ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు

NAAC WITH B GRADE

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)

చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఇండియా.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 10 - Spl. Edition - October 2020 - ISSN No. : 2456-4702



నిర్వహణ :

తెలుగు విభాగం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue No. 10 - Spl. Edition - October 2020 - ISSN No. : 2456-4702

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

విషయసూచిక

1. డాలరు కోడలు నవలలో కుటుంబ సంబంధాలు	- డా॥. వి. శ్రీదేవి	6
2. ప్రపంచీకరణ నేపథ్యంలో రైతు కథలు	- డా॥. టి. జాన్ కిరణ్‌బాబు	13
3. ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక పరిణామం	- డా॥. పి.ఎ. సత్యనారాయణ & - ఎ. మనోజ్ కుమార్	18
4. ఆధునిక సాహిత్యంలో-జానపద సాహిత్యం -ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. ఏ. నాగజ్యోతి	21
5. ''వ్యాపారమృగం'' కథల సంపుటి - ప్రపంచీకరణ	- రవిందర్ అచ్చ	26
6. ఆధునిక తెలుగు కథ - ప్రపంచీకరణ	- డా॥. రాచపాళెం పురంధీశ్వరి	32
7. బతుకమ్మ పండుగ సంస్కృతి - నేపథ్యం - మొగ్గల కవిత ప్రక్రియ	- బసవరాజప్ప	36
8. ఆధునిక తెలుగు నాటకం - ప్రపంచీకరణ ప్రభావం	- పేరం శాంతి	40
9. 'రక్తస్పర్శ' కవుల కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం	- భూక్యా కాశీరామ్	44
10. ఆధునిక కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. యల్. నాగలక్ష్మి దేవి	48
11. తెలుగు కవిత - ప్రపంచీకరణ ప్రభావం	- ఎలగొండ రాములు	51
12. స్త్రీ - నాటి నుండి నేటి వరకు ఒక అవలోకనం	- సోనబోయిన సతీష్	55
13. తెలుగు కథలలో, కుటుంబ వ్యవస్థపై ప్రపంచీకరణ ప్రభావం	- సూరేపల్లి పద్మావతి	59
14. ప్రపంచీకరణ - పల్లె జీవితం	- డా॥. ఏ. వెంకటప్రసాదు	63
15. ప్రపంచీకరణ - తెలుగు భాష	- డా॥. సి. నర్సింహులు	66
16. కథా నేపథ్యంగా తెలుగుభాష-సంస్కృతి-ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. వి. శాంతిలక్ష్మి	68
17. మునికన్నడి సేద్యం - రైతు వ్యవసాయ కుటుంబ జీవిత చిత్రణ	- మార్తల పవన్ కుమార్ రెడ్డి	71
18. ప్రపంచీకరణ నేపథ్యంలో రజక వృత్తి	- అరసవిల్లి మోహనరావు	74
19. ప్రపంచీకరణ - పల్లెజీవనం	- కాపర్తి స్వరాజ్యం	77
20. వ్యవసాయంరంగంపై ప్రపంచీకరణ ప్రభావం - కథా సాహిత్యం	- డా॥. కె. రమేశ్	82
21. చైతన్య దీపికలు కథల సందేశం - ప్రపంచీకరణ ప్రభావం	- శశికళ. యస్	88
22. రైతు, పల్లె జీవనంపై ప్రపంచీకరణ ప్రభావం	- సారంగపాణి బండి	93
23. తెలుగు కథలలో ప్రపంచీకరణ ప్రభావం - నగర జీవితం	- డా॥. ఎం. ప్రభావతి	97
24. ప్రపంచీకరణ కవిత్వం - రైతు జీవితం	- వి. పవన్ కుమార్ రెడ్డి	102
25. 'కవితా వార్షిక 2004' - ప్రపంచీకరణ భావాలు - పరిశీలన	- డా॥. కె.రత్నశేఖర్	105
26. ప్రపంచీకరణ ప్రభావం - చేనేత వృత్తి సాహిత్యం పరిశీలన	- గడ్డం నాగేందర్	110
27. మల్లిపురం జగదీశ్ కథలు - ప్రపంచీకరణ సాంస్కృతిక విధ్వంసం	- ఎం. రమాగీతాదేవి	116

28. ప్రపంచీకరణ నేపథ్యంలో కృష్ణశాస్త్రి ప్రస్థానం	- గొల్లంగి చిన్నబాబు	119
29. వర్తమాన వచన కవిత్వం - ప్రపంచీకరణ	- పల్లెమోని జయమ్మ	126
30. మానవ సంబంధాలపై ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. గుంటుపల్లి గౌరి	130
31. దీపావళి పండుగ ప్రపంచీకరణ	- డా॥. ఎం. ఫామిద బేగం	135
32. పడగనీడ నవల - ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య	- డా॥. ఎన్. సింహాద్రి	138
33. "ఆధునిక తెలుగు సాహిత్య - ప్రపంచీకరణ ప్రభావం"	- కె. రంగనాయకులు	143
34. 'దాడి' నవలలో రైతు జీవనం - ప్రపంచీకరణ ప్రభావం	- కటుకం శారద	146
35. ప్రపంచీకరణ పై దీర్ఘ కవితల ప్రతాపం	- సుంకర గోపాలయ్య	151
36. ప్రపంచీకరణపై ఎక్కుపెట్టిన బాణం అద్దేపల్లి కవిత్వం	- తంత్రవహి శ్రీరామమూర్తి	153
37. ఆధునిక తెలుగు నాటకం - విశిష్టత	- ఆచార్య ఎం. రామనాథంనాయుడు	159
38. ఆధునిక తెలుగు కవిత్వం - ప్రపంచీకరణ పర్యవసానాలు	- డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి	164
39. అత్యాధునిక సాహిత్యం - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. పి. కాళియప్ప	170
40. ప్రపంచీకరణ నేపథ్యంలో మృగ్యమవుతున్న మానవ విలువలు	- డా॥. చిలకా అనిత	175
41. ప్రపంచీకరణ కథలు - మానవ సంబంధాలు	- బాదూరు కుమారి	178
42. ప్రపంచీకరణ నేపథ్యంలో జీవన చిత్రణ	- డా॥. వాసిరెడ్డి భవాని	181
43. ప్రపంచీకరణ ప్రభావాన్ని చిత్రించిన పాట - పల్లె కన్నీరు పెడుతుందో	- జి. బాలచంద్ర	185
44. ప్రపంచీకరణ ప్రభావాన్ని చిత్రించిన కేతు విశ్వనాథరెడ్డి కథలు	- డా॥. బశెట్టి ఉపేంద్ర	189
45. "రైతుల జీవితం - మార్పులు" (నమ్ముకున్న నేల కథ)	- డా॥. ఈ. మురళీధర్	192
46. తెలుగు కథలు - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. నల్లపనేని విజయలక్ష్మి	194
47. కులవృత్తులపై ప్రపంచీకరణ ప్రభావం	- అల్లు పుష్పలత	200
48. గిరిజన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు - ప్రపంచీకరణ	- డా॥. పి. భగ్గు నాయక్	203
49. ప్రపంచీకరణ విధ్వంస చిత్రం 'తుడుం'	- భమిడిపాటి గౌరీశంకర్	208
50. కాపుబిడ్డ కావ్యం - తెలంగాణ రైతు జీవన చిత్రణ - ప్రపంచీకరణ	- జె. శంకర్	211
51. కడప జిల్లా కథాసాహిత్యం - సామాజిక దృక్పథం	- యస్. రామాంజనేయులు	216
52. ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి 'ఒంటరి'	- డా॥. దార్లపూడి శివరామకృష్ణ	219
53. అట్టాడ అప్పలనాయుడు గారి ప్రత్యామ్నాయం కథా సంపుటి	- జె. యోగీశ్వర నాయుడు	222
54. తెలుగు సాహిత్యంలో జీవన నైపుణ్యాలు	- డి. రూతమ్మ	225
55. ప్రపంచీకరణ నేపధ్యంలో రుబాయి కవితాస్థానం	- ఆర్. మమత	229
56. ప్రాచీన ఆధునిక విద్యావిధానాలు - ప్రపంచీకరణ పాత్ర	- నారాయణదాసు మంజులచారి	233
57. రుబాయి కవితలోని జ్ఞాన ప్రాధాన్యత	- ఎం. భవాని	238
58. పీర్ల పండుగ కథ - పల్లె జీవనం	- డా॥. హరీన కళ	240
59. ఆధునిక యుగ విమర్శ వికాసంలో మన తెలుగువారు	- డా॥. మల్లెపోగు వెంకటలక్ష్మమ్మ	246

డాలరు కోడలు నవలలో కుటుంబ సంబంధాలు

– డా॥. వి. శ్రీదేవి, కళాశాల అధ్యక్ష్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు, గుంటూరు.

"మానవ సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలే" అన్నాడు కార్ల్‌మార్క్స్. ఆ మాటలు ఇప్పుడు సమాజంలో ని పరిస్థితులను చూస్తే అది నిజమే అనిపిస్తుంది. మానవ సంబంధాల కన్నా డబ్బుకే ప్రాముఖ్యత పెరిగిపోతోంది. మధ్య తరగతి కుటుంబవ్యవస్థలో అది ఇంకా ఎక్కువ కనిపిస్తూంది. అమెరికా డాలరు మధ్యతరగతి మనుషుల జీవితాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుందో ఒక కుటుంబ కథ ఆధారంగా సుధామూర్తిగారు రాసిన 'డాలరు కోడలు' నవలలో చిత్రించారు. అందులోని కుటుంబ సంబధాలను గురించి తెలుసుకుందాం.

పద్మశ్రీ 'సుధామూర్తి' ఒక భారతీయ సంఘ సేవకు రాలు. రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఇన్‌ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ప్రజా రోగ్య విభాగాలలో కీలకపాత్రలను పోషిస్తున్నారు. ఇంకా హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో భారతీయ గ్రంథాలతో 'ది మూర్తి క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' ను ప్రారం భంచింది. ఈమె రచించిన కన్నడ నవల 'డాలర్‌సొసే' (డాలరు కోడలు). ఆంగ్లంలో 'డాలర్‌బహు'గా అను వదించబడింది. తర్వాత ఇదే నవల 2001లో 'జీ టివి' లో ధారావాహికగా ప్రసరామైనది. 2006 జనవరిలో తెలుగులోకి ఈ నవల ముద్రణ పొందింది.

కుటుంబం అంటే ఏమిటి? ఈ సంబంధాలు ఎలా కొనసాగుతాయి? అని మనం ఒక్కసారి ఆలోచిస్తే అనేక మంది సభ్యులతో కూడుకున్న ఒకానొక వ్యవస్థగా దీన్ని పేర్కొనవచ్చు. మానవుడు జన్మించిన మొదలు ఏర్పడే మొట్టమొదటి అనుబంధం కుటుంబంతోనే ఏర్పడు తుంది. తల్లి, తండ్రి, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు అని మొదటగా ఏర్పడే అన్ని సంబంధాలు దీంతోనే ప్రారంభ మవుతాయి. వ్యక్తి రాగద్వేషాలు, సుఖశాంతులు, ఆనంద్యోగాలు ఈ విధంగా ఆలోచిస్తే చాల వరకు సంబంధాలన్ని కుటుంబ పరిధిలోనే ఇమిడి ఉన్నాయి. సమస్త రంగాలలో పెనుమార్పులు తీసుకువచ్చిన ప్రపంచీ కరణ మానవసంబంధాలు, కుటుంబ సంబంధాల్లోనూ మార్పులు కలుగ చేసింది. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో 'డబ్బు' ప్రధానంగా మారి కుటుంబ సంబంధాలను కూడా ధ్వంసం చేస్తుంది. "ఇప్పుడు సకలం ధ్వంసం కావడం అంగీకరించక తప్పని వాస్తవం. మాన వీయ విలువలు ఉద్వేగాల్ని హరించుకపోతాయి. బరువుగా ఏదో తప్పదన్నట్లుగా బతకడం మనుషుల రీతి అవుతుంది" (గుడిపాటి : 2004, పుట - 44)

డబ్బు, డాలర్‌తో కుటంబ సంబంధాలు ఏ విధంగా శాసించబడుతున్నాయో చిత్రించిన నవల 'డాలరు కోడలు'. మధ్య తరగతి కుటుంబాలలో మానవ సంబంధా లను 'డాలరు' ఎలా ప్రభావితం చేస్తున్నదో, దాని పర్య వసాలు ఎలా ఉంటాయో 'సుధామూర్తి'గారు ఎంతో హృద్యంగా తెలియ చెప్పిన నవల ఇది. మనుషులకన్నా డాలరుకు కుటుంబీకులు ఎటువంటి ప్రాధాన్యతనిస్తారో ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు.

శ్యామన్న, గౌరమ్మ దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు రాజశేఖర్, గిరీశ్, సురభి. శ్యామన్నగారిది గొప్ప వ్యక్తిత్వం. వివేకి. నిదానస్తులు. ఓర్పుగలవారన్న మంచి పేరు కలిగిన వ్యక్తి. దీనికి విరుద్ధంగా గౌరమ్మ వ్యక్తిత్వం. సంపన్నుల గనియైన అమెరికా అంటే ఆమెకు విపరీతమైన ఇష్టం. అందుకే పిల్లల్నిల బాగా చదివించి ఆమెరికాలో డాలర్లు సంపాదించాలి అంటుంది. శేఖర్ ఇంజనీరింగ్ చేస్తాడు. గిరీశ్ బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం. సురభి ఇంటి దగ్గరే ఖాళీగా ఉంటుంది.

చిన్నకొడుకు గిరీశ్‌కు డబ్బు మీద ఆశ ఉండదు. తండ్రిలాగానే ఉన్నదాంట్లో తృప్తిని, ఆనందాన్ని వెతుక్కొనే

మనోభావం. బ్యాంక్‌లో క్లర్క్ ఉద్యోగం. ఎవరైనా అనాథలు చనిపోయినా, స్నేహితుల ఇళ్ళల్లో చనిపోయినప్పుడు తనే ముందుండి దహనసంస్కారాలు చేస్తుంటాడు. "ధర్మ శాలల, దేవస్థానాల ప్రత్యేక కార్యక్రమాలకు, సమారాధన లకు ముందుంటాడు గిరీశ్. " ఇలాంటి వాడు డబ్బేం సంపాదించగలడు? పనికి మాలిన ఇలాంటి పనులు మాని సంపాదన చూడమంటుంది గౌరమ్మ. పరోపకార్థం ఇదం శరీరం" అని సూక్తిని నేర్పింది నాన్నగారే కదమ్మా అంటూ తల్లి నోరును మూయిస్తుంటాడు.

వినుత మొదట్లో బెంగుళూరులో ఉంటుంది. తల్లి దండ్రులు చిన్నప్పుడే చనిపోయారు.వాళ్ల పెద్దనాన్న ఉండేవాడు. అప్పుడు ఇంటిపని, వంటపని అంతా తనే చూసుకొనేది. పెద్దనాన్న మరణించగా అక్కడున్న వారం దరూ వినుతను ఒంటరిగా వదిలేసి దగ్గరి బంధువుల దగ్గరకు తలా ఒక వైపుకు వెళ్తారు. వినుత ఒక్కటే ఉం టుంది. తనూ కూడా సికింద్రాబాద్‌లో ఉన్న తన మామ, అత్తల ఇంటికి వచ్చి, ఒక స్కూల్లో టీచర్‌జాబు చేస్తూ, ఆదివారం రోజుల్లో ట్యూషన్ చెబుతుంటుంది.

గిరీశ్, వినుతలకు ఒకరికొకరు పరిచయం అవుతుంది. వినుతను చూసి ఇష్టపడిన గిరీశ్ తన తండ్రికి చెబుతాడు. వినుతను పెళ్లి చేసుకుంటానంటాడు. శ్యామన్నగారు వినుత మామతో మాట్లాడి పెళ్ళి నిశ్చయం చేస్తాడు. వినుత మామయ్య "వినూ నీకు మంచి సంబంధం తీసుక రాలేము. అలాంటి ఆలోచన ఏమన్నా ఉంటే మరిచిపో. వచ్చిన సంబంధాన్ని కాదనకూడదు. ఇంక బెంగుళూరులో ఉన్న నీ ఇల్లును అమ్మితే వచ్చిన డబ్బులతో నీ పెళ్ళికి ఖర్చు చేయచ్చు. మరి నువ్వు ఏమంటావు? అంటాడు వినుత మామ. మీ ఇష్టం. అలాగే చేద్దాంలే మామయ్య అంటుంది.

వినుత, గిరీశ్‌ల పెళ్లి నిశ్చయం అవుతుంది. శేఖర్ అమెరికా నుండి రావడానికి సెలవు దొరక లేదు. తను పెళ్ళికి రాలేనంటాడు. ఇంకా వినుతకు పెళ్లి కుదిరిందని ఓ వైపు సంతోషం ఉన్నా, పెళ్ళి ఖర్చుల కోసం తనకున్న ఇల్లును అమ్మేకి మనసు ఒప్పలేదు. ఇల్లు పాతదే అయినా తనని వదిలి వేరే లోకానికి వెళ్లిపోయిన తల్లి జ్ఞాపకం అది. అటువంటి ఇల్లును కేవలం మూడురోజుల ఆడంబరానికి అమ్మేయాలనడం వినతకు మనోవేదనకు గురిచేసింది. అలా ఆలోచిస్తున్న వినత దగ్గరకు గిరీశ్ వచ్చి "చూడండి! బెంగుళూరులో మీ ఇంటిని అమ్మి పెళ్ళికి ఖర్చు చేయడం నాకిష్టం లేదు. మరి నీ అభి ప్రాయం ఏమిటో అంటాడు గిరీశ్. ఆ మాటలకు వినుత మనసు ఆనందంతో ఉప్పొంగింది. ఇంకా గిరీశ్ ఈ కాలంలో ఇల్లు కట్టుకోవడం ఎంతో కష్టంతో కూడుకున్న పనో మీకు బాగా తెలుసు. మా అన్నయ్య అమెరికా నుండి డాలర్లు పంపుతున్నా చిన్న ఇల్లు కూడా కట్టలేకున్నాం. మన పెళ్ళి ఖర్చు కోసం రెండు లక్షల వరకూ ఖర్చవు తుంది. దాని కోసం ఇల్లు అమ్మాలనుకుంటున్నాం. పెళ్ళికి వచ్చిన బంధువులు మన ఆడంబంబరాలను చూసి మెచ్చుకొని వెళ్ళవచ్చు. కాని పోయిన ఇల్లు మళ్ళీ ఎలా వస్తుంది? అంటాడు గిరీశ్.

చూడు వినుతా! అమ్మవారి గుళ్ళో పెళ్ళి చేసు కుందాం. నేను నీకు ఒక చీర, తాళిబొట్టు మాత్రమే ఇస్తా. చుట్టాలు నేరుగా వచ్చి భోజనం చేసి అటునుంచి అటే వెళ్ళిపోతారు అంటాడు గిరీశ్. "నా మనుసులో మాటకూడా ఇదే. పైకి చెబితే మీరేమనుకుంటారో అని... అంటుంది వినుత. ఇంకా "నా జీతం, ఉన్న ఇంటికి వచ్చే అద్దె అంతా నెలకు మూడు వేలు వస్తుంది. మా అమ్మ దగ్గరుంచి రెండు గాజులున్నాయి. అంతే నా ఆస్తి' అంటుంది వినుత. అంతకంటే విలువైన ఆస్తి నీను ఉం డాను కదా అంటాడు గిరీశ్. ఆ విషయంలో నేను చాలా అదృష్టవంతురాల్ని అంటుంది వినుత.

వినుత అత్తారింట్లో బాగా కలిసిపోయింది. ఆమెను కూతురిలా చూసుకొనే మామగారి ప్రేమానురాగాలు తన తండ్రిని గుర్తు చేసాయి. అమితంగా ప్రేమించే భర్త ఇంతకన్నా ఏం కావాలి. ఈ జీవితానికి? అనుకుంది వినుత. ఎలాంటి సిరిసంపదలు ఇంట్లో లేకపోయినా

వినుత సుఖాన్ని అనుభవిస్తుంది. ఏ స్త్రీ తన భర్త పూర్తి ప్రేమ విశ్వాసాలను పొందుతుందో ఆమె సుఖి. కేవలం డబ్బు, బంగారం, అధికారంతో ఏ స్త్రీ కూడా సుఖపడదు. "నేను పేద, అతడు పేద, ప్రేమ విశ్వాసాలే మా బ్రతుకు బాట అంటుంది వినుత.

శేఖర్ అమెరికా నుంచి ఇంటికి వస్తాడు. ఒక ధనవంతురాలి కూతురైన జమునతో పెళ్ళి నిశ్చయమవుతుంది. కలవారి పిల్ల జమున అని తనకు కావలసిన చీరలు, నగలు కొనమంటుంది శేఖర్ తల్లి గౌరమ్మ. పెళ్ళి చాలా ఘనంగా చేయాలంటుంది గౌరమ్మ. పెద్ద ఎ.సి. కళ్యాణమండపంలో కనులు మిరుమిట్లు గొలిసే విద్యుత్ దీపాల వెలుగులో కళాత్మకమైన పెళ్లి మండపంలో, సుప్రసిద్ధ గాయకుల ఆర్కిస్ట్రాతో ఆ పెళ్ళి వైభవాన్ని వర్ణించటానికి ఒక నోరు చాలదు. కానీ ఈ పెళ్ళికి అన్ని హంగులు, అన్ని పనులు సమకూర్చడంలో జోడెద్దులలాగా కష్టపడుతున్నది గిరీశ్, వినుత. బయటపనులలో గిరీశ్, ఇంట్లో చాకిరీలో వినుత క్షణం తీరిక లేకుండా వారం రోజులుగా సతమతవైపోతున్నారు. పెళ్లి చీరలు కొంటున్నప్పుడు వినుతకు పట్టుచీర తీసుకొమ్మంటాడు తల్లితో శేఖర్. తనకు అవసరం లేదు. పెళ్ళి పట్టుచీర ఉందిగా అంటుంది గౌరమ్మ. జమున మాత్రం అత్తగారి ఖాతాలో యాభైవేలు, పుట్టింటి వారి నుండి లక్షరూపాయలు విలువైన చీరలు కొన్నది. పెళ్ళి అంగరంగ వైభవంగా జరుగుతుంది.

నిన్నటి వరకు వినుత ముద్దుల కోడలు. ఆమె మాటకు విలువుండేది. "మా వినుత వచ్చిన తరువాత ఇంటి పనులలో 'నేను రిటైర్ అయ్యా' అని అందరితో గర్వంగా చెబుతుండేది గౌరమ్మ. జమున రాకతో ఆమె వర్ణన, ఆమె వినయ విధేయతల గురించి కీర్తన. ఎందుకంటే జమున ధనవంతుల అమ్మాయి కావడమే. జమున పెళ్ళి తరువాత వారి ఫోటోలు, వీడియోలు, పెళ్ళికి వచ్చిన కానుకలు ఇతరులకు చూపించడానికే గౌరమ్మ సమయం సరిపోతుంది. జమున వీళ్ళ కంటికి వెలుగు పోతున్న సూర్యుడులా కనిపించగా, వినుత మాత్రం కృష్ణపక్షం చంద్రుడిలా క్షీణించసాగింది. ఇంట్లో ఉన్న వినుతను కనీసం మాట్లాడుదు కానీ, అమెరికా నుండి డాలరు కోడలు పంపిన ఉత్తరం వచ్చిన రోజు గౌరమ్మకు కాళ్లు నేల మీద నిలిచేవి కావు.

సురభి గోపినాథ్‌ని ప్రేమిస్తుంటుంది. ఆ విషయం వినుత ద్వారా కుటుంబానికి తెలుస్తుంది. అయితే శ్యామన్నగారు, గిరీశ్ గోపినాథ్ కుటుంబం మంచిదై, కుర్రాడు ఉత్తముడైతే తమకు ఇష్టమే అంటారు. కష్టపడి పనిచేసైనా సరే భార్యను పోషించగల తెలివితేటలుంటే, మంచి ఉద్యోగం దొరికే వరకు మరి కొన్నాళ్లకు పెళ్ళి చేస్తే తప్పేముంది? ఒక్కటే కూతురు. ఈ ఊళ్ళోనే కళ్ళముందే ఉంటుంది. కష్టసుఖాల్లో తోడుగా ఉండచ్చనకుంటారు. అయితే గౌరమ్మ ఇందుకు ఒప్పుకోదు. "నాకు అమెరికాలో ఉండే అల్లుడే కావాలి" అంటుంది. "సురభీ! నువ్వింకా చిన్నదానివి. ప్రపంచం ఏమిటో నీకు తెలియదు. గోపిని పెళ్ళి చేసుకుంటే నీ కెలాంటి సుఖము దొరకదు. ఇక్కడ ప్రతి రూపాయి ఆలోచించి ఆలోచించి ఖర్చు చేయాలి. నీ వదిన వినుతనే చూడు. ఎంత కష్టపడుతుందో, నెలంతా కష్టపడ్డా నాలుగు వేలు కూడా రావు. అది అమెరికాతో పోలిస్తే వంద డాలర్లు కూడా ఉండదు. అదే జమునను చూడు లక్షరూపాలయను నీళ్ళలా ఖర్చు పెడుతుంది. ఈ ప్రేమలు దోమలు అంటూ పట్టుకు వేళ్ళాడకు. దీన్నిక్కడితో వదిలెయ్యి" అంటుంది. సురభి కూడా తల్లి చెప్పిందే మంచిదనిపించి సరే అంటుంది. అత్తగారి డాలరు వ్యామోహాన్ని చూసిన వినుత మనసుకు బాధ కల్గుతుంది. గౌరమ్మ పెళ్ళి బ్రోకర్‌తో "మాకు ఇక్కడ వరుడొద్దు. అమెరికా వరుడు కావాలి" ఉంటే చెప్పండి ఎంత ఖర్చు అయినా ఫరవాలేదు" అంటుంది. ఏ తల్లికైనా కూతురు సుఖంగా ఉండాలన్నదే సహజ కోరిక. కోడలు సుఖంగా ఉండాలనుకోవడం అసహజం. కాని కొడుకుల్ని అప్పుల్లో ముంచి కూతుళ్ళను సుఖ సాగరంలో తేల్చాలనుకోవడం అమానుషం కదా

అని శ్యామన్నగారు తన భార్య చేస్తున్న పనులవల్ల విసిగిపోతాడు.

సురభి నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరుగుతుంది. అమెరికా నుండి శేఖర్ పెళ్ళి కొడుక్కు సూటు పంపితే జమున వంద డాలర్లు సురభి పేర పంపింది. ఇంకా ఉత్తరంలో ఈ సంవత్సరంలో సెలవులు తక్కువగా ఉన్నాయి. పెళ్ళిరోజుప్పుడో తెలిపితే రెండు వారాలు ముందు వస్తాం. సాధ్యమైనంత వరకు అందరికీ అనుకూలమైన ముహూర్తం పెట్టండి' అని శేఖర్ ఉత్తరంలో తెలిపాడు. ఆగస్టులో వినుతకు పురిటి రోజులు. అది తప్పితే డిసెంబరులో ముహూర్తాలున్నాయి. కాని పెళ్ళివారు అంతదూరం ఒప్పుకోవడం లేదు. పెళ్లి జూలైలో జరిగితే అందరికి అనుకూలంగా ఉంటుందనుకుంటారు. ఆ విషయాన్ని జమునకు ఫోను ద్వారా చెబుతుంది గౌరమ్మ. 'జూలైలో యూరప్ పర్యటనకి వెళుతున్నాం. దానిని క్యాన్సిల్ చేయటం కుదరదు అంటుంది జమున. ప్రయాణాలు, పర్యటనలు క్యాన్సిల్ చేయవచ్చు కాని పురుడును ఆపటానికి అవ్వదు కదా? అంటాడు శ్యామన్నగారు. వెంటనే గౌరమ్మ 'జమున కోపగించుకొని పెళ్ళికి రాకపోతే ఎలా? ఆమెకి ఎప్పుడు అనుకూలమో, అదే చేయండి. మీరిందులో అనవసరంగా తల దూర్చకండి" అంటుంది.

దానికి అర్థం వినుతకు తెలుసు. సురభి పెళ్ళికి శేఖర్ రెండు లక్షలిచ్చాడు. గిరీశ్ బ్యాంకులో లోన్ తీసుకొని యాభై వేలిచ్చాడు. శేఖర్, జమునలు ఎక్కువ డబ్బులిచ్చి నందువల్ల వారికి అనుకూలంగా చెయ్యాలి. వయసులో పెద్దవారైనా పరిస్థితులు అర్థం చేసుకోకుండా డాలర్ కోడలికి అడుగులు మడుగులు ఒత్తే కైపులో ఉన్నారు. డాలర్ ముందు రూపాయి వెలవెలా పోయింది. సురభి పెళ్ళి ఆగస్టులో నిశ్చమవుతుంది. పురిటికి అతి దగ్గరి రోజులవి, నువ్వొస్తే ఎంత, రాకపోతే ఎంత? జమున వస్తుంది. అదే చాలు అన్న భావన గౌరమ్మది. ఇంకా జమున గురించి నలుగురిలో చెప్పుకోవడానికి చాలా ఉంది. వినుత గురించి ఏముందీ?

ఇక్కడ పురుడు పోసుకోవడానికి వినుత సుముఖంగా లేదు. కారణం ఆమె మనసు బాగా దెబ్బతింది. మా ఊరికి వెళ్తా అంటుంది వినుత. గిరీశ్, శ్యామన్నలు ఎంత చెప్పినా వినలేదు. "మా ఊరిలో ఆసుపత్రులకు కరువా? పురిటికి అవ్వ వస్తుంది" అంటుంది.

సురభి పెళ్ళి వైభవంగా జరుగుతుంది. వెండి, బంగారం పట్టు చీరలతో పాటు ఇంటికి సరిపడ ఖరీదైన సామానంతా ఇచ్చి పంపారు. అయితే గౌరమ్మ చేస్తున్న ఆడంబరాలు జమునకు ఏ మాత్రం నచ్చలేదు. తాము ఇంటి నుంచి కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉండి చలి, ఎండ అనక కష్టపడి సంపాదిస్తున్న డాలర్లును ఈ విధంగా ఖర్చు చెయ్యటం ఆమెకు బాధాకరమనిపించింది. సంపాదించేవారికి తెలుస్తుంది. దీని కష్టమేమిటో, అనుకుంటుంది. ఇకపై డాలర్లు పంపడం తగ్గించేస్తే సరిపోతుందనుకుంది మనసులో.

శేఖర్ వినుత కొడుకు (హర్ష)ను చూడటానికి బెంగుళూరుకు వెళ్తాడు. బాబు పుట్టిన విషయం తెలిసినా కనీసం తన అత్త, మరదులు ఉత్తరం కూడా రాయలేదని బాధ పడుతుంది వినుత. "మీ డాలర్ మమ్మల్ని ఈ గతికి తెచ్చింది. ప్రతి విషయాన్ని ప్రతిపనిని మీ డాలర్‌తో కొలిచి మేము చేసే దానికి విలువ లేకుండా చేశారు. సురభి పెళ్ళికి మేమిద్దరం (గిరీశ్, వినుత) అప్పులు చేసి, శారీరకంగా శ్రమించినా మాకు విలువలేదు. పెళ్ళి ముహూర్తాన్ని జమునకు అనుకూలమైన రోజే పెట్టారు గాని, నాలుగు సంవత్సరాలుగా మనసా వాచా సేవలు చేస్తున్న రూపాయికోడలు జ్ఞాపకం రాలేదు. డాలర్ కోడలికి అగ్ర తాంబూలం, అడుగులకు మడుగులొత్తడం, రూపాయి కోడల్ని అవమానించడం, పెళ్ళి పందిరిలో జమున చలువ వల్లే పెళ్ళయిందని అత్తగారు చెప్పారే కానీ, నా ఊసే ఎత్తలేదని అంటుంది" వినుత.

శేఖర్‌కు పుట్టబోయే బిడ్డకోసం బంగారు చైను, ఉంగరం చేయిస్తుంది గౌరమ్మ. హర్ష బాలసారకి ఇదే నాయనమ్మ కేవలం వంద రూపాయలిస్తుంది. పుట్టని

అమెరికా పాపకి ఏవేవో వస్తువులు, ఎన్నేన్నో కలలు. ఇక్కడున్న మనవడిని అసలు పట్టించుకోదు. నిర్లక్ష్యంగా చూస్తుంది. జమునకు పురుడు పోసేందుకు అమెరికాకు వెళ్లాలని బయలుదేరుతుంది. అమెరికాకు వెళ్ళేటప్పుడు 'వినుతా పిల్లవాడిని బాగా చూచుకో' అని ఒక్కమాటైనా అనలేదు. 'ఛ' అని బాధపడింది వినుత.

గౌరమ్మ అమెరికాకు వెళ్ళిన వారం రోజులకు జమునకు పాప పుడుతుంది. పాపకి ప్రత్యేక రూంలో వివిధ ఆట సామాన్లు, ఉయ్యాల, రంగు రంగుల కర్టెన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడమైంది. పాపని రూంలో వదిలి పెట్టి తన రూంకు జమున వెళుతున్నప్పుడు ఇక తట్టుకోలేక గౌరమ్మ జమునతో ''జమునా అదింకా పసిగుడు. ఒంటరిగా వదిలేస్తే ఎలా? నాచేతికి అట్టి పెట్టుకుంటానివ్వు'' అంటుంది. ''వద్దండి. రేపు మీరు ఊరెళ్ళిపోయాక నాక ప్రాబ్లమ్ అవుతుంది. వేరే ఉండటం ఇప్పటి నుంచి అలవాటు చేస్తా'' అంటుంది. వెంటనే గౌరమ్మకు హర్ష గుర్తుకు వస్తాడు. హర్ష చంటి పిల్లవాడిగా ఉన్నప్పటి నుంచే తాత పక్కల పడుకుంటుండేవాడు. అందువల్ల తాతతో చనువు బాంధవ్యం కూడా పెరిగింది. మరి ఇలా పెంచితే బాంధవ్యం, బంధుత్వం వాళ్ళకి ఎలా పెంపొందుతుంది.

అమెరికాలో ప్రతి శనివారం ఒక్కొక్కరు ఇంట్లో తెలుగు స్నేహితురాళ్ళ కలయిక ప్రోగ్రాం పెట్టుకుంటారు. ఈ వారం జమున వంతు. నాలుగైదు గంటలు పాటు పాటలు, కథలు, పిచ్చాపాటి మాటలు మాట్లాడి వెళ్ళాలనుకుంటారు. బాగా వచ్చిన పదార్థాలు చేయమని అత్త గారితో చెబుతుంది జమున. ఏమి చేయాలన్నా కోడలిని అడిగే చేస్తుంది గౌరమ్మ. పనులు చేస్తుండగా జమున ఇల్లు ఇది అనే భావన గౌరమ్మలో నాటుకుపోతుంది. ఆమె పనుల్లో ఉండగా జమున స్నేహితురాళ్లతో కబుర్లు పెట్టింది. తన గురించి కోడలు అందరికి మంచి చెబు తోందని, తన గొప్పతనం పొగుడ్తోందని భావించి గౌరమ్మ అటు వైపు వెళ్తుంది. వారంతా మాటల్లో పడి గౌరమ్మ వచ్చిన శబ్దాన్ని ఎవ్వరూ గ్రహించరు. 'నువ్వు అత్తగారి మనసుని గెలుచుకున్నావ్' అని మెచ్చుకుంటూ అంటోంది జమున స్నేహితురాలైన సుధ. అంతే కదా మరి? అందుకు నిదర్శనంగా ఆమె నన్ను మెచ్చుకుంటూ రాసిన ఉత్తరం చూపిస్తా. కూతురు సమానురాలైన జమున... లేక జమున నువ్వే నా ఏకైక కోడలివి... అంటూ ప్రారంభిస్తుంది. అదేంది ఇంకో కోడలుండగా ఇలా రాస్తారా! అంటుంది సుధ. అయ్యో! ఆ కోడలు ఈవిడ దృష్టిలో ఏ లెక్కకు లేదు. కేవలం అందం ఒకటి ఉంటే చాలా? ఉత్త గొడ్డు స్వరూపం. ఇండియాలో ఉండ తగ్గది. నోరుమూసుకొని గాడిద చాకిరి చేస్తుంటుంది. అయినా మా అత్తకు ఆమెపై ఏ మాత్రం ప్రేమ, విశ్వాసం కూడా లేదు. నన్ను చూస్తే చాలు. నోరెళ్ళ బెడతుంది చొల్లు కారుస్తూ అంటుంది.

ఇంకా మీ ఆడపడుచు ఎలాంటిదని సుధ జమునను అడుగుతుంది. అదో ఆశపోతుది. ప్రతి ఉత్తరంలో అది పంపించు, ఇది పంపించు అని రాస్తూనే ఉంటుంది. దానికి తగ్గవాడే ఆ మొగుడు కూడా. అందుకే వాళ్ళు పంపిన ఉత్తరాలు వచ్చినా కూడా అవి నాకు చేరలేదు అని అబద్ధం చెబుతుంటాను అంటుంది జమున. మీ అత్తవాళ్ళకి నీ మీద అనుమానం రాదా? అంటుంది సుధ. నమ్మకం నా మీదున్న అతి నమ్మకం. అందుకే అను మానించదు. చూడు నా పాత చీరలన్నీ ప్యాక్ చేసి 'ప్రజంటేషన్' అని ఇస్తుంటాను. అమెరికాద ని దేన్ని ఇచ్చినా నమ్మి తీసుకుంటారు. మా అత్తగారి బుద్ధి చూడండి. వినుతతో జీవితాంతం ఉండాలి. కాని దూరంగా ఉండే నన్ను నమ్ముతారే గాని ఆమెను నమ్మరు. వినుతపై చాడీలు చెబుతుంటాది. 'నిజంగా మీ అత్త గొప్ప తెలివిగల గొడ్డే' అంటారు స్నేహితురాలు. ఇది విన్న గౌరమ్మ గుండె కొట్టుకుంది. కళ్ళల్లో నీరు నిండుకుంది. ఇంకా మా అత్తగారు అమెరికా అంటే కుక్కలా చొల్లు కారుస్తారు. మొదట్లో శేఖర్‌కు వాళ్ల అమ్మను అమెరికాకు పిలి పించుకోవాలని ఉండేది. నేనొక ఉపాయం చేశాను. నా

పురిటి సమయానికి వస్తే ఆమె కోరిక తీరుతుంది. నాకు సహాయంగా ఉంటుందని శేఖర్‌తో చెప్పాను.

అది విన్న గౌరమ్మ నా చేత పనిదానిలా సేవ చేయించుకోవటానికి పిలిపించుకుందన్న మాట. ముద్దుల పెద్ద కోడలు. గౌరమ్మ హృదయం భగ్గుమంటుంది. కంటికి కమ్మిన పొరలు తొలగి జ్ఞానోదయమైంది. రాత్రంతా గౌరమ్మ ఏడుస్తూ బాధపడుతుంటుంది. వినుత తల్లిలేని అనాథ. తన ప్రేమ, అప్యాయతల కోసం ఎంత పరితపించి పోయిందో? వినుత పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించానో, పదేపదే గౌరమ్మ కళ్ళ ముందు వినుత రూపం కదలాడసాగింది. వినుతకు ఏమీ చేయలేదన్న బాధ ఆమెను దహించసాగింది. ఆమెకేనాడు ఒక మంచి చీర కొనియ్యలేదు. తన దగ్గరున్న బంగారాన్ని జమునకు గాజుల రూపంలో ఇచ్చినా వాటికి విలువ లేకుండా పోయింది. అదే కనుక వినుత కిచ్చినట్టయితే..? అత్తగారిచ్చిన అందరికీ చూపిస్తూ ఎంత గర్వపడేది, మురిసిపోయేది. కేవలం జమున కోసంమే సురభి పెళ్ళి రోజు నిశ్చయం చేసింది. అందుకే పురుటికి వినుత బెంగుళూరుకు వెళ్ళిపోయింది. హర్ష నామకరణానికి కేవలం వంద రూపాయిలు ఇచ్చింది. అదే జమున కూతురు మానసికి బంగారు గొలుసు, ఖరీదైన గౌను ఇచ్చింది. వినుతకు ఒక బ్లౌజు ముక్క కూడా ఇవ్వలేదు గౌరమ్మ. గిరీశ్‌కు తక్కువ జీతం కాబట్టి దానికెందుకంత ఖరీదైనది ఇవ్వటం? అన్న చులకన భావం వినుతపై గౌరమ్మకు ఉండేది. జమునకి ఐదువేల రూపాయల ఆకుపచ్చ పట్టుచీర తెచ్చింది. కాని ఆమె దాన్ని ఏదో తక్కువ చీర అన్న భావనతో మూల పారేసింది. ఒక్కసారి కూడా కట్టుకోలేదు. ఆమె దృష్టిలో ఐదువేలకు విలువ లేదు. దూరపుకొండలు నునుపు దగ్గరకు వెళితే తెలుస్తుందన్నట్లైంది గౌరమ్మకు. రంగుల ప్రపంచం వెనుక కుళ్ళు ఎంతో తెలిసింది. తనే కనుక ఇక్కడకు రాక పోయినట్టయితే జమున అసలు రూపం తెలిసి ఉండేది కాదు. జీవితాంతం ఈమెను తాను పూజిస్తూ ఉండేది.

వినుత ఎంత ప్రయత్నిస్తూ వచ్చిన అత్తగారి మనసు గెలుచుకున్న మంచి కోడలు కాలేకపోయింది. ఎప్పుడు ప్రతి విషయంలో, ప్రతి పనిలో జమునతో పోలుస్తూ వినుతను నొప్పిస్తుంటుంది. ఏ పని మెచ్చుకొనేది కాదు. గౌరమ్మ మొదట్లో అలా లేరు. జమున వచ్చిన తరువాతే ఈ మార్పు. వినుత స్థానం దిగజార్పు. వినుతకి గిరీశ్‌పై కోపం వచ్చింది. అత్తగారిలా ఎందుకు చేస్తున్నారని అతన్ని నిలదీసింది. "అమ్మ స్వభావమే ఇంత. నా కన్న మా అన్నయ్యకు ఎక్కువ మర్యాద ఇవ్వటం లేదా? నేనేమైనా బాధపడుతున్నానా? శేఖర్, గిరీశ్ అన్నదమ్ములు. ఒక రక్తం పంచుకు పుట్టినవారు. అతడు సహించగలడు. కాని అంతా సహిస్తూ కూర్చోవాల్సిన అవసరం తనకేమిటి? ఎప్పుడు శాంతంగా ఉండే వినుత అగ్నిగుండంలా నిప్పులు రేగుతుంది. అక్కడ వేల డాలర్లు సంపాదిస్తూ కేవలం వంద డాలర్లు పంపిన జమున, ఇక్కడ మొత్తం జీతం చేతిలో పెట్టే తన కన్నా ఎక్కువ అయింది. తను శారరకంగా ఎంత కష్టపడినా విలువ లేదు అనుకొని బాధపడేది వినుత.

డాలర్ తల్లి ప్రేమలో కూడా చిచ్చుపెట్టింది. పెద్ద కొడుకు డాలర్ సంపాదిస్తూన్నాడు. కాబట్టి గౌరమ్మ దృష్టిలో దేవుడు. గిరీశ్ గడ్డి పోచతో సమానం అంటూ ఆలోచిస్తుంటుంది వినుత. 'వినుతా నేనొక విషయం చెబుతాను. ఎలాంటి బిడియం లేకుండా నీ అభిప్రాయాన్ని చెప్పు' అంటాడు శ్యామన్నగారు. నువ్వు వచ్చిన దగ్గర నుంచి నా కూతురు కన్నా ఎక్కువ చేరువయ్యావు. మీ అత్తగారు మరో రెండు, మూడు నెలల్లో అమెరికా నుండి ఇక్కడికి వస్తుంది. ఇంతవరకు ఆవిడ రాసిన ఉత్తరాలలో అమెరికా వర్ణన, గొప్పతనం గురించి ఒక పుస్తకమే రాయవచ్చు. ఇంకా ఆ మత్తు వదిలి పెట్టలేదు. నీ మానసిక వేదనకు ఇవన్నీ కారణమయ్యాయి. నువ్వు వేరే వెళ్ళిపోవటం మంచిది" అంటాడు. అది విన్న వినుత నేను జమునతోగానీ, అత్తయ్యగారితో గాని కలిసిపోక

ఎప్పుడైనా ఎదురు తిరిగి మాట్లాడానా? మామగారు అంటుంది. లేదు వినూ లేదు. నీ మృదు స్వభావం చూచే నేనే వేరే వెళ్ళి పొమ్మంటున్నా. అతిమంచి పనికి రాదు. గొరికానీ, జమున కానీ నీతో కలవగలిగారా? ఎప్పుడూ సేవ, చాకిరి? గులామ్‌గిరి చేస్తూ బతకవద్దు. ఇలా ఉంటే తక్కువ తనాన్ని ఎత్తి చూపుతుందే గాని మంచి అనబడదు. చిన్నప్పుడు నుంచి స్వేచ్ఛ లేని బానిస బతుకు బతికావు. ఇకనైనా స్వేచ్ఛగా ఉండు. నీ కోసం నువ్వు బతుకు అంటాడు శ్యామన్నగారు. ఎక్కడికి వెళ్ళాలి మామయ్య అంటుంది వినుత. బెంగుళూరులో మీ ఇంటికి వెళ్ళండమ్మా. గిరీశ్‌కు అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని చెబుతాను అంటాడు శ్యామన్నగారు. అలా వారు బెంగుళూరుకు వెళ్తారు.

గౌరమ్మ అమెరికా నుండి తిరిగి వచ్చేటప్పుడు నేనెంత అదృష్టవంతురాలిని. వినుత లాంటి కోడలు దొరికింది అనుకుంటుంది. అయితే ఇంటికి వచ్చిన తరువాత వినుత ఇంట్లో కనిపించకపోతే, విషయం తెలుసుకున్న గౌరమ్మ అంతా చేజారి పోయిందని రెండు చేతులూ ముఖానికి అడ్డు పెట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తుంది. గిరీష్‌ని ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేసుకోమనండి అంటుంది. అయితే శ్యామన్న వాళ్ళని వాళ్ళలా ఉండనీయడం మంచిది అంటాడు. అయితే మనం త్వరగా వెళ్ళి ఒక వారం రోజులు వినుత, హర్షలతో గడిపి వద్దామా అని అడుగుతుంది. శ్యామన్న అందుకు మహారాజులా వెళ్ళి వద్దాం అంటాడు.

గౌరమ్మ తను తీసుకువచ్చిన సూట్‌కేసు తెరుస్తుండగా దారి ఖర్చులకని శేఖర్ ఇచ్చిన వంద డాలర్ల నోటు బయట పడుతుంది. దాన్ని గౌరమ్మ బాధతో చూస్తుంది. ఈ రోజు ఆమె దృష్టిలో డాలర్‌కు ఎలాంటి విలువ లేదు అని, విలువైనది కేవలం రూపాయి అని గుర్తించింది. ఇలా చివరకు రూపాయే గెలిచింది.

ముగింపు :

డాలర్ కోడలైన జమునను అధికంగా ప్రేమించి, రూపాయి కోడలైన వినుతను నిర్లక్ష్యం చేస్తుంది గౌరమ్మ. అమెరికా వెళ్ళిన గౌరమ్మ జమున అసలు స్వరూపం తెలిసి నిర్ఘాంత పోతుంది. జమున దృష్టిలో డాలర్లు పడేస్తే, తన అత్త కుక్కలా చొళ్ళు కారుస్తుంది అని జమున ఉద్దేశ్యం. జమునలోని ఈ విషయాన్ని గమనించిన గౌరమ్మకు ఒక విషయం అర్థమవుతుంది. వినుత తనను ఎంత ప్రేమగా చూసుకుంటోంది. అయినా తను వినుతను నిర్లక్ష్యం చేసింది. ఏ డాలర్ కోడల్ని ఐతే తాను అధికంగా ప్రేమించిందో ఆమె చేతిలోనే నేడు గౌరమ్మ అవమానం పొందింది. నేడు డాలర్లు కుటుంబాలను ఏవిధంగా శాసిస్తున్నాయో కుటుంబ సంబంధాలను ఎంతగా ధ్వంసం చేస్తున్నాయో ఈ నవల ద్వారా మనకు అర్థమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. డాలరు కోడలు (నవల) : సుధామూర్తి (అలకనంద ప్రచురణలు)
2. ప్రపంచీకరణ ప్రభావ నవలలు-పరిశీలన : ఎం. నాగరాజు, కేంద్రీయ విశ్వవిద్యాలయం - హైదరాబాదు.

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో రైతు కథలు

– డా॥. టి. జాన్ కిరణ్‌బాబు, తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె, గుంటూరు జిల్లా.

ప్రపంచీకరణ అంటే ప్రపంచమంతా ఒక్కటి కావడం. జాతీయ రాజ్యాల పేరుతో గిరిగీసుకున్న సరిహద్దులన్నీ చెరిపేసుకొని అంతర్జాతీయ సమాజమనే గొడుగు క్రిందికి వచ్చే ప్రక్రియ. ఆర్థికంగా అవలోకిస్తే స్వదేశీ వ్యాపారాలకు ఆయా దేశాలు కల్పించుకున్న రక్షణ వ్యవస్థలను తమ చేతులతో తామే స్వయంగా తొలగించి వేసుకునే పరిణామం. "జాతీయ సరిహద్దులతో, దూరాలతో సంబంధం లేకుండా ఆర్థిక, రాజకీయ, సామాజిక, ప్రక్రియలు నిరాఘాటంగా చోటుచేసుకోవడమే ప్రపంచీకరణ" (ప్రపంచీకరణను ప్రశ్నిద్దాం:5) "దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం, పెట్టుబడి, సేవలు ఎటువంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా సరిహద్దులు దాటి స్వేచ్ఛగా నిర్ని బంధనలతో ప్రవహించే వెసులుబాటు." (ప్రపంచీకరణ-పదేళ్ళ అనుభవాలు : 26). ఇటువంటి అంతర్జాతీయీకరణ ప్రక్రియలో అభివృద్ధి చెందిన దేశాలతో పాటు తృతీయ దేశాల్లో కూడా అపూర్వమైన, అనూహ్యమైన పరిణామాలు సంభవించాయి. మార్కెట్లు, వాణిజ్యావకాశాలు విస్తృతమయ్యాయి. అధునాతన వైద్యసదుపాయాలు అందుబాటులోకొచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం వ్యాపించింది. ప్రజాస్వామ్యం కోసం, సామాజిక న్యాయం కోసం ఉద్యమించే పౌరసమాజం అభివృద్ధి చెందింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వల్ల వేల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఉన్నత వర్గాలేకాక మధ్య దిగువ తరగతి విద్యార్థులు సైతం ఇటి రంగంలోకి ప్రవేశించి పెద్ద మొత్తంలో జీతాలు అందుకుంటున్నారు. విదేశీయానం సులువైపోయింది. ఇదంతా నాణేనికి ఒకవైపు. మరోవైపు సాంస్కృతిక వ్యవస్థల విధ్వంసం, రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక అంతరాలు, నిరుద్యోగం, పేదరికం, విలువల పతనం వంటివి చాపకింద నీరులా వ్యాపించిన దుష్పరిణామాలు. ప్రపంచీరకణలో భాగమైన సరళీకరణ విధానాలు, ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహం, నూతన ఆర్థిక సంస్కరణల వంటివి వ్యవసాయరంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేశాయి. పర్యవసానంగా లెక్కలకందని రైతుల ఆత్యహత్యలు తెలుగుగడ్డ పైన సంభవించాయి. సరళీకరణ విధానాల్లో అంతర్భాగమైన విద్యుత్తు సంస్కరణలు వ్యవసాయంలో ఏర్పడిన పెనుసంక్షోభానికి, రైతుల ఆత్మహత్యలకు ఏవిధంగా కారణమయ్యాయో రైతుకథలలో ప్రతిఫలించిన తీరును విశ్లేషించడం ఈ పత్రం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

చిత్తూరు జిల్లా శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో గంధమనేని శివయ్య మెమోరియలే సొసైటీ వారు నేలతల్లిని నమ్ముకుని, సిరులు పండించాలనే తపనతో, నీటిఎద్దడికీ, వర్షాభావానికీ, కలిసిరాని కాలానికీ ఎదురీదుతూ, ఆశ చావక, రెక్కలు ముక్కలు చేసుకుని పిడికెడు మెతుకుల కోసం తపించి, ఆ మట్టిలోనే ఒరిగిపోయిన భూమి పుత్రుల వ్యథలను 360 కోణాలలో స్పృశించిన వంద రైతుకథల్ని సంకలనంగా ప్రచురించారు. తెలుగు దేశపు మూడు (రాయలసీమ, తెలంగాణ, కోస్తాంధ్ర) భౌగోళిక ప్రాంతాలకు చెందిన ప్రతిభాసంపన్నులైన రచయితలు మొదలుకొని ప్రయోగదశలో ఉన్న కథకుల వరకూ విభిన్న దృష్టికోణాలతో రైతు గాధలను ఆవిష్కరించారు. ప్రపంచీకరణ ప్రభావంలో కొట్టుమిట్టాడిన రైతు వెతలెన్నో ఈ కథలలో కనిపిస్తాయి. కూలీగా మారిన రైతు, వలసలు, కరెంటు కోతలు, నీటి తగాదాలు, బండబడిపోయిన బోరుబావులు, నకిలీవిత్తనాలు, పొట్టగొట్టిన పురుగుమందులు, ఆహార పంటలను నీరుగార్చిన వాణిజ్యపంటలు, రైతులు ఆత్యహత్యలు ఈవిధంగా రైతుజీవితంతో ముడిపడివున్న ప్రతీ సూక్ష్మాంశాన్నీ విభిన్న దృష్టికోణాలలో సాక్షాత్కరింపజేశారు.

1991 తర్వాత మన దేశంలో సరళీకరణ పేరిట జరిగిన అనేక విధాన నిర్ణయాలలో ఎటువంటి దారిలో వెళ్ళాలన్న విషయంలో రాష్ట్రప్రభుత్వాలకు స్వేచ్ఛ ఉంది. ఈ కారణంగా ప్రపంచబ్యాంకు వంటి సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని బైపాస్ చేసి నేరుగా రాష్ట్రాల మంత్రుల తోనే వ్యవహారాలు నడిపే అవకాశం ఉన్నందున, రాష్ట్ర ఆర్థికరంగంలో నేరుగా జోక్యంచేసుకోవడం మొదలు పెట్టడంతో ఆంధ్రప్రదేశ్ ప్రపంచబ్యాంక్ చేతిలో ఒక ప్రయోగశాలగా మారిపోయింది. పాతకాలంలో విదేశాంగ మంత్రులు దేశాలమధ్య ద్వైపాక్షికసంబంధాలను పెంచు కునేందుకు, సాంకేతికతను పంచుకునేందుకు, పొర పొచ్చాలను తగ్గించేందుకు వెళ్ళేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ప్రధానమంత్రులు, దేశాధినేతలు విదేశీయానాలు చేసేవారు. తద్భిన్నంగా ప్రపంచీకరణ ప్రభావంతో ప్రధాన మంత్రి మొదలుకొని రాష్ట్రముఖ్య మంత్రులవరకు అదేపనిగా విదేశాలకు వెళ్తూ మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి, పరిశ్రమలు స్థాపించండి అంటూ ఆయా దేశాలను ఆహ్వానిస్తూ మౌలిక సదు పాయాల పేరిట ఫ్లైఓవర్లు, విమానాశ్రయాలు, అధునాతనభవంతులు నిర్మిస్తూ, నేల, నీరు, విద్యుత్తు వారు కోరినధరకు సిద్ధం చేస్తూ, భలేమంచి చౌకబేరమంటూ దేశాలవెంట పడి, దానినే అభివృద్ధి మంత్రంగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగా దేశీయరైతాంగాన్ని, పారిశ్రామిక యంత్రాం గాన్ని నిర్లక్ష్యంచేసి వ్యవసాయరంగం దివాలాకు కారణ మయ్యాయి.

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ ముసుగులో వ్యవసాయరంగంలోని విద్యుత్ వినియోగం వలన విద్యుత్ రంగానికేకాక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం వాటిల్లుతుందన్న రాజకీయనాయకుల, ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయాలను పరిగణనలోకితీసుకుని, వ్యవసాయ రంగానికి విద్యుత్ కేటాయింపే విద్యుత్‌రంగ నష్టాలకు కారణమనే బలమైనవాదనని తెరమీదికి తెచ్చి విద్యుత్ రంగాన్ని అధ్యయనంచేయడానికి 'హేతన్‌భయ్యా' కమిటీని నాటి ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచనలను, ప్రపంచబ్యాంకు షరతుల మేరకు నాటి ప్రభుత్వం విద్యుత్‌రంగంలో సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నాలుగు దశాబ్దాలుగా యాభైవేలకోట్లతో నడుస్తున్న ఎపిఎస్ఈబిని పర్యవేక్షకపాత్రకు పరిమితం చేశారు. విద్యుత్‌శాఖను ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విభాగాలుగా వేరుచేయాలనీ, విద్యుత్ అమ్మకం, కొనుగోలుకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడానికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుచెయ్యాలని కమిటీ పేర్కొంది. మరోవైపు ప్రపంచబ్యాంకు విద్యుత్ సంస్కరణ లకు ప్రాధాన్యతనిస్తూ 4,460 మిలియన్‌డాలర్ల రుణం ఇచ్చింది. దీంతో సబ్సిడీలు పూర్తిగా తొలగించాలని, సాలీన 5-20% (1999-2009) దశలవారీగా పది సంవత్స రాలపాటు విద్యుత్ రేట్లు పెంచాలనీ షరతులు విధిం చింది. కమిటీ సిఫారసులు, ప్రపంచబ్యాంకు షరతుల మేరకు వాటి ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్క రణల చట్టం - 1998' బిల్లును ఆమోదించింది. తదుపరి 1999లో విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేసి విద్యుత్తుశాఖను ట్రాన్స్‌కో-జెన్‌కోగా విడదీసి ఆపై 2000 సంవత్సరంలో విద్యుత్‌పంపిణీని నాలుగు ప్రైవేటు సంస్థలకు అప్పగించారు.

విద్యుత్ సంస్కరణల ఫలితంగా వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయింది. దీని కారణంగా 44.6% వ్యవసాయం బోరుబావుల క్రింద ఉండడంతో ఒకవైపు పెరిగిన విద్యుత్‌ఛార్జీలు, మరోవైపు విద్యుత్ సామాగ్రి సరఫరా నుండి ప్రభుత్వం తప్పుకోవడం, లోఓల్టేజీ కారణాలవల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు సాహసంతో పూనుకుని స్వయంగా బోర్లు వేసుకుని, కరెంటు బిగించుకుని, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుకుని, లక్షల రూపాయలు ఖర్చుపెట్టడం వల్ల నిర్వహణా వ్యయం ఒక్కసారిగా పెరిగిపోవడంతో అప్పులు, వడ్డీలు, పేరుకు పోయి నష్టాల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్ప

డ్డారు. చెరువుల విధ్వంసం, సాగునీటి ప్రాజెక్టుల సక్రమమైన నిర్వహణలేమి కారణంగా రైతులు బోరుబావులమీద ఆధారపడడం, అవి నడపడానికి కరెంటు సరఫరా లేక పోవడం, విద్యుత్ ఛార్జీల పెంపు వంటి సమస్యల కోరల్లో విలవిలలాడిన వ్యవసాయదారుడి బ్రతుకు వెతలను రైతు కథలు ఘోషించాయి. వ్యవసాయానికి ప్రాణాధారమైన నీరు, ఆ నీటికి ఆధారమైన బావులు, ఆ బావులలోని పాతాళగంగను బయటికి తేవడానికి వేసిన బోర్లు, ఆ బోర్లను ఆడించడానికి విద్యుత్తు ఇలా ఒక దానితో మరొకటి ముడిపడివున్న సమస్యల్ని చిత్రించే ప్రక్రియలో దాదాపు ప్రతీ కథకుడు బండ బడిపోయిన బోరుబావుల సమస్యను ముందుకు తెచ్చారు. బోధనం నర్సిరెడ్డి - బోరుపాక్కలు, వి.ఆర్.రాసాని - కొత్తజూదం, జి.వెంకటకృష్ణ - చావునీళ్ళు, సుంకోజి దేవేంద్రాచారి - దృశ్యాలు మూడు. ఒక ఆవిష్కరణ, వేంపల్లి షరీఫ్ - జీపొచ్చింది, సింగమనేని నారాయణరావు - ఊబి, సన్నపు రెడ్డి వెంకటరామిరెడ్డి - తడి, కె.ఎమ్. రాయుడు - హైనా, కె. సభా - అంబా, కాలువ మల్లయ్య - భస్మాసురహస్తం, మేరెడ్డి యాదగిరిరెడ్డి - బతుకు, కేతువిశ్వనాథరెడ్డి - వాన కురిస్తే, డా. లంకిపల్లె - జీవనం, పలమనేరు బాలాజీ - అదృశ్యం, నూకా రాంప్రసాద్‌రెడ్డి - కరువు, మధురాంతకం రాజారాం - వినోద ప్రదర్శన, ఇతా చంద్రయ్య - భూమిపుత్రుడు కథలలో విద్యుత్ సంస్కరణలు వ్యవసాయంలో సంక్షోభం సృష్టించి రైతు జీవితాన్ని ఏవిధంగా అంధకారమయం చేశాయో కళ్ళకు కట్టినట్లు చూపించాయి.

బోర్లువేయడం, భూగర్భజలాలు అడుగంటడం ఒక ఎత్తైతే, కొద్దోగొప్పో వర్షాలు పడినప్పుడు నదుల్లో చేరిన నీళ్ళను పల్లంలోకి పడనీయకుండా, మెట్టప్రాంతాల్లోకి పారించే ఆనోచన చేయకుండా ప్రాంతీయ విద్వేషాలను ఎగదోస్తూ, నీటియుద్ధాలకు కారణమయ్యే రాజకీయ నాయకుల విభజనరాజకీయాలను ఎద్దేవా చేసిన కథ చావునీళ్ళు. పాతాళగంగను పైకి తేవడానికి తనకున్న ఒకేఒక్క ఆధారాన్ని తనఖా పెట్టి బోరువేయబోతే మోటార్లు, పంపుసెట్లు బిగించడానికి కరెంటువాళ్ళు రైతు గంపెడాశను సొమ్ముచేసుకుని, పీల్చి పిప్పిచేయడమే కాక, కరెంటు బిల్లు నిర్భంద వసూళ్ళలో వైర్లు, స్టార్టర్లు ఊడ బెరుక్కొని పోతూ బ్రిటిష్ వాళ్ళ క్రౌర్యాన్ని తలదన్నేట్లు ఏమాత్రం దయ, జాలి, కరుణ చూపని ఆకస్మికదాడుల్లో ఉక్కిరిబిక్కిరై ఆగిన రైతు గుండెకు కారణమైన కరెంటు వాళ్ళ ఆగడాల్ని ఎండగట్టిన కథ జీపొచ్చింది. ప్రభుత్వంతో ఏర్పడిన పేచీలతో పదినెలలపాటు ఫ్లాయిక్ చేసిన బిల్లు కలెక్టర్లు, ఆపై పదినెలల రీడింగుకు కలిపి ఒక్కసారిగా వేసిన వేలరూపాయల బిల్లును చూసి నిశ్చేష్టుడైన రైతుకథ ఊబి. వర్షాభావకారణంగా నీటి సౌకర్యం కరువైన భూముల్లో పెద్దరైతు పొలాల్లో ఉండే ఒకేఒక్క బోరుబావివైపు బక్క రైతులు ఆశగా చూస్తోంటే, వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని సేద్యానికి నీళ్ళమ్మి వేలరూపాయలు సొమ్ముచేసుకున్న భూస్వాముల జిత్తుల్ని బయటపెట్టిన కథ తడి. బోరుబావులకు, వ్యవసాయ అవసరాలకు ఇచ్చిన పంటరుణాలను ముక్కుపిండి వసూలుచేసే బ్యాంకుల నిర్దాక్షిణ్య విధానాలను వివరించిన కథ భస్మాసురహస్తం. వేసిన బోర్లు వేసినట్లు ఆవిరైపోతూ అందీ అందని నీళ్ళతో మృత్యుగోతులుగా మారుతూ రైతుల్నీ, పశువుల్నీ పొట్టనబెట్టుకుంటున్న పాతాళబిలాల నిజస్వరూపాన్ని ఆవిష్కరించిన కథ అంబా. విద్యుత్ సంస్కరణల కారణంగా విద్యుత్ సరఫరా ప్రైవేటు సంస్థల హస్తగతమైన నేపథ్యంలో ఓవర్‌లోడ్ అయ్యి మాటిమాటికీ కాలిపోతూ, అరగంటకు అరగంటకు ఫీజు కొట్టేస్తూ, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు ట్రిప్పు కొస్తూ, హెచ్.టి లైన్లు తెగిపడి ఎల్.టి లైన్‌మీద పడి మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతూ సర్కారిచ్చే రెండుసార్ల కరెంటుకు గండికొడుతూ రైతునోళ్ళల్లో మట్టికొట్టి మోయలేని అప్పులభారాన్ని మిగిల్చిన కథ బతుకు. తాలూకాకు పదిరిగ్గులు దించి, బావులు తవ్వించి, చెరువులను పునరుద్ధరించడానికి బదులు, వర్షాల కోసం చేసే మూఢా

చారాల్లో పాల్గొని చెక్కభజనల్లో పాల్గొనే స్థానికనాయకుల ద్వందవైఖరిని ప్రశిస్తూ కర్తవ్యబోధను చేసిన కథ వాన కురిస్తే. రెండేళ్ళపాటు రేయింబవళ్ళు ఎద్దుమాదిరి కష్టపడి కూడబెట్టిన కూలిడబ్బులతో, కుదువబెట్టిన ఆభరణాలతో బోరువేయించుకొంటే డబ్బుకు దాసోహమైన విద్యుత్ సరఫరా మరియు పంపిణీ సంస్థలు లోడ్‌కి మించి కనెక్షన్లు ఇస్తే, మాటిమాటికీ కాలిపోయే కాయిల్స్, మండిపోయే ట్రాన్స్‌ఫార్మర్ల గుట్టువిప్పి చెప్పిన కథ జీవనం. రైతుకు భరోసా కల్పించే పేరుతో బోర్లు వేసుకోవడానికి రుణాలిచ్చి, ఆపై సంపన్నదేశాలు తెరమీదికి తెచ్చిన భూతాప భూతాన్ని బూచిగా చూపెట్టి, పర్యావరణ పరిరక్షణ పేరుతో భూమి - చెట్టు - నీరు చట్టాన్ని చేసి, అమలులో భాగంగా బోర్ల తవ్వకాన్ని నిషేధించి రైతు నోట్లో మట్టికొట్టిన ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను నిలదీసిన కథ అదృశ్యం. మిగులుజలాల పంపిణీపై ధర్నాలు, దీక్షలు చేసిన నాయకులు, అధికారంలోకి రాగానే చేసిన వాగ్దానాలన్నీ మర్చిపోయి, బావిలోకి నీళ్ళొస్తే అదే పెద్ద ఉద్యోగం అనుకుని సంబరపడిన రైతు ఆశల్ని ఆవిరిచేసిన ఊకదంపుడు వాగ్దానాల డొల్లతనాన్ని నిరూపించిన కథ కరువు. నీళ్ళ వసతి మీద ఆశతో ఎన్నో ప్రయత్నాలు చేసి అప్పుతెచ్చి వేసిన బోరుబావి విఫలయత్నమై వెక్కిరిస్తోంటే, విధి ఆడే వింత నాటకంలో అభాసుపాలై పాలం, ఇల్లూ వాకిలీ అమ్ముకొని పల్లె విడిచి బ్రతుకు తెరువును వెతుక్కుంటూ పట్నం బాట పట్టిన వలసల విషాద గాధల్ని గొంతెత్తి చెప్పిన కథ వినోద ప్రదర్శన. మోటబావుల్లో నీళ్ళున్నాయనే ధైర్యంతో ఊరిపొలాలన్నీ వరితో అలికేస్తే ఏ అర్ధరాత్రో చుట్టం చూపుగా ఇట్టే వచ్చి, అట్టే మాయమైపోయి రైతుల్ని కబడ్డీ ఆడించి, లోఓల్టేజీతో ఇంజన్లను అల్లాడించి మోటర్లను బుగ్గిచేసి రైతులకు గుండెకోత మిగిల్చిన కరెంటుకోత విన్యాసాల్ని విశదీకరించిన కథ భూమి పుత్రుడు.

ఊటబావులు అడుగంటిపోయిన తర్వాత బోర్ల వ్యవసాయం వచ్చింది. విద్యుత్తు సంస్కరణల కారణంగా ఇవాళ బోర్లుకూడా రైతుల్ని మోసం చేస్తున్నాయి. రైతులు బోర్లు తవ్వించడంతోనే ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో ప్రభుత్వాలు సబ్సిడీలు తొలగించడం, కరెంటుచార్జీలు పెంచడం, పంటలకు గిట్టుబాటుధర కల్పించకపోవడంతో బోరుబావుల కింద ఉన్న రైతులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతునారన్న కథకుల విశ్లేషణ ఎంతమాత్రం విస్మరించదగినదికాదు. ఇందులో బోరుబావులింకిపోవడం మాత్రమే కారణం కాదు. విద్యుత్తుకు బోరుబావులకు వున్న సంబంధం కూడా ఒక ముఖ్యకారణం. బోరుబావుల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న సమస్య. బోరుబావి వేయడం, పంపుసెట్ల ఏర్పాటు, దాని నిర్వహణ వ్యవసాయ పెట్టుబడిలో 36%గా ఉంటోంది. అదే పేద రైతు విషయంలో వ్యయం మరింత అధికంగా ఉంటుందని సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ కన్సర్న్‌కు చెందిన డా.ఎమ్ఈ తిమ్మా రెడ్డిగారు పేర్కొన్నారు. ఇదే సమయంలో విద్యుత్ సంస్కరణలు గోరుచుట్టుపై రోకటి పోటిలా పరిణమించాయి. బోరుబావుల రైతుల వలన రాష్ట్రధాన్యాగారానికే కాక కోశాగారానికి కూడా వివిధ పన్నులరూపేణా వస్తున్న ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం వ్యవసాయంలో విద్యుత్ వినియోగాన్నే భారంగా భావించాయి నాటి ప్రభుత్వాలు. ఎదురుదెబ్బలు తిన్న ప్రభుత్వాలు తదనంతరం బోరుబావుల రైతుల సాధకబాధకాలను గుర్తించి, కొంత మేరకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ, ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు తలొగ్గి రైతుల మనుగడ విస్మరించి వ్యవసాయ విద్యుత్తు విషయంలో మాత్రం మొండివైఖరి అవలంబిస్తున్నాయి. వ్యవసాయ విద్యుత్తు చార్జీలు పెరిగిపోయి, వ్యవసాయ విద్యుత్తు బలవంతపు వసూళ్ళు భరించలేక రైతులు ఆత్యహత్యలకు పాల్పడుతున్నారు. సంపన్నదేశాల రైతులకు వారి ప్రభుత్వాలు 50% సబ్సిడీ చెల్లిస్తుండగా, మన దేశాలకు వచ్చేసరికి రైతుకు ఏరకం సబ్సిడీ ఇవ్వకుండా చేస్తూ వాళ్ళతో పోటీపడమనడం అన్యాయం. 60% సాగుబడి బావులద్వారా జరుగుతున్నదనే సత్యాన్ని ప్రభుత్వం గుర్తించి బోరుబావుల రైతు

మనుగడకు, దేశ ఆహారభద్రతకు ఉచిత విద్యుత్ సరఫరా అనివార్యమని ఇప్పటికే మానవహక్కుల బులెటిన్ ప్రకటించింది. నిప్పులాంటి ఈ నిజాలన్నీ మన కథకులు గుండెధైర్యంతో ఢంకాభజాయించి మరీ చెప్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయ ఆధునికీకరణలో భాగంగా పెట్టుబడులు పెరగడం, బహుళజాతి కంపెనీల విత్తనాలు, కాంప్లెక్సు ఎరువులు, రసాయన పురుగు మందులు అధిక మోతాదులో ఉపయోగించడంతో నిర్వహణావ్యయం పదింతలుగా పెరిగింది. రుణాలు అందకపోవడం, సబ్సిడీలు తగ్గించబడడం, పెట్టుబడికి తగ్గట్టుగా దిగుబడులు రాకపోవడం నష్టాలకు కారణమౌతోంది. ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలకు గిరాకీ పెరగడంతో ఆహారభద్రత కరువైంది. మితిమీరిన ఎరువులు, పురుగుమందుల రసాయనాల కారణంగా మన వ్యవసాయ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాల విషయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీకి నిలబడలేకపోతున్నాయి. ఈ దుష్పరిణామాలన్నీ ప్రపంచీకరణ ముసుగులో రైతు గుండెలమీద కుంపటిగా దాపురించాయి.

"సమస్య ప్రపంచీకరణతోకాదు దానిని అమలుచేసే పద్ధతిలోనే ఉంది. అంర్జాతీయ ఆర్థికసంస్థలు సమస్యకు కొంత కారణం. ఇ.ఎమ్.ఎఫ్, ప్రపంచబ్యాంకు, డబ్ల్యూటీవోలు ప్రపంచీకరణ నియమాలను రూపొందిస్తాయి. ఈ సంస్థలు సంపన్నదేశాలకు, అందులోనూ కొన్ని ప్రత్యేక వర్గాల ప్రయోజనాలకు ఉపయోగ పడే విధంగా ఈ సూత్రాలను తయారుచేస్తాయి. వర్తమాన ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవు" అని ప్రపంచీకరణ నిజస్వరూపాన్ని బయటపెట్టారు ప్రఖ్యాత నోబుల్ పురస్కార గ్రహీత స్టిగ్లిజ్ జోసెఫ్. సరళీకరణ విధానాల అమలులో మన పాలకుల నిర్లక్యం, అవగాహనారాహిత్యం అంతర్జాతీయ ఆర్థికసంస్థల గడుసుదనానికి దేశాన్ని పోషించే రైతు మాత్రం ఈనాటికీ ఎంతో మూల్యం చెల్లించుకోవాల్సివస్తోంది.

ఆధార గ్రంథాలు :

1. రైతు కథలు(2012) : (సం) సాకం నాగరాజు, గంధమనేని శివయ్య మెమోరియల్ సొసైటీ, బైరాగిపట్టెడ, తిరుపతి, 517501.

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక పరిణామం

– డా॥. పి.ఎ. సత్యనారాయణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ),
రాజమహేంద్రవరం.

– ఎ. మనోజ్ కుమార్
లెక్చరర్, ప్రభుత్వ కళాశాల (అ),
రాజమహేంద్రవరం.

- సాంస్కృతిక పరిణామాన్ని సాంస్కృతిక విధ్వంసం అనుకోవటం తప్పుడు అవగాహన.
- వస్తుదాస్యం లాంటిదే, సాంస్కృతిక దాస్యం కూడా.
- ఎలిజీలు రాసుకోవటం విస్మృత సంస్కృతిని వెలికి తీయటంవల్ల వొరిగేదేమీ ఉండదు.
- అభివృద్ధి కోసం ప్రాకృతిక విధ్వంసం వదిలి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడం అవశ్యం.
- ఏ రంగంలోనైనా పరిణామం అనివార్యం అని గుర్తించడం ప్రధమకర్తవ్యం.
- ప్రగతిశీల కమైన మార్పును ఆహ్వానించడం అనుసరించడం ఒక్కటే శరణ్యం.

ప్రపంచీకరణ అంటే దేశాల మధ్య మార్కెట్ అనుసంధానం. ప్రపంచీకరణకు ముందు కూడా దేశాల మధ్య వాణిజ్యం జరిగింది కానీ ఇక్కడ సరళీకృత విధానాలవల్ల దేశాల మధ్య మార్కెట్ అనుసంధానం విపరీతంగా పెరిగింది దీని కారణంగా వస్తు వినిమయ సంస్కృతి తద్వారా అలవాట్లు ఆచారాలు సంస్కృతి తీవ్రంగా ప్రభావిత మయ్యాయి. విదేశీ వాణిజ్యం ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలలో అంతకంతకు పెరుగుతూ వచ్చింది. పారిశ్రామిక విప్లవం తరువాత ప్రపంచీకరణ చూపిన సాంస్కృతిక ప్రభావం ఎన్నదగినది. ఇది ఎంత ప్రభావం చూపింది అంటే మనిషి కోసం వస్తువులు కాదు వస్తువుల కోసమే మనిషి అంతగా ప్రభావితం చేసింది. అంటే మనిషి ఇ-వస్తువుల వెంటపడ్డాడు వస్తువులే జీవితంగా చేసుకున్నాడు. గందరగోళంలో మునిగిపోయాడు నుంచి మనిషి బయటపడటానికి మానవి మెరుగుపరచడానికి ఒక భావ విప్లవం అవసరం అయింది.

అంతేకాదు మనం అనుకునే నష్టాలనే కాదు కొన్ని లాభాలను కూడా ప్రపంచీకరణ మన ముందుంచింది. కార్మికుల ఉద్యోగ అభద్రత చిన్న కంపెనీల దివాళా లాంటి నష్టాలే కాదు సాంస్కృతిక చైతన్యం ఉపశ్రేణి సంస్కృతుల వెలికితీత స్థానిక భాషల సంరక్షణ లాంటి లాభాలు కూడా ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం ప్రభావంతో ఆధునిక భావజాలం దేశీ సంస్కృతి మీద ఉప్పెనలా వచ్చి పడినట్టుగా ప్రపంచీకరణ వల్ల కూడా అన్నిరంగాలలో అభద్రత చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ శక్తుల వల్ల విస్తృత వస్తువినియోగం తద్వారా అలవాట్ల వినిమయం దేశీయంగా చుట్టు ముట్టింది ఫలితంగా ఉద్యోగ అభద్రతతో పాటు సాంస్కృతిక సంక్షోభం మనల్ని కలిచివేసింది.

వస్తు వినియోగం అలవాట్ల వినిమయం మన పని పాటలను సంస్కృతిని మార్పుకు లోను చేస్తు న్నాయి మార్పుకు అలవాటు పడని సమాజం ఉక్కిరి బిక్కిరి అవ్వటం సహజం. మొత్తం మీద సమాజంలో ఎంత ఘర్షణ వచ్చినప్పటికీ ఈ మార్పుకు అనుగుణంగా ఉన్నది మాత్రమే మన కలుగుతుంది అవసరం లేనిది నిష్క్రమిస్తుంది. కానీ వస్తువుల మీద వ్యక్తుల మీద ఆచారాల మీద అలవాట్ల మీద ఉన్న మమకారం వదలి పెట్టలేక పోవటం వల్ల, కొత్త అవకాశాలను స్వాగతించడం అనివార్యమవటం వల్ల, పుట్టిన సరికొత్త మానసిక సంక్షోభం నుంచి చాలా సాహిత్యం వచ్చింది. పలకా బలపాలు నుంచి కాగితం కలాల్లోకి మనిషి వచ్చాక భౌతిక మానసిక

సామాజిక సాంస్కృతిక పరిస్థితులు ఎంతగానో మారాయి అదేవిధంగా వస్తువులు ఇబ్బడిముబ్బడిగా రావడంవల్ల కూడా సమాజం ప్రభావితమవుతుంది.

అయితే వస్తు వినిమయం సాంస్కృతిక వినిమయంకు దారి తీయటాన్ని చూచి బెంబేలు పడటం ద్వారా మనం సాంస్కృతిక పరిణామాన్ని సాంస్కృతిక విధ్వంసంగా భ్రమించే అవకాశం ఉన్నది. కాబట్టి ఇంత సాంస్కృతిక చైతన్యం భాషా చైతన్యం వచ్చాయి.

అసలు సాంస్కృతిక విధ్వంసం అంటే ఏమిటి పాత అలవాట్లు స్థానంలో కొత్తవి చేరితే మనం బెంబేలు పడడం ఎందుకు సంస్కృతి అంటే ఆచారాలు అలవాట్లు అవి ఎప్పుడూ అలాగే ఉండవు ఏదైనా మార్పులకు లోనవుతుంది మారనిది ఒక్కటే మార్పు మాత్రమే అని తెలిసినా సాంస్కృతిక పరిణామాన్ని సాంస్కృతిక విధ్వంసంగా మనం భావిస్తూ ఉంటాము మన భాష పోతే మనమే పోయినట్టు భావిస్తాము అలాంటి ప్రచారాలకు సులభంగా ప్రభావితులవుతాం. మన భాష సంస్కృతుల్ని వదలలేక ఇతర భాషా సంస్కృతులను వదిలించుకోలేక సంకుల సమరంలో చిక్కుబడిపోతాం. దీనికి కారణం పరిణామం. పరిణామం అవసరాలను ప్రభావితం చేస్తుంది. అవసరాలు మనల్ని ప్రభావితం చేస్తాయి. మన వేషభాషలను ఆచారాలను ,అలవాట్లను కూడా ప్రభావితం చేస్తాయి. కానీ ఓల్డ్, గోల్డ్ అంటూనే వింతైన కొత్తలోకి కొట్టుకుపోతాం.

మనిషి తోటి మనిషిని వదిలేసి వస్తువుల వెంటపడి అమానవీయంగా అసహనంగా తననూ, తన సమాజాన్ని, మొత్తం ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాడు. ఆమాటకొస్తే అనాదిగా మనిషి కొత్త వెంట పడుతూనే ఉన్నాడు ఆవిష్కరణ కోసం అన్వేషిస్తూనే ఉన్నాడు అమానవీయత కూడా మొదటి నుంచి ఉన్నది. బలవంతుడు బలహీనుడిని సొమ్ము చేసుకోవడం అనేది ఎప్పటి నుంచో ఉన్నది. అయితే యజమాని-బానిస సంబంధాలు, కూలీలు-భూస్వాములు, సంబంధాలు నుంచి కార్మికులు - పెట్టుబడిదారులు సంబంధంలోకి మనిషి ప్రయాణించాడు. కానీ ఇవాళ మనిషి హక్కుల పట్ల అవగాహన జాగురూకత రెట్టింపైన మాట వాస్తవం. మునుపెన్నడూ లేని అవగాహన అక్షరాస్యత వల్లనే సాధ్యం అయింది.

మనిషి సమష్టి వైపుఎంత వేగంతోప్రయాణిస్తాడు. వ్యష్టి వైపు కూడా అంతే వేగంతో ప్రయాణిస్తాడు. ప్రపంచం కుగ్రామం కావటం ఎంత వేగంగా జరుగుతున్నది అంతే వేగంగా మనిషి ప్రాంతీయ, వ్యక్తి అస్తిత్వాల వైపుకు ప్రయాణించటం జరుగుతుంది. ఈ నిరంతర రాకపోకల క్రమంలో భిన్న వాదాలు ముందుకు వస్తాయి. విస్మృత మైనవి వెల్లడి అవుతాయి. ప్రధాన సాంస్కృతిక స్రవంతితో పాటు విస్మృత మైన సాంస్కృతిక స్రవంతి కూడా అందలం ఎక్కుతుంది. ఆ మాటకొస్తే ఒకే ప్రాంతానికి చెందిన విభిన్న సంస్కృతులు మధ్య వైవిద్యాలు కాపాడబడుతూనే హెచ్చుతగ్గులులేకుండా సమాన హోదా పొందుతాయి.

అయితే సాంస్కృతిక పరిణామాన్ని సాంస్కృతిక విధ్వంసంగా భ్రమించడం తోపాటు గానే సాంస్కృతిక సంక్షోభం వచ్చి పడిందని సాంస్కృతిక సంరక్షణకు నవ్య సంప్రదాయవాదం ఎప్పుడో నడుంబిగించింది. అదే పని ఇవాళ ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చే సాహిత్యం కూడా చేస్తున్నదని కూడా ప్రచారం జరుగుతున్నది. ఇదంతా తప్పుడు అవగాహన. కుయుక్తి కూడా అయి ఉండవచ్చు. ఈ తరహా ప్రసార కర్తలు తాము ప్రపంచీకరణ భోగాలు అనుభవిస్తూ జనాన్ని సంచార వృత్తులు చేసుకుంటూ దేశ దిమ్మరుల్లా తిరగమని స్వధర్మమే మేలు అంటూ అసమానతల్లో మగ్గిపోయేలాగా చేయడం అన్నమాట.

ఒక్కడి భోగం కోసం వంద మంది బోయీలు కావటం అనే సంస్కృతిని పెంచి పోషించే వాళ్లు సంస్కృతి కోసం ప్రాణాలు ఇవ్వాలి అని ప్రచారం చేస్తారు నిజానికి సంస్కృతి అంటే ప్రాణాలు ఇవ్వాల్సినంత గొప్పదేమీ కాదు అది మనిషి కంటే గొప్పది కాదు మనిషి కోసం అది కాని దాని కోసం మనిషి కాదు. కానీ అది లేకపోతే మనిషి లేడు అంటూ ఉంటారు. సంస్కృతిని సృష్టించింది మనిషి

కానీ, సంస్కృతి మనిషిని సృష్టించలేదు. మనిషి తనకు కావలసినట్టుగా దాన్ని మలుచుకున్నాడు. కొత్తనీరు వచ్చినట్టుగా దాన్ని రోజురోజుకు ఆధునీకరిస్తాడు. అంత మాత్రం చేత కొంపలు అంటుకు పోయినట్టు కాదు. పాతను పట్టుకుని వేలాడడం, కొత్త ను అందుకోవడానికి నిరంతరం తాపత్రయపడటం లో ద్వంద్వ వైఖరి కనిపిస్తుంది. ఈ వైఖరి చాలా ప్రమాదం దీన్ని బుద్ధి పూర్వకంగా ప్రచారం చేసే వాళ్ళు సమాజాన్ని తప్పుదోవ పట్టించే అవకాశం ఉంది అంటే జాతి సంపద అనుభ వించే వర్గం ఒకవైపు సంపదను కష్టించి పోగు చేసే వర్గం ఒక వైపు ఉండేలా ఈ వాదం చేయగలుగుతుంది.

మనిషి వస్తువుల వెంట పరుగు పెట్టడం ఎంత అవివేకమో సంస్కృతి వైపు పరిగెట్టడం కూడా అంతే మూర్ఖత్వం. ఎందుకంటే వాటిని సృష్టించింది మనిషి. మనిషి కోసం అవి కానీ, వాటి కోసం మనిషి కాదు. మనం ఎన్ని ఎలిజీలు రాసుకున్నా మార్పు సహజం అనివార్యం.

వస్తు వినియోగం, సాంస్కృతిక వినిమయం గురించి మనం ఆందోళన చెందాల్సిన పని లేదు. మన ఆందోళన అంతా అభివృద్ధి పేరిట జరిగే ప్రాకృతిక విధ్వంసం మీద మాత్రమే ఉండాలి. సాంస్కృతిక పరిణామానికి సాంస్కృతిక వినిమయమే నాంది. సాంస్కృతిక వినిమయానికి అపరిమిత వస్తు వినియోగమే ప్రాతిపదిక. మనిషి వస్తువులను వినియోగించుకుంటే మంచిదే కానీ వస్తు వినియోగంలో సౌకర్యం ఉందనుకుని వస్తుదాస్యంలో మగ్గిపోతున్నాడు వస్తుదాస్యమే కాదు సాంస్కృతిక దాస్యం కూడా మనిషిని అతలాకుతలం చేస్తుంది.

ఆధార గ్రంథాలు :

1) పోస్టు మోడ్రనిజం - బి. తిరుపతిరావు
2) ప్రజాశక్తి డైలీ సోమవారం సాహిత్య పేజీ
3) వివిధ ఆంధ్రజ్యోతి - సోమవారం
4) మిసిమి-మంత్లీ-ఆగష్టు 2001

❖ ❖ ❖

ఆధునిక సాహిత్యంలో - జానపద సాహిత్యం - ప్రపంచీకరణ ప్రభావం

- డా॥. ఓ. నాగజ్యోతి, తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ.

"సహితస్య భావ: సాహిత్యం" అన్నారు పెద్దలు. సమాజానికి అద్దం వంటి సాహిత్యంలో సంఘం యొక్క ప్రతిరూపం, ఆచారాలు, వ్యవహారాలు, మానవుని ప్రతి కదలికను చూపించకలదు. వీలైతే భూత, వర్తమాన, భవిష్యత్తుకి చెందిన అపారమైన జ్ఞాన సంపదనిచ్చేదే సాహిత్యం. మంచి సాహిత్యం ఉపదేశసహితం. ఎందరో కవులు, రచయితల మనోనేత్రాలే ఎల్లలులేని సాహితీ ప్రక్రియలు. మానవుని అభిరుచి, నాగరికత, భాషా వైవిధ్యాలను బట్టిగాని, మానవుడు సంఘజీవి కాబట్టి తన ఆలోచనలు, భావాలు ఇతరులకు చెప్పుకోవాలి, వారివి కూడా వినాలి అన్న పరిస్థితుల్లో కూడా సాహిత్యంలో అనేక రకాలైన ప్రక్రియలు పుట్టుకొచ్చాయి. సాహిత్యం అంటే మనోవికాసం కల్గించేది కాబట్టి, ఇది ఏ ప్రక్రియలో ఉన్నా దీని ప్రయోజనం చివరకు హితాన్ని. ఆనందాన్ని, మంచికీర్తిని కల్గిస్తుంది. సాహిత్య పోకడలు ఆధునిక కాలంలో అనేక శాఖలుగా విస్తరించి ప్రజోపయోగాలకు తగినట్టుగా వివిధ రకాలుగా మానవలోకాన్ని ఆనందింప చేస్తుంది, ప్రతిభావంతులను చేస్తుంది.

నేటి పోటి ప్రపంచంలో చదువని వారికి, చదువుకున్న వారికి సైతం సాహిత్యపరంగా సాహిత్యం అర్థమయ్యే రీతిలో, ప్రపంచాన్ని కళ్ళముందుకు తెచ్చే 'ప్రచార సాధనాల' ద్వారా సాహిత్యవైశిష్ట్యం వర్ణనాతీతం. సాధారణంగా ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తితో తన ఆలోచనలు, వైశిష్ట్యం భావాలను పంచుకోవటాన్ని స్థూలంగా 'సమాచారాల చేరవేత' అని వ్యవహరిస్తున్నా. మాధ్యమాలు లేక మీడియా కోసం సాహిత్యపాత్ర అవిభాజ్యమైనది. మాధ్యమాలైన కొన్నింటిలో పత్రికలు, రేడియాలు, టెలివిజన్లు, కేబుళ్ళు, సినిమాలు వ్యాప్తిలోకి వచ్చాయి. స్వతహాగా కవి ఒక సన్నివేశాన్ని చూచి స్పందించి, ఊహా, కల్పనలతో వ్రాస్తారు. కాని మీడియా సాహిత్యం ఒక్కో రకంగా శిక్షణ, ప్రావీణ్యం, సృజనాత్మకతలు, శ్రద్ధలాంటివి అవసరం.

వేయి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో ఎనిమిది వందల సంవత్సరాల సాహిత్యం ప్రాచీనసాహిత్యం. మిగిలిన రెండువందల సంవత్సరాల సాహిత్యంపై సంస్కృత ప్రభావం, ఆధునిక సాహిత్యం పై ఆంగ్ల ప్రభావం భాగా కన్పిస్తుంది. తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యమైనవి. ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, పదకవిత, ద్విపద, ఉదాహరణం, శతకం, వచనం, చిత్రకవిత, కథాకావ్యం, దండకం, ద్వర్థికావ్యం, అచ్చుతెలుగు కావ్యం, యక్ష గానం, హరికథ, బుర్రకథ, చాటువు, అవధానం, జానపద కవిత్వం, నవల, కథ, గల్పికలు, నాటకం, ఏకాంకిక, పాట, ఖండకావ్యం, గేయం, జీవితచరిత్ర, స్వీయచరిత్ర, మాత్ర చరిత్ర, వ్యాసం, పీఠిక, విమర్శ, లేఖాసాహిత్యం, అనువాదం మొదలైనవి, చాలా వరకు కొన్ని ప్రక్రియలు సర్వజనాదరణ పొందినవి. తెలుగు సాహిత్యంలో విశ్వమానవ సంక్షేమాన్ని కోరే ప్రక్రియలు అసామాన్యమైనవి. సాహిత్యం సామాజిక ప్రతిబింబం. సమాజం నిరంతరం మార్పునకులోను అవుతుంది.

ఆధునిక కవిత్వ లక్షణాలలో ప్రక్రియా వైవిధ్యమే కాదు, ప్రక్రియా వైశిష్ట్యం కూడా ముఖ్యమైనదే. పాశ్చాత్య కవిత్వ ప్రభావం వల్ల కొత్తదనానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకోవటం వల్ల కొత్త ప్రక్రియలు ఆవిర్భవించాయి.

ఆధునిక సాహిత్యాన్నే నవ్య సాహిత్యం అని కూడా పిలిచేవారు. 19వ శతాబ్దం నుంచి వెలువడిన సాహిత్యమే ఆధునిక సాహిత్యంగా చెప్పుకోవచ్చు. 1885లో జాతీయోద్యమంవల్ల నాదేశం, నా భాష, నాజాతి అనేభావం ఏర్పడింది ఆధునిక సాహిత్య వ్యాప్తికి వ్యావహారిక భాషోద్యమం మరొక కారణమైంది. చరిత్ర నిర్మాణం, సంఘధర్మాలు, విశ్వాసాలు, వీటిని యేయే గ్రంథం పరామర్శిస్తుందో అదంతా నవ్యసాహిత్యం.

ఆధునిక కవిత్వ లక్షణాలు :

19వ శతాబ్దికి ముందు 'ఖండ కావ్యాలు' లేవు. చిన్నకథ గలది కనుక చదవటం సులువుగా ఉంటాయి. 'ఆత్మాశ్రయరీతి'గా అనుభూతులు, కల్పనలు, హృదయ మథనం అనేవి ఆత్మాశ్రయ లక్షణాలని చెప్పవచ్చు, 'వస్తునవ్యత' ప్రాచీనకవిత్వంలోని వస్తువు ఎక్కువగా పురాణాల నుంచి కావ్యాల నుంచి గ్రహించినదే అయి ఉంటుంది. వివిధ వర్ణాలకు చెందిన పాత్రలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. 'భావనవ్యత' ప్రాచీన కవిత్వంలో కథాప్రాధాన్యం కన్న, కల్పనా ప్రాధాన్యమే మిన్న. విన్న దానికన్న, కన్నదానికే ప్రాధాన్యం ఇచ్చారు. 'శైలీనవ్యత' ప్రాచీన కవిత్వంలో పాండిత్య ప్రదర్శన ఎక్కువ. వాడిన పదాల స్థానంలో కొత్త ఉపమానాలు వాడటం, సంస్కృతం కన్న తెలుగుకే ప్రాధాన్యం. వాడుక భాషకి పట్టం కట్టడం ముఖ్యమైన లక్షణం. "కవితా రచనలో నవ్యత' ఆధునిక కవులు మార్గకవిత్వాన్ని ప్రోత్సహించ లేదు. గేయ కవితా రచనకి ప్రాముఖ్యం ఇచ్చారు. ప్రక్రియా బాహుళ్యం ఆధునిక కవిత్వంలోని మరొక ముఖ్య విశేషం. ఖండకావ్యం ప్యారడీ, ఎలిజీ వంటి ప్రక్రియల్ని ఆధునిక కవులు ఆశ్రయించారు. "వచన కవిత' అనే ప్రక్రియ బహు ముఖాలుగా విస్తరించడానికి ఆధునిక కవులే మూలకారకులు. ఆధునిక కవిత్వ ప్రక్రియల్లో దాదాపుగా 20వ శతాబ్ది ప్రారంభమున తెలుగు సాహిత్యాన మొలకెత్తిన ప్రక్రియ ఖండకావ్యం. తెలుగులో ఖండకావ్య ప్రక్రియను ప్రవేశపెట్టిన ఖ్యాతి గురజాడకే దక్కుతుంది. 'పూర్ణమ్మ' అద్భుతమైన ఖండ కావ్యం. తర్వాత కవులందరూ ఈ ప్రక్రియను అనుసరించి ఎంతో ఖ్యాతిని గడించారు విశ్వనాథకవి 'దేశభక్తిని' ప్రబోధించే ఖండకావ్యాలు రాశారు. వీటిలో వేదన, ప్రణయం ఉంటాయి. 'ముత్యాలసరం' అను మాటకు 'ముత్యాలదండ' అని అర్థం. గురజాడ కవి ఈ చక్కటి దేశీయమైన ఛందస్సును ప్రవేశపెట్టారు. వీరు వ్రాసిన 'కన్యక' 'లవణరాజుకల' 'దేశభక్తి' వంటివి ఈ ప్రక్రియకు ప్రజాదరణ లభించింది.

ప్రపంచ సాహిత్యంలో జానపద సాహిత్యమే మొట్ట మొదటగా రూపొందిందని పరిశోధకుల భావం. ఆ జానపద సాహిత్యం ఆధారంగా గ్రహించి సాంప్రదాయ సాహిత్యం ఏర్పడిందని పెద్దల అభిప్రాయం. జానపద సాహిత్యం మౌఖిక సాహిత్యమే కనుక మానవ జీవితాలకు సత్య, సన్నిహితంగా ఉంటుందీ సాహిత్యం. అన్నింటి కంటే ప్రధానమైనది అక్షరజ్ఞానం లేనివాళ్ళు అందులోను, సమాజంలోని అనుభవాలను బాగా ఆకళింపు చేసుకున్న వాళ్లు తమ పరిజ్ఞానాన్ని ఆధారంగా తీసుకుని తమదైన రీతిలో జానపద సాహిత్యాన్ని సృష్టించారు. మనిషన్న తర్వాత సుఖదుఃఖాలకు అతీతంగా ఉండలేడు. ఈ రెండింటిని కలిపిన అమృత సమానవైనవే జానపద గేయాలు. ఆయా కాలాల్లో సంస్కృత, సాంప్రదాయాలు, భాషావిధానం, మానవ మనుగడ మొదలైన విషయాలు తెలుసుకోవటానికి సాహిత్యం ఎంతో ఉపయోగపడు తుంది. ముఖ్యంగా ప్రాచీన సమాజాన్ని గురించి గ్రహించా లంటే ఈ జానపద సాహిత్యాన్ని చదవాల్సిందే.

ఇంతటి ప్రాచుర్యం పొందిన సాహిత్యాన్ని సృష్టించిన వాళ్ళ వివరాలు అజ్ఞాతంగా ఉన్నాయి. ఎవరి ప్రేరణ, పోషణ లేకుండా వెలువడింది కాబట్టి, దానితోపాటు, చదువుకూడా లేదు కనుక రచయితలు తమ వివరాలను పొందుపరచుకోవాలనే ఆలోచన లేక పోయింది. నేటి కాలంలో సాంప్రదాయ సాహిత్యానికి ఆదరణ కరువైంది. రాసే కవులు కూడా అంతంత మాత్రమే ఉన్నారు. దానితో

పాటు ఆదరించే వాళ్ళ సంఖ్య తక్కువేనని చెప్పవచ్చు. కాని జానపద సాహిత్యం నాటి నుంచి నేటికీ, ఏనాటికీ నిత్యనూతనంగా వెలుగొందుతూనే ఉంది. కాలాను గుణంగా సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు పుట్టినా జానపద సాహిత్యానికున్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దానికి కారణం ఈ సాహిత్యంలో మాధుర్యం, మాండలీకం, బాణీలే.

ఆదిమ సమాజంలో మనుషుల ప్రతిపనీ సామూహికంగా ఉండేది. వారి పనులలో ఉపయోగించే పని ముట్ల వాడకం ఒకరినుంచి మరికరు చెప్పుకోవటానికి సైగలు, సంకేతాలు చేసేవాళ్ళు. ఆ క్రమంలో భాష పుటింది. వారు చేసే సామూహిక పనుల్లో ఒక లయ ఏర్పడింది. తద్వారా వారి పనిలోని శ్రమను మర్చిపోవ టానికి పాటలను పాడటం అలవాటయ్యింది. వారి భావాలను బట్టి, చేసే పనిని బట్టి శబ్ద సౌందర్యం ఆయా పాటల్లో సంగీతమయ్యేది.

జనపదములందుండు వారు జానపదులు. వారు పాడుకొను పాటలు జానపద గేయాలు. సమాజంలో స్త్రీ స్థానాన్ని బట్టి ఏర్పడు ఆచార వ్యవహారాలనుబట్టి, మారుతున్న విలువలను బట్టి, పెరుగుతున్న నాగరికతను ఆధారంగా పాటలు వచ్చాయి. జానపద సాహిత్య పరిధి కూడా విస్తృతమైనది. కొత్త పాట కల్పించిన తర్వాత అది అందరి సొత్తు అయ్యేది. ఎందుకంటే వారి పనులు, జీవన సరళి ఒకటే కనుక. కాని ఆధునిక యుగంలో సామాన్యులు ఎక్కువ. మనుషుల మధ్య, బంధాల మధ్య దూరం పెరిగింది. అందువల్ల మౌఖిక సాహిత్యం సన్న గిల్లింది. అక్షరాస్యత పెరిగినకిద్దీ పుస్తకాలు, రేడియో, టీవీల ప్రాముఖ్యం ఎక్కువైంది. అయినా జనసాహిత్యాన్ని అవి అందుకోలేవు. నాగరికత, ఆధునికత వలన పూర్వం వ్యవసాయ పనుల్లో పాడుకునే పాటలు ఇప్పుడు అంత రించాయి. ఎందుకంటే ఆధునిక సామాగ్రి వల్ల ఈ మార్పు చోటుచేసుకుంది. పనులు చేసేటప్పుడు మార్పు అనేది ఒక్కసారిగా వచ్చింది కాదు. దేశంలో మిషనరీలు అధికమైన తర్వాత వచ్చిన పాటలున్నాయి. రానురాను జానపద విజ్ఞానంపై అధ్యయనం విస్తృత పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు పట్టణ సంబంధమైన జానపద విజ్ఞానం కూడా వ్యాప్తిలోకి వస్తుంది.

ఆధునిక సమాజంలో ప్రపంచీకరణ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. ప్రపంచీకరణ వలన ఎంతైనా ప్రయో జనం ఉంది. అంతకంటే ఎక్కువ నష్టం కూడా ఉంది. దీనివల్ల మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. భార తీయ సాంప్రదాయాలు నాశనం అవుతున్నాయి. జీవనం యాంత్రికంగా మారిపోతున్నది. ఈ పరిస్థితిలో ప్రపంచీ కరణ నేపథ్యంలో జానపద సాహిత్యాన్ని కాపాడి, పరిరక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనేమాట వాస్తవం. 'జానపదం' అనగా పల్లెవాసులని, జనపదములందు ఉండు వారు జానపదులు. వారు పాడే చక్కటి పాటలే 'జానపద గేయం' అని వ్యవహరించవచ్చు. దీనినే folk songs, volkslied అను జర్మన్ భాషాపదంనకు అనువాదము. (folklore) జానపదము విజ్ఞానం, (folk literature) జానపద సాహిత్యం, (folk songs) జానపద గేయం అని వ్యవహారంలో కలవు. జానపదమును జాతి, ప్రజలు, విషయానికి చెందిన అంశాలకు వాడ బడును.

ఉత్తర భారతదేశంలో హిమాలయాల నుండి దక్షి ణాన కన్యాకుమారి వరకు, తూర్పున ఆఫ్ఘనిస్తాన్ నుండి బర్మా వరకు వీరు కనిపిస్తారు. జానపద సాహిత్య సంబంధమైన, శబ్దగతమైన విషయంగా కూడా వాడుకలో కలదు. జానపద సాహిత్యం 'మౌఖిక సారస్వతం'. అనగా కథాగేయం, పాట, ఆట, గద్యం, తిట్లు, మాండలికాలు, పిలుపులు మొదలైనవిగా పేర్కొనవచ్చు. ఆ విధంగానే భౌతిక పరంగా వారి సంస్కృతి, పరిశ్రమలు, పానీయాలు, వంట, వార్పు, వస్తువులు, వేషము, ఆభరణాలు, పచ్చ బొట్లు, వాస్తు విజ్ఞానం, ఇళ్ళ నిర్మాణం వంటి అంశాలుం టాయి. వీటినే "Material Culture"లో చేర్చవచ్చు. మౌఖికపరంగానే (Social folk customs) జానపదులు సంస్కృతి, సారస్వతపరంగా సాంప్రదాయక జీవితానికి సంబంధించిన సమాచారం ఉంటుంది, వారి ఆచారాలు, క్రీడలు, ప్రభలు, తిరునాళ్లు, నమ్మకాలు, బోనాలు,

సమాధులు, మ్రొక్కుబడులు, చిట్కాలు, కొలుపులు, దేవతలు వంటి ముఖ్యాంశాలుంటాయి. అన్నింటిలోను మనకు ఆనందాన్నిచ్చే వారి ప్రదర్శనలు, కళలు (performing folk arts) ఆటవికుల విన్యాసాలు, సంగీతం, గాత్ర సంగీతం, బృంద, వ్యక్తిగత నృత్యాలు, కోలాటం, భజనలు, పగటి వేషాలు, కొరవంజి నృత్యాలు, గారడీ విద్యలు, చెక్క బుట్ట, తోలు బొమ్మలాటలు, గుర్రపునృత్యం వంటి అసామాన్య కళలు వారిలో కలవు. కనుక విశాలమైన జానపద వాఙ్మయంలో జానపద విజ్ఞానం ఒక భాగంగా మాత్రమే దానిలో నిబద్ధదేశి, అనిబద్ధదేశిగా వర్గీకరిస్తే శిష్టులరచన నిబద్ధ, జానపదల రచన అయిన అనిబద్ధ రచనలు లేక పల్లీయులకు చెందిన దేశి సాహిత్యంగా పేర్కొనవచ్చు. ఆ విధంగానే గిరిజనుల ఆటవికదేశీ, చదువున్న వారిది జాతిదేశిగా పేర్కొనవచ్చు.

పదకొందు వందల సంవత్సరాలకు పైగా తెలుగు జాతిజీవన స్రవంతిలో సాహిత్యం కొనసాగుతుంది. ఆది కవి నుండి నేటి అభ్యుదయ కవిత్వం వరకు వివిధ ప్రక్రియలలో మన సాహిత్యాన్ని వికసింపజేసారు. ఈ కృషి వలన ప్రాచీన భాష ఉన్నత స్థాయిని అందుకుంది. నాటి కవులు శిష్టజనుల కోసం కవిత్వం వ్రాసినా, నేడు అది సర్వజనులకు అనువైనదిగా మారింది. వచనం, గేయం, కవితలతో వికసించింది. ఈనాడు కవిత్వం వివిధ ప్రక్రియలలో అందరికీ అందుబాటులోకి వచ్చింది. తెలుగు భాషలో ప్రౌఢ సాహిత్యం ఉద్భవించడానికి ముందే జానపదులు 'దేశీయ కవితలు' అల్లినట్లు సాహితీ విమర్శకులు చెబుతారు. జానపదుల కమ్మనిగీతాలు, గేయాలు, వీధిపాటలు జనంలోకి తీసుకొని పోయారు. ఈ జానపద సాహిత్యం నన్నయ తో ప్రారంభమైన లిఖిత పూర్వక సాహిత్యానికి సమాంతరంగా ఆవిర్భవించి అభివృద్ధి చెంద లేదు. జానపద సాహిత్యం నన్నయకు మందే జనులలో ఉండేది. జానపదులకు చదవటం రాయటం రాక పోవడం వల్ల దీనికి కాల ప్రామాణికం దొరకలేదు.

భారతీయ భాషలలో జానపదగీతాలు ఉన్నట్లే తెలుగులో కూడా జానపద సాహిత్యం ఉద్భవించింది. చంద మామ, తుమ్మెద పదాలు, ఊయల పాటలు, నారు నాటే పాటలు యాలపదాలు, రోకలిపాటలు మొదలైనవి.14వ శతాబ్ధికి చెందినవని భావించినా, ఇవి చాలా ప్రాచీనమైనవి. కాలానుగుణంగా పాటల శైలి, లయ మారుతూ వస్తుందని విశ్లేషించ వచ్చును. మధ్య యుగంలో సిరియాళుని చరిత్ర, పల్నాటి యుద్ధం. దేశంగు రాజు కథ, సుభద్రాకళ్యణం, గేయకథలు పాటలుగా ఉన్నాయి. జక్కుల వాళ్లు, జంగాలు, పాటలు పాడుతూ వినిపించేవారు. ఆనాడు వేరేవినోదాలు లేక ఈ గీతాలు విని జనం ఆనందించేవారు. సనాతన సాంప్రదాయకంగా వస్తున్న వారసత్వ సంపద మన జానపద సాహిత్యం. ఇది అందరికీ సంబంధించినది ఎవరికి తోచినప్పుడు వారు మానసిక ఉల్లాసంగా పాడుకునేవారు. ఈ జానపద సాహిత్యం ప్రాచీనమైనది నన్నయకు పూర్వమే వెలసిందంటే ఆశ్చర్య పడవలసింది లేదు. జన జీవనంలో అను సృతంగా కలిసిపోయింది. ఒకరి ద్వారా మరొకరికి ప్రాకి మౌఖికంగా ప్రచారంలో ఉండి కూడా నిత్య నూతనంగా ఉండటమే ఈ సాహిత్యం గొప్పతనం.

'ఇంకా పడుకొన్నావా సీతారాముల పూదోటకు ।
ఈతాకుల కొండలో ఇనుడుదయించె చూడు।'

ఇలాంటి పాటలు తెలుగు భాషలో కోకొల్లలు సులభ శైలిలో ఉండటం జానపద సాహితీ ప్రక్రియ అయ్యింది.

ప్రపంచీకరణ నేపథ్యం :

'గ్లోబలైజేషన్ అనే ఈ ఆంగ్ల పదానికి తెలుగులో 'ప్రపంచీకరణ' అనే మాటను సమానార్థకంగా ఉప యోగిస్తున్నారు. ప్రపంచీకరణ అనే పదం ఈ రోజుల్లో అందరినోట సామాన్యంగా ఉచ్చరింపబడుచున్నది. ఈనాడు ప్రపంచీకరణ అన్నది ఏ ఒక్క అంశానికి పరిమితమై లేదు. ఆర్థిక, రాజకీయ సాంఘీక సాంస్కృత రంగాలన్నీ ఈ ప్రభావానికి గురవుతున్నాయి. ప్రపంచం కుగ్రామం అయిపోయింది. ఇంటర్నెట్, వాట్సప్ వంటివి సాంకేతిక అభివృద్ధిలో ప్రపంచం చిన్నది అయిపోయింది. అయితే ప్రపంచీకరణను ప్రపంచదేశాలు ముఖ్యంగా అభివృద్ధిచేందుతున్న దేశాలు ప్రథమంలో స్వాగతించిన

తర్వాత ఆచరణలో దాని స్వభావం తెలియగానే దాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ప్రపంచీకరణం వల్ల ప్రపంచం కుగ్రామం అవ్వడం, అభివృద్ధిలో సాంకేతికంగా ముందున్న దశలో వ్యతిరేకించడం జరుగుతుంది. ప్రపంచీకరణ వస్తువుల - వసువుల దగ్గర అవ్వడం, మనిషి - మనిషి దూరం అవ్వడం. ఈ పరిణామాన్ని మనం నేడు స్పష్టంగా గమనించవచ్చు

ప్రపంచీకరణ మూలాలు :

ప్రపంచీకరణ 20వ శతాబ్దంలో మొదలైందని చెబుతున్నప్పటికి అందులో వాస్తవంలేదు. నిజానికి ప్రపంచీకరణ 15వ శతాబ్దిలోనే మొదలైంది దేశాలను ఆక్రమించడం, వలసవిదానం వలస దేశాల సామ్రాజ్యవాద రూపంలో ఉన్న నయా ఉదార వాద దశకు చేరుకుంది. ప్రపంచీకరణ వల్ల దుష్పరిణామాలే ఎక్కువని, ప్రపంచీకరణ అంటే అమెరికీకీకరణ, డాలరీకరణ అని కొందరు మేధావులు అభిప్రాయ పడుతున్నారు.

నిర్వచనం:

1. ఆంక్షలు లేని వెనలుబాటు, విశ్వస్వేచ్ఛా వ్యాపారం, ఎల్లలు దాటి వ్యాపించడాన్ని ప్రపంచీకరణ అని ఒకరు నిర్వచిస్తే
2. పెట్టుబడిదారి అభివృద్ధి యొక్క వస్తుగత నియమమే ప్రపంచీకరణ అభివృద్ధి చెందుతున్న దేశాలను తిరిగి ఆర్థిక వలసలుగా మార్చడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించిన బ్లూప్రింటే ప్రపంచీకరణ.
3. గతంలో సామ్రాజవాదంగా ఉండేది నేడు ప్రపంచీకరణగా మారింది.

ఈ విధంగా ప్రపంచీకరణ అన్ని రంగాల మీద దుష్పరిణామాన్ని చూపిస్తున్న ప్రస్తుత కాలంలో స్థానిక సంస్కృతి, ఆర్థిక, రాజకీయ విషయాల్లో అనేక మార్పులు సంభవించాయి. ప్రపంచీకరణ నేపధ్యంలో జానపద సాహిత్యం పైకూడా అనేక రకాలుగా వినాశనాన్ని కల్గిస్తుంది. భారత దేశంలో ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతికి క్రమక్రమంగా లోనౌతూ తమదైన సంస్కృతిని ప్రజలుకోల్పోతున్నారు. ప్రపంచంలో ఉన్న ఏ భాషా సాహిత్యానికైనా, ఆ భాష యొక్క గొప్పతనం తెలుసుకోవడానికైనా ఆ భాషామూల రూపాలు తెలుసుకోవాలన్నా 'జానపదసాహిత్యమే' మూలమని పరిశోధకులు వివరించడం జరిగింది. మన తెలుగు సాహిత్య చరిత్ర, జీవనస్థితులు, విధానాలను, వారి జీవన సరళిని తెలుసుకోవడానికి జానపద సాహిత్యమే మూలాధారం ఇది నాలుగు రకాలుగా వర్గీకరింప బడినది. గద్యాఖ్యానాలు, కవిత్వం, సామెతలు పొడుపు కథలు జానపద సాహిత్యం ప్రధానంగా గేయాలు, గేయకథలుగా వర్గీకరింపవచ్చును.

జానపద సాహిత్యంలో కథ అనునది వచనకథ, గేయ కథ వంటిరూపాలలో పరిఢవిల్లుతుంది. ఈ విధంగా జానపద సాహిత్యం ఎప్పుడు ఎక్కడ ఎలా పుట్టిందో చెప్పడం కష్టం. సంఘజీవి అయిన ప్రాచీన మానవుడు చేసిన జానపద సాహిత్యం దాదాపు అజ్ఞాత కవిగానే ఉన్నాడు. మన సంస్కృతికి చెందిన అంశాలు కాల గర్భంలో కలసి పోకుండా జానపద సాహిత్యం కాపాడుతుంది. సమాజాన్ని శిష్టసాహిత్యం కంటె జానపద సాహిత్యమే ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. జనజీవనంలో ప్రధాన భాగమై ప్రజల లోకజ్ఞానానికి, మనో వికాసానికి, ఉల్లాసానికి తోడ్పడేది జానపద సాహిత్యమే. నిత్య జీవితంలో నుంచి వెలువడిన ఈ దేశికవిత్వం సంప్రదాయ కవిత్వంకన్న ప్రాచీనమైనది. అందుకే అన్నారు. 'జానపద గీతిక జాతి జీవనాళిక' జానపద పాటను కాపాడుకోవాలంటే, జనులను ప్రేమించాలి, మనుషులుగా జీవించాలి. మానవత్వం మల్లెపూవై పరిమళించాలి. పట్టణాలకు తల్లి లాంటివి పల్లెటూళ్లు జాతి చరిత్రకు మూలం జానపదులే.

ఆధార గ్రంధాలు :

1. తెలుగుజానపదగేయగాథలు- డా॥ నాయని కృష్ణకుమారి.
2. జానపదగేయాలు - డా॥ బిరుదురాజు రామరాజు.

❖

"వ్యాపారమృగం" కథల సంపుటి - ప్రపంచీకరణ

– రవిందర్ అచ్చ, పి.జి.టి., తెలుగు ఉపాధ్యాయులు, మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, వెంకటాపూర్ గ్రామం & మండలం, ములుగు (వరంగల్), తెలంగాణ

పరిచయం :

ప్రపంచీకరణలో పెట్టుబడులతో పేదరిక నిర్మూలనం, అభివృద్ధి జరుగుతుందని ఆశించిన వాళ్ళకు నిరాశ ఎదురవుతున్న సందర్భాన్ని, అంతేగాక వ్యాపారం సాగటం, లాభాలు గడించటం ప్రధానంగా మారి వ్యాపార దృష్టితో లాభాలు గడించే కోణంలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను, స్త్రీల, మైనారిటీల వేదనలను, సామాజిక సమస్య, విధ్వంసాలను ''వ్యాపార మృగం'' కథల సంపుటిలో ప్రతీకాత్మకంగా చిత్రించిన వారు రచయిత్రి ''ముదిగంటి సుజాతారెడ్డి'' గారు.

కథ చెప్పటం చాలా నేర్పుతో కూడుకొన్నది. అందునా ప్రపంచాన్నీ, తరతరాలుగా సంతరించుకొన్న మానవ సంబంధాలనూ పటాపంచలు చేస్తున్న రాజకీయార్థి కాంశాల నేపథ్యంలో కళాత్మకంగా, ప్రతీకాత్మకంగా కథగా రూపొందించటం చాలా గొప్ప విషయం. వ్యక్తికీ, సమాజానికీ ఉన్న సంబంధం అలా ఉంచితే, వ్యక్తికీ - వ్యక్తికీ మధ్య ఉండే కనీస మానవ సంబంధాలపై కూడా తన ప్రభావం చూపిస్తున్న ''గ్లోబలైజేషన్'' అంశాన్ని కథల్లో ఇమడ్చి పాఠకుల మెదళ్లకు కదలిక కలిగించడం ఎంతో శాస్త్రీయంగా రాజకీయ - సామాజిక అవగాహన ఉన్న రచయితలకే సాధ్యమవుతుంది.

బహుళ జాతి సంస్థల వ్యూహాల వెనుక ఉన్న రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల గురించి, ఆ వ్యూహాల ఫలితంగా పేద దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక జీవనంలో వచ్చిన, రానున్న ప్రభావాల గురించి ఈ కథలు విశ్లేషిస్తున్నాయి.

ఫ్రీ మార్కెట్ విధానంతో మార్కెట్ల నిండా కుప్పలు తెప్పలుగా కొత్త కొత్త బ్రాండ్స్ కనువిందు చేస్తున్నాయి. సూపర్ బజార్ల స్థానంలో వేల చదరపు అడుగుల బహుళ అంతస్థుల ''మాల్స్'' వస్తున్నాయి. అయితే అక్కడి వస్తువులేవీ సామాన్యుడికి అందుబాటులో ఉండడం లేదు. ఇలాంటి మార్కెట్ విధానం వలన సామాన్య ప్రజల జీవితాలలో అల్లకల్లోలం సృష్టించబడుతోంది. వాటిని చూస్తూ ఊరికే ఉండలేక, అందుకోగలిగే స్థోమన లేక మనసు చంపుకుని బ్రతకలేక సులభ వాయిదా పద్ధతులకు ఆకర్షితులై అప్పుల ఊబిలో చిక్కుకుని చివరకు దానినుండి బయటపడే మార్గం కనిపించక తమ బతుకుల్లో చిచ్చు పెట్టుకుంటున్న వైనాన్ని తెలిపే కథలు పాఠకుల మనసులను కదలించడమే కాక ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. ఇలాంటి మార్కెట్ విధానం మాకెందుకని పాఠకులు తమకు తాము ప్రశ్నించుకునే అవకాశాన్ని రచయిత్రి కథల రూపంలో కలిగించారు. ఆర్థిక సంస్కరణల అమలు వల్ల అనేక దుష్పలితాలు సంభవిస్తున్నాయి. ప్రైవేటీకరణ విధానంతో ప్రభుత్వం క్రమంగా పలు రంగాల నుండి తప్పుకుంటున్నది. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్యరంగాల్ని దాదాపుగా ప్రైవేటీకరించారు. కాలక్రమంలో అమెరికా ఆధిపత్యం బాగా పెరిగిపోయింది. ప్రతిదాన్ని అమ్మటం, కొనటం, కిరాయికి ఇవ్వటం, సహజ వనరులన్నిటినీ లాభాలుగా మలచుకోవటంలో పేటెంట్ హక్కులన్నీ మావేనంటోన్న అమెరికా గుట్టలు, నదులు, బొగ్గు, అదీ ఇదీ అని ఏమటి ప్రకృతినంతటినీ ప్రపంచ బ్యాంకు వ్యూహం ముందు తాకట్టు పెట్టిన వైనాన్ని కథల్లో చిత్రించారు.

ప్రమాదకర పరిస్థితి నుండి భారతదేశం బయటపడి, ఆర్థిక సంస్కరణలమీద పట్టు, మార్కెట్ శక్తుల మీద

అదుపు సాధించకపోతే భారత ప్రజలు దీర్ఘకాల నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్న ఆందోళనను రచయిత్రి తమ కథల్లో జొప్పించి దేశంపట్ల తమ బాధ్యతనూ, భక్తినీ ప్రదర్శించారు. పాఠకులలో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. అమానవీయ విలువల విజృంభణల వివిధ పార్శ్వాలు ఈ కథల్లో దర్శింపచేసి భారత ప్రజానీకాన్ని మేలుకొల్పే ప్రయత్నం చేశారు.

ఈ కథల సంపుటి నుండి పది కథలను ఈ పత్ర రచనకు తీసుకుని విశ్లేషించారు. ఈ కథల్లో కొన్ని కథలు వార మరియు వివిధ పత్రికలలో, వివిధ సందర్భాలలో ప్రచురించడం కూడా జరిగిందన్న విషయం గమనార్హం.

1. వ్యాపార మృగం :

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18 జనవరి 2003)

ఇతివృత్తం :

కల్లు, సారా, విస్కీ, రమ్ము, గుడుంబా, గుట్కా, పాను మొదలైన మాదక ద్రవ్యాలను అమ్ముకొనే వ్యాపారస్తులు తమ వ్యాపారానికి అడ్డు వస్తోందని పులి మాధవి అనే యువతిని హత్య చేయిస్తారు. పులి మాధవి సమాజంలో మాదక ద్రవ్యాల గురించి చైతన్యం తీసుకురావడానికి గజ్జె కట్టి ఆడుతూ, పాడుతూ ఊరంతా తిరుగుతుంది. ఆ మత్తులో మునిగి తేలిన తన భర్త చనిపోయినట్లు ఇంకెవరూ చనిపోకూడదనుకుంటుంది. చివరికి ఆమె వ్యాపార మృగాలకు బలి అవుతుంది. హంతకులు ఆమెను హత్య చేసి ఆమె శరీరాన్ని ఖండ ఖండాలుగా చేసి అనేక ప్రదేశాల్లో పారవేస్తారు.

విశ్లేషణ :

వ్యాపార దృష్టిలో లాభాలను గడించే దిశలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులు, నశిస్తున్న మానవ విలువలు ఈ కథలో ఒళ్ళు జలదరించే రీతిలో చిత్రించ బడింది. అక్కడక్కడా మిగిలి ఉన్న కాస్త మంచితనం కూడా ప్రపంచీకరణ మత్తులో ఇలా బూడిద చేయబడు తోంది. మనిషి తద్వారా సమాజం తద్వారా ఊరు తద్వారా దేశం బాగుపడాలంటే ప్రతివ్యక్తిలోనూ మార్పు రావాలి. ప్రతి వ్యక్తి ముందు మనిషిగా ఆలోచించాలి కానీ మృగంలా కాదు అన్న సందేశాన్ని చాటుతున్న కథ వ్యాపార మృగం. స్వార్థసహిత మనస్థితి నుండి విడిపడి మనిషి మనిషిగా ఆలోచించిన నాడు సమాజానికి నిజంగా మేలు జరుగుతుంది. ఆరోగ్యకరమైన సమాజం నెలకొన్న నాడు మనిషి చాలా ఉన్నతస్థాయిని అధిరోహించగలుగుతాడు. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఇది చాలా అవసరం.

2. న్యూ ఆనంద్ హోటల్ :

ఇతివృత్తం :

నగరంలో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ల పేర్లతో రోడ్డుకు ఇరుపక్కల ఉన్న వ్యాపార షాపులను కూలగొట్టి, అందుకు ప్రభుత్వం కొంత నష్టపరిహారం చెల్లించి షాపులు మళ్లీ కట్టుకోవడానికి లోన్లు ఇచ్చి సహకరిస్తుంది. అధునాతన షాపులు కట్టి కొత్త కొత్త యంత్రాలను ప్రవేశపెట్టి లాభాలు గడించాలన్న కోరిక తీరుతుందని వ్యాపారులు సంతోషిస్తారు. కానీ షాపులలో, హోటళ్లలో పనిచేసేవారికి పనులు లేకపోవడంతో ఆ పేద కుటుంబాలు మొత్తం ఆదాయం లేక రోడ్డున పడతారు.

విశ్లేషణ :

పేదలు మరింత పేదలుగా ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్న ఈ ప్రపంచీకరణ యుగానికి ఈ కథ ఒక ఉదాహరణ. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ ధనవంతులకే లాభసాటిగా మారుతున్నాయి. పేదలకు ఎటువంటి సంస్కరణలు జరగటం లేదు. ప్రగతిపథంలో ఎంతో ముందుకు సాగుతున్న భారతదేశంలో పేదరికం కూడా అంతే ఎక్కువగా పెరుగుతూనే ఉందన్న ఆవేదన ఈ కథ వ్యక్తపరిచింది.

3. ఎక్కలేని మెట్లు :

ఇతివృత్తం :

కాలేజీలో చదువుకుంటున్న జగదీష్ తన పేదరికానికి విరక్తి చెంది, ఒక డబ్బున అమ్మాయిపై మనసుపడి ఆమె తనకు దక్కకపోయేసరికి ఆత్మహత్య చేసుకుంటాడు. ధనవంతులను చూసి అతడు ఎన్నో కలలను కంటాడు.

ఎక్కలేని మెట్లను ఎక్కుతున్నట్లుగా ఊహిస్తూ మరణిస్తాడు.

విశ్లేషణ :

ఈ కథలో పేదరికంలో బ్రతుకు ఈడ్చే పేదల మానసిక స్థితి తెలియచేయడమైనది. తారతమ్యాలు మనిషి జీవితంలో ఏ విధంగా ఆడుకుంటాయో వివరించ బడింది. ప్రపంచీకరణ ముసుగులో చెలరేగుతున్న ఈ విధ్వంసకాండలో ఎందరో అమాయకులు బలి అవు తున్నారు. జగదీష్ ధనవంతుల విలాసవంతమైన జీవితా లకు ఆకర్షించబడి దాన్ని అందుకోలేక, తీరని ఆశలతో జీవితంలో రాజీపడలేక చివరకు తన జీవితాన్ని తానే అంతం చేసుకోవడం వెనక ఎందరో పేదల ఆర్తనాదాలు, ఆక్రందనలు వినిపించేలా చిత్రించబడిన ఈ కథ పాఠ కుల హృదయాలను నిద్రలేపి ఆలోచింపచేసేదిలా ఉంది. అభివృద్ధి నలువైపులా సాగుతోందంటున్న ఈ అందమైన భారతదేశంలో పేదవాడికి జీవించే హక్కే లేదా? అన్న ప్రశ్న ప్రతి ఒక్క పాఠకుని మెదళ్లకు పదును పెడుతుంది.

4. ముంజలు :

(రచన, మార్చి 200)

ఇతివృత్తం :

బాల్యంలోని జ్ఞాపకాలు, జన్మభూమి మీద మమకారం మెండుగా ఉన్న రవీందర్ కాలిఫోర్నియాలో స్థిరపడిన భారతీయుడు. వేసవికాలంలో సేదతీర్చే ముంజలు అంటే అతడికి చాలా ఇష్టం. కంప్యూటర్ ముందు కూచుని ముంజల్.కామ్ అనే పేరు చూడగానే చిన్నతనంలో తిన్న ముంజల మధుర రుచిని, ఆనాటి మధుర స్మృతులను, తీయటి అనుభూతులను నెమరవేసుకుంటాడు. మాతృభూమిపై అతనికి ఎంతో ప్రేమాభిమానాలున్న ప్పటికీ నేటి జీవనశైలి అతన్ని కాలిఫోర్నియాలో స్థిరపడేలా చేస్తుంది.

విశ్లేషణ :

ముంజలు కథలో దాగిన మధురస్మృతుల లోతుల్లో తొంగి చూస్తే ఎన్నో నిగూఢ రహస్యాలు బయట పడతాయి. దేశంలో ప్రవేశించిన ప్రపంచీకరణ వల్ల రేపటి భావితరాలకు మనం ఏ విధమయిన స్మృతులను మిగుల్చుతామన్న ప్రశ్న ప్రతి భారతీయుడు తప్పనిసరిగా వేసుకోవలసిన అవసరం నెలకొన్న పరిస్థితులలో నేడు భారతదేశం ఉంది. నిన్నటి తరం కష్టనష్టాలకు ఓర్చి నేటి తరానికి బహూకరించిన స్వాతంత్ర్యం నేటి తరం ఆలో చనా రహితంగా సర్వనాశం చేసుకుని, దేశం మొత్తాన్ని ప్రపంచీకరణ ముసుగు తొడిగి తమ వశం చేసుకునే ప్రయత్నంలో ఉన్న విదేశీయుల మయం చేస్తోంది. ఇటువంటి సందర్భంలో రేపటి తరానికి నేటితరం మన సంస్కృతి, సంస్కారాలు, తీయటి అనుభూతులు మిగల్చ గలదా? అన్నది ప్రశ్నార్థకంగా మిగలకూడదంటే ప్రతి భారతీయుడు ఆలోచించి ముందడుగు వేయవలసిన అవసరాన్ని ఈ కథ చిత్రించింది.

5. సంస్కారబంధం :

(తెలుగుపలుకు - తానా రజతోత్సవ సంచిక, జులై 3-5, 2003లో ప్రచురితం)

ఇతివృత్తం :

యూ.యస్.లో స్థిరపడిన సురేందర్ జానకిలకు ఒక కూతురు, కొడుకు, యూ.యస్.లోనే పుట్టి పెరిగిన వారి పిల్లలు అక్కడి సంస్కృతినే పునికి పుచ్చుకుంటారు. సురేందర్ జానకిల పెళ్లి సిల్వర్‌జూబ్లీ ఫంక్షన్ వారి పిల్లలకు ఓ కొత్త కోణాన్ని పరిచయం చేస్తుంది. ఇష్టపడిన జంట కొద్దికాలంపాటు కలిసి జీవించడం ఇష్టంలేనిరోజు విడి పోవడమే తెలిసిన వాళ్ళకి ఇంతకాలం కలిసే ఉన్న సురేందర్ జానకీలను చూసి ఎలా ఇది సాధ్యం అని పిస్తుంది. భారత సంస్కృతిని కాపాడుతున్న వివాహ బంధాన్ని గుర్తించిన వారి కూతురు దానికి ఆకర్షితురాలై తనకూ అటువంటి జీవితమే కావాలని కోరుకుంటుంది.

విశ్లేషణ :

యూ.యస్.లో పుట్టి పెరిగిన అమ్మాయి, భారత వివాహ సంస్కృతిని గుర్తించడమే కాక తానూ అటువంటి

బంధాన్ని పొందాలని నిర్ణయం చేయడం ముదావహం. సురేందర్ - జానకిల ఆదర్శ దాంపత్యానికి రుజువు. భారత సంస్కృతికి భార్యాభర్తల అనుబంధం ఆయువుపట్టు వంటిది. దాన్ని విదేశీయులు గుర్తిస్తున్న సందర్భంలో భారతీయులు మాత్రం చేజార్చుకుంటున్నారు. విదేశీ సంస్కృతికి ఆకర్షితులవుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను వీడుతున్నారు. యువతలో ఈ విషయమై అవగాహన కలిగించే ప్రయత్నం ఈ కథలో కనిపిస్తుంది.

6. కొసరి కొసరి బేరాలు :

(విపుల, సెప్టెంబర్ 2005)

ఇతివృత్తం :

కోటి రూపాయల కట్నం ఇచ్చి వివాహం చేసే దొరల పనిమనుషులతో మాత్రం నవల దగ్గర బేరాలాడతారు. పది, పన్నెండు రూపాయలకే పనివాళ్ళతో ఒకరితో పిండిని కొట్టించుకుని, అన్ని పనులు చేయించుకుని వాళ్ల శ్రమని దోచుకుని పేదవాళ్ల పొట్టకొడతారు.

విశ్లేషణ :

సమాజంలో ఆర్థిక అసమానతలు, దోపిడీలు పెరిగిపోతున్న వైనం ఈ కథ చిత్రించింది. ప్రపంచీకరణ ముసుగులో సాగుతున్న అభివృద్ధి పేదలపై ఏనాటికైనా కనికరం చూపుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే మిగులుతున్నది.

7. నిశ్శబ్ద విప్లవం :

(అటా వారి 'అమెరికా భారతి' పత్రిక, జనవరి - ఫిబ్రవరి 2003; 'మన తెలంగాణ' ఏప్రిల్ - జూన్ బులెటిన్ - 2, 2005)

ఇతివృత్తం :

ఊర్లో ఒకప్పుడు అధికారం చెలాయించిన దొరలు తక్కువ కులస్థులను చులకనగా చూస్తూ, వాళ్ళతో వెట్టిచాకిరీ చేయించుకునేవారు. పరిస్థితులు తారుమారు కావడంతో అధికార పెత్తనం చలాయించిన దొరలు కూటికి గతిలేక పనులు దొరక్క బతకడానికి కూలి పనులు చేయవలసి వస్తుంది. సమాజంలో కుల వ్యవస్థ, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటాయి.

విశ్లేషణ :

ప్రపంచీకరణ ఆగమనం సమాజంలో కుల వ్యవస్థ, ఆర్థిక పరిస్థితులపై చూపుతున్న తీవ్ర ప్రభావం ఈ కథలో చిత్రించబడింది. శిఖరాలను అందుకోబోతున్నామనుకుంటే పాతాళంలోకి కూరిపోతున్నామన్న సత్యాన్ని ఈ కథ ఆవిష్కరించింది.

8. మారిన బంధాలు :

(తెలంగాణ సోయి, జనవరి - మార్చి 2003)

ఇతివృత్తం :

సమాజంలో కులవృత్తుల్లో మార్పులు సంభవిస్తాయి. పరిస్థితుల ప్రభావం వల్ల గొప్ప వర్గం వారు కూడా జీవనాధారం కోసం కులం పక్కన పెట్టి అన్ని రకాల పనులు చేయవలసి వస్తుంది. మిరపకాయలు కొట్టడం, వడ్డపని, మంగలి పని చేయనారంభిస్తారు. బతుకుదెరువు కోసం తమ తమ కుల వృత్తులను వదిలి దొరికిన పని చేసుకుంటూ కాలం వెలిబుచ్చడం కొంతమందిని మానసికంగా కృంగదీస్తుంది.

విశ్లేషణ :

ప్రపంచీకరణ యుగం ప్రారంభంలో కులవృత్తులు ఎలా కనుమరుగవుతూ వస్తున్నాయో చర్చించిన కథ 'మారిన బంధాలు'. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు సమాజంపై ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపుతుందో విశ్లేషించింది. సమాజం తన స్వరూప స్వభావాల్ని మార్చుకుని కేవలం బ్రతకటం కోసమే ఎదురవుతున్న తప్పని పరిస్థితులకు అనుగుణంగా రాజీపడుతూ జీవితాన్ని ఏదో విధంగా వెలిబుచ్చుతోంది. ఇది ఇలానే సాగితే ఏదో ఒక రోజు భారత ప్రజలు పూర్తిగా బానసిలుగా మారే ప్రమాదకర దృశ్యాన్ని ఈ కథ పాఠకుని ముందుంచింది.

9. వ్యాపారవియ్యం :

(ఆదివారం ఆంధ్రప్రభ, 16 జనవరి 2005)

ఇతివృత్తం :

సుదర్వన్ - బ్రహ్మాజీలు ఇద్దరూ రియల్ ఎస్టేట్

వ్యాపారులు. ఒకరంటే ఒకరికి గిట్టని విరోధులు. వ్యాపారంలో గోట్లు గడించిన వారిరువురికీ పెద్ద కష్టం వచ్చిపడుతుంది. వేర్నాడు అనే కొత్త పార్టీ, కొత్త రాష్ట్రం కావాలనే ఉద్యమాలను ప్రారంభిస్తుంది. దీని కారణంగా రియల్ఎస్టేట్ వ్యాపారం పడిపోతుంది. అలాంటి సమయంలో శత్రువులైన సుదర్వన్ - బ్రహ్మాజీలు అన్నీ మరచి ఇంకా ఏర్పడని కొత్త రాష్ట్రానికి రాజధాని సృష్టించి రైతుల నుండి అధిక భూములను అతి తక్కువ ధరకు సేకరించి అధిక లాభాలను గడించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కొత్త అర్థం చెప్పి మళ్ళీ తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటారు.

విశ్లేషణ :

భూములన్ని కబ్జా చేసి అమ్మిన వాటినే మళ్లీ మళ్లీ అమ్ముతూ కొన్నవారి కడుపుకొట్టి సొమ్ము చేసుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్థుల అరాచకాలను వ్యాపార వియ్యం కథ తెలియచేసే ప్రయత్నం చేసింది.

10. ఇంకా పొద్దు పొడవలేదు :

ఇతివృత్తం :

శీల తన భర్తతో పడిన కష్టాలను, అతని సూటిపోటి మాటలను భరించింది. అతని తీరు రోజురోజుకు ఎక్కువైన కొద్దీ విడాకులు ఇవ్వడానికి సిద్ధపడింది. తన జీవితానికి ఒక మంచి మార్గం వెతుక్కుంది. ఇంకో పెళ్లి చేసుకోవాలని నిశ్చయించింది. దీన్ని ఆమె తండ్రి హర్షించడు. ప్రపంచం ఎంత ముందున్నా తనకు జరుగుతున్న అన్యాయానికి తనకు తానుగా తీసుకున్న పరిష్కారాన్ని కూడా హర్షించలేని తన తండ్రి ప్రవర్తన శీలకు బాధ కలిగిస్తుంది.

విశ్లేషణ :

ప్రపంచీకరణలో దినాదినాభివృద్ధి చెందుతున్న దేశంలో స్త్రీ మొత్తం ఇంకా అభివృద్ధి నోచుకోలేదన్న అర్థంలో చిత్రించిన కథ 'ఇంకా పొద్దు పొడవలేదు'. మగ వాళ్ళు స్త్రీ రెండో పెళ్ళిని హర్షించలేని సంప్రదాయతత్వం, ప్రపంచం ఏ తీరున మారినా కనిపించని స్త్రీ అభివృద్ధిని ఈ కథలో చిత్రించారు. బాల్యంలో తండ్రి నీడలో, వయసులో భర్త నీడలో, ముసలితనంలో కొడుకు నీడలో స్త్రీ జీవించాలన్న మనువు శాసనం అనాదిగా చెలామణి అవుతూ, స్త్రీలు సైతం ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నప్పటికీ ఇంకా మనువు మాటలకే జేజేలు కొడుతున్న నేటి స్వార్థపూరిత మగ ప్రపంచాన్ని జయించడం ఎలా అన్న ప్రశ్న ఈ కథ చదువుతున్న ప్రతి ఒక్కరి మనసులో ప్రతిఫలిస్తుంది.

ముగింపు :

మానవ సంబంధాలన్నీ మార్కెట్ సంబంధాలుగా రూపాంతరం చెందుతున్నాయి. దేశమంటే మట్టి అని ఆరాధించిన మొన్నటి తెలుగు సమాజాన్ని, దేశమంటే మట్టి కాదు మనిషి అనీ, దేశాన్ని ప్రేమించి ప్రగతిన పెంచమనీ ప్రబోధించిన నిన్నటి సాహిత్యాన్ని ప్రక్కకు నెట్టుతూ దేశమంటే మట్టికాదు, మనిషీ కాదు దేశమంటే మార్కెట్ అంటూ సకల మానవ సంబంధాలను, సమస్త మానవ విలువలనూ శాసిస్తూ, మన జీవిత విధానాలను ప్రభావితం చేస్తూ, సంపన్న దేశాలు తమ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలకు దిశను నిర్దేశిస్తూ, విష సంస్కృతి పేద దేశాలపై విరుచుకుపడడానికి మార్గాన్ని సుగమం చేసిన ప్రపంచీకరణపై స్పందించిన ఈ కథలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేస్తాయి అనడంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. 'వ్యాపార మృగం' కథల సంపుటి - ముదిగంటి సుజాతరెడ్డి.
2. తెలుగులో కథా సాహిత్యం - సి. విజయలక్ష్మి

3. తెలుగు కథ నిర్మాణం - బి. విజయకుమార్
4. వ్యాపార మృగం - ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18 జనవరి 2003.
5. కొసరి కొసరి బేరాలు - విపుల, సెప్టెంబర్ 2005.
6. మారిన సంబంధాలు - తెలంగాణ సోయి, మార్చి 2003.
7. సంస్కారబంధం - తెలుగు పలుకులు తానా రజతోత్సవ సంచిక, జులై 2003.

❖ ❖ ❖

ఆధునిక తెలుగు కథ – ప్రపంచీకరణ

– డా॥. రొంపాళెం పురంధీశ్వరి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల, తి.తి.దే., తిరుపతి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ ప్రభావం ఎక్కువగానే వుందని చెప్పడానికి తెలుగు కథ కూడా ఒక నిదర్శనం. ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో వచ్చిన వచన సాహిత్య ప్రక్రియల్లో వచ్చిన వచన సాహిత్య ప్రక్రియల్లో కథానిక విలక్షణమైంది. నిర్దిష్ట స్వరూప స్వభావాలతో కూడిన కథానిక ప్రపంచంలో అన్ని భాషల్లో లాగానే తెలుగులో కూడా జానపద సంబంధ కథాకథన సంప్రదాయం నుంచి అనేక వేల సంవత్సరాలుగా తరతరాలుగా కొనసాగుతుంది. దీనిని ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా గుర్తించి ప్రపంచంలో మొదటిసారి లక్షణ నిర్దేశం చేసిన ప్రతిష్ట అగ్ని పురాణానికే దక్కుతుంది.

భయానకం సుఖతరం గర్భేచ కరుణోరసః
అద్భుతో స్తేసు క్లుప్తార్థ నోదాత్తా సా కథానికా

కథానిక, చిన్నకథ అనే మాటలు కూడా వ్యవహారంలో వున్నాయి. కథానిక అన్న మాటను మొట్టమొదటిసారి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ప్రయోగించారు. ఈ మాటను ఇపుడు ఎక్కువ మంది వాడుతున్నారు. ఇంగ్లీషులో (Short Stories) అనే మాటకు సమానార్థకంగా వున్న తెలుగు కథానికలో నేడు మనం గుర్తిస్తున్న ఆధునిక లక్షణాలు ఈ దశ ప్రభావం వల్లనే ఏర్పడ్డాయి. కథ్ అనే ధాతువుకు ''సంభాషించు'', ''చెప్పుట'' అనే అర్థాలు వున్నాయి.

ఆంగ్ల విమర్శకులలో గొప్ప వారిలో ఒకడుగా పరిగణింపబడిన పోప్ నెతేనియల్ హాతార్న్ రచించిన కథల్ని విమర్శిస్తూ 1842 వ సంవత్సరం ఒక వ్యాసాన్ని రచించాడు. కథా రచనను ఖండిస్తూ రచించిన ఆ పోపుగారి వ్యాసమే లోకానికంతా కథా రచన (చిన్న కథల్ని రచించడం) అనే ఒక సారస్వతశాఖ నూతనంగా బయలు దేరినట్లు తెలియచేసింది.

ఆధునిక కథానిక జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, రష్యా మొదలైన పాశ్చాత్య దేశాలలో ఇంచుమించు ఒకేసారి పుట్టిందని చెప్పవచ్చు. అమెరికా కథానిక రచయితల్లో ప్రప్రథముడు అన్పించుచున్న వాషింగ్టన్ ఇర్వింగ్ (1819) కూడా ఈ ప్రక్రియను యాదృచ్ఛికంగా చేపట్టాడు. ఒక చిత్త ప్రవృత్తి భావోద్రేకాన్ని తీసుకుని దానికి తగ్గ వాతావరణం కల్పించి రచన సాగించడం ప్రారంభించాడు.

కథానిక ఆధునిక కథాత్మక వచన సాహిత్యంలో అంతర్భాగమే ''ఫెడరిక్ బి పెర్కిన్స్ (డెవిల్ పజిలర్స్) 1877 సంపుటికి రాసిన పీఠికలో వజ్రానికీ కొండకూ వుండే అంతరం నవలకు కథకు వుంటుంది అంటాడు. ఇలా ప్రపంచీకరణ ప్రభావంతో ఎంతో ప్రాచీనమైన కథానిక ఆంధ్రప్రదేశంలో ఈ శతాబ్దిలోనే పాశ్చాత్య ప్రభావంతో కాలూనింది.

ప్రాచీనకాలంలో అగ్నిపురాణంలోను, ఆర్వాచీన కాలంలో పాశ్చాత్య విమర్శ గ్రంథాలలోనూ వచ్చిన కథానిక లక్షణాలలో సమన్వయం చేసుకొని కథానికలో ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, పరిమితపాత్రలు, ఆ పాత్రలకు చక్కని పోషణ, వస్తు వైశిష్ట్యం, ఒక జీవిత సత్యాన్ని ప్రతిపాదించుట. అన్నింటికి మించి వస్త్వైక్యముండి వినోదమో, విజ్ఞానమో వికాసమో కలిగించగల చిన్నకథే కథానిక. తెలుగులో మొట్టమొదటి కథానిక ఏదన్న విషయంలో ఎన్నో అభిప్రాయాలున్నా గురజాడ అప్పారావుగారే ఈ ప్రక్రియకు ఆద్యులని చెప్పక తప్పదు. వీరి 'దిద్దుబాటు' తొలి కథ 1910 'ఆంధ్రభారతి' అనే పత్రికలో ఇది అచ్చయింది.

గురజాడగారు మొదట దీనిని గ్రాంధికంలో రాసిన తర్వాత వ్యావహారికంలో వస్తురూప భాషా రూపాల్లో కొత్తదనాన్ని ప్రదర్శించింది. అర్ధాంగిని మరచిపోయి చెడు

తిరుగుళ్ళు తిరిగిన భర్తకు సున్నితంగా బుద్ధి చెప్పిన ఓ ఇల్లాకి కథ దిద్దుబాటు అద్భుతమైన కొసమెరుపుతో ముగుస్తుంది. గురజాడ అయిదారు కథల కన్నా ఎక్కువ రాయక పోయినా 'మనుషులు చేసిన దేవుళ్ళారా, దేవుడు చేసిన మనుషుల్లారా, మీ పేరేమిటి, సంస్కర్త హృదయం మెటిల్డా మొదలైనవి 'దిద్దుబాటు' కన్నా ప్రయోజన మంతయూ, శిల్పసంపన్నమూ అయిన కథలు రాశారు. పెద్ద మసీదు కథ అసంపూర్ణం. మత మౌఢ్యాన్ని వివరించే కథ.

అస్తిత్వాన్ని ప్రశించే మత సహనాన్ని బోధించేకథ కథ. మీ పేరేమిటి, మతం కన్న ప్రేమ మిన్న అని నేటి సామాజిక వ్యవస్థకి అన్వయించే కథ ఇది. ముసలి భర్తతో జీవించే ధీనురాలి అందమైన భార్య కథ మెటిల్డా. నీతులు చెప్పటం తప్ప ఆచరణలో చూపించని వారిని గురించి రాసిన కథ "సంస్కర్త హృదయం". ఈ రోజుల్లోనే తల్లా వఝుల శివశంకరశాస్త్రి 'సువర్ణరేఖ కథలూ, మదరాసు కథలూ వెలువడ్డాయి. మాడపాటి హనుమంతరావు కథలు' మల్లికాగుచ్ఛం అనే కథల సంపుటిని వెలువరిం చారు. హృదయ శల్యం. ముసలిదాని ఉసురు అగ్ని గుండం మొ॥ పెన్నండు కథలు రాసారు.

తెలుగు కథకూ జవజీవాలనూ ప్రామాణికతనూ కూర్చిన కథకుల్లో విశిష్టులు, అగ్రగణ్యులు శ్రీపాద సుబ్ర హ్మణ్యశాస్త్రి (1891) వీరు ఆనాటి బ్రాహ్మణ కుటుంబా ల్లోని ఛాందసాలనూ, మౌఢ్యాన్నీ తన కథల్లో చిత్రించాడు. అనితర సాధ్యమైన తెలుగుతనం వారి సొత్తు వడ్లగింజలు, రచపీనుగు తోడు లేకుండా వెళ్ళడు, గులాబీ అత్తరు, కలుపు మొక్కలు, కిందమంటలు, మార్గదర్శి గొప్పకథలు తనదైన శైలిలో వాడుకభాషలో తెలుగువారి జీవితాల్ని వస్తువులుగా రాసిన కథక చక్రవర్తి శ్రీపాద. కలుపు మొక్కలు కథలో వస్తువు బాధ్యత కలవాళ్ళే అవినీతిపరులై లంచగొండులై సంఘానికి కలుపు మొక్కలు అయ్యారని ఆవేదన చెందారు. వేలూరి శివరామశాస్త్రి గారు రెండవ ప్రపంచ యుద్ధానంతరము ఏర్పడిన ఆర్థికమాంద్య కాలంలో ఓ నిరుద్యోగి సంసారాన్ని వస్తువుగా స్వీకరించి "డిప్రెషన్ చెంబు" అనే గొప్ప కథ రాసారు.

ఆంధ్రదేశంలో 1930 నాటికే చలం సంచలనం సృష్టిం చాడు. స్త్రీ స్వేచ్ఛనీ, స్త్రీ పట్ల సమాజ దుర్మార్గాన్నీ ఆయన అనితర సాధ్యమైన శైలిలో కొన్ని వందల కథలు రాశారు. ఓ పువ్వు పూసింది, కర్మమిట్లా కాలింది, పాపం కళ్యాణి, ఆ రాత్రి, ఆత్మార్పణ, కన్నీటి కాలువ వీరి ముఖ్య కథలు. ఈ కథలే చలాన్ని గొప్ప కథకుడిగా నిరూపిస్తాయి. మన సమాజంలో నీతి పేరుతో పాతివ్రత్యం - దాంపత్యధర్మం ముసుగుల్లోని అణచివేతనూ, ఆత్మవంచననూ, స్త్రీ పురుష సంబంధాల మూలాల్లోకి వెళ్ళి అడ్డగోడల్ని ఛేదించే ప్రయత్నం చేసాడు. కథల్లో కవిత్వాన్ని ప్రవేశపెట్టి "ఓ పువ్వు పూసింది" అనే గొప్ప కథను చలం మాత్రమే రాయగలిగాడు. స్త్రీ జీవితాన్ని పువ్వు మీద ఆరోపించి చలం చేసిన కల్పన ప్రపంచసాహిత్యంలోనే అరుదైన ప్రయోగం.

కవి, విమర్శకుడు, నవలారచయితగా పేరు పొందిన విశ్వనాథసత్యనారాయణ గారు శిష్టవ్యావహారిక తుల్యమైన గ్రాంథిక భాషలో మాక్లీదుర్గంలో కుక్క, ఏమి సంబంధం కథలు వీరిని కథకుడిగా నిలిపాయి. ప్రజాస్వామ్యం బిచ్చ గాళ్ల రాజ్యంగానూ, అధికారులు, సన్యాసులూ, మత గురువులూ, రాజకీయవేత్తలూ బిచ్చగాళ్లలా ఇతరుల మీద ఆధారపడి జీవిస్తున్నారని ముగ్గురు బిచ్చగాళ్లల్లో వివరిం చారు.

తెలుగు కథల్లో సిద్ధహస్తుడైన అడవిబాపిరాజు అద్భుత సన్నివేశాలతో భోగీరలోయ, హిమాలయరశ్మి, తిరుపతి కొండమెట్లు, నాగలి వంటి పెద్ద కథలు కొన్ని దళిత కథలు, అభ్యుదయ కథలు, రాసిన వీరు సమ కాలీన జీవిత వాస్తవాలను కూడా చిత్రించారు. వీరి వలననే తెలుగు కథకు అభ్యుదయం చేకూరింది. నిజాం నిరంకుశపాలనలో తెలంగాణా ప్రజల కడగండ్ల జీవితాన్ని చిత్రిస్తూ సురప్రతాపరెడ్డిగారు నిరీక్షణ, చంద్రయ్య భీమా ఒట్టు వంటి కథలు రాసారు. మల్లాది రామకృష్ణమశాస్త్రి

గారు మల్లెపూవు, మంచిగంధం, అల్లోనేరేడు మణి దీపాలు, సర్వంగళ వంటి కథలను తెలుగుదనం విడు వని శైలితో రచించారు. ఖామోష్ అనే కథను వారు ఇలా ప్రారంభించాడు. 'సిక్కని సిగురుల్లో పొద్దు వాటారింది. సీతల తోపుల్లో సీకటి పొడిచింది. పికిలిపిట్ట వల్లకుంది. సిలకరెక్క ముడుచుకుంది. గువ్వ గూడెక్కింది. గుట్టు గుడిసెలో దివ్వె వెలిగింది. ఏడకే ఏడకే సినదాన' సేతిగాజులు సిటిలె, సెంపకందిపోయే - మొగాన దూమెరుగులేదు - సూపుల్లో సింగారం లేదు ఎవరే బిడ్డా నీవు!...

కాంతం పేరు వినని సాహిత్యాభిమానులు వుండరు. మామూలుగా జన్మనిచ్చినవాడు తండ్రి అవుతాడు. కానీ కాంతానికి జన్మనిచ్చిన వ్యక్తి మాత్రం ఒక భర్త. కేవలం మధ్యతరగతి భర్త. వ భర్త పేరు మునిమాణిక్యం నర సింహారావు మధ్యతరగతి జీవితాల్లోని అనుభవాలను హాస్యాలుగా దాంపత్య జీవితంలోని అందచందాలను చక్కగా వివరించిన వీరు "నేను రాసిన మొదటి కథ టీ కప్పులో తుఫాను. ఒక శృంగార కలాపము. కతా వస్తువులో కాంత కనబడుతుంది. కాంతం లేకపోతే కథే లేదు అని మునిమాణిక్యంగారే అనడంలో వాస్తవ జీవితం, అవ గాహన, హాస్యదృష్టి ఇద్దరికి మాతాతృకను జీవితమే సమ కూర్చింది. జీవితం ఆనందంగా వుండాలంటే కాస్త ఓర్పు, నేర్పు, సహనం వుండాలని కాంతం మనకు సందేశ మిస్తుంది. నేనూ - మాకాంతం, కాంతం కథలు అనే కథా సంపుటాలు వెలువడ్డాయి.

కరుణకుమారి కథను తప్ప మరో ప్రక్రియను స్పృశిం చని మొదటి కథకుడు కులవర్గ సంబంధాలు, పీడన వీరి కథావస్తువులు. సమాజాన్ని పరిశీలించి అత్యంత సహజంగా కయ-కాలువ, బిళ్లల మొలత్రాడు, రిక్షావాలా, టార్చిలైటు వంటి కథలు రాసారు. పురిపండా అప్పల స్వామి, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి కథకులున్నారు.

సూరి, సీతి, వటీరావు వంటి మరపురాని పాత్రలను సృష్టించిన చింతాదీక్షితులు ఎన్నో కథలు రాసారు. భార్యాభర్తల ప్రణయ కలహాలను సరసంగా చిత్రించిన నోరి నరసింహశాస్త్రి, కాంతం కథలతో మనస్సులను ఎప్పటికీ గిలిగింతలు పెట్టే మునిమాణిక్యం నరసింహా రావు, కథల బొమ్మలు కట్టిన అడవిబాపిరాజు, స్త్రీల సమస్యలను ధైర్యంగా చాటిన గుడిపాటి వెంకటాచలం, చతన్యప్రవంతి పద్ధతిలో మనిషి మానసిక సంఘర్షణకు చిత్రించిన బుచ్చిబాబు, కథానికకు తాత్విక దృక్కోణాన్ని ప్రసాదించిన గోపీచంద్, మధ్యతరగతి జీవితాల్లోని వైరుధ్యాలను మార్క్సిస్టు దృక్పథంలో విశ్లేషించిన కొడవటి గంటి కుటుంబరావు, రాయలసీమ ప్రాంతంలోని బడుగు జీవితాలను కడగండ్లను చిత్రించిన కె.సభా, కరుణకుమార అదేప్రాంతంలో మధ్యతరగతి జీవితాల్లోని వ్యక్తి విలువ లను, ఉపాధ్యాయులు చింతను ప్రతిబింబించిన మధు రాంతకం రాజారాం, గాలివాన కథలో తెలుగు అంతర్జా తీయ ఖ్యాతిని తెచ్చిన పాలగుమ్మి పద్మరాజు మొదలైన వారు తెలుగు కథానికా ప్రక్రియను సుసంపన్నం చేసారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి తన కథలో ఆర్థిక పీడనను సామాజిక స్పృహతో, భావావేశంతో చిత్రించారు. చాసో పెద్దిబొట్ల సుబ్బరామయ్య కథలు ఉత్తమ శ్రేణికి చెంది నవి.

ఇటీవల కాలంలో తెలుగు కథానిక పొందినంత వైవిధ్యం మరే ప్రక్రియా పొందలేదంటే అతిశయోక్తి లేదు. కతానికకు ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని నిర్దేశించి రాసేవారు ఎక్కువైనారు. కాళీపట్నం రామారావు, కె.సభా, మధు రాంతకం రాజారాం, కలువకొలను సదానంద కౌతువిశ్వ నాథరెడ్డి, మంజుశ్రీ, కొలకలూరి ఇనాక్, రంగనాయకమ్మ, తురగా జానీకీరాణి మొదలైన వారెందరో ఉత్తమ కథానికలను రచించారు. కొడవటి కుటుంబరావు సామాజిక ప్రయోజనం అనే బలమైన ఉత్తేజమే వారి కలాన్ని నడిపించింది. దత్తపుత్రుడు, మహాఇల్లాలు, ఆడజన్మ, అమాయకురాలు వంటి కథల్లో సూటిదనం సహజత్వంతో పాఠకుడి హృదయాన్ని తాకేలా రచించటం వారి శిల్ప ప్రధానం. మానవతావాది త్రిపురనేని గోపీచంద్ దేవుని

జీవితం, నరేకాన్విండి. వంటి కథానంపుటాలను రచించారు. సామాజిక సమస్యలే ప్రాణంగా రాజకీయ సాంస్కృతిక అవగాహనతో అన్ని వర్గాలవారి చైతన్యం కోరుతూ సాధ్యమైన శిల్పంతో కథలు రాసిన గొప్ప కథకుడు రాచకొండ విశ్వనాథశాస్త్రి కాళీపట్నం రామారావు కారా మాష్టారుగా పేరుపొందిన వీరు యజ్ఞం, ఆర్తి జీవధార, చావు వంటి కథలలో సంభాషణలతో వర్ణనలతో పాత్రలతో సన్నివేశాలు ఇమిడిపోయే విధంగా కథలు రాసిన వీరు అందరికి సుపరిచితులు. ఇలా ఎంతో మంతి కథకులు వున్నారు.

నేటితరంలో కొత్తగా పుట్టుకొస్తున్న రచయితలు కథా ప్రక్రియను సుసంపన్నం చేస్తున్నారు. రచయిత్రులు ఎంతో వైవిధ్యంతో, ప్రపంచీకరణ స్థానీయతా వాదం నేపథ్యంలో కథారచన చేస్తున్నారు. స్త్రీత్వవద, దళితవాద ధోరణుల్లో బలమైన గొంతుకలను విన్పిస్తున్నారు. తెలుగు కథకి అచ్చమైన తెలుగుదనాన్ని, పాఠకుల మనసుల్ని నిత్య చైతన్యం వైపూ, వాస్తవిక దృక్పథం వైపూ నడిపిస్తూ, విలక్షణమైన శైలిలో, మానవత్వపు విలువలను కాపాడుతూ కాపాడుతూ కథసు రాస్తున్న అందరికి నమోవాకాలు.

ఆధార గ్రంథాలు :

1. దళితకథలు - ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
2. కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య

❖ ❖ ❖

బతుకమ్మ పండుగ సంస్కృతి - నేపథ్యం - మొగ్గల కవిత ప్రక్రియ

- బసవరాజుప్ప, అధ్యాపకుడు, నలంద ఉపాధ్యాయ విద్య శిక్షణ కళాశాల, మహబూబ్ నగర్, తెలంగాణ.

పరిచయం :

వివిధ కుల, మతలవారు రకారకాల ఆచార సంప్ర దాయలతో పండుగలు, జరుపుకుంటున్నారు. తరతరాల నుండి వస్తున్న సంస్కృతి సంప్రదాయలలో పండుగలకు ఒక ప్రత్యేకత పరమార్థం ఉంది. తెలంగాణ లో జరుపుకొనే కొన్ని పండుగలలో సంస్కృతి సంప్రదాయలతోపాటు, సామూహిక భాగస్వామ్యనికి ప్రాధాన్యత నిచ్చే పండుగలు ఉన్నాయి. కొన్ని పండుగలు పురాణేతిహాసాలకు సంబంధించినవైతే, మరికొన్ని స్థానిక అంశాలతో ముడిపడి ఉన్నాయి. వాటిలోనిదే బతుకమ్మ పండుగ.

కులమతాలకు అతీతంగా ఐక్యతారాగాన్ని వినిపిస్తూనే, వర్ణవర్గ విభేదాలను దూరంచేసి ఏకతాస్వరం బతుకమ్మ,పల్లె ఐక్యతనుచాటేజానపదుల పండుగ బతుకమ్మ.

కులమతాలకు అతీతంగా కలిసిమెలసి సాగుతునే, పేదధనికభేధాలనుఆటపాటలతో మైమరపింపజేస్తుంది జనులందరిని ఏకం చేసే పండుగ బతుకమ్మ తల్లి పదేళ్ళ కిందట వెలుగు చూసినది, క్రీ.పూ.ఒకటవ శాతాబ్దంలో ప్రాకృత శాసనంలో బ్రహ్మలిపిలో బతక తమ్సురొ ఖచి బిరమపదిహ అన్న అక్షరాలు కనిపిస్తాయి. అయితే దీనిని బట్టి బతుకమ్మ పండుగ ఒకటవ శాతాబ్దం నాటికే విస్తరించిందని తెలుస్తుంది. ఇక్ష్వాకుల, విష్ణకుండినులు, చాళుక్యులు, కాకతీయుల కాలంలో కూడా ఈ పండుగ ములాలు కనిపిస్తున్నాయి.

వెయ్యేళ్ళ చరిత్ర ఉన్న బహుజనుల పండుగవుతునే ప్రజలకష్టల నుంచి పుట్టిన పండుగ బతుకమ్మ సకలజనులందరినీ చిరకాలం బతుకమనే పండుగ.

దక్కన్ పీఠభూమిలో దర్జాగా వెలుగుతునే సంస్థానాల కాలంలో సమున్నతంగా వెలుగింది నాటి బోడ్డెమ్మలే నేటి బతుకమ్మ ల రూపాలు.

బతుకమ్మ పండుగ చరిత్ర :

ఈ పండుగ సంస్కృతి సంప్రదాయం ఎలా మొద లైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీతనంలో నగిలి పోయిన గ్రామీణ సమజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయిన వారు తట్టుకోలేక, ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలుచు కొని, తోటిమహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకమ్మ లేదా బతుకు అమ్మ అంటు దీవిస్తూ పాటలు పాడేవారు.

ధనికవర్గాల భూస్వాముల ఆగడాలకు బలైపోతునే ఆడపిల్లల ఆత్మకు గుర్తుగా పూలతో చేసే పండుగ బతుకు అమ్మా అంటు ధీవించే పండుగ బతుకమ్మ. జనుల కష్టాల నుంచి పుట్టిన వండుగవుతేనే ప్రాచీనకాలంనుంచి జరుపుకుంటున్న వండుగ పుడమిలో పుట్టిన పూల సందమామ బతుకమ్మ.

ఆత్మబలిదానాలతో ఆవిర్భవించిన బతుకమ్మ పుడమి ఎదలపై పురుడోసుకున్న పండగ తెలంగాణ మట్టిబిడ్డల ఇలవేల్పు బతుకమ్మ తల్లి. ఆదేవిధంగా ఆదివాసులకు వేల సంవత్సరాల పూర్వమే ఆదివాసుల నమ్మకాలలో పురుడుపోసుకొని, పూలదేవతగా మలచ

బడుతుంది బతుకమ్మ, బతుకుదెరువు చూపిన అమ్మగా కొలువబడినది. బతుకుదెరువు అంటే ప్రాణం, జీవనం కోనసాగించడం అని అర్థం. బతుకుదెరువు ప్రసాదిస్తున్న అమ్మ అని అమ్మలగన్నయమ్మ అని వారి నమ్మకం.

మంచిబతుకును ప్రసాదించమని వేడుకుంటూనే చల్లని ధీవెనలను ఇచ్చే పూలసింగిడి బతుకమ్మ జానపదుల సంస్కృతిక గీతిక బతుకమ్మ తల్లి. బతుకమ్మ పండుగా పూర్తి ప్రకృతిని పూజించే విధానం కనిపిస్తుంది. ప్రకృతిలో ఎక్కువ సమయం గడిపే పండగ ఇది. ప్రకృతిలో గడపడం, ప్రకృతిని చూడడం, పారే ఏరు, పర్వతాలు, చెట్లు, చేమలు, సూర్యోదయం, సూర్యాస్తమయం - ఇవన్నీ మనిషిని ఆకర్షింపజేస్తాయి.

జే.జే, రుసో, ఆగస్టు కాంప్టే, పెస్టాలజీ, హెర్బర్ట్, స్పెన్సర్ మొదలగు తత్వవేత్తలు ప్రకృతివాదాన్ని ప్రచారంలోకి తెచ్చారు. బతుకమ్మ పండుగకు పూలతో సంబందం ఉంటుంది కాబట్టి ఈ బతుకమ్మ పండుగ కూడా ప్రకృతికి సంబందించిన పండుగగా భావించవచ్చు. ప్రకృతిని ప్రకృతితో ఆరాధించే పండుగ అవుతునే మానవాళి జీవితాల్లో కొత్త సొబగులను తెస్తుంది మమతానురాగాలను పెంచే పండుగ బతుకమ్మ పండుగ.

మనిషిలోని మానసిక వికారాలను పోగోడుతూనే స్నేహభావనతో మైత్రీబంధాన్ని పెంచే దివ్వషధం అందరినీ కలిపే స్నేహవారధీ చల్లని బతుకమ్మ తల్లి. నుఖసంతోషాలతో బతుకమని ధీవెనలు ఇస్తూనే గౌరమ్మ రూపంలో ఇంటిల్లిపాదిని ఆలరిస్తుంది చల్లగా బతుకమని ధీవించే తల్లి గౌరమ్మ తల్లి. జీవి పుట్టుకకు స్త్రీ, గర్భం - రెండు ఆధారం. అందుకే స్త్రీని బతుకమ్మ అంటూ సంబోధించినట్లుగా ఉంటుంది. ఈ పండుగా పేరులోనే స్త్రీలు బతుకాలి అనే ఆక్షాంక్ష, ఆవేదన కనిపిస్తాయి. అనాదిగా అనేక రుపాలుగా పురుషాధిక్యతకు సమాజంలో స్త్రీలు బలవుతునే ఉన్నారు. ఆత్యచార రుపంలో, ఆరాచకాల రుపంలో ఎందరో స్త్రీలు ఆత్మర్పణ గావించుతున్నారు. స్త్రీలు లేని లోకంలో సమాజ సమతుల్యత దెబ్బతింటుంది. రేపటి తరం నిర్మాణం జరగదు. అందుకే స్త్రీలు బతకాలి అన్న భావనలో కూడా ఈ పండుగ బతుకమ్మ పండుగగా రుపాంతరం చెందినది. అని చెప్పవచ్చు.

కడుపున పుట్టిన బిడ్డలు మంచిగా బతకాలని కోరుతు తొమ్మిదిరోజులు చేసే పండుగ బతుకమ్మ నవమాసాలు మోసిన అమ్మల పండుగ బతుకమ్మ. స్త్రీల ఆవేదనను ఆకాంక్షలను పాటలల్లో కనిపిస్తాయి. స్త్రీల మానసిక చిత్రణ కనిపిస్తుంది. సంతానం, తల్లిగారింట్లో ఆదరణ, అత్తింటి గౌరవం, కోరుకుంటారు పాటల ద్వారా. నాటికాలంలో స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండేది కాదు. ఈ బతుకమ్మ పండుగ ద్వారా వారి మనుసులోని ఆవేదనలు, కోరికలు, కష్టసుఖాలు వెళ్ళబోసుకుంటారు ఆట, పాటల ద్వారా.

పల్లెతల్లి పుట్టింటిబిడ్డయై గౌరమ్మలా అరుదెంచుతునే కన్నతల్లి ఒడిలో హయిగా సేదతీరుతుంది బతుకమ్మ తల్లి ఆడబిడ్డలను గౌరవించుకునే అసలైన పండుగ బతుకమ్మ. మరువురాని తీపి అనుభూతులను పంచుతూనే కలకాలం నిలిచే ఆత్మీయతానురాగాన్ని పంచుతుందిఅనుబంధాల ప్రేమమాలిక బతుకమ్మ పండుగ. మహలయ అమావాస్య మొదలు మహరనవమి వరకు సాగే బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి సొరభాలను వెదజల్లుతుంది. ప్రాణ శక్తి, ప్రాణధాత్రి, గౌరమ్మ, ఆదిశక్తి నామలకు ప్రతిబింబం బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకలు తొమ్మిది నెలలనిండు గర్భనికి చిహ్నం. అండం, శుక్రకణం కలయిక మొదలు ప్రాణం రూపుదిద్దుకొని, సంపూర్ణ మానవరూపం దాల్చడానికి తొమ్మిది నెలల కాలం పడుతుంది. ఆ తొమ్మిది నెలలకు చిహ్నంగా ప్రకృతి ఫలదీకరణకు తొమ్మిది రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆ తొమ్మిది రోజుల నవవిధ భక్తి మార్గలు పాటింప బడతాయి. అహింస, నిగ్రహం, భూతదయ, క్షేమ, శాంతి, ధ్యానం, సత్యం, ప్రేమ మనుసు అనే నవ వివిధ

పుష్పాలకు ఈ తొమ్మిది రోజులు ప్రతీక. అందుకే తొమ్మిది రకాల పూష్పాలు తొమ్మిది వరసలు పేరుస్తారు. ఈ విధంగా బతుకమ్మ ప్రకృతి లోనే ఆవిర్భావించింది. తెలంగాణ సమాజాన్ని సంస్కృతి సంప్రదాయంలో ప్రపంచ స్థాయిలో ఎంతో కీర్తి తెచ్చిపెట్టింది.

పెత్తరమాసతోమొదలైదుర్గాష్టమితో ముగుస్తునే నవరాత్రులనుశోభాయమానం చేసే పండుగ బతుకమ్మ తెలంగాణ జానపదులకు విశిష్టమైన పండుగ బతుకమ్మ.

గౌరమ్మ ఆవతారంగా బతుకమ్మ ను కోలుస్తూనే చల్లని ధీవెనలు ఇమ్మని కోరుతు చేసే పండుగ ఆడ బిడ్డల ఇలవేల్పు మన బతుకమ్మ పండుగ. పుట్టింటి అనుబంధాలను నెమరు వేసుకుంటూనే మెట్టినింటి కష్టాలనుమైమరచి ఆడిపాడతారు ఆడబిడ్డల జ్ఞాపకాల పూలతోట బతుకమ్మ పండుగ రోజుకోక్క రూపుతో అమ్మవారిగా దర్శనమిస్తూనే చల్లని చూపులను ప్రసరించే తల్లి బతుకమ్మ సకలసంపదలను ఇచ్చే కల్పవల్లి బతుకమ్మ. మానవసంబంధాలను మరింతగా బల పరుస్తునే ఆత్మీయ అనురాగాలను పంచే ఆరుదైన పండుగ ప్రతిమదిలో అనుబంధాలను పెంచే బతుకమ్మ.

తెలంగాణ, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. తెలంగాణ పండుగలలో విశేష ప్రాచుర్యం కల్గిన పండుగ బతుకమ్మ. మరుపురాని తీపి అనుభూతులను పంచుతూనే కలకాలం నిలిచే ఆత్మీయతానురాగాన్ని పంచుతుంది అనుబంధాల ప్రేమమాలిక బతుకమ్మ పండుగ.

సప్తవర్ణాలతో కోటికాంతులను పల్లెపల్లెన వెదజల్లుతునే శోభాయమానమై తెలంగాణాంతటినీ పరవశింపజేస్తుంది సంస్కృతి సంప్రదాయాల మేళవింపు బతుకమ్మ పండుగ.

ఆశ్వీయుజ మాసం శుద్ధ పౌడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు రోజుకొక పేరుతో రోజుకొక నైవేద్యం సమర్పించుకుంటూ, మొదటి రోజు ఎంగిలి పుల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగవరోజు నానే బియ్యం బతుకమ్మ, ఐదవరోజు అట్ల బతుకమ్మ, ఆరవరోజు అలిగిన బతుకమ్మ, ఏడవరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవరోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదివరోజు సద్దుల బతుకమ్మను జరుపుకొని చెరువులో నిమజ్జనం చేస్తారు.

గౌరమ్మను ఆటపాటలతో నందడి చేన్తూనే రోజుకొక ప్రసాదంతో నైవేద్యన్ని సమర్పిస్తారు సకల జనులను సల్లగా చూసే తల్లి బతుకమ్మ. పై కవితలు అన్ని ఆధునిక తెలుగు సాహిత్యంలో నూతనంగా వచ్చిన వచన కవిత ప్రక్రియలో భాగమైన మొగ్గల కవిత ప్రక్రియ.

మొగ్గలు కవిత ప్రక్రియ :

ఆధునిక తెలుగు సాహిత్యంలో మూడు పాదాల ఆధునిక మిని వచన కవిత ప్రక్రియ 'మొగ్గలు'. ఈ మొగ్గల సృష్టికర్త ప్రముఖ రచయిత, నిత్యం సాహిత్య సేద్యం చేసే డా॥ భీంపల్లి శ్రీకాంత్, మహబూబ్ నగర్, తెలంగాణ రాష్ట్రం.

మొగ్గలు ఆవిర్భావం :

ఈ మొగ్గల ప్రక్రియ యాదృచ్ఛికంగానే ఆవిర్భావించింది. ఇది మొదటగా 2017లో ఆవిర్భావించింది. ఈ ప్రక్రియకు ప్రేరణ ఆచార్య మసన చెన్నప్ప గారు అని అంటారు మొగ్గల సృష్టికర్త.

మొగ్గలు కవిత లక్షణాలు :

1. ఇది ముడు పాదాలు ఉండాలి.
2. ఎలాంటి ఛందస్సు నియమాలు అవసరం లేదు.
3. ప్రతి పాదంలో మూడు నుంచి ఐదు పదాలు ఉండాలి.
4. మూడు పాదాలలో మొదటి పాదాని కొన సాగింపుగా రెండవ పాదం ఉండాలి. అంటే మొదటి పాదంలో వాక్యం అంతం కాకుండా ఉండాలి. మొదటి రెండు పాదాలు భావ యుక్తంగా, అర్థవంతంగా, మూడవ పాదాన్ని సమర్థిస్తూ అన్వయిస్తూ, బలపరుస్తూ ఉండాలి.

5. మొదటి రెండు పాదాలు సంశ్లిష్ట వాక్యంలా ఉండాలి.
6. మూడవ పాదం ఒక నినాదంగా, సూక్తిగా, సామెతగా చెప్పవచ్చు.
7. మూడవ పాదం చెప్పడంలో కవియొక్క కొత్తదనం సృజనాత్మక శక్తి ఉండేవిధంగా ఉండాలి.
8. వస్తువు అనుకులత, బలమైన శిల్పం, నూతన అభివ్యక్తితో పాటు సరళత, సంక్షిప్తత, గాఢత ప్రధాన లక్షణాలు. ఈ మొగ్గల కవిత ప్రక్రియలలో ఇప్పటి వరకు అనేక సంపుటి లు రావడం జరిగింది. అనతికాలంలోనే మొగ్గలు అయి పూవ్వు అయి సమాజంలో సుగంధ పరిమాలలాను వెదజల్లడం మొగ్గల ప్రక్రియలో ఉన్న గొప్పతనం అని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ వైభవం పుస్తకం -
2. బతుకమ్మ మొగ్గల కవితా సంపుటి - డా॥ భీంపల్లి శ్రీకాంత్.

❖ ❖ ❖

ఆధునిక తెలుగు నాటకం - ప్రపంచీకరణ ప్రభావం

– వేరం శాంతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గుంటూరు.

సాహిత్యంలో నాటకం ఒక అద్భుతమైన ప్రక్రియ. అది ప్రేక్షకునికి ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని, ఉద్వేగాన్ని, ఆలోచననీ కలిగిస్తుంది. సామాజిక చైతన్యానికి దారులు వేస్తుంది. నవయుగానికి స్ఫూర్తి సంకేతంగా నిలుస్తుంది. కళాకారులను పోషించి వారి అభ్యుదయమును కాంక్షిస్తోంది. సమస్థ ప్రజానీకాన్ని చీకటి నుండి వెలుతురు వైపు నడిపిస్తోంది.

"కనుట వినుట కన్నగడు ఘనంబయ్యెడు
నాటుకొను మనంబునన్ దదర్థ
మెల్ల నాటకంబు దృశ్యంబుగావున
ఘనత కెక్కెనెల్ల కళలయందు"

అనే శ్రీపాద కృష్ణమూర్తిగారి మాటలు అక్షరసత్యం. సమాజంలో జరుగుతున్న అనేక పోకడలను దృశ్యమానం చేసి మనిషి ఆలోచనా లోచనాలకు పట్టిన బూజు దులిపే తొలి ప్రయత్నం చేసింది నాటకమే. క్రీ.పూ. 2వ శతాబ్దం లోనే నాటక రచనా ప్రదర్శనములు కలవు. యక్షగాన ప్రదర్శనలు రూపాంతరం చెంది పాశ్చాత్యుల నోటితో నాటకంగా నామకరణం పొందింది. ఒకప్పుడు నాటకం రాజసౌధములలోనే ప్రదర్శించుట వలన పండితులకు, రసజ్ఞులకు కళాపోషకులకు మాత్రమే దృశ్య మానమయ్యేది. తరువాత రాజపోషణ లేమి చేత, దేవభాష వాడుక తప్పుట వలన సంస్కృత నాటకము తెరచాటున దాగుటు మూతలాడింది. వ్యవహారిక భాషతో ఆధునిక తెలుగు నాటకం ఆవిర్భవించింది. జీవిత ఆవిష్కృత రంగస్థలం నాటకం. సంఘాన్ని సంస్కరించాలనే తపనతో నాటకం పుట్టింది. తెలుగు నాటకం పుట్టినప్పుడు నడుస్తున్న సంఘసంస్కరణోద్యమం నుండి వర్తమానంలోని తెలుగు భాషా పరిరక్షణ వరకు ప్రపంచీకరణ ప్రభావంతో నాటకం తనదైన రీతిలో స్పందిస్తోంది.

ప్రపంచ దేశాలు వేగంగా అనుసంధానమవుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు పాటించే నియమాలను ఇతర దేశాలు కూడా పాటించడమే ప్రపంచీకరణ. దేశాల సరిహద్దులను చెరిపేసి పెద్ద ప్రపంచాన్ని చిన్న దేశంగా మన చేతిలో ఉండేటట్లు సాధ్యం చేసుకోగలిగాము. కానీ దీనీ ప్రభావంతో అనేక రంగాల్లో తిరోగమనాన్ని చవిచూస్తున్నాము. సాంకేతిక పరిజ్ఞానం, విదేశీ వాణిజ్యంతో నూతన అవకాశాలు అందిపుచ్చుకున్నప్పటికీ, మన భాషా సంస్కృతులను పెడత్రోవ పట్టించింది. ప్రపంచీకరణ పై ఉక్కుపాదం మోపి ప్రజలలో నూతన చైతన్యం తీసుకురావడానికి మన తెలుగు రచయితలు నాటకాన్ని ఆయుధంగా మలిచి జరుగుతున్న ఘోరాలను దృశ్యమానం చేశారు.

తెలుగు నేలలో సంఘసంస్కరణోద్యమానికి కందుకూరి బలమైన పునాదులు వేశారు. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి సహాయంతో బాల్యవివాహ నిర్మూలనం, వితంతు పునర్వివాహం, సతీసహగమనం, వంటి దురాచారాలు కరాళనృత్యం చేస్తున్న సమయంలో నాటకం శక్తివంతమైన పాత్రను పోషించింది. మూఢనమ్మకాలతో జీవుస్తున్న ప్రజల్లో నవచైతన్యం తీసుకురావడానికి అవిరళ కృషి చేసిన గురజాడగారి కన్యాశుల్కం సమాజంపై తన కొరడా ఝుళిపించింది. కన్ను తెరవని పసిగుడ్డును సైతం కన్యాశుల్కం పేరుతో అమ్మకం జరిపి దుశ్చర్యలకు పాల్పడే దగాకోరులకు ఈ నాటకం ద్వారా జవాబు చెప్పారు. స్త్రీకి రెండు కళ్ళుగా ఉన్నకందుకూరి, గురజాడ, ఆమె అభ్యున్నతికి కృషి చేశారు. స్త్రీల పట్ల జరిగే దురాచారాలను రూపుమాపి సమసమాజ స్థాపన అనే జెండా ఎగురవేయడానికి కన్యాశుల్కం నాటకం 'మేర నగం'గా నిలిచింది. మహిళకు మరచిపోలేని ఊరట

నిచ్చింది. సంఘపరివర్తన పురోగమనానికి అవరోధంగా ఉన్న శక్తులను ఎదుర్కొని సామాజిక వికాసానికి తోడ్పడు తుంది. సామాజిక చైతన్యానికి సాహిత్యం ఉత్తమ సాధన మని ఈ నాటక ప్రదర్శన నిరూపించింది.

సంఘంలోని మరో విషపురుగు వరకట్నం. ఈ కాటుకు బలవుతున్నది కూడ యుక్త వయుస్సు వచ్చిన ఆడపిల్లలే. దాని కోరలు పీకిన కాళ్ళకూరి నారాయణరావుగారి నాటకమే వరవిక్రయం. బెంగాల్‌లో ఒక యువతి వరకట్నాన్ని నిర సిస్తూ ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం ఆ నాటి పత్రికల్లో ప్రచురించబడింది. ఆ వార్త వరవిక్రయ నాటకానికి స్ఫూర్తినిచ్చింది. సంఘంలోని మూఢాచారాలు, న్యాయవాదుల దుర్మార్గాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, పాఠశాలల దుస్థితిలాంటి ఎన్నో అంశాలను ఈ నాటకంలో స్పృశించారు. గాంధీ పిలుపునందుకొని పది సంవత్సరాల నుండి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్న పురు షోత్తమరావు, ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంట్లో నూలు వడుకుతున్నట్లుగా ఆ పాత్రను తీర్చిదిద్దారు. ఆత్మత్యాగం చేసుకోబోయే ముందు కాళింది పాత్ర కూడా రాట్నం కలకాలం తిరుగుతుండాలని ఆశిస్తుంది. సహాయ నిరా కరణను ఈ నాటకంలో ప్రస్తావించి ప్రజలలో దేశభక్తిని కలిగించే ప్రయత్నం చేశారు.

సంఘ గమనం కూడా ఒక ప్రవాహం. మనిషి జీవిత ప్రవాహంలో ఎన్నో మలుపులూ, సుడులూ ఉంటాయి. ఉరకలు వేసే చైతన్యం స్ఫూర్తి మంత్రంగా కలవాడు ప్రవాహానికి ఎదురీది ఆశయసాధనకు కృషిచేసి విజయు డౌతాడు అనే సందేశానిచ్చే నాటకం కొండముది గోపాల రాయశర్మగారి 'ఎదురీత' కలసిన మనుషులు ఒకటి కావడానికి కులమతాలు అడ్డుగోడలు కావంటూ, గోపి అనే యువకుడు తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమించిన వేశ్యా యువతిని వివాహం చేసుకుంటాడు. నాటక రచయిత గోపాలరాయశర్మగారు కూడా అప్పటి పరిస్థితు లకు ఎదురీది నాటకానికి నూతన వస్త్రాలు తొడిగారు. నాటక గమనాన్ని నిరోధించే పద్యాలకు స్వస్తి చెప్పి, పాండిత్యాన్ని పూర్తిగా విడిచిపెట్టి పాత్రపోషణము, సరసమైన భాషనుపయోగించి సామాన్య ప్రజానీకానికి చేరువయ్యే విధంగా రచన చేశారు. ఆంధ్రనాటక కళా పరిషత్ పోటీలో ప్రదర్శించి ఈ నాటకం ఉత్తమ ప్రదర్శన బహుమతిని పొందింది. 1929లో గోవిందరాయ నాట్య మందిరం పేరుతో తెనాలిలో ప్రారంభమైన ఆ వేదిక ఎన్నో ప్రాంతాలకు విస్తరించి తరువాత మద్రాస్ చేరడంతో నాటక రంగం కుదుపునకు లోనై సినిమాగా మొగ్గ తొడిగింది.

తెల్లదొరల దురాగతాలను ప్రత్యక్షంగా చూపిన దృశ్యకావ్యం-నాటకం. ప్రపంచీకరణతో నాటకం పౌరాణిక, చారిత్రక, రాజకీయ, సాంఘిక నాటకాలుగా దృశ్య మానమయ్యాయి. 'నవయుగారంభము' అంటూ నాట కాన్ని రచించిన కవి దామరాజు పుండరీకాక్షుడు. ఒకనాటి భారతదేశ ఔన్నత్యాన్ని గురించి తలచుకొని భరతమాత దేవలోకం నుండి భూలోకానికి వచ్చి బాధపడుతుండగా దేశసేవకుడు దేవుని రూపంలో వచ్చి మీరు బాధపడు నవసరం లేదని, తిలక్‌గా, గాంధీగా అవతారం ఎత్తి భరతమాతను దాస్య శృంఖలాల నుండి విడిపించి నవయుగారంభం చేయడానికి ముందడుగు వేయడం ఈ నాటక ఉద్దేశ్యం.

ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'నాయకురాలు' నాటకం పల్నాడులోని దాయాదుల పోరును చిత్రీకరించింది. పలనాటి చరిత్రలో నాగమ్మ కుటిల నీతి ఆంగ్లేయులను తలపిస్తుంది దాయాదుల సమైక్యతను సాధించడానికి బ్రహ్మనాయుడు చాపకుడు సిద్ధాంతం, భట్టు రాయబారం ఎంతో ఉపకరిస్తాయి. యుద్ధం మానవ జాతిని భక్షిస్తుం దనీ, శాంతి సర్వమానవాళినీ రక్షిస్తుందనే సందేశానిస్తుంది ఈ నాటకం. పల్నాటి యుద్ధం ముగిసిన తరువాత నాగులేరు ఒడ్డున వీరులు ఆయుధాలను ఒక గుడిలో ఉంచి ప్రతి సంవత్సరం కొణతల ఉత్సవాన్ని ఇప్పటికీ నిర్వహిస్తారు. వీరందరూ ముడుపులు, మొక్కుబడులూ చెల్లిస్తారు. నాటకంలో సంస్కృతి కూడా అంతర్భాగ

మనీ...భాష, నాటకం రెండూ తన సమాజ సంస్కృతిని కూడా మోసుకువస్తాయని ఈ నాటకం ద్వారా తెలుస్తుంది.

నాటక సాహిత్యంలో పౌరాణిక నాటకాలకు ప్రత్యేక స్థానము ఉన్నది. సామాన్య ప్రేక్షకుడిని సైతం నాటకం వైపు ఆకట్టుకుని అతని మనసు రంజింపజేస్తుంది. కొందరు రచయితలు పురాణ పాత్రలకు కొత్త సొబగులు అద్ది వాటిలో నిర్హేతుకమైన అంశాన్ని తీసుకొని హేతువాద దృక్పథంతో నాటకాలను రాశారు. ఈ నాటకాలు ప్రజల్లో పాతుకుపోయిన మూఢాచారాలను పారద్రోలి హేతు బద్ధంగా ఆలోచించే ప్రయత్నం చేశాయి. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఈ నాటకాలు ఎంతగానో ప్రభావితం చేశాయి. ఇందులో మహాభారత కథకు సంబంధించిన కురుక్షేత్ర సంగ్రామం ప్రేక్షకులకు ఎంతో సన్నిహితం అయింది. కౌరవ పాండవుల పక్షాన సంజయుడు, శ్రీకృష్ణుడు రాయబారులుగా రావడం, అది విఫలం కావడంతో కురుక్షేత్ర యుద్ధం అనివార్యం కావడం వంటి విషయాలతో కవిరాజు త్రిపురనేని హేతువాద దృక్పథంతో బట్టబయలు చేస్తూ దుర్యోధనునిపై ఉన్న అపనిందను తొలగిస్తూ ఈ రచన చేశారు. ధర్మరాజు అసత్యమైన మాటల గారిడితో ద్రోణుని వధకు కారణమైన వైనాన్ని కూడా తూర్పారబట్టారు. పదమూడేళ్ళు తమరాజ్యం ఇతరుల ఆధీనంలో ఉన్నప్పుడు దానిపై అధికారం కోల్పోతారు. కాబట్టి రాజ్యభాగం కోరే అర్హత లేదని త్రిపురనేని సశాస్త్రీయమైన వివరణను ఈ నాటకం ద్వారా ఇచ్చారు.

జమిందారీ వ్యవస్థపై సాహిత్యం గణనీయమైన ప్రభావాన్ని చూపింది. రైతుకూలీ పోరాటానికి స్ఫూర్తిగా, స్పందనగా సాహిత్యం వెలువడింది. రైతు కూలీల జీవితాలు, ఆలోచనలు, పోరాటాలు జమీందారుల దుర్మార్గాలపై నాటకం గళమెత్తి తిరుగుబాటు చేసింది. జమీందారీ వ్యవస్థను ఎన్నో అవస్థలకు గురిచేసి నాటకం మాలపల్లి. ప్రపంచంలో ఏ నాటక దర్శకుడు చేయని సాహసం ఏ.ఆర్. కృష్ణ చేశారు. ఈ నాటకం ముందు వరకు ప్రదర్శనలన్నీ నేలపైనో, నాలుగురోడ్లు కూడళ్ళ లోనో, ధనవంతుల, లోగిళ్ళలోనో వెనుక వైపు తెరఉంచి మూడు ప్రక్కలా ప్రేక్షకులకు ప్రదర్శన కనిపించే విధంగా సాగేవి. మాలపల్లి నాటక దర్శకుడు శ్రీ ఎ.ఆర్. కృష్ణ ఏకకాలంలో 12 రంగాలపై ప్రదర్శన జరిపి నాటకాన్ని ఆకాశానికెత్తారు. 1973 ఇరాన్‌లో జరిగిన ప్రపంచ నాటకోత్సవం సందర్భంగా చూసిన జపాన్ దేశస్థుల 'తెరయామా' నాటక ప్రదర్శనే ఈ ఆలోచనకు మూలమని చెప్పారు. రంగస్థలంపై ఎడమవైపున చివరి రంగస్థలంలో బుఱ్ఱకథ ద్వారా కథను నడుపుతారు. రెండవ రంగస్థలంపై జైలు, సన్నివేశాలు, మూడవ రంగస్థలంగా గ్రామంలోని ఒక దుకాణం, నాల్గవ రంగస్థలంపై రెండస్థుల భవనంలోని నాలుగు భాగాలు, 5వ రంగస్థలం పై రచ్చబండ ఉంటుంది. అన్ని రంగస్థలాలపై ఏకకాలంలో నాటకం జరుగుతుంది. స్థలంపై సన్నివేశం జరుగుతున్న సమయంలో మిగతా రంగస్థలాలపై ఉన్న పాత్రలు మైమ్ చేస్తుంటాయి. రష్యన్ సర్కస్‌లా 40 మంది కళాకారులతో 100కి పైగా ప్రదర్శనలు ఇవ్వబడింది.

తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన నాటకాల్లో చెప్పుకోదగిన నాటకం సుంకర వాసిరెడ్డిగారి మా భూమి, దొరల కాళ్ళు మొక్కుతూ, బానిసలుగా, నిన్నహాయులుగా బ్రతుకులు ఈడుస్తున్న ప్రజాసామాన్యం కళ్ళు తెరచి దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించింది. వీరంతా సంఘటితమై పీడనకు ఎదురు తిరిగి భూమి కోసం, భుక్తికోసం, విముక్తికోసం కృషి చేస్తే తమను ఓడించే వారుండరని గ్రామ గ్రామాన పోరాటం చేశారు. తెలం గాణా సాయుధ పోరాటంతో పాట ఎంత మారు మోగిందో నాటకం అంత తాండవించింది. సోవియట్ నాటకాలను చదువుతున్నప్పుడు ఎంత సంతోషించానో అంతకంటే ఎక్కువ మా భూమి నాటకాన్ని చదివినప్పుడు సంతోషించానని శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య చెప్పిన మాటలు వాస్తవం.

ప్రపంచీకరణకు వ్యతిరేకంగా వచ్చి నాటకంలో పాటిబండ్ల ఆనందరావు 'పడమటిగాలి' మెచ్చుకోదగినది. పారిశ్రామికీకరణతో నేలతల్లిని నమ్ముకున్న రైతుల కడగండ్లు, తెగిపోత్ను మానవ సంబంధాలు, క్షీణిస్తున్న మానవీయ విలువలను ఈ నాటకం దృశ్యీకరించింది. స్పందన ఒంగోలు సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 100కి పైగా ప్రదర్శనలిచ్చింది. ఎక్కడ అణచివేత ఉంటుందో అక్కడ తిరుగుబాటు ఉంటుంది. ఆ తిరుగుబాటుకు కొంత సమయం పట్టినట్లే స్త్రీవాదం ఒక స్వరూపాన్ని పొందడానికి కొంతకాలం పట్టింది. స్త్రీపురుషులు ప్రకృతిలో సమానమే అనే సత్యం మరచిపోయేలా చేసిన పురుషాధిక్యత, అతడి ఆధీనంలో బ్రతకడానికి స్త్రీ అలవాటు పడిపోయింది. పురుషుడు సహృదయుడు అయిన సందర్భంలోనే స్త్రీ గౌరవప్రదమైన జీవనం సాగించగలుగుతోంది. అణచివేతకు గురైన స్త్రీ తనంత తానుగా అవరోధాలను తొలగించుకుని నిలబడే క్రమంలో స్త్రీవాదం ఆవిర్భవించింది. ఆమె సంకెళ్ళు విప్పి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించడానికి ఎందరో రచయితలు నాటకం ద్వారా ప్రయత్నం చేశారు. స్త్రీ, పురుష ప్రేమ తత్వమే వారి జీవితాలను స్వర్గతుల్యం చేస్తుందని చలం తన నాటికల్లో చూపించారు. గొల్లపూడి మారుతీరావు, తనికెళ్ళభరణి గార్లు కూడా ఉత్తమ ఇతివృత్తంతో నాటికలు రాశారు.

ముగింపు :

మారుతున్న సమాజంతో పాటు నాటక ఇతివృత్తం కూడా ఎప్పటికప్పుడు మారుతూ ప్రజానీకానికి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతూ, సరైన సమయంలో తగిన సందేశాన్నిస్తుంది. నాటకం ఎన్నో బ్రతుకులను సరైన దారిలో పెట్టడమే కాక, ఎందరికో బ్రతుకు తెరువు నిచ్చింది. ఎన్నో పరిమితులకు లోబడి ప్రదర్శించే నాటకం, అవధులు లేని సాంకేతిక పరిజ్ఞానం తోడై వెండితెరపై సినిమాగా రూపుదిద్దుకొని కనకవర్షం కురిపించింది. సినిమా ప్రభావంతో నాటకం కళ తగ్గుతుందనడం కంటే నాటక ప్రదర్శనకు కావలసిన ప్రధాన వనరు రంగస్థల లోపము అనడం సముచితం. ఆకలి కలిగేందుకు ఔషధం ఇచ్చి ఆహారం ఇవ్వకుండా ఏదోతిని, ఎలాగో బ్రతకమన్నట్లు వేదిక లేనిదే ప్రదర్శనావకాశం లేదు. కనీసం జిల్లాకో నాటకశాలను ఏర్పాటు చేసి మన సంస్కృతిని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో నాటక కళారాధనకు తగిన ఏర్పాట్లు కల్పించాలి. నాటక ప్రదర్శనను వీడియో రూపంలో తీసి యూట్యూబ్ వంటి మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువయ్యేటట్లు చేయవచ్చు. తక్కువ సమయంలో సహజశైలిలో మంచి సందేశాలను ఎప్పటికప్పుడు అందిస్తూ నాటక ప్రక్రియను నిత్యకళ్యాణం, పచ్చతోరణంలా నిలుపుకోవచ్చు. ఎంత సాంకేతికతను అందిపుచ్చుకున్నా ప్రపంచ మహమ్మారి కరోనాకు ప్రాచీన ఆయుర్వేద వైద్యంతో ఉపశాంతి పొందుతున్నట్లు నాటకం కూడా తిరిగి తన స్థానాన్ని మళ్ళీ పొందుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. ఆంధ్రనాటక కళాపరిషత్ రజతోత్సవ సంచిక సంకలనం : పసల సూర్యచంద్రరావు.
2. తెలుగు నాటకం ఉద్యమనేపథ్యం : డా॥ కందిమళ్ళ సాంబశివరావు.

❖ ❖ ❖

'రక్తస్పర్శ' కవుల కవిత్వం – ప్రపంచీకరణ ప్రభావం

– భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రస్తుత సమాజాన్ని ప్రపంచీకరణ కాలం అని పరిగణించవచ్చు. అసలు ప్రపంచీకరణ ప్రపంచమంతటినీ ఒక్కతాటిపై కలగలిపి ఏకం చేస్తున్న తరుణం ఇది. వస్తువులు, పెట్టుబడులు, ఉత్పత్తి, సాంకేతిక విజ్ఞానం ఒక దేశం నుండి మరొక దేశానికి తరలిపోవడం అనే అర్థంలో ప్రపంచీకరణని వాడుతున్నారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల వర్ధమాన దేశాల్లో జనజీవన స్రవంతిలో ప్రగాఢమైన మార్పులు సంభవించాయి. కొందరు కొన్ని బలహీనతలకు లోనయ్యారు. మరికొందరు కొన్ని భ్రమల్లో కూరుకుని పోయారు. ఇంకా కొంతమంది సంపన్న దేశాల సంస్కృతీ సంపర్కం మత్తులో ఇప్పటికీ బయట పడలేక పోతున్నారు. చాలామంది ఎన్నో రకాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యల వలయంలో చిక్కుకొని చావుబతుకుల సంఘర్షణలో మృత్యువుతో పోరాడుతున్నారు. అయితే తెలుగు సాహిత్యంలో కూడా ప్రపంచీకరణ ప్రభావం ఉందని చెప్పవచ్చు. మారుతూన్న కాలాల ఒడిలో కొందరు కవులు ప్రపంచీకరణ ఫలితాలను, దుష్ఫలితాలను స్పష్టంగా, స్వచ్ఛంగా పాఠకలోకానికి అందిస్తున్నారు.

ఇంటర్‌నెట్ వంటి ఆధునిక సమాచార వినిమయ సాధనాల వల్ల యువత సాహిత్యంవైపు చూడడం లేదని చెప్పవచ్చు. అదే విధంగా మనిషి ఒంటరి గుహలోకి పారిపోతున్నాడని, సామాజిక సంబంధాల ప్రాధాన్యత తగ్గిందని తెలుస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి ఒంటరి వాడవుతున్న మాట వాస్తవం. కాని ఆ ఒంటరి తనాన్ని ఆవిష్కరింపచేస్తున్నారు వర్తమాన కవులు.

'రక్తస్పర్శ' కవులుగా పిలువబడుతున్న అఫ్సర్, ప్రసేన్, నీతారాం ఈ ముగ్గురు వర్తమాన కవులు తమ సాహిత్యంలో ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తున్నటువంటి మార్పులను కవిత్వ రూపంలో వెలువరించారు. అఫ్సర్ 'రక్తస్పర్శ' కవితా సంపుటిలో మారుతున్న ప్రపంచాన్ని చూసి 'అన్వేషణ' అనే కవితా సంపుటిలో ఇలా అంటాడు -

"సూర్యుడి దేహం
ముక్కలుగా చీలి
వెలుగులు పంచుతూన్న వేళ
పగటికీ రాత్రికీ
వెలుగుకీ నీడకీ
తేడా తెలియడం లేదు" **(పుట.28)**

ఈ కవిత్వంలో కవి దినదినం మార్పు చెందుతూ, వేగంగా పరుగెడుతున్న ప్రపంచాన్ని చూసి వెలుగుకీ, చీకటికీ తేడా తెలియకుండా మనిషి, మనిషి పట్టించుకోకుండా కాలంతో ఉన్నాడని కవి అంటున్నాడు. అలాగే భ్రూణహత్యల గురించి చెబుతూ 'ఇవాళ' కవితా సంపుటిలో 'భ్రూణహత్యల భూమ్మీద' ఖండికలో

"ఇక్కడి తల్లులు రక్తమాంసాల పిల్లల్ని
కనడం ఏనాడో మరిచిపోయారు
అప్పణ్ణించీ ఈ భూమ్మీద మట్టి
వాన వాసనల్ని మరిచిపోయింది
పచ్చటి మొక్కల స్పర్శని మరిచిపోయింది
వాలిన ఆకాశం విప్పే రహస్యాన్ని మరిచిపోయింది
జారిన కిరణాలు రాల్చే
నులివెచ్చని ముద్దుల్ని మరచిపోయింది."
(పుట.78)

నిజానికి ఈనాడు సమాజంలో భ్రూణహత్యలు విపరీతంగా పెరిగాయి అని చెప్పవచ్చు. ఎందుకంటే కొన్ని ఆధునిక టెక్నాలజీల పరంగా చూస్తే గర్భంతో ఉన్న స్త్రీలు తమకు కావాల్సినప్పుడు బిడ్డలకు జన్మనివ్వడం, వద్దను

కున్నప్పుడు అబార్షన్ చేసుకోవడం చేస్తున్నారు. కాని పూర్వ కాలంలో ఎలాంటి పరికరాలు లేకపోవడంతో అప్పటి మాతృమూర్తులు ఇష్టానుసారంగా జన్మనివ్వడం జరిగింది. ఎంతమంది ఉన్నా పెంచి పోషించే తత్వం ఉండేది. కానీ నేడు వేగంగా పరుగెడుతున్న సమాజంలో మనిషి మనిషినే పట్టించుకునే పరిస్థితి లేదు. తమకు నచ్చినప్పుడు గర్భాన్ని ఉంచడం, వద్దనుకున్నప్పుడు తీసివేయడం వల్ల అనేక భ్రూణహత్యలు నేటికి జరుగుతూనే వందల సంఖ్యల్లోనే హత్యలు జరుగుతున్నాయి.

అలాగే 'వలస' కవితా సంపుటిలో 'వీడ్కోలు తర్వాత' ఖండికలో

"ఎంత దయ లేకుండా
వెళ్ళిపోతుంటాయి చెట్లూ చేమలూ వెనక్కి - ఇలా వెనక్కి
ముందుకీ వెనక్కీ వెళ్ళలేక నేను
గడ్డ కట్టుకుపోతున్నప్పుడు
నీ అగ్నిస్పర్శనే ప్రాణం చేసుకుంటానా
నీ కన్నీళ్ళనే ధ్యానం చేసుకుంటానా
వొక్క నవ్వు తప్ప
శేష ప్రపంచమంతా గుడ్డిదైపోతుంది
నేను అనేక ప్రపంచాలై
నీ చుట్టూ గాలిలా వలయాలు తిరుగుతుంటాను"
(పుట.290)

ప్రపంచీకరణ నేపథ్యంలో జీవించడానికి ఒక ఊరి నుంచి మరొక ఊరికి లేదా ఒక దేశం నుంచి మరొక దేశానికి వలస వెళ్తుంటారు. ఊరిని విడిచి వెళ్తున్నప్పుడు ఆవేదనను చెబుతూ ప్రపంచమంతా కళ్ళు మూసుకొని ఉందని, ఎందరో పనికోసం దేశాలు వలస పడుతున్నారని, వెళ్ళేటప్పుడు కుటుంబాన్ని, ఊరిని, జ్ఞాపకాలని, ఆనందాలను వదిలి వెళ్ళే పరిస్థితి నేడు ప్రపంచీకరణ ప్రభావం మూలమే నని వివరించారు కవి అఫ్సర్.

'రక్తస్పర్శ' కవుల్లో ఒకడిగా తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం పొందిన కవి "ప్రసేన్". ప్రసేన్ రాజకీయ విశ్లేషకుడు, సామాజికవేత్తగా కూడా చెప్పవచ్చు. ఈ కవి కవిత్వం చదువుతున్నప్పుడు చాలా విషయాలలో ప్రగతి శీల భావాలు, వాస్తవిక సామాజిక దృక్పథం కని పిస్తాయి. సామ్రాజ్యవాదంపైన దాని యుద్ధాలపైన, ప్రపంచీకరణ ప్రభావం పైన తనదైన శైలిలో కవిత్వీ కరించాడని తెలుస్తుంది. 'తల్లి రాయని వీలునామా' కవిత్వంలో ప్రపంచీకరణలో మనిషిని ఎలా దోపిడీ చేస్తున్నాయో ప్రసేన్ చాలా బాగా వివరించారు.

"అక్కడో కార్బయిడ్
ఇక్కడో కోలా
కర్మాగారాలన్నీ మన్నెత్తురు పిండుకుని
మహాకోలాలుగా మారకముందే
మన శ్రామికుల ఉత్పాదక శంకలన్నీ
ఎవరో కొంటాడో చూడండి
గ్లోబరీకరణంలో మనం గోళ్ళే గిల్లుకోవాలిక"

మానవ శ్రామిక శక్తిని మనిషిని దోపిడీ చేస్తూ, ప్రపంచీకరణలో అన్యాయాన్ని చేస్తున్నటువంటి వాటి గురించి చెబుతున్నారు.

అలాగే 'ఏదీ కాదు' కవితా సంపుటిలో 'దొంగ సంతకం' ఖండికలో నీతిబాహ్య రాజకీయ నాయకులు నిర్ణయాలలో పారదర్శకత లేకపోవటాన్ని, నిర్దాక్షిణ్యంగా ప్రజా సంక్షేమాన్ని వదిలివేయడాన్ని కవి అంటున్నాడు.

"అయినా నేనేనాడో నా ప్రియతమ దళారికి అమ్ముడు పోయా. ఇక స్థానిక పన్నులు అదనం అనడం అబద్ధం. అన్నీ విదేశీ నిజాలే. నేనొక దుకాణాన్ని. ఇదంతా సంతకాల మాయ. ఒప్పందాల కుతంత్రం... దేశప్రజలందరి వేలి ముద్రలను ఒక్కడే నొక్కేయడం. నేనిప్పుడు దొంగ సంత కాన్ని" అంటూ ఎలుగెత్తాడు.

ఆర్థిక సరళీకరణలు, వ్యవస్థాగత సర్దుబాట్లు, మార్కెట్ స్నేహ పెట్టుబడుల ఉపసంహారకాల ఆర్థిక సరళీకరణ లపై రాసిన కవిత.

ఒక దేశపు ఆర్థిక స్వయం ప్రతిపత్తిని పాలకవర్గాలే ప్రత్యక్షంగా బలహీనం చేసేంతగా గ్లోబలైజేషన్, ప్రవేటై

జేషన్, లిబరలైజేషన్ భావాలకు లోనైనప్పుడు కవికి కలిగిన వ్యథే యిది. అయితే ఈ దేశపు నయా క్లాసికల్ ఆర్థిక వేత్తలు, వాటిని గుడ్డిగా అనుసరించిన విధాన నిర్ణేతలలో ఒక గందరగోళం తప్పకుండా ఏర్పడిందని ఆర్థిక సరళీకరణలో మార్పు వస్తుందని తెలుసుకోవచ్చు. అయితే పాలకవర్గాలు మాత్రం అభివృద్ధి సాధనకు మార్కెట్ ఆధార పెట్టుబడులు చక్కటి మార్గమనే ఆలోచనా ధోరణితో ముందుకు నడుస్తున్నాయి. అసలు ద్రవ్య బాధ్యతా రాహిత్యంలోనే యిది మొదలైందని ప్రభుత్వ రంగాన్ని అత్యంత కారుచౌకకు అమ్మేయడంతో శిఖర స్థాయికి చేరుకున్న దొంగసంతకాల ప్రహసనాన్ని కవి ప్రతిఘటిస్తున్నాడు.

సాహిత్య రంగంలో నది ప్రవాహాన్ని సాగుతున్న నిరంతర కవి, విమర్శకుడు సీతారాం. రక్తస్పర్శ కవుల్లో మూడవ వ్యక్తి. సీతారాం తన కవిత్వంలో ప్రపంచీకరణ ప్రభావం సమాజాన్ని ఏవిధంగా ప్రభావం చూపుతుందో, అలాగే ప్రస్తుత సమాజంలో ప్రపంచీకరణ వ్యక్తుల మధ్య సంబంధాలు ఎలా మరుగున పడుతున్నాయో వివరించారు. సీతారం రాసిన సన్నాఫ్ మాణిక్యంలో 'మానవుడు చనెను' అనే కవితలో ఇలా అంటారు.

'మధ్యతరగతి తలలెత్తని
విశ్వగ్రామమున ఇల్లు కొనెను
మిగిలిన ధనముతో షేర్లు కొనెను
ఇంకా మిగులుతో ఆ ఇంటికి
స్టారు టీవీలు తొడిగెను
తిరిగి దైవము బ్రతికెను
ద్వేషమునే నగరములు శ్వాసించెను
కుగ్రామములు ప్లాట్లయ్యెను'

ఈ కవిత వర్తమాన పరిణామాన్నంతా సూక్ష్మంగా పట్టిస్తుందని వివరిస్తాడు కవి.

మతం, దేవుడు, బ్రతకటం మనిషి మరణించిన అంటే మనిషితనం మరణించినపుడే జరుగుతుందని నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితాలను వ్యంగ్యాత్మకంగా చెబుతున్నారు.

అలాగే 'ఆర్థిక భాష' అనే కవితలో 'తోడేళ్ళు తప్ప / ఏవీ తినకుండా ఈ మేకలను కాపలా వుంటాను/ మా నాట అమ్ముతాను/ నా యిష్టానికి కొంటాను/ మలమూత్ర పిండాల్ని ఏదో ధరకి గిట్టించుకొంటాను సరేనా' ఈ కవితలో ప్రపంచంలో ఆర్థిక సంబంధాలే తప్ప మానవ సంబంధాలు లేవని అవి కనుమరుగవుతుందని కేవలం డబ్బు సంపాదించుకునే లక్ష్యమే యావత్ ప్రపంచం నడుస్తోందని కవి ప్రపంచీకరణ ప్రభావంతో మానవీయ సంబంధాల గురించి చెబుతున్నారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం గొప్పతనం అయితే ప్రపంచీకరణ సామ్రాజ్యవాదం శాపంగా మారిందని చెప్పవచ్చు.

"రేపిక్కడే టాటా వాడు మీకు స్వాగతం చెబుతాడు
రిలయెన్సోడు బూట్ల క్లినిక్ తెరుస్తాడు
నా కొడకల్లారా
ఇక తిరగండి వాడి చుట్టూ
ఎందుకు బతుకుతార్రా
నన్ను బ్రతికించుకోకుండా
ఎట్లా బతుకుతార్రా
నా నీడను సైతం చంపి" **(పుట.51)**

- అంటూ కవి ప్రశ్నిస్తున్నాడు.

మా పశువుల బీడు
ప్రపంచ బ్యాంక్ వనరుల కేంద్రమైంది కనుక
పశుక్రాంతి కోసం
మా గాసం కోసం ఒక ఆవలింత కూడా రాకుండా
సూపర్ బజార్ ముందు నిలబడతాను
నేను వైట్ కార్డు హోల్డర్ని **(పుట 52-53)**

- అంటూ రైతు కూలీగా, రోజు కూలీగా పరిస్థితిని మారిపోతున్న ఈనాటి దుష్పరిణామాల్ని వివరించారు కవి.

నిజంగా రైతుపై ప్రపంచీకరణ ప్రభావం ఎక్కువ పడుతుందని చెప్పవచ్చు. కష్టపడి పనిచేసి, తగిన ప్రతిఫలం అందడంలేదని రైతు ఆవేదనను వివరించారు సీతారాం. కుప్పం ప్రజల వ్యథా యథార్థాల్ని భారతీయ సరిహద్దు గ్రామాల, ప్రాంతాల ప్రజల వ్యథా బింబాలుగా వర్ణిస్తూ చెప్పిన కవితగా చెప్పొచ్చు.

ఈ విధంగా రక్తస్పర్శ కవులు తమ సమకాలీన సమాజంలో ప్రపంచీకరణ ప్రభావం మనిషిపై పడడంవల్ల అతని జీవితం ఎంత అస్తవ్యస్థంగా మారుతోందో చెప్పడం జరిగింది. ఈ కవులు వర్తమాన విషయాలపై స్పందిస్తూ, ప్రశ్నించడం కూడా చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై స్పష్టత కలిగి కవితాక్షరాలతో రాసి, సమాజంలో జరుగుతున్న రుగ్మతలను బయటపెట్టడం జరిగిందని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. 'రక్తస్పర్శ' - అఫ్సర్, ప్రసేన్, సీతారాం.
2. సీతారాం సాహిత్యం - విశ్లేషణ వ్యాసాలు - పగిడిపల్లి వెంకటేశ్వర్లు
3. అఫ్సర్ కవిత్వం - అఫ్సర్
4. ప్రసేన్ సరస్యం - ప్రసేన్

❖ ❖ ❖

ఆధునిక కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం

– డా॥. యల్. నాగలక్ష్మి దేవి, తెలుగు లెక్చరర్, వి.ఆర్.యస్. డిగ్రీ కాలేజి, వి.యన్.పల్లి, కడప.

ప్రపంచీకరణ అనేపదం ప్రపంచ దేశాలనే వణుకు పుట్టించింది. ప్రపంచీకరణ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలమీద వ్యాపార పరమైన ఆధిపత్యం పొందడానికి జరిగిన కుట్ర. అభివృద్ధి చెందని దేశాలలో పెత్తనం మాత్రం అమెరికాదే. ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) అనే వినూత్న దృక్పథాన్ని ప్రపంచవ్యాప్తం చేసింది అమెరికాయే.

గాట్ అలజడి ప్రారంభం కాగానే దాని కుట్రను ముందుగా పసికట్టింది సామ్యవాద కర్తలే. ముఖ్యంగా ప్రజా రచయిత సంఘం (ప్రజారస) కవిత్వం ద్వారా ప్రసంగాల ద్వారా మిగిలిన ప్రక్రియల ద్వారా విస్తృత ప్రచారం ప్రారంభించింది. అద్దేపల్లి, సతీష్ చందర్, విద్యాసాగర్, జీవన్ నాగన్న, యశ్‌పాల్, శక్తి మొదలైనవారు ఈ భావాల్ని బాగా ముందుకు తెచ్చారు. విద్యాసాగర్ గాట్ లోని అంశాల్ని వ్యతిరేకిస్తూ "దిష్టిబొమ్మ" అనే దీర్ఘ కవిత రాశారు. "సంతకం చేసిన వేళ్ళ మీద పగ బట్టిన వాడే ప్రగతివాది" అని అద్దేపల్లి అన్నారు.

ఈ విదంగా ఆనాటి గ్లోబలైజేషన్ ప్రభావం వివిధ అంశాలు అయిన వ్యవసాయము, ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలు, కంప్యూటీకరణ, నానాటికి కనుమరుగై పోతున్న మానవ సంబంధాలు వ్యాపార ప్రకటనలో భాగంగా స్త్రీ విలువలు దిగజార్చడం మొదలైన అంశాలను వస్తువులుగా తీసుకొని తెలుగులో కవిత్వం ఎవలువడింది.

భారతదేశం ఒక మార్కెట్‌గా మార్చదలచిన సామ్రాజ్య వాదుల వ్యాపారాన్ని గురించి, సమకాలీన తెలుగు కవులందరూ తమ స్పందనను తెలియజేసారు. చాలా కవితల్ని రాసారు. రాసిన వారిలో నాళేశ్వరం, శంకరం, "గ్లోబల్ ఖడ్గం" అనే కవితలలో మార్కెట్ కుట్రలను చాలా స్పష్టంగా చెప్పాడు.

మన ముందున్న కూల్‌డ్రింకులు
తల్లిపాలకన్న శ్రేష్టమైనవే అని
కంపెనీలకే ఖర్మ కన్న వాళ్ళ చేతనే
చెప్పించే సంస్కృతిని అలవర్చుకున్నాంగదా
అమ్ముడికి కొనుడికి అలవాటైన మన ప్రేమ
గ్లోబల్ పిల్లల్ని ముద్దాడినంతగా
అనాధ పిల్లల్ని ముద్దాడ లేమ
వ్యాపార దేహానికున్నంత కన్నీటి విలువ
నేలచేతి బుగ్గల మీద జారుతున్న చారికలలో
చూడలేం.

ప్రతివాణ్ణీ ఒక వినియోగదారునిగా చెయ్యడమే గ్లోబల్ వ్యాపారస్థుల ముఖ్య లక్షణం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని "వినియోగదారుడు" అనే కవితలో గౌతమ్ రాసాడు. ఈ కవితలో వినియోగదారుడు ఎలా ఉండాలని వ్యాపారస్థుడు అనుకుంటున్నాడో చూద్దాం.

విసుగెత్తిపోయారా ఇంటర్నెట్టుంది
పరిచితమైన తలకాయల్నీ
అపరిచిత దిగంబర దేహాల్ని చూచిచూచి
కళ్ళ మీద సాలెగూళ్ళ పేరుకు పోయాయి
తలేలేని నగ్న దేహం దేశభక్తి ప్రపంచసంతా
ఎవరిష్టమైన తలవాళ్ళు తగిలించంచ్చు
ఇంతకీ విషయం తెల్సా
తలవేరు దేహం వేరు
ఆ రెండూ కల్సిన వాణ్ణిరి
వినియోగదారుడు అంటారు.

అమెరికాకి అసంఖ్యాకంగా భారతీయుల్ని ఆహ్వానించి వారిని కోటీశ్వరులుగా మార్చడమనే క్రమం దాని సామంజస్యం అనివార్యత విషయాలు ఎలా ఉన్నా సాంస్కృతికంగా అమెరికాపై అనుకూల భావన కలిగిం

చడానికి ఒక ప్రత్యక్ష కారణమౌతుంది. బ్రెయిన్ డ్రెయిన్ అనే దాస్యమనే ఒకప్పుడు పత్రికలన్నీ ఎంతో ఘోషించినా ఈ పరిస్థితి ఆగలేదు. ఈ దేశంలో దొరకని విలువ ఆ దేశంలో ప్రతిభకు ఎంతగా దొరికినా ధనం పట్ల ఆకర్షితులు కావడం ఎంత సహజమైన విషయమైనా వెళ్ళడంలో తప్పేమీ లేకపోయినా కొన్ని దుష్ఫలితాలు మాత్రం ఎవరూ కాదనలేనివి ఉన్నాయి.

''వలస యౌవనం'' అనే కవితలో అన్వర్ ఈ దుష్ఫలితాలు కొన్నింటిని చాలా ఆవేదనగా చెప్పాడు.

"ఇక్కడి యౌవనాలు డాలర్ దేశాలకు
ఓన్ ల్యాండ్ నుంచి టేకాఫ్" తీసుకుంటున్నాయి.
దేశంలో డాలర్ చొరబడినప్పుడే
ఇక్కడి యౌవనాల్లో కంప్యూటర్లు చొరబడ్డాయి.
ఆట మైదానంలో దుమ్ముకొట్టుకుపోయిన నిన్నటి బాల్యానికి
పలక జారి కంప్యూటర్ చేతికొచ్చింది.
వాడి దేహంలో దేహంలోని నరాల్లో నరాల్లోని రక్తంలో
దేశాన్ని "తలదన్నే" విశ్వాసం
దేశానికి యౌవనం లేదు
సమస్త వ్యాపారాల్లాగా
యౌవనం దిగుమతి వస్తువవుతుంది.

అని కవిత్వం ద్వారా తెలియజేసారు.

భారతదేశం ప్రధానంగా వ్యవసాయకదేశం భారత దేశంలోని రైతుల పరిస్థితిని గురించి వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాది దోపిడి గురించి భగ్వాన్ ''పాల్లుగింజ'' అనే కవితలో రైతు పరిస్థితిని ఇలా తెలిపాడు.

ఇక నుంచి చెట్టు గొడ్డు కుల్లేవి కావు
నాటాల్సిన విత్తమేదో చల్లాల్సి ఎరువేదో
అమ్మాల్సిన పంటకెంత ధరో
ముందుగానే జరిగిపోయిన ఏకపక్ష నిర్ణయాల మధ్య
ఇకనుంచి రైతు పేరు వెన్నెముక కానే కాదు
కర్రపుచ్చుకున్న ధనికదేశం మోళీవాడి ముందు
మనం కోతుల్లా ఆడడం మొదలెట్టాక
పల్లె పల్లెలా ఉండదు, పల్లె పల్లెలో ఉండదు.

అలాగే టెర్మినేటర్ విత్తనాల గురించీ, వేప, పసుపు మొదలైన వాటి విదేశీ పేటెంట్ హక్కుల గురించి ''ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'' కవితా సంపుటి రాసిన జూకంటి జగన్నాథం ఇలా అంటాడు.

"డంకెల్ ఐ.ఎం.ఎఫ్"? అగ్రరాజ్యాలు???
నీ కంట్లో నేను వేలు పెడతా
నీవు నా నోట్లో చెయ్యిపెట్టు బాపతి గాళ్ళే
ఇంతెందుకు ఒక్కమాట
తలొంచుకు మనపొలం గెట్టుమీదో
మనం యింటి ముందో
చల్లగా నిలిచిన వేపచెట్టు చూస్తుండగానే
వాని హక్కు భుక్తం అయిపోతుంది.

అలాగే ఆరోగ్యకరమైన అలవాట్లు, ఆహారాలు, ఆటలు, పాటలు అన్నీ మరిచిపోయి పాశ్చాత్య ధోరణు లపై మోజు గురించి యాకుబ్ తన "పెంజికటి" కవితలో

"సున్నిపిండ్లు, పసుపు పూతలు లేని
ఫేషియల్ కెమికల్ లోషన్లతో
కందులు, పెసలు, అనుములు
చిరుగింజలు, గుగ్గిళ్ళు లేని
బర్గర్, చాకోబార్, టూటీ ఫ్రూటీ, పల్లెటూళ్ళల్లో
భాగోతాలు, చిరుతలాటలు, దసరావేషాలు
మందెచ్చులు, చిందు వేషాల్లేని
ఫ్యాషన్ టీవీలు, స్టార్ టీవీల్లోనే మనకిక"

అదే విధంగా ఒకప్పుడు ప్రబంధాల్లో స్త్రీ భోగవస్తువు అని విమర్శకులు పేర్కొంటున్నారు. ఇప్పటి టివిల్లో సినిమాల్లో స్త్రీ భోగవస్తువు మాత్రమే కాదు, వ్యాపారానికి చాలా సులభమైన భోగవస్తువు చిల్లర భవానీదేవి స్త్రీల అవయవాల మీద జరిగే వ్యాపార దోపిడిని "ఒక సౌందర్య దుఃఖగీతం'' అనే కవితలో చాలా బలంగా వ్యక్తం చేస్తున్నారు.

"నర్తకుల్ వరించే ప్రకృతి వైపరీత్యాల్లో

బాహ్యంగా స్పృహ ఎప్పుడు వ్యాపారమే
నాగరీక సంస్కృతి విశృంఖలత్వం
ఆడతనాన్ని మగ సమాజం బోనులో నిలబెట్టి
ప్రశ్నిస్తుంటే
ఇంకా పంజరాన్ని కౌగిలించుకోవడం వెర్రితనం
అమతనాన్ని కూడా అపహాస్యం చేసి
ఆక్టోపస్ సౌందర్య వాణిజ్యంలో
వలువల్నీ విలువల్నీ వేటాడుతున్నది.
వర్తమాన ప్రకటనల అంకెల ప్రపంచమే

అని ఆవేదన వెలిబుచ్చారు.

సామ్రాజ్యవాదపు బానిసత్వం ఆహారపు అలవాట్లు దగ్గర నుంచి అపూర్వమైన ప్రేమపూర్వకమైన మానవ బంధాల దాకా పరాయికరణకే దారి తీస్తుంది. కోల్పోతున్న అనుబంధాలను గురించి కవితలే ఈనాడు ఎక్కువ రాయబడుతున్నాయి. ఈ నేపథ్యం నుంచి జి.వి. సుబ్బా రావు "ఒక చేవ్రాలు కోసం" అనే కవితలో

"పాలుతాగి రొమ్ముగుద్దేవాడికి
అ - అంటే అమ్మనీ
ఆ - అంటే ఆప్యాయతనీ
వద్దొద్దు
అ - అంటే అమెరికా అమ్మకం
ఏరా రారా అని పలకరింపులుల్లేవు
రా రమ్మని పిలువడాలూ లేవు
అంతా వ్యాపారమే"

ఈ విధంగా ప్రపంచీకరణ నేపథ్యంలో భాగంగా తెలుగు సాహిత్యంలో కవిత్వం తన వంతు కృషి చేసింది. అనేక రకాల వస్తువులను వస్తువుగా చేసుకొని రచనలు సాగించారు.

❖ ❖ ❖

తెలుగు కవిత – ప్రపంచీకరణ ప్రభావం

– ఎలగొండ రాములు, తెలుగు పండిట్, జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ స్కూలు - ఇటికాలపల్లి, నర్సంపేట మం॥, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ.

'ప్రపంచీకరణ'... ఇటీవల బాగా వినిపిస్తున్నమాట. దీనిని ఇంగ్లీషులో 'గ్లోబలైజేషను' అంటున్నారు. ప్రపంచం మొత్తం ఒక కుగ్రామం అయిందంటున్నారు. ఆధునిక సాంకేతికత వలన ఇది సాధ్యమయింది. ఆధునికత పేరుతో అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తుందంటున్నారు. లాభంతో పాటు కష్టనష్టాలు కూడా ఉన్నాయనేది వాస్తవం. ఇట్టి వాస్తవికత తెలుగు కవితలో ఎట్లా ప్రతిబింబించిందో తెలుపడమే ఈ వ్యాసోద్దేశం.

'ప్రపంచీకరణ'... నిర్వచనం... "ప్రపంచంలో వివిధ దేశాల ప్రజల మధ్య, సంస్కృతుల మధ్య పరస్పరాధారిత, పరస్పరానుబంధాలు ఏర్పడటం ప్రపంచీకరణ."

"పేదదేశాలను మరింత కొల్లగొట్టి, తాము మరింత లాభపడేటందుకు సంపన్నదేశాలు సాగిస్తున్న ఆధిపత్య వ్యూహమే ప్రపంచీకరణ."

తెలుగు సాహిత్యంలో 'ప్రపంచీకరణ' అనేది ప్రధాన ఇతివృత్తంగా మారింది. తెలుగు కవితపై ప్రపంచీకరణం ఎట్లా ప్రభావాన్ని కలిగించినదో తెలిపే ప్రయత్నమిది.

కవిత్వాన్ని చదివేముందు ఆ కవిని చదువాలి. ఆ కవిని చదివేముందు ఆ కవి బతుకుతున్న కాలాన్ని చదువాలి. కాలాన్ని చదువటం అనగా ఆ కాలంలో కవి జీవించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ.... మొదలగు పరిస్థితులను అవగాహన చేసుకోవాలి. అప్పుడే ఆ కవినీ, ఆ కవితనూ, ఆ సామాజిక స్థితినీ మనం అర్థం చేసుకోగలుగుతాము.

ఇవాళ పల్లెకు రెండే రెండు దిక్కులు మిగిలాయి. ఒకటేమో పట్నానికి బతుకుతెరువు కోసం, రెండోది అడవికి బతుకు పోరు కోసం అంటాడు ఒక కవి -

"పల్లెకివాళ రెండే దిక్కులు
ఒకటి పట్నానికి – రెండోది అడవికి
పట్నం చందమామ జాడ చెప్తుంది
అడవి సూర్యుని జాడ చెప్తుంది
ఏ దిక్కైనా ఖచ్చితంగా బతకడానికే" (అన్వర్)

ఈ తరం వారు ఊరిమీద దిగులుపడుతున్నారు. రేపటి తరంవారు ఊరునే మర్చిపోయే ప్రమాదం ఉంది అంటున్నాడు కవి -

"ఈ మధ్య మా ఊరు
నన్ను చూసి బెదిరిపోతున్నది
విశ్వ ప్రవాసిని కదా
మా వూరి సంగతులు వినడానికి
నాకిప్పుడు శ్రోతలు లేరు
రేపు నా మనుమడేమన్నా వింటాడేమో చూడాలి..."
(డా॥ ఎన్.గోపి)

తన వూరి జ్ఞాపకాలను చెరిపేసుకోలేకపోతూ ఆవేదన చెందుతున్నాడు మరో కవి -

"ఇప్పుడు మా ఊరికే గండిపడ్డట్టుంది
చెమ్మలేని గుండెతో చెరువు తల్లడిల్లుతోంది
ఇప్పుడు మా ఊరికే అలుగుపడ్డట్టుంది
పట్నం తీక్షణతకు చెరువు గుండె నెరెలు బారింది
ఎండిపోయిన తల్లి వక్షం మీద పడిపోయి
తల్లడిల్లిపోతున్న పసిపాపల్లా
చెరువు తల్లి గుండెల్లో ముడుచుకొని పడివున్న
మూగజీవాలు..."
(దిలావర్)

నా దేశం పల్లెల సౌందర్యాన్ని కోల్పోతున్నది. రోజు

రోజుకూ నా పల్లె పరాయితనం అంటించుకొని కుమిలి కుమిలి పోతున్నదని కవి వాపోతున్నాడు -

"పల్లెల్ని కోల్పోతున్న దేశపటం
పరాయి ఎలుకల పంటికొరుకుళ్ళకు
చిరుగుతున్నది
కనపడని ఇనుప పాదాల హూంకరింపులకు
వణికిపోతున్నది
పల్లెలు పరాయి వవుతున్నాయి
నా పల్లె సౌందర్యాన్ని
నడమంత్రపు సిరి విసిరి విసిరి కొడుతున్నది..."
(డా॥ కలువకుంట్ల రామకృష్ణ)

ఇప్పుడు పల్లె సంగతులన్నీ చెరిగిపోని పుట్టుమచ్చలే కదా! అంతా దిగులు, గుండెల్లో గుబులు అంటోంది ఒక కవయిత్రి -

"మోదుగాకు సుట్ట సువాసండ్లు
యెద్దోలె పొద్దెల్ల అద్దుకున్న సెమట సెంట్లు
తాటికల్లు, పుల్లతియ్యలు
కలిగెంబలిగెంగా
కలగలిసిన సుగంధాలు
గుమ్మెక్కిచ్చిన గురుతులు
మనవూరి వొంటె మీద సెరిగిపోని పుట్టుమచ్చలే...
గిప్పుడు పల్లె యెల్లిపోయి నిల్లాయె
కందులు గొట్టిన కల్లమాయె...." (జూపాక సుభద్ర)

'ఆకాశంలో కాళ్ళు తెగిన ఒంటె లాగుంది జాబిల్లి' అన్నాడు శ్రీశ్రీ. అదే ఆకాశాన్ని తన స్వంత ఊరితో పోల్చి మరో కవి ఇలా అంటున్నాడు -

"చంద్రుడా! నీవు లేని కొత్తపల్లి ఆకాశం
మన ఊరి సుంకడు ఊడ్చి పోగుచేసిన
చెత్తకుప్పలా ఉంది
పేదవాడు కప్పుకునే చిరిగిన దుప్పటిలా ఉంది
తూట్లు పడ్డ అప్పడాల మూకుడులా ఉంది
కుష్టురోగి అరచేయిలాగుంది..."
(టి. కృష్ణమూర్తి యాదవ్)

వ్యవసాయ జీవితంపై ప్రేమ, శ్రమ సంస్కృతిపై ఆదరణ, మానవ సంబంధాలపై ఎనలేని గౌరవం వెరసి గ్రామీణ జీవితం, ఆ గ్రామీణ వాతావరణమే ధ్వంసమై బతుకుతెరువుకోసం పడిగాపులు కాస్తున్న వైనం -

"పంట బండెక్కే నాటికి రైతు పాడెక్కే స్థితిలో ఉన్నాడు
గుప్పెడు గింజలేసి కుంచాల కొద్దీ వడ్లు కొలిచిన చేతులు
ఎక్కడో గంజుడు కాడ్ల మధ్య బస్తాలెత్తుకున్న వీపులయి పనికోసం
పడిగాపులు కాస్తున్నాయి...." (వఝుల శివకుమార్)

ప్రపంచీకరణ వలలో పడి మా పల్లె పత్రహరితం కోల్పోయి నిర్వీర్యమై కనిపిస్తోంది - అంటూ కలవరపడుతున్నాడు కవి -

"పల్లెపై ప్రపంచీకరణ వల విసిరింది
పత్రహరితం పీల్చేందుకు ఉపగ్రహ ప్రసారాలు
టెలివిజన్ తెరలోంచీ బుద్ధిమాంద్యపు గుళికలు
కల్లోలం చేస్తున్నాయి
పల్లె ప్యారిస్‌తో కలయిక ఊరు యూరప్‌తో జత...."
(అన్నవరం దేవేందర్)

'ఈ పట్నాలన్నీ పాడుగానూ, మా వూరిప్పుడు ముసలి వగ్గైంది, నా బంగారు బాతును ఆశపడి కోసిందెవరు? ఎవర్ని నిందించి ఏం లాభం...' అంటూ ఆక్రోశిస్తున్నాడు కవి -

"మా వూరిప్పుడో ముసలి వగ్గు
పట్నాలు పాడుగానూ
మిద్దిండ్లను మింగిన సిమెంటిండ్లు పాడుగాను
పూరిండ్లను మింగిన రేకిండ్లు పాడుగాను
లారీలు పాడుగాను
మా గుండెకాయ పగిలిపోయే
నా తల్లి సున్నిత నాడీమండలాన్ని తెంచిందెవరురా?

నా ఆత్మీయురాలి పెదవుల మీద నిరంతర జలనిధిని
ఆరిపిందెవరురా?
నా బంగారు బాతును ఆశపడి కోసిందెవరురా
ఎవర్నని అడగాలి?" (సుంకిరెడ్డి నారాయణరెడ్డి)

గ్లోబలైజేషన్ నా పల్లెను మాయం చేసింది. నాకు ఏం మిగిలింది. ఏమి మిగల్లేదు - అంటూ బాధ పడుతున్నాడు కవి -

"గాలిస్తున్న
గ్లోబలైజేషన్ జల్లెడలో
పల్లె జరజరా జారింది
యింకేం మిగిలిం దక్కడ?
గిడసబారిన చేలో గుడ్లప్పగించిన దిష్టిబొమ్మ
కుక్కి మంచమ్మీద ముసలి అమ్మ..."

(ఎం. విజయభాస్కర్)

నేడు పల్లెతల్లి అణువణువునీ గ్లోబల్ మహమ్మారి కమ్మేసింది. రోడ్లు, కరెంట్, కేబుల్ వచ్చాక పల్లె పట్నంలా షోకులాడి అయింది. ఇప్పుడు పల్లెల్లో పట్నం షోకులు పంచరంగుల్లో కన్పిస్తున్నాయంటున్నారు ఒక కవి -

"నా పల్లె పొలిమేరల్లో గాలి విలాపరాగాలు
ఏటి గట్టున చిట్లిన నేల విషాద చిత్రాలు
పల్లె చెక్కిళ్ళమీద దీనంగా జారే కన్నీటి చుక్కలు
మోటబావుల మీద ముళ్ళ జెముడు దివిటీలు
ఓ పల్లెతల్లీ!
ఎడారి మంటల పరదాలు కప్పుకొని ఊపి రాడకున్నవో కదా!..." (డా॥ రూప్‌కుమార్ డబ్బీకార్)

రాజకీయ కాలుష్యం పల్లెకు సోకింది. కులాల కుంపట్లు చిచ్చు రగిలిస్తున్నాయి. మతాలు మారణ కాండను సమర్థిస్తున్నాయి. ఈ అమానవీయ విద్వేషాల మధ్య మాఊరు చచ్చిపోయిందంటున్నారు సంగబొట్ల అనే కవి -

"అవును! మత విద్వేషం మశూచిలా సోకి
ఊరు చచ్చిపోయింది
వరసలు కలిపి – కుశలమడగాల్సిన గొంతులు
కులమతాల విద్వేషంతో కాలిపోతున్నాయి
ఇప్పుడే ఊరు గలగల సెలయేటి చైతన్యం కాదు
పంట పొలాల మధ్య వెక్కిరిస్తున్న దిష్టిబొమ్మ
అమానవీయ విద్వేషాల మధ్య మా ఊరు చచ్చిపోయింది..."

(సంగబొట్ల సాయి ప్రసాద్)

తన ఊరంటే ఓ కవికి ఎంత ప్రేమో, ఎంత అపురూపమో అలాంటి ప్రేమాభిమానాలతో పెనవేసుకున్న వూరిలో పెనుమార్పులు సంభవిస్తుంటే, ఆ కవి తట్టుకోగలడా? ఓ వైపు ఆపేక్ష, మరోవైపు ఆవేదనతో మావూరొస్తావా... అని అడుగుతూ -

"నా ప్రియమైన పెరుగన్నం సాక్షిగా
ఊరు ఊరంతా ఒకే పురుడు, ఒకే పెండ్లి, ఒకే చావై వుండేది
ఇప్పుడేమో ఒంటినిండా గాయాలు
ఇండ్లచుట్టూ కంచెలు
మా బాల్యాన్నీ, తెగిన కాళ్ళనీ, తెగిన చేతుల్నీ తిరిగిస్తావా?" (హనీఫ్)

కాలే కడుపు నింపుకోవడం కోసం, కన్న తల్లిని సైతం వదిలిపెట్టి వలసపోవడం నేడు సర్వసాధారణ విషయం అయింది. కవిని కలవరపెట్టిన ఇదే విషయం ఇలా కవిత్వీకరించారు -

"తల్లి కొంగు నీడ నుండి తరలిపోతున్న కొడుకుల కడుపులో బాధ మెలిపెట్టినట్లుగా గెదిమి కొట్టబడుతున్న బిడ్డలు
ఇప్పుడు పచ్చని బతుకు మలమల మాడిపోతుంది
ఇప్పుడు వెచ్చని గూడు
చెట్టు కొకరు పుట్టకొకరుగా తల్లడిల్లుతుంది
ఇప్పుడు నిలువెత్తు పద్యం నిట్టనిలువునా పడి పలవలా ఏడుస్తుంది!"

(జూకంటి జగన్నాథం)

సామాజిక విలువలకు క్రమక్రమంగా దూరమౌతోంది నేటి పల్లె. మానవసంబంధాలన్నీ నిర్వీర్యమై ఆర్థిక సంబంధాలు బలపడుతున్నాయి. ఆ పల్లె బరిలో పెరిగి, అక్షరాలు దిద్దుకున్న కవులందరూ దాదాపు పట్నాల్లో ప్రవాస జీవితం గడుపుతున్నవారే - అంటున్నారు ఒక కవయిత్రి -

"నేను కలలుగన్న నా పల్లె - ఏమిటిలా మారింది
ఎవరు నా తొలికోడి గొంతు నిలా నులిమింది?
ఎవరు నా గోధూళివేళను దోచుకొంటోంది?
ఎవరు నా రంగవల్లి నిలా చెరిపేసింది?
ఎవరు నా తెలుగు పాటనిలా తగులబెడు తోంది?...." **(జ్యోత్స్న)**

పల్లె మనకు తల్లి ఒడి, ప్రకృతి బడి. ఆ బడి నేడు దయనీయ స్థితిలో ఆదురోవాలని చేయిసాచి అడుగు తోంది. నేడు పల్లెటూరి జీవన విధానంలో సాంస్కృతిక పతనం ప్రారంభమైంది అంటున్నారు కవి రాధేయ -

"అమాయకత్వానికి అచ్చమైన ప్రకృతిలా
ఇక్కడో పల్లెపట్టు ఉండాలి
ఇప్పుడు కన్పించదేమిటి?
నేనెక్కడికి వచ్చాను?
నా ఊరు నాకు పరాయిదైందా?
నేనీ ఊరికే పరాయినయ్యానా!..."
(రాధేయ)

తన ఊరి చిత్రపటాన్ని ప్రపంచ దరిద్ర పటంలో సరిచూసుకుంటూ ఆవేదన చెందుతున్నాడు మరో కవి-

"ఊరిప్పుడు అచ్చం
ప్రపంచ దరిద్రపటం తీరున్నది
ఎక్కడ చూసినా కాలు మోపరాని
కాలుతున్న కపాలాల కమురువాసనే
బతుకు నివ్వరు - బతకనియ్యరు
మెతుకును కొనగోటితో తాకనియ్యరు
ఊరంతా ఇప్పుడు సగం కాలిన మనిషి తీరున్నది
సగం చెక్కిన బొమ్మ తీరున్నది...."
(ఉదారి నారాయణ)

పట్నం బతుకుతో రాజీపడలేని ఎందరో వలస జీవుల వ్యథను ఇలా కైగట్టారు చికోలు కవి -

"ఊరు మారింది - తీరు మారింది - ఉనికి మారింది
సామూహిక గానం వైపు సాగాల్సిన పయనం
ఒంటరి గొంతులా మిగిలిపోతోంది
ఏ ఇల్లుకాఇల్లు వేరే కొత్త వ్యవస్థను కంటోంది
రాజీపడలేని వారికి గుడ్‌బై చెబుతోంది...."
(చికోలు సుందరయ్య)

ఈ విధంగా తెలుగు కవితపై ప్రపంచీకరణ ప్రభావం ఎంతగానో ఉన్నది. గ్రామీణ వాతావరణాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రపంచీకరణ కరాలనృత్యాన్ని ఈ వ్యాసంలో విశ్లేషించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు పసిడి (112 వ్యాసాల సంకలనం - అక్టోబర్ 2006)
2. ఆధునిక సమాజంలో గిరిజన భాష - సంస్కృతులు (16 వ్యాసాల సంకలనం 2012)
3. ఆంధ్రభారతి (60 వ్యాసాల సంకలనం - ఏప్రిల్ 2018)

❖ ❖ ❖

స్త్రీ - నాటి నుండి నేటి వరకు ఒక అవలోకనం

- సోనబోయిన సతీష్, తెలుగు అధ్యాపకులుశ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్.

తల్లి మనిషికి మొదటి దైవం ఈ లోకంలోకి దారి చూపిన దివ్య ద్వారం. క్షమాగుణానికి, ఓరిమికి మారుపేరు తల్లి. వాత్సల్యానికి చివరి హద్దు మాతృమూర్తి. తన దేహంతో నవమాసాలు మోసి, మన శరీరంలోని ప్రతి అణువునూ రూపుదిద్దేది తల్లి. మన ఆకారానికి, మనలో ఉండే వివిధ శక్తులకు, మన తెలివికి, మనం సాగించే ఆలోచనలకు కూడా మూలం అమ్మే. అమె తన ప్రాణాన్ని పణంగా పెట్టి, తన శరీరాన్ని పంచి మనలను తయారు చేసింది.

అమ్మ దయలేనిదే నిజానికి మనం లేనే లేము. పుట్టి స్వతంత్రంగా పెరుగుతూ సొంత ఆలోచనలతో రకరకాల పోకడలకు పోయే ప్రయత్నం చేస్తున్న మనలను ఎత్తుకొని లాలించి, పాలించి, బుజ్జగించి, నచ్చజెప్పి మంచి సంస్కారాలను మనలో నింపేది అమ్మే. ఉగ్గుపాలతో తారంగం తారంగం అంటూ గుడ్డుడమ్మా గుమ్మడి అంటూ రకరకాల పద్ధతులతో మనకు ఆట, మాట నేర్పి పడుతూ లేస్తూ ఉండే వయస్సులో చక్కటి నడకతో పాటు ఉత్తమ సంస్కారాలను మనలో నింపేది అమ్మ.

చందమామను పిలిచి, కాకమ్మను చూపి, పక్షులను, ప్రకృతిని మనకు చూపిస్తూ పరవశులను చేసి వెండి గిన్నెలో చారు, బువ్వ గోరుముద్దలుగా తినిపించి, తియ్యటి ప్రేమతో పెంచి పెద్దచేసేది అమ్మ.

దైవం తెలియని జీవులు ఉండవచ్చేమో కానీ అమ్మనెరుగని ప్రాణి ఉండదు. మనుష్యులలోనే కాదు ఏ ప్రాణిని చూసినా ప్రాణం పోసి జీవాన్నిచ్చిన తల్లుల కుండే ప్రేమకు ఆకాశమే హద్దు అనిపిస్తుంది. కొందరు తెలివిలేని పిల్లలు ఏమిచ్చింది నాకు మా అమ్మ, ఈ ప్రపంచంలో కని పారవేయడం తప్ప! అంటూ అర్థ రహితంగా మాట్లాడుతారు. ప్రపంచంలో చేసే ఉపకారా లన్నింటి కంటే 'జన్మను ఇవ్వడం' అనే ఉపకారం మరి దేనికీ సరిపోదు. అది గుర్తించడం చేతగాని బ్రతుకులు వ్యర్థమే. అటువంటి వారిని భూమి మోయడం శుద్ధ దండగ, తల్లి చేసిన ఉపకారానికి ప్రత్యుపకారమే లేదు. ఏమి చేసినా అది తీరేది కాదు. అందుకే వేదం కూడా 'మాతృదేవోభవ' అంటూ దైవం కంటే, 'అగ్రపూజ మాతృ మూర్తి'కే నిర్ణయించి తల్లిని మించిన దైవమే లేదని చెప్పింది.

లేవగానే మాతృవందం చేసుకొని, ఆ తల్లి అనుగ్రహంతో తన దైనందిన కార్యక్రమంలోకి ఉపక్రమించే వ్యక్తికి అపజయం ఉండదు. ఈ ప్రపంచంలో తల్లి ఆశీస్సులకు మించిన శక్తి మరొకటి లేనేలేదు.

తల్లి ఒడిలోని వెచ్చదనానికి మించిన రక్షణ ఇంకే ముంది? పిల్లవాడు క్రింద పడి, గాయమైనపుడు లేచిన వెంటనే తల్లి దగ్గరకు పరుగెత్తి అమె ఎదలో తల దాచు కుంటాడు. తల్లి ఎదలో మాత్రమే సురక్షిత స్థలమని అతనికి అనాలోచితంగానే తెలుస్తుంది. అక్కడ మాత్రమే ఓదార్పు లభిస్తుందని పిల్లవాడు భావిస్తాడు.

అతనికే కాదు, ఎవరికైనా జీవితంలో బాధ, దుఃఖం ఎదురైనపుడు తల్లి వైపుకే తిరుగుతాం. దానికి కారనం గర్భంలో ఉన్న తొమ్మిది నెలలూ, పాలు త్రాగేటప్పుడూ ఆమెతో కలిసి ఆమె ప్రార్థనలు, కలలు, ఆలోచనలు, ఉద్వేగాలు, ప్రేమ అన్నింటినీ పంచుకోవటం, అందుకే తల్లి రక్షణ స్థావరంలా కనిపిస్తుంది బిడ్డకు.

మగమనిషికి ఆరేళ్ల వాడైనా, అరవైయేళ్ల వాడైనా చిన్న బిడ్డే. అతనికి స్త్రీ యొక్క మార్గనిర్దేశకత్వం అవసరం. తల్లి గర్భం ధరించినప్పుడు, బిడ్డను సాకుతున్నప్పుడు, వాళ్ళు పెళ్లి చేసుకొని వెళ్ళిపోయేటంత వరకూ మాత్రమే తల్లి అని మనుష్యులు భావిస్తారు. కానీ అమె మరణించే వరకూ, బిడ్డ మరణించేవరకు తల్లి తల్లే.

ప్రపంచంలో స్త్రీ శక్తి గొప్పది. మానవసృష్టి ప్రారంభం నుండి ఇప్పటి వరకు సమాజ వికాసానికి తన క్రియా కలాపాన్ని కొనసాగిస్తున్నది. ఈ సృష్టిలోని ప్రతి అణువు చుట్టూ పరిభ్రమిస్తున్నది. అందుకే ఈ జగత్తుకు మూలకారకురాలిగా ముగ్గురమ్మల మూలపుటమ్మగా ఆదిశక్తిగా కొలవబడింది స్త్రీ శక్తి.

మన భారతీయ సంస్కృతికి మూలకందాలు తొలి విజ్ఞాన భాండాగారాలైన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, శాస్త్రాలు, సమస్త కావ్య ప్రపంచం స్త్రీ మూర్తిని అత్యున్నత స్థాయిలో అభివర్ణించడం మనం గమనించవలసింది.

ఆదిమ కాలంలోనే వేదాలలో పేర్కొన్నట్లు కాత్యాయనీ, గార్గి, ఇంద్రాణికి అపాల, లోపాముద్ర, అనసూయ, అరుంధతి వంటి సాధ్వీమణులు, రాణీ రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, పల్నాటి నాగమ్మ వీరవనితలను కన్న దేశం మనది. ఈ స్ఫూర్తి, ఈ చైతన్యం ఈనాడు సమాజంలోని స్త్రీ పురుషులందరికి ఎంతో అవసరం.

స్త్రీ ప్రేమ స్వరూపిణి. సమస్త ప్రపంచాన్ని తన ఒడిలో పెట్టుకొని సంరక్షించగల మహాసాధ్వి ఆమె. అందుకే మానవ ప్రపంచం ఆమెను తల్లిగా, ధాత్రిగా, దేవతలుగా, తల్లిగా భావించి ఆరాధించింది. కానీ స్త్రీ యొక్క కథ ఒకటి చాలు. ఆమె తన కంటి చూపుతో త్రిమూర్తులను కూడా చంటి పాపలుగా చేసి ఓలలాడించిన ఘటన మరువలేనిది.

తన అనురాగంతో, వాత్సల్యంతో, స్నేహంతో పురుషున్ని దివ్య లోకాలకు తీసుకుపోయి పునీతుడిని చేయగల మాతృమూర్తి ఆమె. తాను సృష్టించిన పురుషునికి నాలుగు దిక్కులై తల్లిగా, భార్యగా, చెల్లెలుగా, కూతురిగా నిత్యం పరిరక్షించే త్యాగమూర్తి ఆమె.

పురుషుడు తల్లిలో మాతృభావాన్ని, భార్యలో దాంపత్య భావాన్ని తన తోడబుట్టిన చెల్లిలో స్నేహభావాన్ని, కూతురిలో వాత్సల్య భావాన్ని కలిగి ఉంటాడు.

జన్మనిచ్చిన తల్లికి, పుట్టిన దేశానికి నమస్కరించడం మన సంస్కారానికి నిదర్శనం. అందుకే జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అన్న వాల్మీకి రామాయణ వాక్కు మానవ కోటికి శిరోధార్యమైంది.

మాతృస్వామ్యం – స్త్రీ స్వామ్యం :

క్రీ.పూ. 600 సం॥ కాలాన్ని ఆదిమ దశగా పేర్కొనవచ్చు. ఈ కాలంలో ఇంతకు ముందు కూడా మాతృస్వామ్యం అమలులో ఉండేది. అంటే ప్రస్తుత కాలంలోని పురుషాధిక్యత సమాజాన్ని వ్యతిరేకంగా మాతృమూర్తికి ఆధిక్యం ఉండేది. స్త్రీ కుటుంబ పెద్దగా, గుంపు సమూహాలకు నాయకురాలిగా ఉండేది. తల్లి నాయకత్వంలోనే ఆహార వేట ఉండేది. గుంపుల మధ్య యుద్ధాలు జరిగేవి. మహిళ నాయకత్వంలో ఒక గుంపు వేటాడి ఆహారం సంపాదించుకొనేది. తెచ్చిన ఆహారం నాయకురాలు అందరికీ సమానంగా పంచి ఇచ్చేది. మాతృస్వామ్య కుటుంబాలలో రక్త సంబంధీకులైన స్త్రీ పురుషులతో స్వేచ్ఛాయుత సంబంధాలు ఉండేవి. స్త్రీ, పురుషులు తాత్కాలికంగా జంట సంబంధాలు ఏర్పడడం జరిగింది. పశుసంపద కాలక్రమేనా పెరుగుతున్న కొద్ది స్థిరత్వం కోసం జంటలుగా నివసించడం ఆరంభం అయింది. స్త్రీ పురుషుడు, పశు సంపద వారి సంతానంతో కూడిన కుటుంబం అప్పటికి రూపం దాల్చింది. కుటుంబ వ్యవస్థ ఏర్పడింది.

పశువుల సంపద పెరుగుతుండగా గుంపులో ఆదివాసి తెగలలో దాడులు జరుగుతుండేవి. వారిలో గుపుంలో మగవారిని చంపడం ఆనాటి ధర్మం. ఓడిపోయిన గుంపు స్త్రీలు గెలిచిన గుంపులో బానిసలుగా వుండేవారు. కొంత మందిని మాత్రం భార్యలుగా స్వీకరించడం జరిగింది.

స్త్రీ పురుషుల బాధ్యతలో మార్పులు జరిగి పురుషుడి ఆధిపత్యం మొదలై "మాతృస్వామ్యం" నుంచి క్రమేణ "పితృస్వామ్యం" ఆరంభమైంది. కుటుంబంలో స్త్రీ ఇంటి బాధ్యతలను తల్లి నిర్వహించేది. తండ్రి వ్యవసాయ పనులు నిర్వహించడం జరిగేది.

ఎక్కడ స్త్రీ పూజించబడుతుందో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని మన ధర్మశాస్త్రంలో చెప్పబడింది.

బాల్యంలో తల్లి కట్టుబాట్లలో ఉండి, తండ్రి రోనలో ఉండాలి. యవ్వనంలో భర్త చెప్పినట్లు వింటూ భర్త రక్షణలో ఉండాలి. వృద్ధాప్యంలో కుమారుని సంరక్షణలో ఉండాలి స్త్రీ.

పునర్వివాహం లేని వితంతువు :

త్రేతాయుగం, ద్వాపరయుగంలో కూడా స్త్రీని పురుషుడి సొంత ఆస్తిగా భావించారు. సమాజం కల్పించిన సంప్రదాయాలను పాటిస్తూ, కట్టుబాట్లకు లోనై ధర్మాలు పాటిస్తూ స్త్రీలు వ్యక్తిత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని కోల్పోయి తమ ఉనికినే మరిచిపోయేలా చెయ్యడం జరిగిందనే చెప్పవచ్చు. భారతీయ సంప్రదాయ ఆచార వ్యవహారాలు కొనసాగించడానికి స్త్రీలే కారణం. అలాంటి స్త్రీకి మగ బిడ్డను కన్న స్త్రీలను గౌరవంగా చూడడం, ఆడపిల్లలను కన్న స్త్రీలను చులనకగా చూడటం, పిల్లలు లేని స్త్రీని గొడ్రాలని కుక్కకంటే హీనంగా చూస్తున్నారు ఇప్పుడు.

భర్త చనిపోయినప్పుడు బ్రతికున్న భార్యను మానసికంగా చంపివేసే ప్రక్రియలు ఎన్నో జరుగుతున్నాయి. ఈ కాలంలో భార్య భర్తకు చెందింది. వితంతువులు బయటికి వెళ్లితే ఎందుకు వెళ్ళావు అని హీనంగా స్త్రీ అంటుంది. ఆఖరికి వారికి ఇష్టమైన తిండి కూడా పెట్టడం లేదు. తిననీయడం లేదు. ఇష్టపడే బట్టలు వేసుకోనీయకుండా తెల్లబట్టలు ధరింపచేస్తున్నారు. ఆమెను బ్రతికి వుండగానే శవంలా భావించే విధంగా చేస్తున్నారు. ఆమెలో ఏ మాత్రం ఆత్మవిశ్వాసం లేకుండా చేయడానికి ఆమె ఎదురువస్తే అమంగళం అని వితంతువు ముఖం చూస్తే దరిద్రం అని భావించేవారు. ఆమె ఇంటి వెనుక పనిచేసుకోవాల్సిందే. వితంతువు అందరికీ జీతం లేని బానిస. అందరూ తినగా మిగిలిందే తినాలి.

స్త్రీగా పుట్టడమే శాపమా? వితంతువుల జీవితం ఎంత దుర్భరమో వారికి తెలుసు. కనుక భర్త కోసం ఆయుష్షు కోసం అనేకమైన పూజలు, కఠినమైన వ్రతాలు చెయ్యాలి. కాని వారిని స్త్రీని స్త్రీలాగా చూస్తున్నామా చెప్పండి.

స్త్రీ రోగిష్టి అయిన భర్తను వదిలిపెట్టదు. కాని పురుషుడు స్త్రీ రోగిష్టి అయితే పురుషుడు వేరే వివాహం చేసుకుంటాడు. కానీ స్త్రీ చేసుకోదు. స్త్రీ జాతికి ఒక నీతి, పురుషుడికి ఒక నీతి. ఒకే మానవ జాతికి చెందిన స్త్రీ పురుషుల్లో ఇంత వ్యత్యాసమా? స్త్రీ బ్రతుకు ఇంత దుర్భరమా?

జీవిత భాగస్వామిని పోగొట్టుకున్న ఆమె ఎంతో బాధలో వుంటే ఈ సమాజం అవమానించడం, నీ భర్త చనిపోయాడు గనుక నీవు బ్రతికినా చచ్చినట్లే అని ఆమెకు చెప్పడం జరుగుతుంది. ఆమెకు ధైర్యం చెప్పాల్సింది పోయి ఆమెను ఇంకా బెదిరిస్తున్నాము. ఇది సమాజమా?

ఇవన్ని వితంతువుకు జరుపకుంటే కుటుంబంలోని సభ్యులకు కీడు జరుగుతుందని చెప్పి ఆమె ఇవన్నీ తనంతట తానే ప్రతిఘటించకుండా చేయించుకునేలా చేస్తున్నారు.

ఇలాంటివి ఆడవాళ్లు ఆడవాళ్ళ చేతనే అమలు చేస్తున్నారు. ఇవన్నీ స్త్రీలకు జ్ఞానం లేకుండానే జరుగుతున్నాయి. అసలు ఈ ఆచారం ఎందుకు పుట్టింది. స్త్రీలకు జ్ఞానం లేనందువల్ల కదా. స్త్రీలను మూర్ఖంగా ఇవన్నీ చూపిస్తున్నారు. సకేశి వండిన వంట మేం తినం అంటారు. సకేశి తల మీద వెంట్రుకలున్న వితంతువు అని అర్థం.

ఈ కాలంలో వీరేశలింగం పంతులు, రాజారామ్ మోహన్ రాయ్ లాంటి సంఘ సంస్కర్తలు రావాల్సిందే.

నీ భర్త పోయాడు. కనుక నీవు పెట్టుకున్న బొట్టు అలంకారాలు తీసివేయమనడం, ఆమెను ఎందుకు విధవరాలిగా రెండవ జాతి మనిషికి చూడడం ఆమెను ఎంతో బాధ పెడుతున్నారో సమాజం ఆలోచించాలి. తోటి స్త్రీలు ఆమె ఆత్మగౌరవం కాపాడాలి. ఎందుకంటే స్త్రీ పుట్టిన తరువాత పెళ్ళి, సంసారం తరువాత భర్త పోతే వైధవ్యం. పుట్టుకతోనే ఆమెకు అలంకారాలు ఉన్నాయి.

భర్త చనిపోయిన అంత మాత్రాన ఆమె మనిషి కాకుండా పోతుందా? వీటి అన్నింటి కోసం పసుపు కుంకుమ సృష్టించారా? పసుపు కుంకుమలు స్త్రీల జీవితంలోకి భర్తతో వచ్చినవా?

స్త్రీల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసం చెయ్యాల్సింది స్త్రీలే కనుక స్త్రీలు విజ్ఞానం సంపాదించాలంటే చదువుకోవాల్సిందే.

అబల కాదు స్త్రీ సబల :

స్త్రీ సహజంగా సహనశీలతను కలిగి ఉంటుంది. ప్రతి స్త్రీలో మాతృమూర్తి ఉంటుంది. చిన్నప్పటి నుంచే అమ్మాయిలో అమ్మ లక్షణాలు కనిపిస్తాయి. చిన్నప్పటి నుంచే తమ్ముళ్ల పట్ల, చెల్లెల్ల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తుంది. స్త్రీ హృదయం లొంగిపోయేది ప్రేమకే. తమ కుటుంబంలోని వ్యక్తుల కోసం తన ఇష్టాఇష్టాలనుకు తావివ్వకుండా తల్లిదండ్రుల ఇష్టప్రకారం నడుచుకొంటుంది. స్త్రీ అంటేనే త్యాగం. తన సంతోషాన్ని ఇతరుల సంతోషానికి సంతోషంగా ధారపోస్తుంది. స్త్రీ ఇంట్లో వారినందరినీ ప్రేమిస్తూ అందరికీ ప్రేమ పంచుతూ వారి స్థానాలను గౌరవిస్తూ కుటుంబంలో అందర్ని ఒకరిగా అందరూ ప్రేమతో ఉండేటట్లు చేస్తుంది స్త్రీ.

స్త్రీ బాధను అనుభవించే శక్తి నొప్పి భరించే శక్తి శరీరానికి వుంది. కాని పురుషుడికి లేదు. ఎందుకనగా మానవశాస్త్ర పరిజ్ఞానం చెబుతుంది. పురుషునికి 7 డాల్స్ మాత్రమే ఉంటుంది. కానీ స్త్రీకి మాత్రం 10 డాల్స్ వరకు భరించే శక్తి ఉంటుంది.

స్త్రీ యొక్క మానసిక శక్తికీ ఓర్పుకూ కొలబద్ద లేదు. ఆ శక్తినికి నిర్ణీతంగా కొలవడానికి ప్రపంచంలో ఏ కొలబద్ద లేదు. సరిపోదు కూడా. అత్యవసర పరిస్థితులలో పురుషుని కంటే స్త్రీ ఎక్కువ గుండె నిబ్బరం వుంటుంది.

స్త్రీలకు ఇచ్చిన డబ్బును మాత్రం వారు ఒక్క పైస మాత్రం వృథా చేయరు.

స్త్రీ పురుషులు ఇద్దరూ ప్రకృతిలో భాగమే. స్త్రీ లేకపోతే పురుషుడు లేడు. పురుషుడు లేకపోతే స్త్రీ లేదు. ఇద్దరిలో ఏ ఒక్కరు లేకున్ననూ సృష్టి లేదు. పురుషుని జీవితం అంతా స్త్రీ కోసమే తపిస్తుంటుంది. ఎంతటి మహా పురుషుడయినా చక్రవర్తి అయినా ఇంద్రుడైనా, స్త్రీకి జన్మించిన వాడే.

పురుషునికి ప్రప్రథమ గురువు స్త్రీ మూర్తి. పసివాడై, పెద్దవాడై, కార్యసాధకుడై, కార్యశీలుడైనను తల్లి అయిన స్త్రీ మూర్తిని ప్రేమిస్తాడు, గౌరవిస్తాడు. స్త్రీ లేనిచో పురుషుడు జీవించలేదు.

ప్రపంచంలో అన్ని ఉన్నా స్త్రీ లేకపోతే పురుషుడికి అంతా శూన్యమే. ఏం చేసినా ఏ వృత్తిలో ఉన్నా తన భార్యను, భార్య ద్వారా కల్గిన సంతానాన్ని పోషించడానికి కదా! సుఖపడేది స్త్రీ తోనే, సేద తీరేది స్త్రీ చెంతనే, స్త్రీ లేకపోతే ఎవరిని చూసి సంతోషిస్తాడు. ఎవరికోసం కష్టపడతాడు. ఎలా సుఖపడతాడు, ఎవరికి రక్షిస్తాడు. ఎవరిని సంరక్షిస్తాడు, పురుషుడి జీవితం అంతా స్త్రీతోనే ముడిపెట్టుకొని ఉంటుంది.

ఆధార గ్రంథాలు :

1) మన ఊరి ఆశ
2) చెల్లెలా!
3) తరతరాల స్త్రీ
4) స్త్రీయే వెలుగు
5) ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీ వాద భూమిక
6) సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి

❖

తెలుగు కథలలో, కుటుంబ వ్యవస్థపై ప్రపంచీకరణ ప్రభావం - సాహిత్య విమర్శ

– సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

సమాజాన్ని ఒక వైపు అభివృద్ధి పదంలో నడిపిస్తూ ఇంకోవైపు దుష్పరిణామాలకు కారణం అవుతుంది ఈ ప్రపంచీకరణ ప్రముఖ రచయిత ముదిగంటి సుజాతరెడ్డి ప్రపంచీకరణ గురించి ఈ విధంగా చెప్పారు. ప్రపంచీకరణను ఆంగ్లంలో గ్లోబలైజేషన్ అంటారు. లాటిన్ భాషలోని గ్లోబస్ (Globus)అనే పదం నుండి Globe అనే పదం వచ్చింది. 1990 సం॥లో కొన్ని నిఘంటువుల్లో గ్లోబల్ అనే పదానికి తెలుగులో భౌగోళీకరణ, విశ్వీకరణ, విశ్వవ్యాప్తీకరణ, ప్రపంచీకరణ అనే పదాలు కనిపిస్తాయి. వీటన్నింటిలో కెల్లా ప్రపంచీకరణ అనే పదం వ్యవహారంలో స్థిరపడిపోయింది. ఈ గ్లోబలైజేషన్ అనంతాన్ని అణువుగా మనకు అందించింది. ప్రపంచాన్ని ఒక చిన్న గ్రామంగా మన ముందుకు తీసుకు వచ్చింది. సాంకేతిక అభివృద్ధి ఫలాలను సర్వమానవాళికి అందించే ప్రయత్నం కూడా చేసింది. అలాగే సామాజిక ఆర్థిక, సాహిత్యం మొదలైన రంగాలను కూడా ఎంతో ప్రభావితం చేసింది. రాను రానూ ధనాపేక్షకు గురౌతూ వస్తున్న సమాజం పోటీ ప్రపంచంలో తమ నిబద్ధతను కోల్పోయి నైతికతను మరిచి కనీస విలువల విషయంలో అద:పాతాళంలోకి పడి పోతున్నారు. ధనిక, బీద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అభద్రతా భావంతోనే తమ జీవనం గడుపుతున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ముదిగంటి సుజాతరెడ్డి రచించిన "విసుర్రాయి" కథను ఒక్కసారి పరిశీలిస్తే ఇందులో ప్రధాన పాత్రలుగా సక్కుబాయి, సుబ్బారావు, రజిత, పిల్లలు, ఇంటి యజమాని, ఇందులో స్త్రీ స్వేచ్ఛ ప్రధానంగా కనిపిస్తున్నా కూడా ప్రపంచీకరణలో భాగంగా పుట్టుకొచ్చిన విదేశీ వస్తువుల మోజులో వాటిన్నింటినీ కొనుక్కొని వాటిని దాచుకోవడానికి ప్రత్యేకంగా ఒక అల్మారా కేటాయించుకొని అందులో దాచుకుంటాడు సుబ్బారావు. ఇంటి పని, పిల్లల పని ఆలనాపాలన, వయస్సు మళ్ళిన అత్తను చూసుకోవడం కూడా సక్కుబాయి మాత్రమే చెయ్యాలి. ఈ పనులు అన్నీ తనకు సంబంధించినవి కావంటూ ఉద్యోగం చేస్తూ, విలాసాలు సంతోషాలు తాను చూసుకుంటుంటాడు. కుటుంబ భారం మొత్తం భార్యపై నెట్టి విలాసాల్లో గడుపుతుంటాడు. అంతర్లీనంగా ప్రపంచీకరణ వల్ల వస్తువులు కూడా కుటుంబ వ్యవస్థలపై తమ ప్రభావాన్ని ఏ విధంగా చూపుతున్నాయో తెలుపుతుంది.

అదేవిధంగా "విసుర్రాయి" సంపుటిలోని ఇంకో కథ "బందీ" ఇందులో అన్నపూర్ణ, ఆనంద్, కల్యాణి లతో కథ అంతా నడుస్తుంది. ఒక సంస్కృతి, సంప్రదాయాలపై అలవాటుపడిన జీవితం దానికి పూర్తిగా భిన్నమైన సంస్కృతులకు ఆధునిక సంప్రదాయాలతో మెలగవలసిన పరిస్థితుల నేపథ్యంలో తీసుకొని సాంస్కృతిక ప్రపంచీకరణ పరిణామ నేపథ్యంతో రాయబడింది ఈ కథ. అన్నపూర్ణ భారతదేశంలో ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన సాధారణ గృహిణి అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరంలో తన కూతురు కళ్యాణి, అల్లుడు ఆనంద్‌లు ఉద్యోగాలు చేస్తుంటారు. కూతురు డెలివరీకి సిద్ధంగా ఉందని చెప్పడంతో కొన్ని సంచుల నిండా పచ్చళ్ళు, బహుమతులు తీసుకొని వెళుతుంది. ప్రయాణ సమయంలో ప్రజల సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు

అన్నపూర్ణకు ఆసక్తిని, ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కూతురు ఇంట్లోని పరిస్థితులు ఆమెకు ఉద్వేగాన్ని, విచారాన్ని, బాధను కలిగిస్తాయి. డెలివరీ అయిన మరుసటి రోజే ఉద్యోగానికి వెళ్ళడం, పిల్లలను ముద్దు చేస్తూ ముద్దు పెట్టుకుంటే వైరస్ సోకుతుందని, నూనెతో మర్ధనా చేస్తుంటే ఎముకలు వంకరపోతాయని, ఆవిధంగా చెయ్యొద్దు అని చెప్పడం, ఆసుపత్రిలోనే లైలా అని ఆపాపకు పేరు పెట్టడం లాంటివి సంప్రదాయ గృహిణి అయిన అన్నపూర్ణకు జీర్ణం కావు. ఇలాంటి భిన్న సంస్కృతీ సంప్రదాయాల మధ్య నలిగిపోయే పాత్రలో అన్నపూర్ణ జీవిస్తూ ఇంకా మూడేళ్ళకు పైగా ఈ అమెరికాలో ఎలా ఉండాలో అని ఆవేదనతో బాధపడుతూ ఉండడంతోనే కథ ముగుస్తుంది. ఇందులో ప్రపంచీకరణ మానవ సంస్కృతి సంప్రదాయాలపై ఎంతటి మార్పునకు కారణం అయ్యాయో తెలుస్తుంది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో "నానీల' ప్రభావం కూడా ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో 'నానీల" సృష్టికర్త ఆచార్య ఎన్.గోపీ హైకూలను నిశితంగా పరిశీలించి వాటికన్నా మెరుగైనవి సమయోచితమయినవి రాయాలన్న తపనతో నానీలు రాశాడు. వీటికి నియమాలను కూడా తనే సృష్టించుకున్నాడు.

"పల్లె చెరువులో
తల్లి చేప
పట్నం ఎక్వేరియంలో
పిల్ల చేప "

ఇందులో అనంతమయిన అర్థం దాగి ఉంది. నగరీకరణపై వ్యామోహంతో పల్లెతనాన్ని విస్మరించడంపై నిరసనగా చెప్పవచ్చు. అదే విధంగా పల్లె లేనిదే నగరం లేదనే భావం కూడా తెలుపుతుంది.

సామాజిక బాధ్యతలో భాగంగా కొత్త ఆలోచనలు, నిజాలు, ఇజాలు, వారాలు, వివాదాలు, ఎన్నో కవితా రూపంలో వస్తురూపాలు అయ్యాయి.

చెరువులో
బంగళాలు మొలిచాయి
నీటి తల్లికి
ఇన్ని సమాధులా!

అనే ఈ నానీలో చెరువులను కబ్జా చేసి బంగళాలు కట్టుకున్న తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీటి తల్లికి కట్టిన సమాధుల్లా వాటిని పోలుస్తాడు.

అమె లేచి
సూర్యుడిని లేపాలి
అతడ్ని నిద్రపుచ్చాకే
ఆమెకు విశ్రాంతి

అని ఒక ఇల్లాలు సూర్యుడు ఉదయించక ముందే లేచి ఒక్కోపని చేస్తూ బయట పనులు చక్కబెడుతూ ఇంట్లో వారికి అన్నీ అమర్చుతుంది. మళ్ళీ తిరిగి సూర్యుడు నిద్రించాకే ఆమెకు విశ్రాంతి అని ఇలా ఎన్ని సేవలు చేసినా మగవాళ్ళకు ఆడవాళ్ళ పట్ల గౌరవం, కృతజ్ఞత లేవని చెబుతాడు. ఈ విధంగా ప్రపంచీకరణలో భాగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలలో చైతన్యం తీసుకురావడం కోసం ఆచార్య ఎన్. గోపి తన "నానీలు" రచించారు.

అదే విధంగా ప్రపంచీకరణ సరిగా అతికినట్లు ఈనాటి పరిస్థితులను "శ్రీకాంతా శర్మగారు" ఈ విధంగా తెలుపుతారు.

"మహా కాలుష్య కటాహంలో
మునిగి పోయివున్నాం
అడిగావు కనుక చెపుతున్నా
అంతరంగం జబ్బుగా ఉంది
జ్ఞాన-స్నానం ఒక్కటే శరణ్యం" అని

ఈ పారిశ్రామికీకరణ కాలుష్య జీవనంలో ప్రజల జీవన స్థితిని తెలుపుతాడు.

అదే విధంగా డా॥ కాలువ మల్లయ్య గారు తెలంగాణ గ్రామాలలోని వివిధ వృత్తుల ప్రజలను నేపథ్యంగా

తీసుకొని నశించిన క్రమంగా నశిస్తున్న వృత్తులను దానికి కారణాలను విశ్లేషణ చేస్తూ వృత్తుల కనుమరుగు కారణంగా పతనమయిన మానవ విలువలను వివిధ జీవిత సంఘర్షణలను తెలంగాణ మాండలిక భాషలో "అవ్వతోడు గిది" తెలంగాణ శీర్షికలలో కథలను రాయగా ఎంతగానో ఆదరణ పొందాయి.

అలాగే చిత్ర వృత్తికి భౌతిక వాస్తవికతను నేర్పు కథగా "కులవృత్తి"ని రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథ విశేష ఆదరణ పొంది 2006 సం॥లో ప్రజాసాహితి మాస పత్రికలో ప్రచురితం అయినది. ఈ కులవృత్తి కథలో రచయిత దేవునికి భక్తుడికి మధ్య పూజారి అవసరాన్ని పవిత్రతను ఎలా అర్థం చేసుకోవాలనే అంశాలను స్పష్టంగా ప్రతిపాదించడం జరిగింది. అదేవిధంగా దేవునికి, భక్తునికి మధ్య పూజారి వారధి అనేది భ్రమగా నిరూపించాడు. అంతే కాకుండా అన్ని వృత్తుల వస్తువులకూ ఆ వృత్తులు చేసే వారికి సమాన గౌరవం దక్కాలని ఈ కథలో పేర్కొంటున్నారు. 1990 దశకం తర్వాత కాలంలో ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తుల విధ్వంసాన్ని, నిర్వీర్యాన్ని తెలియజేస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అనేక కథలు వెలుగులోకి రావడం జరిగింది. కుల వృత్తులకు దూరమైన కుటుంబాలు ఎదురుర్కొంటున్న సమస్యలపై కూడా అనేక కథలు వచ్చాయి. ప్రముఖ రచయిత సుంకోజి దేవేంద్రాచారి గారి కథ "అన్నంగుడ్డ" కథలో మగ్గాలు మరుగున పడడానికి నేత కార్మికులు కుల వృత్తికి దూరం కావడానికి యంత్రాల రాకను ప్రధానంగా ఎత్తి చూపారు. అదేవిధంగా పెద్దింటి అశోక్ కుమార్ "కులవృత్తులు" "కాగుబొత్త" కథల్లో ప్రిజ్‌లు వచ్చి కుండలు మాయమవ్వడాన్ని వివరించాడు. "న్యూబాంబే టైలర్స్" కథలో టైలర్ వృత్తికి రెడీమేడ్ దస్తులు ఏవిధంగా అవరోధంగా ఉన్నాయో కదీర్ బాబు చిత్రించారు. ఈ విధంగా ఎంతో మంది రచయితలు ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరుగవుతున్న కుల వృత్తులు, సంప్రదాయాలు ఆచార వ్యవహారాలను బాసటగా తమ రచనలను ఈ సమాజానికి అందించడం జరిగింది.

"సంస్కృతి
దిగజారిపోయాకే
ప్రపంచీకరణ
ఊపిరి తీసుకుంటుందా?"

అని సామ్రాజ్యవాదంను నిలదీస్తుంది డా॥. వై. కృష్ణ కుమారి. ఈ భూగోళంలో ఉన్న ఏ దేశం కూడా సర్వ స్వతంత్ర్యంగా వర్ధిల్లడం విస్తారవాదులకు, సామ్రాజ్య వాదులకు నచ్చదు అని ఏదో ఒక నెపంతో అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొని ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయాలను ధ్వంసం చేస్తున్నాయని వివరిస్తుంది.

నిన్నటి పల్లె ఒక సజీవ చైతన్య స్రవంతి
నేటి గ్రామం ఒక నిర్జీవ శిథిల సమాది
"బొంబాయి బస్సు
మనుషులతో పోదు
రోజూ కన్నీటి నదుల్ని
మోసుకెళ్తుంది"

అని పల్లెల్లో పనులు లేక ఉపాది కోసం తెలంగాణ జిల్లాల నుండి చేనేత కార్మికులు బొంబాయి లాంటి పొరుగు నగరాలకు, దుబాయి వంటి దూర దేశాలకూ వలస కూలీలుగా మారిన దయనీయ స్థితిని డా॥ పత్తిపాక మోహన్ చిత్రీకరించడం జరిగింది.

ఇక "హైకూ" ల విషయానికి వస్తే ఇది ఒక ఛంద: విశేషం కానీ, దానిని అపరిమితం చేయలేము. జపనీస్ కవిత్వంలో అది ఒక ఉన్నత సంవేదన హైకూలను పల కడం జపనీ ప్రజలకు మాత్రమే సాధ్యం అవుతుంది. హైకూల గురించి "ఇస్మాయిల్" ఈ విధంగా వివరిస్తాడు. "నీటిలోకి రాయి విసిరినపుడు ఒక దానిపై మరొకటి వృత్తాలుగా వ్యాపించినట్లు ఒక్కొక్క హైకూ పాఠకునితో వివిధ ఆలోచనా తరంగాలను సృష్టిస్తుంది" అని అన్నారు.

ప్రపంచీకరణలో భాగంగా సాహిత్యంలో కూడా అనేక

మార్పులు చోటు చేసుకోవడం జరిగింది. జపాన్ హైకూలను "గాలి నాసర రెడ్డి" తెలుగులో 'కంభీర' పోయెట్రీ బులెటిన్ 1994లో ప్రచురించారు.

"వర్షంలో
సంభాషిస్తూ వెళ్తున్నాయి
గొడుగూ వాన కోటూ "
"బియ్యం చల్లడం కూడా
పాపమే
కోళ్ళు తన్నుకుంటున్నాయి"

తెలుగులో వస్తున్న హైకూలు జపాన్ వారు పాటించిన సిలబుల్స్ నియమం పాటించక పోవడం వల్ల వీటిని మనం "మినీ కవిత" అని అనుకోవాలి. ఈ హైకూలను తెలుగులోకి పరిచయం చేసింది ఇస్మాయిల్ గారు. 1991 సం॥లో "రహస్యద్వారం" పేరుతో మొదటి "హైకూ" కవితా సంపుటిని శివరామకృష్ణ ప్రచురించారు ఇవి దాదాపుగా జపనీస్ సిలబుల్స్ నియమాన్ని పాటించాయి.

ఉదా॥

"సమీక్షకుడు
పచ్చిపాల మీగడ
వెతికే అత్త"
"ఆకాశం భూమి
నడుమ జీవనది
హైకూ కవిత "

ఈ విధంగా ప్రపంచీకరణలో భాగంగా ఇతర దేశాల సాహిత్యం కూడా అంది పుచ్చుకునే అవకాశం మనకు లభించింది అని చెప్పవచ్చు. ప్రపంచం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో దాని ఫలాలను అందరం అనుభవిస్తూనే ఉన్నాం. కానీ ఈ అనంత విశ్వంలో ఒంటరి అనే భావనకు మనకు మనంగా అలవాటు పడుతున్నాం. ప్రపంచీకరణలో భాగంగా పర్యావరణ సమతౌల్యం దెబ్బ తీస్తున్నాం, నిధి నిక్షేపాలను కొల్లగొడుతున్నాం. సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించి ఆధునిక వేషధారణ అనే ముసుగులో జీవిస్తున్నాం. ఎంత అభివృద్ధి సాధించినా కూడా మనం మన మూలాలను మర్చిపోకూడదు. అదే మనం భావి తరాలకు ఇచ్చే విలువైన కానుకలు అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర-డా॥ ద్వా. నా. శాస్త్రి
2. తెలుగు సాహిత్యం -ప్రాంతీయ అస్తిత్వం వ్యాస సంపుటి-డా॥ వేలూరి శ్రీదేవి
3. ఆధునిక తెలుగు కవిత్వం-ఎం.ఏ., తెలుగు ద్వి.సం॥ పే.6
4. భావవీణ మాస పత్రిక-మార్చి 2020

❖ ❖ ❖

ప్రపంచీకరణ - పల్లె జీవితం

– డా॥. ఏ. వెంకటప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.

ప్రపంచీకరణ వల్ల పల్లె జీవితం మారిన విషయాన్ని ప్రజాగాయకుడు " గోరటి వెంకన్న" 1994 లో " పల్లె కన్నీరు పెడుతుంది " అనే పాట ద్వారా తెలిపాడు. ఈ పాట ప్రజలను బాగా ఆకట్టుకున్నది. ఇది జనంలో బాగా ప్రచారమయ్యాక " కుబుసం" సినిమాకు తీసుకోబడింది.

గోరటి వెంకన్న గారు తన పాట ద్వారా నాటి పల్లెలు ఎలా ఉండేవి, ప్రపంచీకరణ ప్రభావం వల్ల అవి ఎలా మారాయో వివరించాడు.

" పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల,
నాతల్లీ బందీ అయిపోతుందో కనిపించని కుట్రల"
"కుమ్మరి వామిలో తుమ్మలు మొలిసెను - కమ్మరికొలిమిలో దుమ్ము పేరెను
పెద్ద బాడిస మొద్దు బారినది - సాలెల మగ్గం సడుగు లిరిగినవి
చేతి వృత్తుల చేతులిరిగిపాయె - నా పల్లెలోన
అయ్యో గ్రామ స్వరాజ్యం గంగలోన వాయె - ఈ దేశంలోన"

ప్రపంచీకరణ వల్ల ఈ దేశంలోని పల్లెటూళ్ళలో తయారయ్యే చేతివృత్తుల వారి వస్తువులు అమ్ముడుపోక, యంత్రాల ద్వారా తయారయ్యే వస్తువులు విరివిగా తక్కువ ధరకు లభించడంతో, వృత్తి పనివారల జీవితాలు దుర్భర దారిద్ర్యంతో మునిగిపోయాయని అంటాడు.

"మడుగులన్ని అడుగంటి పోయినవి - బావులు సావుకు దగ్గరయ్యినవి
వాగులు వంకలు ఎండిపోయినవి - సాకలి పొయ్యిలు కూలిపోయినవి
పెద్దబోరు పొద్దంత నడుస్తుందో బలసీన దొరలది- మరిపేదల రైతుల బావులెందుకెండే నా పల్లెల్లోనా"

పెద్ద దొరలు వేసుకున్న పెద్దబోరు రోజంతా నడుస్తూ వారి పంట పొలాలకు నీటినందించటం వల్ల వాగులు, వంకలు, మడుగులు, బావులన్నీ అడుగంటి పోగా చివరికి చాకలి వారి పొయ్యిలు నీరు లేక చాకిరేవు మూతపడింది. పేద రైతుల బావులు ఎండిపోయాయి.

"ఈదులన్ని వట్టి మొద్దులయ్యినవి - ఈత కల్లు బంగారమయ్యినది
మందు కలిపిన కల్లును తాగిన మంది కండ్లు నిండూసులయ్యినవి
చల్లని బీరు విస్కిలెవడు వంపె నాపల్లెల్లోకి - అరె బుస్సున పొంగే పెప్సికోల వచ్చె నాపల్లెల్లోకి"

చల్లని బీరు, విస్కీలు, పెప్సికోలలు పల్లెల్లోకి రావటం వల్ల ఈతకల్లుకు గిరాకీ తగ్గింది. తక్కువ ధరకు లభించే మత్తు కల్లును ప్రజలకు అలవాటు చేయటం వల్ల కల్లుగీత కార్మికుల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయి.

"పరకశాపలకు గాలాలేసే తురకల పోరలు యాడికి బోయిరి
లారీలల్ల క్లీనర్లయ్యారా, పెట్రోల్ మురికిల మురికయ్యిండ్రా
తల్లి దూదు సేమియాకు దూరమయ్యినారా సాయిబుల పోరలు
ఆ బేకరి కేఫ్‌ల ఆకలి తీరిందా ఆ పట్టణాలలో"

పల్లెలలో ఉండే సాయిబుల పోరలు చేపలు పట్టుకుని జీవించేవారు. వాగులు, వంకలు, చెరువులలో నీరు లేక బ్రతుకుదెరువుకోసం ఊరిని వదిలి లారీలల్లో క్లీనర్లుగా పట్టణాలలో పనిచేస్తూ, బేకరీలలో పదార్థాలను తింటూ తమ ఆకలిని తీర్చుకుంటున్నారు.

"అరకల పనికి ఆకలి దీరక గడెమునొగల పని గాసమెల్లక

ఫర్నీచరు పనులెదుక్కొంటూ గా పట్నం బోయిర విశ్వకర్మలు
ఆసాములంతా కూసునేటి, వడ్రంగుల వాకిలి -
నేడు పొక్కులులేసి దుఃఖిస్తున్నదిరో నా పల్లెల్లోనా"

ట్రాక్టర్ల రాకడతో గడెం (నాగలి) అరక పనులు తగ్గటం వల్ల విశ్వకర్మలు పట్టణాలకు ఫర్నీచరు తయారు చేయటం లాంటి పనులకోసం వెళ్ళటం వల్ల వడ్రంగుల ఇళ్ళు వాకిళ్ళు మూతలు పడి వారి ఇంటి ముందు పొక్కులు లేసి దీనంగా వున్నాయంటాడు.

"మేరోళ్ల సేతుల కత్తెర మూలపొయ్యి
సిలుమెక్కివోయినది - కుట్టుడు రెక్కల బనీన్లు
వోయినయి సోడె లాగులు జాడకు
లేవు - రెడిమెడు ఫాషను దుస్తులొచ్చెనంటా నా పల్లె
పొలిమెరకు ఆ కుట్టు
మిషన్ల సప్పుడాగినాదా నాపల్లెల్లోనా - పల్లె కన్నీరు
పెడుతుందో కనిపించని కుట్రల "

రెడీమేడు ఫాషను దుస్తులు పల్లెల్లోకి రావటం వల్ల దర్జీపనివారి జీవనం ఛిద్రమైంది అంటూ వారి కుట్టు మిషన్ల చప్పుడు ఆగింది అంటాడు.

"నానా కెంపు తెల్లలు జెల్లలు పరులకు తెలియని మరుగు భాషతో
బ్యారంజేసే కంసలి వీధులు వన్నె తగ్గినవి సిన్నబోయినవి
చెన్నై బాంబె కంపని నగలొచ్చి మన స్వర్ణకారుల
అరె సెర్నకోలలై తరుముతున్నయిరా మన పల్లెలనుండి"

ఎవరికి తెలియని పేర్లతో రక రకాల ఆభరణాలు తయారు చేసి అమ్ముకునే కంసాలివారి వీధులు, చెన్నై, బాంబె నుండి రకరకాల డిజైన్లతో కంపనీల నగలు రావటం వల్ల పల్లెల్లోని కంసాలివారి వీధులలో వన్నె తగ్గింది. వారి వృత్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

"మాదిగలొద్ది నోరు తెరచినది, తంగెడు సెక్క
భంగపడ్డది - తొండం బొక్కెన నిండమునిగినది
ఆరె రంపె పదునారి పోయినది - పాత రేకు వలె
మోతలు మోగేటి ప్లాస్టిక్కు డప్పులు
నా మ్యాదరి డప్పును పాతరేసె కదరా నాపల్లెల్లోనా"

ఎక్కడ చూడాలన్నా తొండెం బొక్కెనలు కనిపించటం లేదు. ఆరె రంప పదునారి పోయింది. ప్లాస్టిక్ డప్పులు రావటం వల్ల మాదిగల వృత్తులకు, మేదరి డప్పులు పోయాయంటాడు.

"కుంకుమ దాసన బుక్కమీద కుడ కంపెని రక్కసి
కన్నువడ్డది - పూసలోళ్ళ తాళాము కప్పలు
కాశీల గలసి ఖతమైతున్నయి - బొట్టుబిళ్ళలు
నొసటికొచ్చె గదరా నా పల్లెల గూడ
మన గుడ్డి దాసరి బతుకులాగమాయే ఈ పల్లెల్లోనా
- పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల "

కంపెనీల వారు తయారు చేసి అమ్ముతున్న రక రకాల బొట్టు బిళ్ళలు, తాళాల వల్ల కుంకుమను తయారు చేసి అమ్మేవారు, పూసలవారు, గుడ్డి దాసరుల బ్రతుకులన్నీ ఆగమయ్యాయి అంటాడు.

"ఇల్లు గట్టుకొనె ఇటుకకు రాయితో, సెలకల జల్లె
ఎరువు కుళ్ళుతో
ఎద్దు బండి ఉన్నోనికి సేతిలో యాడాదంతా పని
దొరికేది
టాటా ట్రాక్టర్ టక్కరిచ్చినాదో నా డొంక దారిని
మా ఎద్దు బండిగిల్లెగిరి పడ్డదమ్మో నాపల్లెల్లోనా"

టాటా ట్రాక్టరు రావడం వల్ల ఎద్దుల బండితో ఏడాదంతా పనిచేసుకుని జీవించే వారి జీవితాలు అతలాకుతల మయ్యాయంటాడు.

"తొలకరి జల్లుకు తడిసిన నేల మట్టి పరిమళాలేమై
పోయెరా
వానపాములు నత్తగుల్లలు భూమిలో ఎందుకు
బతుకతలేవు

పత్తి మందుల గత్తర వాసనరా ఈ పంటపొలాలల
ఆ మిత్తికి తెచ్చిన అప్పే కత్తాయే నా రైతు కుతికపై "

ఒకప్పుడు తొలకరి జల్లులకు వచ్చే మట్టి వాసనతో వానపాములు, నత్తగుల్లలు బయటికి వచ్చేవి. ఇపుడు వాటిని భూతద్దం వేసి చూసినా కనిపించవు. కారణం పత్తి చేలకు, ఇతర అన్ని రకాల చేలపై వేసే పురుగు మందుల ఘాటుకు ఈనాడు చూద్దామన్నా వానపాములు, నత్త గుల్లలు కనిపించటం లేదు. పత్తి చేలకై తెచ్చిన అప్పు తీర్చలేక పోతున్నరైతన్న కంఠంపై ఆ అప్పే కత్తులవుతుంటే అప్పు తీర్చలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

"హరిశ్చంద్ర పద్దె నాటకాల పద్దులార్మోనియం
పెదలు పట్టినది
యక్షగానము నేర్పే పంతులు ఉప్పరి పనిలో
తట్టవట్టినడు
యాచకులు, నా బడగా జంగాలు, ఈ పల్లెల నిడిసి
దేవా..... హరిహరా ..... ఓ.....
యాచకులు, నా బడగా జంగాలు, ఈ పల్లెల నిడిసి
ఆ పాతబట్టల మూటలమ్ముతుండ్రా తమ
పొట్టకూటికై - పల్లెకన్నీరు పెడుతుందో కనిపించని
కుట్రల

హరిశ్చంద్ర పద్యనాటకాల వారి హార్మోనియం మూల పడింది. యక్షగానాలు నేర్చుకునేవారు లేక యక్షగానము నేర్పే పంతులు పొట్ట కూటికోసం ఉప్పరి పనిలోకి వెళ్తున్నాడు. అలాగే యాచకులు బుడగజంగాలకు కూడ ఆదరణ లేక వారు కూడ తమ పొట్టకూటి కోసం పాతబట్టలు సేకరించి మూటలు గట్టుకొని అమ్ము కుంటూ బ్రతుకుతున్నారంటాడు.

"పిండోలెన్నల రాలుచుండగా రచ్చబండపై
కూసొని ఊరే
ఎనుకటి సుద్దులు ఎదలూ కతలూ యాదిజేసుకొని
బాధలె మరిసిరి
బుక్క నోటిలో వడ్డదంటే నేడు మనపల్లెల్లోనా
అయ్యో ఒక్కడు రాతిరి బయటికెళ్ళడమ్మో ఇది
ఏమి చిత్రమో"

ఒకప్పుడు రచ్చబండపై వెన్నల రాత్రులలో అందరూ చేరుకుని తమ వెనుకటి జ్ఞాపకాలను నెమరువేసుకుని తమ బాధలను మరచిపోయేవారు. నేడు రాత్రి తినగానే ఒక్కరు కూడ ఇంట్లోనుండి బయటికి రావటంలేదు.

"బతుకమ్మ కోలాటపాటలు, భజన కీర్తనల మద్దెల
మోతలు
బైరాగుల కిన్నెర తత్వమ్ములు కనుమరుగాయెరా
నా పల్లెల్లో
అరె స్టారుటీవి సకిలిస్త ఉన్నదమ్మా నా పల్లెల్లోనా
సామ్రాజ్యవాద విషమెక్కుతున్నదమ్మో మెల్లంగా పల్లెకు

బతుకమ్మపాటలు, కోలాటంపాటలు, భజనకీర్తనల మద్దెల మోతలు, బైరాగుల కిన్నెర తత్వాలు మొదలైనవి ఈనాడు పల్లెల్లో స్టారుటీవిలు రావటం వల్ల కను మరుగయ్యాయని, సామ్రాజ్యవాదవిషం మెల్ల మెల్లగా పల్లెకు పాకుతుందంటాడు.

"వృత్తులు కూలె ఉపాధిపోయే, ప్రత్యామ్నాయాం
లేకనె బోయే
కూలిన బతుకులు నిలుపుటకైనా కుటీరపరిశ్రమ
లైనా పెట్టరు
అరె బహుళజాతి కంపెనిల మాయలోనా మా
అన్నల్లారా
భారత పల్లెలు నలిగి పోయి కుమిలే ఓ అయ్య ల్లారా"
"పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల,
నాతల్లీ బందీ అయిపోతుందో కనిపించని కుట్రల"

బహుళజాతి కంపెనీల మాయలవల్ల వృత్తులు, కులాల ఉపాధులు పోయాయి. కనీసం కూలిపోయిన బ్రతుకులు నిలపడం కోసం కుటీర పరిశ్రమలైనా పెట్టడం లేదంటూ ప్రపంచీకరణ ప్రభావంతో పల్లె కన్నీరు పెడుతుందని, పల్లె తల్లి బందీ అయిపోయిందనే బాధను గోరేటి వెంకన్నగారు తన పాట ద్వారా పల్లె బాధను ప్రకటించారు. ❖

ప్రపంచీకరణ - తెలుగు భాష

– డా॥. సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబునగరు.

ప్రపంచంలో ఏభాషకైనా జాతి లేనిది భాషలేదు. భాషలేనిది సాహిత్యం లేదు. వాఙ్మయము, భాష, సాహిత్యము పర్యాయపదాలుగా వ్యవహారములో ఉన్నప్పటికి వాటి అర్థాలకు తేడా వుంది. పుట్టిన ప్రతి ప్రాణి చేసే శబ్దం వాఙ్మయము. భావాత్మకైన ధ్వని భాష. లిఖిత రూపమైన వాఙ్మయ భాష సాహిత్యము. ఇందులో సాహిత్యము కన్న భాష ప్రాచీనము. భాషకన్న జాతి ప్రాచీనము. ఆ జాతి పలుకు వాఙ్మయము అతి ప్రాచీనము. భారతదేశములో ప్రాకృత, సంస్కృత ద్రవిడ భాషలతో పాటు తెలుగుకూడ ప్రాచీనభాషయే. క్రీ.పూ. 3వ శతాబ్దంలోనే దక్షిణ భారతదేశాన్ని పాలించిన శాతవాహనుల కాలంలోనే "తెలుగు" రాజభాషగా గాక ప్రజాభాషగానే వుంది. ఇలా జాతిపరంగా, భాషాపరంగా, సాహిత్యపరంగా తెలుగుభాషకు చాలా ప్రాచీనత వుంది. శాతవాహనుల కాలంలో ప్రతిష్ఠానపురంనుండి అమరావతి వరకు, అనగా తూర్పు, పడమర సముద్రాలవరకు, కాకతీయులకాలంలో కాంచీపురంనుండి మధురవరకు, విజయనగరరాజుల పాలనా కాలంలో బళ్ళారి నుండి బరంపురం వరకు, దక్షిణాన కన్యాకుమారి వరకు రాజ భాషగా వెలుగొందినది మన తెలుగుభాష. ఇప్పటికి తంజావూరు సరస్వతి మహలునందు తెలుగుసాహిత్యమే అధిక సంఖ్యలో వుంది.

మన తెలుగు సాహిత్యముపై శాతవాహనుల కాలంనుండి బహుమని సుల్తానుల వరకు తెలుగు భాషపై ఎవరి ప్రభావము లేదు. గోలకొండ కుతుబ్షాహీల కాలంలో పర్షియా రాజభాషగా వున్నప్పటికి తెలుగు భాషకు ఎటువంటి నష్టం జరుగలేదు. తర్వాతి కాలంలో నిజాం నవాబుల రాజభాష ఉర్దూ అయినప్పటికి తెలుగు భాషను ప్రోత్సహించారు. ఆంగ్లేయుడైన సి.పి.బ్రౌను దొరగారు తెలుగు భాషకు ఎనలేని సేవచేశారు. తెలుగుప్రాంతాన్ని అనేక భాషల రాజులు పాలించినప్పటికి తెలుగుభాష వెలిగిపోయింది కాని తొలగిపోలేదు.

ప్రపంచీకరణ ప్రభావము వల్ల ఈనాడు అంతరించి పోతున్న భాషలలో తెలుగు ఒకటని అంతర్జాతీయ సంస్థ యునెస్కో ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా వ్యవహారంలోని ఆరువేల భాషల్లో ఇప్పటికే మూడువేల భాషలు అంతరించి పోయాయని అందులో తెలుగు ఒకటని ఈ సంస్థ వెల్లడించింది. అది కొంతవరకు నిజమే. నేటితరం పిల్లలకు ప్రపంచజ్ఞానం పేరుతో ఆంగ్లంపై వ్యామోహంతో తల్లిదండ్రులు తెలుగును దూరం చేస్తున్నారు. తెలుగు భాషను నాశనం చేసేది తెలుగువారె కాని మరెవరో కాదు. తెలుగువారు తెలుగును మాట్లాడటమే చిన్న చూపుగా భావిస్తున్నారు. దీనికి కారణం ఎవరంటే ప్రభుత్వము, ప్రజలు అందరూ కారకులే. ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో నిర్వహిస్తే భాషగొప్పదనం తెలుస్తుంది. తప్పకుండా ప్రతివ్యక్తి భాషను నేర్చుకుంటాడు. కాబట్టి భాష అంతరించిపోవడానికి ప్రథమకారకులు పాలకులే. భాషాదినోత్సవాలు జరుపుకోవడమే భాషాంతానికి మూలమని నా భావన.

మన ప్రాచీనులు ప్రాపంచిక విషయాలు తెలుసుకోవాలన్నారు. దానిద్వారా మన ఉనికికి ప్రమాదం రాకూడదు. ప్రాపంచిక భావనవేరు ప్రపంచీకరణ వేరు. "తెలుగుభాషలో లేని పదాలను అన్యభాషలనుండి స్వీకరించడము ప్రాపంచిక భావన అయితే భాషలో వున్న పదాలకు మారుగా అన్యభాషా పదాలను స్వీకరించి తెలుగుభాషా పదాలను లేకుండా చేయడము ప్రపంచీకరణ". అట్లే తెలుగు సాంస్కృతిక సాంప్రదాయాలు ప్రపంచీకరణ వల్ల నాశనం కారాదు. ప్రాపంచిక భావనవల్ల

అవి విశ్వవ్యాప్తం కావాలి. మనపూర్వులు కావ్యరచన కూడ విశ్వశ్రేయం అన్నారు కాని "విశ్వనాశనం" అని అనలేదు. ఆ విషయాన్ని గుర్తెరిగి మనం నడచుకోవాలి. లేకపోతే మన ఉనికికే ప్రమాదం.

ఆంగ్లభాష మీద వ్యామోహంతో తెలుగుకు దూరమైన వారిని గూర్చి కవి కాళోజీ నారాయణరావు గారు చెప్పిన మాటలు

ఏ భాషనీది ఏమివేషమురా
ఈ భాష యీ వేషమెవరికోసమురా
ఆంగ్లమందున మాటలనగనే
ఇంతగుల్కెదవు ఎందుకోసరమురా
తెల్గు బిడ్డవయ్యి తెల్గురాదంచును
సిగ్గులేక యింక జెప్పుటెందుకురా
"అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా"

ప్రస్తుతము మన తెలుగువారు ఆంగ్లం మీద మోజుతో భాషనే గాక సంస్కృతి, సంప్రదాయాలు కూడ మరచిపోతున్నారు. కాని విదేశాలలో వున్న తెలుగువారు, భాషను, సంస్కృతిక రంగాన్ని మరచిపోకుండా కాపాడు తున్నారు. అందుకే "పొరుగింటి వారి పుల్లకూర రుచి" వంటి సామెతలు పుట్టినవి. ఏ ప్రాంతంలో వుంటే అది బాగుండదు. ఆ ప్రాంతానికి దూరమైతేనే తన ప్రాంతం మీద మమకారం పుడుతుంది. దాని విలువ తెలుస్తుంది. ఏది ఏమైనా ప్రస్తుతము మన జాతికి, భాషకు వచ్చిన ప్రమాదమేమి లేదని నా అభిప్రాయం. పండాకు పడి పోతుంది పసురాకు వస్తుంది. పాతనీరు పోతుంది. కొత్తనీరు వస్తుంది. భాష మార్పుకు గురవుతుంది. కాని నశించదు.

తెలుగుభాష పుట్టినప్పటి నుండి ఎన్నో ఆటుపోటు లెదుర్కొన్నది. అనేక భాషల సంపర్కము చూసింది. వేరే భాషకు తన రుచిని చూపించింది. వేరే భాషల పదాలను తనలో కలుపుకున్నది. ప్రాకృత, సంస్కృత, పాళీ వంటి భారతీయ భాషలే గాక రోమను, గ్రీకు, ఇటలీ, ఆంగ్ల భాషలు తెలుగులో ఒదిగిపోయినవి. కొన్ని భాషలలో యితర భాషాపదాలు ఇమడవు. అన్యభాషా పదాలను యిముడ్చుకోగల సామర్థ్యం తెలుగుభాషకు వుంది. తెలుగుభాష ప్రాచీనమైనదే కాదు, చాలా శక్తివంతమైనది, మధురమైనది. భారతీయ భాషలన్నింటికన్నా ప్రత్యేకమైన అజంతభాష తెలుగు. ప్రపంచంలోనే అజంతభాషలు రెండే రెండు. ఒకటి "ఇటలీ భాష" రెండవది "తెలుగు భాష". కాబట్టే తెలుగు భాషను "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అన్నారు. మహోన్నతమైన తెలుగుభాష ప్రపంచీకరణ వల్ల మరుగున పడిపోతుందుకోవడం జరుగదని నా అభి ప్రాయం. ఒక భాష తనలో ఇతరభాషా పదాలను కలుపు కొని పోకుంటే అది మృతభాష. మన తెలుగు ఇతరభాషా పదాలను సులభంగా తనలో కలుపుకొని పోతుంది. కాబట్టి తెలుగుకు ఆగతి పట్టదు. కొంతమంది ఆంగ్లభాషమీద మోజుతో భాషను చిన్న చూపు చూసినప్పటికి, మన తెలుగుభాష మృతభాషకాదు. జీవన్భాష, అమృతభాష.

ఆధార గ్రంధాలు :

1. ఆంధ్రుల సాంఘికచరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి.
2. నాగొడవ - కాళోజీ నారాయణరావు.
3. మహబూబునగరు జిల్లా సర్వస్వము - బి.యన్.శాస్త్రి.

❖ ❖ ❖

కథా నేపథ్యంగా తెలుగుభాష-సంస్కృతి-ప్రపంచీకరణ ప్రభావం

– డా॥. వి. శాంతిలక్ష్మి, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు, కర్నాటక.

మూడు దశాబ్దాల కాలం నాటి మన చుట్టూ ఉన్న ప్రజాజీవన సరళికి, నేటి జీవన విధానానికి ఉన్న తేడాను పరిశీలించి చూస్తే రెంటికీ మధ్య వ్యత్యాసం స్పష్టంగా అర్థమవుతుంది. వేషభాషలూ, ఆహారపు అలవాట్లు, విద్యావిధానం మొదలైనవి తమతమ స్వాభావిక రూపాల్ని మార్చుకుంటూ నాగరికత వైపు దృష్టి పెట్టి సంపదలపై, సౌఖ్యాలపై మనిషిని ప్రేరేపిస్తున్న ప్రపంచీకరణ తెలుగు సమాజాన్ని ఆక్రమిస్తూ దేశీయమైన జీవనంలో ప్రతి అంశాన్ని విదేశీయం చేసే ప్రయత్నాలను ప్రజలకు తెలియచెప్పే దిశగా తెలుగు కథానికా రచయితలు స్వచ్ఛందంగా కృషి చేస్తున్నారు.

అంగ్లం ద్వారా మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా ఉద్యోగాల్ని సంపాదించుకోగలం అనే ఉద్దేశంలో ఆంగ్లభాష పట్ల మక్కువ చూపించడం ప్రారంభమయింది. ఇతర భాషలపై మక్కువ పెంచుకోవడం తప్పుకాకపోయినా మాతృభాషను పూర్తిగా విస్మరించడం తప్పు. దీనికి తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువగా కనిపిస్తుండడాన్ని రచయితలు తమ కథల్లో చూపించారు.

పిల్లలు పుట్టీపుట్టగానే వాళ్లని ఎక్కడ చదివించాలో, ఏమి చదివించాలో తల్లిదండ్రులు ఊహించేసుకుని అందుకు తగ్గట్టు మాటలు వచ్చీరాకముందునుంచే ఇతర భాషల్ని బలవంతాన పిల్లల నెత్తిన రుద్దుతున్నారు. మాతృభాషను మృతభాషగా చేసి పిల్లలను పాశ్చాత్య వ్యామోహంలో పెంచి తీరా వారు పెద్దవాళ్లయిన తర్వాత మన సంస్కారం అబ్బలేదని బాధపడ్డంలో అర్థం లేదు. ముందు తరాలకు మన సంస్కారం తెలియాలంటే ముఖ్యంగా వాళ్ళకి మన భాషను నేర్పాలి. ఒకప్పుడు వ్యాఖ్యాలలో ఎప్పుడయినా ఆంగ్ల పదాలు రాయవలసి వస్తే బ్రాకెట్లో తెలుగులో అర్థం రాసేవారు కానిప్పుడు అది తారుమారు అయింది. తెలుగు పదాలకే బ్రాకెట్లో ఆంగ్లంలో అర్థాలు కనిపిస్తున్నాయి. అంతగా నేటి తెలుగు సమాజం మాతృభాషకు దూరం అయింది. అవుతోంది. ఈ విషయాన్ని కొన్ని కథల ఆధారంగా తెలియపరిచే ప్రయత్నం చేస్తున్నాను.

తెలుగు కథలలో ఆంగ్లభాష :

తెలుగు కథల్లో, అందుకు వాడుతున్న వాక్య నిర్మాణంలో తెలుగు భాషతో సమానంగా స్థానం ఏర్పరచుకుని మిళితమై ఉన్న ఆంగ్లభాషను ఏ విధంగానూ వేరుచేయలేని పరిస్థితులను ఈ క్రింది కథల్లోని సంభాషణల వాఖ్యాలు నిరూపిస్తున్నాయి.

1. టింకూ ఇన్ టెక్సాస్ :

"ఇండియా అంటే బోర్ అండ్ డర్టీ డాడ్" (పేజీ - 18)

"డాడ్, డొంట్ సే లైక్ దట్. హీ ఈస్ మై బెస్ట్ ఫ్రెండ్ ఎవర్" (పేజీ - 19)

"లుక్ టింటూ నువ్వు ఇక్కడకు వచ్చి అయిదేళ్ల యింది. ఇండియాలో నీకు అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ, పిన్ని, బోలెడంత మంది అక్కలు, అన్నలు ఉన్నారు. హైదరాబాద్‌లో సమ్మర్ బ్రహ్మాండంగా ఎంజాయ్ చేయొచ్చు. యు నో, ఇపుడు హైదరాబాద్ కంప్లీట్లీ చేంజ్డ్. నువ్వు ఇక్కడ చూస్తోన్న హారీపోటర్, స్నెక్-టూ, స్పైడర్ మాన్-2 అవన్నీ అక్కడ కూడా చూడవచ్చు. అక్కడ మన ఇంట్లో కంప్యూటర్ ఉంది. నీకిష్టమైన వీడియో గేమ్స్ ఆడుకోవచ్చు. చక్కగా నాతో రోజూ ఆన్‌లైన్‌లో చాట్ చేయొచ్చు" (పేజీ - 19).

ఈ పై సంభాషణ టింకూ అనే ఆరేళ్ల కుర్రాడు వాడి నాన్న ఆనంద్ లది. అమెరికాలో స్థిరపడిన తెలుగువారి

జీవన సరళి, వారి పిల్లల మనస్తత్వం, భాష, సంస్కృతి తెలియజేస్తోంది.

2. స్నో స్టార్మ్ :

"నీకు సెలవు కాదూ, నా స్కూల్‌కి సెలవు ఇచ్చుతుంది నా ప్రిన్సిపాల్ (పేజీ - 24)

ఇది న్యూయార్క్‌లో ఐదవ తరగతి చదువుతున్న ప్రీతి తెలుగు పాండిత్య ప్రదర్శన.

''యా, నో నీడ్ టూ ఫినిష్ మై హోంవర్క్ ఫర్ టుమారో'' (పేజీ - 24)

తెలుగు నేర్చుకునే అవకాశమూ, అవసరమూ కలగని ఒకటో తరగతి చదువుతున్న ప్రీతి తమ్ముడు చేతన్.

3. పే పాల్ :

''కాష్ ట్రాన్సాక్షన్... వెస్ట్రన్ యూనియన్ కంపెనీ ద్వారా''పేజీ - 42)

''నువ్వు కస్టమర్లకు సాఫ్ట్‌వేర్ సీడిలు షిప్ చేసినట్లు'' (పేజీ - 45)

''ఫ్రాడ్ చేసి'' (పేజీ - 45)

''సంపాదించడానికి ట్రై చేసింది'' (పేజీ - 45)

4. గీతాభవనమ్ :

''ఒక ప్రక్కగా టీ.వీ., కంప్యూటరూ, సోఫాసెట్, చిన్న కిచెన్, డైనింగ్ టేబుల్'' (పేజీ - 49)

''ఓల్డేజ్ హోం మేనేజరు చేసిన ఎడ్వర్టైజ్‌మెంట్'' (పేజీ - 49)

5. అమెరికాలో అద్దె కొంప :

''గేస్ రేంజ్, రొట్టెలు బేక్ చేయటానికి అవెన్, వంట పాత్రలు కడగటానికి స్టెయిన్‌లెస్ సింక్, కుకింగ్ రేంజి ప్రక్కన ఫ్రిజ్, లివింగ్‌రూము, బెడ్ రూము, ఫర్నీచర్'' (పేజీ - 54)

''కంగ్రాట్యూటేషన్స్ డాక్టర్! యూ హిట్ ద టిక్కెట్''

(పేజీ - 55)

''థాంక్యూ టామ్ లుకింగ్ ఫార్వర్డ్ టు సీయు''

(పేజీ - 57)

''మిస్టరీ ఆఫ్ ఎ మిస్సింగ్ బుక్'' (పేజీ - 57)

''మిస్టరీ ఆఫ్ ఫస్ట్ వరల్డ్ వార్'' (పేజీ - 57)

6. మంచు కురిసిన రాత్రి :

''టెస్ట్‌కి ప్రిపేర్ అవ్వాలి''

''ఆఫీస్ పని, కాలేజ్ కోర్స్ రెండు కలిసి టాక్సింగ్‌గా ఉంది''.

''వెకేషన్'',

''ఎసైన్మెంటు టైంకివ్వకపోతే ఇంకొన్ని మార్క్స్‌పోతాయి. దాంతో ఓవరాల్ గ్రేడ్ తగ్గుతుంది''

(పేజీ - 59)

''ఐయామ్ నాట్ ఓకే! ఐయామ్ డైయింగ్ హియర్. ప్లీజ్ హెల్ప్ మీ.. ప్లీజ్... ప్లీజ్'',

''మై ఫుట్ గట్ స్టక్ ఇన్ హయర్, మై కార్ కీస్ ఆర్ అండర్ కార్.... ప్లీజ్ హెల్ప్ మీ...'',

''ప్లీజ్.. ప్లీజ్ స్టాప్! ప్లీజ్ స్టాప్! ఐయామ్ నాట్ గోయింగ్ టు హర్ట్ యూ. ఐ డోంట్ హావ్ ఎ గన్, ఐ జస్ట్ వాంట్ టూ థాంక్ యూ'' (పేజీ - 68)

''ఓకే మాన్! టేక్ కేర్!'',

''కమాన్ కేట్, వి బెటర్ గెట్ గోయింగ్'' (పేజీ - 68)

7. అంటు - అత్తగారు :

''ఫ్రిజ్‌లో మామూలుగా మనుషులు తినే పదార్థాలు మాయమవుతాయి. వాటికి బదులు కోడిగుడ్డు. కుక్క గోడుగులు, చీజులు, సలామీలు, బర్గర్లూ, బలోనీలు లాంటి పదార్థాలతో ఫ్రిజ్ నిండిపోతుంది'' (పేజీ - 91)

''వై ఆర్ యూ డంపింగ్ దట్ సూప్? డిడ్ ఐ డూ సమ్ థింగ్ రాంగ్'' (పేజీ - 92)

8. కల ఇదనీ నిజమిదనీ తెలియదులే :

''ప్లేను దిగగానే పెద్దలైనులు, క్యూలు ఏమీ లేవిక్కడ. చాలా అడ్వాన్స్‌డ్. వీళ్ళు వీసా ఇచ్చినపుడు పాస్‌పోర్టులో కాగితం అతికించారే దాంట్లోనే మైక్రోచిప్ ఉంటుందిట, ప్లేను దిగుతుండగానే అది వాళ్ళు కంప్యూటర్లతో స్కాన్ చేసేసి మళ్లీ ఆపకుండా పంపించేస్తారు''.

"వాళ్లే క్వార్టర్స్ ఇస్తారు. రాత్రికి మళ్లీ ఈమెయిల్ చేస్తాను" (పేజీ - 96)

9. ఫిష్ దట్ గాట్ అవే :

"డాడ్, నువ్వే పెద్ద న్యూరాలజిస్టువు, మేబీ, యూ నీడ్ టూ స్పెండ్ మోర్ టైం ఇన్ ద హాస్పిటల్" (పేజీ - 110)

"డాడ్, ఎడాప్ట్ ఎనదర్ గర్ల్ బై మై టెన్త్ బర్త్‌డే" (పేజీ - 111)

10. గగ్గుళ్లమ్మ గుడి :

"విమానం ఎక్కి అమెరికా వెళ్ళాలి అంటూ ఫ్లాష్ బాక్‌లో చెపుతున్నాడు" (పేజీ - 112)

"గుడిలో దేవుడి బదులు ఒక శక్తివంతమైన, వాయిస్ ఇంటర్ఫేస్ ఉన్న మాట్లాడగలిగే కంప్యూటర్, వైర్లెస్ నెట్‌వర్క్ పెట్టారు" (పేజీ - 116)

ఉపసంహారం :

అన్ని కథల్లోని ఈ వాక్యాలద్వార భాష, సంస్కృతి, అభివృద్ధి చెందిన, చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, మారుతున్న, మారకతప్పని పరిస్థితులను తెలియ చేస్తున్నాయి.

తెలుగు భాషా సంస్కృతులు, ప్రాచీనత, ప్రపంచీకరణ వల్ల తెలుగు భాషకు సాంకేతిక విస్తృతి పెరగడాన్ని, గూగుల్ సదుపాయాలను, సాంకేతికంగా భాష పెరుగుతున్నా స్థానికంగా ప్రజల నిర్లక్ష్యానికి గురికాబడుతున్న వైనం గుర్తించడమైనది. తెలుగులో మాట్లాడితే నామోషీ అనుకునే పరిస్థితి నేడు దేశంలో నెలకొంది. తమ పిల్లల స్కూలు మెట్లు ఎక్కిన మొదటి రోజునుండే ఇంగ్లీషులో మాట్లాడాలనే తపన నేటి తల్లిదండ్రులలో కనిపిస్తుంది.

ఆధార గ్రంథ సూచి :

1. టింకూ ఇన్ టెక్సాస్ : కల్పన రెంటాల : అమెరికా తెలుగు కథానిక - 2006.
2. స్నో స్టార్మ్ : డా॥. వేద : అమెరికా తెలుగు కథానిక - 2006.
3. పే పాల్ : కె. వి. గిరిధరరావు : అమెరికా తెలుగు కథానిక - 2006.
4. గీతాభవనమ్ : కొమరవోలు సరోజ : అమెరికా తెలుగు కథానిక - 2006.
5. అమెరికాలో అద్దెకొంప : డా॥. గవరసాన సత్యనారాయణ : అమెరికా తెలుగు కథానిక - 2006.
6. మంచు కురిసిన రాత్రి : సుందరశ్రీ దువ్వూరి : అమెరికా తెలుగు కథానిక - 2006.
7. అంటు - అత్తగారు : వేలూరి వేంకటేశ్వరరావు : అమెరికా తెలుగు కథానిక - 2006.
8. కల ఇదనీ నిజమిదనీ తెలియదులే : శ్రీనాథ్ జొన్నవిత్తుల : అమెరికా తెలుగు కథానిక.
9. ఫిష్ దట్ గాట్ అవే : విప్లవ్ : అమెరికా తెలుగు కథానిక - 2006.
10. గగ్గుళ్లమ్మ గుడి : మహేష్ శనగల : అమెరికా తెలుగు కథానిక - 2006.

❖ ❖ ❖

మునికన్నడి సేద్యం – రైతు వ్యవసాయ కుటుంబ జీవిత చిత్రణ

– మూర్తల తరన్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, నెట్ (జె.ఆర్.ఎఫ్), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

కరువులోన బుట్టి కరవుతోడ బెరిగి
కరువులందు గాంచుజనుల
కర్కసులయి భీతి గనరని ఈర్ష్యచే
కడిమి మెరసి కరువుకలచనెనగ
భూమిలోనబుట్టు భూసారమెల్లను
తనువులోన బుట్టు తత్వమెల్ల
శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను

అన్న మాటలు మనకు నామిని సుబ్రహ్మణ్యం నాయుడు గారు రచించిన మునికన్నడి సేద్యం నవలలో కనిపిస్తాయి.

1980 మధ్యకాలంలో రాయలసీమ రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక మొదలైన రంగాలలో ఎన్నో మార్పులు చోటు చేసుకొన్నాయి. వాటిలో ప్రధానమైనది కరువు. రాయలసీమలో కరువుమూలంగా అన్ని వర్గాల వృత్తులవారి జీవితాలు అస్థవ్యస్థమయ్యాయి. ప్రజలు పల్లెలు వదిలి పట్టణాలలకు వలసలు వెళ్ళారు. కొంత మంది స్త్రీలు విధిలేని పరిస్థితుల్లో తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి వ్యభిచార వృత్తిలోకి దిగారు. మరికొంతమంది యువతీయువకులు విప్లవ రాజకీయాల్లో చేరి పోలీసుల ఎన్‌కౌంటర్లలో నేలకొరిగారు. మరో పక్క ఫ్యాక్షన్ హత్యలు యథేచ్ఛగా సాగాయి.

ఈ అంశాలన్నింటిని రాయలసీమ నవలా రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు ఈ మునికన్నడి సేద్యం నవలలో నిరూపించాడు.

మునికన్నడి సేద్యం నవల చదువుతున్నప్పుడల్లా రచయిత స్వయానా రైతునా లేక రైతు కుటుంబం నుంచి వచ్చిన చదువుకున్న వ్యక్తినా అని పాఠకులకు సందేహం కలుగుతుంది. ఎందుకు అలా అనిపిస్తుంది అంటే మునికన్నడి సేద్యం నవలను నడిపించిన తీరు వర్ణనా తీతం. ఈ నవలను గమనిస్తే తాను వ్యవసాయ జీవితాన్ని అనుభవించాడా అనే సందేహం పాఠకులలో కలుగుతుంది అని చెప్పటం అతిశయోక్తి కాదనటంలో ఎటు వంటి బ్రమపడాల్సిన అవసరం లేదు.

అనాదికాలం నుండి భారతీయుల ప్రధానవృత్తి వ్యవసాయం. నేటికి ఎక్కువ శాతం మంది ప్రజలు వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు. అందుకే రచయిత వ్యవసాయక జీవిత ప్రస్తావనను కథాంశంగా తీసుకొని 'మునికన్నడి సేద్యం' నవలను రచించాడని అనిపిస్తుంది. రాయలసీమ అనగానే మనకు గుర్తుకు వచ్చేది కరవు. ఎండిపోయిన నదులు, వాడిపోయిన పంటలు, చితికిపోయిన రైతు జీవితాలు, అతివృష్టి అనావృష్టి, గిట్టుబాటు ధరలేక సకాలంలో పంటను అమ్ముకోలేకపోవడం, పెట్టిన పంటకు లాభాలు రాకపోవడం, పుట్టిన ఊళ్లో బ్రతకలేక వలసపోతున్న రైతుల జీవితాలు ఎంత దౌర్భాగ్యంలో ఉన్నాయో వీటితో పాటు ఎన్నో ఎన్నెన్నో ఈ నవలలో కనిపిస్తాయి.

మునికన్నడి సేద్యం నవలా రచయిత రైతుకుటుంబం నుంచి వచ్చినవాడే. అందుకే రైతు జీవితాన్ని అంతచక్కగా చిత్రించగలిగాడు. ఈ నవల అంతా రైతు నేపథ్యంగా కొనసాగుతుంది.

ఈ నవలలో ప్రధానపాత్రలు ఇలా వంతునాయుడు, యెంగటమ్మ, మునికన్నడు, ధర్మానాయుడు, నాగరాణి, గుర్రప్ప నాయుడు, అద్దెలామె వీరి చుట్టూ నవల తిరుగుతూ ఉంటుంది. రచయిత ఒక వ్యవసాయ కుటుంబ జీవితాన్ని ఇలావంతు నాయుడు కుటుంబం ద్వారా మన కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

ఒక వ్యవసాయ కూలీ కుటుంబం తమ సొంత ఊళ్లో బతుకు గడవక రంగంపేట నుండి మిట్టూరుకు వలస

పోయి అక్కడ గుర్రప్ప నాయుడు ద్వారా అద్దాలామె భూమిని సంవత్సరానికి ఇరవైదుమూటలు వడ్లు ఇచ్చే టట్లు కౌలుకు తీసుకుంటాడు. మొదట కౌలుకు తీసుకున్న మూడున్నర ఎకరాలలో వరి నాటాలను కుంటాడు. కాని ఆర్థికంగా చితికిపోయిన ఆకుటుంబానికి వరినాటడం కష్టసాధ్యమయ్యింది.

వరిమడినాటాలంటే ఎరువులు కొనడానికి చాలా పెట్టుబడి కావాలి. ఆ కుటుంబానికి అంత స్థోమత లేదు. కానీ ఎలాగో అగచాట్లు పడి విత్తనాలు కొని నారు పోస్తారు. యాభై గుంటలు దున్నటానికి మడకలు కావాలి. మడకలు దున్నించాలంటే డబ్బు లేదు అందుకని ఊల్లో మడకలు బదులు అడిగి వారి కుటుంబం ద్వారా మడ కలు దున్నుతాడు మునికన్నడు. ఎరువు కోసం కుటుంబం అంతా అడవికి వెళ్ళి అడవిలో పశువులు వేసిన పేడను సేకరిస్తారు. నాట్లకు మాత్రమే కూలిపెట్టి మిగితా కూలి పనులు ఆ కుటుంబమే చేస్తుంది. మొదటి సంవ త్సరంలో వారుపడిన కష్టానికి తగిన ఫలితం వస్తుంది. దాదాపు డెబ్భైయేడు మూటలపైనే వరిపండుతుంది. అద్దాలామె కౌలు కింద ఇరువైయైదు మూటలు తీసు కుంటుంది. అద్దాలామె పెద్ద సేరుతో కొలుస్తుంది. ఈమె కొలిచిన కొలత రైతుల శ్రమదోపిడికి నిదర్శనం. మొదటి సంవత్సరంలో వడ్లు అమ్మగా వచ్చిన డబ్బుతో మంచిపాడి ఆవును కొనుకుంటారు. వీరికి కష్టాలు రెండో సంవత్సరం నుంచి మొదలయ్యాయి. బావిలో నీళ్ళు తగ్గాయి. బావిలో సొసైటీ ఆయనకు భాగం ఉండటం వల్ల వంతులు పెట్టుకోవాల్సి వస్తుంది.

రెండో ఫలితంలో ఇరవైగుంటల చెరకు, ఇరవై గుంటల వరి, పదిగుంటల శనక్కాయలు వేస్తారు. వానలు సక్రమంగా పడకపోవటం, బావిలో నీళ్ళు తగ్గటంతో ముత్తెపు అనే దిగువూరు రైతు దగ్గర నీళ్ళు కొని అతి కష్టం మీద రెండవ పంట చేజిక్కించుకుంటారు. మూడవ పంటలో వారికి కష్టాలు తారా స్థాయికి చేరాయి. వర్షాలు లేవు కరువు వచ్చింది దానికి తోడు కరెంటు కోతలు మొదలయ్యాయి. ముత్తెపు దగ్గర నీళ్ళుకొని పంట కాపాడుకొందామనుకున్న కరెంటుకోతవల్ల అతని బావుల్లో నీళ్ళు పుష్కలంగా ఉన్నా అతని పంట పారటం కష్ట మవటంతో నీళ్ళు ఇవ్వలేదు. దీంతో శనగపంట వాడి పోయింది. ఈ విధంగా రచయిత రాయలసీమ రైతుపడే కష్టాల్ని అతి సహజంగా చిత్రించాడు. కరెంటు ఎప్పు డొస్తుందో తెలియక గంటలు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి రైతుది. కరెంటు వస్తే రైతు ప్రాణం వచ్చినట్లు భావించేవాడు. వాన కోసం రైతులు ఏ విదంగా కలలు కంటారో మునికన్నడి పాత్ర ద్వారా రచయిత చక్కగా తెలియజేశాడు. అతి కష్టం మీద వ్యవసాయాన్ని ఈదు కొస్తున్న ఆ రైతు కుటుంబం అద్దాలామెకు కౌలు తగ్గించమని అడుగుదామని, ఆమె దగ్గరికి వెళితే వాళ్ళకి మింగుడు పడదని దుర్వార్త.

అద్దాలామె కూతురు పెళ్ళి కోసం ఆ భూమిని ముత్తెపుకు అమ్మేస్తుంది. దీంతో మళ్ళీ ఆ కుటుంబం కూళీలుగా మారిపోతుంది. ఈ నవలలో మునికన్నడు రాయలసీమ రైతుకు ప్రతీక. ఇందులో రచయిత భూమి మీద రైతు పెంచుకున్న మమకారాన్ని మునికన్నడి పాత్ర ద్వారా తెలుపుతున్నాడు. "నా తావన కష్టం చేయించుకొనే భాగ్యం నీకు లేదే భూమమ్మా అని" ఏడుస్తాడు. ఈ నవల రాయలసీమ రైతు జీవితాన్ని ప్రతిబింబించటంలో పూర్తిగా సఫలమైంది.

ఈ నవలలో ప్రధానంగా తెలియజేయాలనుకున్న విషయాలు ఏమిటంటే వానలు సకాలంలో పడకపోవటం, బావుల్లో నీళ్ళు తగ్గిపోవటం, దానికి తోడు కరెంటు కోతల వల్ల రైతు అనుభవించే కష్టాలు మొదలైన విషయాలను ముందుంచాడు రచయిత.

మునికన్నడి సేద్యం నవలలో గ్రామీణ రైతు జీవితాన్ని ప్రతిఫలించిన తీరు అతి సహజంగా ఉంది. రచయిత వాస్తవికతకు ఈ నవలలో అద్దం పట్టారు. వ్యవసాయ కూలీలు వలసవెళ్ళడం, ఆర్థిక ఇబ్బందులతో కొట్టు మిట్టాడటం ఒక ఎత్తైతే, సన్నకారు రైతు వ్యవసాయానికి

కావలసిన పెట్టుబడి స్థోమత లేక అప్పులు చేయడం కూలికి పోవడం మొదలగు పరిస్థితులు కళ్ళకు కన్నీళ్ళు తెప్పిస్తాయి. సొంత భూమిలేని వ్యవసాయ దారులు ఇతరుల భూములు కౌలుకు తీసుకొని పడే కష్టాలు, బావులలో నీటి వనరులు తగ్గిపోయి పడే బాధలు, ఈ నవలలో ఎంతో వాస్తవికంగా చిత్రించబడింది. సకాలంలో వర్షాలు పడకపోవడం, కరెంటు కోతలతో రైతులు సతమతమవటం మొదలైన విషయాలు ఆలోచింప చేస్తాయి. కొంతమంది రైతులు తమ కుమార్తెల పెళ్ళి కోసం భూమిని తాకట్టు పెట్టడం, అమ్ముకోవడం రైతు కూలీలుగా మారడం రాయలసీమ వాస్తవ పరిస్థితికి నిదర్శనంగా రచయిత తమ నవలను చిత్రీకరించాడు.

కొన్ని సందర్భాలలో ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టడం వల్ల దిగువ ప్రాంతాల బావులు ఎండిపోవడం, బోర్లల్లో నీళ్ళు తగ్గిపోవడం, పంటలపై పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో కలత చెందిన రైతులు ఆత్మ హత్యలకు సిద్ధమవటం లాంటి సంఘటనలు ఈ నవలలో పాఠకుల హృదయాలను కలచి వేస్తాయి. కొంత మంది రైతులు పట్టణాలలో చేరి వ్యాపారం చేసుకుంటూ హాయిగా బ్రతుకుతున్నట్లు కొన్ని నవలల్లో కన్పిస్తాయి. నీటి పంపకాల కోసం రైతులు పోట్లాడుకోవడం, జైలుకు వెళ్ళడం లాంటి సంఘటనలు ఈ నవలలో కనిపిస్తుంది. పేదరైతులు ప్రభుత్వ ఉచిత బోర్లు వేయించకోవటానికి ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వడంకోసం బంగారు నగలు తాకట్టు పెట్టి తిరిగి వాటిని విడిపించుకోలేక భూములను అమ్ముకోవడం, కూలీలుగా మారడం ఆరోగ్యం దెబ్బతిని ఆత్మహత్యకు సిద్ధపడటం లాంటి సంఘటనలు రాయలసీమలో సర్వసాధారణం. ఈ విధంగా రాయలసీమ నవలల్లో రైతు జీవన చిత్రణ చాలా సహజంగా చిత్రీకరించబడింది.

భారతదేశానికి వెన్నెముక రైతన్న. ఆరుగాలం శ్రమించి పంటలు పండించి ప్రజలందరికీ తిండి పెట్టేది రైతన్న. అందుకే రైతన్న జైజవాన్ జైకిసాన్‌లో ఒకడిగా పిలవడినాడు. రైతే రాజుగా పిలవబడ్డాడు. కాని నేడు అందరి ప్రశంసలు అందుకున్న రైతన్న జీవితం మాత్రం దుర్భరంగా గడుస్తున్నది.

నేడు రైతు కరువుతో, కరెంటు కోతలో, సరైన దిగబడి రాక, పంటకు గిట్టుబాటు ధరలేక, దళారీల బెడదలో, నకిలీ విత్తనాలతో, పెరిగిన ఎరువుల ధరలతో, వ్యవ సాయం చేయలేకపోతున్నాడు. వ్యవసాయరంగంలో కనీస గిట్టుబాటు కూడా లేక వేలాదిమంది రైతులు వ్యవ సాయాన్ని వదిలేసి పట్నాలకు వలసలు వెలుతున్నారు. పట్నాలలో ఆత్మాభిమానాన్ని చంపుకొని మేస్త్రీ పనికి, అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్ పనిచేస్తూ దుర్భర జీవితాల్ని అనుభవిస్తున్నారు. ఈ విషయాలు ఈ నవల చదువుతూ ఉంటే మనకు అర్థమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. రాయలసీమ రైతు - బైరపురెడ్డి రెడ్డినారాయణ రెడ్డి
2. వేమన పద్యాలు
3. మునికన్నడి సేద్యం - నామిని సుబ్రహ్మణ్యం నాయుడు

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో రజక వృత్తి

– అరసఖిల్లి మోహనరావు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

గ్లోబలైజేషన్ అనే ఈ ఆంగ్ల పదానికి తెలుగులో ప్రపంచీకరణ అనే మాటను సమానార్థకంగా ఉప యోగిస్తున్నారు. ఈ రోజుల్లో ప్రపంచీకరణ అనేది అందరినోట వినిపిస్తున్న సామాన్యమైన పదం ఈనాడు ప్రపంచీకరణ అన్నది ఏ ఒక్క అంశానికి పరిమితమై లేదు. ఆర్థిక రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలన్ని ఈ ప్రభావానికి గురౌతున్నాయి.

ప్రపంచం కుగ్రామం అయిపోయింది. ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సాంకేతిక అభివృద్ధితో ప్రపంచం చిన్నది అయిపోయింది. అయితే ప్రపంచీకరణను ప్రపంచ దేశాలు ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రథమంలో స్వాగతించిన తర్వాత ఆచరణలో దాని స్వభావం తెలియగానే దాన్నీ వ్యతిరేకిస్తున్నాయి. ప్రపంచీ కరణ వల్ల ప్రపంచం కుగ్రామం అవ్వడం, సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ ఉన్న దశలో దాన్ని వ్యతిరేకించడం జరుగుతుంది. ప్రపంచం కుగ్రామంగా, ఏకంగా మారడం మంచిదైనప్పుడు వ్యతిరేకించడం ఎందుకు? అయితే ఇది వ్యాపార, ఎగుమతుల, దిగుమతుల సాంకేతిక యంత్రాల విషయంలోనే గాని మానవుల ప్రేమ, అనుబంధాలకు సంబంధించిన విషయాల్లో కాదు. ఒక్కమాటలో చెప్పా లంటే ప్రపంచీకరణ వస్తువులు-వస్తువులు దగ్గర అవ్వడం, మనిషి-మనిషి దూరం అవ్వడం. ఈ పరిణామంను నేడు మనం స్పష్టంగా గమనించవచ్చు.

ప్రపంచీకరణ మూలాలు :

ప్రపంచీకరణ 20వ శతాబ్దంలో మొదలైందని చెబు తున్నప్పటికి అందులో వాస్తవం లేదు. నిజానికి ప్రపంచీ కరణ 15వ శతాబ్దంలోనే మొదలైంది. అయితే అది దేశాలకు ఆక్రమించడం, వలస విధానం, వలసదేశాల సామ్రాజ్యవాద రూపంలో ఉన్న ప్రపంచీకరణ అనేక దశలను దాటుతూ నేడు మనం చెప్పుకుంటున్న నయా ఉదరవాద దశకు చేరుకుంది. ప్రపంచీకరణ వల్ల దుష్ప రిణామాలే ఎక్కువని, ప్రపంచీకరణ అంటే అమెరీకీకరణ, డాలరీకరణ అని కొందరు మేధావులు అభిప్రాయ పడుతున్నారు.

నిర్వచనం :

ప్రపంచీకరణ ఎప్పుడు మొదలైంది అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లే ప్రపంచీకరణ నిర్వచనాన్ని అనేక మంది అనేక రకాలుగా నిర్వచించారు.

1) "అంక్షలు లేని వెసులుబాటు, విశ్వ స్వేచ్ఛా వ్యాపారం, ఎల్లలు దాటి వ్యాపించడాన్ని ప్రపంచీ కరణ" అని ఒకరు నిర్వచిస్తే.
2) "పెట్టుబడిదారి అభివృద్ధి యొక్క వస్తుగత నియమమే ప్రపంచీకరణ".
3) అభివృద్ధి చెందుతున్న దేశాలను తిరిగి ఆర్థిక వలసలుగా మార్చడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించిన బ్లూప్రింటే ప్రపంచీకరణ"
4) "గతంలో సామ్రాజ్యవాదంగా ఉండేది. నేడు ప్రపంచీకరణగా మారింది".

రజకులు స్థితిగతులు :

రాష్ట్రంలో దాదాపు 9 కోట్ల మంది పురిటి నెత్తురు పిండిమైలను పోగొట్టి, మనిషిని రూపొందించే పనిలో అమ్మను మరిపించి మలమూత్రాలతో మైలబట్టిన బట్టలు ఉతికి, అమ్మతనానికి ఆయువు పోసిన చాకివీరుణ్ణి చాకలోడన్నారు. మానవతాధీరుణ్ణి మడేలోడన్నారు. 'ఉస్సో, ఉస్సో' అని బతుకంతా ఉతుకుడాయే, అయినా బువ్వకు గతిలేక పాయే, చెల్లని పైసాయేరో చాకలోని చాకిరంత, మల్లెగమిము మార్చిన మలినమేర చాకలి బతుకంతా... చవుడు, నీలిమందు స్వచ్ఛమైన నీటిలో

ఉడకబెట్టి, ఉతికి జోడించి, ఇస్త్రీ చేసి కమ్మటి సువాసనతో ఆరోగ్యరక్షణ కవచంలాంటి దుస్తులను, వస్త్రాలను అందించిన తొలి రసాయన శాస్త్రజ్ఞుడు రజకులు.

తాతలు కాలం నుంచి చాకలి వృత్తిని చేస్తున్నాము. పురిటి గుడ్డలు, మైలబట్టలు, రోగులు బట్టలు ఉతికి శుభ్రంచేస్తూ తల్లిలాంటి సేవ చేస్తున్నాము. అయినా సమాజంలో సముచిత గౌరవం ఇవ్వరాయే. కండలు కరిగించి కాయకష్టానికి తగిన ఫలితం ఉండదాయే మేరల ఆదాయం (కూలి) పెంచమని పెత్తందారులను అడిగేం దుకు ఆస్కారం ఉండదాయే జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే గ్రామ బహిష్కరణలు, సాంఘీక బహిష్కరణలు, సామాజిక బహిష్కరణలుయే. ఒరే చాకలోడా! ఒన్ చాకలిదానా! అంటు హీనంగా పిలవడం? నీ బాంచన్‌దొర, నీ కల్మోక్త అంటూ వంగి వంగి భయంగా బ్రతకడం? 'అమ్మా.... చాకలిదాన్ని వచ్చిన బిక్షం వేయంటు' ఇప్పటికి అడుక్కోవడం? ఎంతకాలం ఈ దుర్మార్గం? ఎంతకాలం ఈ వివక్ష? ఎంత కాలం ఈ నరకం? ఎంతకాలం ఈ దోపిడీ? అది అగ్గి రగుతులున్న రజకులు గుండెమంట. తరతరాలుగా కులవృత్తిని నమ్ముకుని బానిసలై దుర్భర జీవనాన్ని గుడుపుతున్నారు.

ఆనాటి నుంచి రజకులలో కరుడుగట్టిన పేదరికం, నిరక్ష్యరాస్యత కారణంగానే నేడు రజకులలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, సాంస్కృతిక రంగాలలో వెనుకబడిపోయారనేది నగ్న సత్యం. ఏ కొద్దో గొప్పో ఆర్థికంగా విద్యాపరంగా కొందరు ముందంజలో ఉన్నారు అనడం వాస్తవమే. కానీ, అగ్రకులాల వారి అనాధార ప్రవర్తనకు భయపడుతూ తమ స్వకులాన్ని మరుగున దాచుకోవడం జరుగుతుంది అనేది జగమెరిగిన సత్యం.

అందుకే ఈ వృత్తిని వదులుకుంటే తప్ప మనకు మంచి భవిష్యత్ లేదనే నిర్ణయానికి చాలా మంది వచ్చారు. రజక వృత్తిని వదిలిపెట్టిన అనంతరం మరి ఏ వృత్తిని చేపట్టాలి. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ఏం ఉన్నాయి. ప్రపంచీకరణ పరుగుతో చేతివృత్తులన్నీ ధ్వంసం అవుతున్నాయి. చివరకు వ్యవసాయ పనులు, మట్టి పనులు సైతం యాంత్రీకరణ మింగివేస్తున్నది. ఈ లూటి నేపధ్యంలో భూమి, నీరు, చదువు వంటి వనరు లకు దూరమైన చాకలివారు ఎలా బతకాలా? ఏమి చెయ్యాలి? ఈ ప్రశ్న రజకులదే కాదు. సాటి అణగారిన కులాల సామాజిక సేవలను గౌరవించే ప్రతి ఒక్కరిది. నాటి రామాయణ కాలం నుంచి నేటి వరకు రజకవృత్తిని మన భారతీయ సమాజంలో అల్లుకుపోయి కొనసాగ తున్నట్లు పురాణాలు, చరిత్రలు తెలియజేస్తున్నాయి. శివుడు గరళం మింగి లోకాన్ని ప్రాణవాయువతో కాపాడి నట్లు రజకులు మురికిని ప్రక్షాళనల చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన, కాంతివంతమైన మెరిసే దుస్తులను అందిస్తారు. ఆ దుస్తుల అలంకరణతోనే నాగరిక, సాంస్కృతిక స్థాయి ప్రతిబింభిస్తుంది. అంతెందుకు నేడు ఏ చోట రాజకీయ నాయకుడైన ఇస్త్రినలగని రెపరెపలాడే తెల్లటి వస్త్రాలను చూస్తున్నాం. ఈ కోణంలో చూసినప్పుడు రజకవృత్తికి ప్రాధాన్యత ఎంత ఉందో తెలుస్తుంది. అయితే సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల అమలు నేపధ్యంలో రజకవృత్తి కొనసాగడం ఏటికి ఎదురీతగా మారింది. వృత్తికి జీవనాధారమైన నీరు (చెరువులపై) రజకులకు ఎలాంటి హక్కులు, ఆజమాయిషీ లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అనాదిగా సంక్రమించిన ఇనాం భూములు అన్యాక్రాంతం అయిపోతున్నాయి.

చాలాచోట్ల ధోబీగాట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాకలి పాయ్యలు కూలిపోతున్నాయి. ఉన్న కొద్దిపాటిని రక్షించుందామనుకున్నా ప్రభుత్వాలు సహకరించడం లేదు. 1965లో అప్పటి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జౌలి విధానమే ఇటు ఇతర చేతివృత్తులతో పాటు రజక వృత్తిని ఘోరంగా దెబ్బతీసింది. ఒకప్పుడు చాకలి కులం చరిత్రలో ఒక మహోన్నత స్థానం ఉండేది. అయితే అవసరమైన ఆధారాలు కూడా కాలగర్భంలో కలిసి పోయాయి. ఇప్పుడు మిగిలి ఉన్న కొన్ని అగ్రకుల ఆధి పత్యం కోసం ఒకరినొకరు విమర్శించుకోవడం, తిట్టు

కోవడం, అవహేళనపరిచే క్రమంలో దొరికేవే. ఆధునిక కాలంలో అణగారిన చరిత్ర ఆసాంతం అవహేళనకు గురికాబడ్డది. ఆ అవహేళన నుంచి అధికారిక ఆధారాలు సంపాదించాలి. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు పదవీచ్యుతుడు అయిన తర్వాత ఆ పీఠాన్ని అధిష్టించింది 'చాకలి పేరయ్య' . ఈ ప్రపంచంలోనే ఏ మహిళకూడా యుద్ధరంగంలోకి అడుగు పెట్టకముందే కొడవళ్లతో చెక్కిన తుపాకులను అందుకుని బరిగీరి దొరలపై పోరాడి అణగారిన కులాలకు స్ఫూర్తినిచ్చి తెలంగాణ మహత్తర రైతాంగ సాయుధ పోరాటంలో వీరవనితగా నిలిచింది ''చాకలి ఐలమ్మ'', ఆమె దొరతనానికి వ్యతిరేకంగా చేయెత్తిన క్షణాన ఆమె వెనుక మార్క్స్ లేదు. మాలో లేడు కనీసం అంబేద్కర్ కూడా లేడు. ఒక్క ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం తప్ప. ఐలమ్మ పోరాటం సాహసం అతి త్వరలోనే ఆ ప్రాంతామంతా పాకింది. ఈ విషయం తెలుసుకున్న కామ్రేడ్ 'సుందరయ్య' ఐలమ్మ ఇంటికి చేరుకుని ఐలమ్మ చేసిన పోరాటం గురించి తెలుసుకొని ఆమె ధైర్యసాహసాలను మెచ్చుకున్నాడు. ఆనాటి నుంచి ఐలమ్మ తన ఇల్లునే పార్టీ కార్యాలయంగా మార్చి సంఘానికి అన్ని తానైంది. కేవలం ఈమె రజక వృత్తి చేసుకునే సామాన్య మహిళ. అంతటి పోరాటాన్ని చేసింది.

కారంచేడు, చుండూరు దళిత పోరాటాలకు ఉద్యమాల సంఘం అధ్యక్షుడు 'దేవళపల్లి మస్తాన్‌రావు' గారు ఆ పోరాటానికి ఒక బహుజన తాత్వికతను అద్ద గలిగాడు. ఇతను రజక సామాజిక వర్గానికి చెందిన వారే. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2000 ఆగస్టు 2న కరెంట్ ఉద్యమ పోరాటంలో అసువులు బాసిన అమరుడు రజక యువకిశోరం 'సత్తెనపల్లి రామకృష్ణ'తో పాటు అనేక మంది రజకులు ఇవ్వాల్టి దోపిడి సమాజానికి సవాళ్లు అయ్యారు. నిరుపేదగ పుట్టి రజకుణ్ణని సగర్వంగా ప్రకటించుకుని మూడుసార్లు శాసన సభ్యుడిగా ఎన్నికై రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేస్తున్న 'బస్వరాజు సారయ్య' లాంటి వారు ఉన్నారు. అమెరికాలోని మొదటి పదిమంది శాస్త్రవేత్తల్లో 'మామిడాల రాములు' వంటి మేథావులున్నారు. పోరాటంలో పోయిన వారే కాక ఇంకా మిగిలి అనేకమంది మెరికల్లాంటి యువతి, యువకులు రజకుల్లో కోకొల్లలుగా ఉన్నారు. అయితే రజకుడు, రజకుడిగా చెప్పుకోకపోవడం మనలో మనకున్న అనైకతగా మనకు తెలుస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కోర్లపాటి శ్రీరామూర్తి
2. చాకలి పద్దు - నక్క విజయరామారావు
3. వికీపీడియా - చాకలి ఐలమ్మ
4. ఈనాడు ప్రతిభ - ప్రపంచీకరణ నేపథ్యం

❖ ❖ ❖

ప్రపంచీకరణ - పల్లెజీవనం

- కాటర్ల స్వరాజ్యం, కరీంనగర్.

ప్రపంచీకరణ అనేది కేవలం ఒక్క రంగంపైనో కాకుండా అన్ని రంగాలపై ప్రభావం చూపింది తెలుగు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది సాహిత్యం సమాజాన్ని అధ్యయనం చేస్తుందనేది నమ్మదగిన సత్యం ప్రపంచీకరణ పరిణామాలపై అన్ని దేశాల్లో సాహితీ కారులు ప్రతిస్పందించారు. భారతదేశంలో కూడా ఎంతో మంది సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహితీ ప్రముఖులు ప్రవంచీకరణపై ప్రతిస్పందించారు. తెలుగులో కూడా ప్రపంచీకరణ సాహిత్యం విస్తృతంగా వస్తుంది .

దాదాపు రెండు దశాబ్ధాల కిందట భారతదేశంతో సరళీకరణ వాణిజ్య విధానాలమలు కావడం జరిగింది . డంకెల్ ప్రతిపాదనలపై మన దేశం సంతకం చేయకుండా తిరుగుబాటుగా గొప్ప ఉద్యమం దేశ వ్యాప్తంగా జరిగింది . ఆ సందర్భంగా వీధి నాటకాలు , పాటలు , నృత్య రూపకాలు ఊరూర ప్రదర్శించారు 1990 సంవత్సరం మొదటి రోజుల్లో దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యాల ప్రభావం బలంగా ఉంది . 1990 నుండే ముస్లిం వాద సాహిత్యం కూడా రావడం జరిగింది . ప్రాంతీయ చైతన్య సాహిత్యం కూడ వచ్చింది . 1996 వరకూ నూతన ఆర్థిక విధానాలు దేశ ప్రజలకు అంతగా అర్థం కాలేదు కాని అనంతరం ప్రపంచీకరణ విశ్వరూపం మొదలైన తర్వాత నెమ్మదిగా మధ్యతరగతి ఆకాంక్షలు వారి వికలమైన స్వప్నాలను తెలియజేస్తూ కవిత్వం రావడం మొదలైంది.

ఇదంతా ప్రపంచీకరణ ఫలితమని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. అమెరికా యుద్ధోన్మదం అధిక మయి ఇరాక్, అఫ్ఘనిస్తాన్, మీద అమెరికా యుద్ధం ప్రకటించడంతో తెలుగు సాహిత్యం కారులను చలింప చేశాయి. వ్యవసాయ రంగం సంక్షోభం, చితికిన మధ్య తరగతి ఆర్థిక పరిస్థితి, రైతుల ఆత్మహత్యలు మొదలైనవి వీటిన్నింటికి గ్లోబల్ పరిస్థితులే కారణం కాబట్టి కవులు, కళాకారులు, అన్ని వాదాల సాహిత్య కారులు ప్రపంచీ కరణపై స్పందించి సాహిత్యాన్ని వెలువరించారు. తెలుగులో ప్రపంచీకరణ సాహిత్యం ఒక ధోరణిగా మారిందనవచ్చు. ''సాధారణంగా సమాజంలోను, సాహిత్యంలో నెలకొని ఉన్న వ్యవస్థపట్ల క్రమంగా నిరసన పెరిగి ఆందోళన దశకు చేరింది . మలిదశ దోరణి అంటున్నాం.

ప్రక్రియ భాష, శిల్పం, ఇతివృత్తం, సైద్ధాంతిక దృక్పథం మొదలయిన విషయాల్లో రచయితలు చెప్పు కోదగ్గ సంఖ్యలో అనుసరించే మార్గమూ, పద్ధతీనే ప్రపంచీ కరణ రెండు దశాబ్దాల ప్రపంచీకరణ సాహిత్య సృజనలో ప్రపంచీకరణపై వ్యతిరేకత ఎక్కువ ముఖ్యంగా కవిత్వంలో వ్యతిరేకత కథా సాహిత్యంలో వ్యతిరేకత కొన్నిసార్లు అనుకూలత కన్పిస్తుంది. ఒక్క మాటలో చెప్పా లంటే సామ్రాజ్యవాదపు వికృతరూపం గ్లోబలైజేషన్ ప్రపంచీకరణ అనేది అభివృద్ధి చెందాల్సిన ప్రాంతాలకు, దేశాలకు, జాతులకు వర్గాలకనువుగా మల్చుకోవాల్సిన అవసరముంది. ఒక సామెత చెప్పినట్టు బర్రె మనకోసం కట్టదు ఈనదు కాని దాని పాలు పిండుకోవాలి. లేక పోతే చరిత్రలో అభివృద్ధిలో వెనకబడిపోతామనేది చరిత్ర సత్యం 1996 తర్వాత తెలుగు సాహిత్యంలో విస్తృతంగా ప్రపంచీకరణమై నేటికి ప్రపంచీకరణ సాహిత్యంలో అనేక మార్పులు చేసుకుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు ప్రపంచమే ఒక గ్రామంగా మారి శాస్త్ర, సాంకేతిక పురోగాభివృద్ధి వల్ల ప్రపంచంలో ఏమూలన ఏసంఘటన జరిగినా ఆవార్తా క్షణాల్లో ప్రపంచమంతటా వ్యాప్తిస్తుంది . అలాగే కట్టు ,

బొట్టు, అలంకరణ వేషధారణ, ఆహారపు అలివాట్లు సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలో కూడా పెను మార్పులు సంభవించి గ్రామాలు సైతం పట్టణాలుగా మారి, గ్రామీణ సంస్కృతిని దెబ్బతీస్తున్నాయనేది నమ్మ దగిన విషయం రెండు దశాబ్దాల క్రితం గ్రామీణ సంస్కృతి, నాగరికత నేడు కనుమరుగయిందనడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. నాడు భిన్నత్వంలో ఏకత్వంల అన్ని కులాల వారు విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు కల్గి ఉన్నప్పటికి సోదరభావంతో కలిసి మెలసి మనుగడ సాగించారు. ప్రపంచీకరణ మూలంగా నేడు ఏకత్వంలో భిన్నత్వంల పోటీలు, వర్గాలు, ఈర్ష్య, అసూయ, కక్ష్యలతో తమ వారినే పట్టించుకోకుండా ఎవ్వరికి వారే యమునా తీరన్నట్లు మారిపోతున్నారు

గ్రామాల్లో ఉండే సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబాట్లు , ఆచారాలు, కులవృత్తులు కేవలం నేటి తరం పుస్తకాలలో ఊహించుకునే పరిస్థితి ఏర్పడింది. అనాటి గ్రామాలు పరిశీలిస్తే ఇప్పటి తరం వారికి ఆ గ్రామ జీవితం అర్థం కావాలంటే "ఫ్రూట్ సలాడ్" వంటిది. అంటే అన్ని రకాల పండ్లతో చేసిన రసంలా అన్ని కులాలకు చెందినవారు, వారి వృత్తులను చేసుకుంటూ నిండు కుండలా ఆనందకంగా స్వేచ్ఛగా ఉండేవారు. పల్లెల్లో చెరువులు, కుంటలు, కాలువలు దగ్గరగా ఉండేవి. అంతేకాదు వీటి ఓడ్డులకు తాటిచెట్ల ఏపుగా పెరిగే ద్రశ్యాన్ని తలపించేలా ఉండేది. తాటి ఆకులతో పూరిల్లు తాటి మొదళ్లలో చేసిన పట్టెలు, దూలాలు, నారతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసేవారు. అంతేకాదు రామాయణ, భారత, భాగవతాలను ఎన్నో చారిత్రక గ్రంథాలను తాళపత్రాలపై రచించి అందించిన చరిత్ర వారధులు తాటిచెట్లు అంతేకాదు కొన్ని యుగాలుగా వర్ధిల్లుతున్నది కానీ ప్రపంచీకరణ నేపధ్యంలో పల్లెల్లో తాటిచెట్లు లేకపోయిన కొంపొండ్లల్లో కల్లు తయారు చేసే సంస్థలు నెలకొల్పుతున్నారు ఈ నేపథ్యంను గోరెటి వెంకన్న గారు పాట ద్వారా చక్కగా తెలిపారు.

ఈదులన్ని వట్టి మొద్దులయ్యినవి
ఈతకల్లు బంగారమయ్యినది

.....

బుస్సు బుస్సున పొంగే పెప్సికోల వచ్చేనా పల్లెల్లోకి అన్నది వాస్తవమయింది .అలాగే వాడవాడకు బెల్టు షాపులు వెలసి విభిన్న రకాల మత్తు పానీయాలు లభిస్తు న్నాయి. గ్రామీణ ప్రజలు వ్యసనాలకు బానిసలై ఆరో గ్యాలు పాడుచేసుకుంటున్నారు. వాడు గౌరవంగా జీవనం కొనసాగించిన గౌడపుత్రుల వారు నేడు ఎక్కడు న్నారు ఎలా ఉన్నారు ఆర్థిక పరిస్థితికి కారణం ప్రపంచీకరణే అని చెప్పాలి. భారత దేశంలో ప్రతి కులానికి, జాతికి ప్రత్యేక సంస్కృతి, ఆచార వ్యవహారాలు ఉండేవి. కాని నేడు ఎలా ఉన్నారనేది చూస్తున్న సత్యం నేతకారులు పల్లెల్లో నులక, గోగునాగలతో నాగలి అవసరమైన మోకులు, ఎద్దులకు పగ్గాలు, ముక్కు దోరా, పలుపులు నేసేవారు అంతేకాదు ముతకచీరలు, దోతులు, మంచాల నవారు, జంపఖానలు నేసేవారు అగ్గిపెట్టల్లో పట్టె చీరను నేసి వస్త్ర నిర్మాణంలో తమ ప్రతిభ చూపిన ఘనత నేతన్నలది నేడు యాంత్రీకరణలో అభివృద్ధి వల్ల తక్కువ సమయంలో తక్కువ మందితో ఎక్కువ వస్త్రాలు తయారు చేయడంతో వారి వృత్తి మరుగున పడింది.

వ్యవసాయరంగంలో ఆధునిక పద్ధతుల వల్ల యంత్రా లపై ఆధారపడడం వల్ల ఎద్దులు, ఆవులు కను మరుగవ్వడంతో వాటికవసరమయ్యే తాళ్లు ఉపయోగించే అవసరం లేకుపోయింది. వీటికి తోడు కూలీ పనులు చేసుకునే వారికి పనిదొరకక వేరే పనులు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పల్లెల్లో నివసించే కుమ్మరి, కంసాలి వడ్రంగి వృత్తులు మరుగునపడి, వాటి స్థానంలో యంత్రాలు రావడం వల్ల ఆర్థిక స్థితి దెబ్బతిన్నది.

వ్యవసాయ రంగలో అనేక మార్పులు చోటు చేసు కున్నాయి. పూర్వ కాలంలో సేంద్రీయ ఎరువులతో పంటను పండించే వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు ప్రపంచీకరణ వల్ల ఆర్థిక వ్యవస్థ మార్పు వల్ల భూమిలోని

సారం తగ్గినా పర్వాలేదు పంట ఎక్కువగా దిగుబడి చేయాలనే కుతూహలంతో కృత్రిమ ఎరువులు, రసాయనాలు, మందులు వాడి పండిస్తున్నారు దీని వల్ల అనారోగ్య పాలవుతున్నాం.

అంతేకాదు గొట్టపు బావుల వల్ల భూగర్భజలాలు అడుగంటి, పంట పొలాలు బీడుగా మారుతున్నాయి అడవుల నరకడం, తవ్వడం వల్ల కాలుష్యం కలుషిత వాతావరణం ఏర్పడుతుంది. యంత్రాల సాయం లేకుండా వ్యవసాయం చేయలేమనే స్థితి ఏర్పడింది తత్ఫలితంగా మనుషుల వాడకం, ఎద్దుల వాడకం తగ్గింది కుల వృత్తులు మాయమైనాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక మార్పులను చోటు చేసుకున్న వాటిలో పల్లెలు కూడ ఒకటి ప్రపంచీ కరణ ముందు పల్లెలు, అక్కడ ప్రజల మానసిక పరిస్థితులు, జీవనం ప్రపంచీకరణకు లోనయి 1996 తర్వాత అనేక మార్పులు చోటుచేసుకుంది.

పూర్వం పల్లెటూరు అనగానే ముందుగా గుర్తొచ్చేది పంట పోలాలు ఎక్కడ చూసిన పచ్చని వాతావరణం పొద్దునే లేచి పొలాలకు వెళ్లేరైతులు వారితో పాటు భార్యలు, కూలీలు ఏదో ఒక పని చేసుకుంటూ తీసే కూనిరాగాలు ఇవన్ని కూడ మధున స్మృతులే. పొలాలు నాటేయ్యాలన్నా, కోయాలన్న, కలుపుతీయాలన్న అనాడు మనుషుల అవసరం ఉండేది ప్రపంచీకరణ తర్వాత ప్రతి పనికి మనుషులు వచ్చి, మనుష్యుల మధ్య దూరం పెంచాయి. అంతేకాదు పొలాల గట్టుకు తుమ్మ చెట్లు నేరేడు చెట్లు అనేక రకాల చెట్లు సేదతీరడానికి ఉండేవి. పని చేసిన తర్వాత అందరూ ఒకే చోట కూర్చుని కష్ట సుఖాలు పంచుకునేవారు రక్తసంబంధాలు లేకపోయినా వ్యక్తి సంబంధాలు ధృడంగా ఉండేవి. అన్ని అక్క, అవ్వ, అయ్య ఇలాంటి సంబోధనలతో మనుస్యులంతా ఒకటే ననే తత్వం ఉండేది నేడు పొలాలకు వెళ్లే పరిస్థితి మారి బతుకుదేరువు కోసం పట్నం బాట పట్టి దూరాలు పెంచు కుంటున్నారు సాయంత్రం కాగానే అందరూ ఒకచోట కూర్చుని కబుర్లు చెప్పుకేనేవారు కాని టీ.వీ.లు, రేడియోలు ఎప్పుడయితే వచ్చాయో అప్పటి నుంచి కబురు మానేసి కాలక్షేపం కోసం ఒంటరిగా మిగిలిపోతున్నారు పల్లెలో మంచి నీళ్ల బావి ఉండేది. బావి చుట్టూ దాదాపుగా ఆరు దిక్కులా నీళ్లు చేదుకోవడానికి వీలుగా ఉండేది ఆడవాల్లందరూ కలిసి ఒక వాడలోని వాళ్లు ఒకే సారి వెళ్లి నీళ్లు తెచ్చుకునేవారు ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు పల్లెల్లో ప్రజలు పాయ్యి మీద వంట చేసుకునేవారు. కంటి వ్యాధులు వచ్చేవి ప్రపంచీకరణలో భాగంగా గ్యాసు స్టవ్‌లు రావడంతో పల్లెల్లో కూడ పాయ్యి వెలగడం లేదు అనారోగ్యపాలవుతుఆన్నరు.

పల్లెల్లో ప్రతి ఇంటిలో దాదాపుగా పండ్లు, పూలు, కూరగాయల చెట్లు పెంచుకునేవారు. డబ్బు ఆదాతో పాటు రసాయనాలు లేని పంట వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు అంతేకాదు ఎక్కువగా జొన్న రొట్టె, గడక తినేవారు కేవలం పండుగలప్పుడు మాత్రమే అన్నం వండుకునేవారు అన్నం వండితే ఆరోజు పండుగని చెప్పు కేనేవారు ప్రపంచీకరణ ముఖ్యంగా ఆర్థిక రంగంపై చూపిన ప్రభావం అంతా ఇంత కాదు అందుకే పల్లెలో నేటి జీవన విధానం అనేక మార్పులు చోటు చేసుకుంది ముఖ్యంగా పంటలు పండించే విధానంపై ప్రభావం ఎక్కువ, పల్లె ప్రజలు పనిని ఎంతో ఇష్టంగా చేసేవారు. "మోటి" కొట్టడం ఇది పూర్వం పొలాలకు నీరు పెట్టే విధానం. ప్రస్తుతం ఈ విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

ప్రపంచీకరణ వల్ల పల్లెల్లో మార్పు జరిగిందనడానికి మారిన తారురోడ్లు సాక్ష్యం పూర్వ కాలంలో పల్లెల్లో రోడ్డు అనగానే కంకర, మట్టి రోడ్డు ఉండేవి కాని వెళ్లడానికి, రావడానికి చాలా ఇబ్బంది పడేవాళ్లు. ఇలాంటి పరిస్థితి నేటికి కొన్నిచోట్ల ఉన్నప్పటికి దాదాపుగా పెల్లె రోడ్లు మారాయని చెప్పవచ్చు. దూర ప్రయాణాలకు ఎండ్ల బండి కట్టుకుని వెళ్లెవారు ఆడపిల్లకు వివాహం చేసి అత్తవారింటికి పంపేటప్పుడు ఆమెతో పాటు, శారె, చీరె, అనేక

రకాల వాయినాలు పంపేవారు వీటన్నింటిని కూడ ఎండ్ల బండిలోనే పెట్టి పంపేవారు ఒక్కదానిలో పట్టవు కాబట్టి అనేక బండ్లు కట్టించి పంపేవారు. కంకర రోడ్డుపై బండ్లు పోతుంటే ఎత్తు పల్లాలకు ఎద్దులు ఊగుతుంటే వాటి మెడలో గజ్జెలు ఘల్లు ఘల్లుమని మోగేవి. నేడు కార్లు, బైక్‌లతో పొగను చిమ్ముతున్నాయి.

ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. చేతి వృత్తులు అంతరించడం, ఒక దుస్థితి పల్లెల్లో కుల వృత్తులు, కూడా నేడు లేవు మరియు పర్యావరణంలో కూడ అనేక మార్పులు జరిగి పంటకు నష్టం రైతుల ఆత్మహత్యలుకు కారణమవు తున్నాయి. దీనికి కారణం బహుళ జాతి కంపెనీలు ఉత్పత్తులు ఫ్రిజ్‌లు వచ్చి కుండలు తయారీ మాయం కావడం అన్నట్టు ప్రపంచీకరణ వల్ల పల్లెలు మారాయి.

కుమ్మరి వాగులో తుమ్మలు మొలిసెను
కమ్మరి కొలిమిలో దుబ్బ పేరెను
సాలెల మొగ్గం సడుగులిరిగినై
పెద్ద బాడిసలు మొద్దు బారినై

గ్రామ స్వరాజ్యం గంగలోన కలిసే నా పల్లెల్లోనా కుల వృత్తులు కూలిపోవడం కనిపిస్తుంది .

ప్రపంచీకరణలో భాగంగా సరళీకృత ఆర్థిక విధానాలు అమలయి అనేక పరిశ్రమల స్థాపన జరిగి ప్రయాణ వాహనాలు అధికమయ్యి కాలుష్యం పెరిగి వాతా వరణంపై ప్రభావం చూపింది తత్ఫలితంగా భూతాపం పెరిగి, వర్షాలు తగ్గి రైతులు, జనాలు పనిలేక కరువు భారిన పడిపోయి కుటుంబాన్ని పోషించడానికి పట్టణా లకు వలసలు పెరిగాయి ముఖ్యంగా భూగర్భ జలాలు ఇంకిపోయి తాగునీరు కూడా లేని పరిస్థితి ఏర్పడింది.

ఊరిడవమన్నది కరువు
ఉరితాడై ఉన్నది కరువు
నవ ధాన్యాల మాటేలేదు పల్లెల్లో
వలసల ఏడ్పుల వలస బాటలో

అనే పాట పల్లె, జీవన దుస్థితిని కనులకు కట్టినట్టు తెలుపుతుంది.

ప్రపంచీకరణ పేరుతో పల్లెల్లో జరిగిన విధ్వంసం వర్ణించలేనిది. మనుషులే కాదు పల్లెలు కూడ మూట గట్టుకుని నగరాలకు వలసబాట పట్టినయి మిగిలిన పల్లెలు కృత్రిమమైన నాగరికత ముసుగేసుకున్నాయి సాంస్కృతిక పరాయికరణకు గురయ్యాయి. నేడు పల్లె ఆనవాళ్లు వెతుక్కొవాల్సి వచ్చింది

ప్రపంచీకరణ విద్యారంగంపై కూడ ప్రభావం చూపింది గత శతాబ్ధి కాలం నుండి గ్రామీణ యువత విద్యారంగంలో కొంతమేర ముందుకెళ్లినా సాధారణ విద్య సభ్యసించడం వల్ల నిరుద్యోగంతో బాధపడుతున్నారు అంతేకాదు ఉన్నత విద్య కోసం పల్లెలు వదిలి పట్నం రావడం , చదువుకోవడం కోసం ఫీజులు కట్టేందుకు తల్లి తండ్రులు పొలాలు తాకట్టు పెట్టడం చివరికి అమ్మడం ఉద్యోగం రాక పట్నంలో బతకలేక పెల్లెటూరుకు వెళ్లలేక అవస్థలు పడడం జరుగుతుంది .

నిజానికి పూర్వం పల్లెలు పచ్చదనానికి చిరునామాగా ఉండేవి కాని ప్రపంచీకరణ మానవ జీవితాలలో అనేక మార్పులు తెచ్చింది నాటి చెరువులు, పొలాలు గట్లు, తుమ్మచెట్లు, రచ్చబండ, పురాణాలు కనుమరుగై పోతున్నాయి. "దేవుల పల్లి కృష్ణశాస్త్రి" గారన్నట్లు మా ప్రపంచీకరణ పల్లె జీవనా విధానమే మార్చేసింది ప్రపంచీ కరణ మార్పు తట్టుకోలేక నా పల్లెలు ఘోషిస్తున్నాయనేది అక్షర సత్యం.

పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
నా తల్లి బండీ అయిపోతుందో కనిపించని కుట్రల

పల్లవిలోంచే పల్లె జీవిత చిత్రాన్ని విషాదమయిన బతుకు చిత్రాన్ని దుఖస్వరంలో చూపించారు. "ప్రపంచీ కరణ" కుట్రను పసిగట్టి ప్రజలను జాగ్రతం చేసే గీతం.

మడుగులన్ని అడుగంటినవి

బావులు సావుకు దగ్గరయ్యినవి

.....

పేద రైతుల బావులెందుకెండే నా పల్లెల్లోనా..

అంటూ పల్లె రైతుల దుస్థితి తెలిపాడు. నాటి పల్లెలు విరబూసిన కుసుమాలు. కోడికూత, ఎద్దుల మోత, గాజుల గలగల, చీపురు చప్పుడు, చాటల చెరుగుడు, వంగి వరిచేను కోసే నడుములు , మోకాలి మీది గోచిలు, కొప్పున పూలు, కూని రాగాలు, పిల్ల తల్లుల జోలపాటలు, రచ్చబండ ముచ్చట్లు, రావిచెట్టు గాధలు, మంచినీళ్ల బావి కాడ ముల్లె విడిచిన సద్దులు, చింతచెట్టుకు ఊగే ఉయ్యాలలు, చెరువుగట్టు కాడ తోపులాటలు, కచ్చీరు కాడ గోలీలాటలు నేడు మధుర జ్ఞాపకాలు.

ఆధార గ్రంథాలు :

1) గోరెటి ఎంకన్న సాహిత్యం
2) ఊతకర్రలు - శిరంశేట్టి కాంతారావు (విశాలాంధ్ర పబ్లిషర్స్)
3) మా ఊరు పోయింది - దేవులపల్లి కృష్ణశాస్త్రి

❖ ❖ ❖

వ్యవసాయంరంగంపై ప్రపంచీకరణ ప్రభావం - కథా సాహిత్యం

– డా॥. కె. రమేశ్, సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

సమాజంలో మానవుని జీవనశైలి ఎప్పటి కప్పుడు మారుతున్నకాలానుగుణంగా నూతన జీవనవిధానాన్ని ఎప్పటికప్పుడు అలవరుచుకుంటుంది. ఆ విధంగా మార్పు చెందుతూనే అనాగరికత నుండి నాగరికతవైపు వెళ్తుంది. ఈ కాల క్రమంలో అనేక ఆధునిక మార్పులకు లోనయింది. ప్రస్తుత ప్రపంచంలో మానవుడు తనకు తానుగా ఉనికిని చాటుకుంటున్నాడు. ఈ పరిణామ క్రమంలో ఆధునికంగా పెరుగుతున్న ప్రపంచీకరణ ప్రభావం మానవుని జీవితంపై తనదైన ప్రభావాన్ని వేసింది. ప్రస్తుత కాలంలో అత్యంత చర్చనీయాంశమైన 'ప్రపంచీకరణ' దీన్నే ఆంగ్లంలో ''గ్లోబలైజేషన్'' (Globalization) అని వ్యవహరిస్తున్నారు. నేడు స్వేచాహాణిజ్య విధానాన్నే ప్రపంచీకరణ అంటున్నారు.

18 వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం ప్రపంచీకరణకు దారి తీసిందని చెప్పుకోవచ్చు. యూరప్ దేశాలలో సహజ వనరులు సాంకేతిక పరిజ్ఞానం మిగతా ప్రపంచ దేశాలకంటే ఎక్కువ. తత్ఫలితంగా యూరప్ దేశాలు వలసలను స్థాపించాయి. ఈ వలసలు బలపడడానికి పారిశ్రామిక విప్లవం మరొక ముఖ్య కారణం అయింది. ఈ విప్లవం రావడంతో ప్రపంచ దేశాల్లో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మరియు ఆర్థికపరమైన విషయాలతోపాటు చేతి వృత్తులు, వ్యవసాయంలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి.

దీంతో ప్రపంచ ఆర్థికవ్యవస్థను పునర్నిర్మాణం చేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ ఆర్థికవ్యవస్థను చక్కదిద్దడానికి ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు ఏర్పడ్డాయి. మరియు శాస్త్ర, సాంకేతికంగా అభివృద్ధి చేసే ప్రయోగాల కారణం కూడ ప్రపంచీకరణకు కారణమవుతున్నాయి. ప్రపంచీకరణ అనేది ఆర్థికపరమైన, వాణిజ్యపరమైన విధానాలతోపాటు రాజకీయ, సాంస్కృతిక అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది.

ఆధునిక సాహిత్యంలో ఎక్కువగా ప్రభావవంతమైనది, సమాజంలో ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న దోపిడులను బహిర్గతరపరచే సాధనం కథా సాహిత్య ప్రక్రియ. ఈ కథా సాహిత్య రంగంలో వృత్తి కథా రచయితలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. ప్రపంచీకరణ వల్ల, వ్యవసాయక, కులవృత్తులు కోల్పోవడం జరుగుతుంది. దీనికి సాంకేతిక, పారిశ్రామికరంగాల్లో అభివృద్ధిపేరుతో నయా వంచనాలతో ముసుగుగప్పుకొన్న పెద్దబడిదారుల పెత్తందారు కబంధహస్తాల్లో వృత్తి జీవితాలు కాస్తా కూలీలుగా మారిపోయారు. ప్రస్తుతం వృత్తి కులాల జీవితం 'పూలు అమ్మినచోటే కట్టెలు అమ్మడం'లాగా మారిపోయింది. పల్లెల్లోని వృత్తులన్నీ విధ్వంసాని గురవుతున్నాయి. ఈ అంశాలన్నింటిని ప్రపంచీకరణ దృక్పథంతో అభివృద్ధిపేరుతో వ్యవసాయరంగానికి జరిగిన అన్యాయాన్ని వృత్తికథల్లో ఏవిధంగా చిత్రించారో విశ్లేషించడమే ఈ పత్రోద్దేశ్యం.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భూతద్దం పెట్టివెతికినా మంచి కనిపించడం లేదు. వ్యవసాయ ఆధారిత దేశాలను అన్ని రకాలుగా ప్రపంచీకరణ కబలించింది. ఈ నేపథ్యాన్ని మేరెడ్డి యాదగిరిరెడ్డి 'బిటి విత్తనం' కథలో ''ఎవరినోట విన్నా బిటి బిటి.. బోల్‌గార్డ్.. బన్ని బిటి పత్తిగింజలు అందమైన ప్యాక్‌లు. బడా బహుళజాతి కంపెనీలు బిటి పత్తి విత్తనాలను తయారుచేసి రైతులమీదికి వదిలాయి. చీడల పీడల బాధుండదు. దిగుబడి బాగా వస్తుందని ఊదరగొట్టు ప్రచారం. విత్తన మాయా ప్రపంచంలో రైతన్న లక్షల ఎకరాల్లో పత్తి పంట. ఇదివరకైతే రైతు తన

విత్తనాలు తానే తయారుచేసుకునేవాడు. తన చేలో బలంగా ఉన్న మొక్కల నుండి విత్తనం ఏరుకొని తాలు తీసి ఎండబెట్టి తొలకరిలో విత్తుకునేవాడు. ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో సాంప్రదాయ విత్తనాలు కనుమరుగై హైబ్రిడ్, బిటి విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుల మందులు, బహుళజాతి కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోయాయి" (యాదగిరిరెడ్డి, మేరెడ్డి. 2010 : 54). ఈ పేరుతో కంపెనీ మొదట విత్తనాలను అమ్ముకుంది, తరువాత తనకు అనుకూలమైన పంట లను వేయాలన్నది. ఆ పంటలకు పట్టిన పురుగులను చంపడానికి బహుళజాతి కంపెనీలు తయారు చేసిన మందులనే వాడాలనే దుస్థితి కల్పించారని ఈకథలో బలంమైన అభిప్రాయాన్ని రచయిత బహిర్గతపరిచారు.

అంతేకాకుండా పంటకు మేలుచేసే ఎన్నో రకాల కీటకాలు, పురుగులు ఈ రసాయనిక మందుల వాడటం వలన చనిపోయాయి. పంటను ప్రకృతి సహజంగా రక్షించుకునే అవకాశాన్నిరైతు కోల్పోయాడు. అనవసరంగా క్రిమిసంహార మందులపై ఆధారపడేటట్లు ప్రపంచీకరణ చేసింది. ఈ దేశంలో అమ్ముతున్న పురుగుల మందుల్లో తొంభై శాతం బహుళజాతి కంపెనీలు అమ్ముతున్నవే.

బహుళజాతి కంపెనీలు తయారుచేసిన మందులను అమ్ముకోవడం కోసం ఇతర దేశాలు నష్టపోయినా పర్వా లేదు మాకు మాత్రం లాభాలు రావాలనే దురాలోచన ప్రపంచీకరణలో ఉంది. విత్తిన విత్తనాలు మొలకెత్తక, మందుకొడితె పురుగుకు బదులుగా పంట మొత్తం నష్టపోయి రైతు నష్టాల బారినపడి అప్పులబాధలతో జీవించడానికి భారమై ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితిని ప్రస్థుత సమాజంలో ప్రత్యక్షంగా కళ్ళముందు కనిపిస్తూనే ఉన్నాయి.

ప్రపంచీకరణలో వ్యవసాయరంగం :

విదేశీ పెట్టుబడులతో ప్రస్తుతం మన వ్యవసాయ విధానం అభివృద్ధిపేరుతో అగమ్యగోచరమైన స్థితిలో ఉంది. హరిత విప్లవం తన ఊపుని కోల్పోవడం వల్ల పంట దిగుమతి స్తంభించిపోవడమే కాకుండా తగ్గుముఖం పడుతుంది. దీనికి గల కారణం సరళీక్రృత ఆర్థిక విధానాలు, సంపన్న దేశాలు వాణిజ్యం తరువాత వ్యవ సాయంపై దృష్టి సారించాయి. ఈ అంశాల్ని చొప్పదండి సుధాకర్ 'గడ్డిపరక' కథలో "విదేశీబ్యాంకా? యస్.. కోట్లాది డాలర్లు ఇందుకోసం ఉదారంగా, ఉచితంగా అందిస్తోంది. మొదటి సంవత్సరం ప్రతి జిల్లాలో వెయ్యి ఎకరాల చొప్పున, దేశంలో వంద జిల్లాల్లో మొత్తం దేశంలో వచ్చే పదేళ్ళలో ప్రస్తుతమున్న గడ్డినంతటినీ రూపుమాపి కొత్త గడ్డిని సాగుచేయాలని కృతనిశ్చయంతో ఉంది" (ఎల్లారెడ్డి, కర్ర(సంపా). 2009 : 29). బహుళజాతి కంపెనీలు ఇక్కడి సహజ వనరులను పనికిరాని వాటిగా విషప్రచారం చేసి విదేశాలనుండి వచ్చే వాటిని అత్యుత్తమంగా ప్రకటనల ద్వారా ప్రచారం చేసుకొని ఏవిధంగా అమ్ముకుని ఎలా సొమ్ము చేసుకుంటున్నారో తెలిపే కథ ఇది. నేడు ప్రజల అవసరాలను బట్టి కాక తమ వ్యాపార ప్రయోజనాల మేరకు ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు ప్రవేశపెట్టాయి.

"19వ శతాబ్దం ప్రథమార్ధంలో బ్రిటీషు వారు మన దేశంలో రవాణా సౌకర్యాలు కల్పించి ఎగుమతులకు పనికొచ్చే పంటలు పండించాలని ఒత్తిడి తెచ్చారు. నాటి నుండి రైతులు పత్తి, పొగాకు, చెరకు వంటి వాణిజ్య పంటలు పండించడం ప్రారంభించారు. అప్పటి నుంచే ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోయింది. ఆ మందుల వల్లనే నేడు సారవంతమైన నేలలు వాణిజ్య పంటలు పండించడంచేత దేశంలో తిండి గింజల ఉత్పత్తి నిరం తరం తగ్గుతూ వచ్చింది" (దేవేందర్, అన్నవరం. 2002 : 4). దేశీయ మార్కెట్‌లోకి విదేశీ వ్యవసాయ దిగుమతు లను యథేచ్ఛగా అనుమతించడంతో దిగుమతులు పెరిగి ఇక్కడి రైతులకు విలువలేకుండా పోయింది.

ప్రస్తుతం వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశించి కార్పోరేటు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ కార్పోరేటు సంస్థలు రోజురోజుకు సారవంతమైన భూము

లను సొంతం చేసుకుంటూ వినాశకర రసాయనాలను ఉపయోగిస్తూ భూములను నిస్సారంగా తయారు చేస్తున్నాయి.

డబ్ల్యూటిఓలో చేరిన దేశం వ్యవసాయ రంగంలో వాణిజ్య పంటలను ప్రవేశపెట్టాలని రైతులపై ఒత్తిడి తెచ్చింది. వ్యాపార పంటలు వేస్తే అధిక లాభాలొస్తాయని ఎండమావులను చూపింది. వీటి వెంట పరుగెత్తిన రైతుల జీవితంలో అనేక పార్శ్వాలను పెద్దింటి అశోక్ కుమార్ 'కీలుబొమ్మలు' కథలో వివరించారు. కార్పోరేటు వ్యవసాయ విధానాన్ని వివరించే కథ ఇది. వార్తాపత్రిక ఎడిటర్ సర్వాయి పల్లెకు వెళతాడు. అక్కడ వ్యవసాయ విధానంలో వచ్చిన పలు మార్పులు గమనిస్తాడు. అతడు దారిలో వెళ్తున్నప్పుడు గతంలో వార్తా విలేఖరిగా వచ్చినపుడు రైతుల దుస్థితి, దానికి కారణమైన ప్రభుత్వ విధానాలు పరిశీలిస్తాడు.

ప్రస్తుతం మళ్ళీ అటువంటి పరిస్థితులే చూస్తాడు. గ్రామ సర్పంచ్ ఇంతకు ముందుకంటే ఇప్పుడు ధనవంతుడయ్యాడు. రైతులచేత ఉద్యమం చేయిస్తున్న తనని ఏ చట్టం కింద అరెస్టు చేశారో తెలియదు తనకి. ఇది కథావస్తువు. ఇంకా ఈ కథలో "పూలసాగుకు హాలెండ్ బొకారో కంపెనీ ప్రవేశించి తల్లిలాంటి తమ భూమి తమది కాకుండా పోయాక మనుసు బండ బారిపోయింది, మనుషులూ బండబారి పోయారు. యంత్రాల్లా పనిచేస్తున్నారు. ఏడ్పులు మామూలై పోయాయి" (అశోక్ కుమార్, పెద్దింటి. 2002 : 105). రైతుల దీనావస్థను బహిర్గత పరుస్తుందీ కథ.

ప్రపంచీకరణలో రైతు అస్తిత్వం :

'కీలుబొమ్మలు' కథలో చేపల నీలి విప్లవాన్ని విచిన్నం చేసిన ఆక్వాకల్చర్, పసుపు పచ్చ విప్లవాన్ని నాశనం చేసిన పామాయిల్, శ్వేత విప్లవాన్ని దెబ్బతీసిన సింతటిక్ మిల్క్ ఫ్యాకెట్స్, నెదర్లాండ్ పాలు, అమెరికా గోధుమలు, చైనా బియ్యం, చక్కెర పప్పులు చౌకగా మార్కెట్లను ముంచెత్తాయి . దీంతో ఇక్కడి రైతు అస్తిత్వాన్నే కోల్పోయే స్థితిని కథ ప్రపంచీకరణ గురించి పాఠకులకు విస్తృత అవగాహన కల్పిస్తుంది. రచయితకు ఇతివృత్తంపై ఉన్న పట్టు అమోఘమైంది. ప్రపంచీకరణ గురించి తెలియకుండానే రాస్తున్నారనే అపవాదును ఈ రచయిత తుత్తునియలు చేశారు. ప్రపంచీకరణ వెనుక దాగివున్న రాజకీయ, ఆర్థిక కుట్రలను బహిర్గతం చేశాడు. ఒక పత్రికా విలేఖరి ప్రపంచీకరణను అర్థం చేసుకున్న కోణంలో కథ నడుస్తుంది. "పాశ్చాత్య దేశాల్లో నిషేధించబడిన ఎన్నో అపాయకరమైన రసాయనాలను సామ్రాజ్యవాద దేశాలు భారత్‌లో అమ్ముకుంటున్నాయి" (చౌదరి, కె.ఆర్. 2005 : 16). అంటే దీనికి కారణం మన రాజకీయ రంగంలో ఉన్న లోపాలవల్లనే మన దేశంలో అభివృద్ధి, సాంకేతికత పేరుతో ఇక్కడ ప్రవేశపెట్టడం జరుగుతుంది.

ఈ విషయాలను పెద్దింటి అశోక్ కుమార్ "ప్రభుత్వం జనటికల్ ఫుడ్స్ ప్రాజెక్టుకు ఇక్కడ అనుమతి ఇవ్వాలని చూస్తోంది. ఈ ఏటితో డచ్ కంపెనీతో పూల కాంట్రాక్ట్ పూర్తవుతుంది. ఫ్రాన్స్ కు చెందిన జరీన్ కంపెనీతో ఇక్కడ కూరగాయలు పండించాలని చూస్తోంది. అవి మామూలు కూరగాయలు కాదు... వీటి సాగులో పెద్ద ఎత్తున రసాయనాలు వాడాలి. నీటి వాడకం కూడా ఎక్కువ. రెండు పంటలకే భూగర్భజలాల్లోకి నైట్రేటులు చేరుకుని నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం మొదలై ఆరోగ్య సమస్యలు మొదలైనవి. అక్కడ ఆపేసి తెలివిగా ఇక్కడికి తేవాలని చూస్తున్నారు" (అశోక్ కుమార్, పెద్దింటి. 2002 : 109). ఈ దేశ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పట్టించుకోకుండా ఇక్కడికి తేవాలని చూస్తుంటారు. అంతే కాకుండా ఇంకా ఈ కథలో రైతులు, వ్యాపారస్తులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలకు కారణాలను రచయిత సంభాషణా ధోరణిలో చెప్పాడు.

కార్పోరేటు వ్యవసాయం వల్ల రైతులు భూములు కోల్పోవడం :

ప్రస్తుత వ్యవసాయ విధానాన్ని వివరించిన మరో కథ 'దార్ల రామచంద్ర' రచించిన 'గద్దొచ్చే - కోడిపిల్ల' కథ.

కార్పోరేటు వ్యవసాయం చేయడానికి ఇజ్రాయిల్ నుండి దొరగారు వచ్చారని ఇక్కడ అంతా కార్పోరేటు వ్యవ సాయం జరుగుతుందని మల్లయ్యతో వీరయ్య చెబు తాడు. ఇంకా వందల ఎకరాల భూమి ఉన్న పెద్దపెద్ద భూస్వాముల భూములు కూడా విదేశీ దొర కొన్నాడని అందులో రకరకాల వాణిజ్య పంటలు వేస్తారని పేర్కొం టారు. ఇంకా రంగారెడ్డి జిల్లాలో పనికి ఆహార పథకం కింద వచ్చిన బియ్యాన్ని అక్కడ రాజకీయ నాయకులు అమ్ముకొని తిన్నారని వివరిస్తారు. ఇందులో ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌తో పెరిగిపోతున్న నిరుద్యోగం గురించి వివరిస్తాడు రచయిత.

ఊర్లో ఉన్న భూములన్నింటినీ ఇజ్రాయిల్ కార్పోరేటు వ్యవసాయ దారులకు అమ్మడం వలన ఊర్లో అందరు భూమిలేని వ్యవసాయ కూలీలుగా మారుతారు. ఆ భూముల్లో సుగంధ ద్రవ్యాలు, ఆలుగడ్డ మొదలగు వాణిజ్య పంటలు విదేశాలకు ఎగుమతి చెయ్యడానికే పండించడం జరుగుతుంది. చివరికి రైతులకు కూడా ఆహారం దొరకడం కష్టమైపోతుంది. "ఊర్లో నాలుగెకరాలు పంటలు పండించుకొని ఉన్నదాంట్లో త ృప్తిగా బతికే రైతుని నేను. గిప్పుడు గీ కార్పోరేటు వ్యవసాయం పేరు జెప్పి గీల్లు మాభూములని కాజేసిరి" (సత్యనారాయణ, ఎస్వీ(నంపా). 2003 : 105). చివరికి పెద్దపెద్ద భూస్వాములు భూమిని అమ్ముకొని కార్పోరేటు వ్యవసాయదారుల దగ్గర జీతానికి పనిచేయవలసిన పరిస్థితి వచ్చిందని ఈ పాత్రల ద్వారా ఎలాంటి దారుణానికి సిద్ధపడ్డారో తెలుపుతుందీ కథ.

ప్రపంచీకరణలో రైతు జీవితం :

ప్రపంచీకరణ ప్రభావంలో రైతు జీవితం ధ్వంస మయింది. అయితే గ్రామాల్లో పుట్టిపెరిగి మధ్యతరగతి వర్గం ప్రపంచీకరణ తరువాత గ్రామాన్ని చూసి అనుభ వించిన వేదనను అప్పల్నాయుడు 'క్షతగాత్ర గానం' అనే కథలో తెలియపరిచారు. ఈ కథలో నాలుగు దశాబ్దాలలో గ్రామం ఎలా ఉందో రచయిత చర్చించాడు. గ్లోబలైజేషన్ సృష్టించిన విధ్వంసం కన్పిస్తుంది. "ప్రపంచీకరణ వ్యవసాయాన్ని కార్పోరేట్ వ్యవస్థగా మార్చటానికి శ్రీకారం చుట్టింది. ఇవన్నీ గ్రామీణ సామాజిక వర్గాల మధ్య అసమానతలను తీవ్రతరం చేసి గ్రామీణ జీవిత సంక్షోభా నికి కారణమయింది" (అప్పల్నాయుడు. అట్టాడ. 2009 : 6). గ్రామీణ జీవిత మూలాలను అప్పల్నాయుడు క్షుణ్ణంగా చిత్రించారు. వర్తమానంలో జీవిస్తూ గతంలోకి వెళ్ళి గత వర్తమానాల మధ్య కథా సంచారం చేయటం కథా రచనలో ఒక పద్ధతి. తను అనుకున్నది చెప్తూనే స్పష్టత, నూటిదనం అప్పల్నాయుడి కథలో మనకు కనిపిస్తుంది.

బహుళజాతి కంపెనీల కన్ను ఇండియా మీదనే! వ్యాపార పంటల ఆశ చూపి విత్తనాలు అమ్ముకున్నారు. పురుగులను పంట మీద చల్లి మందులు అమ్మారు. అందాల రాణుల కిరీటాలను ఇచ్చి సబ్బులు, పౌడర్ల వ్యాపారం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలలో రైతులకు ఎనభై శాతం సబ్సిడి ఇచ్చి, వర్ధమాన దేశాలకు సబ్సిడి ఎత్తేశారు. దీనికి ప్రపంచ బ్యాంకు విధానాలే కారణం. బ్యాంకు పెట్టిన షరతులకు తలొంచిన మన పాలకులు కరెంటు, ఎరువుల రేట్లు పెంచారు. పంటలకు రేటు లేకుండా చేశారు. అందుకే "ప్రపంచీకరణ పరిణామంలో నలిగిపోయింది రైతులు, కూలీలే! సినిమాలకి, పరిశ్రమలకి, ఇన్ఫర్మేషన్, టెక్నాలజీకి, సబ్సిడీలు పెంచిన గవర్నమెంటు రైతులకు మొండిచేయి చూపింది. కంప్యూ టర్లకు లోన్లిచ్చి, ఎరువు, విత్తనాల సబ్సిడి ఎత్తేసింది" (అశోక్ కుమార్, పెద్దింటి. 2003 : 118). ఈవిధంగా ప్రపంచబ్యాంక్ నిజస్వరూపాన్ని బహిర్గత పరిచాడు

అభివృద్ధి చెందిన దేశాల్లో పనికిరాని పంటను ఇక్కడ పండించి ఇక్కడి భూగర్భజలాల్లోకి నైట్రేటులు చేరేటట్లు చేస్తున్నారు. తద్వారా నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం వల్ల అనేక అంతుచిక్కని వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇలా వాణిజ్య పంటలతో తిండి గింజలను, కార్పోరేటు వ్యవసాయంతో స్వంత భూము

లపై హక్కులను పోగొట్టుకొన్న రైతుల గోసను, కల్తీ మందులను ఉపయోగించి అవి పనిచెయ్యక ఆత్మహత్య చేసుకున్న రైతు జీవిత నేపథ్యాన్ని జూకంటి జగన్నాథం 'రాజయ్య మజిలి' కథలో వివరించారు. ఈ సంవత్సరం తనకున్న రెండు ఎకరాలతోపాటు తన భూమి ప్రక్కనున్న నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట వేశాడు. పెరిగి పెద్దదై మొగ్గకు వచ్చి కాయలు పట్టింది అంతే! లద్ది పురుగు చేనంతా పడ్తుంది. పూవులు, కాయలు తెల్లారెసరికే రాలిపోయె స్థితికి వస్తాయి. వర్ధన్నపేటకు పోయి పురుగుల మందులు తెచ్చి పురుగులు చావాలనీ కొడతాడు. కానీ పురుగు చేనంతా రోజురోజుకూ ఎక్కువ అవుతుంది కాని ఫలితం మాత్రం శూన్యం. ఇంకా కథలో "పత్తి చేనుకు 'లగోడి' పదిహేను వేల వరకూ అయ్యింది. మొదటిసారి అటుపెట్టి ఇటుపెట్టి పత్తి ఏరితే ఆరు ఎకరాలకు కలిపి నూట ఇరవై క్వింటాళ్ళు రావాలనుకుంటే పదమూడు క్వింటాళ్ళు అయ్యాయి. ధర పద్దెనిమిది వందలు క్వింటాలుకు పలికింది. అమ్మిన పత్తిని బాకీ కిందికి సేటు జమ కట్టమన్నాడు. శనగలు బుక్కి చెర్ల చేతులు కడుకున్నట్లయింది. అరవై వేలదాకా అప్పు అయ్యి కూచుంది. సంక్రాంతి తర్వాత పత్తిమీద ఆశతో బిడ్డ పెండ్లి పెట్టుకుంటే పంట నోట్లే మన్నుకొట్టింది. మూడు చొప్పున మిత్తితోపాటు అప్పును బతికివుంటే తీర్చడం వల్ల కాదు. కళ్ళలో నీళ్ళూ తిరుగగా మిగిలిన అరలీటరు మోనోక్రోటోపాస్ మందును తీసుకుని మొండి ధైర్యంతో ముందుకు నడిచాడు" (జగన్నాథం, జూకంటి. 2004 : 81). ఈ విధంగా పంటలువేస్తే కల్తీ మందులతో ఉపయోగం లేక, మద్దతు ధర రాక, చేసిన అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని రైతు ఆత్మహత్యకు దారి తీసిన కారణాన్ని బలంగా వ్యక్తీకరించారు. ఇదే విధంగా కాలువ మల్లయ్య 'నేలతల్లి', నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'అన్నదాత, చెరువు', సుంకోజు దేవేంద్రాచారి 'నీడ, రాబందులు, అన్నదాత, గొంగళి పురుగు', బోధనం నర్సిరెడ్డి 'పేగుబంధం, బోరుపొక్కలు', మేరెడ్డి యాదగిరి రెడ్డి 'బోరుబిక్కింది'ఐతా చంద్రయ్య 'సప్తసముద్రాలు' మొదలైన కథల్లో ఈ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ముగింపు :

ప్రపంచీకరణ వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని సత్వరం చేస్తూనే దేశీయ పరిశ్రమలపై, వృత్తులపై దాడి చేస్తోంది. ఇది పిడికెడు మందికి మేలుచేసేది కాని చాలా మందికి ప్రపంచీకరణ నష్టం చేస్తున్నది. వ్యవసాయ రంగానికి చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులపై బహుళజాతి కంపెనీలు గుత్తాధిపత్యం సంపాదించి ప్రపంచీకరణ పేరుతో దోపిడి చేస్తున్నాయి. ప్రపంచీకరణ అంటేనే దోపిడి స్వభావాన్ని సంతరించుకున్న పెట్టుబడిదారి విషపుత్రికగా కనిపిస్తుంది. కాబట్టి అశేష ప్రజలకు ఆధారమైన ప్రాథమిక రంగంపై తన పట్టును సాధించి మన భూమిపై మనల్నే పరాధీనులను చేసే పథకం రచించింది. అంతే తప్ప ఈ ప్రపంచీకరణ ప్రజలకు మేలుసేసే ప్రపంచీకరణ కాదు. ఇది కచ్చితంగా దోపిడి వర్గాలకు మేలుచేసే ప్రపంచీకరణ. ఇక్కడి దేశీయ కంపెనీలు కూడా బహుళజాతి కంపెనీలతో పోటీపడలేక చతికిలపడుతున్నాయి. ఇన్ని రకాలుగా ప్రపంచీకరణ మౌలిక రంగమైన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుంది. దీన్ని గమనించి మనం జాగ్రత్తపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధారగ్రంథాలు :

1. యాదగిరిరెడ్డి, మేరెడ్డి. 2010. కొలిమి కథలు. హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌస్.
2. ఎల్లారెడ్డి, కర్ర(సంపా). 2009. తెలంగాణ కథ - 2008. హన్మకొండ: తెలంగాణ సాహితీ పబ్లికేషన్.
3. దేవేందర్, అన్నవరం. 2002. మరోకోణం(సామాజిక వ్యాసాలు). కరీంనగర్: నూతన సాహితి.

4. అశోక్ కుమార్, పెద్దింటి. 2002. ఊటబాయి. సిరిసిల్ల: నయనం ప్రచురణలు.
5. చౌదరి, కె.ఆర్. 2005. ప్రపంచీకరణ ఎవరిని ఉద్ధరించటాన్కి. హైదరాబాద్: ఎ.బి.కె.ఎమ్.ఎస్. ప్రచురణలు.
6. సత్యనారాయణ, ఎస్వీ. 2003. గ్లోబలైజేషన్ కథలు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్
7. అప్పల్నాయుడు, అట్టాడ. 2009. క్షతగాత్ర గానం(కథలు). హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
8. జగన్నాథం, జూకంటి. 2004. వైపని. సిరిసిల్ల: నయనం ప్రచురణలు.

❖ ❖ ❖

చైతన్య దీపికలు కథల సందేశం - ప్రపంచీకరణ ప్రభావం

– శశికళ. యస్, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

తెలుగులోని పురాణేతిహాసములన్నియు కథలే. ప్రాచీనాంధ్ర సాహిత్యంములో కథా కావ్యమునకు కావలసిన లక్షణాలను జతచేసుకుని ఛందోబద్ధముగ సాగినది. కేతన దశకుమార చరిత్ర, మంచన కేయూర బాహ్య చరిత్ర జక్కన్న విక్రమార్క చరిత్ర నుంచి పేదరాశి పెద్దమ్మ కథలు దాకా మొదలగునవి తెలుగు పాఠకుల లోను ఆదరమును అందుకొన్నవి. ప్రాచీన కథా సాహిత్యంలో ఛందోబద్ధముగా కొనసాగితే నేడు ఆధునిక కాలములో కథ సరళమైన వచనములో సాగినది. ప్రాచీన కథా సాహిత్యంలో వస్తువైవిధ్యము చక్కగా కనిపిస్తే ఈనాటి కథలో వస్తువైవిధ్యము మాత్రమే కాక శిల్ప విన్యాసము కూడా ముఖ్యస్థానంలో ఉన్నవి.

కథ అత్యంత ప్రాచీనమైన ప్రక్రియ. మౌఖికంగా "కథ" అనే విషయం తెలుగునాట అనాదిగా వచ్చింది. కానీ ఒక సాహితీ ప్రక్రియగా తెలుగు కథ రూపు దిద్దుకోవడానికి కొంత సమయం పట్టింది. కథ అనే ప్రక్రియ తెలుగులో తొలిసారిగా గురజాడ అప్పారావు రచించిన 'దిద్దుబాటు' కథను పేర్కొంటారు. బండారు అచ్చమాంబ, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ వంటి వారు గురజాడకు ముందే తెలుగు కథకు శ్రీకారం చుట్టారు. అయినా కూడా అన్నీ మంచి లక్షణాలు గల మొదటి కథగా 'దిద్దుబాటు'ను గౌరవిస్తున్నారు. తెలుగు సాహిత్యంలో మహాభారత రచనతో కవిత్రయంవారు కథలను ప్రారంభించారు. అలాగే భాగవతంలో కూడా అనేక కథలు ఉన్నాయి. కానీ వాటిని కథా కావ్యాలని చెప్పలేము. కథలు పద్యరూపంలో రచింపబడితే వాటిని కథాకావ్యాలు అంటారు. తెలుగు అకాడమీ నిఘంటువు ప్రకారం కథ అనగా కొంత సత్యాంశతో కూడిన కల్పిత గద్య గ్రంథం. ఆంధ్రదేశంలో చిన్నపిల్లలకు నిద్రపోవడానికి తల్లిదండ్రులు చిన్న చిన్న కథలు చెప్పడం బాగా అలవాటు. పాత కాలపు కథల్లో తూర్పుదేశాల కథలు ప్రసిద్ధి పొందాయి. తెలుగులోను, ఇతర భారతీయ భాషలలో కొత్త కథ పుట్టి సుమారు నూరేళ్ళయింది. ఈ నూరేళ్ళలో సుమారు లక్షకు పైగా కథలు రచించబడినట్లుగా ఒక అంచనా. ఇవి ఎక్కువగా దిన, వార, మాస పత్రికలలో ప్రచురింపబడుతున్నాయి. ఈ కథలు ముఖ్యంగా నీతి, ధర్మం, సాహసం, ఔదార్యం, శృంగారం వంటి విషయాలు ప్రధాన వస్తువుగా నడుస్తాయి.

ఇతర సాహిత్య ప్రక్రియలన్నింటికన్నా కథకి ఆదరణ ఎక్కువ. అలాంటి కథలలో కొన్ని నిజమైన సంఘటనలు, కొన్ని కల్పితం కలిగిన సంఘటనలు చోటుచేసుకుంటాయి. అలాగే కొన్ని సమాజానికి మరిన్ని సందేశాల్ని ఇస్తూ, ప్రభావితం చేసే విధంగా ఉంటాయి. అలా వచ్చిన ఈనాటి చైతన్య దీపికలు బాలల కథల సంపుటి, రచయిత దినవహి సత్యవతి ఎంతో సందేశాత్మకంగా తెలియజేసారు. చైతన్య దీపికలు కథలలోని కథల సందేశం ఏమిటో చూద్దాం.

చైతన్య దీపికలు కథలు సందేశం :

చైతన్య దీపికలు బాలల కథల సంపుటిలో 15 కథలు ఉన్నాయి. ఒక్కొక్క కథ ఒక్కొక్క ప్రత్యేకమైన సందేశాన్ని తెలియజేస్తూ, ఒక్కొక్క అంశంతో కథలు రాశారు. ఈ కథలన్నిటిలో ప్రముఖ పాత్రలతో చక్కని కుటుంబాన్ని పరిచయం చేస్తూ, పలురకాల కథల అంశాలు ఉండటమే కాకుండా, ప్రతి సమస్యకి పరిష్కారం కూడా చెప్తున్నారు. అంతే కాకుండా పిల్లల ముందు ఇంట్లో పెద్దలు ఎలా ప్రవర్తించాలో, ఎలా మాట్లాడాలో ఈ కథా సంపుటిలో రచయిత్రి సమాజానికి తెలియజేశారని చెప్పవచ్చు. నేటి బాలలే రేపటి పౌరులు అని పెద్దలు చెప్పిన మాట నూటికి

నూరుపాళ్ళు నిజం. మొక్కై వంగనిది మానై వంగునా అని ఒక నానుడి కూడా లేకపోలేదు.

చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే వాళ్ళకి మంచి చెడులు చెప్తూ అభివృద్ధి మార్గాలకు బాటలు వేయాలి. వాళ్ళ ఆలోచనా ధోరణుల్ని మెరుగు పరచాలి. మరి ఈ కథా సంపుటిలోని ఒక్కొక్క కథలో ఎలాంటి సందేశం సమాజానికి తెలుజేశారో గమనిద్దాం.

నేను సైతం :

ఈ కథలో చక్కని కుటుంబ సంభాషణ ద్వారా అపర్ణకు మంచి ఆలోచనధోరణి రావటం.

నేను సైతం :

ఈ కథలో కోడలు ఆలస్యంగా నిద్రలేవటం, అత్త బ్రేక్‌ఫాస్ట్ చేసి పెట్టి, కోడలికి చెప్పి న్యూస్ పేపర్ చదువుతూ అత్త కోడలి దగ్గర ఇలా అంటుంది, 'నూతన రాజధాని నిర్మాణానికి సహాయ నిధికి కొంత డబ్బు సహాయము చేద్దాం' అని అంటుంది. ఇలా వీళ్ళ సంభాషణ ద్వారా అపర్ణకు కలిగే మంచి ఆలోచన వలన తండ్రి ఇంటికి రాగానే తను దాచుకున్న కిడ్డి బ్యాంక్‌లోని డబ్బులను తెచ్చి, సహాయనిధికి నేను ఇస్తాను అంటూ తండ్రికి ఇస్తుంది. దీనివలన చిన్న పాపకి కలిగిన మంచి ఆలోచనను అపర్ణ తల్లి, బామ్మలా ప్రోత్సహించడం అవసరం. ఒక రూపాయైనా మంచి పనికి ఇవ్వాలన్న హృదయ భావం రావడానికి కుటుంబ సభ్యులు తోడుగా నిలబడి ప్రోత్సహించడం ఈ కథలో సారాంశం.

శభాష్ :

ప్రపంచంలో ఏది వృథా కాదు. కనీసం వస్తువులు కూడా వృథాగా పోవు. ఈ కథలో శ్రీజ ద్వారా ప్రతి ఒక్కరికి మంచి సందేశాన్ని తెలియజేసింది రచయిత్రి. కొన్ని సమయాలలో పిల్లలు మాట్లాడే మాటల్లో పెద్దలు చేసే తప్పులు సవరించుకునే సందర్భం ఎదురవుతూ ఉంటుంది. ఒక రోజు ఏదో వ్రాసుకోవాలసి వచ్చి, నాలుగు తెల్ల కాగితాలు ఉంటే ఇవ్వమని శ్రీజని అడిగింది. శ్రీజ కాగితాలని తెచ్చి ఇచ్చింది. తరువాత ఆ కాగితాలు వాడకం అయ్యాక వృథా చేయబోతుంటే శ్రీజ ఆ కాగితాలు భద్రపరిచి వాటిని చింపి 'స్లామ్ బుక్' చేసుకొని ఉపయోగించడం శ్రీజ పినికి ఒక మంచి ఆలోచనగా తోచింది.

దీని మూలంగా పిల్లలు చేయాలనుకున్న పనిని మనమూ గమనిస్తే అది ఎంత గొప్ప సందేశాన్ని మనకు చెప్తుందో, అప్పుడే మనం చేసే పనిలో తప్పులు సవరించుకోగలుగుతాము. అంతేకాకుండా శ్రీజ ద్వారా "వృక్షోరక్షతి రక్షితః" అనే సూక్తిని గుర్తుతెచ్చుకుని, ఏ వస్తువునూ వృథా చేయడం, దుబారా చేయడం పొరబాటని గుర్తించాలని ఈ కథ ద్వారా తెలిపారు.

స్నేహం :

ఈ కథలో సన్నివేశం అంతా స్నేహభావంతో కూడినది. మూడు పాత్రలతో మొదలైన ఈ కథా సారాంశం ఒక రోజు డాక్టరు కుటుంబం ఇల్లు మారే సందర్భం వస్తుంది. అక్కడే దగ్గర స్కూల్ కూడా ఉండటంతో నవీన్‌ను చేర్పించాడు. వాళ్ళ ఇంటి పక్కనే పనిచేసే అమ్మాయి కొడుకు రాజు కూడా ఆ స్కూల్లోనే ఒకే క్లాస్‌లో చదువుకుంటూ ఉంటారు. నవీన్ కి రాజుకి మంచి స్నేహం ఏర్పడుతుంది. ఒకరోజు హఠాత్తుగా రాజు ఇక స్కూల్‌కి రాడు అనే విషయం నవీనఖకి తెలిసి తండ్రి దగ్గరకు వెళ్ళి ఏడుస్తూ చెప్తాడు. మీ స్కూల్ ప్రిన్సిపల్ నా స్నేహితుడే, ఏడవకు ఏమైందో నేను తెలుసుకొని రాజుని మళ్ళీ స్కూల్లో చేర్పిస్తాను అని నవీన్‌కి తండ్రి మాట ఇస్తాడు. మరుసటి రోజు నవీన్ తల్లిదండ్రులు స్కూల్‌కి వెళ్ళి రాజు గురించి విషయాల్ని సేకరించగా తెలిసిన విషయాలు రాజుకి బొల్లి అనే చర్మవ్యాధి ఉందని, తోటి విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులు రాజు వస్తే మేము మా పిల్లల్ని పంపమని అంటున్నారు, అందుకే రాజుని స్కూల్ నుంచి నిలిపివేయాల్సి వచ్చిందని ప్రిన్సిపల్ చెప్పారు. అప్పుడే నవీన్ తండ్రి మళ్ళీ పేరెంట్స్ మీటింగ్ పెట్టమని, వాళ్ళతో నేను మాట్లడతానని చెప్పాడు. ఇక ఒకరోజు

అందరూ స్కూల్‌లో ఏకమై ఉండగా డాక్టర్ వచ్చి రాజుకు ఉన్న సమస్య గుర్తించాను. అది అంటువ్యాధి కాదు. దానివలన సమస్య మీ పిల్లలకు ఏముండదు. ఒక చిన్నవాడి భవిష్యత్తు పాడవడానికి మనం కారణం కాకూడదు. అంటూ చాలా విషయాలు తెలియ జేయటంతో వాళ్ళందరూ తమ తమ మనసులను మార్చు కుని రాజుని మళ్ళీ స్కూల్‌కి చేర్పించుకుంటారు. నవీన్ ఎంతో సంతోషంగా రాజుని గట్టిగా పట్టుకుని కబుర్లు చెప్పటం మొదలు పెడతాడు. రాజు తల్లిదండ్రులు అందరికి కృతజ్ఞతాభావం తెలుపుకుని ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోతారు. ఈ కథలో సారాంశం రాజుకి నవీన్‌కి గల స్నేహ బంధం కారణంగా రాజు మళ్ళీ స్కూల్‌కి రావటం నవీన్ తండ్రి మానవతా భావంతో స్కూల్‌లో అందరితో మాట్లాడి ఒప్పించటం అంతా కూడా సుఖాంతం అయ్యింది.

దాచు, దాచు, పనికివస్తుంది :

ఈ కథలో పాతికేళ్ళ చిన్నవయసులోనే భర్తను పోగొట్టుకున్న మల్లి ఆ ఇంటా, ఈ ఇంటా పనిచేసి కొడుకుని చదివించుకుంటోంది. సూరి బాగా చదివి తనకి ఆసరా అవుతాడని మల్లి ఆశ. ఒకరోజు సూరికి వారిలో పెన్ను దొరికితే తల్లి దగ్గరకు వచ్చి, అమ్మ పెన్ను దొరికింది అంటాడు. అప్పుడు తల్లి దాచు... దాచు... పనికివస్తుంది అని అంటుంది. మరుసటి రోజు సూరి ఏడుస్తూ అమ్మ నాకు నాన్న కావాలి, చూడాలి అని మారాం చేస్తూ అడుగు తాడు. అప్పుడు తల్లి మీ నాన్న త్రాగుడికి గురి అయ్యి చనిపోయాడు అంటే ఎక్కడ మారాం చేస్తాడో అని మీ నాన్న దేవుడు దగ్గర పని చేస్తున్నాడు అని చెప్పి, తాను ఏడుస్తూ ఉంటుంది. సూరి తల్లి ఏడవటం గమనించి తాను ఏడవటం ఆపి నిద్రపోతాడు. తరువాత రోజు సూరి మళ్ళీ అమ్మ పెన్ను దొరికింది అంటే తల్లి నవ్వుతూ అదే మాట చెప్పి వెళ్ళింది. ఒకరోజు సూరి వాళ్ళ స్కూల్లో ప్రిన్సిపల్ మల్లిని పిలిపించి నీ కొడుకు సూరి పక్కన వాడి బ్యాగ్‌లో వస్తువుల్ని దొంగిలిస్తున్నాడు అని చెప్పడంతో తల్లి బాధతో సూరిని మందలిస్తుంది. అప్పుడు సూరి నేను అమ్మ పెన్ను దొరికింది, పది రూపాయలు దొరికింది అంటే అమ్మ సంతోషంతో దాచు దాచు పనికివస్తుంది అని అంటుంది. అమ్మ ముఖంలో సంతో షాన్ని చూడటానికి ఈ పని చేశాను అని సమాధానం ఇస్తాడు. దాంతో మల్లి నేను వాడిని మందలిస్తే బాధ పడతాడు, భయపడతాడు అని వాడిని నిరుత్సాహ పరచటం ఎందుకని అనలేదు అని ఏడుస్తూ ప్రిన్సిపల్‌కి చెప్పింది. ఈ కథలో సారాంశం పిల్లలు ఏ పని చేసినా వాళ్ళని ప్రోత్సహించకూడదు. అందులో మంచి చెడులను తెలుసుకొని వాళ్ళకి తెలియజేస్తే రేపు వాళ్ళు చెడు తోవకు వెళ్ళే మార్గం నుంచి బయట పడగలరు. అందుకే పిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్న భావం రచయిత్రి ఈ కథలో చక్కగా ప్రపంచానికి వివరించారు.

మౌనపోరాటం :

ఈ కథలో ఒక గ్రామానికి చెందిన ముత్యాలు అనే బాలిక తన స్కూల్‌లో శౌచాలయాలు (టాయిలెట్స్) సరిగ్గా లేకపోవటంతో ఆడపిల్లలందరూ చాలా ఇబ్బంది పడుతున్నారని, ముఖ్యంగా నెలసరి రోజుల్లో సాయంత్రం వరకు బడిలోనే ఉండవలసి రావటంతో చాలా ఇబ్బంది కరమైన పరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తోందని, ఎన్ని సార్లు ప్రధానోపాధ్యాయుడికి చెప్పినా ఆయన పెడచెవిన పెడుతున్నారని, ఇంక లాభంలేదు, ఏదో ఒకటి చేస్తే గాని ఈ సమస్యకి పరిష్కారం దొరకదు అని నిశ్చయించు కుని, బడిలో సరైన శైచాలయాలు కట్టిస్తేగానీ నేను నా తోటివారూ కూడా బడికి వెళ్ళేది లేదు అని నిర్ణయించు కుని, నడిరోడ్డు మీద మౌనపోరాటం కొనసాగించానని ఒక పేపర్ మీద రాసి అడిగి పెద్దమనిషికి ఇచ్చింది. ఇంతలో గ్రామపెద్దకి విషయం తెలిసి, వచ్చి చూసి, అడిగి, సరె అనటంతో అక్కడ గల గ్రామ ప్రజలు ముత్యాలుకి అభినందనలు తెలుపుతుంటే అక్కడ ఒక పెద్దమనిషి ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నావ్ అని అడుగగా బాధతో ముత్యాలు చూడగా తన తల్లి ముత్యాలుకి మాటలు

రావు, చిన్న వయసులో అడుకుంటూ తన గొంతుకి గాయం తగిలింది అని చెప్పడంతో ఆ పెద్దమనిషికి మరింత బాధ కలిగింది. కానీ ఎవరు చేయలేని పని మన ముత్యాలు చేసిందంటూ ఆ ఊరి ప్రజలు ఆమెను గౌరవించసాగారు. ఈ కథలో ముత్యాలు ఒక ఊరి సమస్యని తన ధైర్యంతో పరిష్కరించింది. ప్రతి ఒక్క ఆడపిల్ల పడే బాధకి పరిష్కార మార్గాన్ని చూపింది. ఇలా ఎన్ని ఊర్లు ఇలాంటి సమస్యలు ఉన్నాయో అని రచయిత్రి భావంలో ఉందని క్షుణ్ణంగా అర్థమౌతుంది. ఇప్పటికీ ఇలాంటి సమస్యలు కొన్ని గ్రామాల్లో ఉన్నాయంటూ, ఈ సమస్య తీరాలనే ఉద్దేశంతో ఈ ప్రభావం ప్రపంచం మీద కలగాలని ఉద్దేశ్యపూర్వకంగా తెలియజేసారు.

చింటు :

చింటు ఎంత తెలివిగలవాడో అని చెప్పటానికి ఈ కథలోని సారాంశం అర్థమౌతుంది. తండ్రి చాలా ఎక్కువగా బీడీ కాల్చటం చూసిన చింటూ తన తండ్రి చేత ఈ అలవాటు ఎలా మాన్పించాలా అని మధన పడుతూ ఉండగా క్లాస్‌లో టీచర్ గమనించి, వాడిని దగ్గరకు పిలిచి ఏమైందని అడగటం, వాడు అసలు విషయం చెప్పటంతో టీచర్ దీనికి పరిష్కార మార్గం నేను ఇస్తా అని ఒకరోజు బడిలో ఒక నాటక ప్రదర్శన ఉందని పేరెంట్స్‌కి మీటింగ్‌లో తెలియజేస్తుంది. ఆరోజు నాటకంలో పాపకి తీవ్ర చలిజ్వరంతో దగ్గుతుంటుంది. ఆసుపత్రికి తీసుకెళ్ళాలని తండ్రి వెళ్తాడు. అక్కడ డాక్టరు పరీక్షించి, మీ ఇంట్లో ఎవరికైనా పొగ త్రాగే అలవాటు ఉందా? అని ప్రశ్న వేస్తాడు, అప్పుడు తండ్రికి నేను పొగత్రాగేందుకు ఈ పాప అనారోగ్యానికి సంబంధం ఏంటా అని ఆలోచిస్తూ నేను తాగుతాను అని అంటాడు. డాక్టరు ఇలా అంటాడు 'మీరు తాగే బీడి, సిగరెట్ వలన పాపకి ఊపిరితిత్తులలో ఇన్‌ఫెక్షన్ అయ్యింది. త్రాగే వారికన్నా పీల్చేవారికే ఎక్కువ భారీ నష్టం అని తెలియ జేయటంతో, నన్ను క్షమించండి డాక్టరుగారూ, మీరు చెప్పినట్లే నిగరెట్లు తాగటం ఇప్పటినుంచే మానివేస్తాను అని పాపని బ్రతికించినందుకు చాలా కృతజ్ఞతలు. అని చెప్పి ఇంటికి వెళ్ళిపోతారు. ఈ నాటకం చూసిన చింటూ తండ్రి 'వామ్మో అందులో చూపించినట్లుగా నా బిడ్డకి కూడా ఏదైనా జరిగి ప్రాణం మీదకి వస్తే అనే ఆలోచనే ఎంత భయంకరంగా ఉందో' అనుకొని ఇంటికి వచ్చి, బీడీ ప్యాకెట్లన్నీ చెత్తబుట్టలో పడేయటం, అది చూసిన భార్య ఆశ్చర్యంతో చింటూకి చెప్తుంది. అప్పుడు చింటూ ఈ విషయంలో తన టీచర్ తప్పక సహాయం చేస్తానని చెప్పిన ధైర్యం గుర్తుకు వచ్చి, తల్లితో చెప్పుకుంటాడు. బహుశః చింటూ టీచరుగారు వాడి సమస్యనే ఇలా నాటకంలా వ్రాసి, దాని ద్వారా అందరికీ ఒక మంచి సందేశాన్ని తెలియజేసే ప్రయత్నం చేశారని చింటూ తల్లి అర్థం చేసుకుంది.

ఈ కథలోని సారాంశం తండ్రి పొగత్రాగటం వలన చింటూకి కలిగిన ఆలోచన ధోరణ, దాంతో టీచర్‌కి చెప్పి బాధపడటం, టీచర్ దీనికి పరిష్కార మార్గం ఒక నాటక రూపంలో తీసుకొని రావటం, అది చూసిన చింటూ తండ్రిలో ఒక్కసారిగా మార్పు రావటం, ఇంటికి వచ్చి సిగరెట్ ప్యాకెట్ పారవేయటం ఒక పరిష్కారంగా ఎన్ను కొనబడిన కథగా రచయిత్రి ఎన్నుకున్నారు. సమాజంలో పొగత్రాగటం హానికరం అని ఎన్ని బోర్డులు పెట్టినా వినని సమాజం నేడు అయినా ఎంతో కొంత ఈ కథ ఉప యోగకరంగా ప్రపంచానికి ఓ మంచి ప్రభావంగా మారు తుందని ఉద్దేశ్యపూర్వకంగా సందేశాన్ని రచయిత్రి దినవహి సత్యవతి వాపోతున్నారని అర్థమౌతుంది. ఇలా ఈ విధంగా మంత్రం, సత్కార్యం, దీక్ష, పుట్టినరోజు పండుగ మొదలైన 15 కథల్లో ఇలానే మంచి సందేశాల్ని నింపి, ప్రపంచీకరణానికి ప్రభావం అయ్యేలా చైతన్య దీపికలు బాలల కథల సంపుటి ద్వారా ఆకాంక్షించారు.

ముగింపు :

ఈ కథా సంపుటిలో రచయిత్రి 15 కథలు రాసి, అందులో ప్రతి కథలోనూ గొప్ప సందేశాన్ని ఇస్తూ, అలాగే

తన ఉద్దేశాలను కూడా తెలుపుతూ, కథలోని సారాంశాన్ని ప్రపంచానికి ఎంతవరకు ప్రభావితం అవ్వాలో కూడా అవసరం ఉందని వాపోతున్నారు. నేనుసైతం కథలో కుటుంబం సంభాషణ ద్వారా అపర్ణకి కలిగిన మంచి ఆలోచనాధోరణి, సమాయం చేయాలనే గుణం, రెండవ కథ శభాష్ లో ఏది వృథా కాదు అన్న భావన శ్రీజ ద్వారా తెలియజేయటం, 2. స్నేహం లో నవీన్, రాజుల మధ్య స్నేహ బంధం వలన సమాజానికి అందిన సందేశం. 4. దాచు దాచు పనికొస్తుంది అనే కథలో పాతికేళ్ళ వయసు గల తల్లి పడుతున్న కష్టాలు పిల్లాడిని పోషించే విధానం. అంతేకాకుండా పిల్లలు ఏది చేసినా ప్రోత్సహించకుండా మంచి చెడులను విమర్శించి, మంచి మార్గం చూపడం అవసరం అని చెప్పిన కథగా చెప్పుకోవచ్చు. 5. మౌన పోరాటం లోని 12 ఏళ్ళ పాప ఊరికోసం బడిలో శౌచియాలను కట్టించమని పోరాటం చేసిన విధానాన్ని చెప్పారు. ఇలా మొదలైన కథల్లో రచయిత్రి గొప్ప సందేశాల్ని ఎన్నుకొని ఇవన్నీ ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ, ఇలాంటి సందేశాలు కొంతవరకు ప్రభావితం చేయాలన్న ఆకాంక్ష రచయిత్రిలో ఎంత నిగూఢంగా ఉన్నాయని అర్థమవుతుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. 'చైతన్య దీపికలు' బాలల కథల సంపుటి - దినవహి సత్యవతి.
2. తెలుగు కథానిక స్వరూప స్వభావాలు - డా॥ పోరంకి దక్షిణామూర్తి.

❖ ❖ ❖

రైతు, పల్లె జీవనంపై ప్రపంచీకరణ ప్రభావం - తెలుగు సాహిత్య విమర్శ

– సారంగపాణి బండి, వరంగల్లు.

1990 దశకంలో ప్రారంభమైన ఈ గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) ప్రస్తుతం ఎక్కడ చూసినా, ఏ చిన్న అభివృద్ధి కార్యక్రమంలోనైనా, ఉపన్యాసాలలో, వార్తా పత్రికలలో, ప్రసార సాధనాలలో మనం నిత్యం వినే పదం, వినిపించే పదం ప్రపంచీకరణ. ఈ పదం ఒక్క మన దేశంలోనే కాదు ప్రపంచంలోని నలుదిశలూ వ్యాపించింది. ఈ ప్రపంచీకరణ కారణంగా మనం ఎన్నో కొత్త విషయాలను కనుగొంటున్నాం, సమాచారంను అతి తక్కువకాలంలో పొందుతున్నాం, గమ్య స్థానాలను అత్యంత వేగంగా చేరుకుంటున్నాం, అంతే వేగంగా సమస్త జీవరాశి మనుగడను ప్రశార్థకంగా చేస్తున్నాం. అన్నింటి కంటే ముఖ్యంగా ఎంతో అమూల్యమైన, సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కుల వృత్తులు, పల్లె జీవనం ఇలా ఎన్నో అపురూపమైన వెలకట్టలేని సంపదలను దూరం చేసుకుంటూ వస్తున్నాం. ఈ ప్రపంచీకరణ విజయం సాధించడానికి ప్రధాన కారణం అయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలు అని చెప్పవచ్చు. ఈ ప్రపంచీకరణకు తమ అస్థిత్వాన్ని కోల్పోయిన రంగాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో సంప్రదాయ వ్యవసాయరంగం, కుల వృత్తులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరీకరణలో భాగంగా కను మరుగవుతున్న పల్లె జీవనాలు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం అత్యంత ప్రధానమైనది. అలాంటిది ప్రపంచీకరణ అనే మత్తులో దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతు వెన్నెముక విరగ్గొట్టడం ఎంతవరకు సమంజసమో ఈ ప్రభుత్వాలు చెప్పాలి.

ప్రపంచీకరణ ద్వారా కార్పోరేట్ సంస్కృతి వేగంగా విస్తరించింది. ఈ సంస్కృతి మానవ స్వభావాన్ని పూర్తిగా మార్చివేసింది. కంప్యూటరీకరణ అనేది మనుషుల మీద, వారి మనస్తత్వాల మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందంగా, హుందాగా, ఖరీదైన వేషదారణతో, మెలగాలని సహజ భావోద్వేగాలను దిగమింగుకుని, అణచుకొని ఇతరులతో మెలగాలి. ఎంత సంపాదించినా, ఎక్కడున్నా ఎదో వెలితిగా, పరాయి వాళ్ళతో ఉన్నట్లుగా, ఏకాకిగా జీవింపజేస్తుంది ఈ ప్రపంచీకరణ.

ప్రపంచీకరణకు ముందు సమాజం – స్థితిగతులు:

ప్రపంచీకరణ జరుగక ముందు సమాజ పరిస్థితులు ఆర్థికంగా అంత ఉన్నత స్థితిలో లేకపోయినా మనిషి జీవన విధానం, స్వచ్ఛంగా ఉండేది. మనుషుల మనస్తత్వాలు నిష్కళంకంగా ఉండేవి. సోదర భావంతో మెలగడం, పరమత సహనంతో వ్యవహరించడం, ప్రకృతిసిద్ధ వాతావరణంలో ప్రశాంత జీవనం. ఆరోగ్యకరమయిన కుటుంబ వ్యవస్థ. సేంద్రీయ వ్యవసాయ విధానం, ప్రాచీన కళలు, సంస్కృతి సంప్రదాయాలు, సమాజంలో నివశించే అన్ని రకాల కులాల వారు ఆర్థిక వ్యవస్థలో భాగం అయ్యారు. ఒకటేమిటే ఎన్నో రకాల జీవన వైవిధ్యాలను కలిగి ఉంది. ముఖ్యంగా చూస్తే

సంప్రదాయ వ్యవసాయ విధానం :

ఈ వ్యవసాయంలో రైతులు సంప్రదాయ విధానంలో, సేంద్రీయ, ఎరువుల వాడకం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను సృష్టించేవారు. ఈ రకమయిన వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేసేవి. ఈ

వ్యవసాయ రంగంపై అనేక మంది ఆధారపడేవారు. వ్యవసాయం అనేది కుటుంబం యొక్క ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. వ్యవసాయానికి అనుబంధంగా పశు పోషణ కూడా గ్రామీణ వాతావరణంలో ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది పశుపోషణ ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేది. సహజ వాతావరణ పద్ధతులకు లోబడి వ్యవసాయం చేయడం వలన ప్రకృతి సమతౌల్యం ఎప్పుడూ తప్పలేదు. స్వచ్ఛమైన నీరు, గాలితో పాటుగా నేలకూడా కలుషిత రహితంగా ఉండేది. అడవుల సంరక్షణ జరిగేది. మనదేశ వ్యవసాయరంగం అధికంగా వర్షాధారంపై ఆధారపడడం వల్ల ఋతుపవనాలు సకాలంలో వచ్చేవి. పంట దిగుబడిని అమ్ముకునే సమయంలో కూడా దళారీ వ్యవస్థల మోసాలు అంతగా ఉండేవి కావు. అదే విధంగా ఈ వ్యవసాయరంగానికి అనుభంధంగా ఎంతో మంది అసంఘటిత కార్మికులు జీవిస్తుండేవారు. వారిలో ముఖ్యంగా కొన్ని కులాలు చూస్తే కమ్మరి, వడ్రంగి ఇలా రైతులపై ఆధారపడేవారు.

సమాజంపై ప్రపంచీకరణ ప్రభావం :

ప్రపంచీకరణ ప్రభావం సమాజంలోని అన్ని వర్గాలపై పడిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ ప్రభావం అన్ని రంగాలతో పాటుగా భాషపై కూడా పడింది. పర భాషా వ్యామోహంలో మాతృభాషను నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. స్వచ్ఛమైన భావ కవితలు, సాహిత్యాలు చాలా అరుదుగా వస్తున్నాయి. ఉరుకుల పరుగుల జీవన ప్రయాణంలో మనిషి తనకు తెలియకుండానే యాంత్రికంగా మారుతున్నారు. అభివృద్ధి అనే సాకుతో నరగరీకరణ జరుగుతుంటే కన్న తల్లిలాంటి ఊళ్ళను విడిచి పట్నం వైపు పరుగులు తీస్తూ ఊర్లను వదిలేస్తున్నారు. పచ్చని పంట పొలాలను రియల్ ఎస్టేట్ అంటూ ఎడారిగా మారుస్తున్నారు. కంప్యూటరీకరణలో భాగంగా ఉద్యోగాల వేటలో కులవృత్తులకు దూరం అవుతున్నాం. ఆంగ్ల భాషా ప్రవేశం, ప్రమేయంతో భాషను నిర్లక్ష్యం చేస్తున్నాం.

ప్రస్తుత పల్లెల పరిస్థితులపై ప్రముఖ కవి గోరేటి వెంకన్న ఈ క్రింది విధంగా చెబుతాడు.

"పల్లే కన్నీరు పెడుతుందీ
కనిపించని కుట్రలో
తల్లీ కన్నీరు పెడుతుంది. . . . అంటూ "

తెలంగాణా పల్లెలు, పల్లెతనం కోల్పోయి ఏవిధంగా కన్నీరు పెడుతుందో చెప్పాడు.

ప్రపంచీకరణ ప్రభావంతో బతుకులు అతలాకుతలం అవుతన్నాయని ప్రముఖ కవి సి.హెచ్. ప్రకాష్ తన కవితలో ఈ విధంగా చెబుతాడు.

"విభిన్న మనుస్సుల
మనుషులన్న దరిత్రిలో
బురుజుల
బల రుజులు వెదకే చరత్రలో
కుతంత్రాల
ఇనుప యంత్రాల
ప్రపంచీకరణ పాదాల కింద నలిగిన
మానవ హక్కులు
సామాజిక అసమాతల మీద
అసహనం ప్రకటించడం
అసహజమేమీ కాదు " అని అంటాడు.

ప్రపంచీకరణ ప్రభావంతో నశించి పోతున్న నీటి వనరుల గూర్చి ప్రముఖ కవయిత్రి మహెజబీన్ "నీళ్ళు కావాలి" లో ఈ విధంగా గొంతెత్తుతుంది.

"కొంచెం నీళ్ళు కావాలి
గొంతు ఎండిపోతుంది
కొంచెం నీళ్ళు కావాలి
పొలం ఎండిపోతుంది
నీళ్ళు కావాలి
చాలా నీళ్ళు కావాలి
నీళ్ళు లేని నా బావి
నీళ్ళు లేని నా చెరువు

నీళ్ళు లేని నా నది
నన్ను చూసి నవ్వుతున్నాయి"

అని నీరు లేక ఎండిపోయిన బావినీ, చెరువునీ, నదినీ తలచుకుంటూ పోలాలకు నీరు అందించలేక కనీసం త్రాగడానికి కూడా నీళ్ళు ఇవ్వలేని దుస్థితిని చూసి నది, చెరువు, భావి నవ్వు కుంటున్నాయి అని అంటుంది.

"అమ్మ తర్వాత
నాకు సజీవత్వాన్ని ఇచ్చింది
ఈ నీళ్ళే కదా
నీళ్ళుండ బట్టేగా
నా పొలం పచ్చగా మెరిసింది
నీళ్ళుండ బట్టేగా
ఊరు కళ కళలాడింది
ఇప్పుడు నీళ్ళు లేవు
నీళ్ళ కోసం యుద్ధం
అవును
ఇక మీద జరిగే యుద్ధలన్నీ నీళ్ళకోసమే "

అని నీరు సజీవత్వానికి, వ్యవసాయానికి ఊరికి ఎంత ఉపకారం చేసిందో. ఇప్పుడు నీళ్ళు లేవు కనుక ఇక జరిగే యుద్ధాలు అన్నీ నీళ్ళకోసం జరుగుతాయి అంటారు.

పల్లెలన్నీ విధ్వంసం అవ్వడం, పల్లెప్రజల నగరాలకు వలస వెళ్ళడం, నగర జీవనం స్వార్థంగా, కృత్రిమంగా మారడంపై వసీరా, కాట్రగడ్డ దయానంద్, పాపినేని, గోదావరి శర్మ, గుండెలనకు హత్తుకునేలా కవితలు రాశారు.

"చిగురించని శిలల్ని పాతి
మొలిపించారు నిన్ను, ఓనగరమా!
కుసుమించని బాహువుల్తో
విస్తరిస్తున్నావు భవన వనానివై
కుడి చేత్తో అడవుల్లో వృక్షాలని పడగొట్టి
ఎడమ చేత్తో పార్కుల్లో మొక్కలు పెంచుతూ
ప్రకృతిని పరిహసిస్తున్నావు"

అని గోదావరి శర్మ నగరీకరణని బలంగా విమర్శనాత్మకంగా వ్యక్తీకరించారు.

ఇక తెలుగు కవిత్వంలో వినూత్న రూప ప్రక్రియగా వెలువడిన "నానీలు" కొత్త కవితారూపం. దీనిని 1997 సం॥లో డా॥ ఎన్. గోపి సృష్టించిన అద్భుత సులభతర సాహిత్యం అని చెప్పవచ్చు.

"నెర్రలు వారి
ఎండిన పోలాలు
రైతన్నలు
గుండెలూ అలాగే "

అని రైతు గుండె భాధన తెలుపుతాడు

"రైతన్న
ఎన్నడూ ఇంత కుంగి పోలేదు
నిందను
వానపైనే వేద్దామా? "

అని నగరీకరణలో భాగంగా పల్లెలను నిర్లక్ష్యం చేసి వర్షాభావం వల్ల ఎండిన పంట పోలాల రైతన్నల ఆవేదనను తెలియజేస్తాడు.

"అన్నంపెట్టే రైతు
యాచకు డయ్యాడు
ఎవరు సిగ్గుపడాలో
తేల్చుకోండి "

అని సూటిగా సమాజాన్ని ప్రశ్నిస్తున్నాడు.

అదేవిధంగా ప్రకృతిలో మమేకం అవడం అంటే మానవ ప్రకృతిలో మమేకం అవడమే అని ప్రకృతి తత్వాన్ని ఈ విధంగా తెలుపుతాడు.

"ఆకులు లేకుంటే
చెట్టునెలా గుర్తిస్తావ్
పచ్చదనమే
చెట్టు చిరునామా"

అని తనలోని హరిత బావన ఆకాంక్షను చెప్పాడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో చేతి వృత్తుల వారు, కుల వృత్తులపై ఆధారపడ్డ ప్రజలు, ఉపాది లేక ఆదాయం లేక ఆకలిచావులు ఏవిధంగా ఉన్నాయో. ఆ చేనేత కార్మికులపై దూడం నాంపల్లి రాసిన కవిత్వంలో తేట తెల్లం అవుతుంది.

"అయ్యయ్యో! చేతన కార్మికా
ఆకలి చావుల కాహుతి ఐతివా!!
నరాలనే పోగులకు రక్తమనే రంగద్ది
సరిలేని జీవితాన 'సరిజేసు' మొగ్గమెట్టి
కండల్నే కండెలుగా జోటగొట్టి పూటిగొట్టి
సరిగంచులు నేసినోడ! శ్రమశక్తి తెలిసినోడ! "

ఈ విధంగా సిరిసిల్లలో చేనేత కార్యికుల ఆత్మ హత్యలపై ఆక్రోశంగా రాశిన కన్నీటి కవిత.

ప్రపంచం ఒక కుగ్రామం అని అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్న మానవుడు తెలుసుకో లేకపోతుంది మరియు తప్పక తెలుసు కావాల్సిన సత్యం.

"తన కోసం తను బతకడంగాదు
అన్నీ తన కోసం బతకాలన్నదే మనిషి సమస్య
బతికేవాడు అన్నింటినీ బతకనివ్వాలి గదా
ప్రపంచం మానవుడికే సొంతంగాదు
ప్రపంచం మనిషితోనే అంతం గాదు
అన్న సత్యాన్ని మానవుడు ఎరిగి జీవిస్తే మంచిది."

ఒక్క సారి మహాకవి శ్రీశ్రీ మాటలను గుర్తు చేసు కుంటే

"ఏ దేశ చరిత్ర చూసినా ఏ మున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"

అన్నట్లుగా ప్రపంచంలోని ఏదేశాన్ని చూసినా ఎంత అభివృద్ధిపదంలో ఉన్నా గర్వించడానికి ఏమీలేదు. పర పీడనంలో మానవ చరిత్ర చిక్కుకుని ఉంది. ఆచారాల్లో, సంస్కృతిలో, భాషలో, భావంలో, వేషదారణ ఒకటా, రెండా అన్నీ కూడా అనుకరణగానే ఉన్నాయి. నగరీ కరణం, ప్రపంచీకరణం అనే బ్రమలో మనల్ని మనం మర్చిపోతూ సమాజంలో యాంత్రికంగా జీవనం సాగి స్తున్నాం. మనకు తెలియకుండానే పాశ్చాత్య సంస్కృతికి బానిసలుగా మారిపోయాం.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర-డా॥ ద్వా. నా. శాస్త్రి
2. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
3. మన తెలంగాణ-కరీంనగర్ సంచిక-కర్ర ఎల్లారెడ్డి
4. ఆధునిక కవిత్వం-ఎం.ఏ., తెలుగు ద్వి.సం॥ పే.6
5. భావవీణ మాస పత్రిక-మార్చి 2020
6. వచన కవిత్వంలో రైతు ప్రపంచీకరణ ప్రతిఫలనం-3వ అధ్యాయం.

❖ ❖ ❖

తెలుగు కథలలో ప్రపంచీకరణ ప్రభావం - నగర జీవితం

– డా॥. ఎం. ప్రభావతి

ప్రపంచీకరణను ఆంగ్లంలో "గ్లోబలైజేషన్" అంటారు. తెలుగులో ఈ పదానికి రకరకాల అర్థాలున్నప్పటికీ "ప్రపంచీకరణ" అనే మాట వాడుకలోకి స్థిరపడింది. ప్రపంచీకరణ అంటే ప్రపంచమంతా ఒకటి కావడం అనేది సాధారణ అర్థం. నాడు మన నిత్య జీవితంలో ప్రత్యక్షం గానూ, పరోక్షంగానూ తరచూ వినిపిస్తున్న మాట ప్రపంచీ కరణ. ఒక దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేస్తూ స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఆంక్షలు లేకుండా ప్రపంచమంతా కొనసాగించడం మరియు అభివృద్ధి చెందిన దేశాలు తమ వస్తువులను ప్రపంచ వ్యాప్తం చేయడమే "గ్లోబలైజేషన్".

అభివృద్ధి చెందుతున్న దేశాలను తిరిగి ఆర్థికంగా మార్చుకోవడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక "ప్రపంచీకరణ". ఇది పూర్తిగా ఆర్థిక విషయాలకు సంబంధించిది.సరళీకృత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేసిన అంతర్జాతీయ విధానం స్వదేశీ వ్యాపారా లకు ఆయా దేశాలు కల్పించుకున్న రక్షణ వ్యవస్థను తొలగించి వేసిన పరిణామమే "ప్రపంచీకరణ".

ప్రపంచీకరణ-నిర్వచనం :

"అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడుల చోదకత్వంలో సమాచార, సాంకేతిక శాస్త్ర సహాయంతో వివిధ దేశాల ప్రజలు, కంపెనీలు, ప్రభుత్వాల మధ్య ఏర్పడే సంబంధం,సమైక్యతల ప్రక్రియే "ప్రపంచీకరణ" అని పాపినేని శివశంకర్ నిర్వచించారు.

"ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత ప్రపంచమంతా ఒక కుటుంబంగా మారిపోయింది. ప్రపంచదేశాలలోని మనవజాతుల్ని ఒక జాతిగా, ఒక దేశంగా, ఒక రాష్ట్రంగా, ఒక ప్రాంతంగా, ఒక జిల్లాగా, ఒక మండలంగా, ఒక గ్రామంగా, ఒక కుటుంబంగా కలిసి జీవించే పద్ధతిని "ప్రపంచీకరణ" అని మేడిపల్లి రవికుమార్ వివరించారు.

ప్రపంచీకరణ మూలంగా సమాచార, సాంకేతిక రంగాల్లో ఎన్నో మార్పులు సంభవించాయి. ఇంటర్నెట్ అభివృద్ధి చెందడం వలన సమాచార రంగంలో పెద్ద విప్లవ మైన మార్పులు వచ్చాయి. చరవాణి వంటివాటి వల్ల సామాజిక మాధ్యమాలు మానవులకు అతి చేరువలో ఉన్న కారణంగా మనుషుల మధ్య సంబంధాలు సాధ్య మయ్యాయి. ఇది అంతా ప్రపంచీకరణ వల్ల సాధ్యమైంది. అదే సమయంలో "అంతర్జాలం" మనుషుల మధ్య సంబంధాలను దగ్గర చేసిందే కానీ, సంస్కృతికి దూరం చేసింది. ప్రపంచీకరణ మన సమాజాన్ని మార్చి వేస్తే, కార్పొరేట్ సంస్కృతి మానవ స్వభావాన్ని మార్చివేసింది. కంప్యూటరీకరణ మనుషుల మీద వారి మనస్తత్వాలు మీద ప్రతికూల ప్రభావం చూపించింది. ప్రపంచీకరణ ప్రభావం చూపని రంగం అంటూ ఏదీలేదు. తెలుగు సాహిత్య రంగం పై కూడా ప్రపంచీకరణ ప్రభావం పడింది. సమాజంలోని సమకాలీన విషయాలపై సాహిత్య అధ్యయన పరిశోధనలు జరుగుతూ వుండడం సహజం. అన్ని దేశాలోని సాహితీకారులు ప్రపంచీకరణ పరిణా మాలపై ప్రతిస్పందించారు. మన దేశంలో కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహితీ ప్రముఖులు ప్రపంచీకరణపై తమ తమ స్పందనను తెలియజేశారు. తెలుగు సాహిత్యంలో కూడా అన్ని రంగాలలోని విషయా లపై చూపిన ప్రపంచీకరణ ప్రభావం పై రచయితలు రచనలు చేశారు.ప్రపంచీకరణ ప్రభావంపై ఎన్నో కవితలు, కథలు,నవలలు,వ్యాసాలు వెలువడ్డాయి.

తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ :

1990వ దశకం తర్వాత తెలుగు సాహిత్య ధోరణులు

తీవ్రంగా ఆలోచింపజేసిన అంశం "ప్రపంచీకరణ". దీని వల్ల మానవ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. ప్రపంచీకరణ ఫలితంగా ఏర్పడిన వ్యాపార శైలి కుటుంబ సంబంధాలలోని సహజమైన ప్రేమను తారుమారు చేసింది. అదే సమయంలో గ్రామాలన్నీ నగరీకరణ వైపు పయనమయ్యాయి. నగరీకరణ సంస్కృతి గ్రామాలలో కూడా విస్తరించింది. గ్రామాలలోని ప్రజలు నగరాలకు వలసలు వెళ్లడం ప్రారంభించారు. అట్టిపరిస్థితులో "కొండేపూడి నిర్మల, గీతాంజలి, కుప్పిలి పద్మ, పి.సత్యవతి, ఓల్గా, నల్లూరి రుక్మిణి, మొదలైన మహిళా రచయితలు ప్రపంచీకరణ ప్రభావంతో మానవ జీవితంలో ఏర్పడ్డ సంఘటనలు, మార్పులు, సమకాలీన సంస్కృతిని ఇతివృత్తంగా తీసుకొని రచనలు చేశారు.

ముఖ్యంగా మధ్యతరగతి వారి పై ప్రపంచీకరణ ప్రభావం ఎక్కువగా పడిందని చెప్పవచ్చు. వ్యవసాయం, విద్య, వైద్యం వంటి విషయాలపై ప్రపంచీకరణ తెలుగు కథ బలమైన ప్రభావం చూపింది. ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచ మార్కెట్లపై, ఉత్పత్తులపై బడా కంపెనీల గుత్తాధిపత్యం పెరిగింది. విదేశీ కంపెనీలు అనేకం వచ్చి దేశీయ కంపెనీల స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. పల్లె టూర్లు పట్టణానికి పట్టుకొమ్మలు అంటారు. అటువంటి పల్లెల్లోని వ్యవసాయంలో ఎన్నో నష్టాలు వచ్చాయి. రైతులు అప్పులు పాలు కావడం మరియు గ్లోబలైజేషన్ వల్ల వచ్చిన రసాయనాలు ఎక్కువగా వినియోగించడం వల్ల సారవంతమైన భూమి అంతా పాడడం జరిగింది. రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేయడం జరుగుతుంది. కావున వీటన్నింటిని వదులుకొని రైతులు నగరాలకు వలసలు వెళ్లడం మనం చూస్తూనే ఉన్నాము. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో ముసలివాళ్ళు మాత్రమే నివసిస్తున్నారు. అంతేకాకుండా ఉన్నత చదువులు అభ్యసించిన వాళ్ళు విదేశాలపై మోజుతో అక్కడికి వెళ్లడం జరుగుతుంది. అమెరికా పెళ్లి సంబంధాల మోజులో పడి నేటి యువతరం తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు.

తెలుగు కథలలో ప్రపంచీకరణ ప్రభావం – నగర జీవితం :

ప్రపంచీకరణ ప్రభావం వల్ల సమకాలీన సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను, సంఘటనలను ఇతివృత్తంగా స్వీకరించి వాటిని తమ రచనకు అనుగుణంగా మలచుకొని,ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని కుప్పిలి పద్మ కథలు రాయడం జరిగింది. కుప్పిలి పద్మ తన కథలకు వస్తువులను విభిన్న కోణాలలో పరిశీలించి స్వీకరించడం జరిగింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక రంగంలో చోటుచేసుకున్న పరిణామాలను మరియు వాటివల్ల కుటుంబ జీవితాలలో ఏర్పడుతున్న మార్పులను గుర్తించి తన కథల పరిధిని విస్తృతం చేసుకున్నారు. గ్లోబలైజేషన్ సృష్టిస్తున్న అలజడిని దాని వల్ల నష్టపోతున్న కుటుంబాల మధ్య మానవ సంబంధాల గురించి, వ్యవసాయ భూములను అమ్ముకోవడం, కంపెనీలు సైతం అమ్ముకోని నగర జీవితానికి అలవాటు పడటం వంటి విషయాల పై ఏర్పడ్డ ప్రపంచీకరణ ప్రభావం ఏ విధంగా ఉంటుందో కుప్పిలి పద్మ తన కథలలో వివరించారు. కుప్పిలి పద్మ ప్రపంచీకరణ ప్రభావంతో అందించిన కథాసంపుటి "సాలభంజిక". ఈ కథలో ప్రధానంగా "ప్రపంచీకరణ" ప్రభావం కారణంగా మానవ సంభందాలలో చోటుచేసుకుంటున్న అనేక విషయాలను, యదార్థ సంఘటనలను గురించి వివరించారు. ఈ కథలలో సామాన్య జీవనం కంటే భిన్నంగా నగర జీవితం మనకు ఎక్కువగా కనపడుతుంది. ఆధునికయుగంలో గ్రామీణ ఆచార వ్యవహారాలు "ప్రపంచీకరణ" వల్ల పల్లెల్లోని వాళ్లు కూడా నగర జీవితాన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వ్యవసాయం చేయడం కష్టమైపోయింది. దానికి తోడు వాతావరణం కూడా అను కూలించక పోవడంతో నష్టాలను, కష్టాలను భరించలేక నగరంలో ఏదైనా చిన్న ఉద్యోగం చేసుకొని

జీవించవచ్చు అనే తలంపుతో నగర జీవితం గడపడానికి ఎక్కువ మంది విముఖత చూపుతున్నారు.

ప్రకంపనం :

ఈ కథలో గ్లోబలైజేషన్ వల్ల ఏర్పడిన ఆర్థిక స్థితి లో వచ్చే పరిణామాలు, మరియు మానవ సంబంధాల్లో ఎటువంటి మార్పులు తీసుకువచ్చాయో తెలియజెప్పే కథ "ప్రకంపనం".

ఈ కథలో శర్మిష్ఠ, అచల్, శర్మిష్ఠ తల్లిదండ్రులు, నానమ్మ ప్రధానపాత్రలు. శర్మిష్ఠ, అచల్ భార్య భర్తలు. ఉద్యోగరీత్యా న్యూయార్క్లో స్థిరపడిన వారు. చాలా రోజుల తర్వాత శర్మిష్ఠ అమ్మానాన్నలు చూడటానికి ఇండియాకి వస్తుంది. ఇండియాలో వాళ్ల తల్లిదండ్రుల ఇంట్లో అన్నీ అలవాట్లు మారిపోయి ఉంటాయి.టిఫిన్స్, భోజనాలు అన్నీ హోటల్ నుంచి తెప్పిస్తుంటారు. ఎంతమంది వచ్చినా స్వయంగా వంట చేసి వడ్డించే అమ్మ ప్రస్తుతం మీటింగులు, బ్యూటీపార్లల్ అంటూ బిజి జీవితానికి అలవాటు పడడం చూసి శర్మిష్ఠ ఆశ్చర్య పోతుంది. తండ్రి కూడా ఆఫీస్కి వెళ్ళకుండా ఇంట్లో ఖాళీగా ఉండడం చూసి శర్మిష్ఠ తండ్రి అని అడుగు తుంది. వేరే వాళ్ళు వచ్చి మన ఊరిలో ఉండే చాలా ఫ్యాక్టరీలు కొనేశారు. మనం తయారు చేసే వస్తువులకు విలువ తగ్గిపోయింది. గ్లోబలైజేషన్ వల్ల ఎన్నో మార్పులు వచ్చాయి. అందుకే ఫ్యాక్టరీలు అమ్మేశాము అంటాడు శర్మిష్ఠ తండ్రి.

శర్మిష్ఠ అచల్ ను వాళ్ళ నానమ్మ ఊరికి వెళ్దాం అంటుంది.అచల్ కి గ్రామానికి వెళ్లడానికి ఇష్టం ఉండదు. కావున నేను రాను అని గోవా వెళ్తాడు.శర్మిష్ఠ ఒకటే వాళ్ళనానమ్మ ఊరికి వెళ్తుంది. అక్కడ పచ్చని పొలాలు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. శర్మిష్ఠను చూసిన వాళ్ళ నానమ్మ ఏంతో సంతోషంతో "శర్మిష్ఠ పనసపొట్టు కూర తింటావా" అని అడుగుతుంది.అవి అంటే నాకు ఇష్టం కదా ఎందుకు అలా కొత్తగా అడుగు తున్నావు అని శర్మిష్ఠ అంటుంది. అందుకు నానమ్మ "ఇష్టం అనేది ఎప్పుడూ ఒకేలా ఉండదు. కాలంతో పాటు రుచులలో కూడా మార్పు రావడంలో ఆశ్చర్యమేముంది". అని నానమ్మ అంటుంది. ఏళ్ల తరబడి అన్నం పెట్టే భూములనే ఇష్టం లేక అమ్మి వేస్తున్నప్పుడు అలవాట్లలో మార్పు రావడం సహజమే కదా! మీ అమ్మా నాన్న ను చూసావా ఫ్యాక్టరీలు అన్ని అమ్ముకొని సోమరులుగా తయారై భోజనాలు కూడా హోటల్స్ నుండి తెప్పించు కొని తింటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా భూమిని నమ్ముకొని బ్రతికాము. కన్నతల్లి లాంటి భూమిని అమ్మటానికి చూస్తున్నారు మీ తాత. నాకు ఏమాత్రం ఇష్టం లేదు. అందుకు నేను అంగీకరించను. అంతగా అవసరమైతే కోర్టుకు వెళ్తాను అని శర్మిష్ఠతో నాన్నమ్మ అంటుంది. శర్మిష్ఠ నుయార్కు వెళ్లిపోయిన ఒక వారానికి నాన్నమ్మ కోర్టులో కేసు వేసింది అని తెలుసుకొని సంతోష పడుతుంది. కానీ దాని కారణంగా నాన్నమ్మ, తాతయ్య మధ్య గోడవులు మొదలయ్యాయి. ఆ విషయం తలుచుకొని శర్మిష్ఠ ప్రకృతి కారణంగా తలెత్తిన మంటలను అర్పవచ్చు. కానీ కుటుంబం మధ్యలో రగిలే మంటలను ఎవరు అర్పలేరు అని నిట్టూరుస్తుంది.

ఈ కథలో "ప్రపంచీకరణ" ప్రభావం కారణంగా గ్రామీణ వాసులు పట్టణాలకు వలస వెళ్లడం. స్త్రీలు బ్యూటీ పార్లర్కి వెళ్లడం, హోటల్స్కి వెళ్లడం, విమానంలో ప్రయాణం చేయటం వంటి విలాన వంతమైన నగర వాతావరణం కనిపిస్తాయి. పల్లెటూరులో వుండే నాయనమ్మ చైతన్యవంతంగా కోర్టుకు వెళ్లడం అనేవి రచయిత్రి నగర వాతావరణాన్ని చిత్రిస్తూన్నే పాత్రలను చైతన్యవంతం చేయడం మనం చూడవచ్చు.

కుబుసం :

ఈ కథలో సైన్స్ టెక్నాలజీ అభివృద్ధి చెందడం వల్ల మన స్నేహితులు, బంధువులు ఎంత దూరంలో వున్నా, వాళ్ళతో మాట్లాడుకునే అవకాశం ఏర్పడింది.కానీ భార్యా భర్తల మధ్య దూరాలను, మనుషుల మధ్య అపార్థాలను

తొలగించేందుకు ఏ టెక్నాలజీ అభివృద్ధి చెందాలి అన్నది ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం.

ఈ కథలో ప్రధాన పాత్రలు ఉత్తర,విహారీ.వీరు భార్యా, భర్తలు. వీరు ఉద్యోగ రీత్యా వేరు వేరు ఊర్లో నివసిస్తూ ఉంటారు. విహారికి ఒక మంచి కంపెనీలో ఉద్యోగం వస్తుంది. ఆ కంపెనీ వాళ్ళు వారు కేటాయించిన ఇంటిలోనే నివాసం ఉండాలనే నిబంధన పెడతారు. అందుకు విహారి, ఉత్తరను తన ఉద్యోగానికి రాజీనామా చేసి తనతో పాటు రమ్మంటాడు. ఉత్తర దానికి అంగీకరించదు. నీ ఉద్యోగం కోసం కార్పొరేట్ సంస్థ వాళ్ళు చెప్పారని నన్ను ఉద్యోగం వదలమని అంటున్నావు. రేపు ఆ కంపెనీ వాళ్ళు ఉద్యోగం నుండి తొలిగించరని నమ్మకం ఏంటి? నీ ఉద్యోగం కోసం నన్ను రమంటున్నావు కానీ నామీద ప్రేమతో కాదుఅని ఉత్తర అంటుంది. విహారి వెళ్లి ఆ విషయాన్ని కంపెనీ వాళ్లతో చెబుతాడు. వాళ్లు భార్యను ఒపించ్చలేని నీవు రేపు మా కంపెనీలో ఏదన్నా సమస్య వస్తే ఎలా పరిష్కరిస్తావు అని ఉద్యోగం ఇవ్వరు.విహారికి ఉద్యోగం పోవడం వల్ల ఉత్తరతో మాట్లాడడం మానేసాడు. నెలరోజుల వరకు ఇంటికి కూడా రాడు. కొద్ది రోజుల తరువాత విహారికి వేరే ఊరిలో ఉద్యోగం వస్తుంది. ఆ విషయం కూడా ఉత్తరకి చెప్పడు. వారానికి ఒకసారి వచ్చి పిల్లలని మాత్రమే చూసి వెళుతుంటాడు.

ఈ విధంగా కార్పొరేట్ సంస్థల వల్ల భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడుతున్నాయి.ప్రపంచీకరణ వల్ల గ్రామాలలోని పొలాలు సైతం ప్లాట్లుగా మార్చి అమ్మి వేస్తున్నారు. అంతే కాకుండా గ్రామాలలో కూడా ఫ్యాక్టరీ రావడం, అందులోని కలుషిత పొగవల్ల చుట్టుపక్కల వున్న వాతావరణం కలుషితమయిపోయి పంటలు సరిగా పండక పోవడం అనేవి జరుగుతున్నాయి.అందుకే ప్రజలు చాలా వరకు నగరంలో జీవించడానికి ఇష్టపడుతున్నారు.

ఇన్ స్టెంట్ లైఫ్ :

ప్రపంచీకరణ వల్ల బిజీ లైఫ్ కి అలవాటు పడిపోయి ఇన్ స్టెంట్ ఆహారం తింటున్నట్లు, జీవితంలో కూడా మానవుల మధ్య ఉండే ప్రేమ, స్నేహం కూడా వ్యాపారమే అయిపోయిందని తెలియజేసే కథ "ఇన్ స్టెంట్ లైఫ్".

ఈ కథలో ప్రధాన పాత్రలు మునీర, అరుంధతి, విజయ్, సందీప్. మునీరా ఆమె తల్లి అరుంధతి తాము నమ్మిన సిద్ధాంతాలకు, భావాలకు, వ్యక్తిత్వాలకు కట్టుబడి నివసించాలి అనుకుంటారు.కానీ మునీరను ప్రేమించిన సందీప్, తండ్రి విజయ్ వీరిద్దరు మారుతున్న కాలంతో పాటు మనము మారాలి అనే సిద్ధాంతాన్ని నమ్మేవారు. మునీర తండ్రి మొదట భార్య అరుంధతి భావాలను గౌరవించినా కాలక్రమంలో డబ్బు సంపాదించే యంత్రంలా తయారవుతాడు. సంపాదనే ముఖ్య ఉద్దేశంగా భావించి భార్య వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ మాట్లాడడం జరుగుతుంది.

మునీరను ప్రేమించిన సందీప్ కూడా మునీరతో వివాహానికి ఒప్పుకోడు. మొదట మనిద్దరి భావాలు ఒకేలా వుండేవి, ఇప్పుడు నీవు మారుతున్న కాలానికి అనుగుణంగా నీ భావాలను మార్చుకోవడం లేదు. అలాంటి మార్పు నువ్వు అంగీకరించలేక పోతున్నావు. అంతే కాక పెళ్లి చేసుకున్నా మీ అమ్మ న్నానలు గోడవపడుతున్నటు మన మధ్యలో కూడా గొడవలు వస్తాయి.అందుకే నిన్ను పెళ్లి చేసుకోను అని చెప్పి అమెరికాకి వెళ్ళిపోతాడు.

ఈ "ఇన్ స్టెంట్ లైఫ్"కథలో మారుతున్న కాలానికి అనుగుణంగా మారడం లేదని మరియు సంపాదనకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రాణంగా ప్రేమించిన అమ్మాయిని సైతం వదులుకొని అమెరికాకి వెళ్ళిపోవడం, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం, ఉన్నత చదువులు అభ్యసించిన వాళ్ళు విదేశాలపై మోజులో అక్కడికి వెళ్లడం జరుగుతుంది. నగర జీవితం మత్తులో పడి నేటి యువతరం తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ప్రపంచీకరణ వల్ల నగర జీవితానికి,

విలాసాలకు అలవాటు పడి మానవ సంబంధాల మధ్య ప్రేమ కూడా ఇన్ స్టెంట్ గా మారిపోవడం ఈ కథలో మనము చూడవచ్చు. ఈ కథలో అమెరికా వంటి విలాసవంతమైన నగర జీవితం మనకు కనబడుతుంది.

ముగింపు :

"ప్రపంచీకరణ"వల్ల కొంత మేలు జరిగినప్పటికీ కొంత నష్టం కూడా జరిగిందని చెప్పవచ్చు. ప్రస్తుత కాలంలో ఎక్కువ మంది నగర జీవితానికి అలవాటుపడి, నగరాలలో ఎటువంటి వసతులు లేక పోయినప్పటికీ పట్టణాల్లోనే నివసించడానికి ఇష్టపడుతున్నారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారు. కొన్ని చిన్నా చితకా ఫ్యాక్టరీలు కూడా మూతపడుతున్నాయి. ఇవన్నీ సామాన్య మానవుడి జీవితంలో ఎంతో నష్టాన్ని కలిగిస్తున్నాయి. గ్రామాల నుండి నగరాలకు వలస వచ్చిన కార్మికుల బతుకులు గురించి సంకోజి దేవేంద్రాచారి "రాబందుల నేరం"కథలో చిత్రించారు. "ప్రపంచీకరణ" ఇతివృత్తంగా నేడు అనేక కథలు వస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మార్పుల్ని బహుముఖ కోణాలలో కథలు ఆవిష్కరించబడ్డాయి. ప్రపంచీకరణ ప్రభావం వల్ల పల్లెల్లో కూడా నగర జీవితపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలను మనం ప్రస్తుతం గమనించవచ్చు. కాలం మారుతున్న కొద్దీ వాటికి అనుగుణంగా సమాజం లోని ప్రజలలో కూడా మార్పు రావడం సహజం.

ఆధార గ్రంధాలు :

1. ప్రపంచీకరణ- సాంస్కృతిక దృక్పథం - శివసాగర్
2. భారతదేశంలో ప్రపంచీకరణ పర్యవసానాలు - యం.వి. కృష్ణయ్య.
3. తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణపై ప్రచండపోరు - డా.యస్.వి.సత్యనారాయణ.
4. సాలభంజిక కథల సంపుటి - డా.కుప్పిలి పద్మ.

❖ ❖ ❖

ప్రపంచీకరణ కవిత్వం - రైతు జీవితం

– ఖ. తవన్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారతదేశం వ్యావసాయిక దేశం. దేశ జనాభాలో దాదాపు అరవై శాతం దాకా వ్యవసాయ రంగం మీద ఆధారపడి బతుకుతున్నారు. 1947 సంవత్సరంలో మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. 1950లో ప్రణాళికా సంఘం ఏర్పడింది. 1951-56 మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్య మిచ్చారు. తదనంతర కాలంలో వ్యవసాయ రంగం కొంత మెరుగ్గానే ఉండేది. 1991 లో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశించడంతో అన్ని రంగాల లాగే వ్యవసాయ రంగం కూడా సంక్షోభం వైపు పయనం సాగించింది. నేడు ఆ సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది.

'దేశానికి వెన్నెముక రైతు, రైతే రాజు' వంటి మాటలు ఒట్టి మాటలుగానే మిగిలిపోతున్నాయి. రైతుల ఆత్మ హత్యలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి తప్ప, తగ్గడం లేదు. ప్రభుత్వ విధానాలు, బ్యాంకు రుణాలు, కల్తీ పురుగు మందులు, బహుళజాతి కంపెనీల మోస పూరిత విత్తనాలు, పండిన పంటలకు కనీస మద్దతు ధరలు లేకపోవడం, వ్యవసాయ భూముల్ని సెజ్‌లుగా మార్చి రైతుల్ని కూలీలుగా మార్చడం వంటి కారణాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్ళింది.

వ్యవసాయం - ప్రాధాన్యత :

వ్యవసాయ రంగ ప్రాముఖ్యాన్ని, రైతు ప్రాధాన్యాన్ని కవి దర్భశయనం శ్రీనివాసాచార్య 'సేద్యం' అనే కవితలో ఈ విధంగా తెలిపాడు.

ఎన్నాళ్ళు రాస్తారయ్యా
పొలాల మీద కవిత్వం ?
నేలను రైతన్న
దున్నినంత కాలం
మెతుకు మీద మనిషి
బతికినంత కాలం

మానవ సమాజం ఉన్నంత వరకు రైతు అనేవాడు ఉంటాడు. ఆ రైతు సేద్యం చేస్తూ పంటలు పండిస్తాడు. ఆహార ఉత్పత్తుల్ని సమాజానికి అందజేస్తాడు. మానవ నాగరికతా పరిణామంలో రైతు పాత్ర ఎనలేనిది. మనిషి నాగరీకుడయ్యే కొద్దీ తన మూలాల్ని మరచిపోతున్నాడు. కానీ కవులనే వాళ్ళు శ్రమజీవులైన రైతుల పట్ల ఉండాల్సిన బాధ్యతాయుతమైన పాత్రని నిర్వహిస్తున్నారు.

కవి అన్నవరం దేవేందర్ రాసిన 'వ్యవసాయ శాస్త్రం' కవిత వ్యవసాయం యొక్క అర్థాన్ని, నిర్వచనాన్ని తెలియజేస్తున్నది.

వ్యవసాయం లోకానికి
బువ్వపెట్టే మహత్కార్యం
ఏండ్లకేండ్లు సాల్లు సాల్లుగా దున్నుతున్నా
తరగని సేద్యపు ఆకాశం

చేనూ చెలకా పచ్చని పరిమళం
వ్యవసాయం ఆకలి తీర్చే వ్యాపకం
... ...
కంచంలో తెల్లని మెతుకు అయ్యేందుకు
మన్నులో మన్నైన పాణం
పుటుకుతా పరుల కడుపు నింపే సాయత

పెట్టుబడి గిట్టుబాటు దిగుబడి
ఆర్థిక శాస్త్రం లోతు తెల్వని బోలాతనం
పంటలు పండించడమే పరమ తపస్సు
లోకుల ఆకలి తీర్చడమే వ్యవసాయ శాస్త్రం

సమాజానికి అవసరమయ్యే తిండిగింజల్ని అందించే వ్యవసాయ రంగం ప్రాథమిక రంగానికి చెందిందే కాదు, ఎంతో ప్రాధాన్యం కల్గిందనే విషయం పై కవిత ద్వారా తెలుస్తున్నది.

రైతు పరాయీకరణ :

రైతు తను రెక్కలుముక్కలు చేసుకొని కాయకష్టం చేస్తాడు. పంటలు పండిస్తాడు. ప్రపంచానికి తిండి గింజలు అందిస్తాడు. కానీ తన శ్రమ నుంచి, తన ఉత్పత్తి నుంచి, తాను పరాయీకరణకి గురవుతున్నాడు. అనేక విధాల దోపిడికి బలై, తన జీవితమంతా ఇబ్బందుల్లోనే గడుపుతున్నాడు.

అయితే ఆ ఇబ్బందులకి తోడు మరికొన్ని చిక్కులు మొదలై అతని పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారువుతూ ఉంది. నేటి ప్రపంచీకరణ యుగంలో రైతు రైతుగా మనగలగలేకపోతున్నాడు. పూర్తిగా రైతు తన పాత్ర నుంచి వైదొలిగే పరిస్థితి నేడు తిష్టవేసింది.

వర్తమాన కవి మాడభూషి సంపత్ కుమార్ రాసిన 'రైతే కూలీ' అనే కవితలో రైతు పరాయీకరణ చెందిన విధానాన్ని చక్కగా వ్యక్తంచేశాడు.

ఎవరో ఇచ్చిన
విత్తనాలు విత్తాలి
ఎవరో చెప్పిన
ఎరువు వెయ్యాలి
ఎవరి ఆజ్ఞ ప్రకారమో
పంటలు పండించాలి
ఎవరో నిర్ణయించిన ధరకు
అమ్మకాలు సాగించాలి
రైతు తన భూమిలో తనే కూలీ

రైతు ఇవాళ తన రైతు జీవితం నుంచి పరాయీకరణ చెందాడు. ఒకప్పుడు స్వతంత్రంగా ఉండేవాడు. ఇప్పుడు పరతంత్రుడు అయ్యాడు. తన నేలకు కావాల్సిన సత్తువను సహజమైన ఎరువులతో నింపేవాడు. తన పంటకు తనే యజమానిగా వ్యవహరించేవాడు. ఇప్పుడంతా పరిస్థితి తారుమారయ్యింది. రైతు ప్రమేయం తగ్గిపోతూ ఉంది. పై కవితలో చెప్పిన విషాదాంతమైన విషయాలన్నీ కవులందరికీ ఆవేదనకి గురి చేస్తున్నాయి. అందుకే కవులంతా రైతు పక్షం వహించి తమ బాధ్యతను తాము నిర్వర్తిస్తున్నారు.

రైతు తను పండించిన పంటకి తాను ధరను నిర్ణయించలేకపోతున్నాడు. ఏ మార్కెట్ శక్తులో నిర్ణయిస్తే వాటి ప్రకారం అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతు శ్రమ మాత్రమే చేయాలి, మిగతా విషయాలన్నీ బహుళ జాతి సంస్థల ఆజ్ఞలతో, ఆదేశాలతో జరగాలి. ఇటువంటి నేపథ్యంతో రైతుల పరాయీకరణను కవులు కవిత్వీకరించారు. మరొక కవి సిరికి స్వామినాయుడు రాసిన 'నిర్బంధం' అనే కవితలో ఈ విషయాన్ని గమనించవచ్చు.

విత్తనం వేస్తావా....
ప్రసవించినా, పురిట్లో చచ్చినా
మా కంపెనీ విత్తనాలే నువ్వు నాటాలి!
పురుగు పుట్టిందా...
చంపినా, చీడ చావకపోయినా
మా కంపెనీ పురుగు మందులే నువ్వు చల్లాలి!
ఎరువేస్తావా...
యిచ్చినా, సారమివ్వకపోయినా
మా కంపెనీ ఎరువులే నువ్వు వాడాలి!
పంటనమ్ముతావా...
వచ్చినా, గిట్టుబాటు రాకపోయినా
చచ్చినట్టు, మేం చెప్పిన రేటుకే నువ్వు పంటనమ్మాలి!
ప్రతిఘటిస్తావా....
హింసాయుతంగానో, అహింసాయుతంగానో
మేం విధించిన షరతుల్లోనే నువ్వు ఉద్యమించాలి!

రైతు తన సొంత పొలంలో తను నిర్ణయించుకున్న పంటలు వేయడానికి అనర్హుడవుతున్నాడు. మార్కెట్ శక్తులు అతన్ని శాసిస్తున్నాయి. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అన్నీ కూడా బహుళజాతి సంస్థల చేతుల్లో ఉన్నాయి. వాటి నిబంధనల ప్రకారం రైతులకి

మార్గనిర్దేశం చేయడం రైతు పరాధీనతకు నిదర్శనం. ఒకనాటి రైతు తను పండించిన పంటలో కొంత భాగాన్ని తర్వాత పంట వేయడానికి దాచుకొనేవాడు, నిల్వ చేసుకునేవాడు. కానీ నేడు కంపెనీల విత్తనాలతో అటువంటి పద్ధతికి స్వస్తి పలకాల్సి వచ్చింది. ఇది రైతుని పరాయీకరణకి గురి చేయడమే. వర్ధమాన దేశాల రైతుల్ని, వారి పంటల్ని బహుళజాతి సంస్థలు తమ అదుపులో ఉంచుకునేందుకు, తమ నియంత్రణలో పెట్టుకునేందుకు చేస్తున్న వ్యూహాలే ఇవన్నీ. తద్వారా మన నేలపై మనం ఏ పంటలు పండించాలో అంతా సామ్రాజ్యవాద మార్కెట్ శక్తులు నిర్ణయించే దశకి నెట్టడం జరుగుతున్నది.

ఇటువంటి విషయాలనే నందిని సిధారెడ్డి 'బహు(ళ) దాహం' కవితలో స్పష్టంచేశాడు.

ఇక్కడి విత్తనాలు వాడిష్టమేనట
వాడిష్టంతోనే ఇక్కడ పంటలు పండాలట
భూమ్మనదే కష్టమ్మనదే
వొచ్చే సర్వసంపద మాత్రం వాడిదట

పైన పేర్కొన్న కవితలు రైతు పరాయీకరణకి గురి అయిన వివిధ సందర్భాలను తెలియ చేస్తున్నాయి

ముగింపు :

1991లో ప్రపంచీకరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి రైతు జీవితం పరాయీకరణకి గురయింది. రైతు ఏ పంటలు పండించాలో బహుళజాతి సంస్థల కార్పొరేటర్లు నిర్ణయిస్తున్నారు. రైతు కష్టపడతాడు, పంటలు పండిస్తాడు. అయితే ఆ పంటకి ధరను నిర్ణయించేది మాత్రం దళారులు, మధ్యవర్తులే. ఇటీవల ప్రభుత్వాలు కూడా రైతులకు ప్రతికూలమైన బిల్లులను రూపొందించి చట్టాలు చేస్తున్నాయి. అంటే ప్రభుత్వాలని కార్పొరేట్ రంగం వారు ప్రభావితం చేసి, తమకు అనుకూలమైన చట్టాల్ని రూపొందించుకుంటున్నాయి. ప్రగతిశీలమైన కవులు, ఆలోచనా పరులు రైతు పక్షం వహించి వ్యవసాయదారులకు నష్టం చేసే చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. రైతులకి లబ్ధి చేకూరే విధానాలు చేపట్టాలని సూచిస్తున్నారు. కాబట్టి దేశానికి పట్టెడన్నం పెట్టే రైతు జీవితం మెరుగుపడాలని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు :

1. నేల గంధం - దర్భశయనం శ్రీనివాసాచార్య
2. వరి గొలుసులు - అన్నవరం దేవేందర్
3. చివరకు నువ్వే గెలుస్తావు - మాడభూషి సంపత్ కుమార్
4. ప్రజాసాహితి మాస పత్రిక - మే, 2013
5. రైతు కవిత (సంపాదకులు) - పాపినేని శివశంకర్

❖ ❖ ❖

'కవితా వార్షిక 2004' - ప్రపంచీకరణ భావాలు - పరిశీలన

– డా॥. కె. రత్నశేఖర్, ఆంధ్రోపన్యాసకులు, ఎస్.వి.కె.పి డిగ్రీ కళాశాల, పొదిలి, ప్రకాశం జిల్లా.

''గ్లోబలైజేషన్ అనేపదం ఆధునిక కాలవాచి. ఈ పదానికి గ్లోబలీకరణ, ప్రపంచీకరణ, భౌమీకరణ, విశ్వీకరణ అనే పర్యాయపదాలున్నప్పటికీ ప్రపంచీకరణ అనే పదమే వ్యవహారంలో స్థిరపడింది. ఇంగ్లీషులో కనిపించే గ్లోబల్, గ్లోబలిజమ్ అనే పదాలకు సమానార్థకాలు తెలుగులో చోటుచేసుకోలేదు. ప్రపంచ సంబంధాల విస్తృతినీ, సామాజిక జీవన వ్యవస్థనీ, ప్రపంచ చైతన్యాభివృద్ధినీ తెలియజేసేది ప్రపంచీకరణ'' (తెలుగు కథా సాహిత్యం ఆధునిక దృక్పథాలు, 2007:1) అని అరుణ కుమారి గారు పేర్కొన్నారు. ఇది ఆర్థిక రంగంలో ప్రవేశించి రాజకీయ రంగు పులుముకొని జనజీవనంలోకి చొచ్చుకు పోయి సాంస్కృతిక మార్పులకు దారితీసింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా ఏకరూపతను కలిగి ఉండటాన్ని ప్రపంచీకరణ అని చెప్పవచ్చు.

వర్తకాన్ని స్వేచ్ఛగా ఏ ఆటంకాలూ లేకుండా ఏ దేశంలోనైనా జరుపుకొనే స్వేచ్ఛనే 'ప్రపంచీకరణ' అంటారు. ప్రపంచంలో ఎక్కడ వస్తువులున్నా, ఆ వస్తువులను ఏ దేశంలోనైనా స్వేచ్ఛగా అమ్ముకోవచ్చన్నమాట. మన భారతదేశంలో స్వాతంత్ర్యం రావడానికి ముందు, బ్రిటిష్ వారి పాలనాకాలంలో ఉత్పత్తి అంతా ప్రైవేటు రంగంలో జరిగేది. స్వాతంత్ర్యానంతరం దేశాభివృద్ధిని కాంక్షించి, ప్రభుత్వరంగంలో కూడా కొన్ని కర్మాగారాలు ప్రారంభించి, మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేశారు. కానీ స్వార్థపరులైన రాజకీయ నాయకులవల్ల, ప్రభుత్వరంగ సంస్థల్లో సమ్మెలవల్ల, 1991 నాటికి భారత దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రభుత్వ పరిశ్రమలన్నీ నష్టాల్లో పడ్డాయి. ద్రవ్యోల్బణము పెరిగింది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా హరించుకుపోయాయి. దేశంలో బంగారం తాకట్టు పెట్టవలసి వచ్చింది. ఈ పరిస్థితులనుండి భారతదేశాన్ని గట్టెక్కించడానికి 1991 - జూలై 24 న నూతన ఆర్థిక విధానము లేక పారిశ్రామిక తీర్మానము ప్రకటించారు. దీనివల్ల భారతదేశం స్వేచ్ఛా మార్కెట్‌లోకి, ప్రపంచీకరణలోకి తీసుకొని రాబడింది.

ప్రపంచీకరణ అంటే, ఒకదేశ ఆర్థిక వ్యవస్థను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మిళితం చేయడమే. 1947-94 మధ్య పనిచేసిన 'గాట్' స్థానంలో, డబ్యు.టి.వో(ప్రపంచ వాణిజ్య సంస్థ) పనిచేయడం ప్రారంభించింది. ఈ సంస్థ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.యమ్.ఎఫ్), ప్రపంచ బ్యాంకుల ద్వారా ప్రపంచీకరణను అమలు పరుస్తుంది. 1991నుండి మనదేశం ప్రైవేటీకరణను ప్రోత్సహించింది. ప్రభుత్వరంగ ఫ్యాక్టరీలలోని హెచ్చుభాగం షేర్లను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతుంది. సరళీకృత ఆర్థిక విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులు కర్మాగారాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ ఆంక్షలను తగ్గించి, లైసెన్సు విధానాన్ని సులభం చేసి ఉత్పత్తిని పెంచడంలో ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించింది. విదేశీ పెట్టుబడులపై ఉన్న నిషేదాన్ని తొలగించి, విదేశీ పెట్టుబడులను ప్రభుత్వం అనుమతించింది.

ప్రపంచీకరణలో భాగంగా ప్రభుత్వం విదేశీ వస్తువుల దిగుమతిపై ఆంక్షలు సడలించింది. పెక్కు వస్తువుల ఎగుమతికి ఉన్న ఆంక్షలను తొలగించింది. చౌకగా వచ్చే విదేశీ వస్తువుల పోటీని మన స్వదేశీ పరిశ్రమలు ఎదుర్కోలేక పోతున్నాయి. స్వదేశంలోని చిన్న పరిశ్రమలు మూతబడ్డాయి. విద్యారంగంలో వ్యాపారధోరణి పెరిగింది. సాంకేతిక విద్యలకు పోటీ ఏర్పడింది. ప్రభుత్వరంగంలోని ఉద్యోగులు, వీధినబడి నిరుద్యోగాన్ని అనుభవించారు.

దేశంలో ఆహారోత్పత్తి పెరిగి విదేశాలకు వస్తువులు ఎగుమతి అవుతున్నా, దేశంలో ఆకలి చావులు సంభవించాయి. వ్యవసాయరంగానికి, గృహరంగానికి ఇస్తున్న సబ్సిడీలను తగ్గించింది. అందువల్ల పేద, మధ్య తరగతివారు వాడే అనేక వస్తువుల ధరలు పెరిగాయి. ధనికులు ఉపయోగించే విలాస వస్తువుల ధరలు తగ్గాయి.

ఈ ప్రపంచీకరణ వల్ల మనదేశంలోని మేధావులు వలసలు పోయారు. ఎందుకంటే వారికి విదేశీ బహుళజాతి సంస్థలు డాలర్లను ఆశజూపిస్తుంది. అందుకే వారు మాతృదేశాన్ని వదిలి పెట్టి తమ చదువును, జ్ఞానాన్ని విదేశీయులకు పంచిపెడుతున్నారు. వారిని చదివించిన తల్లిదండ్రులను అనాదలుగా వదిలిపెట్టి, వారి ఆలనా పాలనా చూసుకునేవారులేక, చివరికి వారు మానసికంగా శారీరకంగా కుంగికృశించిపోవడం కనిపిస్తుంది. అలాగే రైతుల జీవితాలు కూడా దీనివల్ల బాగా మారిపోయాయి. పొలాలను సాగుచేయడం మాని వలస కూలీలుగా మారే పరిస్థితులు దాపురించాయి. నూతన ఆర్థిక విధానాలవల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చింది. కష్టపడి పనిచేసే కార్మికులకి, శ్రామికులకి కనీస ధరలులేక దళారీ వ్యవస్థ రూపుదిద్దుకుంది. పల్లెల్లో కులవృత్తులు కూడా ధ్వంసం కాబడ్డాయి. ప్రజల జీవన విధానంలోనూ మార్పు చెందుతూ వచ్చింది. మనిషి దేశ సంస్కృతి, సంప్రదాయాలను పక్కన పెట్టి విదేశీ వస్తువుల వ్యామోహంలో పడి జీవించడం మొదలుపెట్టాడు.

"గత శతాబ్దకాలంలోసాహిత్య, సాంస్కృతిక రంగాలలో అతివేగంగామార్పులు వచ్చాయి. ఒక ధోరణివెంట మరొక ధోరణి, ఒక మార్పుని అర్థంచేసుకొనేంతలో మరొక మార్పు. ప్రపంచవ్యాప్తంగా అనేక సాంస్కృతిక సిద్ధాంతాలు ఒక దానిపైన మరొకటి. దశాబ్దం ప్రారంభంలో బహిర్గతమైన అనేకానేకమానవ వర్గాల అస్తిత్వ కాంక్షలు దశాబ్దం పూర్తయిన సమయానికి వైయక్తిక అస్తిత్వ పోటీలుగా పరిణమించిన స్థితి. వీటివెనుక ప్రపంచ మార్కెట్, వినియోగదారీ సమాజం, బహుళ ప్రసార సాధనాలు. కొత్త అనుభవాలు అనేక విషయాలను పునరాలోచన చేయవలసిన అవసరాన్ని గుర్తింపచేస్తున్నాయి" (సామయిక వ్యాసాలు, 2000: v) అని ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్య, సాంస్కృతిక రంగాలలో వచ్చిన మార్పులను రంగనాథాచార్యులు పేర్కొన్నారు.

ఈ భావనలతో మన ఆంధ్రదేశంలో ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చింది. దానిని ప్రతికవీ తమ కవిత్వంద్వారా ప్రజలను చైతన్యం చేయాలని చూశారు. కానీ సామ్రాజ్యవాదపు క్రూరమైన పద్ధతుల వల్లనూ, దాని అధికారం ముందు మన కవుల రచనలు ఏవీ ప్రభావితం చేయలేకపోయాయి. అయినప్పటికీ కవులు తమ బాధ్యతతో తమ రచనలలో ప్రపంచీకరణ దృక్పథాన్ని తెలియపరిచారు. '"డబ్బుపిట్ట', 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' లాంటి కవితా సంపుటాలు వచ్చాయి. నూతన ఆర్థిక విధానాలు భారతదేశంలో అమలుకావటం మొదలయ్యాక జరుగుతున్న పరిణామాల్ని ఈ సంపుటాలు పట్టుకునే ప్రయత్నంచేశాయి. 'న్యూ ఎకనమిక్ పాలసీ' అమలు మొదలైన క్రమంలో మధ్యతరగతి జీవన విధానంలో వచ్చిన మార్పును 'డబ్బుపిట్ట' సమగ్రంగా ఆవిష్కరించింది. భారతీయార్థిక వ్యవస్థని, భారతీయ సామాజిక మార్పులు, పర్యవసానాలు వాటి ముప్పుల్ని పట్టిచూపే ప్రయత్నం చేసింది. ప్రసేన్ 'ఏదీకాదు' లాంటి సంపుటాలు ఈ నేపథ్యంలో గ్యాట్ ఒప్పందాలను వాటిలోని కుట్రల్ని బహిర్గత పరచడం చేసింది" (అదేపుట, 2007:49) అని సీతారాం ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన కవితా సంపుటాలను గురించి విశ్లేషించారు. 'గ్లోబల్ ఎకానమీ' 1980ల తర్వాత పొందుతున్న పెద్దమార్పులు, జులై 1991 నుంచి అమలవుతున్న ఆర్థికసంస్కరణలు అందులో భాగంగా భారతీయ ఆర్థికంలో వస్తున్న మార్పులను మనకవులు రచించడం మొదలుపెట్టారు.

2004 సంవత్సర కాలంలో వెలువడ్డ ఉత్తమ

కవితలను ఏరి, కూర్చి ఒక సంపుటంగా కవితాస్వాదకులకు అందివ్వవలసిన చారిత్రక అవసరాన్ని గుర్తించి 'సృజనలోకం' 'కవితావార్షిక' పేరుతో జనవరి నుండి డిసెంబర్ వరకు వివిధ మాధ్యమాల ద్వారా వెలువడ్డ ఉత్తమ తెలుగు వచన కవితలను సేకరించి ప్రతి సంవత్సర మార్చినెల మూడవ ఆదివారం రోజు ఆవిష్కరించ సంకల్పించింది. ఈ దృష్టితో వారు విస్తృతంగా 2004 సంవత్సర కాలంలో సేకరించిన దాదాపు 926 కవితలనుండి సృజనలోక కవితా వార్షిక సంపాదక వర్గం ఎనభై కవితలను ఎంపికచేసి మొదటి సంపుటిని 'కవితావార్షిక - 2004'గా తెలుగు సాహిత్యలోకానికి అందించింది. ఈ కవితా సంపుటిలో ప్రపంచీకరణ భావాలు ఏవిధంగా ఉన్నాయో తెలియ జెప్పడమే ఈ నా పరిశోధనా వ్యాస ప్రధాన ఉద్దేశం.

పల్లెల్లో పేదరైతులు బతకలేక పట్టణాలకు నగరాలకు వలసపోవడం, సర్వసాధారణమైపోయిన సమకాలీన దృశ్యం. తల్లి దండ్రుల్నీ, కుటుంబాల్నీ వదిలేసి, వలస పోతున్న బిడ్డల్ని గురించి దయనీయమైన ఘట్టాన్ని జూకంటి జగన్నాధం 'తల్లికొంగు' కవితలో తెలియజేశాడు.

"తల్లి కొంగునీడ నుండి తరచిపోతున్న కొడుకులు
కడుపులో బాధ నులిపెట్టగా గెదిమికొట్టబడ్తున్న బిడ్డలు
ఇప్పుడు పచ్చని బతుకు మలమల మాడిపోతుంది
ఇప్పుడు వెచ్చని గూడు
చెట్టుకొకరు పుట్టకొకరుగా తల్లడిల్లుతుంది
ఇప్పుడు నిలువెత్తు పద్యం నిట్టనిలువుగా పడి
వలవలా ఏడుస్తుంది". (కవితా వార్షిక 2004: 84)

రైతులు కూరగాయలు కష్టించి, పండించి, అమ్ముకుని, ఫలితం దక్కని కూరగాయలామె గురించి 'కూరగాయలామె' కవితలో పొట్లపల్లి శ్రీనివాసరావు తెలియజేశారు.

"ఉదయం కన్నా ముందే వేకువ పిట్టవై
అంగట్లోనూ అందరి ముంగిట్లోనూ
అరచి అరచి తిరిగి తిరిగి ఆవిరైన శక్తినంతా
కూరల తాజాదనంలో నింపుతున్న ఓ శక్తినంతా
కూరల తాజాదనంలో నింపుతున్న ఓ శక్తిప్రదాయినీ
దినమంతా జనారణ్యంలో సంచరించే కూరలవ్యా
తీరొక్కతీరు పిలుపులు కూరల పేరైన ఓ
కూరలమ్మీ
పదిలం పదిలంగా మాట్లాడు
మాయమాటల మోసగాళ్ళుంటారు
పైసలు బుక్కే బ్రోకర్లుంటారు
పరువం గుంజే దళారులుంటారు
చూసి బేరమాడు - ముదిరిన బెండలు సుమ్మీ
ఇంట్లో సరసాలు చెరసాల పాల్జేసిన వాళ్లంతా
నవరసాలు కొసరి కొసరి పండిస్తారే చెల్లీ -
కూరల్ని తడిమి తడిమి బేరమాడే మాటల్లోంచి
అర్థకలి నగ్న సత్యాన్ని అత్రంగా జోగుతున్న
కళ్లలోంచి
రాలుతున్న పై పైనా పరకైనా
కడుపులో కొలువుదీరిన దేవతకేనని చెప్పవే
చిన్నారీ".

(కవితా వార్షిక 2004: 63)

నీరు కూడా బహుళజాతి వ్యాపారంలో భాగం. ప్రజలు తాగడానికి నీళ్ళుండక పోవచ్చుగానీ, వాటర్ బాటిళ్ళ వ్యాపారానికి కొరతలేదు. బహుళ జాతుల కూల్‌డ్రింకుల వ్యాపారానికి లోటులేదు. నాళేశ్వరం శంకరం 'జల సంభాషణ' కవితలో ఈ విషయాలను తెలియజేశాడు.

"హృదయ మేధావులేమో
జలానికి ఫౌంటేన్ జరీ జలధారల వేషం వేసి
విద్యుత్ జలకాంతి నక్షత్రాలను కూర్చేబెట్టి
జలంచేతనే జలనృత్యం చేయించి మురిసి మురిసి
పోతారు
తొలకరి వానజల్లు మా ఇంటి ముందు కల్లాపి
చల్లినప్పుడైనా
మట్టి సుగంధాలను మనో పరిమళంగా దాచు
కోవాల్సింది...

ఎడారి ఇసుకలో సైతం నిషేదానికి గురైనా
ఒంటెల పొట్టల్లో యెలా తలదాచుకుందో
గుర్తించాలి"

(కవితా వార్షిక 2004: 80)

సామ్రాజ్య వాద దోపిడీకి మూడు రంగాలు బాగా పనిచేశాయి. అవి ఎల్.పి.జి. లిబరలైజేషన్ (సరళీకరణ), ప్రైవేటైజేషన్ (నిజీకరణ), గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ). ఈ అన్నింటికీ వ్యాపారమే మూలసూత్రం. పెట్టుబడిదారీ విధానమే పునాదిరాయి. వరల్డ్‌బ్యాంక్, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ, శాస్త్రవిభాగం మొదలైన ఎన్నో ఎన్నో ఈ దేశపు సంపదను తరలించుకుపోవడానికి పన్నిన వలలే. డబ్బునే 'దేవుడు'గా చేసే సంస్కృతి ఈ అన్నింటి అంతిమలక్ష్యం. 'నాగలి బతకాలి' కవితలో ఎస్వీ సత్యనారాయణ ఈ విధంగా అంటాడు.

"రైతుల స్వీయ హత్యల వెనుక
దేశం కీళ్ళు విరిగిపోతున్న చప్పుడు
ఈ చప్పుడులో ...
ప్రపంచ బ్యాంక్ డాలర్ కత్తుల సవ్వడి
ఐ.టి. విప్లవాల అసమ ప్రగతీ ప్రతిధ్వని
రక్తంతో గీస్తున్న కంప్యూటర్ చిత్రాలు
శవాలపై వికసిస్తున్న బయోటెక్ పుష్పాలు
మట్టితో పెనవేసుకున్న
సకల మానవ సంబంధాలూ
ఒక్క చావు వేటుతో తెగిపోతున్నాయి
దశాబ్దాలుగా
నిర్లక్ష్యం చేయబడిన బీడుభూములు
సజీవ సమాధులౌతున్నాయి".

(కవితా వార్షిక 2004: 93)

భారతదేశం ప్రధానంగా వ్యవసాయికదేశం. ఇక్కడ పాలంతో రైతుకి అవినాభావ సంబంధం ఉంది. ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ విధానాన్ని తేవడంతో, రైతునీ పాలాన్నీ విడదీసి, పెట్టుబడిదారులకి పాలం ఒక వ్యాపార వస్తువుగా చేయబడింది. ఇలా ఎన్నో కారణాలవల్ల నిర్లక్ష్యం చేయబడ్డ రైతుకి ఆత్మహత్యలు తప్ప మార్గం లేకపోయింది. దాదాపు కవులందరూ రైతుజీవితం గురించి కవితలు రాశారు. ఈ విషయం గురించి కత్తిపద్మారావు 'భూమి భాష' అనే కవితలో తెలియజేశారు.

"భూమి ఒక నిరంతర అనుకంపిత
సంభాషిత కూడా
దాని నిశ్శబ్దం అంతా భాషే,
అది పొరలు పొరలుగా లేస్తున్నా
పగుళ్ళు పగుళ్ళుగా బీటలువారుతున్నా
దాని గుండెల్లో దాగున్న
విత్తనానికి ఊపిరి పోయడం కోసమే
దాని వేదన".

(కవితా వార్షిక 2004: 109)

అలాగే దేశీయ మూలాల్ని సేకరించే ఆర్థిక దాడి గురించి, రైతులు పండించే పంటగురించి, చేతివృత్తుల వారి జీవనం గురించి జయధీర్ తిరుమలరావు 'దృశ్యంలో మార్పుకోసం' కవితలో తెలియజేశాడు.

"రెండు పెను మార్పుల మధ్య
గతరెండు మహా సంగ్రామాల నీడన
మరో గ్లోబాధిపత్య యుద్ధలాలనలో
ఓ దిక్కు కార్మికలోకం ... మరో దిక్కు కర్షక జీవితం
కోనల మధ్య
తాత్విక మథనాల నేపథ్యంలో...
వందలాది వంతెనల నుండి
మనోవేగంతో వాలి దేశీ కూకటివేళ్ళని పెకిలే
హార్థిక ఆర్థిక హానికర జాడలు...
ప్రజలు ఉక్కు కవచపు రక్షాబంధనాలు కావాలి
కర్రులు చేతివృత్తులు నిత్యం విరిగిపడే చప్పుడు
ఎవరు చేసే యజ్ఞానికి బలి పశువులు?
'పంట' ప్రాణాలను తోడడం వాస్తవం
భూమి పంపకమే కాదు
విత్తనం. క్రిమిమందు, ఎరువు, కరువు, ధర దళారీ,
పెట్టుబడీ, బ్యాంకులు వీటి క్షాళన ..ఎవరు...".

(కవితా వార్షిక 2004: 87-88)

ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో మన పల్లెటూర్లు ఏవిధంగా తమ రూపురేఖలను మార్చుకున్నాయో ఎన్. గోపి ఊరు మారిన తీరును 'మరోసారి మావూరు' అనే కవితలో ఈవిధంగా తెలియపరిచారు.

"అమ్మ పాతబడుతుందా
అట్లనే మావూరు
ఎన్ని సార్లు వెళ్లినా
ఎంతో ప్రేమతో చేతులు చాచి పిలుస్తుంది...
మాచెరువు నీళ్లు
ఏ శూన్యాల్లోకి ఇంకిపోయ్యాయో!
ఎముకలు తేలిన ఛాతిలా కొట్టుకుంటుంది...
ఎంత చదివినా
ముగియని గ్రంథం మావూరు
ఈ మధ్య మావూరు
నన్ను చూసి బెదిరిపోతున్నది
విశ్వప్రవాసిని కదా!"

(కవితా వార్షిక 2004: 116-117)

యాంత్రీకరణలో చితికిపోయిన జీవితాల్లో చేనేత వారివి అత్యంత దారుణం. ఫ్యాషన్లపేర, మోడల్స్‌పేర, అందాల పోటీల పేర వ్యాపారం చేసేదంతా విదేశీ వస్త్ర సంస్కృతే. పాలక వర్గాలు ప్రజల ఆందోళనల వల్ల కొన్ని తాత్కాలిక కంటి తుడుపు చర్యలు చేసినా, అంతిమ లక్ష్యం దేశీయ వృత్తుల వినాశనమే. ఇలా ప్రపంచీకరణకు పల్లెలు, అక్కడి ప్రజల జీవనం దుర్భరమైపోయింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. నవీన్, అంపశయ్య (సంక), కవితా వార్షిక 2004, సృజనలోకం, వరంగల్లు, 2005.
2. రంగనాథాచార్యులు, కె.కె, సామయిక వ్యాసాలు, స్వీయప్రచురణ, 2000.
3. శరత్ జ్యోత్స్నారాణి, ఎన్, (సంపా), తెలుగు కథా సాహిత్యం ఆధునిక దృక్పథాలు, జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాద్, 2007.
4. సీతారాం, అదేపుట, పాజిటివ్ పబ్లికేషన్స్, ఖమ్మం, 2007.

❖ ❖ ❖

ప్రపంచీకరణ ప్రభావం - చేనేత వృత్తి సాహిత్యం పరిశీలన

- గడ్డం నాగేందర్

భారతదేశంలో అతి పెద్ద ఉపాధి రంగం వ్యవసాయం ఆ తర్వాత 2వ అతి పెద్ద ఉపాధిరంగం చేనేత రంగం. దేశంలో కొన్ని లక్షల మగ్గాలు ఆధారంగా చేనేత పరిశ్రమ నడుస్తుంది. మరి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో కొన్ని లక్షల మగ్గాలు ఉన్నాయి. ఈ మగ్గాల వలన 2 కోట్ల మందికి పరోక్షంగానూ, జీవనోపాధి లభిస్తుంది. ఇది కేవలం ఉపాధి రంగమేకాదు, సాంప్రదాయకమయిన కళాత్మకమయిన, నైపుణ్యం కలిగిన పరిశ్రమ కూడా. ఇక్కడ తయారయిన చేనేత వస్త్రాలు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసి విదేశీ కరెన్సీని ఆర్జించడం మనకు గౌరవప్రదం. అయితేఏళ్ల క్రితం ఈ దేశ ఆర్థిక వ్యవస్థను బ్రిటీష్ వలసవాదం అస్తవ్యస్తం చేసింది యురప్ లో వచ్చిన పారిశ్రామిక విప్లవం వలన అక్కడి ఉత్పతి అయిన వస్తువులు మన దేశం కి రావడం వలన ఈ దేశ కుటీర చేతి వృత్తులు అన్ని విధ్వంసం అయ్యాయి వివిధ దేశాలు ఆధునిక సాంకేతిక రంగం ఉపయోగించి ఉత్పత్తి అయిన వస్తువులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయడాన్నే ప్రపంచీకరణ అనవచ్చు. ప్రస్తుత ఆధునిక సమాజం లో ఈ ప్రపంచీకరణ ప్రభావం వలెనే అనాధిగా ఉన్న చేతివృత్తులు(కులవృత్తులు) కనుమరగవుతున్నాయి.

భారతదేశంలోగత కొన్ని ఏళ్లుగా చేనేత పరిశ్రమ అనేక విదేశీ, స్వదేశీ సవాళ్లను ఎదుర్కొంటూ తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నది. అయితే గత 25 ఏళ్ళుగా ప్రపంచీకరణ సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో కొన్ని సరికొత్త సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తుంది. ఇందులోముఖ్యంగా ఆధునిక యంత్రాల పైన ఆధారపడిన పరిశ్రమ నుంచి వస్తున్న అనైతిక పోటీ ఒకపెద్ద సవాలు అయితే దానికి అనుగుణంగా ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలు కూడా మరో సవాలుగా పరిణమించాయి. గత కొన్ని సంవత్సరాలుగా చేనేత పరిశ్రమలో విపరీతమైన మార్పులు రావడం సరైన ఉత్పాదకత లేక నేతన్న రోజు కూలీలుగా మారుతున్నాడు. అనేక కుటుంబాలు తమ సొంత మగ్గం మిద ఆధారపడి బతుకుతున్నాడు. నేసిన బట్టలకు కనీస ధర, ఆదరణ లేని పరిస్థితి దీనికి స్పష్టమైన సంకేతం ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు చేనేత కార్మికులు పెరుగుతున్న పేదరికం. స్వతంత్రంగా పని చేస్తూ జాతీయ, స్థూల ఉత్పత్తికి దోహదపడుతూ స్వేచ్ఛగా వస్తు ఉత్పత్తి చేసే సగటు చేనేత కుటుంబం అంత ఇతర డబ్బు ఉన్న వాళ్ళ దగ్గర దినసరి కార్మికులు పనిచేస్తూ చేనేత వస్త్ర ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు ఈ పరిస్థితిని గుర్తించకుండా సరైన అవగాహన పెంచుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానన్ని నేతన్నలకు అందించకుండా ఉత్పత్తి పెంచమనడం అలానే సహాయం, సబ్సిడీలు అందించకుండా కోట్లాది చేనేత కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నాయి.

ప్రపంచీకరణ ప్రభావం :

ప్రపంచీకరణ (Globalization) అనేది మానవ సమాజం అభివృద్ధి చెందుతున్న దశలో ఏర్పడిన ఒక అనివార్య దశ. ఈ దశకు మూలాలు క్రీస్తు పూర్వం మూడో మిలీనియంలోనే ఉన్నాయని చెప్పేవారు లేకపోలేదు. అంత వెనక్కు కాకపోయినా 15వ శతాబ్దంలో సంభవించిన పారిశ్రామిక విప్లవం దరిమిలా ఐరోపా దేశాలు కొన్ని ముఖ్యమైన శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు చేయడం ద్వారా భారీ మొత్తంలో ఉత్పత్తులను తయారు చేయగలిగాయి. ఆ ఉత్పత్తులకు (నరుకులకు మార్కెట్లను వెతుక్కునే క్రమంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు వ్యాపారం పేరుతో ఆ దేశాలను

వలసలుగా చేసుకోవడంతో ఈ ప్రపంచీకరణ దశ వేగం పుంజుకున్నదని చెప్పవచ్చు. ప్రపంచ వ్యాపితంగా విస్తరించి ఉన్న ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమలు, మార్కెట్లు, సంస్కృతి విధానాల రూపకల్పన అన్నీ సమ్మిళితం కావడమే "ప్రపంచీకరణ" కొందరు ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రపంచ దేశాల మధ్య వస్తువులు, సేవలు, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం, శ్రమ మానవ మూలధనం లాంటివి ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు లేకుండా స్వేచ్ఛగా ప్రవహిస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సమైక్యంగా సంఘటితం కావడమే ప్రపంచీకరణ అనిఅంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది ప్రపంచీకరణలో నాలుగు ప్రధాన అంశాలను గమనించవచ్చువ వివిధ దేశాల మధ్య వస్తుసేవల స్వేచ్ఛా ప్రవాహానికి ఉన్న అవరోధాలను తగ్గించడం దేశాల మధ్య మూలధన స్వేచ్ఛా ప్రవాహాన్ని తగిన వాతావరణాన్ని సృష్టించడం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సరిహద్దులు దాటి, ప్రపంచమంతా విస్తరించేలా చేయడం దేశాల మధ్య శ్రామికుల గమన శీలతకు తగిన వాతావరణాన్ని సృష్టించడం,నేడు అంతర్జాలం విస్తరించిన నేపథ్యంలో ప్రపంచమే ఒక విశ్వ గ్రామంగా అవుతుంది1980వ దశకంలో ఆవిర్భవించిన విధానాలు, స్వేచ్ఛా వాణిజ్య విధానాలను ప్రాచుర్యంలోకి వచ్చాయి.అంతర్జాతీయీకరణ, సరళీకరణ ఫలితం ప్రపంచీకరణ అని చెప్పవచ్చు ప్రపంచీకరణ వల్ల గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం, బహుళ జాతి సంస్థల (ఎంఎన్సీ) ద్వారా విదేశీప్రత్యక్ష పెట్టుబడులు (ఒడిఐ) పెరగడం లాంటి ప్రధాన అనుకూల అంశాలు ఏర్పడతాయి. రవాణ, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానం బహుముఖంగా విస్తరిస్తుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ), యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఎన్ఏ ఎస్టీఏ లాంటికూటముల ద్వారా ఏర్పడ ప్రాంతీయ వర్తక మండళ్లు పపంచీకరణకు తోడ్పడుతున్నాయి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, వాటి మార్కెట్లలో బహుళజాతి సంప్రద పేరుతో అభివృద్ధి చెందినదేశాల్లోని అధికోత్పత్తి, అధిక స్థాపిత శక్తి ప్రవేశించడం వల్ల ప్రపంచీకరణ పెరుగుతుంది అంతర్జాతీయ వ్యాపారంలో వస్తుసేవల ఎగుమతి, దిగుమతులపై ఆంక్షల తొలగింపు, విదేశీ మారక ద్రవ్యం నియంత్రణలను తొలగించడం లాంటివి ప్రపంచీకరణకు అవకాశాన్ని ఏర్పరుస్తుంది వివిధ దేశాల విదేశీ వ్యాపార చెల్లింపు శేషంలో మార్పులు జరిగి, విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరగడం జరుగుతుంది.

ప్రపంచీకరణ - చేనేత వృత్తి సాహిత్యం :

నాలుగున్నర దశాబ్దాలుగా తెలంగాణ కవితాకాశంపై తనదైన మట్టి ముద్రలను వేస్తూ సాగిపోతున్న జూకంటి జగన్నాథం తెలుగు నేలపై ప్రపంచీకరణ ప్రమాదాన్ని ముందుగానే తన కవిత్వంతో ఎలుగెత్తి చాటిన కథకులలో ముఖ్యమైన వాడు జూకంటి తాను దశాబ్ద కాలంలో రాసిన 12 కథల్ని 'వైపని' పేర 2004లోనే సంపుటిగా తీసుకు వచ్చారు. తన కళ్ళముందే తన ఊరు, మనిషి, ప్రకృతి అనవాలు లేకుండా చెదలుపట్టిపోతుంటే ఒక మానవత్వ మున్న మనిషిగా కదిలిపోయి దుక్కించే కథకుని తన్లాట కనిపిస్తుంది.ఈ కథలు వచ్చి నేటికి 16 ఏళ్ళయినా వీటి ప్రాసంగికత తగ్గలేదనడానికి వైపని కథ మంచి ఉదాహరణ. ఈ కథ 2002లో ఇండియా టుడే వార్షిక సంచికలో ప్రచురింపబడింది. మనిషి దేహాన్ని వర్ణమయం చేసి, మానవులను నాగరికులను చేసిన చేనేత కార్మికులకు ఈ లోకం ఆకలి చావులనే బహుమతిగా ఇచ్చింది. సిరిసిల్లనే కాదు దేశంలోని అనేక వస్త్రోత్పత్తి కేంద్రాలు ఈ రోజు ఎంతో సంక్షోభంలో ఉన్నాయనేదానికి ఇంకా కొనసాగుతున్న ఆకలి చావులే నిదర్శనం. సరిగ్గా 'వైపని' కథ కూడా పవర్ లూమ్ కార్మికుల ఆత్మహత్యలను, చేనేత రంగంలోని సంక్షోభాన్ని, ప్రభుత్వాల ఉదాసీనత చర్యలను చిత్రించిన కథగా చూడవచ్చు.

తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ పరిణామాలతో వెలువడిన తొలి కథా సంపుటి వేవ చెట్టు.దీనికి జి.రాములు రాసారు. ఇందులో అయిదవ వాడు

చేయూత, మలుపులు, సంబంధం, ప్యారా సైట్లు, కామన్వెల్త్ వంటి కథలు కలవుముదిగంటి సుజాత రెడ్డి రాసిన వ్యాపార మృగం కథల సంపుటం ప్రపంచీకరణ నేపథ్యంలో రాయబడినది. దీనిలో 20కథలు కలవు.ఇది సామ్రాజ్యవాద కారణంగా వ్యాపారాలు సృష్టించిన వైపరీత్యాన్ని చిత్రీకరించాయి. ఇందులో వివిద్ వృత్తి కులాలకు సంబంధించిన ప్రపంచీకరణ ఈ నేపథ్యంలో వాళ్ళు పడ్డ బాధలు ఇందులో ఉన్నాయి.

అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన ఘనత తెలుగు నేతన్నలది. విదేశాలలో మన చేనేత వస్త్రాలకు నేటికీ మంచి గిరాకీ ఉంది. అయితే ప్రస్తుత ప్రపంచీకరణ ప్రభావాలు, పాలకుల విధానాల కారణంగా చేనేత పరిశ్రమ చితికిపోతోంది. చేనేతవృత్తి కళ్ల ముందే కుప్ప కూలుతున్నా కాపాడే గట్టి ప్రయుత్నాలు మాత్రం మృగ్యమైనాయి. ఎన్నికల సవుయాలలో రాజకీయ పార్టీలు తమ రాజకీయ జూదంలో చేనేతలను పావులుగా వాడుకుంటున్నారు తప్ప, వారి అభ్యున్నతికి పాటుపడటం లేదు. దీంతో చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయి నిస్తేజమైపోయింది.

అనంతపురంకు చెందిన డా. రాధేయ, ''మగ్గం బతుకు'' అనే దీర్ఘ కార్యంలో చేనేత కార్మికుల బతుకు లను గురించి కూలంకషంగా విశ్లేషించారు. అందులో - 'ఆరుగజాల నేతచీరను అగ్గిపెట్టెలో అందంగా మడతపెట్టి అంతర్జాతీయ కీర్తిని తలదాల్చిన ఈ కళాకారుడు నేడు జానెడు పొట్టను, పిడికెడు మెతుకులతో నింపుకోలేని దౌర్భాగ్యుడైనాడు. ప్యాకేజీ స్కీములతో పవర్లూమ్స్ లాభపడితే టెక్స్ టైల్ పార్కులతో బహుళజాతి కంపెనీలు బలపడతాయి. మా శ్రమజీవన సౌందర్యం, షోరూము ల్లోనూ ఆర్ట్ గ్యాలెరీల్లోనూ మీ కనులకు విందు చేస్తుంది' అందులో చేనేతల కార్మికుల జీవన స్థితిగతులు వివరిం చారు. తెలుగు సాహిత్యం లో చాల మంది కవులు చేనేతల బతుకుపై దీర్ఘ కవిత్వాలు కవిత్వం రాశారు. చేనేత లు పడుతున్న కష్టాలు బాధలు గురించి రాపోలు జగన్ చేనేత కథలు రాశారు అందులో చాలా కొరకు చేనేత కుటుం బాలపై కేంద్రంగా కథలు ఉన్నాయి. ఈయన కథలు ప్రపంచీకరణ ప్రభావం వలన నేతన్నల బతుకు ఏ విధంగా మారింది అనే విషయాలు తెలుసుకోవచ్చు.

సమాజంలోని చేనేత కుల వృత్తికారుల జీవన నేపథ్యంగా రాసిన యాభై ఎనిమిది కథలను 'పడుగు పేకలు' పేరుతో సంకలనంగా వెలువరించింది. చేనేత జీవితాలలో నుంచి తెలుగు కథను వెతికి పట్టి చూపించిన మొట్టమొదటి వృత్తి అస్తిత్వ కథాసంపుటి ఇది. చేనేత వృత్తి మనదేశంలో పుట్టింది మొదలు ఆ వృత్తిదారుల జీవితాల్లోని దోపిడీనీ, పీడననూ, దారుణమైన పరాధీ నతనూ, విధ్వంసాన్నీ వివిధ కోణాల్లో వ్యక్తం చేశాయి ఈ కథలు. అదే సమయంలో ఆ లోటును పూడ్చాల్సిన బాధ్యతనూ గుర్తు చేస్తాయి. తెలుగు సమాజాన్ని వృత్తి జీవితాల పట్ల ఆలోచన చేసే విధానంలో భాగంగా ప్రచు రించిన ఈ కథా సంకలనం చేనేత వృత్తి ఉత్థాన పతనా లను వివరంగా తెలుగు సాహిత్యంలో చేనేత వృత్తికి సంబంధించి వివిధ ఈ ప్రాంతాలకు చెందిన కథా రచయితలు రచించిన చేనేత వృత్తికి సంబంధించిన కథ లను సంకలనంగా తీసుకువచ్చిన మేడిమర్తి ఓబులేసు, వెల్దండి శ్రీధర్, డా. సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో 58 రచయితల చేనేత కథలు ''పడుగు పేకలు'' సంకలనం నవంబర్ 2016లో వెలువడింది. ఈ సంక లనంలో కేవలం, చేనేత కుటుంబాలకు చెందిన రచ యితలే కాకుండా,ఇతరులు నేతన్నల జీవితాలపై మంచి మంచి కథలు రాశారు. కుల వృత్తి కథల విషయాలకు వస్తే, ఎందరో రచయితలు వృత్తి సంబంధించిన కొన్ని వందల కథలు రాశారు. చేనేత వృత్తి నేపథ్యంగా వచ్చిన తెలుగు కథలను సంకలనం ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర కథా రచయితలు రాసిన ఉత్తమ చేనేతకథలున్నాయి. చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకున్న ప్రస్తుత సందర్భంలో ఈ పుస్తకం ఒక వెలుగు దారి. చేనేత రంగ సంక్షోభాన్ని గురించి అవగాహన

చేసుకునుటకు ఈ సంకలనం పనిచేస్తుంది. దీంట్లో కొన్ని ప్రపంచీకరణ ముందు ఆ తర్వాత రచించిన కథలు అన్నీ ఈ సంకలనంలో ఉన్నాయి చేనేత బతుకులు వాళ్ళ జీవన విధానం ప్రపంచీకరణ వల్ల నేతన్న జీవితం ఎలా నాశనమైపోయింది ఈ సంకలనంలో చదవడం ద్వారా అవగాహన చేసుకోవచ్చు.

ఈ పడుగు పేకల కథా సంకలనం లో దిలావర్ మహ్మద్ రాసిన ఈ 'ఉరితాళ్ళు కథ వాస్తవ జీవితాన్ని అంతే వాస్తవికంగా చిత్రించిన కథ. ఇది 1994 లో జాగృతి పత్రికలో సెప్టెంబర్ 25 మొదటగా వచ్చింది .ఆ చేనేత కథ సంకలనం లో తిరిగి ముద్రణ పొందింది . చేనేత జీవితాల నిండా ముసురుకున్న 'ముసురు'ను మన మనసు నిండా నింపి పోయే కథ.గోరు చుట్టూ మీద రోకలి పోటులా సబ్సీడీ రద్దు చేస్తూ సర్కారు వారి ఫర్మానాలు. ఇబ్బడి ముబ్బడిగా విదేశాలకు నూలు ఎగుమతి చేయడం ఇంకొక సమస్య. అనుపత్రుల్లో, ఆఫీసుల్లో చేనేత వస్త్రాలను యూనిఫారంగా ఉప యోగించక పోవడం మరో సమస్య. నిధుల కొరత. అమ్మకాల్లేక ఆప్కోలో బట్టలు గుట్టలు గుట్టలుగా పేరుకొని పోవటం సరైన నా తోడ్పాటు అందకపోవడం వల్ల చేనేత లు వేసిన బట్టలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణకు నోచుకోలేదు. సరైన గిట్టుబాటు ధర లభించక ఎంతో మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఈ కథా సంకలనంలో ఉన్న కథలలో చూడవచ్చు .

ఈ దేశంలో చేనేత కార్మికుల జీవితాలు ఏ రంగులూ లేకుండా ఎట్లా తెల్లారి పోతున్నాయో ఈ కథ కళ్ళకు కట్టినట్టు చూపుతుంది. దేశానికి అన్నం పెట్టె రైతన్న లాగే ప్రపంచానికి బట్ట అందించి మనిషిని ఎంతో నాగరికంగా తయారు చేసిన నేతన్న కూడా ఎలా మృత్యు కూపంలో కూరుకు పోతున్నాడో ఈ కథ ఒక ఉదాహరణ. దశా బ్దాలుగా చేనేత బతుకుల్లో ఇంతటి సంక్షోభం కొనసాగు తుండగా చేనేత వృత్తి, పవర్లూమ్ రంగం మరింత అగాదంలోకి నెట్టి వేయబడింది. పని చేయడానికి చేతుల్లో బలమున్నా చేయడానికి పని లేక, మరో పనిలోకి మారలేక, బయటకు పోలేక చేనేత కార్మికుల ఆకలి చావులు ఇంకా పెరిగి పోయాయి. చేనేత రంగం మరింత కుదేలై పోయింది. ఉత్పత్తి కులాలకు మంచి రోజులు రావాలని, ప్రతి మనిషి బాధలు లేని జీవితం గడిపి సంతోషంగా కాలం గడపాలని ఆకాంక్షించే కథ. చేనేత కార్మికుల ఆకలి చావులు ఉన్నన్ని నాళ్ళు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉన్నన్ని నాళ్ళు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేదా ఇద్దరు చనిపోయి పిల్లలు అనాథలుగా మారుతున్న పాడు రోజులు ఉన్నన్ని నాళ్ళు ఈ 'ఉరితాళ్ళు' కథ అందరకి గుర్తుంటుంది .

బి వి ఎన్ స్వామి గారి కథా సంకలనం 'రాత్రి పగలు ఒక మెలుకువ' అని వెలువరించారు. ఈ కథా సంపుటిలో 14 కథలు ఉన్నాయి.ఇందులో ఉన్న ఒక మంచి కథ పద్మశాలీల జీవితాన్ని బేస్ చేసుకుని వ్రాసిన కథ "కుంఠనం" దీనికి అర్థం అంటేకుంఠనం అంటే ఒక ప్రస్టేషన్ లోకి వెళ్లి పోవడం అనే ఈ విధమైన అర్థంతో రచయిత కథ పేరు పెట్టారు. చేనేత కారులు అప్పులు తీస్కొని బట్టలు నేయడం ఆ తర్వాత అప్పులు పెరిగి పోవడం సరైన ఆదరణ లభించక పోవడం ఇలాంటి సమస్యలతో చేనేతకారులు ఎంత మనోవేదనకు గురై ఆత్మహత్యకు పూనుకుంటున్నారని విషయాలు గమ నించవచ్చు. ఈ కథలో. పద్మశాలీల కులదైవం దగ్గర్నుంచి చేనేత కార్మికులు ఈ రకంగా ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. ఆత్మహత్యలకు పాల్పడటానికి కారణాలేమిటి అనే విషయాలు ఇందులో కనబడతాయి. ఈ కథలో పద్మ శాలీలు సంబంధించిన ఒక పాట కూడా పెట్టడం జరిగింది. అలానే చేనేత కుటుంబంలోని కష్టాల కడలినంతా పట్టి చూపిన కథ కొక్కుల భాస్కర్ 'తెగిన పోగు' (1999), చేనేత కుటుంబ బాధలు వివరించారు. వేల్దండి శ్రీధర్ కథా సంకలనం "పుంజితం" కథా సంక లనం 'మరణ మదంగం' కథలో సిరిసిల్లలో ముగ్గురు

జీవితాలకు సంబంధించిన మూడు కథలు యేక కాలంలో నడుస్తాయి. ముగ్గురి సమస్యా వొకటే. మగ్గాలు పోయి సాంచెలు వచ్చినప్పటికీ యే చేనేత కార్మికుడి బతుక్కీ భరోసా లేదు. కుటుంబాలు జీవనోపాధి కష్టంగా మారు తుంది. ప్రతి ఇంట్లో మగ్గం చప్పుడును 'మరణ మదంగం' మింగేసింది. అనే అర్థంలో రచయిత అందుకు కారణాలని కథలో చూపించాడు . పాలకుల సంక్షేమ పథకాలేవీ నేతన్నల బతుకులో వెలుగు నింపటం లేదని ఆవేదన చెందుతున్నాడు. ఈ ఆవేదనే కథలో ప్రతి పదంలోనూ కనిపిస్తుంది.

ప్రపంచీకరణ ప్రభావంతో చేనేతల జీవన విధానాన్ని వారు పడుతున్న బాధలను అర్థం చేసుకోవడానికి ఇటీవలే వచ్చిన "మల్లేశం" సినిమాను చూస్తే పవర్లూమ్ తో పోటీగా నేతన్నలు బట్టలు నేయక పోవడానికి గల కార ణాలు బట్టలు నేయడానికి కావాల్సిన దారం, రంగులు కొనడానికి ఆర్థిక వనరులు లేకపోవడం ఇలాంటి విష యాలు మనకు అర్థం అవుతాయి. శారీరిక శ్రమ ఎక్కువగా ఉండడం వల్ల అనారోగ్యం బారిన పడటం కనిపిస్తుంది. గ్రామాల్లో కుటుంబాలు బట్టలు నేయడంలో పడే ఇబ్బందులు ప్రపంచీకరణ ప్రభావం వల్ల మార్కెట్లో కొత్త సాంకేతిక టెక్నాలజీ ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఉత్పత్తి జరుగుతుంది కాలంలో నేతన్నల బతుకు చిద్రమైనట్టు వీళ్ళ పరిస్థితి గమనించిన గ్రామంలోని ఒక యువకుడు చేసిన గొప్ప పని మీద ఆధారపడి ఈ సినిమా ఉంది. ప్రధాన పాత్ర అ మల్లేశం ఆసు యంత్రాన్ని కనిపెట్టి ఎందరో చేనేత కార్మికులకు కష్టాలు తీర్చిన వ్యక్తిగా మనకు కనిపిస్తాడు. చింతకింది మల్లేశం తన జీవితంలో పడిన ఇబ్బందులను ఆసు యంత్రాన్ని కనిపెట్టిన విధానాన్ని ఈ సినిమాలో చూపించారు. ఈ సినిమాని ఆర్ రాజ్ దర్శకత్వం వహించారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల గ్రామాల్లో చేనేత కుటుంబాలకు సరైన పని దొరకక పోవడం పెద్ద పెద్ద పారిశ్రామిక రంగాల నుంచి ఉత్పత్తి అయిన బట్టలు ప్రజలకు అందుబాటులోకి రావడం చేనేత బట్టలకు ఆదరణ తగ్గిన విషయాన్ని పని మానేసి ఇంట్లో కాలి ఉండలేక వలన ఇతర రంగాల్లో పని వెతుక్కొని జీవితం గడపడం ఇలాంటి విషయాలు ఇందులో కనిపిస్తాయి.

చేనేత కుటుంబాల్లో జరిగే వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకోవడానికి జీవనోపాధి కోసం పడే కష్టాలను "అగ్గిపెట్టెలో అరుగజాలు". అనే నవలలో చూడవచ్చు. ఈ నవలను ప్రసిద్ధ రచయిత్రి మంథా భానుమతి చేనేతల బతుకుల మీద పరిశోధన చేసి ఈ నవల రాసింది. వస్త్రాల తయారీలో ఎదుర్కొనే కష్టనష్టాలు భరించేవారు ఏ విధమైన జీవనవిధానంలో ఉన్నారు, అట్టడుగు కార్మిక వర్గానికి చెందిన కుటుంబాలలో స్త్రీల పాత్ర ఏమిటి,ప్రపంచీకరణ ప్రభావంతో చేనేత రంగం ఎలా చితికిపోయింది. అనే విషయాలు వెతుకుతుంటే ఒక నవలలో కనిపిస్తాయి ఈ నవల చేనేతల బతుకు లను, పరిశోధన చేసి ప్రపంచీకరణ ప్రభావం లో నేత కార్మికుల జీవితాలు, నేత పరిశ్రమ పోతున్న పోకడలు, దేశ వ్యాప్తంగా విస్తరించిన పరిశ్రమలోని వైవిధ్యం ఇలాంటి విషయాలను తెలిపే నవలగా 'అగ్గిపెట్టెలో ఆరుగజాలు' నిలిచింది .

ప్రపంచీకరణ ప్రభావం వల్ల విపరీతమైన పారిశ్రామికీ కరణ గురైన టెక్స్టైల్ ఇండస్ట్రీ ఉత్పత్తి చేసే బట్టలకు పోటీగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో నేతన్నలు బట్టలు తక్కువ సమయంలో ఉత్పత్తి చేసేవీలు లేదు. దీనివలన సరైన ఉత్పత్తి జరుగక ఆదరణ లభించక చేనేత కార్మికుల కుటుంబాలలో పూట గడవటం భారంగా మారింది. అయితే ప్రస్తుతం కార్మికులకు పనులు లేక మార్కెట్లో బట్టాల విక్రయాలు లేక జీవనం భారంగా కొనసాగుతున్నారు నేడు. మగ్గం మీద చీరను నేసి కండ్లకు ఆకట్టుకునేలా చీరలు తయారు చేసే నేతన్న నేడు కూలీ అవతారమెత్తాడు. అలవాటు పడిన పని వదిలేసి. తెలియని పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భవన నిర్మాణ కార్మికులుగా ఇంకా ఇతర అనలు

ఎప్పుడూ అనుభవం లేని పని రంగాల్లో మునిగారు. హైదరాబాదులోని పారిశ్రామికవాడలో వెళ్లి కంపెనీలో పని చేస్తున్నారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల గ్రామాల్లోని చాలామంది చేనేత కళాకారులు గ్రామాలు వదిలి ముంబై సోలాపూర్ వారణాసి గుజరాత్ ఇలాంటి ప్రాంతాలకు వలస వెళ్లారు ఎక్కడ జీవనోపాధి కోసం ఎక్కడెక్కడో వెళ్లి దొరికిన పని చేసుకుంటున్నారు. చేనేత కార్మికుల ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుండి ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వీలైనంత ఎక్కువ ఉత్పత్తి సాధించే విధంగా చేనేత కార్మికులకు సహాయం చేయాల్సి అవసరం ఉంది. అప్పుడే నేతన్నలు ప్రపంచీకరణ ప్రభావాన్ని తట్టుకుని నిలబడగలుగుతారు.

ఆధార గ్రంథాలు :

1. రవీందర్, పసునూరి. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ :(ఎం ఫిల్)యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, 2006.
2. వెంకటరామయ్య, జి. ప్రపంచీకరణ కథలు విమర్శనాత్మక పరిశీలన: (ఎం ఫిల్)యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, 2005.
3. శ్రీధర్, వెల్దండి.(సంపా) పుంజీతం (కథ సంకలనం) : హాసిని పబ్లిషర్స్, హైదరాబాద్, 2019
4. శ్రీనివాస్, సంగిశెట్టి, ఓబులేసు మేడికుర్తి, శ్రీధర్ వెల్దండి.(సంపా).పడుగు పేకలు (చేనేత వృత్తి కథలు) : ఫోరం ఫర్ కన్సార్డ్ బిసిస్, హైదరాబాద్ , 2016.

❖ ❖ ❖

మల్లిపురం జగదీశ్ కథలు - ప్రపంచీకరణ సాంస్కృతిక విధ్వంసం

– ఎం. రమాగీతాదేవి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చీపురుపల్లి, విజయనగరం జిల్లా.

"అభివృద్ధి చెందుతున్న అభివృద్ధి చెందని దేశాలకు అప్పులిచ్చేనెపంతో అభివృద్ధి నెపంతో అమెరికా తన సహస్ర బాహువులతో ఆక్రమించుకొని ఆయాదేశాల స్థానిక సంస్కృతులను, జీవవైవిధ్యాన్ని చంపెయ్యడం, ఆయా దేశాల, రాష్ట్రాల ప్రభుత్వాలను తోలుబొమ్మలుగా, కీలు బొమ్మలుగా మార్చుకొని పెత్తనం చెయ్యడమే ప్రపంచీకరణ ("రాచపాళెం చంద్రశేఖరరెడ్డి"). 1990వ సం॥లో మనదేశంలో ప్రవేశపెట్టబడిన ఆర్థిక విధానాలవలన మనదేశంలో ఆర్థిక, సాంఘీక, రాజకీయ, సామాజిక రంగాల్లో గుణాత్మక మార్పులు వచ్చాయి. అంతర్జాతీయ ఒప్పందాలు, బహుళజాతి సంస్థల నియంతృత్వంలో భూమి పరాయీకరణ జరిగి రైతుజీవితం విధ్వంస మవుతోంది. ప్రపంచీకరణ వలన మన ఆంధ్రదేశంలో అందునా ఉత్తరాంధ్ర ప్రాంతము ఎక్కువగా నష్ట పోయింది. కొన్ని ప్రాంతాలవారు మాత్రం ప్రపంచీకరణ ఫలితాలను బాగానే అందిపుచ్చుకొన్నారు. నాటి శ్రీకాకుళ రైతాంగ పోరాటంనుండి నేటి ఉత్తరాంధ్ర ప్రాంతలో జరుగుతున్న ఆందోళనలకు ప్రధాన కారణం "భూమి". 40సం॥ల క్రిందట అడవులమీద, అటవీ భూములమీద ఆదివాసీల హక్కుల కోసము ఉద్యమాలు చేస్తే అడవుల్ని, కొండల్ని కొల్లగొట్టుకుపేయే బహుళజాతి కుట్రల్ని ప్రతిఘటించేందుకు నేడు అన్ని వర్గాలు సంఘటిత మవుతున్నాయి. చిన్నచిన్న రైతులు, వ్యాపారస్తులు కార్పొరేట్ వ్యవస్థకు బలిఅవుతున్న తరుణంలో ప్రజలంతా సంఘటితమై చైతన్యంతో భూములు పరాయీకరణను ప్రశ్నిస్తున్నారు. ప్రపంచీకరణ వలన విలువలు, నమ్మకాలు, సామాజిక కట్టుబాట్లు కట్లు తెంచుకోవడం, సంస్కృతీ సంప్రదాయాలు కరిగిపోవడంవంటి విషయాలు ఈ ప్రాంతంలో అనేకమంది కథకులు కథలుగా రాస్తూ వస్తున్నారు. వీరిలో మల్లిపురం జగదీశ్ రాసిన కథలు 'శిలకోల' 'గురి' అనే కథా సంకలనాల రూపంలో వచ్చినవి. జగదీష్ కథానిర్మాణంలో, నిర్వహణలో వస్తుశైలి, శిల్ప పరంగా కొత్త ప్రయోగాలు ప్రయత్నిస్తూ, ఆదివాసీల జీవితాల్లో ఇంతకుముందు స్పృశించని కొత్తకోణాల్లో మరింత లోతుగా చూసి కథలు రాస్తున్నారు. ఆదివాసీల సాంస్కృతిక అస్తిత్వము పెనుప్రమాదంలోకి నెట్టివేయ బడుతున్న వైనం, సాంస్కృతిక సంక్షోభాన్ని జగదీశ్ చక్కగా అక్షరీకరించారు.

జగదీశ్ ఇతర పరాయీకరణ కంటే సాంస్కృతిక పరాయీకరణను తన కథల్లో ఎక్కువగా స్పృశిస్తారు 'నాపేరు సాంబరా' కథలో పండుగంటే గిరిజనగూడెంలోని అందరి గుండె చప్పుళ్ళునూ, డప్పులు వేసి అడవికి వినిపించడం, కొండమీద పండిన ప్రతిగింజ మీ చలవేనని పిల్లకర్ర పాటలుపాడడం. నీ నీడలో ఒకటై వున్నామని అడవితల్లిముందు గజ్జెకట్టి థింసా అడుగులువేయడం పండుగలో 'అడవితల్లే' దేవత. అలాంటి అడవితల్లి ఒడిలోంచి ఒక్కోబిడ్డను మతం పేరిట దూరంచేస్తారు. చెట్టుకీ పుట్టకీ అడవితల్లికీ వూరి జాకరమ్మకి మొక్కిన ఆ గూడెంలోకి చర్చి మెళ్ళో శిలువా వచ్చి వారిభాష, వేషాలను మార్చివేస్తాయి. లక్కాయి "లాజరు" అయ్యాడు. "ఇన్నాళ్ళూ చెట్టుకీ పుట్టకీ మొక్కి మీరేమిటి సాధించారు? మూర్ఖము, అనాగరికం అంటూ కొత్త ఊరిని తయారు చేస్తాడు." అతడి కొడుకుపేరు సాంబరాను రాబర్ట్ విల్సన్‌గా మారుస్తాడు. కాని సాంబరాలో ఒక నిశ్శబ్దం,

గుండెల్ని కదించే డప్పులేదు. ఆడించే కిన్నెరపాట లేదు. వెన్నెలరాల్చే పిన్నకర్ర లేదని బాధపడతాడు. కొత్తసంఘం కూడా 'లాజర్‌ని సారా తాగాడని బహిష్కరిస్తారు. తాగడం తప్పే కానీ కొండోడి బతుకులో అవిశ్రాంతంగా శ్రమించే టప్పుడు పొద్దుగుంకే వేళకి రెండు జీలుగు చుక్కలు గొంతులోపోసుకుని నృత్యం చేయడం వారి బతుకులో భాగం. తన తోటివారికి కొత్తగా చేరిన సంఘానికి దూరమై వుండలేక ఉరేసుకుని చనిపోతాడు 'లక్కోయి' (లాజరు).

డిగ్రీ పూర్తియి టీచర్ ట్రైనింగ్ ఇంటర్వ్యూకెళ్ళిన 'రాబర్ట్'ని గిరిజనుడవేనా నువ్వు? అని ప్రశ్నిస్తారు. మీ ఊర్లో పేర్లు ఇలా ఉండవే? తన జాతినుండి పేరువలన వేరుచేయబడిన వాడిని ఆవూరు మరలా అతడిని అక్కున చేర్చుకుంటుంది. చినుకు రాలడం, నేలదున్నడం, విత్తునాటడం, మొక్కమొలకెత్తడం, పువ్వులుకాయడం, కోయడం, ఇవన్నీ పండుగలనీ, పండుగ ప్రతి కదలిక లోనూ ప్రకృతితో కలిసి నడుస్తామని, అదే మన సంస్కృతి అని, టిల్లకాయ ధ్వని, థింసా అడుగులు నేను ఆదివాసి నని, నాకుమతంలేదని 'నాపేరు సాంబరా' అంటాడు. గిరిజనగూడేల్లోకి ప్రవేశించిన క్రిష్టియన్ మిషనరీలు ఆదివాసీలను వారి సంస్కృతినుంచి వారినెలా పరాయి కరణ చేస్తున్నాయో చెబుతూ స్వీయసంస్కృతిని కోల్పో యినా మరలా తన అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి 'సాంబరా' చేసిన ప్రయత్నాన్ని ఈ కథలో చక్కగా చిత్రీ కరిస్తారు జగదీష్.

'బాకుడుంబారి' అడవిల్లంట తిరుగుతుంది. దానికి మనిషిబుర్ర ఉంటుంది. కాలు చేతులు ఏమీ ఉండవు. ఒంటరిగా అడవికెళ్ళినవారిని పేరుపెట్టి పిలుస్తుంది. పలికారా సరే ఇంక ఎగిరి పీక కొరికి రక్తంతాగేస్తుంది. జోగులు, శ్రీధర్ మాస్టారికి పిల్లలకి చెప్పినకథ ఇది. చదువులేకపోయినా తమవాళ్ళని అడవిలోని జంతువుల బారినుండి రక్షించుకోవడానికి, ఒంటరిగా వెళ్ళకుండా సామూహికత విషయమై ఈకథ రూపుదిద్దుకోవచ్చు. కల్పన అవ్వచ్చు. కాని నేటి పరిస్థితి బహుళజాతి సంస్థలు, ప్రభుత్వము, రాజకీయ నాయకులు అంతాకలిసి బాకుడుంబారుల్లా మారి ఊళ్ళని ఖాళీచేయించి కొండల్ని ఉండల్నిచేసి మింగడాన్ని ఈకథలో చెప్పడం జరుగు తుంది. ప్రపంచీకరణ వలన ప్రవేటు శక్తులు కొండల్ని, నదుల్ని, అడవుల్ని, ఆక్రమించి, మనుషుల్ని అక్కడినుంచి తరిమేసే అభివృద్ధిలోని అమానవీయతను సాంస్కృతిక దురాక్రమణను జగదీష్ 'బాకుడుంబారి' కథలో వర్ణిస్తారు.

ఒక పురాతన వ్యవసాయక్షేత్రం అందరు సవరలే. సవర భాషే. ప్రకృతిని దేవతలా కొలిచే అత్యంత సహజ మైన మానవులు, ఈ భూమిపైన అణుఅణువు పవిత్ర మైనదేనని భావించే సమూహం. జన్నోడు, దీసరి, ఎజ్జోడు, కార్జిల సమన్వయంతో ముందుకెళ్ళిన ఊరు. తరతరాలుగా సాగుతూ వస్తోన్న సంప్రదాయం స్థానంలో వినాయకచవితికి చందాలెత్తడం, సంక్రాంతికి భోగి మంటల కర్రలు కాల్చడం, కొత్తగా వచ్చి చేరతాయి. ఎక్కడినుంచో వచ్చిన చౌదరి ఊరిపెద్దవుతాడు. ఊరి జాగాను ఆక్రమించుకుని 'జాకరమ్మ' బదులుగా కొత్త శిలువను నిలబెడతాడు. ఆఊరి వాళ్ళను వాళ్ళ భూములుకే పరాయివాళ్ళకు చేస్తాడు. తరతరాలుగా సంప్రదాయం పేరుతో నడుస్తున్న వ్యవస్థ కూలిపోతుంది. కిన్నెర మోత, టిల్లకాయి ధ్వనులు, తుడుం డప్పుల శబ్దాలు, థింసా అడుగులు, గోగోయి స్వరాలు, ఆట, పాట, జాతర అన్ని ధ్వంసమైపోయాయి. అందరూ మందిగా బతికే సామూహిక సాంస్కృతిక వ్యవస్థని నిలిపిన జన్నోడు, దీసరీ, ఎజ్జోడు, కార్జీలు బతుకుతెరువు లేక వలస జీవులై చెన్నైలో భవన నిర్మాణ కార్మికులుగా వెళ్ళడం, భవనంకింద శిధింలగా మారే వైనాన్ని "శిధిల సమూహం" కథలో కళ్ళకు కట్టిస్తాడు కథకుడు. పురాతన సాంస్కృతిక వ్యవస్థ విధ్వంసాన్ని జీర్ణించుకోలేని, సర్దుబాటు కాలేని కథకుని హృదయ ఆవేదన ఈ కథలో కన్పిస్తుంది.

ప్రపంచీకరణ వలన ఒకేఇంటిలోని వారు దూరమై పోతున్నారు. ఎవరికివారే అన్నట్టుగా కుటుంబంలో సభ్యుల మధ్య ఉండాల్సిన అభిమానాలు, అనురాగాలు,

మృగ్యమవుతున్నాయి. అడవికి దూరమై నగరాలుకు అభివృద్ధిపేరిట, ఉద్యోగాలపేరిట వచ్చి చేరినవారు పట్టణాల్లో సొంతఇల్లు, స్మార్ట్‌ఫోన్లు, వాహనాలు, విలాస సౌకర్యాలు అమరిన తరువాత అడవితనాన్ని కోల్పోయారు అని 'అడవితనం' కథలో చెబుతారు జగదీశ్. నేస్తరికం చేయడం, ఇతరులకు ఇచ్చిపుచ్చుకోవడాలు, ఆతిథ్యం ఇవ్వడం, ఆశ్రయం ఇవ్వడం, ఆపదలోనున్న వారిని ఆదుకోవడం. ఇవన్నీ ఆదివాసీల జీవితాల్లో భాగం. ఈ కథను అడవికి దూరమైన ఆదివాసీ స్త్రీ తనకుతానుగా చెప్పుకుంటున్నట్లు చక్కని శిల్పపరమైన నేర్పుతో కథను నడిపిస్తాడు.

గూడెంలో గుగ్గిలం పొగ, ఎజ్జోడి మంత్రం, కొత్తల సంబరం, సన్నాయి ఊదడం నాగడుని, ఊరందిరికి తల్లోనాయలు మెలిగే అతని సహాయాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది. అదే ప్రాంతంనుంచి పట్టణం వచ్చిన తనభర్త కొత్త స్నేహితులు, కొత్త సరదాలతో నగరజీవిగా సంపాదనా యంత్రంలా మారిపోయి, సుఖాలమత్తులో మునిగిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతుంది. అడవితనాన్ని కోల్పోయి మనిషితనాన్ని మరిచి, మానవత్వ స్పందనలు విడిచి నాగడు ఆపదలోనుంటే సహాయం చెయ్యడానికి నిరాకరిస్తాడు ఆమె భర్త. తోటి మనిషిపట్ల నిర్లిప్తంగా ఉండడమే అడవితనాన్ని కోల్పోవడమని తాను అడవి తనాన్ని కాపాడుకోవడానికి, నాగడికి సహాయం చేయడానికి ముందడుగు వేస్తుంది. ఈ కథలో అడవికి దూరమైన వారికి పేరుపెట్టకుండా అడవికి దూరమైనవారు పేరు కోల్పోతారని చెపుతాడు కథకుడు.

డబ్బు వాటితో కొనే వస్తువులు ఈ రెండే జీవితానికి పరమార్థంగామారి వస్తువులకోసం, మనిషి చేసే పోరాటంలో అతడు కుటుంబాన్ని కోల్పోతున్న విషయం గురించి పరాయికరణ పాలవుతున్న ప్రకృతి ఒడిలోని ఆదివాసుల గురించి వలస కూలీలు శిధిలాలకింద సమిధ అవుతున్న సాంస్కృతికపీడన గురించి, ఉత్తరాంధ్ర ఆదివాసీ ప్రజల జీవితాలతో ప్రపంచీకరణ ఎలా చెలగాట మాడుతుందో జగదీష్ తన కథల్లో చక్కగా చిత్రించారు. అభివృద్ధి వెలుగుల పేరిట, విశ్వవాణిజ్యీకరణ ప్రపంచీకరణ అంటూ ఆదివాసీల జీవనవెతలకు సాంస్కృతిక విధ్వంసానికి కారణమైన గాధలు శిధిలాలనుండి వెలికితీసే పనిలో జగదీష్ కృతకృతులయ్యారని చెప్పవచ్చు.

ఆధార పుస్తకాలు :

1) మల్లిపురం జగదీష్ గురి కథా సంకలనం.
2) ఉత్తరాంధ్ర కథలు.
3) కథా పార్వతీపురం.
4) ప్రపంచీకరణపై వచ్చిన వ్యాసాలు.

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో కృష్ణశాస్త్రి ప్రస్థానం

– గొల్లంగి చిన్నబాబు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణా జిల్లా.

అనుకోని మార్పు :

ఈ అనంత లోకంలో ఆలోచనలకు అంతే లేదు. క్షణకాలంలోనే ఆలోచనలు దేశాల హద్దులు దాటేస్తున్నాయి. ఇదో ఉరుకుల పరుగుల ప్రపంచం. భాష, భావ వినిమయానికి ఇదో నిలయం. ఆ మార్గంలోనే ఒక సాహిత్యంలోని విషయాలు మరో సాహిత్యంలోకి వచ్చి చేరుతున్నాయి. వచ్చి చేరడమే కాదు వాటి రూపు రేఖలను కూడా మార్చేస్తున్నాయి. 19 వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవమే కాదు, సాహిత్య విప్లవం కూడా మొదలైంది. బ్రిటిషు వారి పుణ్యమా అని అది మన దేశానికి కూడా పాకింది. అప్పటి వరకు కావ్యాలు, ప్రబంధాలు, జాతి, ఉపజాతి ఛందస్సులు మొదలైన వాటితో అలరారుతున్న తెలుగు సాహిత్యంలో అనుకోని మార్పులు వచ్చాయి. అవే ఆధునిక సాహిత్యానికి బాటలు వేశాయి. అందులో ప్రధానంగా, అన్నింటికంటే భిన్నంగా ఉన్నదే భావ కవిత్వం. భావ కవిత్వ అవిర్భావం, దానిపై ప్రపంచీకరణ ప్రభావం ఎలా ఉందో ఒక లుక్కేద్దాం.

లిరికల్ పోయెట్రి – భావ కవిత్వం :

ఒక వంక అపారమైన ఆదరణ, మరోవంక తీవ్రమైన విమర్శలకూ, హేళనకు గురైన ఆధునిక కవిత్వోద్యమమే భావకవిత్వోద్యమం. రాయప్రోలు సుబ్బారావుతో, అబ్బూరి రామకృష్ణారావు గార్లతో ఆరంభించిన ఈ ఉద్యమం ఇరవై ఏళ్ళే అయినా దీని ప్రభావం సుదీర్ఘం. భావ కవిత్వం (Lyrical poetry)కి తత్వదృష్టిలో మాతృక కాల్పనిక కవిత్వం (Romantic poetry). దీన్ని ఆంగ్లంలో "లిరికల్ పోయిట్రీ" అన్నారు. లైర్ (Lyre) అనే వాద్య విశేషంతో పాడే కవిత కాబట్టి దీనికి "లిరిక్ పోయిట్రీ" (Lyric poetry) అనే పేరు వచ్చింది.

భావకవిత్వం అనగానే ప్రేమ, అమలిన శృంగారం, వెన్నెల, ఇలాంటివి గుర్తొస్తాయి. ప్రబంధ నాయికల అంగాంగ వర్ణనలతో విసిగిపోయిన కవులు ప్రణయానికి, హృదయానుభూతికి జాగా ఇచ్చి రాసిన కొత్త కవిత్వం భావకవిత్వం. సాంఘిక కట్టుబాట్లతో సాంప్రదాయక వివాహాలలో విసిగిపోయిన పురుషులు స్వేచ్ఛా ప్రణయాన్ని ఊహించుకుని ప్రేయసి మీద రాసిన కవిత్వం భావ కవిత్వమని విమర్శకుల భావన. ఇంకొక అడుగు ముందుకు వెళ్తే ఒక పక్క జనం ఆకలితో చస్తూ ఉంటే జీవితంలో లేని ప్రేయసి మీద కవిత్వాలు రాస్తూ ఊహా లోకంలో విహరించే కవుల గాలి మాటలుగా మార్క్సిస్టులు భావకవిత్వాన్ని నిరాకరించారు.

భావ కవిత్వ నేపథ్యాలు :

భావం లేకుండా కవిత్వం వుంటుందా? అన్న హేళనలు వచ్చాయి. ఆంగ్ల సాహిత్య చరిత్రలో రొమాంటిక్ పొయిట్రీ, అంతకు పూర్వం వున్న క్లాసిసిజమ్ మీద ముఖ్యంగా వర్డ్స్ వర్త్ లాంటి కవులు ప్రకృతిని దర్శించి, ప్రకృతే దేశికత్వమనే బోధనతో కొత్త మార్గాలు అనుసరించారు. పట్టణ నాగరికత, కృత్రిమత్వం, మౌలిక మానవ సంబంధాల్ని విలువలనీ కలుషితం చేస్తున్నాయి. దాంతో వాటిమీద తిరుగుబాటుగా ప్రకృతి సౌందర్యం, గ్రామీణ జీవిత సౌందర్యం, కల్లా కపటంలేని అనుబంధాలను ప్రతిబింబించాలని కవులు తపించారు. ఆ ప్రయత్నాలలో భాగమే కవిత్వ వస్తువులో, వ్యక్తీకరణలో, కవిత్వ భాషలో మార్పు రావడం. భావకవిత్వం ఇంగ్లీషు రొమాంటిక్ ఉద్యమానికి తూగుతుంది. అసలు వివరించుకోవాలంటే కాల్పనిక ఉద్యమం అని చెప్పాలి.

ఇంగ్లీషులో లిరికల్ పొయిట్రీ అన్నదానికి లలిత కవిత్వం. తెలుగులో ఈ పదాలు అర్థాన్ని అందించే

భావనలో భావకవిత్వం అని స్థిరపడింది. కవిత్వానికి హృదయానుభూతి ప్రథమస్థానం. సహజత్వం పునాది. కవి అంతరంగ స్థితి, ఆవేశం, తపన మాటల్లో దూకుతూ వస్తాయి. లాక్షణిక నియమాలు, కట్టు బాట్లు, గిరిగీసిన గీతలు ఏవీ ఆటంకం కావు. అలా నిర్బంధించే నియమాలని లెక్క చెయ్యకుండా కట్టుబాట్లు ఆంక్షలు లేని స్వేచ్ఛ కావాలంటాడు భావ కవి.

1921 లో ఆరంభించి, 1925లో దేవులపల్లి పూర్తి చేసిన "కృష్ణ పక్షం" కవితా సుగంధ కుసుమం. "కృష్ణపక్షం"లో వేదన, విషాదంతో

"చెవి యొగ్గి వినుడు.! / ఏను స్వేచ్ఛా కుమారుడ నేను గగన
పథ విహార విహంగమ పతిని నేను/ మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝా ప్రభంజన స్వామి నేను!"

అంటూ తన ప్రళయ వేగాన్ని స్వేచ్ఛను వ్యక్తం చేశాడు. భావకవిత్వంలో వియోగానికీ, సౌందర్య ధ్యానానికీ విలువైన స్థానం ఉంది. ప్రేమ సామ్రాజ్యైక చక్రవర్తిగా, స్నేహశీలిగా, అభివర్ణించిన రామమూర్తి కృష్ణశాస్త్రి కవితా ప్రస్థానంలో ప్రేరణ కలిగించిన వ్యక్తిగా మనకి కనిపిస్తాడు. భావకవిత్వం అంటే పాట. కృష్ణశాస్త్రి భావకృతులన్నీ గానయోగ్యమైనవే. కవిత్వాన్ని సంగీత స్థాయికి తెచ్చినవారు కృష్ణశాస్త్రిగారు. అందుకే భావ కవిత్వంలో కృష్ణ శాస్త్రిగారిని స్మరించుకోవడం నేటి అవసరం.

కృష్ణపక్షానికి ఆ పేరు ఎలా వచ్చింది?

కృష్ణపక్షంలో నాయకా నాయికలు లేరు. వారి పేర్లనిబట్టి ఈ కావ్యానికి ఈ పేరు రాలేదు. పోనీ విషయం కృష్ణపక్షానికి చెందిందా? కాదు. అరవై ఖండకావ్యాల్లో కృష్ణపక్షమనే పేరు లేదు. కృష్ణపక్షాన్ని వర్ణించే కవితా లేదు. ఈ పేరు ఎలా పెట్టాడు? రూపక ప్రాయమై సౌమ్యమైన సాంకేతిక నామం. కవి కృష్ణశాస్త్రి కావడంవల్ల కవిత్వం విశేషభాగం కరుణ రసాత్మకం కావడంవల్ల కృష్ణపక్షం అనే పేరు పెట్టి ఉంటారు" అన్నారు. నిజానికి ఈ అన్ని కారణాలకూ అవకాశం లేకపోలేదు. ఇవి ఏవీ కృష్ణశాస్త్రి ఉద్దేశించినవి కావు. తాను ప్రారంభించిన నాటినుంచి ఇకముందు తెలుగు కవిత్వం తన పక్షమై ప్రవర్థిల్లుతుంది అన్న ఆత్మ విశ్వాసంతో ఆయనీ పేరు పెట్టారు. కవికి తన సమర్థత పట్ల అహంభావం ఉండి తీరుతుంది. కవులు నిరంకుశులు కదా(నిరంకుశాః కవయః). కళ వెనక ఉండే శక్తి సౌందర్యం. అది మానవుల ఏర్పాటుకి లొంగనిది. కళాకారుడు ఎంత సౌందర్యాన్ని తాను స్వాధీనం చేసుకున్నా, అంతకన్నా గొప్పగా సౌందర్యం అతనిని వశం అయ్యేలా చూపరులకు అనిపిస్తుంది.

కృష్ణ శాస్త్రి గారిని తలుచుకోగానే ఈ కవిత గుర్తు కొస్తుంది-

"సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు? / చంద్రికల నేల వెదజల్లు చందమామ ?
ఏల సలిలంబు పారు ? గాడ్పేల విసరు ?/ ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను ?"

ప్రేమించటాన్ని ఎంత సహజమైనదిగా వివరించారో. గాలి ఎందుకు వీస్తోందో, సూర్యుడు వెలుగెందుకు ఇస్తున్నాడో, చంద్రుడు ఠంచనుగా వెన్నెలనెందుకు ఇస్తున్నాడో, ప్రేమ ఎందుకు పుడుతుందో ఎవరూ చెప్పలేరు. కొన్ని జంటలని చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఏ రకంగా ప్రేమించుకున్నారా వాళ్ళు అని. పాడుగు పొట్టి లావు సన్నం రంగు రూపం ఎందులోనూ సారూప్యత ఉండదు. కొన్నైతే మరీ ఎక్స్ ట్రీం కేసెస్ చూస్తే ఎలా ప్రేమ కలిగింది అన్నది ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. ఫైనల్ గా నాకు అర్థం అయింది ఒక్కటే ప్రేమని ప్రేమించగలం కానీ పుట్టించలేం.

తెలుగులో కావ్యరచన కేవలం అలంకార భూయిష్టంగా, పాండిత్య ప్రకర్షగా, మేధోమథనంగా కొన సాగుతుందనే ఆలోచన 19వ శతాబ్దంలో బాగా ప్రాచుర్యం పొందింది. ఆకాలంలో వెలుబడిన ఆధునిక కవిత్వ ధోరణుల్లో భావకవిత్వానిదొక ప్రత్యేకమైన శాఖ.

తెలుగులో భావకవిత్వానికి పర్యాయ పదాలుగా నిలిచే కవుల్లో కృష్ణశాస్త్రిగారు ముఖ్యులు. ఆయన కవిత్వం ప్రధానంగా స్వేచ్ఛాకాంక్ష, సౌందర్యారాధన, ప్రేమ భావన, వియోగవేదన అనే అంశాలని ప్రతిఫలిస్తుంది. దేశం బానిసత్వంలో మగ్గుతున్న కాలంలో మనిషిలోపలి భావదాస్యాన్ని ప్రశ్నించి, సౌందర్య రాహిత్యాన్ని నిరసించి, వ్యక్తి ప్రేమ అనివార్యతను నొక్కిచెప్పి తనదైన సుస్పష్టమైన భావజాలన్ని విస్తరింపజేసిన కవి ఆయన.

భావ కవిత్వానికి ప్రతీకలు :

కృష్ణశాస్త్రి జీవితంలో సౌందర్యం పట్ల ఆయన వేదనని పరిశీలిస్తే ఇది బోధపడుతుంది. ఆయన కావ్యాలు కృష్ణపక్షం - ప్రవాసం - ఊర్వశి భావకవితకి రూపకల్పనలు. ఒక్కొక్క అనుభవం మనస్సుని కదిలిస్తే ఒక్కొక్క పద్యంగా బయటకి వచ్చి పడ్డాయి. 'నా జీవితంలో అతి తీవ్రమైన వేదన, ఆవేశమూ కలిగించే గొప్ప అనుభవాలు కొన్ని వచ్చాయి' అని కృష్ణశాస్త్రిగారు స్వయంగా చెప్పుకున్నారు.

గురజాడ అప్పారావుగారి 'ప్రేమ కలుగక బ్రతుకు చీకటి' లాంటి వాక్యాలూ, అబ్బూరి రామకృష్ణారావు, రాయప్రోలు సుబ్బారావు గార్లతో ప్రారంభమైన కాల్పనిక కవిత్వం ఆయనలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. ఒకే రకం అనుభవాలని ఆత్మపరమైన కావ్యాలలో చెప్పుకున్న కవులలో వేదుల, నాయని, బసవరాజు, నండూరి, కృష్ణశాస్త్రి ప్రసిద్ధులు. హృదయావేశమూ, భావన, భాష అన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకుని వీరి చేతుల్లో కావ్య రూపాలు ధరించాయి.

జీవించినందుకు రెండే ఫలితాలు. తీవ్రమైన ప్రేమతో జీవితం వెలగాలి, లేదా విరహంతో కాలిపోవాలి. ధనమూ, సుఖమూ, భోజనమూ- ఇవన్నీ కలిగి బ్రతకడం ఎందుకు' అంటారు చలం. అటువంటి ఆదర్శ ప్రేమ కోసం ప్రపంచంతో సంఘర్షించి, సౌందర్య ధ్యానంతో, ఆత్మని సంస్కరించుకొని, దివ్య సౌందర్యాన్ని దర్శించిన కవి కృష్ణశాస్త్రి.

ఆంగ్ల సాహిత్య ప్రభావం :

ఆంగ్ల సాహిత్యంలోనూ, సూఫీ, వంగ, వైష్ణవ సాహిత్యాలతోనూ పరిచయం ఏర్పడటంతో సరికొత్త పద్ధతిలో సౌందర్య తత్వాన్ని ఆవిష్కరించాలన్న తపన కృష్ణశాస్త్రి గారిలో కలిగింది. ఆయన కావ్యాలలో క్రమ వికాసం ఉంది. అనుభవ ఉదాత్తతలో శిల్పం ఒక దానికంటే మరొకదానిలో రాటుతేలింది.

ఫ్రెంచి కవి, పండితుడు పాల్ వేలరీ కవి లక్షణాల్ని వివరిస్తూ ఇలా అంటాడు. 'A poet, in sum, is an individual in whom the agility, subtlety, ubiquity and fecundity of this all-powerful economy are found in the highest degree' (కవికు ఉండే గుణాలు మొత్తాన్ని చూస్తే, ఈ శక్తివంతమైన వ్యక్తి చురుకుదనం, సున్నితత్వం, సర్వవ్యాపకత్వం, పాండిత్యం లేదా రగిలే గుణం అత్యధిక స్థాయిలో కనిపిస్తాయి) కృష్ణశాస్త్రి గారిలో పాల్ వేలరీ చెప్పిన లక్షణాలన్నీ ఉన్నాయి. పొదుపైన మాటలతో సూక్ష్మమైన విషయాన్ని సర్వవ్యాపక లక్షణంగా రమణీయమైన శైలిలో చెప్పటం ఒక ప్రత్యేకత. భావోద్రేకం, నిరంతర సౌందర్య తృష్ణ ఉన్నాయి.

జీవితంలో నిజమైన విషాదం ద్వేషించడం కాదు. ప్రేమించలేకపోవడమని బుచ్చిబాబు అభిప్రాయపడ్డారు. 'నా కాష్టాల రేగుమంట/ మును బ్రతుకునట్ల నాదేహ మును దహింపు / పడదులే ఆర్పగా నొక బాష్పమేని' కృష్ణశాస్త్రి ''కృష్ణపక్షము'' లోని కవికుమారుని తన బ్రతుకులాగే తన దేహాన్ని దహిస్తున్న కాష్ఠజ్వాలలలో ఎవరినీ కన్నీరు కార్చొద్దంటున్నాడు. సూఫీ తత్వంలో సత్యాన్వేషణం ఇలా ఉంది. 'Probe through the surface self and discover the transcendent self to rend the veils in Sufi language perceive the truth' (బయటకు కనబడే అంతరంగిక లేదా కవితాత్మక అందాలను సూఫీ భాష తెలుసుకుంది. అంటే సూఫీ భాష పాడడానికి అనుకూలంగా కవితాతత్వాన్ని పెంచుకుంది). ఇలా ఆంగ్ల సాహిత్యానికి సోదరిగా భావ కవిత్వం అందాన్ని పెంచుకుంటూ ఆపై ఆనందాన్ని ఇచ్చింది.

కృష్ణశాస్త్రి కలం బలం :

కవిలో సృజన అతిసున్నితంగా, తీవ్రంగా ఒక సునిశిత వాతావరణంలో పదునెక్కుతుంది. 'కొత్తయుగం కవికి కొత్త యౌవనం, స్వేచ్ఛా జీవనమంటే అభిలాష, సమాజంతో సంఘర్షణా, బాధ, అన్వేషణా, కోరికలు, అవి ఫలించకపోవడమూ, కృష్ణపక్ష రాత్రి - ప్రియతముల మృత్యువూ, ప్రవాసమూ, కొత్త లోకపుటంచుల దర్శనం, గాంధీజీ, మానవమాత్రుని సాక్షాత్కారము' ఈ సంఘటన లన్నీ ఆయనలోని కళాకారుణ్ణి స్పందింప చేశాయని కృష్ణశాస్త్రిగారే అవతారికలో చెప్పుకున్నారు.

సౌందర్య ప్రేమ, సృజనాత్మక కళ మానవ మనస్తత్వాన్ని తెలుపుతూ జీవితానికి కొత్త విలువలు ప్రతిపాదిస్తాయి. 'ఈ ప్రపంచ దుఃఖాలకీ సౌందర్యాలకీ అనుకంప(కరుణ, కనికరం) పడగల ఆత్మ ఉంటే గాని కళని కల్పించలేడు మానవుడు' అంటారు చలం. ఆ అనుకంప కృష్ణశాస్త్రి కవితకి ప్రాణం. పదాలలో లాలిత్యం, భావాలలో సౌందర్యం, కవితలో గాంభీర్యం తొణికిసలాడించి తెలుగువారిని ఉర్రూతలూగించిన భావకవి కృష్ణశాస్త్రి.

ఏ రాజ్యాలు సాధిస్తావ్,/ఏడుపు గొట్టు ముఖాన్ని,/
మోసుకుంటూ అలా,/ఎన్ని చిరునవ్వుల్ని,
వెలిగించాలో కదా,/అన్నిన్ని అశ్రుమలినాల్ని,/ శుభ్రంగా కడగాలంటే,/ఏ దూరము దగ్గర కాలేదు,
ఏ బంధము, అతకలేదు,/ఏ ఆర్తి హత్తుకోలేదు,/
అంత అవివేకాన్ని./మేఘం కురిసినట్లు,
పువ్వు విరిసినట్టు,/నెలవంకవై, నవ్వుని ఆశ్రయించు.

సంకుచితంగా వ్యవహరించే లోకం చూపిన దుర్మార్గానికి బలైపోయిన రామమూర్తితో, 'ఈ పాట బ్రతుకు నీకేపాటిదోయీ' అనడంలో పాటకంటే ఉదాత్తమైన వ్యక్తిత్వం కలవాడని కృష్ణశాస్త్రి అభిప్రాయం.

'ప్రేయసీ, ప్రేయసీ, వెడలిపోయితివేల, ఆ యగమ్య తమస్వినీ గర్భకుహరాల' అంటూ ప్రారంభమౌతుంది ప్రవాసము. "కృష్ణపక్షము"లోని 'ప్రతీక్ష' ఖండికలో వ్యక్తమైన

నాటి తుది సందే చీకటి కాటుకల వీ/ లీనమైపోవు రాజమార్గాన, నీవు/ కదిలిపోతి, విషాద సుఖమ్ము గూర్చి / సగము నిద్దురుల కమ్ము స్వప్నమటులు/
ఆపుకోలేని మమత, ఘంటాపతమ్ము/ నడుమ పరువిడి, నిలబడినాడ నట్టే,
విచ్చి కొనిపోవు వీక్షణ వితతి తోడ, / మూసుకొని పోవు శూన్య హృత్పుటము తోడ
ఆ నిగూఢ ప్రశాంత సంధ్యా దురంత/ గర్భ కుహ కాంతరమ్ముల కలచిపోవు
క్రమ భవదీయ మంజీరకటక గాన/ రవముచే తిమిరమ్ము సాంద్రతరమయ్యె
"ఆ యగమ్య తమస్సాంద్ర యవనికాంత/ రంపుటేకాంతమున బడి, యా క్రమ క్ర

మాస్తమిత నూపురారవాహ్వానములను/వెంటనంటి, నా హృదయము వెడలిపోయె" ప్రతిధ్వని ప్రవాసంలో కనిపిస్తుంది. 'ప్రవాసం' కవి వేదన విశ్వరూపాన్ని, కవి హృదయ పరిణామాన్ని స్పష్టం చేస్తుంది. 'కవి రసాత్మకుడు. తాను ఆనందిస్తూ మనల్ని ఆనందింప జేస్తాడు. కవి ఋషియట. అతని ఆత్మోన్నతి మనకి వివృత మౌతోంది (= తెరవడం, వికసించునది). భావకవి అంటే లోకానికి ఎంత ఆశో! ఆ ఆశ ఎంత న్యాయమైనదో' అని కొంపెల్ల జనార్ధనరావు అన్నారు.

కృష్ణపక్షంలో 'నేను'గా అహంభావం ప్రకటించిన కవి తనని తాను సంస్కరించుకొని, విశ్వవ్యాపితమయ్యే ప్రయత్నం ప్రవాసంలో కనిపిస్తుంది. ప్రియురాలి ఎడబాటు భరించలేక, అపుడు గొంతెత్తి యేడిస్తే, తారకలు ఆర్చుకుపోయినాయి. మొగుళ్లు (మేఘాలు) మరింత నల్లబడి నిట్టూర్పు దొంతరలయ్యాయి. చీకట్లు తలలు వాల్చుకున్నాయి. ఇలా అమూర్తమైన వాటికి ఆకారాన్ని కల్పించాడు. గాలి చలించిపోవడాన్ని కృష్ణశాస్త్రి -

"అపుడు బ్రతుకొక్కటె యేడుపైన గాలి/ రిచ్చవడి వట్టి పసిపాప లీల మౌన
యానమున బరి సుప్త పత్రాళి నొదిగి/ పొంచి చూచుచు చలియించి పోయినాడు"

ఏకాంతంలో మానవుని మానసిక స్థితిని ప్రకృతిలో సమన్వయించి ప్రవాసిని చిత్రించారు.

కృష్ణశాస్త్రిగారు కృష్ణపక్షం ఖండికలు చాలా వరకు వసంతఋతు నేపథ్యంలో రచించారు. మానవ జీవితం లోని రకరకాల అనుభవాలకి ప్రతిబింబాలు ఋతువులు. ప్రకృతిలోని పరిణామం కవి హృదయ పరిణామంలో కనిపిస్తుంది. "కృష్ణపక్షము", ప్రవాసము, ఊర్వశి క్రమ పరిణామంగా భావించి పరిశీలిస్తుంటే కవి హృదయ వికాసము బోధపడుతుంది.

కృష్ణపక్షంలో ఉన్నంత అందుబాటులో ఉండవు ప్రవాసంలో రచనలు. దానికి కారణం కృష్ణశాస్త్రిగారు నా గొప్ప రచన అనే వ్యాసంలో ఇలా అంటారు. 'అన్వేషణ ఆగిపోలేదు. ఇదివరకు ఎక్కడా చూడలేనివాడు ఇంక లోపలికి చూడటం ప్రారంభించాడు. చూపులు పగలు పైకి పరుగెత్తుతాయి. రాత్రి తలతిప్పుకొని లోపలికి వెళ్ళగించుకొని చూస్తాయి.' ఏ కళాకారుడైనా సృజనాత్మక భావనని అంతర్దృష్టితో మేళవించినప్పుడే సౌందర్యాన్ని సృష్టించగలుగుతాడు.

'ప్రేమకంటే గొప్ప అనుభవం మానవుడికి లేదు. ఇది వరకు అసమగ్రంగా ఉన్న నా ప్రకృతి నీవు నాలోకి వచ్చాక సమగ్రంగా అయింది.' అంటాడు ప్రేమికుడైన కవి' అని అంటారు కృష్ణశాస్త్రి.

మనిషి ప్రేమలోనే ఆనందాన్ని పొందగలుగుతాడు. అదే శాశ్వత సత్యం. ప్రేమ అనంతం, అద్వైతం. ప్రేమలో ఉన్న కవికి దుఃఖం సౌందర్యంగా పర్యవసిస్తుంది.

'వినరావీ విభావరీ/ వేలాశాలల నీమ్రుదు/ వసనాంచలముల గుసగుసలో
మసలు చరణ మంజీరము/ కొసరు జాలి పలుకరింతలో!
ఈ కుటీర ముఖద్వార/ మిందే వ్రేలాడి సగము/ వాడి, విరహతోరణమ్మునై
వలవంత సడలి నేలజీ/ రాడి యెన్నినాళ్లు మనుదునో!
నీ మనోజ్ఞ కాంచన కాం/ చీమణి ఘంటా గళములు/ ఏకాంతము కరగ మ్రోయగ
విన నరచే బ్రదుకు దాల్చి/ యెడద మోత కెంత యేడ్తునో'

కృష్ణశాస్త్రిగారి సహజకళా వికాసం, శిల్పం అనన్య సామాన్యమనిపించే పాట.

'ఆకసమాలోకనముగా లోకమెల్ల వీనుగ కాలాంతము నకు కాచియుందునా' శాశ్వతమైన సత్యాన్ని ఆవిష్కరించేటప్పుడు కృష్ణశాస్త్రి కవిత ఉన్నత శిఖరాలని అందుకుంటుంది.

ప్రియురాలి మృదువసనాంచలముల గుసగుసలు వినటానికి కవి చెవులని దిశాంతాల దాకా లాగి వింటాడు. దరిద్ర హేమంతంలో చైత్ర శుభోత్సవ విభాత కళ్యాణం కోసం చూస్తాడు. 'అన్వేషణలో ఎంత అలసట ఉందో అంత రుచి ఉంది' అంటారు కృష్ణశాస్త్రి.

'నా నివాసమ్ము తొలుత గంధర్వలోక/ మధుర సుషమా సుధాగాన మంజువాటి
ఏనొక వియోగ గీతిక'.

గంధర్వలోక సౌందర్యానికీ, మానవప్రేమకీ ముడిపెట్టి మానవలోకాన్ని అందంగా తీర్చి దిద్దాలనే తపన కవిలో కనిపిస్తుంది.

కవికి ఎంత ఏకాకితనం ఉందో అంత ఆర్తత, అంత ఆర్ద్రత ఉన్నాయి. అగ్నిపరీక్ష పూర్తయింది. తాను పరుచుకున్న మరణశయ్యపై తానే వాలి, తన చితిని తానే పేర్చుకొని ప్రవాసియైన కవి మరణిస్తాడు.

'ఏను మరణించుచున్నాను - ఇటు నశించు ..... నా కొరకు చెమ్మగిల నయనమ్ము లేదు'

నిండు యౌవనంలో మరణించాలన్న ఆలోచన కవికి ఎందుకు రావాలి? అని ప్రశ్నించుకొని ప్రసిద్ధ నవలా రచయిత బుచ్చిబాబు ఇలా అన్నారు. 'ఈ పద్య కావ్య సంపుటంలో 'నేను' అన్నది ఒక వ్యక్తిగా కవి కాడనే అనుకుంటున్నాను. 'ఏను మరణించుచున్నాను' అంటే 'తను' అని కాదు. తనలాంటి వాళ్లెందరోనని. ప్రత్యేకమైన అంతరంగ జగత్తులో - శరీరానికి బంధింపబడ్డ వ్యక్తి - విముక్తుడై తన వ్యక్తిత్వాన్ని బాధతో కుంగదీసి, నలిపి, ముక్కలు చేసి ఇతరుల అంతరంగ జగత్తులో వెదజల్లి, వ్యక్తిగా తను మాయమై -ఒక శక్తిగా ఇతరులలో తన్ను చూసుకొని దాగిలి మూతలాడటం లాంటిది' బుచ్చి బాబుగారు 'నాకొరకు చెమ్మగిల్ల నయనమ్ము లేదు' అన్న కృష్ణశాస్త్రిగారి వాక్యం ప్రేరణగా 'చివరకు మిగిలేది' నవల రాశానని చెప్పారు. 'ఇంతకంటే విషాదకర గీతం ఏదుంది' అన్నారు. ఈ సమస్య బుచ్చిబాబుని బాధించింది. వ్యక్తిగతమైన విముక్తి తన నవలకి ప్రేరణ అని చెప్పుకున్నారు.

ఆనందాన్వేషణలో పడ్డ కవి ప్రేమని పొందలేక, ప్రేమించలేక దుఃఖంతో శరీరాన్ని బాధించి, కాల్చి హృదయాన్ని ప్రేమతో నింపుకున్నాడు. ప్రేమే సత్యం. ఇక్కడ కవి చనిపోవడమన్నది ప్రతీక. వాస్తవమేమిటంటే వేదన నుండి విముక్తిని పొందటం. కృష్ణశాస్త్రి భావకవి. భావ కవులకి భావన ప్రాణం. మానవులని బాధించే జీవిత సత్యాలని అన్వేషించడానికి కవులు భావనకి అగ్ర తాంబూలం ఇచ్చారు. మెదడుకి అందని సత్యం హృదయానికి లభిస్తుందని వీరి విశ్వాసం. శాశ్వత సత్యమైన ప్రేమని, కవి తన శరీరాన్ని నలగ గొట్టడం ద్వారా తెలుసుకోగలిగాడు. 'కృష్ణపక్షం' చీకటిలో ప్రయాణం ప్రారంభించి, ప్రవాసంలో సంకుచితత్వాన్ని దాటి, విశ్వ వ్యాపితమైన ప్రేమని రక్షించగలిగాడు. సాధన పూర్తయింది. అదే సౌందర్యం, భావకవులు అన్వేషించే సత్యం. అది శాస్త్రానికి, తర్కానికి, వేదాంతానికి లొంగేది కాదు. అందుకే భావకవులు అంతర్దృష్టితో భావనకి పదును పెట్టుకుని సృజన సాగించారు. ఈ పరంపరలోనే కృష్ణశాస్త్రి సౌందర్య ఆరాధనలో పడ్డారు.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు! :

కృష్ణశాస్త్రి కొత్త కవిత్వ భాషని సృష్టించారనిపిస్తుంది. వస్తువుని ఎంచుకోవడంలో వినూత్న కల్పనలు చేసారు. కల్పనలు కాదు కల్పితమే అంతా. కానీ పాఠకుడు మాత్రం ఆ ఊహా జగత్తునే నిజమనుకునే విహరించాడు.

'ప్రణయకాల మహోగ్ర భయద జీమూతోరు గలఘోర గంభీర ఫెళపెళార్భటిలో మెరపేలా' అని రాసిన ఆయన సంస్కృత ధిషణత్వాన్ని చూస్తే దానిలో ప్రత్యేకత అంతగా లేదు. కానీ... 'స్వేచ్ఛాగానం'లో 'మొయిలు దోనెలలోన పయనంబొనర్చి/ మిన్నెల్ల విహరించి మెరపునై మెరసి/ పాడుచు చిన్నుకై పడిపోదునిలకు/ నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అంటారు.

మబ్బుదోనెలో ఆకాశ విహారం, మెరుపులా మెరవడం, పాడుతూ చినుకై పుడమి మీద పడటం... దీనిలో భావం, భాష అన్నీ కృష్ణశాస్త్రీయమే. కవుల్లో కృష్ణపక్ష కవి చిత్రంగా ఉంటాడు. మనిషి అయిన ఈ కవి తన జన్మను మరచి పక్షినవుతాననీ, వృక్షమవుతాననీ, మబ్బునీ, చందమామని ఇలా అవీ ఇవీ అవుతానంటాడే విచిత్రకవిలా ఉన్నాడే అని మనం అనుకునేలోపునే ఆయనంతట ఆయనే... 'వింతగా దోచు నాదు జీవితము నాకె' అంటారు. జిలుగు వెన్నెలతో చిమ్మచీకట్లలో మోహన సంగీతాన్ని వింటానంటారు. హృదయాన్ని కోసే దారుణమైన ఏడుపు నవ్వడుల్ని వింటానంటాడు. ఇక 'మహాకవి'లో... 'గుత్తునాయని జాతిముత్యాల్/ గుచ్చినాడే మేలిసరముల/ ఇత్తునాయని తెలుగుతల్లికి/ ఇచ్చినాడే భక్తితో' అంటూ ముత్యాలసరాల ఛందస్సుకు ప్రాభవం కల్పించిన గురజాడను స్మరించుకున్నారు. 'జాతిముత్యాల్, మేలి సరముల' అని ప్రయోగౌచిత్యం పఠితను ఆకట్టుకుంటుంది.

కృష్ణశాస్త్రి కలంతో భావ కవిత్వానికి కొత్త సొగసులు:

ఎవరేమన్నా భావకవిత్వమనే దానికి రూపమిచ్చి పెంపొందించినవాడు దేవులపల్లి కృష్ణ శాస్త్రి. అచ్చంగా

భావ కవిత్వమే రాస్తాడు. అదే అతని వైశిష్ట్యం. భావ కవిత్వమనేది అర్థమయ్యే విషయం కాదు. హృదయానికి అవగతమైయ్యే విషయం. నీ హృదయంలో ఏదో తారాడు తోంది. అది బాధగా ఉంటుంది. ఆ బాధలో ఒక సుఖం ఉంటుంది. అది జీవున్ని కదిలిస్తుంది. అదే భావ కవిత్వమంటే. కళలన్నింటిలోకి ఒక దృష్టితో చూస్తే సంగీతం గొప్పది. అందుకోని ఎత్తులూ, లోతులూ లేవు. మాటకు లొంగని ఆవేశాలనూ, అనుభవాలనూ సంగీతం అందుకుంటుంది. అందిస్తుంది. అందుకనే ఋషుల ఛందములను గానం చేశారు భక్తులు. పాటల రెక్కల మీద పరమపదం అందుకున్నారు.

సుదూరమైనవీ, సూక్ష్మమైనవీ అయిన ఒక మహా కవి ఆత్మానుభూతులు వ్యక్త పరచడానికి శబ్దాలు సామాన్య రీతిలో ఉపయోగిస్తే చాలదు. వాటిని అవసరాన్ని బట్టి ఏరి, చేరదీసి, ఒకమూసలో పోసి అక్కడ ఆ గానానికి ఉండే శక్తిని పొందించాలి. కవికి పర్యాయపదాలు లేవు. ప్రతిదానికీ ప్రత్యేకమైన రంగూ, రుచీ ఉన్నాయి. ఛందస్సులూ, గణాలు ఒప్పుకున్నా కవికి ఏదో 'ఒక్కటే' తప్పకుండా ప్రయోగించి తీరవలసిన శబ్దం 'ఒకే ఒకటి ఉంటుంది'. ఆ విధమైన కూర్పే లిరిక్ - గేయం - గీతి.

భావకవిత్వం తన గొంతు సవరించుకుంది. తెలుగు కవిత్వం తన ఉనికిని విస్తరించుకుంది. భావకవిత్వాన్ని ఓ ఉద్యమంలా ముందుకు నడిపినా, కృష్ణపక్షానంతరం, ప్రవాసనం చేసినా, తన కలల ఊర్వశిని తానే సృష్టించు కున్నా అతనికే చెల్లింది. ఎప్పటికీ మూగబోని కలం. పొద్దుపొడిచిన భావకవిత్వపు తొలికిరణం కృష్ణశాస్త్రి. దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి. దేవులపల్లి అచ్చమైన భావ కవి. వీరి భావుకత కేవలం భావుకతే కాదు. తాత్విక రాగాల సమ్మేళనం కూడా. భావ కవిత్వాన్ని ఒక స్థాయికి తెచ్చి దాని తత్వాన్ని లక్ష్య లక్షణ సమన్వితంగా ఊరూరు తిరిగి ప్రచారం చేసిన వారు దేవులపల్లి. కృష్ణ శాస్త్రిగారి రచనలతో అంతకన్నా ఎక్కువగా అయన కావ్య పఠ నాలతో ఆధునిక కవిత్వానికి నత్తువ చేకూరింది అనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. అంతర్జాలం
2. ఆంధ్ర భారతి - అంతర్జాల నిఘంటువు
3. కృష్ణపక్షం - కృష్ణశాస్త్రి - విశాలాంధ్ర పబ్లికేషన్స్
4. కృష్ణ శాస్త్రి సాహిత్యం - విశాలాంధ్ర పబ్లికేషన్స్
5. Lyrical Ballads - William Wordsworth
6. Globalisation and Literature – Suman Gupta

❖ ❖ ❖

వర్తమాన వచన కవిత్వం - ప్రపంచీకరణ

- పల్లెమోని జయమ్మ, టి.జి.టి., తెలుగు ఉపాధ్యాయులు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు), జడ్చర్ల గ్రామం & మండలం, మహబూబ్‌నగర్, తెలంగాణ.

ప్రపంచీకరణ పరిచయం :

ఆంగ్లంలో 'గ్లోబలైజేషన్' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'ప్రపంచీకరణ' అనే పదాన్ని వాడుతున్నాం. ప్రపంచీకరణకు విశ్వీకరణ అనే పేరు కూడా ఉంది. దేశాలు తమ మధ్య వాణిజ్యానికి, పెట్టుబడుల ప్రవాహాలకు అవరోధాలను తొలగించుకోవడంతో బడా బహుళ జాతి సంస్థలకు, కార్పోరేషన్‌లకు, ఫండ్ మేనేజర్లకు ప్రపంచ మార్కెట్లలో చొచ్చుకుపోవడానికి గల రాజమార్గమే ప్రపంచీకరణ. ప్రపంచీకరణ అనేది ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నిటంలోను సరిహద్దు అంతర సంబంధాలు తీవ్రం కావడం. మరొక రకంగా చెప్పాలంటే జాతీయ సరిహద్దులతో, దూరంతో నిమిత్తం లేకుండా క్లిష్టమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రక్రియలు చోటుచేసుకునే ప్రపంచం అని అర్థం. ప్రపంచంలో ఎక్కడ సంభవించిన ఏ పరిణామమయినా ఇతర చోట్ల తీవ్ర ప్రభావాన్ని కలుగచేయడం అని కూడా చెప్పుకోవచ్చు.

ప్రపంచీకరణ అన్ని రంగాలపై ప్రభావం చూపింది. ప్రపంచీకరణ ప్రభావితం చేయని రంగంలేదు. తెలుగు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది. సాహిత్యం సమాజాన్ని అధ్యయనం చేస్తుంది. ప్రపంచీకరణ పరిణామాలపై అన్ని దేశాల్లో సాహితీకారులు ప్రతిస్పందించారు. భారతదేశంలో కూడా ఎంతోమంది సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహితీ ప్రముఖులు ప్రపంచీకరణపై ప్రతిస్పందించారు. తెలుగులో కూడా ప్రపంచీకరణ సాహిత్యం విస్తృతంగా వస్తుంది.

ప్రపంచీకరణ ప్రధానంగా ఆర్థికరంగంలో ఒక పెద్ద కుదుపు. సాహిత్యరంగం దీనికి ఒక మినహాయింపేమీ కాదు. సమాజమే సాహిత్యం అని భావిస్తున్నప్పుడు సమాజంలో వచ్చే ప్రతి కదలిక సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది.

సాహిత్యంలో ఎన్ని వాదాలు వచ్చినా ఎన్ని ధోరణులు పుట్టినా వాటన్నింటి వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆర్థిక సూత్రం నిబిడీకృతమై ఉంటుంది. ఎవ్వరూ దానిని కాదనలేం. ముఖ్యంగా దళిత కవిత్వంలోనూ, మైనారిటీ వాద కవిత్వంలోనూ ఈ ఆర్థిక కోనం దాగివుంది. అదే కొత్త వస్తువుగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే "అయితే కులం లేదా అర్థిస్థాయి" - ఇవే మన ఉనికిని, అస్తిత్వాన్ని నిర్ణయించే ప్రాతిపదికలుగా మారాయి. ఇది ప్రపంచీకరణలోని ఒక ప్రతి ఫలనం.

వైఫల్యమో... సాఫల్యమో
అంతర్ముఖమో... బహిర్ముఖమో... బహుముఖమో
విముఖమో
వివర్ణమైన వరదగుడి మీ
అలసిన పిట్ట వాలుతున్న దో....
జీవన ధూళి బరువిక మోయలేక
జల్లెడైన ఆకులతో ఈ చెట్టు కూలుతున్నదో...

- అని ధ్వని పూరితంగా "దేవిప్రియ" "డిజిటల్ పెయిన్"లో అన్న మాటలు ప్రపంచీకరణలోని విధ్వంసాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ప్రపంచీకరణలోని లక్షణాలకు ఈ కవిత చక్కగా ఒదుగుతోంది. ప్రపంచీకరణ లక్షణాలకు ఈ కవిత చక్కగా ఒదుగుతోంది. ప్రపంచీకరణ లక్షణాలు దైనందిన జీవితంలో ఒక భాగమయ్యాయి. దీనివల్ల మన సామాజిక, మానసిక జీవనం అంతు పట్టని మార్పుకు గురయ్యింది. చివరకు ప్రపంచీకరణ ప్రభావం నగరాలనే కాదు, గ్రామాలకు కూడా ప్రాకింది.

ఆర్థిక ఒత్తిళ్ళు పెరగడం, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమవ్వడం, విడాకుల కేసులు పెరగడం, స్త్రీ, పురుష సంబంధాల్లో లాభదాయికత ప్రవేశించడం; వర్తక వాణిజ్యాలు, కళా సాహిత్యాలు, రాజకీయాలు, విద్య, వైద్యం... అన్నిటిలోనూ నైతికత క్షీణించడం - దేశాధినేతలు, క్రీడాకారులు, కళాకారులు, వాణిజ్యవేత్తలు, మతాధిపతులు నేర విచారణ ఎదుర్కోవడం.... ఇవాళ సర్వసాధారణమైంది. ఉగ్రవాదం, నేరాలు పెరగడం, మతంలో మూఢనమ్మకాలు ఎగబడటం... ఇవన్నీ ప్రపంచీకరణలో అంతర్గతంగా ఉన్న లక్షణాలు.

ఒక వాక్యంలో చెప్పాలంటే "అనేకతలకి ముంగిలి - ప్రజాస్వామ్య ఆలోచనల సమాధికి వాకిలి "ప్రపంచీకరణ". ప్రపంచీకరణ ప్రభావం సృజనాత్మక సాహిత్యంపై బలమైన ప్రభావం చూపింది. జ్ఞానం, ఆచరణల మధ్య పొంతన లేకుండా చేసింది. ద్వంద్వ ప్రవృత్తుల్ని పేరేపించింది. విరామం, విశ్రాంతి లేకుండా చేసి మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దీనిని "మంచికంటి" చాలా జాగ్రత్తగా పసి గట్టాడు. అందువల్లే -

రచ్చబండ చర్చల్లేవు
రాత్రి ఊరేగింపుల్లేవు
ఇళ్ళు నిండా నిండిన మనుషులకు మాటల్లేవు
జాలిగొలిపే జీవితాలకు ఆదరణల్లేవు
ఊరి నిండాపచ్చని అలంకరణల్లేవు
ఊపిరి పీల్చేందుకు తగినంత సమయంలేదు
.....
బ్రతకడమంటే పక్కా నటనగా మారిపోయింది

- అని అనగల్లినారు "ఇనుపగజ్జల మాయావి" కవితలో.

1990-92 నాటికి "ప్రపంచ బ్యాంకు" లాంటి ఒకటి అరా కవితలు తప్ప పెద్దగా కవిత్వం వచ్చిన దాఖలా కన్పించదు. వచ్చినా వాటిని పట్టించుకున్న వారూ తక్కువే. మన దేశంలో ప్రపంచీకరణ 2000 సంవత్సరం నుండి వేగం పుంజుకుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ కళారంగాలన్నింట గొప్ప మలుపు తెచ్చిన సంవత్సరమిది. "డబ్బాపిట్ట". "ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" లాంటి కవిత్వ సంపుటాలు వెలువడిన దశ.

సామాజిక మానసిక జీవన రంగాలన్నింటా వ్యాపించడమే కాకుండా కార్పోరేట్ విద్యా వ్యవస్థలోనూ, రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ, రైతుల్ని ఆత్మహత్యలు చేయించడంలోనూ... ఒక్కటేమిటి దేన్నీ వదలిపెట్టకుండా మెల్లమెల్లగా అన్నిటిని కబళించసాగింది. తర్వాతర్వాత సామాన్య ప్రజలతోపాటు కవుల, కళాకారుల జీవితాల్లోకి చొరబడింది. తత్ఫలితంగా భాష మారింది. భావం మారింది. తెలుగు, ఇంగ్లీషు కలగలసి దినసరి జీవితంలో పెనవేసుకుపోయింది. సరళీకృత ఆర్థిక విధానాలు, "ఆర్థిక సంస్కరణలు".

సాగారం కాని స్వర్ణ గ్రామాలు
మంత్రాల మర్రిలో
ఐ ఆర్ ఆర్ డి రాక్షసుడు
నీకళ్ళలో ఉరివేసుకున్న కరెంట్ తీగ
కన్నీటి మట్టం పెంచిన జలయజ్ఞము

ఈ పదాలకు అర్థాన్నీ నీ "బాబు" "నడుగు" అనే స్థాయి దాకా "వంశీకృష్ణ" "ఆంధ్రప్రదేశ్.. ఒక అనువాద కవిత" (మీనింగ్స్ కవితా సంకలనం)లో వెళ్ళాడు.

ప్రపంచీకరణలోని స్వభావాన్ని ఆధునిక తెలుగు కవి గమనించాడు. వాటిని పట్టుకోగల్గినాడు ప్రపంచీకరణ వేర్లు చివరికి పడకగది దాకా వెళ్ళాయని గుర్తించాక - "పాటిబండ్ల రజని" "ఒంటిపొద్దు ఆకాశం"లో

"కోటానుకోట్లుగా అమ్ముడవుతున్న
వయాగ్రాల ఎక్క చెప్పకుండా -
ఈ రెంటిదే అగ్రస్థానమంటే -
అస్సలస్సలు నమ్మలేకున్నాను
.....
నీ సిగ్గు లేని తనాన్ని నేనిప్పుడు

సిలికాన్ ఇంప్లాంట్‌గా కుట్టుకోలేను
మనసులేని తనాన్ని మానిన గాయంపై
మర్మస్థానంలా అతికించుకోలేను"

- అని నిక్కచ్చిగా తేల్చి పడేసింది.

నగరీకరణకు, పాపులర్ సంస్కృతి విజృంభణకు, అత్యాధునిక వాదాలకు ప్రపంచీకరణ ప్రతిధ్వనులే కారణం. దీని ప్రభావంతో శ్రామికవర్గం బలహీనపడింది. మరోవైపు సామాజిక సంబంధాలలో విలువల్ని క్షీణింప చేస్తూ నియంతృత్వంగా మారి మానవత్వానికి ప్రమాదకర సూచి ఎగరవేసింది. జీవితాన్ని ప్రమాదంలో పడేస్తూ నూతన భావాల, వినూత్న వ్యక్తీకరణలను అణగద్రొక్కే దిశగా సమాజాన్ని తీసుకెళ్ళింది. సాహిత్యానికి, కళలకు విలువలేకుండా ఫక్తు వ్యాపార ధోరణిగా మార్చిపడేసింది. మేధస్సుకు అవినీతి చెదలు పట్టించింది.

వాణిజ్యం, కులం, మూఢనమ్మకాలు, మతం, భక్తి, జెండర్, భిన్న అస్తిత్వాల పరస్పర సంఘర్షణ, ఆధిపత్యాల కోసం ప్రాకులాడ్డం అంతర్గత వైరుధ్యాలు పెరగడం, ప్రతిధీ వ్యాపార ధోరణి కావడం, మేధావుల మౌనం, సంకోచ వ్యాకోచాలకు గురి అయి కొన్ని పదాలు అర్థాల్ని కోల్పోవడం... ఇదంతా ప్రపంచీకరణ తత్ఫలమే.

భాష, భావనల వ్యక్తీకరణ వారధుల్ని కట్టాల్సిన చోట గోడలు కట్టడం, ఇది కేవలం ఒక్క సాహిత్యరంగంలోనే కాదు, వివిధ సామాజిక, సాంస్కృతిక రంగాల్లో, రాజకీయ క్షేత్రాల్లో, సైద్ధాంతిక భూమికలోనూ మార్పులు వచ్చాయి.

ఇందులో ప్రలోభాలు ఉన్నాయి. బుజ్జగింపులూ కన్పిస్తాయి. హింసాత్మకంగా మారిన వైనం కూడా ఉంది. మతం నిత్యజీవితంలో ఎక్కువగా చోటు సంపాదించుకుంది. దీనికి అగ్రరాజ్యాల అండదండలూ ఉన్నాయి. పర్యవసానంగా రచయితలు, కళాకారులు చెల్లాచెదరవ్వడం కన్పిస్తుంది. సుఖాల మత్తులో కొందరు మునిగిపోవడాన్ని చూస్తాం. నిబద్ధత నిజాయితీ వంటి పదాలు కాలం చెల్లి అపహాస్యానికి గురవుతున్న దశ కన్పిస్తుంది. నమ్మిన విలువలు నీళ్లపాలయిన దాఖలాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రపంచీకరణ వల్ల మోహరించిన లక్షణాలు. ఒక్కమాటలో చెప్పాలంటే మనం చెప్పే దానికి, చేసే దానికి మధ్య విస్తృమైన తేడా కన్పిస్తుంది. ఆ మధ్యగల తేడాయే ప్రపంచీకరణ ప్రభావం. ఈ మార్పు ఎక్కడ్నుంచి మొదలైందో నిశితంగా గమనించడం చాలా అవసరం.

సమాజంలో వస్తున్న వేగం గురించి మాట్లాడుతున్నాంగాని, వేగాన్ని నిశితంగా చూడలేకపోతున్నాం. 2000 తర్వాత దాని విశ్వరూపం అనేక రూపాల్లో చూడగల్గినాం.

డాలర్ కళ్ళద్దాలకది
జానా బెత్తుడు బోర్డే కావచ్చు
నా కంటి కది జ్ఞాన నేత్రం
.....
వలసపోవటమే జీవితమైనప్పుడు
దుఃఖం అక్షరాలై ప్రశ్నల్ని సంధించటం
చూస్తున్నాను
ఏ భాషాశాస్త్రానికి లొంగని ఆగ్రహం
.....
బోర్డంటే పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ల
స్వప్న సౌధం కాదు. ముంపు"

ధీర్ఘ కవితలో "పి. విద్యాసాగర్" ప్రతిదానికి పవర్ పాయింట్ ద్వారా ఉత్పత్తి గణాంకాల ఆవిష్కరణలకు తెరతీశారేగాని చొచ్చుకొచ్చిన సంక్షోభాన్ని గుర్తించి కల్లోలాన్ని రూపుమాపిన దాఖలా ఏది? - అని ప్రశ్నించారు.

"అమ్మా? అమెరికా డాలరా?" అనే కవితలో "మౌనశ్రీ మల్లిక్" -

మీ అమ్మ వ్రాయునది
నీ పెళ్ళి శుభలేక అందింది
నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేను
నువ్వు అమెరికాలో ఉంటే రాలే ననుకున్నావా?
సప్త సముద్రాలనైనా ఈదుతూవచ్చేదాన్నే
నీ శుభలేఖ ఆలస్యంగా చేరింది కన్నా...!

నీ పెళ్ళి ఫోటోలు బాగున్నాయి.
ఖరీదైన దుస్తుల్లో దొరబాబులా వున్నావు
నా కోడలు మహారాణిలా ఉంది
ఊరి జనమంతా
అదృష్టమంటే నాదేనంటున్నారు
నేను ఆరు సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నాను
నేనెంతటి అదృష్టవంతురాలినో...?
నీ శుభలేఖ చెప్పింది..
.....
తొమ్మిది నెలలు మోయాల్సిన నిన్ను
ఏడు నెలలకే కన్నాను
నెలలు నిండని నువ్వు బతకవని చెబితే
ఎందరు దేవుళ్ళకు మొక్కానో...
అర్ధరాత్రి నువ్వు గుక్క పెట్టి ఏడుస్తుంటే
దిక్కుతోచక నీతోపాటు నేను
నాతోపాటు మీనాన్న ఏడ్చేవాళ్ళం
.....
ఇప్పుడెలా ఉన్నావేనని దిగులుగా ఉంది
..... జాగ్రత్త కన్నా....

- బయటకు విన్పించని ఏడ్పు, కంటి కొలకులు దాటని కన్నీరు, పంటి కింద నలిగిపోతున్న మౌనం - తల్లి హృదయానికి మాత్రమే తెలుసు అదే "అమ్మా? అమెరికా డాలరా?" కవిత.

ఆధార గ్రంథాలు :

1. డిజిటల్ పెయిన్ కవిత - దేవిప్రియ.
2. ముంపు దీర్ఘకవిత - పి. విద్యాసాగర్.
3. అమ్మా? అమెరికా డాలరా? - మౌనశ్రీ మల్లిక్.
4. 'గ్లోబల్ ఖడ్గం' ప్రపంచీకరణ ప్రభావం - వై. జాన్‌బాబు.

❖ ❖ ❖

మానవ సంబంధాలపై ప్రపంచీకరణ ప్రభావం

(కొంతమంది రచయిత్రులు తమ కథా సాహిత్య సృజనలో చూపిన ప్రపంచీకరణ ప్రభావం)

– డా॥. గుంటుపల్లి గౌరి, లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల, (స్వయంప్రతిపత్తి), గుంటూరు.

ప్రపంచంలో ఉన్న దేశాలు వేగంగా అనుసంధాన మయ్యే ప్రక్రియను "ప్రపంచీకరణ" అంటారు. అంటే ప్రపంచ దేశాలమధ్య ఉన్న అవరోధాలు తొలగి స్వేచ్ఛా వాణిజ్యం అంతటా వ్యాపిస్తుంది. ప్రపంచీకరణను ఆర్థిక విషయంగానే భావించినప్పటికీ ఇది రాజకీయాలకు, చరిత్రకు, సంస్కృతికి, పర్యావరణానికి, సమాజానికి ఇలా అనేక ఆర్థికేతర అంశాలను కూడా ఆక్రమిస్తుంది.

ఆధునిక సాహిత్యంలో గత దశాబ్దంగా ఉద్యమాల ఉధృతి తగ్గుతున్న సమయంలో ఈ ప్రపంచీకరణ ప్రభావం అన్ని ప్రక్రియలమీద స్పష్టంగాఉంది. దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలకమైన అనేక రంగాలలో సంపన్న వర్గాల పట్టు పెరిగింది. గ్రామజీవితం నగరజీవితంగా రూపాంతరం చెందే క్రమంలో సాంప్రదాయ, సాంస్కృతిక రూపాలు స్వీయపరిమితులను సాపేక్షంగా కోల్పోతూ ఈ సాంస్కృతిక రూపాలను సరుకులుగా, లాభాపేక్ష కోసం అమ్మే ఉత్పత్తులుగా మార్చివేసే మార్కెట్ శక్తుల ప్రభావానికి లోనయ్యాయి. సాహితీ ఉద్యమాలు, సిద్ధాంతాలు, అస్తిత్వపు వేదనలు, మానవ హక్కులు, మానవ సంబంధాలు మొదలగువాటిపై ప్రపంచీకరణ ప్రభావం ఊహించని విధంగా పెరిగింది. వస్తు సంస్కృతి పెరిగి, మార్కెట్ దోపిడీ మాయాజాలంలో మధ్యతరగతి ప్రజలు దుర్భర పరిస్థితుల అగాధాల్లోకి నెట్టబడుతున్నారు. ఒకప్పుడు సిద్ధాంతాలు వల్లెవేసినవాళ్ళు, విప్లవ ఉద్యమాలు నడిపినవాళ్ళు, అజ్ఞాతంలో గడిపినవాళ్ళు, రహస్య ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషించినవాళ్ళు నేడు పదవులకు, డబ్బుకు, వస్తు సంస్కృతికి బానిసలై పోతున్నారు. ప్రపంచీకరణ కారణంగా మానవ సంబంధాలు అంటే ప్రేమ, ఆప్యాయత, అభిమానం అనేవి కరువైపోతున్నాయి. ముఖ్యంగా బంధువులమధ్య, భార్యాభర్తలమధ్య సంబంధాలు విచ్ఛిన్నమవడం గమనించవచ్చు.

1990 దశకం తరువాత అన్ని సాహిత్య ధోరణులను తీవ్రంగా కలవరపెట్టిన అంశం ప్రపంచీకరణ. దీని ఫలితంగా మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్నాయి. ప్రపంచీకరణ ఫలితంగా ఏర్పడిన వ్యాపారశైలి కుటుంబ సంబంధాల్లోని సహజమైన ప్రేమలను చిన్నాభిన్నం చేసింది. దీనితోపాటు మహిళల జీవితాలపై ప్రపంచీకరణ మరింతగా ప్రభావం చూపుతున్నదన్న విషయం మహిళలు వ్రాసిన తెలుగు కథాసాహిత్యంలో స్పష్టమయింది. కొంతమంది రచయిత్రులు కథలను, కవిత్వాన్ని వ్రాసారు. కొండేపూడి నిర్మల వంటివారు 'మల్టీనేషన్ ముద్దు' పేరుతో కవిత్వాలను వ్రాస్తే, గీతాంజలి, కుప్పిలి పద్మ, పి. సత్యవతి, ఓల్గా, నల్లూరి రుక్మిణి వంటివారు తమ కథాసృజనలతో ప్రపంచీకరణ ప్రభావంతో మానవ సంబంధాల మధ్య నలుగుతున్న మహిళా జీవితాలకు అద్దంపడుతూ రచనలు చేసారు. దీనిలో భాగంగానే పితృస్వామ్యపు జాడ్యాన్ని వదిలించుకుంటూ మహిళల తమ ప్రగతిని పదిలపరుచుకోవాల్సిన అవసరం ఉందనే ఆలోచనను, వివేచనను కథాసాహిత్యంద్వారా తెలియ చేశారు.

ప్రైవేటు పరిశ్రమలకు దేశం తలుపులు బార్లా తెరిచిన తర్వాత విచ్ఛిన్నమయిన గ్రామం కథ "కథ 2020". అంతేకాదు పట్టణ జీవితంలో చదువుకున్నవారు కెరీరిజానికి వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టుకున్న తీరును కూడా గీతాంజలి అలియాస్ భారతి ఈ కథలో చెప్పారు. "కథ 2020"లో జర్నలిస్టు అయిన నరేంద్ర ప్రపంచీకరణ

ప్రభావాన్ని వ్రాయాలనే క్రమంలో తనకు తెలిసిన ఒక గ్రామానికి వెళతాడు. ప్రైవేటీకరణంలో భాగంగా బహుళ జాతి సంస్థలు ఫ్యాక్టరీలు పెట్టేసరికి ఆ పల్లెలో పట్టణీకరణ చోటుచేసుకుంటుంది. దీని ప్రభావంతో గ్రామాలలోని వృత్తి పనులన్నీ మూలనపడతాయి. విదేశీ కంపెనీలు, షాపింగ్ క్లాంపెక్సులు, బ్యూటీపార్లర్‌లు ఏర్పడతాయి. కల్తీ విత్తనాలు, కల్తీ మందులవల్ల ఆ ఊళ్ళో వేసిన పత్తిపంట పండక బ్యాంకు ఋణాలు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న రైతులు అతని గ్రహింపుకు వచ్చారు. రెడీమేడ్ దుస్తులు వాడకం వల్ల మూలనబడిన టైలరింగ్ వృత్తి, తమ వృత్తులను ప్రవృత్తులుగా మార్చుకుంటూ పాడే జానపద కళాకారులు కనుమరుగయ్యారని అర్థం అవుతుంది. పొలాలున్న చోట 'అగ్రిటెక్' కంపెనీలు పుట్టుకు రావడం వంటివి ఆ పల్లెలో వచ్చిన మార్పులు. పంటకు అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టినా పోటీ మార్కెట్లలో ధరలు పడిపోయి గిట్టుబాటు లభించక అప్పులు తీర్చలేకపోయే సరికి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో భూములు కోల్పోయి పిచ్చి చూపులు చూస్తున్న రామన్న ఆ ఊరిలో కనబడతాడు. యాదగిరి పండ్లతోటలు మాయమై వాటి స్థానంలో హైటెక్కువాదుల విదేశీ వస్తువులతో ఆ గ్రామ రూపురేఖలే మారిపోయాయని భావిస్తాడు. పట్టణీకరణ ప్రభావం గ్రామాల్లోని ప్రజల జీవితాలపై ఎక్కువగా ఉండి శ్రమ జీవులు, వృత్తి పనులు చేసుకునేవారు మరింతగా పేదరికపు బారిన పడటం కనపడుతుంది. వీళ్ళ దాహం తీర్చగల చల్లటి చెరువునీళ్లు కూడా ప్రైవేటీకరణలో భాగంగా పరాయీకరణ చెందినట్టుగా జర్నలిస్టు నరేంద్రకు అర్థమవుతుంది. చెరువును లీజుకు తీసుకున్న బహుళజాతి సంస్థ నయాగరా మినరల్ వాటర్ కంపెనీ, కోకాకోలా కంపెనీలు రావడంతో దాహార్తికై ఆ చెరువు నీటితో తయారుచేసిన రంగునీళ్ళకు డబ్బులు వెచ్చించి దాహం తీర్చుకోవాల్సిన స్థితి వచ్చిందని గ్రహిస్తాడు. పండ్లతోట పెంపకానికై బ్యాంకు ఋణాల వత్తిడివల్ల భర్త ఆత్మహత్య చేసుకుంటే అతని భార్య ఆండాళ్ళు పిల్లలతో సహా అదే ఊళ్ళో ఫ్రూట్ జామ్ ఫ్యాక్టరీముందు అడుక్కోవటంలోని దీనత్వాన్ని గుర్తిస్తాడు నరేంద్ర. ఇవన్నీ చూసిన నరేంద్ర వాటి గురించి పేపరులో వ్రాయలనుకుంటాడు. కాని పేపరు యాజమాన్యం మాత్రం మెకన్సీఅగ్రిటెక్, కార్పోరేట్ ఐ.టి.ఐ సాధించిన 'అభివృద్ధి'ని గురించి వ్రాయమంటుంది. కాని లొంగుబాటుతత్వంలేని నరేంద్ర అలా వ్రాయనందుకు పత్రికాఫీసులోని అతని ఉద్యోగం ఊడిపోతుంది. అతని భార్య మాధవికి అంతకుముందే వెనుకపడ్డ పరిశ్రమగా వాచీ కంపెనీ మూతపడేసరికి ఉద్యోగం పోతుంది. అప్పటినుండి తాత్కాలిక ఉద్యోగాలు చేసుకుంటూ వస్తుంది. ఆమె కాంట్రాక్టు కూడా అయిపోతున్న సమయంలో ఇద్దరికి ఉద్యోగంలేని స్థితిని తలచుకుంటూ... భార్యాభర్తలిద్దరూ మాట్లాడుకోవాల్సివస్తే ఆర్థిక ఇబ్బందుల గురించి, అవసరాల గురించి మాట్లాడుకోవాల్సి వస్తుందనీ ఇద్దరూ మాట్లాడుకోవడం మానేస్తారు. ప్రపంచీకరణంలో భాగంగా ప్రపంచబ్యాంకు ఆదేశించిన ఆర్థిక పునర్నిర్మాణంలో భాగంగా వెనుకపడ్డ పరిశ్రమలను మూసివేయడం తప్పనిసరి ఆదేశం కాబట్టి దాని ఫలితంగా కథలో మాధవికి మరియు మాధవి స్నేహితులకు ఉద్యోగం పోవడం జరుగుతుంది. అర్థాంతరంగా ఉద్యోగాలు పోయేసరికి మాధవి స్నేహితులు నలుగురు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. ఉద్యోగం పోయినందుకు మాధవికూడా పిచ్చిదవుతుంది. ఆ వత్తిడి ఫలితంగా ఆమె అనారోగ్యానికి గురిఅవుతుంది. పెరిగిన ధరలవల్ల, పెరుగుతున్న ఆపరేషన్ ఖర్చులకు, తట్టుకోలేని పరిస్థితి మాధవిది. దీనిద్వారా ఆ ఇంటికి బతుకుతెరువు కరువవుతుంది. ప్రపంచీకరణ ఫలితంగా ఏర్పడిన వ్యాపార సంస్కృతి కుటుంబ సంబంధాలలోని సహజమైన ప్రేమ సంబంధాలను కూడ విచ్ఛిన్నం చేస్తోందని రచయిత్రి తెలియచేసింది.

పి. సత్యవతి 'ఇరుకు' కథలో ప్రపంచీకరణతో ఏర్పడిన వస్తుసంస్కృతి, వ్యామోహాలు భార్యా భర్తలమధ్య ఉండాల్సిన ప్రేమబంధాన్ని శత్రుబంధంగా మార్చడమే కాక మనసులో అమానవీయ భావాలను పెంచుతున్నాయన్న రచయిత్రి బాధ విశదమవుతుంది. ఇల్లంతా

వస్తువులతో నింపేయటం కోసం భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ బిజిగా ఉండటం, ఇంటికి వచ్చిన తల్లిదండ్రులను కూడ పట్టించుకునే తీరికలేనితనంలో ఇందిర వచ్చిన తన తల్లిని ఆ వస్తువుల మీదనున్న దుమ్ముధూళిని తుడవమని పురమాయించడం చేస్తుంది. "ఆత్మ లింగాల్లా ఇల్లంతా పాకిన వస్తుసంస్కృతి" ఆ తల్లి దండ్రులకు పడుకునేందుకు చోటులేకుండా చేసి వాళ్ళను అతిధుల క్రింద భావించేటట్టు చేస్తుంది. ఈ వస్తు సంస్కృతి ఇంటిని ఇరుకు చేయడమే గాక ఆ వస్తు సంస్కృతిమీద మోజు ఉన్న మనుషుల మనసులను కూడా ఇరుకు చేస్తుందని ఆరకంగా ప్రపంచీకరణ వల్ల ప్రపంచమంతా ఇరుకుగా తయారవుతోందని ఇందిర తల్లి భావిస్తుంది. కొండేపూడి నిర్మల చెప్పినట్టు "గదికీ మదికీ గవాక్షాలు మూసుకుపోయి వైశాల్యాన్ని నమిలి మింగటానికి నానారకాల వస్తు దంతాలున్నా"యని "వస్తువు బరువుకు మాట అగాధంలో పడిపోయిందనీ" అంటుంది. వ్యాపార సంస్కృతి స్వార్థం పెరిగి వ్యక్తి ప్రధానమనే భావన రావడం, "వస్తు వినియోగంతో కూడి వ్యాపార సంస్కృతితో మనిషి మరణిస్తున్నాడన్న" సామాజిక తత్వవేత్త ఎరిక్‌ఫ్రామ్ అన్న మాటలు అక్షర సత్యాలు. దీని మధ్య కన్నతల్లిగా బాధపడ్డ మహిళగా ఇందిర తల్లి అర్థమవుతుంది.

మానవీయతకు ఆస్కారంలేని 'అభివృద్ధి' మనుషులకు కలలో కూడ రక్తపాతాన్ని చూపిస్తూ భయాందోళనకు గురి చేస్తోందని తెలిపే కథ కుప్పిలి పద్మ రచించిన 'అతని వలలు' అనే కథ. కులమత వర్గ లింగ వయోబేధం లేకుండా మనుషులు ధనలాభమే ధ్యేయంగా వ్యాపార నాగరికతా ప్రభావంతో చూస్తుండగానే యంత్రాలుగా, రహదారులుగా, ఆనకట్టలుగా, భవనాలుగా మందులుగా ప్లాస్టిక్ మొక్కలుగా మారిపోతున్నారని ఈకథ ద్వారా అర్థం అవుతుంది. తృతీయ ప్రపంచ దేశాలలోని వనరులన్న చోటును ఎన్నుకొని ఉత్పత్తులు చేసి, మార్కెటింగ్ అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాలను అందించిందీ ప్రపంచీకరణ అనికూడ అర్థమవుతుంది. తత్ఫలితంగానే ఒకేస్థాయిలో ఉన్న పట్టణాలలో నగరీకరణ చోటు చేసుకుంటుంది. మార్కెట్లు వెలిసే సరికి మనుషుల రద్దీ పెరగడం, వాళ్ళ ఆహార విహారాలకు తగ్గట్టుగా హోటళ్ళు రావడం పరిపాటి. దీనికి అద్దంపట్టే మరొక కథ కుప్పిలి పద్మ వ్రాసిన "ప్రకంపనం" అమెరికా నుండి వచ్చిన శర్మిష్ఠి తన తల్లి 'క్లబ్' వ్యవహారాల్లో బిజీ అయిపోయి యింట్లో వంటచేయడం మానివేసి హోటల్‌నుండి భోజనం తెప్పించుకోవడం చూసి ఆశ్చర్యపోతుంది. ప్రపంచీకరణ ప్రభావం వంటయింట్లోకి కూడా జొరపడినట్టు ఇక్కడ అర్థం అవుతుంది. ప్రతిసారి విమానాశ్రయానికి వచ్చి శర్మిష్ఠను యింటికి తీసికొని వెళ్లే తల్లిదండ్రులు ఈసారి రాకపోయేసరికి తల్లిదండ్రులకు పిల్లల్ని గురించి పట్టించుకునే తీరిక, ఉత్సాహం తగ్గిపోయిందని శర్మిష్ఠ బాధపడుతుంది. శర్మిష్ఠ తండ్రి ఒక భక్తుడిగా నిర్లిప్తతతో కాలం గడిపే స్థితికి రావడానికి కారణం ఈ ప్రపంచీకరణ అని అర్థం అవుతుంది.

ప్రపంచీకరణంలో భాగంగా బహుళజాతి సంస్థలు 'డాలర్' పెట్టుబడితో వినియోగదారులను ఆకర్షించే క్రమంలో పోటీ మార్కెట్‌ను ఏర్పాటుచేసి తక్కువ ధరలకు వస్తువులను అమ్ముతారు. ఆ పోటీలో 'రూపాయి పెట్టుబడి పెట్టి ఫ్యాక్టరిలో ఉత్పత్తి అయిన సరుకును ఆ రేటుకు అమ్మితే అది ఉత్పత్తి ఖర్చుకంటే కూడా తక్కువగా ఉండటంతో కంపెనీకి నష్టాలు వస్తాయనే భ్రమను స్వదేశీ ఫ్యాక్టరీల వాళ్ళకు కలిగించడం ప్రపంచీకరణలో భాగమే. ప్రైవేటీకరణంలో భాగంగా ఫ్యాక్టరీలను బహుళజాతి సంస్థలు కొనుక్కొని తమ ఇష్టానుసారం ధరలను నిర్ణయించి ప్రపంచంలో ఎక్కడైనా మార్కెట్ చేసుకునే "గ్యాట్" ఒప్పందం ఉండటంతో బహుళజాతి సంస్థలకు స్వదేశీయులు తమ ఫ్యాక్టరీలను అమ్ముకునే స్థితి ఏర్పడింది. వాటిని కొనుక్కుని స్వాధీన పరచుకుని కొన్ని రోజులు తర్వాత ఆ ఉత్పత్తి సరుకును అధిక ధరలకు అమ్ముకొని పూర్వ నష్టాలను కూడా పూడ్చుకునే విధంగా ధరలను పెంచి అధిక లాభాలను ఆర్జించే వెసులుబాటు ఈ ప్రపంచీకరణ ఒప్పందాలలో భాగంగా బహుళజాతి

సంస్థలే ఆయా ప్రాంతాలకు తగ్గట్టుగా మార్కెట్ ధరలను నిర్ణయించుకునే 'స్వేచ్ఛ' ఉంది. దీనినే 'మార్కెట్ స్వేచ్ఛ' అనవచ్చు. దీని ఫలితంగానే "ప్రకంపనం" కథలో కూడా శర్మిష్ఠ తండ్రి మార్కెట్ రేటుల పోటీకి తట్టుకోలేక తమ ఫ్యాక్టరీ ఉత్పత్తులను తక్కువ ధరలకు ఇస్తే ఉత్పత్తి ఖర్చుకూడా గిట్టుబాటు కాదనే భయంతోనే తానిక ఈ ఫ్యాక్టరీని నడపలేననుకొని బహుళజాతి సంస్థలకు అమ్ము తాడు. పనులతో నిరంతర చైతన్యశీలుడిగా ఉన్న శర్మిష్ఠ తండ్రి ఆ ఫ్యాక్టరీ అమ్మిన తరువాత పనీ పాట లేని వాడుగా తయారైతే అతనిలో ఒక నిర్లిప్తత చోటు చేసు కుంటుంది. ఆ మనోవైకల్యపు వత్తిడినుండి తప్పించు కోవడానికి నిరంతరం ధ్యానాన్ని అలవాటు చేసుకున్నాడు.

ప్రపంచీకరణ పట్టణాలలోనేకాక పల్లెటూళ్ళలో కూడా చొచ్చుకుపోయి "ప్రకంపనాలు" సృష్టించటం ఈ కథద్వారా అర్థం అవుతుంది. శర్మిష్ఠ పల్లెటూళ్ళో ఉన్న నాయనమ్మ తాతయ్యలను చూడటానికి వెడితే అక్కడ కూడా బహుళజాతి సంస్థలు తమ ఫ్యాక్టరీలనూ ఆ ఊళ్ళో పొలాలను అధిక ధరలకు కొంటా మంటారు. దానికి ఆమె తాతయ్య యిష్టపడ్డ ఆ నేలకు తాను దూరం కావడం ఇష్టంలేని నాయనమ్మ వద్దని చెపుతుంది. అయినా విననందుకు తన వాటాక్రింద కొంత పొలాన్ని ఇమ్మని అడుగుతుంది. దీనితో భార్యభర్తల మధ్య మనస్పర్థలు, మౌనాలు ఏర్పడతాయి. పెళ్ళయిన నాటి నుండి అన్యోన్య దాంపత్యం గడిపిన తాతయ్య నాయ నమ్మలు ముసలితనంలో బేధాభిప్రాయాలతో మనసులు దూరం చేసుకోవటానికి కారణం ప్రపంచీకరణ ప్రభావేమ నని శర్మిష్ఠ గ్రహిస్తుంది. శర్మిష్ఠ తాతయ్య పొలం ఇవ్వ నందుకు వాటా కోసమై శర్మిష్ఠ నానమ్మ కోర్టులో దావావేసే స్థితికి తీసుకెళ్ళింది. ఈ ప్రపంచీకరణ ఈ రకంగా పలెటూళ్ళలోని కుటుంబ వ్యవస్థలో మనుష్యుల మధ్య ప్రేమాభిమానాలు తగ్గించి మనుషుల్లో ప్రకంపనాలు సృష్టిస్తోంది.

నల్లూరి రుక్మిణి రాసిన 'పోగులు తెగిన అల్లిక' అనే కథలో ప్రపంచీకరణ మనిషి ఉనికిని అంతర్జాతీయత కల్పించినా మానవ సంబంధాల మధ్య మరింతగా తగ్గిపోయే ప్రేమ సంబంధాలు ఎంతగా నలిగిపోతు న్నాయో అర్థం అవుతుంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న పిల్లలకోసం ఉన్న ఊరిలో భర్తను కాదనుకునే అంతగా తల్లి ప్రేమతో అమెరికా వెళ్ళి చాకిరీ చేయటం, చివరికి అందరూ తల్లిని తమ అవసరాలకు వాడుకునే యంత్రంగా భావించారని గ్రహించి ఒంటరిగా మిగిలి పోతుంది పూర్ణమ్మ. ఇక్కడ వాడుకున్న తరువాత బయట పారవేసే వస్తువుల విలువకూడ తల్లికి ఇవ్వడంలేదని అర్థం అవుతుంది. ఈమె రాసిన మరోకథ 'పందేలాట' ఈ కథలో పొలంమీద అప్పుతెచ్చి కొడుకును ఇంజనీరు చదివించి అమెరికా పంపిస్తే డాలర్లు తెచ్చి ఇస్తాడని, అప్పులు తీర్చుకోవచ్చునని భ్రమకు లోనై బాధలకు గురిఅవుతాడు ఒక తండ్రి. ఈ బాధలయొక్క పరీక్ష ప్రభావం ఈ యింటి గృహిణిమీద ఎక్కువగా ఉంటుం దని వేరే చెప్పక్కరలేదు. ఈమె వ్రాసిన మరో కథ "మిడిసిపాటు" ఈ కథలో కూడా అమెరికాలోని ద్రవ్యో ల్బణం కారణంగా ఉద్యోగం నుండి తనకొడుకు వంటి వారిని అమెరికా నుండి వెనక్కి తిరిగి భారతదేశం పంపించేస్తున్నారని తెలిసి మోహనరావు వంటివారు ఆందో ళనకు గురి అవడం, అనారోగ్యం పాలవటంగానూ అర్థం అవుతుంది. నల్లూరు రుక్మిణి వ్రాసిన 'మాయజలతారు' అనే మరో కథలో బహుళజాతి సంస్థలు గ్రామాల్లో ఫ్యాక్టరీలు పెట్టేసరికి పొలంలో పనిచేయడానికి కూలీలు దొరకటం కష్టం అయి ఆహారధాన్యాలు పండించాల్సిన పొలాలలో పామాయిల్, సర్వీచెట్లు వేసి లాభాలను పొందాలనుకున్న సగటు రైతు స్వభావం భారతదేశపు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం వంటివేనని అర్థమవు తుంది. వ్యవసాయోత్పత్తులు తగ్గితే తిండి గింజలు తగ్గడం, కొరత, అధిక ధరలకు కొనలేక తిండిలేక మృత్యు ముఖంలోకివెళ్లిన కోట్లమంది బాధితుల ముఖాలలో కనపడే విషాదానికి కారణాలు.

ఓల్గా వ్రాసిన 'కోకాకోలా' కథలో శ్రీనివాస్ పనిచేస్తున్న కంపెనీ మూతపడటానికి కారణం పుట్టగొడుగుల్లా

పుట్టుకొస్తున్న బహుళజాతి సంస్థలే అని అర్థంఅవుతుంది. కాని ఒక వ్యక్తిగా ప్రపంచపు మొత్తం విధానాన్ని ఎదురించడం కష్టమనీ, స్వదేశీ కంపెనీలలో లాభం నల్లదొరలకు, విదేశీ కంపెనీల లాభం తెల్ల దొరలకు పోతుందికాని కార్మికులకు ఉద్యోగస్తులకు రాదని మనదేశపు వాళ్లయితే ఆ డబ్బులు మళ్ళీ మనదేశంలోనే పెట్టుబడి పెడతారని శ్రీనివాస్ భావిస్తాడు. అయితే అతని భార్య పార్వతి మాత్రం ప్రపంచీకరణ, బహుళజాతి సంస్థల వ్యాపారపు లావాదేవీలు భారతదేశాన్ని కబళిస్తాయేమోనని భయంతో మళ్ళీ ఈస్ట్ ఇండియా కంపెనీ రోజులు, విదేశీ పాలన రాబోతుందా అని ఆందోళన చెందుతుంది. వేళ్ళ సందులోనుంచి 'స్వేచ్ఛ' తెలియకుండా జారిపోతుందని భావిస్తోంది. పార్వతీ తనలోనే తాను తర్జనభర్జనలు పడుతూ విదేశీ వస్తువులు చౌకగా వస్తున్నంత కాలం ప్రజలు వాటినే కొంటారని స్వదేశీ వస్తువులను ఉత్పత్తి చేయాలని భావించినట్లు అర్థం అవుతుంది. ఇదివరకు ఈస్ట్ ఇండియా కంపెనీ స్వాతంత్ర్యాన్ని హరించింది. కాని ఇప్పుడు ప్రజలలో చైతన్యం ఉంది కాబట్టి ఒక వ్యక్తి అసమర్థత వలన తీసుకున్న నిర్ణయాలకు దేశం పతనం కావలసిన అవసరం ఏర్పడిందని కూడా భావించడం జరుగుతుంది. ప్రభుత్వం ఋణాలు తెస్తుంటే భారత దేశం కూడ వడ్డీ వ్యాపారపరమైన ఆస్థిలా తయారవుతుందేమోనని బాధతో వరదలు వచ్చి మురుగునీరు చేరి కంపు కొట్టి రోగాలు వస్తే వాటికి మందులు కనిపెడతారు కాని, వరదలను మాత్రం ఆపలేనట్లుగా అప్పులను ఆపలేకుండా ఉన్నారన్న భావనకూడా ఏర్పరచుకుంటుంది. అయితే ఇలా అప్పుల్లో కూరుకుపోతున్న దేశాన్ని ఎలా కాపాడుకోవాలంటే ప్రపంచాన్నంతా కంట్రోల్ చేస్తున్న శక్తిమీద యుద్ధం చేయక తప్పదని, యుద్ధ చేయడం కొంతమందికి ఇష్టం లేకపోయినా వాళ్ళు ఉన్నది మాత్రం యుద్ధరంగంలోనేనని, వాళ్ళు పీలుస్తున్న ఊపిరి రక్తం వాసన వస్తూనే ఉంటుంది. కాని కొత్త పోరాటాల పక్షాన ఉండాలనే భావనను వ్యక్తం చేస్తూ ప్రపంచీకరణ ప్రభావాన్ని ఎదుర్కొనే మార్గాలలో భాగంగా విదేశీ కంపెనీ అయిన కోకాకోలా కంపెనీలో ఉద్యోగం మానేయలేకపోతే కనీసం దాన్ని తాగొద్దని ప్రచారం అయినా చేస్తే బాగుండునని సందిగ్ధావస్థలో పడిన వ్యక్తులుగా కథలో పార్వతీ శ్రీనివాసులు అర్థం అవుతారు. ఈ కథలో 'భారత జాతీయత' వంటబట్టించుకున్న పార్వతి బతుకు తెరువు కోసం విదేశీ కంపెనీలో ఉద్యోగం చేస్తే తప్పేమిటంటూ శ్రీనివాసులు భార్యభర్తలుగా కొన్నాళ్ళు ఘర్షణపడి మాట్లాడుకోకపోవడం జరుగుతుంది. దీనికి కారణం ప్రపంచీకరణ ప్రభావమే అని అర్థమవుతుంది.

ప్రపంచీకరణ ప్రభావం మానవ జీవితాలను ఆక్రమిస్తుంటే, మార్కెట్ శక్తులమధ్య మానవ సంబంధాలు నలిగిపోతుంటే ఇంటా బయటా స్త్రీలు రకరకాలుగా బాధితులవుతున్నారని ఈ కథలద్వారా అర్థం అవుతుంది. నల్లూరు రుక్మిణి రాసిన 'పోగులుతెగినఅల్లిక', 'మాయ జలతారు', ఓల్గా 'కోకాకోలా' తదితర రచనలు పితృస్వామ్య సంస్కృతివల్ల ఇప్పటికే బాధితులైన మహిళలు ప్రపంచీకరణ వలన ఏర్పడిన కొత్త సాంస్కృతిక దాడికి మరింతగా బాధితులవుతున్నారనే విషయాన్ని తేటతెల్లం చేస్తాయి. అమానవీయ, అప్రజాస్వామిక ధోరణులు పెరిగిపోతున్న సమయంలో స్త్రీలు తమ శక్తిసామర్థ్యాలను పెంచుకొని ఆత్మరక్షణ చేసుకుంటూ నిలబడే శక్తిని పొందాలి.

ఆధార గ్రంథాలు :

1) గీతాంజలి (గీతాంజలి అలియాస్ భారతి)-"కథ 2020" సుప్రభాతం వారపత్రిక తేది. 18-03-2000
2) కుప్పిలి పద్మ "అతని వలలు" కథ - ఆంధ్రజ్యోతి వారపత్రిక తేది 22-05-1998.
3) నల్లూరి రుక్మిణి "పోగులు తెగిన అల్లిక" కథ, అరుణతార మాసపత్రిక తేది. 01-11-2001. "పందేలాట" కథ - ఆంధ్రప్రభ వారపత్రిక తేది. 21-03-2002. "మిడిసిపాటు" కథ ఆంధ్రప్రభ వారపత్రిక తేది. 08-09-2001.
4) డా॥ జె. కనకదుర్గ "తెలుగు సాహిత్యం - మహిళా చైతన్య ప్రస్థానం" ముద్రణ : తాహెర్ గ్రాఫిక్స్, కొత్తగూడెం, జూన్ 2009.

దీపావళి పండుగ ప్రపంచీకరణ

– డా॥. ఎం. ఫాయిద బేగం, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, కె.వి.ఆర్.ప్రభుత్వ మహిళాకళాశాల, కర్నూలు.

"దీపం జ్యోతి: పరబ్రహ్మ దీపం సర్వతమోపహమ్
దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీపన్నమోస్తుతే"

దీపం ప్రసరించే వెలుగు పరబ్రహ్మ స్వరూపం. పర బ్రహ్మ అంటే ఈ సకల చరాచర జగత్తును తన కనుసన్న లత నడిపించే అనంతమైన అద్భుతశక్తి. అందువల్లే ఆ దీపం మనోవికాసానికి, సద్గుణసంపత్తికి, మానసిక అనంద ఐశ్వర్యాలకు ప్రతిరూపం.

అజ్ఞానాంధకారంల కొట్టు మిట్టాడుతున్న లోకానికి భగవానుడు కరుణతో పరిపూర్ణ జ్ఞానకాంతులు ప్రసాదించే పండుగ దీపావళి. ఈ పండుగ ప్రతి సంవత్సరం ప్రత్యే కంగా నిండు అమావాస్యరోజు వస్తుంది. ఆ రోజు హిందూ దేశం మొత్తం ఆనందోత్సాహాల వెలుగులో మెరిసి పోతుంది.

దీపావళి :

అమవాస్య చీకట్లను పారద్రోలి వెలుగులను ప్రసారం చేసే సందర్భం దీపావళి. లోకంలోను, మనసులలోను కాంతిని నింపి ఆనందమయం చేస్తుంది కనుకనే దీపావళి అయింది. అందరూ చేసుకునే పండుగ అయింది. అన్ని సంప్రదాయాల వారు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారీ పండుగ.

దీపావళి జరుపుకోవటానికి ముందురోజు అంటే ఆశ్వయుజ కృష్ణ చతుర్ధశినాడు శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించాడు. నరకాసురుని పై యుద్ధానికి వెడుతున్న ప్పుడు శ్రీకృష్ణునితోపాటు సత్యభామ కూడా బయలు దేరింది. కృష్ణుడు యుద్ధం చేస్తూ మూర్ఛపోతే సేద తీర్చుతూనే నరకుని యుద్ధంలో నిలువరించింది. సత్య భామ సమక్షంలోనే శ్రీకృష్ణుడు నరకాసురుని సంహ రించాడు. నరకుని పీడ వదలినందుకు మరునాడు ఆవునేతితో దీపాలు వరుసగా వెలిగించి తమ ఆనందాన్ని భరతఖండవాసులందరూ వ్యక్తం చేశారట ద్వాపర యుగంలో.

కృతయుగంలో నరకుని జన్మకు బీజావాసం జరిగింది. యజ్ఞవరాహ రూపంలో భూదేవిని ఉద్ధరించిన విష్ణు మూర్తిని భూదేవి తనకొక కుమారుని ప్రసాదించమని కోరింది. అడిగిన సమయాన్ని బట్టి మహాబలవంతుడు, లోక కంటకుడు అయిన కుమారుడు జన్మిస్తాడని చెప్పి ఆమె కోరికను తీర్చుతాడు. భయపడిన దేవతలు ఆమె గర్భం నుండి శిశువు బయటకు రాకుండా నిలిపి ఉం చారు. త్రేతాయుగం కూడా గడిచిపోతుంది. భూదేవి విష్ణువుతో మొరపెట్టుకుంది. త్రేతాయుగంలో కుమారుడు జన్మిస్తాడని అభయం ఇచ్చాడు. అదే విధంగా రావణ వధానంతరం కుమారుడు జన్మించాడు. భూదేవి ఆ బాలుని పెంచమని జనకునికి అప్పజెప్పింది.

జనకుడు ఆ బాలుని 16 సం.లు వచ్చేవరకు పెంచు తాడు. అప్పుడు భూదేవి తనతో తీసుకొని వెళ్ళింది. విష్ణువు అతడిని ప్రాగ్జ్యోతిషానికి రాజుగా చేసి ధర్మబద్ధంగా రాజ్యపాలన చేయమని, గోవులను, బ్రాహ్మణులను, మునులను బాధించవద్దని, లేకపోతే హాని కలుగుతుందని హెచ్చరించి వెడతాడు.

చాలాకాలం తండ్రి చెప్పినట్టే ప్రవర్తించాడు. కానీ బాణాసురుని సాంగత్యం వల్ల అతడిలో సహజంగా ఉన్న అసుర లక్షణాలు బహిర్గతమయ్యాయి. వైదిక పద్ధతికి దూరమయ్యాడు. జ్ఞుమాచారాన్ని అనుసరించాడు. పంచమకారాలతో తాంత్రిక ఆరాధన చేసి కామాఖ్యా దేవిని ప్రసన్నం చేసుకుని ఎన్నో సిద్ధులు పొందాడు. కాని, ఆశక్తి అంతులేదు కదా ! మరి కొన్ని సిద్ధులు సాధించటానికి

దేవికి బలి ఇవ్వటం కోసం బలిష్ఠులైన రాజకుమారులను, అందమైన రాజకుమార్తెలను తెచ్చి బంధించి ఉంచాడు. దేవమాత అదితి కుండలాలను, వరణుడి ఛత్రాన్ని స్వంతం చేసుకున్నాడు. సాధుహింస మొదలు పెట్టాడు. ద్వాపర యుగం చివరలో సంహరించబడ్డాడు. అయినా ఈనాటి వరకు తలుకుకోబడుతున్నాడు.

నరకునిది మూడు యుగాలకు విస్తరించిన 'ఘనమైన' చరిత్ర, నాలుగవది అయిన కలియుగంలో కూడా తల్లి అయిన భూదేవి కోరిక కారణంగా తలుచుకోబడుతూనే ఉన్నాడు.

సమస్తమైన సంపదలు, ఓషధులు, ఖనిజాలు భూమి నుండే ఉద్భవిస్తాయి. భూదేవి కుమారునిగా వాటినన్ని టినీ పొందే అర్హత నరకునికి ఉంది. కానీ నరకుడు ఆ అర్హతను దుర్వినియోగం చేసుకున్నాడు. సంపదలనే కాదు వెలుగుని కూడా స్వంతం చేసుకోవలనుకున్నాడు. అందువల్ల తల్లి కళ్ల ముందే చంపబడ్డాడు. పూర్వ జన్మలో తన కుమారుడు అయిన నరకుడు తన కళ్ల ముందే చంపబడుతుంటే సత్యభామ అడ్డుకోలేదు, కాని విజయోత్సవ వేడుకలు తన కుమారుని పేరు మీద జరగాలని కోరింది. కనుకనే ఆ రోజు 'నరక చతుర్దశి'గా ప్రసిద్ధి పొందింది. నరకుడు భూమి మీదనే జీవులందరికీ నరకమంటే ఏమిటో చవి చూపించాడు. ప్రాగ్జ్యోతిషమంటే ముందుగా వెలుగు ప్రసరించే దేశమని అర్థం. ఇంకెవ్వరికీ ఆ వెలుగు అందకుండా తన స్వంతం చేసుకోవాలనుకున్నాడు. మనుషులు పగలే ఇల్లు వదలి బయటికి రావటానికి భయపడే వారు. రాత్రి తమ ఉనికి తెలుస్తుందని దీపాలు వెలిగించుకొనే వారు కాదు. కనుక నరకుడు చనిపోయాడని తెలియగానే కరవుతీరా దీపాలు వెలిగించుకున్నారు. పండగ చేసుకున్నారు. తన కుమారుడే అయినా ఒక దుష్టుని సంహారంతో జీవులందరినీ ఉద్ధరించిన మంచితల్లి భూదేవి తల్లులందరికీ ఆదర్శం. ఈ దీపాలన్నీ ఒక రకంగా చూస్తే భూదేవికి, ఆ తల్లి అంశ కలిగిన మాతృమూర్తులందరికీ అర్పించే నివాళిగా చెప్పుకోవచ్చు.

ద్వాపరయుగంలో మాత్రమే కాదు, అన్ని యుగాల లోనూ అశ్వయుజ కృష్ణఅమావాస్య అనగా దీపావళి అమావాస్యనాడు అనే శుభసంఘటనలు జరిగాయట. దీపావళి పండుగ చేసుకవటం వల్ల వాటినన్నింటిని స్మరించినట్టవుతుంది.

త్రేతాయుగంలో - అంటే సుమారుగా 22 లక్షల సంవత్సరాలకు పూర్వ శ్రీరామచంద్రుడు రావణుని వధించి, సీతా సమేతుడై అయోధ్యకు వచ్చిన సందర్భంలో సీతారాములను ఆహ్వానించటానికి పౌరులు నగరాన్ని ఆవు నేతి దీపాలతో అలంకరించారట. ఆ దీపాలు తమ మనస్సులోని ఆనందానికి సంకేతాలని, శ్రీరాముడు అయోధ్యలో లేని రోజులన్ని తమకు చీకటి అని, రాముని ఆగమనం తమ జీవితాలకు వెలుగునిచ్చిందని తెలియ చేయటానికి దీపాలు వెలిగించే స్వాగతం పలికారట. ఆ శుభ సంఘటనకు గుర్తుగా ప్రతి ఏడు ఆశ్వయుజ బహుళ అమావాస్య నాడు దీపాలు వెలిగించి ఉత్సవం జరుపుకోవటం ఆనవాయితీ అయిందని, దీపావళి పండుగ మూలం త్రేతాయుగంలోనే ఉందని ఒక విశ్వాసం.

దీపావళి నాటి ప్రాముఖ్యత :

విక్రమాదిత్య చక్రవర్తి 30 లక్షల మంది ఒకులను, హూణులను భరతభూమి నుండి పారదోలినది దీపావళి పర్మదినానేనట. విక్రమశకం పాటించేవారు. ఈ రాటికి దీపావళిని సంవత్సరాదిగా పాటిస్తారు. వ్యాపారస్తులు కొత్త లెక్కల పుస్తకాలను మొదలు పెట్టటానికి కారణం ఇదే కావచ్చును.

సిక్కుల మత గురువు గురుగోవిందసింగ్‌ను మొగల్ చక్రవర్తి జహంగీర్ గ్వాలియర్ కోటలో బంధించాడు. కొన్నాళ్ళకు చక్రవర్తి గురుగోవింద్‌సింగ్‌ని మాత్రం విడుదల చేస్తానన్నాడు. కానీ ఆయన దానికి అంగీకరించలేదు. కోటలోని వారినందరినీ కూడా విడుదల చేయాలని పట్టు పట్టాడు. జహంగీర్ ఆయన మాట మన్నించి అందరిని విడుదల చేసింది కూడా దీపావళినాడే. కనుక సిక్కులు దీపావళిని త్యాగానికి సంకేతికంగా పరిగణిస్తారు.

జైనమత ప్రవక్త మహావీరుడు మహాసరి నిర్వాణం పొందింది కూడా దీపావళినాడే. అందువల్ల జైనులు దీపావళిని పరమ పవిత్రంగా భావిస్తారు.

ఈ విధంగా భారతదేశంలోని అన్ని సంప్రదాయాల వారికే కాదు. దేవలోకం వారికి కూడా దీపావళి పవిత్ర మైనదే. దీపావళినాడే లక్ష్మిదేవి పాలసముద్రం నుండి ఆవిర్భవించి విష్ణుమూర్తిని చేపట్టింది. దుర్వాస మహా ముని శాపం కారణంగా స్వర్గ లక్ష్మిని కోల్పోయిన ఇంద్రుడు తిరిగి దానిని పొందుతాడని విష్ణువు సెలవిచ్చిన శుభసమయం అది. కనుకనే దేవతలందరూ లక్ష్మిదేవి జన్మదిన వేడుకను వైభవంగా జరిపారు. తాము చీకట్లో నుండి వెలుగులోకి వచ్చిన దానికి చిహ్నంగా దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని జ్యోతి స్వరూపంగా ఆరాధించటం ప్రారంభించారు.

ప్రపంచీకరణ :

దీపాలను వెలిగించి పండుగ జరుపుకోవటం ఒక్క భారతదేశానికి మాత్రమే పరిమితం కాదు. వెలుగుని ఆరాధిస్తూ ప్రపంచంలోని ఎన్నో దేశాల వరావీ దీపాలు వెలిగించి పండుగ చేసుకుంటారు.

"నాయిమ్ ముబా" అనే పేరుతో చైనావారు దీపాల పండుగను చేసుకుంటారు.

"తీహార్" అనే పేరుతో "నేపాల్" లో ఐదురోజులపాటు దీపాల పండుగ చేసుకుంటారు. మొదటి రోజుని కాకుల పండుగ, రెండవ రోజు కుక్కల పండుగ, మూడవరోజు ఆవుల పండుగ, నాలగవ రోజు పశువుల పండుగ ఐదవ రోజు ఆడపడుచుల పండుగగా జరుపుకుంటారు.

"తోరోనాగీషి" అనే పేరుతో జపాను దేశీయులు మూడు రోజుల పాటు దీపాలు వెలిగించి పండుగ జరుపుకుంటారు. పితృదేవతలు తమ ఇళ్ళకు వచ్చి విందారగించి వెడతారని వారి నమ్మకం. మొదటిరోజు ఇంటిని దీపాల వరుసలతో అలంకరిస్తారు. రెండవరోజు బంధుమిత్రులను కలుసుకుని ఆనందంగా గడపుతారు. మూడవరోజు పడవల మీద విహారానికి వెళతారు.

"తంగీజ్" అనే పేరుతో బర్మాదేశంలో నవంబర్‌లో దీపాల పండుగను చేసుకుంటారు.

క్రైస్తవ, మహమ్మదీయ, బౌద్ధ, యూదల మతస్థుల కూడా దీపాలను వెలిగించే పండుగలను చేసుకుంటారు.

ముగింపు :

ఏ మనిషి అయినా, ఏమతమయినా, ఏ కులమైన వాడైనా ఏ ప్రాంతమువాడయినా ఆనందంతో తమతమ పండుగలను జరుపుకొంటారు. అందరూ ఒక్కటే మానవ జాతి అని పండుగ జరుపుకోవడం మనుషులలోని మనసుల మాలిన్యాన్ని తొలగించుకొని పండుగలు జరుపుకోవాలని ప్రపంచవ్యాప్తంగా దీపావళి మరింత శోభాయమాన ప్రకాశంతో జరుపుకోవాలని ఆశిస్తూ తమసోమా జ్యోతిర్గమయా.....

ఆధార గ్రంధాలు :

1. పండుగలు ప్రాముఖ్యత -తెలుగు అకాడమి
2. తెలుగువెలుగు
3. బాలభారతం
4. పండుగలు ప్రాధాన్యత నవరత్న బుక్ సెంటర్

❖ ❖ ❖

పడగనీడ నవల – ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య

– డా॥. ఎన్. సింతోద్రి, కళాశాల అధ్యక్ష్యులు, ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురం.

నేడు ప్రపంచ వ్యాప్తంగా అందరి నోటా నానుతున్న పదం ప్రపంచీకరణ. మొదట ఇది ఒక ఆర్థిక ప్రక్రియగా మొదలైన తర్వాత అన్ని రంగాలను ఆక్రమించింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్య..... ఇలా అన్ని రంగాలకనూ ప్రపంచీకరణ నేపథ్యంలో చూడాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఈ వ్యాసంలో ప్రస్తుత కాలంలోని ప్రవేట్ పాఠశాలలో విద్య ఏ విధంగా అందు తోందో తెలియజేయడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

"గ్లోబలైజేషన్" అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో 'ప్రపంచీకరణ' అనే పదాన్ని వాడుతున్నాం. "జాతీయ సరిహద్దులతో, దూరాలతో సంబంధం లేకుండా ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రక్రియలు నిరాఘాటంగా చోటు చేసుకోవడమే ప్రపంచీకరణ" - కవల్జిత్ సింగ్.

గ్లోబలైజేషన్ అంటే విశ్వ స్వేచ్ఛా వ్యాపారం' రాజీవ్ దీక్షిత్.

"అభివృద్ధి చెందుతున్న అభివృద్ధి చెందని దేశాలకు అప్పులిచ్చే నెపంతో, అభివృద్ధి నెపంతో అమెరికా తన సహస్ర బాహువులతో ఆక్రమించుకొని ఆయా దేశాల స్థానిక సంస్కృతులను, జీవవైవిధ్యాన్ని చంపెయ్యడం, ఆయా దేశాల రాష్ట్రాల ప్రభుత్వాలను తోలుబొమ్మలుగా, కీలుబొమ్మలుగా మార్చుకుని పెత్తనం చెయ్యడమే ప్రపంచీకరణ" - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. అని ఇంకా అనేకమంది సాహిత్యవేత్తలు ప్రపంచీకరణ గురించి తమ అభిప్రాయలను చెప్పారు.

ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యారంగం వ్యాపార మైంది. ఎక్కడ చూసినా మానవతా విలువలు లేని కార్పరేట్ కాలేజీలే నేడు దర్శనమిస్తాయి. కార్పోరేట్ కాలేజీల ధన వేటలో తల్లిదండ్రుల ఆశయాలు, లక్ష్యాల సాధనలో విద్యార్థులు ఏ విధంగా మనో వేదనను, ఒత్తిడిని, హింసను అనుభవిస్తున్నారో వివరించిన నవల పడగనీడ. ఈ నవలను 2010లో 'సలీం' రాశారు. ఇతను 1959 జూన్ ఒకటో తేదీన జాఫర్, అన్వర్‌బీలకు జన్మించారు. ఒంగోలు సమీపంలో త్రోవగుంట అనే గ్రామంలో జన్మించారు. మానవత్వాన్ని మించిన మతం లేదనీ, అదే తన అభిమతంగా, కథలు, నవలలు, కవితలు రాశారు. స్వాతి చినుకులు, నిశ్శబ్ద సంగీతం, రూపాయి చెట్టు కథలు అనే కథల సంపుటాలు, నీలోకి చూసిన జ్ఞాపకం అనే తొలి కవితా సంపుటిని ప్రచురించారు. జీవనస్మృతులు, వెండిమేఘం, పడగనీడ మొ॥ అనే నవలలు రాశారు. మెహర్, బురఖా, తలాక్, ఆరో అల్లుడు వంటి కథల ద్వారా ముస్లిం సంప్రదాయాల్లో, ఆచార వ్యవహారాల్లో ఉన్న రుగ్మతల్ని ఖండించారు. 2010లో ఈయన రాసిన నవల కాలుతున్న పూలతోటకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

లేలేత మొగ్గలు సహజ సిద్ధంగా వికసించి... మృదు పరిమళాలు వెదజల్లటమే కదా ప్రకృతి ధర్మం... దానికి విరుద్ధంగా బలవంతంగా వికసింపజేయాలని ప్రయత్నిస్తే వికృత ఫలితాలే వస్తాయి. విద్యార్థుల మేధో వికాసాన్ని నియంత్రించి, వాళ్ళని మార్కులు తెచ్చుకునే మర యంత్రాలుగా మారుస్తున్న కార్పోరేట్ విద్యాసంస్థల 'పడగనీడ' ని కళ్ళకు కట్టేలా చిత్రించిందీ నవల.

సాంకేతిక విద్యకున్న డిమాండ్ - వాటి ఫీజులు:

నేడు సాంకేతిక విద్యకు ఉండే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రవేట్ విద్యా సంస్థలు పోటీపడి తమ సంస్థలను ప్రారంభిస్తున్నాయి. వీటిలో వివిధ రకాల కోచింగ్‌ల పేరుతో వేలకు వేల రూపాయలను సంపాదిస్తు న్నాయి. నవలలో అనూష పదవ తరగతి చదవు

తుంటుంది. తర్వాత తాను ఏమి చదవాలో అనూష తల్లి ఇలా అంటుంది. "అనూషను విజయవాడలో చేర్పిద్దా మండీ శ్రీ చరిత జూనియర్ కాలేజీకి మంచి పేరుంది. బాగా రుబ్బుతారట. యంసెట్లో మనమ్మాయికి ర్యాంక్ ఖాయం అందో రోజు. ప్రతి వాళ్లు యంసెట్టు వెంట వేలం వెర్రిగా పడబట్టే కాలేజీలన్నీ యంసెట్ కోచింగ్ లంటూ వేలకు వేలు దండుకుంటున్నాయి", (సలీం : 2010, పుట - 10) అంటూ ఒక విద్యార్థి తండ్రి వ్యక్తం చేసే ఆవేదన మనల్ని ఆలోచింపచేస్తుంది. ఈ మాటల్ని పరిశీలిస్తే ఆధునిక విద్య నేపథ్యంలో ర్యాంకుల పేర్లతో ప్రవేట్ సంస్థలు దోచుకొనే స్థితి మనకు ఈ నవలలో కనబడుతుంది.

విద్యార్థులకు ఇష్టం లేని చదువు :

పిల్లలకు తమకు నచ్చిన చదువుల్లో ముందుకు సాగేలా పెద్దలు ప్రోత్సహించాలి. అందుకు తగిన వాతా వరణాన్ని ఇంట్లో కల్పించాలి. అలా గాక చదువుల విషయంలో వారి శక్తి సామర్థ్యాలకు భిన్నంగా తల్లి దండ్రులు ఆశించకూడదు. పిల్లలకు ఇష్టం ఉన్న విష యాన్ని పిల్లలకోణం నుంచే ఆలోచించే ప్రయత్నం చేయాలి. అయితే నేటి సమాజంలో తల్లిదండ్రులు దృష్టికోణం ఎలా ఉంటుందో ఈ మాటలను చూడవచ్చు. 'పడగనీడ' నవలలో "అనూషకు అందోళనంగా ఉంది. నిజమే... తనకు లెక్కల్లో నూటికి నూరు మార్కులు వస్తాయి. సైన్సు అన్నా ఇష్టమే. కానీ తనకు ఇంజనీరు కావాలని లేదు. అలాగని సిఏ చదవాలని కూడా లేదు. తనకు లిటరేచర్ చదవాలని ఉంది. ఒక రోజు అమ్మతో ఆ విషయం చెప్పినప్పుడు ఇంట్లో పెద్దరాద్ధాంతం జరి గింది. లిటరేచర్ చదువుతావా? హవ్వా నాదగ్గరన్నావు కాబట్టి సరిపోయింది. ఇంకెక్కడా అనకు పరువు నష్టం" (సలీం : 2010 పుట - 12) సాహిత్యం చదువుతానన్న ఆసక్తిని కనబర్చిన అనూషకు తన తల్లి చేసే సూచన వలన ఈ రోజు ప్రపంచీకరణ దాడికి గురైన సంప్రదాయ విద్య భాష, సాహిత్యాల విలువ మనకు అర్థమవుతుంది.

"కథలూ కాకర కాయలు చదివితే తిండెలా దొరుకు తుంది? ఉద్యోగాలేం దొరుకుతాయి? ఇప్పుడు ఇంజనీర్ల కున్న డిమాండ్ ఎవ్వరికీ లేదు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు లక్షలకు లక్షలు జీతాలు... ఏసీ రూముల్లో కంప్యూటర్ ఎదురుగా కూచొని రావచ్చు" అంటూ అనూష తల్లి అభిప్రాయపడుతుంది. ఈ అంశాలను పరిశీలిస్తే ప్రపంచీకరణ నేపథ్యంలో సంప్రదాయ విద్యకు ఆదరణ తగ్గుతూ, సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ విద్య ప్రాధాన్యత పొందు తుంది. ఐతే ఇంజనీరింగ్ విద్య భారత్‌లాంటి పేదదేశాల ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాల వారికి అందని ద్రాక్షగా మారుతుంది. ఎందుకంటే వృత్తి సాంకేతిక విద్యలు నేడు ఖరీదైన విద్యలుగా ఉన్నాయి. అందువలన ప్రపంచీకరణ ద్వారా విద్యా ఉపాధి రంగాల్లో కొన్ని ఉన్నత వర్గాలే అత్యధిక ప్రయో జనం పొందుతున్నారన్నది విశ్వాసం.

హిస్టరీ చదివితే ఏమొస్తుంది? ఉపాధికి పనికిరాని చదువులు వృధా... అదే ఏ కంప్యూటర్ కోర్సో, ఇంజ నీరింగో, మెడిసినో చదివితే మంచి మంచి ఉద్యోగా లొస్తాయి. అమెరికాలాంటి విదేశాలకెళ్ళే అవకాశం ఉం టుంది. చేతి నిండా డబ్బులు సంపాదించవచ్చు, (సలీం : 2010; పుట - 71) అంటూ అభిప్రాయపడుతుంది ఒక అమ్మాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక శాస్త్రాల పట్ల ఇలాంటి వైఖరి అధికమవుతోంది. అయితే చరిత్ర, సాహిత్యం చదవకుండా మానవత్వపు విలువల గురించి చెప్పేంత తీరిక నేటి తల్లిదండ్రులకు లేదు. అంతా డబ్బు సంపాదనలో తీరిక లేకుండా కష్టపడుతూ డబ్బే సర్వస్వంగా భావిస్తున్నారు. ఈ కంప్యూటర్ విద్యలు ఇలాగే కొనసాగి సంప్రదాయ విద్యలు పతనమైతే కొంత కాలానికి విద్యార్థులకు కవిత్రయమంటే ఎవరో తెలి యదు. సింధూ నాగరకత గురించి కూడా తెలిసే అవ కాశం ఉండదు. సమాజం మర యంత్రాలుగా మార కుండా ఉండాలంటే మనుషులుగా అధ్యయనం చేయడం ఎంతైనా అవసరం.

ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు కాస్తంతయినా స్వేచ్ఛ ఇవ్వడం లేదు. తమ కలలను, ఆశయాలను పిల్లలపై బలవంతంగా రుద్ది వారిని ఊపిరి సడలనంత ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రపంచీకరణ కాలంలో డబ్బుపై ఆశ సమాజాన్ని పట్టిపీడించడమే. నేడు ప్రతి ఒక్కరికి లెక్కలేనంత ధనం కావాలి. దాని కొరకు తమ పిల్లల భవిష్యత్తును ముందే ఊహిస్తూ వారి స్వేచ్ఛను హరిస్తున్నారు.

పిల్లలపై తీవ్ర ఒత్తిడి, స్వేచ్ఛను హరించడం :

నేడు పోటి యుగంలో విద్యార్థులు తీవ్రమైనటువంటి ఒత్తిడి, హింసను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రుల అత్యుత్సాహం, కళాశాలల ర్యాంకులు, మార్కుల దాహం వలన విద్యార్థుల స్వేచ్ఛ హక్కును హరిస్తున్నారు. దీంతో విద్యార్థిలోకం తీవ్రమైన ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు గురవుతోంది. ఈ పరిస్థితని చిత్రించిన ఈ నవలలో ఇలా చిత్రించారు రచయిత.

ఒకప్పుడు విద్య అనేది ఆటపాటలతో హాయిగా సరదాగా గడిచిపోయేది. కానీ నేడు ఆటలు లేవు పాటలు లేవు. తల్లిదండ్రులు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు నేర్పుతున్నది ఒకటే అదే చదువు! చదువు. ఈ స్థితిని తెలియజేసిన నవల సలీం రాసిన పడగనీడ. 'విశ్రాంతి లేని చదువు .... మనసుకు ఏ రకమైన ఉల్లాసం లేదు. ఆటల్లేవు. కనీసం ఇండోర్ గేమ్స్ కూడా లేవు. ఆటల వల్ల సమయం వృథా అవుతుందట. ఎక్స్ట్రా కరికులర్ యాక్టివిటీల్లేవు. వక్తృత్వ పోటీలు, వ్యానరచన పోటీ లాంటివి ఉండవట. క్విజ్‌లూ కవిత్వాలూ పనికి రావట. అంతా చదువు.... చదువు.... చదువు... (సలీం : 2010, పుట - 28) అంటూ అనూష బాధపడుతుంది. ఈ పరిస్థితి నేడు కార్పరేట్ ప్రపంచకం కల్పించిన పరిస్థితికి అద్దం పడుతుంది.

పిల్లలకు ఆటపాటలను కల్పించాలి. మంచి ఆరోగ్యంగా ఉండాలంటే రోజు కొంత సమయాన్ని ఆటలు, వ్యాయామం కల్పించాలి. అలా కాకుండా ఎప్పుడూ పుస్తకాలు ముందేసుకొని తెగ కష్టపడేటట్లు చేస్తున్నాయి నేటి ప్రవేటు విద్యాసంస్థలు. అలా చేయడం వల్ల బుర్రకు ఏ మాత్రం ఎక్కదు. కారణం పరీక్షల ఒత్తిడి. కావున ఇలాంటి సమయంలో పెద్దలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని పిల్లలకు తోడుగా ఉండాలే కానీ, వారి పై ఒత్తిడి తీసుకరాకూడదు.

కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రచారం :

నేడు ప్రవేట్ కళాశాలల యాజమాన్యం తమ ఉద్యోగులతోనే ఇంటింటి ప్రచారం చేయిస్తున్నాయి. కళాశాలల్లో పాఠ్యాంశాల్ని బోధించాల్సిన లెక్చరర్లు ఇంటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఈ అంశాలను ఈ నవలలో ఇలా చూపెడుతున్నాడు రచయిత"నా పేరు సుందరం. శ్రీ చరితకాలేజీలో లెక్చరర్ని. మీ అమ్మాయిని ఇంటర్మీడియట్ ఎక్కడ జాయిన్ చేయాలనుకుంటున్నారు?

"సునందా కాలేజి అని చెప్పడానికి ఆమె మహమాట పడి" ఇంకా నిర్ణయించుకోలేదండి కొన్ని కాలేజీలు అప్పుడే తెర్చినా మిగతా కాలేజీల్లో చేరడానికి ఇంకా టైం ఉందిగా అంది.

"అందుకే వచ్చాను. మీ అమ్మాయిని మా కాలేజీలో చేర్చండి. మంచి ఫ్యాకల్టీ ఉంది. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠాలు చెప్తారు. యంసెట్లో ర్యాంక్ గ్యారంటీ. ఒకవేళ ఇప్పటికే వేరే కాలేజీలో చేర్చినా పర్లేదు మా కాలేజీకే మార్పించండి" (సలీం : 2010, పుట - 85) ఈ మాటలు 'పాఠాలు బోధించాల్సిన అధ్యాపకుల చేత ప్రచారాలు నిర్వహించడం ప్రవేట్ విద్యా సంస్థల వ్యాపార స్వభావానికి నిదర్శనంగా చూపెడుతున్నాయి.

నేడు ప్రతిదీ, ప్రచారాలపైనా, హంగూ ఆర్భాటాలపైనే ఆధారపడి మన గలుగుతుంది. విద్య కూడా అందులో భాగంగానే ప్రచారం చేయబడుతుంది. "నర్సరీ క్లాసు నుంచే కంప్యూటర్ శిక్షణ అని ఓ స్కూలు ప్రచారం చేస్తుంది. మీ పిల్లలకు ఎల్కేజి నుండే గుర్రపుస్వారీ, స్విమ్మింగ్ నేర్పించే ఏకైక విద్యాసంస్థ అని మరొకడం టాడు. ఏసీ క్లాసు రూములు, ఏసీ బస్సులు మరొక స్కూల్

అట్రాక్షన్. వీటికే చదువుకున్న భాదరాయణ సంబంధ మేమిటో ఎంత బుర్రలు బద్దలు కొట్టుకున్నా అర్థం కాదు. కానీ ఆ స్కూళ్ళు నిండి పోతుంటాయి. అడ్మిషన్లు దొరకవు, భారీగా డొనేషన్లు... రికమెండేషన్లు'' (సలీం : 2010 పుట - 88) ఈ అంశాన్ని పరిశీలిస్తే ప్రవేట్ విద్యా సంస్థల ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఏ స్కూల్లో చేర్పించాలో కూడా ఊపిరాడనంతా స్థితికి నెట్టబట్టారు నేటి విద్యా వ్యవస్థ ప్రచారాలతోనే మనుగడ సాగిస్తున్నది.

విద్యార్థుల ఫలితాలు వచ్చినప్పుడు టీవిలలోనూ, సామాజిక మాధ్యమాల్లో ఏ విధంగా ప్రచారం చేస్తారో ఈ మాటల ద్వారా తెలుసుకోవచ్చు. ''మరునాడు మధ్యాహ్నం మూడింటికి రిజల్ట్స్ వెలువడ్డాయి. సాయంత్రానికల్లా టీవీల నిండా ప్రచారపు హోరు... ఏ ఛానెల్ తిప్పినా ఒకటే గోల... యంసెట్ ర్యాంకుల గురించి... శ్రీ చరిత జూనియర్ కాలేజీ ప్రభంజనం... ఇంజనీరింగ్‌లో మొదటి ర్యాంక్‌తో పాటు మూడు నాలుగు ర్యాంకులు కైవసం... మొదటి వంద ర్యాంకుల్లో యాభై ఆరుస్థానాలు నిలబెట్టుకున్న శ్రీ చరిత... అని ప్రకటన వచ్చిన కొద్దిసేపటికే సునందా కాలేజీ వాళ్ళ ప్రకటన ..... గత కొన్ని సంవత్సరాలుగా మెడిసిన్ ర్యాంకుల్లో విజయఢంకా మోగిస్తున్న ఏకైక విద్యాసంస్థ... గెలుపుకి మరో పేరు సునందా... విజయానికి అసలైన దారి సునందా...'' (సలీం : 2010, పుట - 102) అంటూ కార్పోరేట్ విద్యాసంస్థలు గ్లోబల్ ప్రచారం చేస్తున్నాయి. ఈ పోటీలో ఒక కళాశాలకు మించి మరొక కళాశాల ముందుంటున్నాయి.

పై అంశాల్ని పరిశీలిస్తే నేడు కార్పోరేట్ ప్రవేట్ విద్యాసంస్థలు తమ ప్రచారాన్ని ఏ విధంగా చేస్తున్నాయో అర్థమవుతుంది. ప్రవేట్ విద్యాసంస్థల ప్రచారం ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కువైంది. ఎక్కడ చూసిన ప్రచార పత్రాలు, రాతలే మనకు నేడు విరివిగా కనిపిస్తున్నాయి.

కార్పొరేట్ విద్య వ్యాపారం :

సామాజిక శ్రేయస్సే లక్ష్యంగా అందరికీ అందిచాల్సిన విద్య నేడు వ్యాపారమైంది. సామాజిక శ్రేయస్సుతో ఎలాంటి సంబంధంలేని పెట్టుబడిదారీ లాభాపేక్ష నుంచి పుట్టిన ఆలోచన ఇది. ఫలితంగా విద్యారంగానికి ప్రభుత్వ వ్యయం తగ్గి మరో వైపు ప్రవేటురంగంలో విద్య వ్యాపార సాధనమైంది. దీన్ని కొనగలిన వారే నేడు విద్యను పొందుతున్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మారిపోతున్నటు వంటి పరిస్థితులకు అనుగుణంగా ప్రవేట్‌విద్యాసంస్థలు కోర్సులను ప్రవేశపెడుతూ తద్వారా లాభార్జనే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ''బాగా చదివే వాళ్ళందర్నీ చేర్చి జె.యల్ వన్లోనో, టూలోనే వేశారు. బెస్ట్ లెక్చరర్లందరూ ఆ రెండు సెక్షన్లకే వెళ్తారు. ఐ. ఐ. టీ. కోచింగ్ తీసుకొనే వాళ్ళకి సెపరేట్‌గా మరో సెక్షన్ ఉంది. యింతే కాలజేజి యాజమాన్యం కాన్సన్‌ట్రేషన్ అంతా వీళ్ళమీదే ఉంటుంది. కాలేజీకి అవసరమైన ర్యాంక్‌ల పంట పండించేది వాళ్ళే. మిగతా సెక్షన్లూ విద్యార్థులూ వాళ్ళ కాలేజీకి అవసరమైన ఆర్థిక వనరుల్ని సమకూర్చి పెట్టడానికి ఉపయోగపడేవాళ్ళే, అంతా వ్యాపారం తెలుసా?'' (సలీం : 2010, పుట - 79) ఈ అంశాలను పరిశీలిస్తే కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపార దోపిడీ ఏ విధంగా ఉంటుందో అర్థమవుతుంది.

నేటి ప్రవేట్‌విద్యాసంస్థలు పోటీ పడుతూ విద్యార్థుల్ని పరీక్షలకు తయారుచేస్తున్నారు. విద్యా సంస్థల ధన దాహానికి విద్యార్థులను సాధనాలుగా ఎలా వాడుకుంటున్నాయో ఇలా... ''రోజు గంటల తరబడి చదివిందే చదివిస్తారు. సబ్జెక్ట్ అర్థమైనా కాకున్నా, బేసిక్స్ మీద అవగాహన లేకున్నా, ఫలానా ప్రశ్నకు ఫలానా జవాబులు అనేది మాత్రం మెదళ్లో రికార్డయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి అవసరమైన రకరకాల టెక్నిక్‌లు చెప్తారు. అందుకే మార్కులు వస్తాయి కానీ సబ్జెక్టు శూన్యం. ఒక ప్రశ్నని కొద్దిగా తిప్పి అడిగితే సమాధానం చెప్పలేరు. ఏం చేస్తాం పేపర్లో

పెద్దపెద్ద ప్రకటనలిచ్చుకోవాలిగా బిజెనెస్ కదా" (సలీం : 2010, పుట - 77) అంటూ అనూష అభిప్రాయపడుతుంది. ఈ అంశాలను పరిశీలిస్తే ప్రపంచీకరణ పేరిట శర వేగంగా పుట్టుకొస్తున్న కార్పొరేట్ ప్రవేట్ పాఠశాలలో ధోరణి అర్థమవుతుంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే సామాజిక ప్రయోజనం కలిగిన విద్య పూర్తిగా కార్పొరేట్ వర్గాల గుత్తాధిపత్యం కిందికి వెళుతుందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
2. పడగ నీడ నవల - సలీం. శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్

❖ ❖ ❖

"ఆధునిక తెలుగు సాహిత్య - ప్రపంచీకరణ ప్రభావం" - రైతు జీవితం

- కె. రంగనాయకులు, పాఠశాల సహాయకులు (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిప్పగిరి, కర్నూలు జిల్లా.

రైతు జీవితం :

రైతు అంటే అన్నదాత ఈయన లేకపోతే ప్రపంచమే ఆహారం కోసం అతలాకుతలం అవుతుంది. అందుకే అన్నదాతని దేశానికి వెన్నెముక అన్నారు.

రైతు వృత్తి వ్యవసాయం అనగా వ్యవ అనగా ఖర్చు అని అర్థం. సాయం అనగా సహాయం అని అర్థం. వ్యవసాయం అనగా తన రెక్కలను ఆడించి ఇతరులకు సహాయ పడేవాడని అర్థం. తన రెక్కల కష్టాన్ని ఖర్చు చేసి ఇతరులకు సహాయం చేసేవాడని అర్థం.

వ్యవసాయం :

వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా భావించేవాడు రైతు. వ్యవసాయం కొత్త రాతియుగంలోనే మొదలైంది. అప్పటినుంచి నేటివరకు వ్యవసాయం అనేక రకాల పుంతలు తొక్కుతూ వస్తుంది. ఇందులో రైతు పావుగా వాడబడ్డాడు. రైతు జీవితం దుర్భరం. ఇందుకు మనం ప్రస్తుతం చూస్తున్న దీనగాధలు అనేకం. ప్రతిరోజు దేశంలో ఎక్కడో ఒకచోట రైతు ఆత్మహత్యలు దినపత్రికలలో చూస్తూనే వున్నాం. ఈయనే లేకపోతే ఉన్నవారికి కడుపు నింపేదెలా ? ఎవరి గింజా గట్రా వారే పండించుకుంటారా? లేదే కనుక రైతే వుంటే ప్రతి ఒక్కరి ఆకలి మంటలను తీరుస్తూ తన కడుపును కాల్చుకుంటున్నాడు. అంతేకాక రైతు తన పొలంలో పండించే పంటకు గిట్టుబాటు ధరల్లేక అల్లాడి కృంగి కృషించి తనువులు చాలించిన వారు అనేకం.

ప్రపంచీకరణ నేపథ్యంలో రైతు జీవితం : ఇందులో రైతు జీవితం చిద్రమైందనే చెప్పాలి. ఎందుకంటే రైతు వేసవికాలంలో పొలం పనులనుండి పంట చేతికి వచ్చేవరకు అనేక కష్టనష్టాలను చవి చూస్తూనే వున్నారు. రైతు మోసపోవడమే కానీ మోసం చేయలేదు. పొలాన్ని దుక్కి దున్ని పొలం చదును చేసి పంట వేసి పంటకు చీడపీడలు పట్టకుండా పురుగు మందులు వాడి, ఎరువులు వేసి, పంట కోత కోసి నూర్పిడి పట్టి ధాన్యాన్ని ఇంటికి తెచ్చి పెట్టుబడులకు పంటను అమ్మేకుపోతే మధ్య దళారీల మాయమాటలకు బలియైపోయి గిట్టుబాటు ధరలందక చేతిలో ఒట్టి రూమాలు పట్టుకొని ఇంటికి వస్తే ఆ ఇంటి ఇల్లాలు తన భర్త ఏమి తెస్తాడోనని ఎదురు చూస్తున్న ఆలికి ఎదురయ్యే సమస్యలు కడుపు నిండా అన్నం తినక పస్తులతో పిల్ల జల్ల ఆకలి మంటలతో తల్లడిల్లిపోతున్న రైతు జీవితం ఏమని చెప్పేది.

అంతే రైతు బ్రతుకులు
కన్నీరే కడకు కడుపు నింపు
కష్టాలే శ్మశానానికి దారి
చవి బారిన బ్రతుకులు !
అంతే రైతు బ్రతుకులు
అణగార్చిన విధిరాతలు
మోసం చేసే మధ్య దళారీలు
భరించక తప్పదు బాధల మోపులు !
అంతే రైతు బ్రతుకులు
తుఫానులో తడిసిన పంట
చేతికందక బ్రతుకు తంట
ఇంటిల్లిపాది కన్నీరు కార్చు !
అంతే రైతు బ్రతుకులు

తిరిపెముకు గుప్పెడు మెతుకులు
అడ్డు వచ్చే మానములు
కడకు కాటికి చేర్చెను !

రైతుకు బ్రతులు బాగుపడడం చూడలేదు. వస్తే అతి వృష్టి లేకుంటే అనావృష్టి ఈ రెండింటి మధ్య కొట్టు మిట్టాడుతూ బ్రతుకు బండిని ఈడ్చుకొస్తున్నాడు. విధి రాతలు తలక్రిందులై తనువును చాలిస్తున్నారు. తుఫానులో తడిసిన పంటను మధ్య దళారీల చేతిలో మోసపోయి కన్నీటితో కడుపు నింపుకొన్నాడు. ఎవరైనా పిడికెడు అన్నం పెట్టడానికి వస్తే రైతు దానిని స్వీకరించడు. దానిని అవమానంగా భావిస్తాడు. తుదకు తనువును చాలించడము జరుగుతున్నది.

ప్రపంచీకరణ నేపథ్యంలో రైతు ప్రతిచోట మోస పోవడమే జరుగుతుంది. సేద్యపు పనిముట్లు దగ్గర నుంచి విత్తన గింజలు, గిట్టుబాటు ధరలు, పురుగు మందులు ఎరువులు వగైరా వంటివి సమకూర్చుకోవడము గగనమై పోతుంది. కొనే వస్తువులు ధరలు ఆకాశానికి ఎదిగాయి. రైతు అమ్మే పంట ధరలు పాతాళానికి అణచి వేయ బడ్డాయి. ఇది ఇప్పటి రైతు జీవితం.

అంతే రైతు బ్రతుకులు
అణగారిన రైతు పంట ధరలు
అవే ధరలకు బలియైను
పాపం పుణ్యం అనే నాథుడేడి ?
అంతే రైతు బ్రతుకులు
కృషి తప్ప ఇంకేమి యెరుక
ఫలమును ఆశించి పండు టాకాయె
పరిపరివిధాలు ఆలోచనాలాయె !

మన దేశంలో, రాష్ట్రంలో సారవంతమైన భూములు, అనుభవజ్ఞులైన కష్టపడే రైతులు, ఆదాయాలు పెరిగినా ప్రజా ప్రభుత్వాలు వుండికూడా అసంఖ్యాక రైతులు ఎందుకు అథోగతి పాలవుతున్నారు ? ఎందుకు బల వంతపు మరణాల పాలవుతున్నారు. అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి సాధిస్తున్న ఒక్క వ్యవసాయ రంగము మాత్రమే ఎందుకు అభివృద్ధి చెందలేదు ? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుకకు తగ్గకుండా మొండి ధైర్యంతో రైతులు సేద్యం చేస్తున్నారు కాబట్టే అన్నం ఈమాత్రమైనా దొరుకుతుంది. వారు విరక్తి చెంది ఒక యేడాది కాడి కిందకు పడేస్తే మన దేశమంతా అధోగతి కాక తప్పదు.

అంతే రైతు బ్రతుకులు
అలుపెరుగని శ్రామిక రైతు
అందినది తిని ఆకలి తీర్చుకొని
పొద్దుగుంకే వరకు కష్టపడె !
అంతే రైతు బ్రతుకులు
అక్కరకు రాని రాయితీలు
అందని రుణ మాఫీలు
అన్ని వున్న భూకామందులకే అన్నీ అందె !

రైతు పొలంలో పని చేస్తూ అలుపు యెరుగక కడుపు మాడ్చుకొని పని చేస్తాడు పొద్దు పోయేవేళకు ఇంటికి వచ్చి ఉన్నదేదో తిని లేకపోతే కష్టాలు, సమస్యలు చెప్పు కొనే ఆలి బాధలు విని నిదురులేక తెల్లవారె ముందు పొలం బాట పడతాడు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతు బాధలు తీరలేదు. ఎన్ని రాయితీలు, రుణమాఫీలు చేసినా నిజమైన ఇబ్బంది పడే రైతుకు అక్కరకు రాలేదు. భూకాంధులకే అన్నీ అందుతున్నాయి. అది లేదు గిది లేదు అంటే అధికారి చేయి తడవందే రైతు చేతికందదు. పాలకులు అంగీకరించినా అంగీకరించక పోయినా క్షేత్ర స్థాయిలో జరుగుతున్నది సత్యము.

అంతే రైతు బ్రతుకులు
ఫలసాయమందే దశలో విపత్తులు
విధ్వాంసానికి రైతుల కష్టార్జితం
పొలాలలోనే కుళ్లి పోతుంది పంట !
అంతే రైతు బ్రతుకులు
కొలు రైతులకు సేద్యం గిట్టుబాటు కాక
భూయజమానులకు కిస్తీలు కట్టలేక
అప్పుల ఊబిలో కూరుకుపోయె రైతన్న !

అకాల వర్షాలకు పంటలు దెబ్బ తిని రైతు చేతికందక కష్టార్జితం అంతా పాలాలోనే కుళ్లిపోతుంది. దీనితో రైతు చావుగంట చల్లగా పేపర్లలో (దినపత్రికలలో) పొద్దునే చూస్తున్నాం. కౌలు రైతులకు వ్యవసాయమే గిట్టుబాటు కావడం లేదు. భూ యజమానికే అన్నిరకాల ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. వడ్డీకి తెచ్చిన సొమ్ములను కట్టలేక బలవన్మరణానికి పాల్పడుతున్నారు.

ప్రభుత్వాలు నాటినుంచి నేటివరకు రైతులను ప్రోత్సహించి వుంటే వ్యవసాయ రంగము బాగా అభివృద్ధి చెంది వుండేది. వ్యవసాయం గిట్టుబాటు కాక చిన్న, సన్నకారు రైతులు కౌలుకిచ్చి పట్టణాలకు వలసలు పోతున్నారు. ప్రభుత్వ పథకాలు అసలైన చిన్న సన్నకారు రైతులకు అందితే ఈ విధమైన రైతు ఆత్మహత్యలు జరిగేవా ?

ప్రపంచీకరణ నేపథ్యంలో రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ కుదరదు, సబ్సిడీలు అసలే లేదు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు లభ్యత లేక ప్రభుత్వం అందించే సాయం పక్కాగా లేక ఈ వ్యవసాయ రంగము కుదేలవుతుంది. ప్రపంచ బ్యాంకు షరతులకు ప్రభుత్వాలు తలొగ్గక తప్పడం లేదు. దీనితో రైతు జీవితం ఆహ్లాదకరంగా లేక అలసిన జీవితము అయ్యి చివరికి శ్మశానానికి దారెటు అన్నట్లుగా జీవితాన్ని విరిగిన బండి చక్రాల మీద సాగుతున్నది.

❖ ❖ ❖

'దాడి' నవలలో రైతు జీవనం - ప్రపంచీకరణ ప్రభావం

– కటుకం శారద, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, యస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ డిగ్రీ, కళాశాల, కరీంనగర్.

'సాహిత్యం సామాజిక ప్రతిబింబం'. నాటి కాలం నుండి నేటి వరకు ఒక వ్యక్తిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది సాహిత్యం. ఎంతో మంది సాహిత్యకారులు వారి కాలంలో జరిగిన సంఘటనలు, సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని చక్కని సాహిత్యాన్ని సృష్టించి, ముందు తరాల వారికి అందించారు. సూర్యుని తాపానికి వాడిపోయిన పూవులకు చంద్రుని కాంతి ఊరట ఇచ్చినట్టు పరతంత్ర పాలనలో వాడిపోతున్న తెలంగాణ భాషకు చంద్రకాంతి లాంటి హాయిని ఇచ్చి ఆ భాషను తన రచనల ద్వారా పునర్జీవింప చేసిన రచయిత, కథకుడు, నవలాకారుడు పెద్దింటి అశోక్ కుమార్. వీరు 6 ఫిబ్రవరి, 1968 వ సంవత్సరంలో సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో మల్లమ్మ, అంజయ్య దంపతులకు జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించి పాధ్యాయులుగా స్థిరపడ్డారు. తెలుగు సాహిత్యంపై అభిమానంతో 1999 నుండి అవిశ్రాంతంగా రచనలు చేస్తున్నారు. వీరు ఇప్పటి వరకు ఆరు నవలలు, 50 కి పైగా కథలు, అనేక వ్యాసాలు, నాటికలు, కొన్ని సినిమాలకు మాటలు అందించారు. రచయిత ఊరు, కుటుంబం, అక్కడి మనుషుల భాష, జీవితపు అలవాట్లు, జీవన వైవిధ్యం, కట్టుబాట్లు మొదలగునవి వారిని సాహిత్యకారునిగా మలిచినవి. అందుకే వారి రచనల్లో పాత్రలు సజీవంగా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంతో పాటుగా తన రచనలలో కూడా వైవిధ్యాన్ని చూపుతూ ఎందరో రచయితలకు స్ఫూర్తినిస్తున్న రచయిత పెద్దింటి అశోక్ కుమార్.

వ్యవసాయ నేపధ్యంగా తెలంగాణా ప్రజల జీవన చిత్రణను ప్రతిబింబించిన నవల 'దాడి'. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా మల్లారెడ్డి పేట అనే పల్లెటూరి రైతు బిడ్డ భూమయ్య. ఆ రైతు జీవనాన్ని, రైతు జీవనంలో ఎదుర్కొన్న కష్టాలను, అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చిత్రించారు రచయిత. గూడ నుంచి యాతానికి, యాతం నుంచి మోటకు, మోట నుంచి రాటుకు, రాటు నుంచి ఇంజనుకు, చివరకు కరెంటు మోటరు, బోరుబావి వరకు శ్రమ దూరమై పర్యావరణం మీద దాడి ఎలా జరిగిందో వివరించినారు. చుట్టూ నీళ్లతో ఉన్న ఆ పల్లె తరం నుండి తరం మారగానే ఎలా ఎండుకు పోయిందో వాస్తవానికి దగ్గరగా, సహజంగా చిత్రించినారు.

వాగు, చెరువు, బావులు ఎండి పోవడంతో ప్రజలు ఉన్న ఊరును విడిచి మస్కట్, దుబాయి,బొంబాయి వంటి ప్రాంతాలకు, ఇతర నగరాలకు, పట్టణాలకు వెళ్లి వలన కూలీలుగా మారిన పరిస్థితులను వివరించినారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా నీళ్లు దొరకక ఒక ఊరు ఖాళీ అయిన విధానాన్ని హృదయ విదారకంగా రచయిత చిత్రించారు.

నవలలో ఎంకయ్య, ఎంకవ్వలు భార్యాభర్తలు. రైతు కుటుంబంలో పుట్టి, వ్యవసాయం వృత్తిగా చేసుకొని జీవనం సాగించేవారు. వారికి మగ సంతానం లేనందు వల్ల భూమయ్యను ఇల్లరికం తెచ్చుకున్నాడు. 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్టుగా భూమయ్య చిన్నతనం నుండి కష్టపడే మనస్తత్వం కలవాడు. ఓర్పు, నేర్పు కలవాడు. ఎంకయ్య అన్న మల్లయ్య, తమ్ముడు ఎల్లయ్య. వారికి ఇద్దరేసి మగ సంతానం. ముగ్గురు అన్నదమ్ములకు పొత్తుల మూడు చోట్ల ఐదేసి ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి ఉన్నది.నీటి పారుదల సౌకర్యంలేని భూములు కావటం వల్ల సంవత్సరానికి ఒకచోట సాగు చేసుకునేవారు. గూడ, యాతం వంటి వాటితో సాగు చేసేవారు.

ఊరిలో కమ్మరి, కుమ్మరి, వడ్ల, బెస్త, తెనుగు, ఔసుల, మేర, మాల, మాదిగ వంటి అన్ని వృత్తుల వారుండేవారు. వ్యవసాయం చేసేవారు ఎక్కువ సంఖ్యలో ఉండేవారు.ఊరి నుండి చెరువు,వాగు ,అనేక కాలువలు పారుతూ ఊరంతా సస్యశ్యామలంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఆ ఊరికి ఎవరైనా వస్తే 'ఈ ఊళ్లోనీళ్లు తాగి బతుకవచ్చు' (పుట'23) అని అనుకునేవారు. ఊరిలో ఉండే, చక్కని పంటలు పండే భూములను అన్నదమ్ములకు ఇచ్చి, వాగు అవతల ఉండే భూమిలో అందరి సమ్మతితో ఎంకయ్య బావి తవ్వుకున్నాడు.బావి తవ్విన రోజులల్లో వివిధ వృత్తి పనుల వారికి చేతినిండా పని దొరికింది. ఎంకయ్య బావికి మోటను అమర్చి సాగు చేస,చక్కని పంటలు పండించినాడు. అప్పటి నుండి అతన్ని అందరు మోటబాయి ఎంకయ్య అని పిలిచేవారు. 'అరె ఎంకయ్య మోటబాయి దగ్గర సచ్చిమి తారంగ మాడుతుందిరా' అని ఊరి ప్రజలంతా అనుకున్నారు. ఎంకయ్య పంటను, పనిని, బావిని చూసి, చెరువు పారుకం లేని వారంతా మోటబాయిలు తవ్వుకొని సాగు చేయటం మొదలు పెట్టినారు.

ఎంకయ్య పచ్చగా బ్రతకటంతో అన్నదమ్ములు ఓర్వ లేక పోయినారు.అన్నదమ్ములుద్దరు కూడ బలుక్కున్నారు. ఒకరోజు ఎల్లయ్య మోటబాయి పొలంలో నాగలికట్టి, తనకూ పొలంలో, బావిలో హక్కు ఉన్నదని ఎంకయ్య మీదికి మర్రవడినాడు.చివరికి ఊరి పెద్ద కాందారి రాజయ్యకు చెప్పినా ప్రయోజనం లేకపోయింది.కుల పెద్దలు మల్లయ్య, ఎల్లయ్యకు అమ్ముడుపోయి ఎంకయ్యదే తప్పు అని, తండ్రి ఆస్తిలో అన్నదమ్ము లందరికీ హక్కు ఉంటుందని తీర్పు చెప్పినారు. కుల పెద్దలు, అన్నదమ్ములు తనను మోసం చేస్తున్నారని ఎంకయ్య తెలుసుకున్నాడు.

ఆ ఊరి దొర సౌమ్యుడు, ప్రజల కష్టాలు తెలిసివాడు. మగ సంతానం లేనందువల్ల ఒక్కగానొక్క బిడ్డకు పెళ్లి చేసి అల్లున్ని ఇల్లరికం తెచ్చుకున్నాడు. అతడు ప్రతి ఏకాదశినాడు లింగన్నపేట గడీలోకి వచ్చి అనుమాండ్ల గుడిలో పూజలు చేసి వెళ్లుతాడు. కనుక ఆ సమయంలో తన బాధనంతా అతనితో చెప్పుకొని సమన్యను పరిష్కరించుకోవాలని ఎంకయ్య అనుకున్నాడు. భమయ్యను తీసుకొని తోవలో బొంగురాలాట మొదలు పెట్టినాడు. నిండు వానాకాలం, రైతులంతా పనులతో తీరిక లేకుండా ఉండే సమయంలో బొంగురాలు ఆడు తున్న ఎంకయ్య మీద కోపగించుకున్నాడు దొర. 'దొరా నీ బాంచెన్...కాళ్లు మొక్కుత. నాకు పని యాడిది. తోడు కున్న బాయిని అన్నదమ్ములు గుంజుకున్నరు' (పుట.74) అని జరిగినదంతా ఎంకయ్య ఏడ్సుకుంట దొరతో చెప్పి నాడు. దొర జరిగిన విషయం తెలుసుకొని మల్లయ్య, ఎల్లయ్యలను గట్టిగా మందలించి, వారిని చెరో బావి తవ్వుకోమని, మోట బాయిని ఎంకయ్యకు చెందునట్లుగా తీర్పు చెప్పినాడు.

ఒక సంవత్సరం వర్షాలు కురవక పోవటం వల్ల చెరువు, బావులు ఎండిపోయినవి. ప్రజలంతా వానలు కురవాలని హారికథలు, భజనలు, కప్పతల్లి ఆటలు ఆడినారు. దొర ప్రజలను సమావేశ పరిచి వారి సలహాను కోరినాడు. వాగుకు అడ్డుకట్ట కట్టి కాలువల ద్వారా నీటిని చెరువులోకి మళ్లించాలని భూమయ్య చెప్పిన ఆలోచనను అమలు పరిచినాడు దోర. దాంతో బీడు భూములన్నీ సాగులోకి వచ్చినవి. భూమయ్య పొలంలో మొలకకు బదులు వడ్లను చల్లి చక్కని పంట పండించి అందరికి మార్గదర్శి అయినాడు. అప్పటి నుండి యాసంగి, వానాకాలం కాక చింతపువ్వు కార్తి అనే కొత్త పంట పండించటం మొదలై నది.

ఎంకయ్య కొత్త ఇంటిని కట్టుకున్నప్పుడు కావలసిన కట్టె కోసం పక్కనున్న అడవి నుండి చెట్లను నరికి తెస్సున్నారు. అన్నదమ్ములు ముగ్గురు మూడు బండ్లు చేయించుకున్నారు. అన్నదమ్ములు బావులు తవ్వు కున్నప్పుడు మనస్పర్ధలు కూడా మరిచిపోయి ఎంకయ్య, భూమయ్య వారికి అన్ని వాధాల సహాయం అందించి

నారు. ఈరిలో జనాభా పెరగటం వల్ల ఊరు పెరుగు తుంది. పొయ్యిల కట్టెలకు, ఇండ్ల నిర్మాణాలకు, ఎడ్ల కొట్టాలకు కావలసిన కట్టె కోసం చెట్లను నరకటంతో అడవి తరిగి పోతున్నది. ఊరు దిగితేనే తీరొక్క కట్టె దొరికేది, ఇప్పుడు కోపుల దాకా పోతేకాని కట్టె దొరుకుత లేదు. ఊరు పెరిగి అడవి తరిగి పోతుంది (పుట.91).కట్టెల కోసం భూమయ్య బావ మరుదులతో అడవికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ఎడ్లబండి కింద పడి ప్రమాదానికి గిరియైనాడు. దారులు సరిగా లేక పోవటం వల్లనే ప్రమాదం జరిగిందని భావించిన ఎంకయ్యతో పాటు ఊరి ప్రజలంతా గుంతలు పూడ్చి తొవ్వల నిర్మాణం చేసినారు.

ఎంకయ్య ప్రమాదవశాత్తు బావిలోపడి చనిపోయి నాడు. భర్త మీద బెంగతో ఎంకవ్వ చనిపోయింది. ఊరు ఊరంతా బాధపడింది. ఎల్లయ్య, భూమయ్య ఒంటరి వారు అవుతారు. అదే సంవత్సరం మోటబాయిలు, షాదబాయిలు ఎండిపోయినాయి. ప్రజలు బాయిలను లోతు తవ్వడం, పూడికతీత పనులు వంటివి చేసినారు. నిండు కరువుల కూడా ఎండిపోని బాయిలు ఎందుకు ఎండిపోయినవో ప్రజలకు అర్థం కాలేదు.ఎంకయ్య బాయిల మునిగి సచ్చిండు.ఎంకవ్వ నీళ్లకు శాపం పెట్టింది.అందుకే బాయిలు ఎండిపోయినవి. వారి పేరు మీద గుడి కట్టి, ముసలవ్వ, ముసలయ్య బొమ్మలు పెట్టి పండుగ చేయాలని అనుకున్నారు. తోటకాడికి, బాయిల దగ్గరికి వంటలకు వెళ్లి శాతకొక యాటపిల్లను కోసి, ఇంటికొక పాలువేసి పండుగ చేయడం ఆన వాయితీగా మారింది.

తల్లిదండ్రి మీద బెంగతో ఎల్లవ్వ అనారోగానికి గరి అయింది. స్థల మార్పిడి జరిగితే కొంత మార్పు ఉంటుందని భావించిన భూమయ్య ఆమెను తన అన్నల దగ్గరికి తీసుకొని వెళ్లుతాడు. ఆవులను లింగానికి, భూములను మామలకు అప్పగించి రెండు సంవత్సరా లకు తిరిగి వస్తాడు. అప్పటికే మామలు, బావమరుదులు ఇంటిని, భూములను, ఆవుల మందను మలుపుకున్నారు. 'ఇటు ఇల్లును దోసుకున్నరు.అటు దొడ్డిని మలుపు కున్నరు. అయ్యవ్వ పోయినట్టు మేము కూడా సచ్చిపోతే వాళ్ల కండ్లు నల్లవడుతుండె' (పుట.117) అని ఎల్లవ్వ బాధపడింది.పెదనాన్న,చిన్నాన్నలను కలిసి తన భూములు తనకు ఇవ్వాలని అడుగుతుంది. 'యాడిదే నీది. నాది నాదంటున్నావు. పాలులేదు. ఏం లేదు. ఆడపిల్లవు. ఒగింటి కోడలువు. నీ ఇల్లు ఇదిగాదు. అత్తగారిల్లు. అక్కడ ఏమన్న ఉన్నదేమో పంచుకోపో. ఇంకోసారి నా పాలు నా పాలని అడుగకు అని కోపగించినాడు మల్లయ్య.

భూమయ్య, ఎల్లవ్వలు తాము కష్టపడిన మోట బాయి పొలం సాగు చేద్దామని పోతే అందరూ కలిసి వారిపై దాడి చేసి భూములు లాక్కొని, ఇంటి నుండి తరిమి వేసినారు. భూమయ్య రెండవసారి దొర సహా యాన్ని కోరి మోటబాయి పొలాన్ని, ఆవుల మందను, ఇంటిని తిరిగి దక్కించుకున్నాడు. ఊరిలో సాగుకు కావలసిన నీటి పారుదల అనుకూలం కావటం వల్ల వరి పంటలు పండించినారు. పశువులకు నిలువ నీడ లేకుండా పోయింది. గడ్డి దొరకక పావటం వ్ల ఆవుల మందలు తగ్గినవి. మందల బాగు కోసం ఊరంతా కాట్రేపుల గుడి దగ్గర బోనాల పండుగ చేసినారు. భూమయ్య కొడుకు ఎంకన్న చదువు పూర్తి కాగానే ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. స్నేహితులు చేరినా తను చేరలేదు. 'వాళ్లకు భూములు లేవు. జాగలు లేవ్వు. బతుకు దెరువు కోసం పోతున్నారు. నీకేం తక్కువరా జాయి జాతు లేదా, జమీను లేదా నలుగురిని సాదుతవు. ఒకనికి పెట్టలి కానీ, ఒకని దగ్గర జీతముంటరా' (పుట.151) అని తండ్రి చెప్పిన మాటకు విలువ ఇచ్చి, స్వశక్తిని నమ్ముకొని ఎంకన్న వ్యవసాయం చేసినాడు.

భూమయ్య మోట గొడుతూ ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాడు. మోట స్థానంలో రాటు తెచ్చినాడు. అందరు రాట్లు పెట్టడంతో నీళ్లు లోతుకు చేరి బాయిలు ఎండి పోయినవి. తిరిగి బాయిని లోతు తవ్వించి డీజీల్

ఇజన్ పెట్టినాడు. ఊరంతా కూడా ఇంజన్‌లు తెచ్చినారు. వాగులకు, ఒర్రెలకు ఎక్కడ పడితే అక్కడ ఇంజన్‌లు పెట్టడం వల్ల నీరావ పంటలయి పిట్ట వాలుదామన్నా జాగలేకుండా అయింది. నీళ్లు లోతుల పడటం వల్ల ఇంజన్ నీళ్లను ఎత్తుకోలేక పోయింది. దాంతో కరెంటు మోటర్లు తెచ్చినారు. వచ్చిపోయే కరంటుతో కష్టాలు తప్పటానికి ఆటోమేటిక్ షాటర్ తెచ్చుకున్నారు. కొత్త ఎరువులు, పురుగుల మందులు వచ్చినవి. ఆవుల మందలు తగ్గిపోవటం వల్ల పెండ ఎరువు స్థానంలో ఎరువు వేసే పరిస్థితి వచ్చింది. అడవి తరిగి పోవటం వల్ల కట్టెలు లేక ఇటుక సిమెంటుతో ఇల్లు నిర్మించు కున్నారు. పాయ్యిలకు కట్టెలు లేక పోవటం వల్ల గాంచు నూనెతో వంట చేయటం వంటి మార్పులు వచ్చినవి.

ఎంకన్న కొడుకు మల్లేం అతని కాలంలో కరువు వచ్చి పంటలు పండలేదు. అందువల్ల అతడు బోరు వేయించి నాడు. తిరిగి వ్యవసాయానికి మొదటి కళ వచ్చింది. ఎక్కడ బావులు కనిపించటం లేదు. అన్ని బోల్లే. పొలాల్లో నాగండ్లతో పాటు ట్రాక్టర్ల వాడకం పెరిగింది.

ప్రజలలో మార్పు వచ్చింది. సైకిండ్ల మీద తిరుగు తున్నరు. పొద్దున సాయంత్రం రెండుసార్లు బస్సు వస్తుంది. మడిగెలు దుకాండ్లు అయినవి. షావుకార్లు సేట్లు అయినారు. కొత్త విత్తనాలు, కొత్త ఎరువులు వచ్చినవి. పురుగులు వచ్చినవి. కొందరు కరెంటు దగ్గర ఇండ్లను నిర్మించుకన్నారు. పొట్టి వరి కంటె తక్కువ కాలంలో పండే పంటలను పండించాటనారు. పంటను కల్లం దగ్గరనే షావుకార్లకు అమ్మేవారు. కాపు కులం వాళ్లే కాక అన్ని కులాల వాళ్లు భూమిని దున్నటం జరుగు తున్నది. చేతుల పని కంటే వాళ్లకు డ్డు ఎవుసమే తిండి పెడుతున్నది. ఊరిలోని వాగు, చెరువు, కరెంటు బాయిలు, బోరు బావులు ఎండిపోయినవి. వ్యవసాయం మూలకు పడింది. వాగులో, చెరువులో బోర్లు వేసిన ప్రయోజనం లేకుండా పోయింది. ఊరిలో వేసిన బోరు బావిలోని నీటిని ట్యాంకర్ల ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. నీళ్ళ ట్యాంకు ద్వారా నీటిని ప్రజలకు అందిస్తున్నారు. కొందరు నీళ్లను కొనుక్కొని తాగుతున్నారు.

ఊరి జనంలో చాలా మంది బ్రతుకు దెరువు కోసం మస్కట్, దుబాయి, సూరత్, బీవండి ప్రాంతాలకు వెల్లినారు. స్త్రీలు బీడీలు చాసి కాలం వెళ్ల దీస్తున్నారు. పాలిచ్చే బర్లు తప్ప, నాగలి నడిచే ఎద్దులేదు. చివరకు మేఘమధనం వంటి ప్రయోగాలు కూడా ఆ ప్రాంతంలో విజయవంతం కాలేదు.నవలలో నాలుగు తరాల వ్యక్తులు ఎంకన్న- భూమయ్య-ఎంకన్న-మల్లేశ్‌లు కనిపిస్తారు. వారి తరాలలో వచ్చిన మార్పులు చిత్రించినారు.

వానలు గొడితే అది నిండు వానాకాలం. వానలు లెవ్వు. అందుకే అది ఎండకాలమైంది. స్వాతిల వానలు గొడితే సవలోకం బతుకుతదట. ఒక్క స్వాతిల గాదు. ఏ కార్తిల వానలేదు. కాలాలు ఎన్ని అడిగితే ఎండకాలం, సలికాలం రెండే కాలాలు అనేతట్టున్నరు జనం (పుట.3). నేను చిన్నగుండంగ ఈ మడ్లల్ల నీళ్లు ఊరు తుండెనట. తర్వాత యాతం పొక్కలు ఎండి మోటబాయిలల్లనే ఊరినయి. ఇప్పుడు కరెంటు బాయిలల్లనే ఊరు తున్నయి. అద్దగజం పొక్క తవ్వితే ఊరే నీళ్లు ఇరువై గజాలకు దిగినయి గదా రేపు నీ కొడుకు తరం ఎవుసం ఎట్ల జేస్తరురా అన్న భూమయ్య మాటల్లో ఆరాటం, ఆందోళనతో పాటు భవిష్యత్తులో రాబోయే నీటి యెద్దడిని తెలుపుతుంది.

ఇది కరువు గాదు. కరువైతే తిండి దొరుకదు. కాని అంతో ఇంతో తిండి దొరుకుతుంది. నీటి కరువైతే నీళ్లు దొరుకయి. కాని నీళ్లే లెవ్వు. నీళ్లు దొరకక పోవటం వేరు, నీళ్లు లేకపోవటం వేరు. నీటికి మూల వనరు వర్షమైతే ప్రత్యామ్నాయ వనరు భూమి. ఇప్పుడు భూమి తల్లి గర్భం వట్టి పోయింది. 400 ఫీట్ల దాకా బోర్లు వేసినా నీటి చుక్కలేదు. ఉన్నా అవి విషపు నీళ్లే (పుట.2). ఇది నవలలో కనిపించే విషమ పరిస్థితి. దీనికి కారణాలను పరిశీలించుదాం.

ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆర్థిక వ్యవస్థలు, పరిశ్రమలు, మార్కెట్లు, సంస్కృతులు, విధానాల రూపకల్పన అన్ని సమ్మిళితం కావటమే ప్రపంచీకరణ అని ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక నిర్వచించింది.ఈ ప్రపంచీకరణ అనేది మానవ సమాజం అభివృద్ధి చెందుతున్న దశలో ఏర్పడిన ఒక అనివార్య దశ. ప్రపంచీకరణలో భాగంగానే ఐరోపా దేశాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలను వలసలుగా ఆక్రమించి అక్కడి సహజ సిద్ధమైన అభివృద్ధిని ఆటంక పరిచి తాము సాధించిన అభివృద్ధిని వాటిపై రుద్దినవి. సాధారణంగా ఉత్పత్తి శక్తులు వ్యవసాయదారులు, వ్యాపారులు, చేతివృత్తులు, పరిశ్రమలు కాగా భూములు, చిన్న, చిన్న పరిశ్రమలు ఉత్పత్తి సాధనాలు అవుతాయి.

ప్రపంచీకరణ ఎక్కువగా పారిశ్రామికీకరణను ప్రోత్సహించింది. పెట్టుబడి అసమానతలు పెంచుతుంది. విధ్వసం చేస్తుంది. ప్రపంచ వాణిజ్య సంస్థలో దేశాలన్ని భాగస్వామ్యం పొంది, ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకొని అప్పులు తెచ్చుకున్న తర్వాత పెట్టుబడి తన విధ్వంసాన్ని వేగవంతం చేసింది. అపరిమిత వస్తు ఉత్పత్తి కోసం ప్రకృతిని విధ్వంసం చేసే లక్షణం పెట్టుబడికి ఉంటుంది. అంటే ప్రపంచీకరణ వల్ల వాతావరణ కాలుష్యం ఎన్నో రెట్లు పెరిగింది. భూమి, ఆకాశం, గాలి, నీరు వంటివి పూర్తిగా కలుషితం అయినాయి.

సకాలంలో వర్షాలు కురవక పోవటం, కురిసిన వర్షపు నీరు భూమి పొరల్లోకి ఇంకక పోవటం, నీరంతా సముద్రం పాలై భూగర్భ జలాలు అడుగంటినవి. పట్టణాలు, పల్లెల్లో కూడా తారు రోడ్లు, సిమెంటు రోడ్ల వల్ల వర్షపు నీరు భూమి పొరల్లోకి ఇంకటం లేదు. ప్రపంచీకరణ ప్లాస్టిక్ వాడకాన్ని పెంచింది. ప్లాస్టిక్ భూమిలో కరగకుండా ఎన్నో ఏళ్లు భూమి పొరల్లో ఉండిపోయి భూసారాన్ని దెబ్బ తీస్తుంది. రసాయన ఎరువుల వాడకం, పురుగు మందుల వాడకం పెరిగినందు వల్ల భూమి పొరలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. మానవ సంబంధాలు, సంస్కృతి, విలువలు, ప్రాధాన్యాలు తారుమారు అయినవి. ఒకప్పుడు సస్యశ్యామలంగా ఉన్న పల్లె నేడు తాగడానికి కూడా నీళ్లులేని కరువు కోరల్లో చిక్కుకున్నది. ఈ విషమ పరిస్థితులకు కారణం ప్రపంచీకరణ విధానాలే అన్నది స్పష్టము. ప్రభుత్వం ఆర్థిక వాధానాలు మార్చుకొని పెట్టుబడి వ్యవస్థకు తాళం వేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది ఏని చెపప్వచ్చును.

ఆధార గ్రంధాలు :

1. దాడి నవల- పెద్దింటి అశోక్ కుమార్, ప్రచురణ తెలంగాణ రచయితల వేదిక, 2008.
2. దాడి నవల- పరిశీలన (ఎం.ఫిల్), కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు, 2015.

❖ ❖ ❖

ప్రపంచీకరణ పై దీర్ఘ కవితల ప్రతాపం

– సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధ్యక్షులు, పీఠికాపురాదిస ప్రభుత్వ కళాశాల, కాకినాడ.

ప్రపంచీకరణ మాట పాతదే కావచ్చు గానీ అది ఎప్పటి కప్పుడు మన జీవితాల్లోకి చాలా సులభంగా చొచ్చుకు పోతుంది. జాలరి వల విసిరితే చేపలు తప్పించుకోవచ్చు. గానీ ప్రపంచీకరణ వల నుండి తప్పించుకోవడం సులభమూ కాదు సాధ్యమూ కాదు. ఎంత మడి కట్టుకుని కూర్చుందాం. అన్నా అది ఏదో ఒక మార్గం నుండి దూరిపోతుంది. అలాంటి ప్రపంచీకరణను నిరసిస్తూ, అది ధ్వంసం చేసిన రంగాలు, పర్యావరణం, పల్లెలు, వ్యవసాయం, వృత్తులు నేపథ్యంలో వచ్చిన 'దీర్ఘకవతల్ని' ఈ వ్యాసంలో చర్చించుకుందాం.

'దీర్ఘకవిత' కుందుర్తి నాటి నుండి నేటి వరకు ఇదో ప్రక్రియగా స్థిరపడింది. అనేక దీర్ఘకవితలు వెలువడు తున్నాయి. ప్రముఖ కవి అద్దేపల్లి ప్రభు 'పిట్టలేనిలోకం' అనే దీర్ఘ కవితలో ప్రపంచీకరణ చేసిన వినాశనంలో కొన్ని పక్షి జాతులు అంతరించిపోవడం గురించి ఆవేదన చెందారు. ప్రపంచీకరణ పైకి సౌకర్యవంతంగా జీవితాన్ని సుఖమయం చేస్తున్నట్టు ఉన్న, వెనుక జరిగే విధ్వంసం గురించి ప్రభు రాశారు.

యింత పెద్ద గోళం మీద
పిడికెడు మట్టికి జాగా యివ్వలేరూ
దాన్ని ప్రాణానికి దాన్నొదిలేయలేమా
ఈ మనిషి దాహానికి
గోళం ద్రవమై ఇంకి పోవాల్సిందేనా
ప్రకృతిని ప్రేమించడం అంటే
కాళ్ళు చాచుకుని 'డిస్కవరీ'ని చూట్టం కాదు
చేతులు కలిపి కేరింతలు కొట్టడం
(పిట్టలేనిలోకం, పుట.17)

ఎమ్మెన్. సూర్యనారాయణ అనే కవి కుదేలౌతున్న రైతు పరిస్థితి గురించి 'ఆకుమడి' అనే దీర్ఘ కవితలో ఆక్రోశం చెందారు. మోనపోతున్న రైతు జీవితాన్ని ఆవిష్కరించారు. పండించిన పంటకి గిట్టుబాటు ధర లేక పోవడం, దళారీల మోసం. ఈ నేపథ్యంలో భగ్నమైన రైతు కలలు. ఇలా ఆయన ఈ దీర్ఘ కవితలో చూపే ప్రయత్నం చేశారు.

దాచుకున్న కలను
దోచుకు పోయిన జాడలు తప్ప
దొంగల ఆచూకీ లేదు
పంట బోదెల స్తన్యాల నుంచి
నీటి పాలను తాగి ఎదిగిన కల
అంతలోనే బానిసగా అమ్ముడైన విషాదం
ముక్కలైన హరిత స్వప్న శకలాలను
ఎక్కడని విరజిమ్మడం
(ఆకుమడి, పుట.7)

రైతు హరిత పచ్చ స్వాప్నికుడని, ఓ ఆకుపచ్చ సైనికుడిలా మారి, మాయదారి మోసాలను, కంపెనీలపై తిరుగుబాటు చేయాలని పిలుపు ఇచ్చారు.

అల అనే కవి 'నిప్పులవాగు' అనే కవితలో వ్యవసాయ రంగం, రైతు ఎలా కాలి పోతున్నారో ఈ దీర్ఘ కవితలో రాశారు.

విత్తనం కడుపులో
సంకరం సుంకు పుట్టింది
బహుళ జాతి బలాత్కరించి
టర్మినేషర్ ఎబార్షన్ చేసింది
క్రిములకు అమృతమైన
సంహారక మందులు
డంకెల్ తడిగుడ్డతో
రైతుల్ని హత్య చేశారు. (నిప్పులవాగు, పుట.34)

అనిశెట్టి రజిత స్త్రీలపై వ్యాపార ప్రకటనలు ఎలా ప్రభావితం చేస్తాయో తెలుపుతూ రాసిన దీర్ఘకవిత "మార్కెట్ స్మార్ట్ శ్రీమతి". ఈ ప్రకటనల వెనుక ప్రపంచీకరణ కుట్ర ఉందని మనకు తెలుసు. అయినా ఆ ప్రకటనల్ని మనం చూస్తాం. ప్రభావితం అవుతాం. మార్కెట్ మాయలో పడతాం. వస్తు వ్యామోహంలో చిక్కుతాం.

మహా మార్కెట్ గారి
మాయా జాలపు పిలుపులు
కలల ప్రపంచంలోకి
మనల్ని జర జరా లాగేసుకొని
అరచేతిలోని ఇంద్ర ధనస్సుల్ని
దింపేస్తాయి
భ్రాంతుల్ని వాస్తవ మేన్నట్లుగా మరిపించి
ముస్తాబులతో కల్పిస్తాయి
(మార్కెట్ స్మార్ట్ శ్రీమతి, పుట.13)

రొయ్యల సాగుతో వ్యవసాయ భూములు దెబ్బ తిన్నాయి. కొల్లేరు సరస్సు ధ్వంసం అయింది. ఈ నేపథ్యంలో ఎస్.ఆర్. భల్లం కొల్లేరు అనే దీర్ఘ కవిత రాశారు.

ఇదేమిటి
ఈ కొల్లోటి నీళ్లరంగు మారిందేమిటి
అదా
డాలరు విషం కలిసింది
కాడి పట్టిన మట్టి కలలు
వొట్టి పోతున్నాయేమిటి
ఈ కొల్లేటి శరీరంలో
'డంకెల్ బ్రీడ్' క్రిమి చొరబడింది కదా
(కొల్లేరు, పుట.29)

ఈ విధంగా 'ప్రంచీకరణ' భూతానికి బలి కాని రంగం లేదు. అది అద్భుతంగా విస్తరించింది. విస్తరిస్తూనే ఉంది. పైకి అందంగా కనిపిస్తూ, విషం కలిసి పెడుతున్న రాకాసి ప్రపంచీకరణ.

ఆధార గ్రంథాలు :

1. పిట్టలేనిలోకం - ఎ. ప్రభు
2. మార్కెట్ శ్రీమతి - అనిశెట్టి రజిత
3. ఆకుమడి - ఎమ్.ఎస్. సూర్యనారాయణ
4. నిప్పుల వాగు - అల
5. కొల్లేరు - ఎస్. ఆర్. భల్లం
6. దీర్ఘ కవితా వికాసం - డా॥. పెళ్ళూరు సునీల్

❖ ❖ ❖

ప్రపంచీకరణపై ఎక్కుపెట్టిన బాణం అద్దేపల్లి కవిత్వం

– తంత్రవాహి శ్రీరామమూర్తి, తెలుగు అధ్యాపకులు, పి.ఆర్. ప్రభుత్వ.జూ. కళాశాల, కాకినాడ. తూ.గో.జిల్లా.

ఏ దేశాలమధ్యనైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా వ్యాపారం కొనసాగించడానికి అనువైన విధానమే ప్రపంచీకరణ. ఈ స్వేచ్ఛామార్కెట్ కి అనుగుణంగా మిగిలిన వ్యవస్థాత్మక నిర్మాణాలన్ని రూపుదిద్దుకుంటాయి. దీని వలన మార్కెట్ మాత్రమే సాంస్కృతిక విలువల్ని తనకనుగుణంగా సర్దుబాటు చేసుకుంటుంది. ఆర్థికతృష్ణ ప్రధాన స్రవంతియై, అన్ని విలువల్నీ చిందరవందర చేస్తుంది. వస్తు వ్యామోహాన్ని పెంచి, జీవితమే సరుకుల మీద ఆధారపడేట్టు చేస్తుంది. ఈ వస్తువుల తయారీలో 'పరిశ్రమలు' ప్రధానమైన పాత్ర వహిస్తాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ మార్కెట్ ని దోపిడిచెయ్యడం ద్వారా దేశీయ పరిశ్రమలు నాశనం చేయబడ్డాయి. వచ్చిన కొత్త పరిశ్రమలు నాగరికజాతులన్నిటికీ జీవన్మరణ సమస్య అవుతుంది. వస్తువుల ఎగుమతులతో బాటు మేధా సృజనలు కూడా అందరికీ చెందిన సంపదలు అయ్యాయి.

20వ శతాబ్ధి ప్రారంభంనుండి సామ్రాజ్యవాదంగా ఉన్న ఈ ప్రపంచీకరణలో పేదదేశాలకు ధనికదేశాలు పెట్టుబడులుపెట్టాయి. దీని వలన పేదదేశాల్ని అన్ని రంగాల్లో శాసించటం జరిగింది. సరళీకృత ఆర్థిక విధానం, అన్ని రంగా లలో ప్రైవేటేజేషన్, ప్రపంచీకరణ విధానాల ద్వారా అనంతమైన లాభార్జన, రాజకీయంగా ఏకధృవ ప్రపంచస్థాపన, ఒకే సంస్కృతిని ప్రపంచమంతా నింపడం దీని లక్ష్యాలు. దీని వలన భారతదేశపు విలువలన్నింటినీ విధ్వంసంచేసే ప్రక్రియప్రారం భమైంది. ఈ నేపథ్యం లోంచి చూస్తే దోపిడీకి, విధ్వంసానికి కారణాలను అన్వేషించి, విశ్లేషించి, దానికి పరిష్కారాలను వెతికే దిశగా మేధావులు ప్రయత్నం చేస్తారు. కవి దానిని ఒక కళాత్మకంగా చిత్రీకరించి సమాజంలోని అన్ని వర్గాల వారిని చైత న్యం చేయటానికి ప్రయత్నిస్తాడు. అందుకే " అంతర్లోకాల మథనం,సామాజిక అవగాహన రెండూ సమపాళ్ళలో కలిపి వాస్తవికత, అనుసృజనల సమ్మిళిత ముద్ర వెయ్యగలవాడే అసలైన కవి" అని ఉద్ఘాటించే అద్దేపల్లి రామమోహనరావు గారు ఈ పోరాటంలో ముందు నుంచి ముందునిలిచి ఉన్నారు. తానురచించిన 'తెరలు' వంటి దీర్ఘకవితలతో సహా చాలా కవిత లలో అది ప్రకటితమైనా ప్రపంచీకరణ ధిక్కార స్వరమే ప్రధాన ధ్యేయంగా వచ్చిన కవితా సంపుటి 'పొగచూరిన ఆకాశం' 'ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక అవసరంగా వెలువడిన ఈ కవితా గుచ్ఛం' లోని ప్రపంచీకరణ స్వరూప స్వభావాలు, దాని పట్ల కవి దృష్టికోణాన్ని తెలపటమే ఈ వ్యాసం ఉద్దేశం.

'పొగచూరిన ఆకాశం శీర్షిక మాడ్చి మసిచేస్తున్న, కాలుష్య విషవాయువుల్ని, చిమ్ముతున్న ప్రపంచ ప్రశాంత వాతావరణాన్ని, సంస్కృతి ఆవరణను ఆవరించి ఉన్న అగ్ర ఉగ్ర రాక్షస క్రీడకు ప్రతీక'. కవితా ఖండికలన్నీ ప్రపంచీకరణ దుష్ఫలితాలను అనేక కోణాలలో వ్యక్తం చేసేవే. ఇన్ని ముఖాలుగా దాడి చేస్తున్నదని చదివితే గానీ పాఠకునికి తెలియదు. అంతేకాక కవి దార్శనికతకు, ప్రతిభకు ఆశ్చర్యపోతాము. 'స్వీకరించిన వస్తువును బట్టి, ఎంచుకున్న శ్రోతను బట్టి కవిత్వ నిర్మాణ పద్ధతిలో మార్పులు చేసుకోవడం కవి ప్రతిభను నిరూపిస్తుంది. అద్దేపల్లి అటువంటి ప్రతిభ, సృజనశక్తి పుష్కలంగా కలిగిన కవి. అందుకే ఈ సంకలనంలో వైవిధ్య భరితమైన కవితా శిల్పం కూడా కనిపిస్తుంది'. ఏ జాతినైనా గుర్తించేది ఆ జాతి మాట్లాడే భాష మూలంగానే. భాషలోనే ఆ జాతి సాహిత్యం, సంస్కృతి ఇమిడి ఉంటుంది. ప్రపంచీకరణ దాడి మొదట మన భాషమీదనే జరిగింది. దానికి

మొదటగా ఆంగ్లేయుల పాలనలోనే ఇంగ్లీషు విద్యా విధానమనే బీజం పడింది దానిని అద్దేపల్లి గుర్తించారు. అందుకే 'పడమటిసూర్యోదయం' కవితలో

"వాడు మన పోరు పడలేక పోతూ పోతూ/దేశం మెదడులో వ్యాపార విత్తనం నాటిపోయాడు.
ఏభై ఏళ్ళుగా అక్కణ్ణించి ఎరువులు పంపుతూనే ఉన్నాడు.....వాడి భాషా మంత్రాక్షరాలతో
ఇక్కడి పాలకులందర్నీ హిప్నటైజ్ చేసి/తన మొక్కని పెంచే సమర్థతనిస్తూనే ఉన్నాడు.
తన మట్టినే మన దేశం నిండా జల్లి/మన మట్టిని మనమే తిట్టుకుని
గతకాలపు గోతిలో కప్పెట్టేటట్లు చేశాడు.' (పు.31)

అంటారు. అభివృద్ధి అంతా తనదేనని ఒక భ్రమ కల్పించి మనదేశం చరిత్రలో మాత్రమే గొప్పదని రుజువు చేసే వాడి ప్రతిభను, మనదేశం పట్ల మనమే విముఖుల మయ్యే పరిస్థితిని అద్దేపల్లి కవితలో చక్కగా నిరూపించారు. ఇక్కడ భాషకు పర్యాయపదం నమ్మకం, ప్రతిజ్ఞ, సంస్కారం. కాని వాడికి ఇవేమీ లేని లాభార్జనే ప్రధానమైన వ్యాపారసూత్రం. అందుకే 'వ్యాపార విత్తనం నాటి పోయాడు' అంటారు

ముందరే చెప్పినట్లు భాష అంటే దేశంయొక్క సంస్కృతి. సంప్రదాయం, విజ్ఞానం, కళలు. ఇవన్నీ మొత్తం ఎలా మారిపోతాయో 'చీకటినాహ్వానిస్తున్న సంజెగుమ్మం' కవితలో చెబుతారు. భాష మారిపోతున్న విషయాన్ని చెప్పిన ఉపమానాలు కూడా సంస్కృతి విధ్వంసానికి సంబంధించినవై ఉండేలా చేయటం కవితానిర్మాణానికి సంబంధించిన కవి కౌశలమే.

'వ్రతిలో అపవ్రతిని దూర్చిపాడినట్లు,
సాత్వికాభినయంలో బ్రేక్‌డాన్సును ముంచి ఆడినట్లు
ఇంట్లో ఓకాలూ, వాకిట్లో ఓకాలూ పెట్టి
వంతెన కిందిపచ్చని గుమ్మాన్ని మరిచిపోయినట్లు
సగం ఇంగ్లీషు, సగం తెలుగు
తెలుగు వాడినోట్లోంచి గట్లు తెగుతుంది.'(పు.1)

తెలుగు, ఇంగ్లీషు భాషల ఉచ్చారణలో మార్పులు చెబుతూ తెలుగుభాష మీద తనకున్న ప్రేమను కూడా క్రింది పంక్తులలో ఉదాహరించారు. తెలుగు మాట్లాడేటపుడు మొగమంతా కళ్లలోనే ఉంటుంది

ఇంగ్లీషు వచ్చేటప్పటికి పెదవులు, కనుబొమ్మలు, బుజాలు
వంకర్లు పోతున్న చేతులు ఎటుపడితే అటు గంతులేస్తుంటై
ఆ గంతుల్లో పడి దూర దూర దూశాలన్నీ
ఒకదాన్నొకటి తలలు బాదుకుంటూ ఉంటై. (పు.1)

కవికి భాషమీద ఉన్న ప్రేమ చూపుతూ ఏదో ఒక ఊహ ఆధారంగా ఈ పంక్తులు రాయలేదు. భాషాశాస్త్రం ప్రకారం ప్రాచీన, అర్వాచీన భాషలేవి అని తెలియాలంటే వాటి ఉచ్చారణ విధానం కూడా ఒక ఆధారమే అని చెప్పారు. ఆ ప్రకారం భారతీయ భాషలు ముఖ అవయవాల వికారంలేకుండానే ఉచ్చరింపబడతాయి. ఇంగ్లీషు భాషలు దీనికి భిన్నం. దానిని కవి వంకర్లుపోతున్న చేతుల మీదుగా భాషలు ఎగిరిపోతున్నవని, దూరదేశాలు తలలు బాదుకుంటున్నాయని హాస్య రసంతో కూడిన కవితాత్మకంగా శాస్త్రీయ విషయాన్ని చెప్పారు. ఇది అనన్యసాధ్యమైన కవి నైపుణ్యమే. భాషా సంస్కృతుల మధ్య సంబంధాన్ని కూడా ఈ కవి వివరించారు.

సంస్కృతి నా యిల్లైతే / భాష నా వీధి గుమ్మం
సంస్కృతి నా జీవితమైతే/ భాష నా శ్వాస మార్గం
సంస్కృతి నా అమ్మైతే/ భాష నా ఆరాధన గీతం
వీధి గుమ్మాన్ని మోత రాకుండా/ వాడు పగలగొడుతుంటే
ఇల్లు కన్నీటి గోడలై పునాదుల్లోకి యింకిపోతుంది. (పు.2)

ఇక్కడ ఇల్లు మనిషి, జాతి ఉనికికి ప్రతీక. అదే పోయినపుడు మిగిలేదేముంది. మనిషి బికారి అవుతాడు. జాతి అనామకమౌతుంది. సంస్కృతి అవశేషమై మిగులుతుంది. దీనితోనే కవితనంతా విస్తరించారు. ఫలితం

ఏమిటో చెప్పి, భాష రక్షించుకోవాల్సిన మన కర్తవ్యాన్ని చెప్పిముగింపులో ఇలా చెబుతారు.

'మనతనం' సగం అట్లాంటిక్‌లో, సగం పసిఫిక్‌లో
పడి కొట్టుకుపోతుంది -ఆత్మాభిమాన భాషని
మన మట్టిలో పాతుకుంటే చెట్టై లేచి నింగినంటేది
మాతృదేశమే! (పు.4)

దేశానికి రెండు వైపులా ఉన్న రెండు మహా సముద్రాలలో మన ఉనికి పడిపోయి కనబడకుండా పోతుందనే భౌగోళిక వాస్తవాన్ని కవితలో పొందుపరిచారు. భాష పంటగా ఉంటేనే మరలా మరలా బీజాలు లభిస్తాయి. మట్టి మన జీవితానికి, జీవికకు ప్రతీక. దానిలో భాష పాదుకుంటేనే నింగి నిలువెత్తు దేశాభివృద్ధి, వికాసము కలుగుతాయని కవి చెబుతున్నారు. దేశం చెట్టై పెరగటం కాలుష్యరహిత, సర్వప్రాణిహిత నాగరికతకు నిదర్శనం. ఇది ప్రకృతిని, ప్రపంచాన్ని సంరక్షించటమే.

ప్రపంచీకరణ ద్వారా మారిపోతున్న సంస్కృతి, పండుగలు, పబ్బాలు, పెరిగిపోతున్న వస్తువ్యామోహ సంస్కృతి, మనవికాని ఆహార విహారాలు, నియమం, నిగ్రహం గాలికొదిలిన స్వేచ్ఛా విశృంఖలత్వం; విపరీతంగా పెరిగిపోవడాన్ని సామాన్యుని స్థితిని అద్దేపల్లి ' ఈ దారి ఎక్కడికి పోతుంది?' కవితలో అక్షరీకరించారు.

'మనిషి స్థానంలో వస్తువునారాధిస్తున్న
కొనుగోలు దారుణ్ణి నేను నిన్న నేను అవసరానికే
వస్తువులు కొన్నాను
నేడు నేను నా స్థాయి కోసం వస్తువులు కొంటు
న్నాను
రేపు నేను ఒక వస్తువును కావడం కోసం జీవితాన్ని
అమ్ముకుంటాను' (పు.6)

అంటారు. సాంకేతికత మానవ జీవితాలలోనికి చొచ్చుకు రావటం వలన తరతరాలుగా వస్తున్న ఆటల స్వరూపం ఎలా మారిపోయిందో వివరించారు. బందీ అయిపోతున్న బాల్యం, తల్లిదండ్రుల దగ్గరనుండి ఎలా జారిపోతోందో క్రింది పంక్తులలో చెప్పారు.

"కత్తిపడవలు, నెమలి కన్నులు/ ఇసక గూళ్ళు,
బువ్వాలాటలు
కొమ్మ ఉయ్యాలలు, కోతికొమ్మచ్చులు
అన్నీ నేను వీడియోగేమ్స్ గా మార్చుకుంటాను"
(పు.7)

విస్తరిస్తున్న వ్యాపారం, పెరుగుతున్న దోపిడీకి అనుకూలంగా కలిగే విద్యావకాశాలు, ఉద్యోగాలు పేరుతో ఖండాంతరాల వలసలు పెరిగి మనుషులు తల్లి దండ్రులకు దూరంగా వెళ్ళిపోతారు. అనుబంధాలు కనుమరుగై ఆశలు ఆవిరైపోతాయి.

దీనిని అనుబంధాలు, విమానాల రెక్కల మీదుగా/
సముద్రంలోకి జారిపోతై
అనుభవాలు, యంత్రాల అద్దాలముంది నిలబడి/
బట్టతలలు దువ్వుకుంటై.....(పు.7)
'జీవితం పసిపాప, దేశం మార్కెట్టులో /అమ్మా
నాన్నల నుండి తప్పిపోతుంది'

ఇవన్నీతొలగించుకుని కొత్తదారి వేసుకున్నాక...దేశం చెయ్యిచాస్తే సూర్యబింబం వచ్చి అరచేతిలో నిలవాలి' అని కవి సమాజానికి ప్రబోధిస్తారు. అలా జరగాలనే ఆశావాదంతో కవిత ముగిస్తారు.పెరుగుతున్న స్వేచ్ఛా భావన, వ్యక్తివాద ఫలితంగా పెరిగే విశృంఖలత్వం వలన ప్రేమ 'సెక్సు' గా మారిపోవడాన్ని కవి అనేకచోట్ల చెప్పారు. ప్రేమ కామదేవతముందు శిర:ఖండనం చేసు కుంటుం దంటారు. దీనిని మిథోపోయి ప్రకియ లో 'నేనుకామాన్ని నిద్రపోనివ్వను' అనే కవితలో కలర్‌టీవీల నిండా అల్లుకుని మనిషిని నైతికంగా దిగజార్చే ప్రోగ్రా ముల పరంపరను ఇందులో ప్రస్తావించారు. 'కోరికల మైదానాల్లో ఇంకించి/ మనోభూగర్భ రతిప్రవాహాల రహస్యాలై/వరదల కోసం ఎదురుచూసే క్షణాలుగా' రిమోట్ కంట్రోలు మన్మథుడు చేస్తున్నాడంటారు. దీనికి 'పాలకవర్గాల ఆశీర్వాదాలు, విదేశాల హస్త మస్తక సంయోగాలున్నాయనే నిజాన్ని వెల్లడి చేసారు. వ్యవసాయ రంగంలో వచ్చిన సంక్షోభాన్ని ' ఆత్మ హత్యల ఆలోచనల మంటలమీద

పొర్లుతున్న రైతుని ప్రపంచ బ్యాంకు నిబంధనలతో కట్టి పడేస్తుంటే
పండగ పొలంగట్లకేసి తల బాదుకుంటుంది' (పు.23)

అంటారు 'పండగపూట' కవితలో. పండగలు కూడా తమ సజీవత్వాన్ని కోల్పోతాయని, అన్ని పండగలు టి.విలలో చేసుకొనే విధానం రావడాన్ని కూడా ప్రస్తావించారు.

మరదళ్ళ పరిహాసాలకి /టి. వి. యాంకర్లు మార్గదర్శకులౌతారు
గొబ్బిళ్ళ పేడకి క్రమంగా /విదేశీ కాంట్రాక్టులు వస్తే
పెద్ద పెద్దవాళ్ళ పండగ సందేశాలన్నీ
తెలుగు కత్తితో ఇంగ్లీషునీ/ ఇంగ్లీషు కత్తితో తెలుగునీ
ఖూనీ చేస్తూ ఉంటై' (పు.23)

నిత్యం జరిగే పండగ రోజుల దృశ్యాల వెనుక కారణాలను సహేతుకంగా విశ్లేషించారు ఈ కవితలో అద్దేపల్లి. ప్రపంచీ కరణంతా లాభాల వ్యాపారం కోసమేనని తెలుసు. ఈ వ్యాపారంలో " ఉత్పత్తి అవుతున్న రకరకాల సరుకుల్ని ప్రపంచ మార్కెట్టులో అమ్ముకోవడం కోసం ప్రైవేట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలలో వివిధ రకాల ప్రకటనల్ని రూపొందించు కుంటారు. అద్దేపల్లి ఈ యాడ్స్ స్వరూపాన్ని 'యాడ్ మ్యాడ్ వరల్డ్' కవితలో బట్టబయలు చేసారు.

"గ్లోబల్ మార్కెట్ మేధావులందరూ/ బుర్రలోని గుంజునంతటినీ
అదే పనిగా కంప్యూటర్లలో రుబ్బి/తయారు చేసిన అద్భుత అపూర్వ
కాక్ టెయిల్ బొమ్మ-అడ్వర్టయిజ్ మెంట్
(పు. 76)

కార్యాకరణ సంబంధంలేని ఈ కాక్‌టెయిల్‌బొమ్మ స్వభావాన్ని కూడా కవి ఇదే ఖండికలో తేటపరిచారు.

నాటి 'అమాయకుడు-నల్లవేక కథే /నేటి 'నాగరికుడు-అడ్వర్‌టయిజ్ మెంట్' కథ!

అది అపూర్వ చిత్ర విచిత్ర మాయాసభ /కూల్ డ్రింక్ తాగి సముద్రాలు ఈదవచ్చు
రేజర్ పట్టుకొని లేడికిల్లర్ కావచ్చు------
యాడ్‌లు బాగా తాగినవాడికి
నిండు చలికాలంలో పసిపాపకిప్పించిన ఐస్‌క్రీమ్/ వెచ్చని హెల్దీఫుడ్‌లా కనిపిస్తుంది.
--------- అడ్వర్‌టైజ్‌మెంట్
పెట్టుబడిదారి చేతిలో యంత్రదండం/ఫ్రీ సెక్స్ ప్రచారానికి బండిచక్రం
ప్రపంచమార్కెట్ అధినాయకుడికి బానిసభూతం" (పు. 76-78)

మార్కెట్ అధినాయకుడికి బానిసభూతంలాంటి ఈ ప్రకటనలు సామాన్యులు జీవితాలకు పెనుభూతంగా మారాయి. ఈ విషయం ఇప్పటికే మనందరి అనుభవాలకు అందింది కూడా" "సౌందర్యం అనే నినాదంతో స్త్రీశారీరక దృక్పథాన్ని పూర్తిగా వికృతం చేస్తుంది ప్రపంచీకరణ'. స్త్రీల అవయవాలన్ని వ్యాపారంకాబడతాయి. వ్యాపారప్రకటనలు, ప్రసారమాధ్యమాలు, సినిమాలు అన్నిటా శృంగారం రాజ్యమేలుతుంది. కెమేరా కన్నుకు స్త్రీల అవయవాలు కేంద్రకాలు. ఈ విషయాలు ప్రధానంగా 'వెలుతురు కిరణాల చీకటి కొరడా' 'ఈనాటి హీరో' అనే కవితలలో వర్ణించారు. నాయికా నాయికలు, రచయిత, కెమెరామెన్, దర్శకుడు అంతా కలిసి శరీర వ్యాపారంలో ఎలా భాగస్వామ్యులో చెబుతారు. వీరంతా పాత్ర ధారులే. సూత్రధారులు వెనుకాల నడిపిస్తారు. అందుకే ఆమాట చెప్పకుండానే కవి కవితను పూర్తిచేసారు. నాయిక నడమూపులో సింగారం, రచయిత పాటలో పచ్చిసరసం, సంగీత దర్శకుడి సాంకర్య జ్ఞానంలోని నరాలగుంజుడు, కామకేంద్రాల్ని చూపించే కెమేరా కన్ను, కాసులు రాల్చే దర్శకుడి నృత్యం, అన్నీ కలిసి వికృతమైన శరీరవ్యాపారమౌతుందని తెలిపారు అద్దేపల్లి.

మనంచూసే డ్యూయెట్‌లో దాగిన వెలుతురు కిరణాల చీకటికొరడా, అవి మనవిలువలపై, సంస్కారాలపై కొట్టే దెబ్బలు లోచూపుతో చూసి మనకు చూపించారు. కవికి తగిలిన దెబ్బ మనకు దెబ్బలని గుర్తించే స్థితిలో మనం లేకపోవడమే విషాదం. కెమేరా చేసే చిత్రాల బొమ్మగీసి చూపించారు.

ప్రపంచపు తెరలన్నిటి మీదా/సమాజాన్ని తిరగేసి ముద్రించే
కెమేరాయే ఈనాటి హీరో--------హింసలో కరుణ కరుణలో శృంగారం/క్షణాల్లో మార్చేసి /సంకీర్ణ మానవుణ్ణి బయటికి లాగుతుంది' (పు.46)

----అంటూ యాక్సిడెంటులో పోయిన స్త్రీమీదైనా కళా స్థానాల్లోకే పాకిపోతాడని. హింసకి సౌందర్యపు జరీ చీరకట్టి గుండెల్ని తియ్యగా చీలుస్తాడనే నిజాన్ని నిక్కచ్చిగా చెబుతారు. కెమేరా చేసే వ్యాపారం తెరుచుకున్న కళ్ళ లోంచి కనుపాపల్ని తుంచుకుపోవడం. ఈ యుద్ధంలో మనకళ్లు జయించినపుడు మన కనుపాపాలు రెండు సూర్యబింబాలయి జగత్తుకంతా వెలుగులు పూస్తాయని కవి ఆకాంక్షిస్తారు. ప్రపంచీకరణ చేసే మాయాజాలం అందరికీ అర్థంకాదు. అది ఏమేమి చేయగ లదో చెబుతూ 'సైన్సు అనబడే ఒక మూఢ విశ్వాసం' కవితలో భారత దేశం అమ్మగా పూజించే ప్రకృతిని కీలుబొమ్మగా చేసి అమ్మకానికి పెడుతున్నదని, విత్తనంలో తలదూర్చి వ్యాపార వృక్షాన్ని దేశం గుండె పగిలేదాకా పెంచుంతుదని చెప్పారు. విజ్ఞాన శాస్త్రం కూడా బహుళజాతుల మీట మెడక్కట్టుకున్న రోబో అని చెబుతారు.

"ఏ విలువలూ లేని శీతల పానీయాల్ని / నాగరికతా విష జలపాతం చెయ్యగలను
పత్తిగింజను పేల్చి/ రైతుల మీద టెర్మినేటర్ డాన్సులు చెయ్యగలను
భారత దేశంలోని ప్రతి గింజనీ/ పనికిమాలిందిగా రుజువుచెయ్యగలను
భారత దేశంలోని మనిషినే ఒక గింజచేసి / నా టెస్ట్ ట్యూబ్‌లోకి ఇరికించి
బానిసత్వపు జీన్లు/ ప్రతి అణువులో/ నిరూపించి విస్ఫోటించగలను" (పు. 53)

'చెట్టుకిందనుంచి నేలను లాగేస్తున్నా అందాల పోటీల్లో మునిగిపోయిన పూలు పట్టించుకోవడం లేదని'నాదేశంలో నేనే పరదేశిని' అనే కవితలో ఈ దు:ఖాన్ని వ్యంగ్యంగా వ్యక్తీకరించారు. దీనికి 'పాలకవర్గాల శిరస్సులు/ మెడలమీదికి జారిపో వచ్చుకాని/ మట్టిబిడ్డల మెడలు శిరస్సుల్ని నిటారుగా నిలబడే'రోజు వస్తుందని 'మట్టి ఉప్పెన' కవితలో దర్శించారు. స్త్రీవాదం కవిత్వం దీనిపై ఇంకా బలంగా పోరాడాలని మార్గదర్శనంచేస్తూ' నీదేహంతోనే నీ దేహానికి మంట పెడుతున్న మార్కెట్ మధ్య, నీప్రతిఘటన స్వరం తారాస్థాయికి చేరలేదు ఆకాశంలో రెండో నగం మారలేదు-'(పు.79) అని హెచ్చరిస్తారు. తాను ఏమి చేస్తున్నారో కూడా స్పష్టంగా చెబుతారు 'యుద్ధం మొదలుకాలేదు' కవితలో- ఈ యుద్ధం ఇంకా మొదలుకాలేదు/ యుద్ధంచేయడానికి/ జాతి వెన్నెముకని ఖడ్గంగా మారుస్తున్నాను /మట్టిలో వేళ్లని/ దేశమంత లోతుగా పాతిపెడుతున్నాను' (పు.75) అని మనకర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నారు. కవే 'పొగచూరిన ఆకాశం' "అక్షరాక్షరం ఆవేశాన్ని ప్రతిఫలించింది. ఇది పెద్ద ప్రజా ఉద్యమంగా మారేవరకు, మంచి ఫలితాన్ని సాధించే వరకు ఆవేదన చల్లారదు"అని ప్రకటించారు. డాన్ సింగ్ బాడీ, డాన్స్ బేబీ డాన్స్, ఫైర్, బుద్ధుడు-బూతుబొమ్మలు, ఐ.టి; అదికావాలా? ఇదికావాలా? ఇలా అన్ని కవితలు కవి ఆవేదనను, ఆవేశాన్ని ప్రకటించేవే.ఆలోచనను కలిగించేవే. అందుకే 'ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వంలో అద్దేపల్లి శిఖరాగ్రాన నిలిచిన ఒక నాయక కవిగా' కనిపిస్తారు. "కవిత్వం విమర్శ నాకు రెండు కళ్ళు. ప్రగతిశీల ఆవేదన నా ఊపిరి. నిరంతర చైతన్యం నా జీవిత మూలసూత్రం." అన్న అద్దేపల్లి అన్నిటినీ మనకే ఇచ్చి కీర్తికాయునిగా నిలబడ్డారు. ఆయన నమ్మిన దారుల్లో ప్రయాణించడానికి సైన్యం తయారుచేయటమే మన కర్తవ్యం.

ఆధార గ్రంధాలు :

1. అద్దేపల్లి సాహిత్యదర్శనం-సాహితీ స్రవంతి-2016.
2. అద్దేపల్లి సాహిత్య వైభవం-జి.సుబ్బారావు-2013.
3. అన్నవి-అనుకున్నవి-అవధానుల మణిబాబు-2015.
4. ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళ-అద్దేపల్లిరామమోహనరావు-2006
5. పొగచూరిన ఆకాశం-అద్దేపల్లిరామమోహనరావు-2005.
6. పొగచూరిన ఆకాశం-అద్దేపల్లి విజన్; డా.మేడేపల్లి రవికుమార్-2008.

❖ ❖ ❖

ఆధునిక తెలుగు నాటకం - విశిష్టత

– ఆచార్య ఎం. రామనాథంనాయుడు, తెలుగు విభాగం, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూర్, కర్ణాటక.

భారతీయ సాహిత్యం నుండి పుట్టిన అతిరమణీయమైన వాక్యం ''కావ్యేషు నాటకం రమ్యం''. ఈ వాక్యం కావ్యాలలో నాటకానికున్న ప్రాధాన్యతని, ప్రాచుర్యాన్ని తెలుపుతుంది. అతి ప్రాచీనమైన కళల్లో నాటకం ఒకటి. ఋగ్వేద కాలంనుండి భారతీయ రంగస్థలం వుందని చెపుతారు. సంస్కృతభాషలో నాటకం మొదటగా అక్షరరూపం దాల్చింది. మహాకవి కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం, విక్రమోర్వశీయం, మాళవికాగ్ని మిత్రం; భవభూతి రచించిన మాలతీమాధవీయం, ఉత్తర రామచరిత్ర ప్రాచీన నాటకాలయినా నేటికీ ఆదరణీయమైనవి, అపురూపమైనవి.

'నాటకం' గడచిపోయిన కాలాన్ని మన కళ్ళముందు నిలుపుతుంది. ఆ కాలానికి వాస్తవరూపం కలిపించేది నాటక రచన. నాటకం సర్వజనీయం, సర్వకాలీనం, కాలాన్ని బట్టి, ప్రదేశాన్నిబట్టి, సంస్కృతిని బట్టి రూపం మారుతుందే తప్ప అంతర్లీనంగా నాటక మూలసూత్రం ఒక్కటే. అందువలన నాటకం బహుళ ప్రజాదరణ పొందిన రంగస్థల ప్రక్రియ.

'రంగస్థలం' అనేది ఒక వినోదప్రాంతం. వివిధరకాల మనుషుల్ని ఒకచోటకు చేర్చే శక్తివంతమైన క్రియ. రంగస్థలం దగ్గర దర్శించే నాటకాన్ని చూచిన మనుషులు ఆనందిస్తారు. కొన్ని సన్నివేశాలు చూచి దుఃఖపడతారు. అయితే అక్కడే ఆలోచనలకు అంకురార్పణ జరుగుతుంది. మనిషికి స్ఫూర్తినిస్తుంది.

'నట' అనే ధాతువు నుంచి నాటకం పుట్టింది. నాటకానికి అభినయం ముఖ్యం. ఆయాకాలాల్లో జరుగుతున్న సామాజిక స్థితిగతుల్ని నాటకం దర్పణం పడుతుంది. మనిషి జీవితంలో ఎన్నో నటనలు వేయాలి. నటనకు జీవం పోయాలి. లేదంటే వారు జీవితంలో క్లిష్టపరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. నటించడం అంత సులువైన పనేం కాదు. నాటకం రాయడం ఒక ఎత్తు అయితే నటించడం మరో ఎత్తు. అందరూ వారి వారి పాత్రలకు తగినట్టుగా నటించలేరు. అది కొంతమందికే సాధ్యం. ఈ జగత్తు అంతా ఒక నాటకం లాంటిదని అంటారు. శ్రీకృష్ణ పరమాత్ముడిని జగన్నాటక సూత్రధారి అనికూడా అంటుంటారు. ఆయన ఆడించినట్టు ఆడడం తప్ప మన పాత్ర ఏమీలేదని చెపుతారు.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో నాటకం అత్యంత శక్తివంతమైన సాధనం. ప్రజాహృదయాన్ని సూటిగా స్పందింపజేసే శక్తి ఒక్క నాటకానికే వుంది. 'కావ్యేషు నాటకం రమ్యం', 'నాటకాంతం హి సాహిత్యం', 'నాటకాంతం హి కవిత్వం' అనడంవల్ల పూర్వులు నాటకానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. కాళిదాసు 'మాళవికాగ్ని మిత్రం' అనే నాటకంలో నాటకాన్ని ''చాక్షుషమైన క్రతువు''గా అభివర్ణించడం గమనార్హం. భరతుడు కూడా నాటక వైశిష్ట్యాన్ని ఆవిష్కరించాడు. నాట్యం లేదా నాటకం సర్వకళల సమాహారం. కవిత్వం, సంగీతం, నృత్యం, అభినయాలతో అలరారే నాటకం అందరినీ అలరించే అద్భుత ప్రక్రియ.

తెలుగు నాటకం సంస్కృత నాటకానువాదాలతో మొదలై, ఆంగ్లనాటకానువాదాలతో ఊపిరి పోసుకుని, పౌరాణిక నాటకాలతో బలపడి, సాంఘిక నాటకాలతో పరిపుష్టినీ, తుష్టినీ ఏర్పరచుకుంది. తెలుగు నాటకానికి మహోజ్వల చరిత్ర వుంది. ఎందరో నాటకకర్తలు తమ నాటక రచనలద్వారా తెలుగునాటక సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. కాలానుగుణంగా సామాజిక పరిస్థితులకు

అనుగుణంగా అనేక నాటికలు వచ్చాయి. అద్భుతమైన నాటక కళాఖండాలు వెలువడ్డాయి.

తెలుగులో తొలినాటకం కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన మంజరీమధుకరీయం. మంజరీ మధుకరీయంతో ప్రారంభమైన తెలుగు నాటక రచన సంఘసంస్కరణ ఉద్యమంతో, జాతీయోద్యమంతో, సోషలిస్టు ఉద్యమంతో పెనవేసుకొని దినదిన ప్రవర్ధమానమై అభివృద్ధి చెందింది.

నాగార్జున కొండ తవ్వకాల్లో దొరికిన ఆరుబయట రంగస్థలం వేలాది ప్రేక్షకులకు సరిపోయే వైశాల్యం కలదిగా వుంది. అంతేగాక శబ్దసంయమ సౌకర్యాదులు కలిగి వుందని తెలియవచ్చింది. ఈ రంగస్థలం క్రీస్తు పూర్వం 560-480 నాటిదని పురావస్తుశాఖవారు లోతుగా పరిశోధన చేసి నిర్ధారించారు. దీని ఆధారంగా తెలుగు దేశంలో 2500 సంవత్సరాలకు పూర్వపు రంగస్థలాలు వున్నట్లు తెలుస్తుంది. నాటక ప్రదర్శనలు కూడా ఇక్కడ జరిగేవని బోధపడుతుంది. క్రీస్తుకు పూర్వం ఐదు, ఆరు శతాబ్దాల్లోనే తెలుగుదేశంలో సంస్కృత నాటకాలు ప్రదర్శింపబడేవని తెలుస్తోంది.

ఆంధ్రమహాభారతంలో నన్నయ ''ఉదాత్త రసాన్విత కావ్యనాటకాలు పెక్కుచూచితి'' అని అనడాన్నిబట్టి ఆనాటికి నాటకాలు ప్రదర్శింపబడి వుండవచ్చు. ఉత్సవయాత్ర సందర్భంలో నాటకాలు ప్రదర్శించబడేవని పాల్కురికి సోమనాథుని 'పండితారాధ్య చరిత్ర' లోని వర్ణననుబట్టి మనకు స్పష్టమవుతుంది. పెద్దన మను చరిత్రలోని స్వరోచి పురప్రవేశ సందర్భంలో ''చిలుకల కొల్కి కల్కి యొకచేడియ నాటకశాలలు మేడపై నిలువున నిల్చి'' అని నాటకశాల పదం వాడడం వల్ల ఆ రోజుల్లో నాటకశాలలు ప్రదర్శించబడ్డాయో, తెలుగు నాటకాలు లేదా యక్షగానం లాంటి దేశిరూపకాలు ప్రదర్శిత మయ్యాయో చెప్పలేం.

వినుకొండ వల్లభురాయుడు రాసిన 'క్రీడాభిరామం' అనే వీధినాటకంలోనూ, మరికొన్ని పూర్వకవుల చాటువుల్లోనూ నటీనటుల ప్రశంస వుంది. దక్షిణాంధ్రయుగంలో అనేక యక్షగానాలు వెలువడ్డాయి. ఇవి నూటికి నూరు పాళ్ళు దేశిరూపంతో కూడుకున్నాయి. ఎలకూచి బాల సరస్వతి, కుందుర్తి వెంకటాచలపతి మొదలైనవారు నాటకాలు రాసినట్టు తెలుస్తుంది. కాని అవి లభించడం లేదు. వీటన్నింటినిబట్టి చూస్తే ఆంధ్రదేశంలో నాటకాలు ప్రదర్శింపబడేవని తెలుస్తుంది.

నాటకాన్ని కింది విధంగా నిర్వచించవచ్చు.

- నటన ప్రధానంగా కలది నాటకం.
- సమాజంలోని స్త్రీపురుష స్వరూప స్వభావాలను వేదికమీద ప్రదర్శింపజేసేది నాటకం.
- జరిగిన దాన్ని, జరుగుతున్న దానిని చూపుతూ ఎలా జరిగితే బాగుంటుందో సూచనప్రాయంగా ఆలోచింపజేసేది నాటకం.
- కంటికి, చెవికి కమనీయమైన విందు నాటకం.
- చెప్పదలచుకున్న విషయాలను దృశ్యాల ద్వారా నూటిగా హృదయంలో చొప్పించగల సూత్ర సాధనం నాటకం.

సాధారణంగా నాటకాలను అనువాద, పౌరాణిక, చారిత్రక, సాంఘిక, ప్రయోగ నాటకాలుగా విభజించ వచ్చు.

అనువాద నాటకాలు :

నాటకరచనా ప్రారంభదశలో సంస్కృత నాటకాలు విరివిగా తెలుగులోకి వచ్చాయి. ఆంగ్లనాటకాలు కూడా అనేకులు అనువదించారు. తరువాతికాలంలో బెంగాలి, హిందీ, తమిళు, కన్నడ భాషలనుంచి తెలుగులోకి నాటకాలు వచ్చాయి. ముఖ్యంగా మనవారు సంస్కృత నాటకాలను ఆంధ్రీకరించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

పౌరాణిక నాటకాలు :

తెలుగువారికి పురాణాలు అంటే చాలా ఇష్టం. పౌరాణిక పాత్రలంటే ఎక్కువ మక్కువ. కాబట్టి సంస్కృత పౌరాణిక నాటకాలను ఆంధ్రీకరించడమే కాక సంస్కృత పురాణేతిహాస కావ్యాలనుంచి ఇతివృత్తాన్ని తీసుకుని పౌరాణిక నాటకాలుగా రచించారు.

చారిత్రక నాటకాలు :

చరిత్రను ఆధారంగా చేసుకుని రాసిన నాటకాలు చారిత్రక నాటకాలు. చారిత్రక సంఘటనలు, చారిత్రక వ్యక్తులు ఈ నాటకాల్లోని ప్రధానాంశాలు. నాటక లక్షణా లన్నీ ఈ నాటకాలకు కూడా వర్తిస్తాయి. తెలుగులో అనేకులు అనేక చారిత్రక నాటకాలు వెలయించారు.

సాంఘిక నాటకాలు :

సంఘంలో చోటుచేసుకొనే వివిధరకాల వ్యక్తులకు, వివిధ రకాల సంఘటనలకు స్థానం కల్పిస్తూ రచింపబడే నాటకం సాంఘిక నాటకం, సాంఘిక నాటకం సమకాలీన సమాజంలోని ప్రతి సమస్యకు ప్రతిస్పందిస్తుంది. సంఘం లోని సంఘటనలను ప్రతిఫలింపజేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే సంఘజీవితానికి అద్దం పడుతుంది.

ప్రయోగ నాటకాలు :

1920వ సంవత్సరం తర్వాతికాలం నూతన ప్రయో గాల కాలంగా వర్ధిల్లింది. ప్రయోగనాటకాలు భావ, రచనా వైవిధ్యానికి, ప్రదర్శనా సౌలభ్యానికి సంబంధించినవిగా వెలువడ్డాయి. సాంప్రదాయక నాటక రచనావిధానం నుండి విడివడడానికి రచయితలు చేసిన ప్రయత్నాల ఫలితమే ఈ నూతన ప్రయోగాలు.

కొన్ని నాటకాలు సాహిత్యదృష్టిని, మరికొన్ని నాటకాలు ప్రయోగదృష్టిని, ఇంకొన్ని నాటకాలు సాహిత్య ప్రయోగా లను పురస్కరించుకొనివచ్చాయి. ఈ మూడురకాల నాటిక ప్రయోగాల ద్వారా తెలుగు నాటకరంగం ఎంతగానో అభివృద్ధి చెందింది.

కొన్ని నాటకాలు సాహిత్యదృష్టిని, మరికొన్ని నాటకాలు ప్రయోగదృష్టిని, ఇంకొన్ని నాటకాలు సాహిత్య ప్రయోగా లను పురస్కరించుకొని వచ్చాయి. ఈ మూడురకాల నాటిక ప్రయోగాల ద్వారా తెలుగు నాటకరంగం ఎంతగానో అభివృద్ధి చెందింది.

ఆధునిక సాహిత్యం సమాజానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. కాల్పనికత నుంచి వాస్తవికత వైపు పయ నించడం ఆధునిక సాహిత్యంలోని గొప్పదనం. ఆధునిక సాహిత్యానికి సంబంధించిన అనేక రచనల్లో సంఘాన్ని ప్రతిబింబించే అనేక విషయాలు ఉంటాయి. సంఘాన్ని ప్రతిబింబించే అనేక విషయాలు వుంటాయి. ఈ విషయంలో కన్యాశుల్కం అన్నింటికంటే ముందు వరుసలో నిల్చుంటుంది. కన్యాశుల్కం అన్నింటికంటే ముందు వరునలో నిల్చుంటుంది. కన్యాశుల్కం నాటకంలో గురజాడ అప్పారావుగారు విద్యావిధానం, కుటుంబం, వివాహం, సంబంధం బాంధవ్యాలు, న్యాయ స్థానాలు, పోలీసులు, తహసీల్దారులు మొదలైన వారిని గురించి చర్చించారు. ఈ నాటకంలో వున్న విషయాలు, వాటి వైవిధ్యం చాలా నాటకాల్లో కనిపించవు. ఈ నాటక ప్రారంభం నుంచి చివరివరకు ఇలాంటి సామాజిక విషయాలెన్నో గమనించదగినవిగా వున్నాయి.

విజయనగరం మహారాజుకు సంఘసంస్కరణపై చాలా ఆసక్తి వుండేది. ఆయన దగ్గర ఆశ్రయం పొందిన గురజాడ అప్పారావు విశాఖపట్టణం జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో జరిగిన బ్రాహ్మణ కన్యాశుల్కాల వివరాలను సేకరించాడు. ఏడాది నుండి ఐదేళ్ళలోపు పిల్లల్ని కూడా కన్యాశుల్కానికి ఆశపడి పెళ్ళి చేసిన సందర్భాలున్నాయి. కడుపులోవున్న పిల్లలకు కూడా బేరం కుదుర్చుకున్నవారు వున్నారు. దీన్ని గమనించిన గురజాడ "ఇంతటి ఘోరమైన పరిస్థితి సమాజానికి సిగ్గుచేటు అన్నాడు. కన్యాశుల్కం నాటక రచనకు తనను ప్రేరేపించింది. ఇదే విషయమని తెలిపాడు. ఇటువంటి దురాచారాన్ని ఎండగట్టి ఉన్నత మైన నైతిక ప్రమాణాలను వ్యాపింపజేయడానికి మించిన కర్తవ్యం సాహిత్యానికి మరొకటి లేదని గురజాడ అభి ప్రాయపడ్డాడు.

కన్యాశుల్కంలో పదే పదే వేశ్యాసమస్యను తెరమీదకు తీసుకువస్తాడు గురజాడ అప్పారావు గారు.

ముఖ్యంగా మధురవాణి ద్వారా చాలా విషయాలు చెప్పించాడు. మగవాడికైనా, ఆడదానికైనా నీతి వుండాలి అని, సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా! అని అంటుంది.

వీటిని పరిశీలిస్తే గురజాడగారి ఇంగితం బోధపడుతుంది. పూటకూళ్ళమ్మ ముచ్చటగా తప్పటడుగులు వేసే రోజుల్లోనే ఒక కునుష్టి ముసలాడికి కట్ట నిశ్చయించారు. పుస్తెకట్టపోతుంటేనో, కట్టిన ఉత్తర క్షణంలోనో ఆ ముస లాడు పెళ్లిపీటల మీదే గుటుక్కుమన్నాడు. ఇలాంటి బాల్యవివాహాలు ఆ కాలంలో చాలా జరిగేవి. పుస్తె కట్టేటప్పుడే గుటుక్కుమన్నవాడయితే పెళ్ళి అయిందా లేదా అనేది మీమాంస.

అగ్నిహోత్రావధాన్లు బుచ్చమ్మను పదిహేనువందల రూపాయలకు అమ్మేశాడు. ఆ విషయాన్ని నిలదీస్తే కూర గాయలా అమ్మడానికి, ప్రతి గాడిద కొడుకూ అమ్మేశావని అడిగేవాడే. ఆ రూపాయలు పుచ్చుకోకపోతే మొగుడు వచ్చేవాడా! దాని గతి ఏమైవుండు అని తాను చేసిన పనిని సమర్థించుకున్నాడు. అందుకు కరటక శాస్త్రి "చచ్చాడంటే వాడిదా తప్పు" మంచం మీది నుంచి దించేయడానికి సిద్ధంగా వున్నవాడికి కట్టబెట్టావ్ అని అనలు విషయం బయటపెట్టాడు. అయితే అగ్ని హోత్రావధాన్ల వంటి ఛాందసులకు అవన్నీ గిట్టవు. అల్లుడు చచ్చిపోయినాడంటే అందువల్ల ఎంత లాభం కలిగింది. భూములకు దావా తెచ్చావా లేదా అని వాది స్తాడు. అంతటితో ఆగక రెండో కూతురు సుబ్బమ్మను కూడా మరో ముసలాడికి కట్టబెట్టాలని చూస్తాడు. లుబ్ధావధాన్లు లక్షాధికారని, పద్దెనిమిది వందలకు సుబ్బిని అడగొచ్చాడని, పెళ్ళి మహావైభవంగా చేస్తాడని మురిసి పోతుంటాడు. ఆ లుబ్ధావధాన్లకు అరవై యేళ్ళు దాటాయని గిరీశం తెలియజేస్తాడు. కరటక శాస్త్రి "బావా యీ సమ్మంధం చేస్తే నీ కొంపకి అగ్గిట్టేస్తాను" అంటాడు. అవధాన్లు మండిపడి "తాంబూలం ఇచ్చేశాను - తన్నుకు చావండి" అని అనడమే కాకుండా వెంకమ్మను ఉద్దేశించి "ఆడముండల్తోనా ఆలోచన" అని తిడతాడు.

కన్యాశుల్కంలో ముఖ్యంగా బాల్యవివాహాలు, కన్యా శుల్కాలు, వాటి పరిణామాలు, వితంతువులు ఎదుర్కొనే సమస్యలు, వాళ్ళను లొంగదీసుకోవడానికి గిరీశం లాంటి వాళ్ళ పన్నాగాలు, అమాయకుల్ని కాపాడడానికి ఆసక్తి చూపించే సౌజన్యారావు, మధురవాణి లాంటి వాళ్ళు కనిపిస్తారు. సమస్యను వాచ్యంగా చెప్పి ఉపన్యాస ధోరణిలో పరిష్కరించకుండా పాత్రల మూలంగా ఆ సమస్య ఎంత దారుణంగా వుండేదో చూపించడం గుర జాడ ప్రత్యేకత. అందువల్లనే గురజాడ కన్యాశుల్కం వందేళ్ళకు పైగా ప్రదర్శనలు పొందింది.

సమాజంలో బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొం టున్న సమస్యల్ని కళ్ళకు కట్టినట్టు బోయిభీమన్న తన పాలేరు నాటకంలో చిత్రించాడు.

"ఒకడు తినుచు – మరియొకడు పస్తుపడి
యుండుట ధర్మము – కాదురా
కూడు, గుడ్డ, కొంప సమానముగా
కూర్పుమురా! లోకమున"

అని అన్నాడు. అయితే "పాలేరుతనం చేసుకు బ్రతికే తొత్తుకొడుక్కి చదువేమిటిరా! చదువు" అన్న ఒక్క వాక్యం పరిశీలిస్తే భూస్వామి భూస్వామిగానే, పాలేరు పాలేరుగానే జీవించాలనేది ఆనాటి భూస్వాముల మనస్తత్వం.

అలాగే "నీవు పాలేరుదానివి. నేను కామందును. కామందంటే సగం మొగుడు" అన్న మాటల్లో ధనికవర్గాల దర్పం, దౌష్ట్యం అర్థమవుతుంది. ఆనాడు ధనికవర్గాలు మూర్ఖంగా ప్రవర్తించి రకరకాల మార్గాల ద్వారా పాలేరుల భార్యలను లొంగదీసుకునేవారు. వారు కామందులై తమ చేతుల్లో తక్కువ కులాల స్త్రీలు ఎంతోమంది బలైనారని తమ మగతనం గురించి గొప్పలు చెప్పుకునేవారు.

అయితే వీటన్నింటికీ కారణం బడుగు బలహీన వర్గాల్లోవున్న పేదరికం ఒకటే కాదు. వారిలోవున్న తెలివి తక్కువతనం, మూర్ఖత్వం అని సూటిగా తన పదునైన కలంతో పేదల హృదయాలను గుచ్చాడు బోయి భీమన్న.

"జాతి భేదము పుట్టి నాశనముజేసె
భవ్య భారతదేశ సౌభాగ్య శోభ"

అని భీమన్న తన కూలిరాజు నాటకంలో వాపోయాడు. నాది కేవలం కూలి ఉద్యమమే. ఈ ఉద్యమంలో కులానికి స్థానం లేదు. కులభేదాలు రూపు మాపి, ఏకైక భారతజాతిని తయారు చేసి రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమత్వం స్థాపించడమే నా ఆశయం, ధ్యేయం అని తన అంతరంగంలోని మాటను బయటపెట్టాడు. ఇలా ఆధునిక నాటకాలలో సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ధిక్కరించి, తమ కలాన్ని గళాన్ని విప్పి సాహిత్యం ద్వారా సమసమాజ అభ్యున్నతిని కోరారు ఆధునిక కవులు.

ఆధారగ్రంథాలు :

1. కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు.
2. వ్యాస తరంగాలు - సర్వోత్తమరావు.
3. సాహితీకిరణాలు - వెలమల సిమ్మన్న.
4. సాహిత్యం - సమాజం - చిన్నం రాజారాం.

❖ ❖ ❖

ఆధునిక తెలుగు కవిత్వం - ప్రపంచీకరణ పర్యవసానాలు

– డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

ఆధునిక సాంకేతిక విప్లవ యుగం ప్రపంచాన్ని గ్లోబల్ గుడిసెగా మార్చేసింది. భారతదేశానికి సంబంధించి ఆర్థిక సరళీకరణ విధానాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కేబుల్ టీవీ రంగప్రవేశం, స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ మొదలై నవి భారతీయుల జీవితాన్ని బలంగా ప్రభావితం చేశాయి. ఎంత బలంగా అంటే, మనిషిని తనకు తానుగా మిగల కుండా చేశాయి. కుటుంబ విలువల్ని, సామాజిక సంబం ధాల్ని ధ్వంసం చేశాయి. పంటపొలాల్ని ప్లాట్లుగా మార్చాయి. పల్లెల్ని అనాథల్ని చేశాయి. శ్రామికుల్ని, వృత్తికారుల్ని, రైతుల్ని చిన్నాభిన్నం చేశాయి. జానపద కళలను ఊరవతలికి తరిమేసి, 'నెట్టింట్లో' కూర్చోబెట్టి నంగనాచి కబుర్లు చెప్తున్నాయి. మన జీవితాన్ని, జీవన విధానాన్ని నాశనం చేసే అవలక్షణాలు ప్రపంచీకరణ పర్యవసానంగా మనకు తగులుకున్నాయి. మానవత్వం వున్న మనిషిని మాయం చేస్తున్నాయి. ఈ దురవస్థను ఎదుర్కోవలసిన అవసరాన్ని తెలుగు కవులు స్పష్టంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈనాటి ఆధునిక కవులు ఎలా స్పందించారో వివరించడమే ఈ పరిశోధనాపత్ర ఉద్దేశ్యం.

ఛిద్రమైన పల్లె :

'భూమి తల్లి మొదటి కాన్పులో కన్న నిలువెత్తు నిజాయితీరూపం' అయిన ఒకప్పటి పల్లె, పుడమితల్లి మట్టినే మురిపాలుగా తాగి, చెమట చెట్టై ఎదిగి, సవాలక్ష జీవజాతికి చల్లని నీడనిచ్చిన పచ్చని పందిరి లాంటి పల్లె 21వ శతాబ్దంలో అనేక స్వార్థాలకు బలై అస్తిత్వాన్ని కోల్పోతోంది.

"లోహం కోరల రాక్షసి ముళ్ళ కంచెల ప్రాజెక్టుల
స్మశానంలో
చిరునామాలేని శవమై తగలబడిపోతోంది
మానవత్వం లేని మారీచక ముఠాలు
పాల కోసం పొదుగును కోసి నిస్సిగ్గుగా వదిలేసిన
గంగగోవై మూగగా విలపిస్తోంది
నగరాల్ని గగనాల ఎత్తుకు పెంచడమంటే
పల్లెల్ని పాడెగట్టి వల్లకాడ్లో పాతేసినట్టే"

(మహాభినిష్క్రమణం!)

సడ్లపల్లె చిందంబరరెడ్డి అంటాడు. ఉద్యోగ, వ్యాపార, జీవన పోరాటాల కారణాలు నగరాల పెరుగుదలకు కారణమే అయినా, బతకడానికి అవసరమైన తిండి గింజలు, పాలు, పళ్లు ఇచ్చే పల్లెను స్మశానంగా మార్చడమే విషాదానికి మొదటి కారణం.

పరిశ్రమల పేరుతో పచ్చని పొలాల్ని, భూగర్భ జలాల్ని నిలువునా దోచేసుకొని, రైతుల్ని బానిసలుగా మార్చేస్తున్న ధనబలంతో ఎగిరిపడే స్వార్థం పల్లెకు పాడెకట్టింది.

"పల్లెపొలాల మధ్య వాడి
వేల దేహాల గళ్ళ ఆకుపచ్చరంగుల గుడారం
అమాయక సీతను వంచించడానికి
బంగారు పూతల మాయలేడి నట్టడవికి దిగినట్టు
గ్రామీణ మూలాల్ని తెంచే పాపిష్టి పిడుగు"గా
పారిశ్రామికీకరణ పరిణమించింది.

(సడ్లపల్లి చిదంబరరెడ్డి)

కార్పొరేట్‌ల కనుసన్నల్లో వారు విసిరే మాయా వలయాల్లో పేద రైతులు చిక్కుబడిపోతున్నారు.

ప్రపంచ వంచకుడి కల సాకారమైనట్టు, వాణిజ్య వట వృక్ష ఊడలు పల్లెపల్లె మీదా దళారి గద్దలై బుసకొట్టడాన్ని' కళ్ళ ముందుంచుతాడు కవి.

"ఊర్లో ధ్వంసమై మొలకెత్తని
విత్తన మొకటి పట్నంలో
ఓ ఇంటిగేటు ముందు
గ్రీష్మం కురిసిన చెట్టై నిలబడింది"
(గాయపడ్డ విత్తనం - ఈ. రాఘువేంద్ర)

అంటాడు కవి. పల్లె జీవితం అన్ని విధాలా వికటించి, రైతులు నగరాల్లో కాపాలాదార్లుగా మారిపోతున్న సందర్భాన్ని పట్టిస్తాడు ఈ. రాఘువేంద్ర.

ప్రపంచీకరణ పర్యవసానం పల్లెను ఏగతి పట్టించిందో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాటల్లో-

"ఊరంతా వెదికితే
అక్కడక్కడ కుక్కి మంచాల్లో వయసై పోయిన
ఎముకలు, తోళ్ళు, తోడులేని కళ్ళు...
మొండిగోడల కింద పుల్లదుమ్ములో
కర్రువూడి, ఆరెవిరిగి, దుంప అరిగి
చెదలు తిన్న నొగతో... నాగలి...
కాళ్ళు విరిగి శాశ్వత అంగవైకల్యంతో పడున్న
పనికిరాని ఆ కొయ్య ముక్క..." (బడి)లా ఊరు
విలవిలలాడుతోంది.

'మరణించిన పల్లె మట్టిదేహం చుట్టూ, కర్మాగారాల పుకార్లు షికార్లు చేయించి, అడుగూ గజాల కొలతల పాషాణాలు పాతి, కరెన్సీ కట్టలు పెంచే ముఠాకోటరీలు, వేయి తలల పన్నాగాల పడగల్తో, కబ్జాలు, దౌర్జన్యాల క్రౌర్య కౌరవపుత్రుల'తో పల్లెతల్లి మానం పోగొట్టుకొని, మౌనంగా రోధిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

సాంస్కృతిక విధ్వంసం :

ఒక దేశాన్ని నాశనం చేయడానికి ఎలాంటి ఆయుధాలు అక్కరలేదు. ఆ దేశ సంస్కృతిని నాశనం చేస్తే, ఆ దేశ అస్తిత్వం నాశనమై, చివరికి ఆ దేశం మునుపటి దేశంలా కాక, సాంస్కృతిక దాడి చేయించిన దేశంగా మారిపోతుంది. అప్పుడు పరాయి దేశాల ఆలోచనలు, వ్యాపారాలు, వారి స్వదేశాల్లో లాగే సాగిపోతాయి. పిజ్జా, బర్గర్ల నుండి, నడిరాత్రి నీలిచిత్రాల దాకా మనపై పరాయీకరణ దాడి చేస్తూనే ఉంది. ఆ దాడిలో బలై పోతున్నామన్న స్పృహ కూడా మనకు లేకుండా చూసుకోగల నైపుణ్యం ఈ ప్రపంచీకరణకున్న గొప్ప లక్షణం.

"ఊరిలో తలదూర్చిన టెలివిజన్
కేబుల్ తోకతో ఊరిని పట్టి బిగించి
పల్లె కళను ఊరవతలికి కక్కించింది
(కన్నీటి సీమ, డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి)

దీని పర్యవసానంగా గ్రామీణ సంస్కృతి విధ్వంసమైంది. గతంలోని పల్లెటూళ్ళు "వెన్నెల రాత్రులొస్తే నిద్ర పొయ్యేవి కావు. వయసుల వారీగా వారి వారి ఆట పాటల్లోకి వారు వెళ్ళిపోయేవారు. 'చిన్నపిల్లలు ఎన్నే కుప్పలాటకు వీథులను వాటాలేసుకునేవారు. కుర్రకారు 'చెడుగుడు' తక్కెట్లో బలా - బలాల్ని అంచనా వేసుకునే వారు. ఇక యువతులైతే గొబ్బియళ్ళ పాటల్తో కంచివరద రాజులను మా ముంగిళ్ళ దాకా తీసుకొచ్చేవారు. గంగరచ్చ దగ్గర 'ఆట'కు వద్దిక నడుస్తూంటే, సత్తెమ్మ గుడికాడ పండరి భజన జెండాలెత్తుకొని నాట్యం చేసేది. వయసు మళ్ళినవారు రామాలయ పందిరి కింద ఆధ్యాత్మిక సాధన చేసేవాళ్ళు" (కన్నీటి సీమ). అంతే గాదు, ఊరు ఊరంతా ఒక కుటుంబంలా సాధక బాధకాలు పంచుకునే వారు. 'మా ఊరిలో ఏ ఒక్కరికి తేలుకుట్టినా, ఆ విషం ఊరంతా ఎక్కిపోయేది. బాధను అందరూ కలిసి మోసేవాళ్ళు.' ఇలాంటి సంస్కృతి ఇప్పుడెక్కడుంది? మనకులేని, మనవి కాని వస్తువులకు, ఆహారానికి, అలవాట్లకు బానిసను చేసి, మనల్ని మనకు కాకుండా చేసింది ప్రపంచీకరణ. టెలివిజన్ చేసిన మాయాజాలం, ప్రకటనల రూపంలో సినీ, క్రీడా ప్రముఖులు నటించిన ప్రకటనల రంగుల కలను సాకారం చేసుకొనే భ్రమలో ఫేరన్ లౌప్లీ నుంచి బూస్ట్ దాకా, పారాగాన్ చెప్పుల నుండి పరాయిదేశ సారాయి దాకా వారు చూపించే బ్రాండ్ బొమ్మలకు బానిసలై పోయాం. ఇక సెల్ఫోన్లు వచ్చాక, ఇంట్లో ఉన్న ఏ ఇద్దరూ మనసువిప్పి మాట్లాడుకునేంత తీరిక లేక సతమత

మౌతున్నారు.

ఈ పరుగుల యుగంలో పిల్లలు తల్లిదండ్రులను సేవకులుగా, ఏటిలుం కార్మలుగా గుర్తిస్తారు. తల్లి దండ్రులు కూడా క్రమశిక్షణ పేరుతో శిక్షకులుగా మారి పోయిన వస్తువులు ఐపోయారని కవులు గుర్తించారు.

జీవన పరిమళం / అదృశ్యమైన కాలంలో / ఆమె, అతడు రెండు వస్తువులు / వస్తు ప్రపంచంలో మెళకువలు / నైపుణ్యాలకే చోటు / ఇద్దరు శిక్షకులు / ఇద్దరు రక్షకులు / ఇద్దరు పాలకులు / ఇక అమ్మ ఎక్కడ? నాన్న ఎక్కడ?" (మాటల్లేని వేళ) అంటూ పలమనేరు బాలాజీ మాటలు తల్లిదండ్రులకు, బిడ్డలకు మధ్య ఆవిరైపోతున్న అనుబంధాన్ని చూసి ఆందోళన వ్యక్తం చేస్తాడు.

ఈ ప్రపంచీకరణ ఎంత దుర్మార్గమైందంటే, 'కన్నతల్లి చనుబాలను తాగనీకుండాచేసి, బాల్యపు మురిపాల ముఱ్ఱుపాల హక్కునూ కాలరాసిందని' (తప్తస్పృహ) మౌనశ్రీ మల్లిక్ వాపోవడాన్ని చూడవచ్చు. చివరికి భౌగోలిక పరిస్థితులకు అనుగుణంగా ఏర్పడిన కట్టు బొట్టులను కూడా చరిత్రపుటల్లోకి దిగజార్చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

కార్పొరేట్ వ్యాపారం సంస్కృతి :

కార్పొరేట్ వ్యాపారం ఊడల మర్రిలా నగరాలనుండి పల్లెల దాకా విస్తరిస్తోంది. నీళ్ళు, పాలు, కూరగాయలు, కిరాణా సరుకులు, స్కూళ్ళు, కాలేజీలు, రాజకీయాలు ఇలా కార్పొరేట్‌లు అడుగుపెట్టని వ్యాపార అంశం గానీ, ప్రదేశంగానీ లేదు. 'రూపాయి వస్తువుకు రెట్టింపు ధరలు వేసి, సగానికి సగం డిస్కౌంట్ ప్రకటించే మాయాబజార్లు' రాజ్యమేలుతున్నాయి. కిరాణా కొట్లు, బట్టల అంగళ్ళు, ఫ్యాన్సీస్టోర్లు ఇలా అనే దుకాణాలతో బతికే మధ్యతరగతి, చిరువ్యాపారులు ప్రపంచీకరణ ప్రభావంతో కార్పొరేట్లకు సేవకులుగా, కూలీలుగా, మారడమో, లేదా ఊరొదిలి పెట్టి పారిపోవడమో, లేదా ఆత్మహత్యతో జీవితాన్ని ముగించడమో చేస్తున్న సంఘటనలు కనిపిస్తాయి. ప్రముఖ కవి శిఖామణి ఇదే విషయాన్ని తెలియజెప్తూ-

"నగరం నల్లత్రాచు
ఇప్పుడు జరజరా పల్లెకు పాకి
డిపార్టుమెంటు స్టోరులై
సూపర్ మార్కెట్‌లై
బజారులై, సెంటర్లై, అనకొండలై
ఒక ఆరణాల షాపునేకాదు
గ్రామీణ భారతంలోని
అన్ని చిరు అంగళ్ళను దిగమింగి
వొళ్ళు విరుచుకుంటోంది (గిజిగాడు)

అంటాడు. మెగా మాల్స్ దెబ్బకు కుదేలై పోతున్న చిరువ్యాపారుల జీవితాలు ఇందులో స్పష్టంగా కని పిస్తాయి.

ఫ్యాషన్ రాగం :

గతంలో సినీకవి 'సముద్రాల' అందమె ఆనందం అంటే, తర్వాత శ్రీశ్రీ శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని అన్నాడు. ఇప్పుడు మనుషులు తెల్లగా ఉంటే చాలని అదే గొప్ప సౌందర్యమని రాస్తున్నారు. దాని ప్రతిఘటిస్తూ -

"మాకిప్పుడు మాయరోగం / తెల్ల మాయరోగం వచ్చి సచ్చింది / తెల్లసముద్రంలో ఈదితే గానీ / ఈ రోగ మిప్పుడు తగ్గి చచ్చేట్టు లేదు.... బొంబాయి వీధుల్లో / సామాన్యుల పొలి కేకే లేని / బాలీవుడ్ హీరోల గుంపులూ, ఫెయిర్ అండ్ లవ్లీ ముఖాలు (దళిత వ్యాకరణం - తులిమల్లి విల్సన్ సుధాకర్) మన జీవితాల్ని మోసం చేస్తున్నాయని వాపోతాడు కవి.

మన దేశంలో పౌష్టికాహారం లేక ఇరవై ఆరున్నరలక్షల మంది అనారోగ్యం పాలు అవుతుంటే, అందమే జీవితమనే అర్థాలను గుప్పిస్తూ పేదరికంలోని పిల్లలు కూడా ఇదేనేమో జీవితం అనుకుని ఫేర్ అండ్ లవ్లీ లాంటి క్రీములు కొనేటట్టు చేస్తున్నాయి. కష్టపడకుండా ఏదీ రాదు అనే సూక్తిని తోసిరాజని, తెల్లచర్మం ఉంటే అన్నీ వచ్చేస్తాయనే బ్రమల సందేశాన్ని ప్రబలంగా ఇస్తున్నారు.

దీన్నుండి యువతను బయటేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాధ్యమాల దుష్ప్రభావం :

రేడియో, సినిమా, పత్రికలు, టీవీలు, ఇంటర్నెట్, సెల్‌ఫోన్లు, వివిధరకాల యాప్‌లు మానవ సమాజాన్ని ఒక అడుగుముందుకు, రెండడుగులు వెనక్కి నడిపిస్తున్నాయి. సమాచారాన్ని పొందడానికి, జ్ఞానం సాధించడానికి, ఉన్నతంగా ఎదగడానికి మాధ్యమాలను వినియోగించుకోవడం తగ్గిపోతోంది. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే, ఒంటరిగా వేరే ప్రపంచంలోకి వెళ్ళిపోతున్న మనిషి చివరికి తన గురించి కూడా, తాను ఆలోచించలేక పోతున్నాడు. తిండి, నీళ్ళు, నిద్ర, ఆరోగ్యం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, చదువు లక్ష్యాలు ఇవేవీ స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటికి లాగలేకపోతున్నాయి. ప్రాణాలతో చెలగాటమాడే ఆన్‌లైన్ ఆటలు, మానసిక బలహీనతలను సొమ్ము చేసుకునే పోర్న్ వీడియోలు యువతను చీడపురుగుల్లా పట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక కవులు రాసిన కవిత్వం మనిషిని ఆలోచింపచేస్తోంది. "ఉదయాన్నే నెత్తుటి వార్తల్ని మోసుకొచ్చే పత్రికల్ని నిషేధించండి. అశ్లీలతను, అపహాస్యాల్ని, హింసను బోధిస్తున్న టీవీలను కట్టేయండి. ఎఫ్.టి.వి. మసాలా మత్తులో దారి తప్పుతున్న యువతను రక్షించాలని (మైనపు బొమ్మలు) మంచి దారిలో నడిపించాలని కోరుతుంటాడు లోసారి సుధాకర్.

ప్రపంచీకరణ ప్రభావం ఎంత వినాశన కారిగా మారిందో చెప్తూ "ప్రపంచం మరీ చిన్నదైపోతుందను కోలేదు. అంచుల్లేని కత్తి అవిశ్రాంతంగా కోస్తుందని ఊహించలేదు. వంచన వీరవిహారం చేసే రంగభూమిలో మనసు ఈ శతాబ్దపు తొలిముద్దాయి" (సూర్యోదయానంతరం) అంటారు షమీ ఉల్లా.

మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తూ, ఊపిరి సలుపు కోనీకుండా చేస్తున్న అరచేతిలోని టెక్నాలజీ 'మనసు'ను ముద్దాయిగా మారుస్తోందంటే ఒప్పుకొని తీరాలి. రెండు చేతులు అడ్డుపెట్టి గాలినుండి దీపాన్ని సంరక్షించుకున్నట్టు మనసును కాపాడుకోవడం ప్రతిరోజూ ఒక సాహసం.' అయినా మనసును రక్షించుకుంటే గాని, మనిషిగా మిగలలేం.

వలస సంస్కృతి :

మేధావుల్ని కన్న నా దేశం, తెలివైన వాళ్ళను విదేశాలకు ఎగుమతి చేసి ఈ కర్మభూమిపై తల్లిదండ్రుల్ని అనాథలుగా నిలబెడుతోంది. డాలర్ల వేటలో పడి బతుకును సంపన్నం చేసుకునే క్రమంలో యువత నిజమైన జీవితాన్ని అందులోని సంతోషాన్ని ఆవిరి చేసుకుంటోంది.

"ఇక్కడి యవ్వనాలు డాలర్ దేశాలకు ఓన్ ల్యాండ్ నుండి టాకాఫ్ తీసుకుంటున్నాయి. దేశంలో డాలర్ చొరబడినప్పుడే, ఇక్కడి యవ్వనాల్లో కంప్యూటర్లు చొరబడ్డాయి... ఫాస్టుఫుడ్, కూల్‌డ్రింకు, స్కిన్ టైట్ జీన్స్, సిగరెట్ శ్వాస, పొడవాటి జుట్టు, మీసం లేని మూతి, వాడో కంప్యూటర్ గీసిన చిత్రం" (వలస యవ్వనం) లా ఉందని అంటాడు ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్. ఈనాటి యువకుల ముఖచిత్రాన్ని ఆధునిక కవిత్వం ఆవిష్కరిస్తోంది.

వలస సంస్కృతి ఎంత భయానకంగా ఉంటుందో చెప్తూ "నాలుగు రాళ్ళ కోసం, చలికి ఎండకు వానకు తట్టుకొని రాత్రీ పగలూ ఎవడి కోసమో ఊడిగం చేస్తూ, తల్లిదండ్రులకు పెళ్ళాం పిల్లలకు దూరంగా, పుట్టినరోజు నుండి కళ్ళల్లో కలలా అమెరికా కనిపిస్తుంటే, పసితనాన్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని పాతరేసి, గూగుల్నే ప్రపంచంగా చేసుకొని, మార్కులు ర్యాంకులు తప్ప, రెండోధ్యాస లేకుండా, జీవితమంతా పరుగెత్తి పరుగెత్తి సాధించిన అమెరికా ప్రయాణం చివరకు ఒకే ఒక్క క్షణంలో విధి పేరుతో బలైపోతుంది... వైట్‌హౌస్ రక్తపు మరకలు దగ్గరకు వెళితేగాని కనిపించవు (మూడో మనిషి) అంటున్న ఆచార్య మాడభూషి సంపత్కుమార్ మాటలు

అక్షర సత్యాలు. అమెరికాలో జరుగుతున్న శ్రమ దోపిడిని చిత్రిస్తూ... "రూపాయిని చీప్‌గా కొట్టేసినట్టే, నా శ్రమను కూడా చీప్‌గా కొంటున్నాడన్న ధ్యాస నాకు లేదు. చల్లని గదుల్లో వెచ్చని డాలర్ల కోసం పరితపిస్తున్నా, ఏ నాడూ దేశం కోసం పనిముట్టుకోని నేను, వాడికి 'పనిముట్టు'గా మారిపోయాను (చివరకు నువ్వే గెలుస్తావు) అని ఆత్మ పరిశీలనలోకి లాక్కెల్తాడు. అందమైన అమెరికా కలల్లో కర్కశ కత్తులు పొంచి ఉన్నాయని, యాంత్రిక జీవితంలో సంతోషం ఇంకిపోతుందని సంపత్కుమార్ హెచ్చరిస్తాడు.

"డబ్ల్యు.డబ్ల్యు.డాలర్.కామ్‌లో పేగుబంధం చిలక పలుకుల కుశల ప్రశ్నలేస్తుంది. ఉద్వేగమై బరువెక్కిన రహస్యదుఃఖం ఏ మేలూ చేయని ఈమెయిల్‌పై అబద్ధ క్షేమ సమాచారాన్ని అత్యవసరంగా చేరవేస్తుంది." (నాది కాని కల - బెల్లంకొండ రవికాంత్) ఆశల సౌధాల కోసం అందర్నీ వదిలి వెళ్ళిపోయిన వారిలో 'కొంతమంది యోగ క్షేమాలను నటిస్తున్నారని' కవి ఆవేదన వెలిబుచ్చుతాడు. 'పుటక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అని కాళోజీ నారాయణరావు అంటే, పుటక నీది, చావు నీది, బతుకంతా విదేశానిది అన్నట్టుగా పరిస్థితులు పరిణమించాయి.

భారతదేశాన్ని ప్రపంచీకరణ వలలో పడేసింది ఆనాటి ప్రధాని పి.వి. నరసింహారావు. అభివృద్ధి పేరుతో ఆర్థిక ఒనరుల నమీకరణ కోసం విదేశీ పెట్టుబడులను బాహాటంగా స్వాగతించాడు. ఆయన తెచ్చిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణకు గట్టి పునాదులేశాయి. ఈ పరిస్థితులు మన గ్రామీణ జీవితాన్ని అతలాకుతలం చేశాయని ఒక కవి వాపోతాడు.

"మన నర్సిమ్మ
కాయితాల మీదదస్కత్ చేసిండు
ఆడు పోసిన గంజినీళ్ళు తాగమంటడు
సెండ్లల్ల, సెలకలల్ల సల్లే ఇత్తనాలు ఆడే ఇత్తడు
ఇంకేమన్న ఉంద బిడ్డ
పత్తి సేను ఆడిదే అయితది
పంట సేను ఆడిదే అయితది"

(గ్లోబల్ ఖడ్గం - కృష్ణమూర్తి యాదవ్)

అంటాడు కవి. 21వ శతాబ్దంలో వచ్చిన, వస్తున్న మార్పులు భారతీయ సమాజాన్ని సంపూర్ణంగా ఆవహించాయి. మన గురించి మనం ఆలోచించుకునే సమయాన్ని కూడా లేకుండా చేస్తున్న టెక్నాలజీ నుండి, హ్యాకింగ్‌ల ద్వారా కోట్లు దోచేస్తున్న స్థితిదాకా ప్రపంచీకరణ ప్రభావం ఉంది. ఇది రంగురంగుల మాయలో మనుషుల్ని బంధించి, స్వీయ ఆలోచనా శక్తిని హరించి, జీవిత విలువల్ని తలకిందులు చేస్తోంది. పదిమంది కోసం పాటు పడే దశ నుండి, ఒకడి కోసం పదిమందిని దోచుకున్నా ఫర్వాలేదు అనే స్థితిలోకి మనల్ని నెట్టేసింది. ఆహార ఉత్పత్తులకన్నా అణుబాంబుల ఉత్పత్తే గొప్పదని చాటిచెప్పే దుర్మార్గమైన సంస్కృతే భూమిపై జీవుల మనుగడనే ప్రశ్నార్థకం చేయబోతోంది. మనిషి మనిషిగా మిగలాలంటే విలువల దారం పట్టుకొని మళ్ళీ వెనక్కి రాకతప్పదు. మానవ చైతన్యం వసుధైక కుటుంబం వైపు నడిపించడానికి కవులు, రచయితలు నిరంతరం శ్రమించక తప్పదు.

ఆధార గ్రంథాలు :

1. సడ్లపల్లి చిదంబరరెడ్డి - మహాభినిష్క్రమణం (2019)
2. వి. రాఘవేంద్ర - గాయపడ్డ విత్తనం (2019)
3. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి - బడి (2018)
4. డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి - కన్నీటి సీమ (2003)
5. మౌనశ్రీ మల్లిక్ - తప్తస్పృహ (2015)

6. పలమనేరు బాలాజీ - మాటల్లేని వేళ (2007)
7. శిఖామణి - గిజిగాడు (2012)
8. తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ - దళిత వ్యాకరణం (2007)
9. లోసారి సుధాకర్ - మైనపు బొమ్మలు (2012)
10. షమీ ఉల్లా - సూర్యోదయానంతరం (2011)
11. జూకంటి జగన్నాథం (సంపాదకుడు) - గ్లోబల్ ఖడ్గం (2004)
12. ఆచార్య మాడభూషి సంపత్కుమార్ - మూడో మనిషి (2017)
13. డా॥ కొండెపోగు .బి. డేవిడ్ లివింగ్ స్టన్ - అరణ్యంలో కేక (2007)
14. డా॥ ఎల్.కె. సుధాకర్ - కొబ్బరాకు (2003)
15. ప్రసాదమూర్తి - మాట్లాడుకోవాలి (2007)

❖ ❖ ❖

అత్యాధునిక సాహిత్యం – ప్రపంచీకరణ ప్రభావం

– డా॥. పి. కాశియప్ప, సహాయక ఆచార్యుడు, తెలుగుశాఖ, డి. జి. వైష్ణవ కళాశాల, చెన్నై.

ఆధునిక సాహిత్యంపై ప్రపంచీకరణ ప్రభావం పెద్ద స్థాయిలో ఉంది. సాహిత్యంతో పాటు ప్రపంచీకరణ ప్రభావం అన్ని రంగాలపై కూడా పడింది. ప్రపంచీకరణ ప్రభావితం చేయని రంగం లేదు. తెలుగు సాహిత్యంపై కూడా దాని బలమైన ప్రభావానికి లోనైయింది. సాహిత్యం నిత్యం అనుశీలమైనది. కాబట్టే సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా సాహిత్యం దాని తీరును, రూపాన్ని మార్చుకుంటుంది. సాహిత్యం సమాజాన్ని నిత్యం అధ్యయనం చేయటం వలన ప్రపంచీకరణ పరిణామాలపై సాహితీకారులు ప్రతి స్పందిస్తారు. ప్రపంచీకరణ అనేది సాహిత్యపరంగా చూస్తే స్థానిక లేదా ప్రాంతీయ విషయాలను ప్రపంచ విషయాలుగా మార్చేసే ప్రక్రియ. ప్రపంచంలో ప్రజలందరినీ ఏకం చేసి ఒకే సమాజంగా కలిసికట్టుగా పనిచేసేటట్టు చూసే ఒక పద్ధతిగా దీన్ని చెప్పవచ్చు. ఈ క్రమంలో అత్యాధునిక సాహిత్యంపై ప్రపంచీకరణ ప్రభావ విశేషాలను గురించి చర్చించడమే ఈ వ్యాస ఉద్దేశం.

తెలుగు సాహిత్యం – ప్రపంచీకరణ నేపథ్యం :

"గ్లోబలైజేషన్" అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో "ప్రపంచీకరణ" అనే పదాన్ని వాడుతున్నాం. గ్లోబలైజేషన్ అనే పదం గ్లోబస్ అనే లాటిన్ పదం నుండీ గ్లోబ్ అనే పదం ఏర్పడింది. దీనర్థం భూగోళం. దీని నుండే కాలక్రమంలో గ్లోబలైజ్ అనే క్రియాపదం ఏర్పడి, ఆ గ్లోబలైజ్ ప్రక్రియను తెలపడానికి గ్లోబలైజేషన్ అనే పదం ఏర్పడింది. 1960 తర్వాత ఈ గ్లోబలైజేషన్ ప్రాచుర్యం పొందింది. మొదటిసారిగి 1962లో మార్షల్ మెల్ లూహన్ అనే కెనడా జాతీయుడు తన 'వార్ అండ్ పీస్ ఇన్ గ్లోబల్ విలేజ్' అనే గ్రంథంలో "విశ్వగ్రామం" అనే పదబంధాన్ని ప్రయోగించడం ద్వారా 'ప్రపంచీకరణ' అనే భావనను వెలిబుచ్చారు.

ప్రపంచీకరణ పితగా భావించే రోలాండ్ రాబర్ట్‌సన్ 1990 నాటి 'గ్లోబల్ కల్చర్' అనే గ్రంథంలోని 'మ్యాపింగ్ ది గ్లోబల్ కండిషన్ : గ్లోబలైజేషన్ యాస్ ది సెంట్రల్ కాన్‌సెప్ట్' అనే వ్యాసంలో ప్రపంచీకరణ భావాన్నీ, ప్రభావాన్నీ ఎంతో పరిశీలనాత్మకంగా, ఆచరణాత్మకంగా సామాజిక దృష్టితో విశ్లేషించారు. దీంతో ఈ పదం ప్రపంచానికి పరిచయం కావడం మొదలైంది. సమాజశాస్త్రవేత్త యస్.ఎల్. దోషి ఇలా అంటారు. "ఇంగ్లీషు, ఫ్రెంచి, స్పానిష్ మరియు జర్మన్ భాషల ప్రధాన నిఘంటువులేవీ 1980 లేదా 1990 ప్రథమార్థం వరకూ గ్లోబలైజేషన్ పదాన్ని చేర్చలేదు. కానీ జపాన్ 1980లోనూ, చైనా 1990లోనూ, 'ది సోషియల్ సైటేషన్ ఇన్‌డెక్స్' లో 1980లోనూ గ్లోబలైజేషన్ పదం కన్పించినా, 1992 తర్వాత అది విరివిగా ప్రయోగింపబడుతోంది" అని తన గ్రంథమైన "పోస్ట్‌మోడర్న్ ప్రస్పెపెక్టీవ్ ఆన్ ఇండియన్ సొసైటీ"లో పేర్కొన్నారు.

నేటి ప్రపంచాన్ని నడిపిస్తున్న సామాజిక చలన సూత్రాలలో ప్రపంచీకరణ బలీయమైనది. ఏ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాహితీవేత్తలూ దీనిని విస్మరించి ముందుకెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. మానవ జీవితంలోని ప్రతి కదలికనూ, ప్రపంచీకరణ ప్రభావితం చేస్తోంది. ప్రతి మనిషికీ 'ప్రపంచీకరణ' అంటే ఏమిటో తెలియకపోవచ్చు, జీవితంలోని కదలికకు, కుదుపుకు కారణం ఇదేనని అర్థం కాకపోవచ్చు. జీవితాల్లో తీవ్ర మార్పులకు మాత్రం అందరూ తడబడుతున్నారు. భయపడుతున్నారు. అయోమయానికి గురవుతున్నారు. జీవితాన్ని వ్యాఖ్యానించడమే కవిత్వం. సమాజంలో వచ్చే తీవ్రమైన అనుహ్యమైన

మార్పులను సామాన్య మానవుడు తొందరగా అర్థం చేసుకోలేడు. గాయపడ్డ మనిషి, భయంతో, బెంగతో ఉన్న మనిషి, అయోమయంలో ఉన్న మనిషి కళ్ళ ముందున్నప్పుడు సాహిత్యం ఆకాశంలో చూపులు నిలపదు. కాగడాగా మారి దారి చూపుతుంది. మానవ జీవితాన్ని ఇంతలా అతలాకుతలం చేస్తున్న ప్రపంచీకరణ పట్ల తెలుగు సాహిత్యం 'కేసరి పిట్టలా' హెచ్చరిస్తూనే ఉంది.

సాహిత్య ప్రక్రియల్లో తక్షణ స్పందనాభివ్యక్తికి సరైన వేదిక కవిత్వం. సూక్ష్మస్థాయిలోకి చొచ్చుకెళ్ళగలిగే సౌలభ్యం కవిత్వానికి ఎక్కువగా ఉంటుంది. అందుకే మార్పును ఒడిసిపట్టి, వెంటనే స్పందిచడంలో కవిత్వం ఎప్పుడూ ముందే ఉంటుంది. ప్రపంచీకరణను అర్థం చేసుకోవడంలోనూ, వ్యతిరేకించడంలోనూ, కవిత్వంలోకి అనువదించడంలోనూ కవిత్వం క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఉంది. ఆధునిక కాలంలో వచన కవితా విస్తృతికి మరో కారణం ప్రపంచీకరణ. ఇది మొదట ఆర్థిక ప్రక్రియగా మొదలై ఆ తర్వాత అన్ని రంగాలనూ ఆక్రమించింది.

అత్యాధునిక సాహిత్యం – ప్రపంచీకరణ ప్రభావం:

1990 తర్వాత స్త్రీవాద, దళిత సాహిత్యాల ప్రభావం బలంగా ఉంది. 1990 నుండే ముస్లింవాద సాహిత్యం కూడా రావడం జరిగింది. ఇదే సమయంలో ప్రాంతీయ చైతన్య సాహిత్యం కూడా రావడం జరిగింది. 90వ దశకం నుండి చోటుచేసుకున్న మార్పులకు అనుగుణంగా మధ్యతరగతి ఆకాంక్షలను వారి స్వప్నాలను తెలియజేస్తూ కవిత్వం రావడం మొదలైంది. ఇదంతా ప్రపంచీకరణ ఫలితం అని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. 1990 దశకం నుండి నూతన ఆర్థిక విధానాలు జనజీవితాల్లోకి చొరబడటంతో అన్ని వాదాల సాహిత్యకారులు దీనిపై స్పందించి సాహిత్యం వెలువడడంతో ప్రపంచీకరణ అనేది నేడు ఒక ధోరణిగా మారింది.

అత్యాధునిక కవిత్వం – ప్రపంచీకరణ ప్రభావం:

ప్రపంచీకరణ కమ్యూనిస్టు, విప్లవ, స్త్రీ, దళిత, మైనారిటీ వాదులలో భిన్నాభిప్రాయాలున్నా ఎవరూ 'ప్రపంచీకరణ'కు ఆవలగా వెళ్ళి కవిత్వం రాయలేని అనివార్యత నెలకొంది.

"మనిషి గాయపడుతుంటే
కవి మౌనంగా వుండగలడా?
కంటికి నిద్రపడుతుందా?

(అవిశ్రాంతం – రాధేయ, పు. 9)

అంటే పట్టదు. ఒకవేళ నిద్రపడితే అతడు కవిగాడు. మహాప్రస్థానానికి యోగ్యతా పత్రంలో చలం అన్నట్లు "పట్టుదిళ్ళలో తలలు దూర్చి, భాగ్యవంతుల పాలిటి ఈశ్వరుడి మీద స్తోత్రశ్లోకాలు చదువుతూ - ఆల్ ఇస్ వెల్ విత్ ది వరల్డ్" అనుకుంటూ నిద్రపోయేవాళ్ళు". వాళ్ళది స్తోత్రం. కవిత్వం కాదు.

"వ్యవస్థీకృత హింసోన్మాదానికి
గురి పెట్టే లక్ష్యం కవిత్వం
కవిత్వమొక సామాజిక సంస్కారం
ద్రోహచింతనై ధిక్కార స్వరం"

(అవిశ్రాంతం – రాధేయ, పు. 11)

అని రాధేయ కవిత్వ లక్ష్యాన్ని గురించి పేర్కొంటాడు. అలా చూసినప్పుడు ఒక ఉద్యమ స్థాయిలో తెలుగులో ప్రపంచీకరణ కవిత్వం వచ్చింది. 1991 నుండీ భారత దేశంలో ప్రపంచీకరణ యుగం మొదలైనా అంతకు ముందుగానే తెలుగు కవులు దాని రాకను పసిగట్టారనే చెప్పాలి. 1987 జనవరి 15 నాడే జూకంటి జగన్నాథం రచించిన 'సంధికాలం' కవిత అందుకొక నిదర్శనం.

"సమస్త విలువలు నశిస్తాయి
పెట్టుబడి అన్ని రంగాలనూ
ఇనుప కౌగిలిలోకి
లాక్కొని బుజ్జగిస్తున్నప్పుడు సమస్త విలువలు
నశించిపోయాయని"

(జూకంటి జగన్నాథం కవిత్వం -1 –
జూకంటి జగన్నాథం, పు. 17)

అనాడే హెచ్చరించాడు. ఆ తర్వాత 1994 జనవరిలో వచ్చిన ''కవితా! ఓ కవితా' సంకలనంలో డీహ్యూమనైజేషన్ (వసీరా), పరాయికరణ (సుంకిరెడ్డి నారాయణ రెడ్డి), నాగలి విరిగిన చప్పుడు (పాపినేని శివశంకర్), పగిలిన పాట (దర్భశయనం శ్రీనివాసాచార్య) కవితలలో ప్రపంచీకరణకు ముందు దశను పసిగట్టిన అనవాళ్ళు చూడవచ్చు. ప్రపంచీకరణ ప్రభావంతో తెలుగులో కవితా సంపుటాలుగా సంకలనాలుగా రావడం 1995 తర్వాతనే మొదలైంది.

తెలుగు కవులు కేవలం భారతదేశంలోని సంఘటనలకే కాక ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలో జరిగినటువంటి సంఘటనలకూ ప్రతిస్పందించారు. నైజీరియాలో కెన్‌సారోవివాను ఉరితీయడాన్ని తీవ్రంగా నిరసించడంతోపాటు 1997లో ప్రజారచయితల సంఘం వారు ఒక సంకలనాన్ని తీసుకువచ్చారు. 1997 తర్వాత జూకంటి జగన్నాథం, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్‌ల సంపాదకత్వంలో ఒక బలమైన వ్యక్తీకరణగా గ్లోబల్ ఖడ్గం కవితా సంకలనం వచ్చింది. 2000లో బషీర్‌బాగ్‌లో విద్యుత్ చార్జీల వ్యతిరేక నిరసనకారులను ప్రభుత్వం కాల్చి చంపింది. ఈ నేపథ్యంలో 'వికసించిన విద్యుత్ తేజం' కవితా సంకలనం వచ్చింది. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కొండేపూడి నిర్మల 'మల్టీనేషనల్ ముద్దు' అనే కవితా సంకలనం తీసుకొచ్చారు. ఈ సంకలనం స్త్రీవాదులు పురుషాధిక్యంతో పాటు ప్రపంచీకరణను కూడా వ్యతిరేకిస్తున్నారు అనే వాదనను బహిర్గతం చేసింది.

ప్రపంచీకరణ తర్వాత తెలుగు కవిత్వంలో ఎలాంటి మార్పులు వచ్చాయో అక్షర సాక్షిగా నిలిచే కవితలతో వచ్చిన సంకలనాలను గమనిస్తే 2001లో వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌పై జరిగిన దాడితో అమెరికా భయంతో వణికిపోయింది. ఈ నేపథ్యంలో 'కాగితప్పులి కళ్ళలో భయం' అనే కవితా సంకలనం ఎన్.వేణుగోపాల్ సంపాదకత్వంలో వచ్చింది. వంశీకృష్ణ 'డబ్బుపిట్ట', ఎండ్లూరి సుధాకర్ 'నల్ల ద్రాక్ష పందిరి', శిఖామణి 'నల్లగేటూ నంది వర్ధనం' శివారెడ్డి 'అంతర్జసం', శ్రీకాంత్ 'యితర' అద్దేపల్లి రామమోహన్ రావు 'పొగచూరిన ఆకాశం', శిలాలోలిత 'ఎంతెంతదూరం' జిలకర శ్రీనివాస్ 'కలల గొలుసు', దాదాపు పది సంవత్సరాల ప్రపంచీకరణ కవిత్వంను 'అనేక' అనే పేరుతో అఫ్సర్, వంశీకృష్ణ సంపాదకత్వంలో తీసుకురావడం జరిగింది. ఈ కవితా సంకలనాలు ప్రపంచీకరణ భారతదేశంలో తెస్తున్నటు వంటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలను భిన్న రూపాల్లో వ్యక్తీకరించడం జరిగింది.

అత్యాధునిక కథ - ప్రపంచీకరణ ప్రభావం :

ప్రపంచీకరణ ప్రభావం కేవలం ఒక రంగం అని కాకుండా అన్ని రాంగాలపై ప్రభావాన్ని చూపింది. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలతో పాటు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది. తెలుగు సాహిత్యంలో ఇతర ప్రక్రియల్లాగే ప్రపంచీకరణపై కథ వ్యతిరేక భావం ఎక్కువగా చూపినప్పటికీ ఇక్కడ కొంత అనుకూలత కూడా కనిపిస్తుంది. ప్రపంచీకరణ ప్రతిఫలాలను చిత్రించడంలో కవిత్వం, పాటకన్నా వచన సాహిత్యం కొంత ఆలస్యంగా రావటం కనిపిస్తుంది. మధ్యతరగతి ప్రజల మీద ప్రపంచీకరణ చూపిన ప్రభావాలను పేదల జీవితంలో వచ్చినటువంటి మార్పుల్ని కథలు బాగా చిత్రించాయి. వ్యవసాయం, విద్య, వైద్యం వంటి విషయాల మీద కథ బలమైన ప్రభావం చూపింది. ముఖ్యంగా తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో ఉన్నటువంటి కరువు, చావులు, ఆత్మహత్యల్ని గురించి లోతుగా పరిశీలించింది. ప్రపంచీకరణ ఇతివృత్తంతో విశాలాంధ్ర బుక్ హౌజ్ ఒక కథా సంపుటిని వెలువరించింది. అలాగే మధురాంతకం రాజారం సాహితీ సంస్థ ప్రతి సంవత్సరం వచ్చే కథల్ని ఒక 'కథా సంకలనం'గా తీసుకువచ్చింది.

ప్రపంచీకరణ ఫలితంగా విదేశీ సంస్థల గుత్తాధిపత్యంపై ఓల్గా 'కోకాకోలా' అనే కథ రాశారు. విదేశీ కంపెనీతో లాభాలు విదేశాలకు వెళతాయి అనే నేపథ్యంగా మహమ్మద్ ఖదీర్ బాబు రచించిన 'పెండెం సోడా

సెంటర్', ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం కావడం. చేతివృత్తులు అంత రించడం, రైతులు ఆర్థికంగా చితికిపోవడం, మూతపడు తున్న ఫ్యాక్టరీలు ఇవన్నీ వినాశనం అవుతున్న సమాజ పరిస్థితిని సూచిస్తున్నాయి. ఈ దుస్థితిని చిత్రీకరించిన కథ కొండవీటి సత్యవతి 'వైరస్' అత్యాధునిక వస్తువుల రూపంలో విదేశాలనుండి వస్తున్న వస్తువుల కారణంగా స్థానిక కులవృత్తులు అంతరించిపోయే స్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చిన కథ అశోక్‌కుమార్ 'కులవృత్తులు'. ఈ కథలో ఫ్రిజ్‌లు వచ్చి కుండలు తయారీ మాయం కావడాన్ని చక్కగా చిత్రించారు రచయిత. ప్రపంచీకరణ నేపథ్యంలో చేనేత కార్మికులు జీవనోపాధిని కోల్పోయిన విధానాన్ని సుంకోజి దేవేంద్రాచారి రచించిన 'అన్నంగుడ్డ' కథ. ఇంకా ముదిగంటి సుజాతారెడ్డి 'జవాబులేని ప్రశ్నలు', 'వ్యాపారమృగం', కాసుల ప్రతాపరెడ్డి 'శిథిలం', ఓల్గా 'మార్పు', కాలువమల్లయ్య 'గ్లోబలి' వంటి అనే కథలు వచ్చాయి. తెలుగు సాహిత్యంలో కవిత్వం కన్నా బలంగా కథ ప్రపంచీకరణ ఫలితాను విశదీకరించి.

కాశీభట్ల వేణుగోపాల్, పి. రామకృష్ణ, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, చిలుకూరి దేవపుత్ర, సింగమనేని నారాయణ, కొమ్మిశెట్టి మోహన్ మొదలైన వారు ఎందరో తమ రచనల ద్వారా ప్రపంచీకరణ నేపథ్యాన్ని అభివ్యక్తీక రించారు.

అత్యాధునిక సాహిత్యం – ప్రపంచీకరణ ప్రభావ ఫలితాలు :

గ్రామీణ ముఖచిత్రం, రైతుల కడగండ్లు, విస్తరిస్తున్న వస్తు సంస్కృతి, హరించుకుపోతున్న బాల్యం, విచ్ఛిన్న మౌతున్న మానవ సంబంధాలు, జీవితంలో ప్రవేశించిన యాంత్రికత, మానవాంశలేని చదువులు, కొడిగడుతున్న భాషా సంస్కృతులు, విధ్వంసానికి గురౌతున్న పర్యా వరణం వంటి అంశాలు, ఇలా ఒకటేమిటి ఆధునిక జీవితంలోని సంక్లిష్టతల్నీ, సంక్షోభాలనూ, వైరుధ్యాలనూ, కుట్రలనూ అన్నింటినీ ప్రపంచీకరణ ప్రభావంతో తెలుగు సాహిత్యంలో చోటుచేసుకున్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే నేటి సమాజంపై ప్రపంచీ కరణ ప్రభావం ఎంతో ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఏమి జరిగినా దానిని ఒక వస్తువుగా స్వీకరించే పరిస్థితులు నేడు నెలకొంది. దీని ఫలితంగా ప్రపంచంలోని అన్ని భాష లతో పాటు తెలుగు భాషపై కూడా దాని ప్రభావం పడింది. దీనికి తోడు సాంకేతిక విప్లవం. సాంకేతిక విజ్ఞానం ఫలప్రదమైన ప్రపంచంలో అనేక దేశాలు అసమానమైన అభివృద్ధి సాధించాయి. అయితే, చాలా దేశాలు ఇంకా ఆశించినంత అభివృద్ధి సాధించలేక పోతున్నాయి. అభివృద్ధి పథంలో చేరిన దేశాలలో కూడా అనేక ప్రాంతాలు, అనేక జాతులు అనూహ్యమైన రీతిలో వెనుక బడి ఉన్నాయి. రవాణా, విద్యుత్ వంటి సౌకర్యాలే కాదు, సాగునీటికీ, త్రాగునీటికీ మొగంవాచిన ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఆధునికతకు మచ్చలుగా చెప్పవచ్చు. ఆధునికవిజ్ఞానం, అది సాధించిన ప్రయోజనం పరిమిత ప్రదేశాలకు, వర్గాలకు మాత్రమే లాభం సమకూర్చింది. ప్రాంతీయ అసమానతలకు పరోక్షంగా కారణమయింది. ఆధునిక సైబర్‌యుగ ప్రభావంతో గ్లోబు మన జేబులో ఇమిడిపోతున్నది. గ్లోబలైజేషన్ నినాదంతో వర్తక వాణిజ్యసామ్రాజ్యాలు విశ్వాన్ని కబళించే ప్రయత్నం చేస్తున్నాయి. ఒకవంక దారిద్ర్యం, నిరక్షరాస్యత, నిరు ద్యోగం గ్లోబులో ఒక భాగంగానే ఆకాశం అంత ఎత్తుకు ఎదిగిపోతున్నది. ఆధునికతలోని వైరుధ్యాలలో అతి ముఖ్యమైన అంశం ఇది.

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, మొదలైనవన్ని మన సంస్కృతిలో భాగం. పండుగలు ఉత్సవాలు అన్ని మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబం ధించి ఉంటాయి. ఇలా అనేకం మన సంస్కృతి సంప్ర

దాయాలను ప్రతిబింబిస్తుంటాయి. ప్రపంచీకరణ పేరిట శరవేంగా చొచ్చుకొస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతి దేశీయ సంస్కృతిని ధ్వంసం చేస్తుంది. లేకపోతే వస్తువినిమయ సంస్కృతిగా మారుస్తుంది. మన పండుగల ప్రాధాన్యాన్ని తగ్గించి విదేశీ విషసంస్కృతిని పెంచి పోషిస్తు ప్రజలను దోచుకుంటున్నాయి పెట్టుబడిదారీ సంస్థలు. తెలుగు వారికి ఉగాది కొత్త సంవత్సరాది. అయితే దీనికంటే నేడు జనవరి 1కి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నాయి.

మనం తినేటువంటి తిండి, మనం ధరించే వస్త్రాలు కూడా మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ప్రపంచీకరణ ప్రభావం వలన మన సంస్కృతిలోని అనేక విభాగాలు వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నాయి. ముఖ్యంగా ఆహారం, అలవాట్లు, దుస్తులు, మన పండుగలు, మన పరిసరాలు, మానవ ప్రవర్తన అభివృద్ధి పేరిట అనుహ్య పరిణామాలకు గురికాబడుతున్నాయి. ప్రపంచీకరణ ప్రభావం మూలంగా ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి అధికంగా విస్తరించి. విదేశీ కంపెనీలు భారతదేశంలో తమ రెస్టారెంట్లు స్థాపించి సంస్కృతి మార్పుకు కారణమయ్యాయి.

ముగింపు :

1990వ దశకం తర్వాత తెలుగు సాహిత్యాన్ని గమనిస్తే రెండు అంశాలు ప్రధానంగా కనపడతాయి. ఒకటి ప్రాపంచికత, స్థానికత. ఈ రెండింటిని ఒకటిగా కూడా పరిగణించవచ్చు. ప్రపంచీకరణ, దానిలో అంతార్భాగమైన అనేక అంశాలు, స్థానికతావాదం. ఈ రెండింటిని కలిపి లేదా వేరువేరుగా కానీ ఇతివృత్తంగా తీసుకోవడానికి రచయితలు ప్రయత్నం చేస్తారు. అలా ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ సాహిత్య ప్రక్రియల ఆధారంగా కులం, మతం, జెండర్, స్థానికత వంటి అస్తిత్వాల సమస్యలను చూపిన విధానం సాహిత్య అధ్యయనం ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది.

ఆధారగ్రంథాలు :

1. పేర్వరం జగన్నాథం - అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, సాహితీ సమితి, 1987.
2. సింగమనేని నారాయణ - సమయమూ - సందర్భమూ, విశాలాంధ్ర, 2005.
3. గుడిపాటి - గ్లోబలైజేషన్ సాహిత్య దృక్పథం, మొలక ప్రచురణ, 2002.
4. కె.ఆర్.చౌదరి - వ్యవసాయం - ప్రంచీకరణ, వీక్షణం పబ్లికేషన్స్, 2011.
5. మేడిపల్లి రవికుమార్ - ప్రపంచీకరణ కవిత్వం, ప్రజాజీవితం, ప్రజాసాహితి, 2003.

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో మృగ్యమవుతున్న మానవ విలువలు

– డా॥. చిలకా అనిత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

చిత్తూరు జిల్లాలో ఎందరో చెయ్యి తిరిగిన రచయిత లున్నా అందులో పులికంటి కృష్ణారెడ్డిది ప్రత్యేక స్థానం. డా॥ పులికంటి కృష్ణారెడ్డి గారు చిత్తూరు జిల్లా చంద్రగిరి తాలూక జక్కదొన గ్రామంలో 30-7-1931న పాపమ్మ గోవింద రెడ్డికి జన్మించారు. ఆయన ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి నాటక రంగాన్ని సాహిత్య రంగాన్ని ఉద్ధ రించాలనే తపనతో అనేక నాటకాలు రాసి నటించారు. కాని నాటక రంగంలో నిలదొక్కుకోవడం రాతి సేద్యమే నని గ్రహించి సాహిత్య సేద్యం వైపు దృష్టి మరల్చి భావస్ఫోరకమైన కథలు, గాథలు, గేయాలు, నవలలు, బుర్రకథలు, దళిత కథలు ఇలా ఎన్నో సాంఘిక ఇతి వృత్తాలను గైకొని సంస్కరణాభిలాషతో రచించాడు. దూరదర్శన్‌లో ఎడ్వజరీ కమిటీ మెంబర్‌గా కూడా పని చేశాడు.

అంతే కాకుండా తన 70వ యేట నుండి ఐదేండ్ల పాటు పులికంటి సాహితీ పురస్కారం పేరుతో ఐదుగురికి ఒక్కొక్కరి 5వేల రూపాయల చొప్పున సాహితీ పురస్కా రాలు అందజేశారు. 19-11-2007న ఆకస్మికంగా తన 76వ యేట శ్వాసకోస వ్యాధితో నిష్క్రమించారు.

"కథకి గొప్పతనం పట్టాలంటే కథ చిత్రించే జీవితం భూమి నుంచి లేవాలి" అని చలం అన్నట్లుగా ఇక్కడ పులికంటి అవసరమైన విషయాన్ని అవసరమైనంత మేరకు చెప్పిన కథలలో 'పులికంటి కథా వాహినీలోని 'ఇదీ ఈనాటి కథ'' నమ్మకం మొదలైన మానవ విలువ లనే అపహాస్యం చేసే వికృత సామాజిక శక్తిగా స్వార్థం కొత్త రూపాల్లో అవిష్కారం కావడాన్ని ఈ కథలో రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించారు.

"ఇది ఈనాటి కథ"లోని మానవ సంభంధాలు :

ఈ కథలో సుమతి ఒక బడిపంతులు కూతురు. ఆమెకు ఆమె తండ్రి ఆస్థిపాస్తులు ఇవ్వకపోయినా అంతో ఇంతో చదువును మాత్రం ఇవ్వగలిగాడు. సుమతి పల్లెకు ఆడపడుచు పట్నానికి కోడలు. సూర్యారావుకి ఇల్లాలు. ఉగాది పండగని తెల్లవారు ఝామునే లేచి పేడ నీళ్ళు కళ్ళాపు చిలకరించి ముగ్గు చిప్పతో వాకిట్లో వంగింది. అటుగా మోటరు సైకిల్ పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు సుమతి ప్రక్కనే ఆగడమే తరువాయి సుమతి మెడలో ఉన్న బంగారు గొలుసును తెంపుకొని పారిపోయారు. లోకులు కాకులు కదా! ఎవరి ఇష్టం వచ్చి నట్లుగా వారు అన్నట్లుగా "నీకొక్కదానికేనా పండుగ" ఏదో పుట్టి మునిగి పోతున్నట్లు ఇయ్యరవకాడ లేసేదెందుకు? ఇద్దో నగా నట్రా ధారపోసుకునే దెందుకు' అని పలురకాలుగా మాట్లాడంతో సుమతి మతి పోయినంత పని అయ్యింది.

ఆమూడు తులాల గొలుసు చేయించడానికి వాళ్ళ నాన్న పడిన అగచాట్లు గుర్తొచ్చాయి. ప్రావిడెంట్ ఫండ్‌లోను ఆయన సైకిలు ఇంకా చాలలేదని ఏడుకొండవాని కొరకని హుండిలో దాచిన డబ్బుతో నానా తంటాలు పడి ఆ గొలుసు చేయిస్తే చివరకు ఇలా అయిం దని సుమతి బాధపడుతుంది. ఆ బాధ మరచి కొంత మాములు మనిషి అవుతుందని సూర్యారావు అత్త గారింటికి వెళ్ళమని సలహా ఇచ్చిన సుమతిని బస్టాండులో దిగబెడదామని తాను కూడా వెళ్ళి బస్సు కోసం నిలబడిన సమయంలో బస్సు రాలేదు కాని గొలుసు తెంపుకు వెళ్ళిన దొంగలు సేట్ చందూలాల్ వద్దకు అమ్మకానికి తీసుకు వెళితే ఆ దొంగల్ని మోసం చేసే క్రమంలో చందూలాల్ ఆ గొలుసు నకిలీ అని చెప్పడంతో బస్టాండ్‌లో నిలబడిన సూర్యారావును ఆగి ఆగడంతోనే ఈ చెంపా ఆ చెంపా ఫెళా ఫెళా వాయించారు. "రాస్కెల్ గెతి లేని నా కొడకా పెళ్ళానికి గిల్టు నగలు పెడతావట్రా" అంటు రివ్వున

దూసుకెళ్ళారు. అంతా రెప్పపాటులో జరిగిపోయింది. ఏం జరుగుతుందో ఎందుకు జరుగుతుందో తెలియని అయోమయంలో సుమతి కొయ్యబారిపోయింది. చూసిన వాళ్ళు ఎవరు వాళ్ళు? ఎందుకు కొట్టారు? అయినా నువ్వేం మొగోడివయ్యా? కొడ్తా ఉంటే నిలువురాయిలాగా నిలబడి దెబ్బలు తినడమేనా? అంటూ చుట్టు ప్రక్కల వాళ్ళు గుంపులుగా తలోమాట అంటున్నారు. దాంతో సూర్యారావుకు తలకొట్టేసినట్లయింది.

సూర్యారావు సుమతి ఇంట్లోకి అడుగుపెట్టారు. సూర్యారావు కళ్ళల్లో చింతనిప్పులు కురుస్తున్నాయి. ఇక్కడ కోపం మూడు తులాల గొలుసు పోయిందని కాదు. పదిమందిలో ఎవరో ఆ చెంప ఈ చెంపా వాయించాడన్న పరితాపంతో కాదు. గిల్టు నగలు పెట్టి మోసం చేసిన మామగారిమీద కసి, కోపం. అది గిల్టు నగ అని తెలిసి కూడా మెడలో వేసుకొని మోసగించడమే కాకుండా ఇంత అవమానానికి కారణమైన భార్యమీద ద్వేషం.

ఆ కోపం, కసి సుమతి మీద పిడిదెబ్బలు, చెంప దెబ్బలు రూపంలో చూపించిన సూర్యారావు అలసి పోతే సుమతి సొమ్మసిల్లి పడిపోయింది. అప్పటికి గాని సూర్యారావు కోపం చల్లారలేదు. బస్టాండుకి వెళ్ళేటప్పుడు కలసి వెళ్ళిన జంట చందూలాల్ చెప్పిన ఆ అబద్ధానికి పిల్లి, ఎలుకలా తయారయ్యారు. వారి అన్యోన్య దాంపత్యం ఎటుపోయిందో తెలియదు. గెతి లేదని ఒక్కమాటంటే సరిపోతుంది కదా అనేది సూర్యారావు ఉద్దేశ్యం. భార్య మొకం చూడలేనంత ఏహ్యభావాన్ని మననంతా నింపుకున్నాడు. చివరకు భార్యను విషం తిని చావొచ్చు కదా అని అంటూ ఇంట్లో ఇద్దర్లో ఒక్కరే ఉండాలని అనుకోవడంలో ఒక్క అనుమానం. ఇద్దరి దాంపత్యంలో ఎంతటి పొరపొచ్చాలను తెచ్చిందో గమనిస్తాము.

ఇక్కడ సేట్ చందూలాల్‌కి బంగారం విలువకట్టడం తెలుసు. ఇతడు కాలము అంటే డబ్బు అని అక్షరాభ్యాసం చేసినప్పటి నుండి అభ్యాసం చేశాడు. అతడు అర్ధశరీరమని నమ్మే తనభార్యకన్నా, పెద్దలు చెప్పే మాట పున్నామ నరకం నుండి రక్షిస్తాడని ఒక్కగానొక్క కొడుక్కంటే చందూలాల్ తన అంగడినే ఎక్కువగా ప్రేమిస్తాడు. ఆయన అంగడిలో పూజకు పూలు అవసరం లేదు. పండ్లు అసలే అవసరం లేదు. వేళకు అంగడి తెరచి కాఫీకి కూడా కాలు బయట పెట్టకుండా ఇనప్పెట్టె ముందు కూర్చుంటే చాలనేది సేట్‌జీ విశ్వాసము. కాని ఆయన నమ్మకం ఎప్పుడూ వమ్ముకాలేదు.

ఒకనాడు సూట్‌కేస్‌లో సొమ్మును నింపుకుని రిక్షాకోసం ఎదురుచూస్తూ ఉండగా రిక్షా రావడం అందులో ఎక్కి కూర్చోవడం దిగిన తరువాత రిక్షావాడికి అర్ధరూపాయి ఇవ్వడంతో రిక్షావాడు ఆయన్ను ముగ్గుర్ని మూడు కిలో మీటర్లు తొక్కుకుంటూ వచ్చాననడం. ఆ గొడవకు చుట్టుప్రక్కల మార్వాడీలందరూ రావడం రాజీకుదిర్చే పనిలో ఉండగా అదే సమయంలో అటుగా వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ మోహనరావు గమనించడం, అక్కడకు జనాల్లోకి చేరి ఆ రిక్షావాణ్ణి ఒకరకంగా చూస్తూ మరో రకంగా నవ్వుతూ "ఏరా కేడీనా కొడకా... ఇక్కడ చేరావ్ అంటూ దబాయిస్తూనే ధైర్యం చెప్పాడు. దాంతో రిక్షావాడు అబద్ధాల కథలతో అల్లుకు పోయాడు తాను దొంగిలించినవన్నీ తాను చందూలాల్ సేట్‌కి ఇస్తున్నట్లు దానికి ప్రతిఫలంగా పదో పాతికో తీసుకుంటున్నాట్లుగా అతి వినయంగా తన సహజ ధోరణిలో రిక్షావాడు పాచికను విసిరాడు. అంతటితో ఇన్‌స్పెక్టర్ మోహనరావు అయితే మీ ఇద్దరు తోడుదొంగలని ఇద్దర్నీ స్టేషన్‌కి రమ్మని గదమాయించాడు. దాంతో తన ప్రమేయమేమి లేనప్పటికిని చందూలాల్ కూడా స్టేషన్‌కి వెళ్ళవలసి వచ్చింది. పొట్టోణ్ణి పొడుగోడు కొడితే పొడుగోణ్ణి పోచమ్మ కొట్టిన చందాన చందూలాల్ బంగారు నగను గిల్టు నగగా నమ్మబలకడంతో సుమతి నగ అమ్మడానికి వచ్చిన దొంగలు దాన్ని అక్కడే వదిలి వెళ్ళడం. వారు వెళ్ళిన తరువాత ఆ నగను కళ్ళకద్దుకుని ఇనపెట్టెలో వేసుకున్నాడు. అటువంటి మోసాలన్ని ఏకమై చెయ్యని నేరానికి ఒక రిక్షావాడితో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళవలసి వచ్చింది. చేసిన పాపం ఊరికే పోదుకదా!

ఎం.ఎల్.ఏ ఎరుకలయ్య తన పనిలో తలమునకలై ఉన్నాడు ఒకవైపు బదిలీలు, మరోవైపు కాంట్రాక్టర్లు, మరో ప్రక్కన పెన్షనర్లు మొదలైన వారి అర్జీలతో వచ్చిన ప్రతి ఒక్క సమస్యలను ఓపికతో వింటూ వారికి సమాధానాలు చెబుతూ అష్టావదానిలా తికమక పడుతున్న సమయంలో ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ నుండి ఫోన్ మ్రోగింది. మీ నగలు దొరికాయని ఆ ఫోన్‌కాల్ సారాశం. వెంటనే మూడో కంటికి తెలియకుండా తానే కారు నడుపుకుంటూ వెళ్ళి చిరునవ్వుతో సూట్‌కేస్‌ను తీసుకొని కారులో కూర్చుంటున్న సమయంలో ఇన్‌స్పెక్టర్ తన ప్రమోషన్ గురించి అడగడం దాంతో ఎం.ఎల్.ఏ ముందుగా రామ్మోహన్‌కి రాష్ట్రపతి అవార్డుకి రికమెండ్ చేస్తాననడంతో పోలీసు డిపార్ట్‌మెంట్ రాజకీయ నాయకుల మనస్తత్వం మనకు ద్యోతకమవుతుంది. ఒకప్పటి పేద ఎరుకలయ్య వెనుకబడినవాడు కాని నేడు మాత్రం తాహసీల్దార్‌ను దబాయించడంలో కాని ఆర్టీవోను హడలు గొట్టడంలో కాని పోరంబోకుల్ని పేదలకు పంచి ఆస్తులను పెంచుకోవడంలో వెనుకపడలేదు.

ఎరుకలయ్య తీసుకెళ్ళిన సూట్‌కేస్‌లోని నగల్ని ఒకొక్కటిగా తన ఒంటిపై పెట్టుకుని చూసి మురుసుకుంటున్న తన భార్య తన అందాకనికి తనే మురిసిపోతూ ఒకప్పుడు గిల్టు నగలు అమ్ముకుని బ్రతికిన సంగతి మరచిపోయింది. హెడ్ కానిస్టేబుల్ భార్య తన రవ్వల నెక్లెస్ చూసుకుంటూ మురిసిపయింది పెద్దింట్లో చిన్నావిడ.

ఒకప్పుడు చందూలాల్ కింద నిలబడి తలెత్తి తన మేడ చివరి అంతస్థును చూసిన పాపాన పోలేదు. అతను చూడలేదని అది పెరగటం మానలేదు. 'బంగారం పోతే పోయింది. బగారం లాంటి భర్త ఉన్నాడు కదా'! అనుకునే సుమతీ.

ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలు మృగ్యం అని ఈ కథలో ఉన్న సుమతీ సూర్యారావు మనస్తత్వం కాని చందూలాల్ కుహనా ప్రవర్తన, రామ్మోహన్ లాంటి ఇన్‌స్పెక్టరు తన ప్రమోషన్ కోసం అడ్డదార్లు తొక్కడం. ఎం.ఎల్.ఏ ఎరుకలయ్య. తాను నగలు పోగొట్టుకోక పోయినా పోయినట్లు నాటకమాడడం ఇవన్నీ సగటు మానవ ప్రవర్తనకు అద్దం పడుతుంది. ఇటువంటి వారి కంబంద హస్తాలతో గొంతు నులుము తుంటే ఈ దేశంలో ఊపిరాడక విలవిల కొట్టుకుంటున్న సుమతీ సూర్యారావు లెందరో!

ఆధార గ్రంథాలు :

1. పులికంటి కథావాహిని - విశ్వంభర పబ్లికేషన్
2. పులికంటి కృష్ణారెడ్డి సీమబారతం - విశ్వంభర పబ్లికేషన్
3. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి. (తెలుగు కథానిక శతజయంతి సంవత్సరోత్సవ దీపిక)

❖ ❖ ❖

ప్రపంచీకరణ కథలు - మానవ సంబంధాలు

- బూదూరు కుమారి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, చిత్తూరు జిల్లా.

ప్రపంచీకరణ :

పెట్టుబడి, వాణిజ్యం, టెక్నాలజి, వస్తువినిమయం మొదలగునవి ఒక జాతీయ దేశానికి పరిమితం కాకుండా ప్రపంచమంతటా విస్తరించే క్రమాన్ని ప్రపంచీకరణ అన వచ్చు. అగ్రరాజ్యాల ఆలోచనా ఫలితమే ప్రపంచీకరణ. ఆ ప్రభావంలో ప్రజలు తమ సంస్కృతి మూలాల నుండి వేరుపడే పరిస్థితి ఏర్పడుతోంది. దేశంలో ప్రవేశించిన ప్రైవేటీకరణ, బహుళజాతి సంస్థల ప్రమేయం, కార్పొరేట్ వ్యవసాయం (వాణిజ్యం పంటల ప్రోత్సాహం) ఆక్వా కల్చర్, ఆధునీకరణ, సరళీకృత విధానం (విదేశీ పెట్టు బడులకు ఆహ్వానం) వంటి అంశాలు ప్రపంచీకరణ వివిధ రూపాలే! ఈ విధాన వల్ల ప్రధానంగా దెబ్బ తింటున్నది మానవ సంంధాలే!

ప్రపంచీకరణను సమర్థించేవాళ్ళు ఇదొక నూతన ప్రక్రియ దీనిని ఆహ్వానించలేని వాళ్ళంతా అభివృద్ధికి దూరమవుతారని అంటున్నారు. దీనిని వ్యతిరేకించే వాళ్ళు మాత్రం ఇది దేశాల రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలను ప్రభావితం చేసి చివరికి ఆ రంగాల క్షీణతకు కారణమవుతుందని చెబుతున్నారు. అయితే ప్రతీ విషయంలో అనుకూల ప్రతికూల అంశాలు రెండూ ఉంటుంది.

ప్రపంచీకరణ కథా కాలం :

తెలుగులో కథలు చెప్పె సాంప్రదాయం ప్రాచీనకాలం నుంచే ఉంది. తెలుగు లిపి పుట్టకముందే, జానపదులు సందర్భానికి తగ్గట్టు కథలు అల్లుకుని వాటిని చెప్పు కుంటూ కాలక్షేపం చేసేవారు. విస్తృత జీవితంలో రోజుల తరబడి చెప్పే కథలు మౌఖిక సంప్రదాయంలో ఉన్నాయి. సమాజంలో ఎన్ని మార్పులొచ్చినా కథా సంప్రదాయం మాత్రం కొనసాగుతూనే ఉంది. కనుక మనిషి ఉన్నంత వరకు ఇది కొనసాగుతుంది.

తెలుగు సాహిత్యంలో 1910 నుంచి కథా సాహిత్యం మొదలైందని చెప్పవచ్చు. ప్రపంచీకరణ ప్రభావ కథలు దాదాపు 1990 నుంచి వెలువడుతున్నాయి. "ప్రపంచాన్నీ, తరతరాలుగా సంతరించుకొన్న మానవ సంబంధాలనూ పటాపంచలు చేస్తున్న రాజకీయార్థికాంశాల నేపథ్యంలో కళాత్మకంగా ఓ ప్రక్రియను రూపొందించడం అంత తేలిక కాదు. వ్యక్తికీ, సమాజానికీ ఉన్న సంబంధం అలా ఉంచి, వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఉండే కనీస మానవ సంబం ధాలపై కూడా తన ప్రభావం చూపిస్తున్న "గ్లోబలైజేషన్" అంశాన్ని కథల్లో ఇమడ్చడం - చదివించే లక్షణాన్ని ఆ కథలకు అద్దడం, ఎంతో శాస్త్రీయంగా రాజకీయ - సామా జిక అవగాహన ఉన్న రచయితలకే సాధ్యం" (గ్లోబలైజేషన్ కథలు - పుట. 1) ఏటుకూరి లక్ష్మీ ప్రసాద్ చెప్పారు. అటువంటి రచయితలు రచించిన ప్రపంచీకరణ ప్రభావంతో మానవ సంబంధాలు ఏవిధంగా దెబ్బ తిన్నాయో తెలిపే కథలు తీసుకుని "ప్రపంచీకరణ కథలు - మానవ సంబంధాలు" అనే శీర్షికతో పత్రం రాయడానికి పూనుకున్నాను. ప్రస్తుత సమాజంలో ప్రపంచీకరణ ప్రభావం చాలా కనిపిస్తుంది. దాని ద్వారా ఎదురయ్యే దుష్ప్రభావాలని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత పరిశోధక విద్యార్థుల పై ఉంది. దానిని తెలియ జేయాలనే ఉద్దేశంతో ఈ పత్ర సమర్పణ చేస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన కథలు దాదాపు 200 వరకు ఉండచ్చు. పత్రానికి అన్ని కథలు అవసరం లేదని నేను భావించి అందులో కొన్ని కథలకు నా పత్రం పరిమితం చేసి రాయడం జరిగింది.

మానవ సంబంధాల కథలు (ప్రపంచీకరణ నేపథ్యంలో) :

ప్రపంచీకరణ వలన ఎంత లాభం ఉందో అంతకు మించిన నష్టం కూడా ఉంది. అది గుర్తించిన వర్గం పోరాడుతుంది. గుర్తించని వర్గం ప్రపంచీకరణ మాయలో మునిగి తేలుతుంది. దాని ప్రభావం వస్తువుల వరకే ఆగిపోకుండ మనిషికి మనిషికి మధ్య చిచ్చురేపే వరకు దారితీస్తుంది. మానవ సంబంధాలు దెబ్బతినే తీరును కొన్ని కథల ద్వారా విశ్లేషణ చేస్తాను.

ఊరికి పోదాంరా భూదేవి - గీతాంజలి :

శివానీ కాలేజి లెక్చరర్ సాయంకాలాలు మెడిషన్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ట్యూటోరియల్స్‌లో క్లాసులు తీసుకుంటుంది. శివానికి సరదాలు, శిఖార్లు ఏమి ఉండవు. భర్త దినకర్‌కు సంపాదన మీద మోజు. ఇంటికి అన్ని హంగులా ఉండాలన్న తాపత్రయంలో శివానీని మానసిక, శారీరక హింసకు గురి చేస్తుంటాడు. శివానీ ఇంట్లో పనిమనిషి ఎల్లమ్మ, ఎల్లమ్మకు భర్త లేడు. ఇద్దరు కూతుళ్ళు, పెద్ద కూతురుకు పెళ్ళి చేస్తుంది. చిన్న కూతురుకు సంబంధం కుదిరితే చిన్నల్లుడికి ఇవ్వబోయే లాంఛనాలు తనకిచ్చిన లాంఛనాలకన్నా ఎక్కువని పెద్దల్లుడు గొడవ చేసి భార్య భూదేవిని పుట్టింటికి పంపించేస్తాడు. ఎల్లమ్మ ఆ బాధతో ఉంటుంది. శివానీ, ఎల్లమ్మ, ఇద్దరూ తమ తమ బాధ్యతలను నెరవేర్చి క్రమంలో ఒత్తిడికి గురవుతారు.

"చిందు భాగోతం"లో అల్లీ / రాణి పాత్రలో లోనమవుతారు. శివానీ భర్తకు ఇష్టం లేకపోయినా చిందు భాగోతానికి వెళ్ళడంతో ఆగ్రహంతో చెయ్యి చేసుకున్న భర్తపై తిరుగుబాటు చేసి మనసులో ఉన్న వేదనంతా ఆగ్రహ రూపంలో వెళ్ళగక్కి భర్తను తను తన మార్గంలోకి తెచ్చుకుంటుంది శివానీ! చిందుభాగోతం జరుగుతుండగానే అల్లీ / రాణీ రౌద్ర రూపానికి పూనకం వచ్చిన ఎల్లమ్మ స్టేజి పైకి వెళ్ళి తన వ్యధనంతా వెళ్ళ గుక్కుకుంటుంది. శివానీ, ఎల్లమ్మా ఇద్దరూ వారి వారి స్థితి గతులను బట్టి మానసిక ఒత్తిడి నుండి తమకు తెలియకుండానే బయటపడ్డారు. ఈ క్రమంలో ఎల్లమ్మ తన చిన్నకూతురు భూదేవితో పట్నంలో బతికి బావుకునేదేం లేదని ఏళ్ళ క్రితం వదిలి వచ్చిన పల్లెకు తిరిగి వెళ్దాం అనడమే. ఊరికి పోదాం రా భూదేవీ" కథ.

స్త్రీల మానసిక ఒత్తిడిని ప్రధానంగా చిత్రించిన కథ ఇది. శివాని భర్త దినకర్‌ని సంపాదన మీద మోజు ఉండడం, ఇల్లు హంసలతో నిండిపోవాలని కోరుకోవడం వంటివి, ప్రపంచీకరణ దోరణి ఎల్లమ్మ తన సొంత ఊరు వదిలి వలసపోవడం అక్కడ ఆమె కష్టాలు ఎదురవడం కూడా ప్రపంచీకరణ ప్రభావమే, శివాని మానసిక వేదనకు గురర్వడానికి దినకర్ ఒత్తిడి చేయుటకు, ఎల్లమ్మ వలసకు కారణం మారుతున్న కాలం, టెక్నాలజీ. ఈ పరిణామాలు అన్ని కూడా ప్రపంచీకరణ ద్వారానే వచ్చాయని చెప్పవచ్చు.

కోకా కోలా - ఓల్గా :

పార్వతి, శ్రీనివాస్‌లు భార్యా భర్తలు! పార్వతి అభ్యుదయ భావాలు కలిగిన స్త్రీ, శ్రీనివాస్ ప్రభుత్వ స్కూటర్ కంపెనీలో పని చేస్తుంటాడు. కంపెనీ మూతపడడం, శ్రీనివాస్ కోకాకోలా కంపెనీలో ఉద్యోగం రావడం, అది పార్వతికి నచ్చకపోవడంతో భార్యభర్తల మధ్య అశాంతికి తెర తీసింది. విదేశీ కంపెనీలో చేరడం పార్వతికి సుతరామా ఇష్టం లేదు. అభ్యుదయ భావాలు కడుపు నింపవని శ్రీనివాస్ భావన, అలకలు, అశాంతి, అంతర్యుద్ధాల తన నిర్ణయంతో దేశం నుండి విదేశీ కంపెనీని తరమలేమనే నిజాన్ని జీర్ణించుకుని భర్త ఆలోచనను సమర్థిస్తుంది. స్త్రీ పురుష సంబంధాల మధ్య అగ్గిరగిల్చే స్థితిని తీసుకురాగల శక్తి ఉన్న గ్లోబలైలేషన్ ఆధిపత్యాన్ని తెలిపే కథ. "కోకాకోలా"

పోగులు తెగిన అల్లిక - నల్లూరి రుక్మిణి :

వయసుడిగిన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్య వైఖరి, అమెరికాలో ఉంటూ పిల్లలు తమ తల్లిని తమ అవసరా

లకు ఉపయోగించుకుని తండ్రి మరణాన్ని కూడా యథాలాపంగా తీసుకుని, అవసరాలన్నీ తీరాక తల్లిని, ఒంటరిగా పల్లెకు పంపేయడం, అక్కడ భర్త జ్ఞాపకాలతో తల్లడిల్లిపోతూ ''ఆమె పోగులు తెగిన - అల్లిక''లో కనబడుతుంది.

ఇవాళ - జయంతి పాపారావు :

''ఇవాళ'' కథలో కథళో చైతన్య స్రవంతి ధోరణి కనబడుతుంది. కథలో ఒక పాత్ర విశాఖ పట్టణంలో గ్లోబలైజేషన్ వల్ల వల్ల కలుగుతున్న మార్పులు, సమాజం ఆ స్థాయికి వెళ్ళలేక పోవడం, సామాన్యుడి ఇబ్బంది, వ్యధ, వేదన గమనిస్తూ అభివృద్ధి ఎవరికి? అని తనలో తాను ప్రశ్నించుకుంటూ అసలు అభివృద్ధి అని దేన్ని భావించాలో అర్థం కాక తనను తాను ప్రశ్నించుకోవడం ఇందులో కథాంశం.

కామన్ వెల్త్ - బి. శ్రీరాములు :

కుల వివక్షే నిర్మూలించలేని దేశంలో గ్లోబలైజేషన్ గురించి మాట్లాడం అవసరం అంటూనే, అదే గ్లోబలైజేషన్ ప్రభావం వల్ల అక్రమ సంబంధాలు కూడా ఎంత హుందాగా చలామణి అవుతాయో తెలిపే కథ ''కామన్ హెల్త్''.

ప్రపంచీకరణ వలన మనుషుల మధ్య దూరం కొంత తగ్గి దగ్గరవ్వడానికి కొన్ని మాధ్యమాలు తోడ్పడుతున్నాయి. ఉదా: పూర్వకాలంలో వేరే ఊరులో మనుషులతో మాట్లాడానికి కొన్ని గంటలు, రోజుల సమయం పట్టేది. కాని ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో అవన్ని క్షణాల్లో పనైపోయింది. ఎంత దగ్గరైన మనిషికి మనిషికి మధ్య దూరం మాత్రం చాలా పెరిగిందని పై కథల ద్వారా తెలుస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. గ్లోబలైజేషన్ కథలు - డా॥ పస్వీ సత్యనారాయణ
2. కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3. ప్రపంచీకరణ ప్రభావంలో - విద్యాభూషణ్
4. ప్రపంచీకరూ పరిణామాలు, ప్రభావాలు మహిళల జీవితం - తోట జ్యోతిరాణి కాత్యాయనివిద్యహే

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో జీవన చిత్రణ

– డా॥. వొసిరెడ్డి భవాని, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు.

ప్రపంచీకరణం అంటే మానవులందరినీ ఏకం చేసే ఒక ప్రయత్నం ఈ ప్రయత్నంలో మన ప్రమేయమున్నా లేకున్నా ఫలితాలను మనం అనుభవించవలసినదే అవి మనకు మంచి చేయవచ్చును, చెడుచేయవచ్చును. సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. ఈ ప్రపంచీకరణ ప్రభావం సాహితీలోకంలో ఒక పెనుసంచలనాన్ని తీసుకువచ్చింది. ఈ ప్రభావం మన తెలుగు సాహిత్యం పైనా పడింది. ఈ ప్రపంచీకరణ ప్రభావంతో మానవత్వం మంటగలిసిందని మానవతా వాదులు చెబుతుంటే ఆచారాలు భ్రష్టుపట్టాయని ఛాందసవాదులు మొర పెట్టుకుంటుంటే మన సంస్కృతి రూపుమాసినదని సాంస్కృతిక వాదులు ఘోషపెడుతుంటే పెట్టుబడి దారులు, వ్యాపారవేత్తలు మాత్రం హర్షం వ్యక్తంచేస్తున్నారు. తరతరాల మానవ శ్రమసంచిత సంస్కృతిని కుదిపివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి ఎయిడ్స్ మహమ్మారి మనదేశంలోకి చొచ్చుకురావడం ప్రపంచీకరణమే ఈనాటి కరోనా క్రక్కుతున్న విషం ప్రపంచీకరణ కోరలదే కాస్త వ్యంగ్యంగా మనం దీనిని గురించి చెప్పుకోవాలంటే ఇది మన యిల్లు చక్క బెట్టడానికే వచ్చింది. "ఒక సూర్యుడు అనేకరూపాలతో ప్రత్యక్షం కావచ్చు" అన్నట్లుగా ఈ ప్రపంచీకరణకు నిర్వచనం అనేక రకాలుగా ఇవ్వవచ్చును ఎందుకంటే ఈ కిరణాలు ప్రసరించని చోటే లేదని చెప్పడం అతిశయోక్తి కాదేమో.

దీనినే మనం అంతర్జాతీయకరణ, సరళీకరణ, విశ్వీకరణ, పాశ్చాత్యీకరణ లేక ఆధునికీకరణ ఆప్రాదేశికత్వం అని చెప్పుకొంటూ వస్తున్నాం. ప్రపంచీకరణకు ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక సామాజిక కోణాలున్నాయి. ఇందులో ఆర్థిక అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత వున్నది. ప్రపంచంలోని ఒనరులన్నీ ఒకటి కావడం ఎవరైనా ఎక్కడైనా స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకోవడం శాస్త్రసాంకేతిక సంపత్తి అందరికీ అందుబాటులో వుండడంవల్ల ఈనాడు ప్రపంచదేశాలన్నీ ఆర్థిక పురోగతిని సాధించడానికి అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇదంతా చెప్పుకోడానికి బాగానే అన్పిస్తున్నది. వసుధైక కుటుంబం అనే అన్పిస్తున్నది. కానీ సంపన్నవర్గాలు, సంపన్నదేశాలు దీనిని స్వార్థప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయి. ఇది అన్ని రంగాలమీదా తన ప్రభావాన్ని చూపించింది. ఈ విషయాలను వస్తువుగా స్వీకరించి సాహితీకారులు అనేక ప్రక్రియలలో వైవిధ్య భరితమైన రచనలు చేసి సమాజంలో మార్పుతేసుకు రావడానికి ప్రయత్నం చేస్తునే వున్నారు.

ముఖ్యంగా మనకు సమాచార సాంకేతికరంగాలలో వచ్చిన పెను మార్పులు మనకు అనుభవంలోకి వస్తున్నాయి. ఇంటర్‌నెట్ వినియోగం వల్ల సమాచార రంగంలో వచ్చిన నూతన సౌకర్యాలతో మనిషి తనను తానే మర్చిపోతున్నాడు. ఉదా: సెల్‌ఫోన్‌లవంటి సౌకర్యాలవల్ల నిమిషాలలో వార్తలు చేరిపోవడం దానివల్ల ఒకొక్కసారి ప్రాణాలు నిలబడుతున్నాయి ఒకొక్కప్పుడు ప్రాణాలు పోతున్నాయి. మనుషులమధ్యన అనురాగాలు పెరుగుతున్నాయి కానీ కృత్రిమత్వం చోటుచేసుకుంటున్నది స్పర్శ అప్యాయత కరువైపోతున్నాయి.

ఈనాటి కరోనావ్యాధి విధించిన నిబంధనలవల్ల మనిషి మనిషి ఎదురుపడే పరిస్థితి లేకపోవడంవల్ల ఇవే ప్రాణాధారాలవుతున్నాయి. విద్యార్థులకు విద్య బోధించే గురువులుగా అవతారమెత్తాయి. తెలుగు వంటి ప్రాంతీయ భాషలవారు జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించడానికి ఈ సమాచార సాంకేతిక నైపుణ్యాలే ఆధార భూతములైనాయి. అయితే దీని వల్ల నష్టాలు లేకపోలేదు దారితప్పుతున్నయువ తరాన్ని మనం

గమనిస్తూనే వున్నాము. అదృశ్యపరిచయాలవల్ల జరిగే అనూహ్య అనర్థాలు మనదృష్టికి వస్తూనే వున్నాయి.

మన భారతీయ సంస్కృతిలో ప్రజల జీవనవిధానం పొదుపుగా వున్నదానితో సర్దుకుపోవడం తృప్తిగా జీవించడం తెలుసు. కానీ ఈ ప్రపంచీకరణ ప్రభావంతో ప్రజల జీవన శైలిలో మనం అనేక మార్పులను చూస్తూనే వున్నాము. భౌతిక సుఖాల కోసం దుబారాగా ఖర్చు చేయడం. ధనమూలమిదంజగత్ అన్నట్లుగా ధనం చుట్టూ జనం తిరిగేవిధంగా తయారాయ్యాము.

కాంచనపల్లి రాజేందర్‌రాజు వ్రాసిన "డాలరువల" అనే కవితలో

"అకస్మాత్తుగా
ఆగంతకుడెవడో తోటలోకి ప్రవేశించాక
కోకిలమ్మదువుగా స్వాగతంపలికి
చెట్టునీడన సేదదీరమంది
కోకిలమ్మకు తోడుగా తోటతోటంతా వంతపాట పాడింది.

అదను చూసి ఆగంతకుడు
తోటపై డాలరు వల విసిరాడు
ఇప్పుడు తోటలోని కోకిలలేకాదు
మృగరాజులు --- గజరాజులు సహితం
డాలరు వలలో బంధీ.

ఈ కవితలో మన భారతదేశంలోకి ప్రపంచీకరణాన్ని ఆహ్వానించిన తరువాత మనమంతా తెలియని దాస్యాన్ని చేస్తూ ఏ విధంగా డాలరువలలో బందీ లైపోతున్నామో తెలియచేస్తున్నది. అంతేకాదు తీరని ధనదాహంతో అనేక ఆర్థిక నేరాలు వెలుగుచూస్తున్నాయి.

పట్టణాలలో నే కాదు పల్లెపట్టులపై కూడా పట్టు సాధించినదీ ప్రపంచీకరణం పచ్చనిపైరు పాలాలతో స్వేచ్ఛగా స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించే పల్లెటూళ్ళలో ఏ యింట్లో చూచినా ఫ్రిజ్, ఏ.సి, టీ.వి నిత్యావసర వస్తువులుగా మారిపోయాయి. సెల్‌ఫోన్‌లు ఆక్సిజన్‌గా మారిపోయాయి. మనభారతీయ జీవన విధానానికి మూల వృత్తి వ్యవసాయమే ఈ ప్రభావంతో గ్రామీణ జీవనశైలి అతలాకుతలమైనది. విత్తనాలు, పంటలపద్ధతి ఎరువులు వీటిలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయం కష్టాలు కడగండ్ల పాలైనది సేద్యం జూదమైనది .రైతు స్వేదం నేలతల్లి పాలవుతున్నది.మన నేలకు అనువుగాని వాణిజ్య పంటలు రైతులపాలిట శాపాలుగామారి జీవితాలను కడతేరుస్తున్నాయి.

అన్నంపెట్టే రైతు కుంచించుకు పోయేసరికి అతనిపై ఆధారపడ్డ రైతుకూలీలు రైతుపై ఆధారపడ్డ వివిధ కుల వృత్తులు చరమ దశకు వచ్చాయి. ఒకప్పుడు గౌరవ ప్రదంగా కూడు బెట్టిన కుల వృత్తులు నేడు అవమాన కరంగా భావిస్తున్నారు. అంతకన్నా ఆదాయానిచ్చే మార్గాలను వెతుక్కుంటున్నారు. ఉదా : బొమ్మలాటలు హరికథలు, బుర్రకథలు మొదలైన జానపద కళారూపాలు ఆదరణకు నోచుకోవడం లేదు ఈ భావాన్ని తెలియచేసే గోరేటి వెంకన్నగారి పాటను పరిశీలిస్తే

"పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
తల్లి బందీయైపోయిందో కనిపించని కుట్రల
కుమ్మరి వాముల తుమ్ములు మొలిసెను
కమ్మరి కొలిమిల దుమ్ము పేరెను
పెద్ద బాడిస మొద్దుబారినది
సాలెల మగ్గం సడుగులిరిగినవి
చేతివృత్తుల చేతులిరిగిపోయె నాపల్లెలోన

అని కులవృత్తులు ఎలా నసించిపోయాయో చక్కగా వర్ణించి చిత్రించారు.

డా॥. పాపినేని శివశంకర్‌గారు "ఒక ఖడ్గం, ఒకపుష్పం" అనే కవితా సంపుటిలోని "కలకానిది" అనే కవితలో

పడమటి దిక్కుల నుంచి రెక్కల జంతువేదో
పొలిమేరలో రంకేసినట్టు
కంచం, మంచం, తట్ట, బుట్ట, కుండ, కుదురు
అన్నీవాటంతట అవే దారినబడి వలసపోతున్నట్టు

పురుగుమందులు డబ్బాల్లో రైతుల్ని ముంచుకొని నంజుకున్నట్టు
కూలీలు కలుపు మొక్కలతో కడుపునింపుకుంటు నట్టు
రాములవారి గుళ్ళో బుర్రకథ చెప్పేమీరాసాయిబుని బుర్రేనడుముకు తగిలించుకుని వాయించినట్టు
భజన చక్కలు రెండూ పండరిదాసు రెండు చంపలు వాయగొట్టినట్టు
చే బాడిస, కమ్మరి సుత్తె, సాలెమగ్గం
పరుగు పందె మేసుకొని ఊరబావిలో దూకినట్టు
కుమ్మరి సారెమీద కుండల వెంకన్నే గిరగిర తిరుగున్నట్టు
నారాయణ ప్రక్కజేబులో మంగళిపాది డొక్కలో తన్నినట్టు
తూర్పు వాగులో కోకాకోలాగట్టుల్ని ఒరుసుకొని వరదలా పారుతున్నట్టు
పక్కవీధిలో చుక్కమ్మకి తొలిచూలులోనే
పండంటి కంప్యూటర్ పుట్టినట్టు
బ్రహ్మాండమైన ఫై ఓవర్ మీదగా
తలకాయలు దొర్లుకుంటూ పరాయిదేశానికి పరుగెత్తుతున్నట్టు
రచ్చబండదగ్గర ఊరకుక్క రాత్రంతా ఒకటే ఏడుస్తున్నట్టు
అంత ఒక కలగా కలతగా

ఈ కవితను చదివినప్పుడు అనుకోకుండా మన జీవితాలలో సుడిగాలిలా వచ్చిపడిన ప్రపంచీకరణ ప్రభావం ప్రతి అక్షరంలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

ఈ ప్రపంచీకరణ ప్రభావంతో ఆహారపుటలవాట్లలో ఎన్నో మార్పులు వచ్చాయి జొన్నరొట్టెలు, రాగి సంగటి, వేరుశనగ వుండలు, లడ్డూలు, జిలేబీ, చక్కిలాలు మొదలైన సంప్రదాయ వంటలు మొరటుగా మారి పోయాయి యువత పిజ్జాలు, బర్గర్లు వైపు దారి మళ్ళించారు. శీతల పానీయాలమీది మోజుతో కొబ్బరి బోండాలను మర్చిపోయారు ఈ సందర్భంగా ఎండ్లూరి సుధాకర్ గారి మాటల్లో చెప్పుకోవాలంటే

"నిండుగోదారి పక్కన నీళ్ళపొట్లాలమ్ముకోవడం
కొబ్బరి బోండాలమ్ముతూ కోకోకోలా త్రాగడం
పెరుగుపాలు అమ్మాక పెప్సీ సేవిస్తూ
సెల్లుమాట్లాడుతున్న చల్లనమ్మనీ చూపించాను"

అని తన విదేశీ స్నేహితుడితో జరిగిన ప్రపంచీకరణ ప్రభావ సంభాషణ గురించి చెప్పారు.

కుప్పిలి పద్మగారు రచించిన "ఇన్‌స్టెంట్ లైఫ్"అనే కథలో నగరంలో ప్రజల జీవన విధానం ఎలావుంటుందో వివరించారు. ఇంటివరకూ వచ్చిన తాజాకూరగాయలను కొనకుండా మాల్స్‌కి వెళ్ళి ఫ్రీజర్స్‌లో వున్న కూరగాయలను తెచ్చుకోవడం, రోడ్డు ప్రక్కన యిడ్లీ బండివాడు శుచిగా వేడివేడిగా యిడ్లీ యిచ్చినా వదిలి వేసి నక్షత్రాల హోటళ్ళు వెంట నడవడం. ఆ యిడ్లీ బండ్ల స్థానంలో ఛాట్ మసాలా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు గిరాకీ పెరగడం. ఏది ఆరోగ్యమో ఏది అనారోగ్యమో తెలుసుకోలేని పరిస్థితిలో యువత ప్రవర్తిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను అమెరికా పంపించి డాలర్లు కురిపించే చెట్లు లా భావిస్తున్నారు. ఈ కథలో సందీప్ అనే యువకుడు తను ప్రేమించిన అమ్మాయిని సైతం వదిలివేసి డబ్బు సంపాదన కోసం అమెరికాకి ప్రయాణమవ్వడం "ఇన్‌స్టంట్‌లైఫ్" అనే కథద్వారా తెలియ చెప్పారు.

జీవవైవిధ్యం గురించి మనం ఆలోచించినట్లయితే ఈ భూమి మీద ప్రతిప్రాణికీ బ్రతికే అనుకూలతవుంది దానిని నిరోధించే హక్కు మనకు లేదు కానీ మనం దానిని కూడా వదలడం లేదు ఉదా:- కొల్లేరు సరస్సు గురించి ఆలోచిస్తే కొల్లేటి సరస్సులో కొంగలు వున్నాయా? సరస్సు ఆక్రమణలపాలై చేపల చెరువులైనపుడు కొల్లేటి కొంగలు ఏ న్యాయస్థానానికి మొరపెట్టుకోవాలి? వాటి గోడు పట్టించుకొనేదెవరు?

"డాలర్ తూటా తగిలిన గూడకొంగ కొల్లేరు
జవసత్వాలు జమచేయబడ్డ బొమికలబొమ్మ
కొల్లేరు "

పొలాల్లో విరజిమ్ముతున్న విషరసాయినాలవల్ల పిచ్చుక జాతి అంతరించే దశకు వచ్చిందిగదా అంతేకాదు మన ఆరోగ్యాన్ని కూడా హరిస్తున్నది కదా. ఎల్లలులేని ఆర్థికాభివృద్ధి వినియోగం అనే ప్రక్రియలో పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నది ఓజోన్ పొర దెబ్బతింటున్నది. సంపన్న దేశాల విచ్చలవిడి వినియోగ పద్ధతులవల్ల వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్, కార్బన్‌మోనాక్సైడ్ కార్బన్‌ల మయమైపోయింది. పాపినేని శివశంకర్ గారి మాటల్లో

"తనకోసం తను బతకటంగాదు
అన్నీ తన కోసం బతకాలన్నదే మనిషి సమస్య
బతికేవాడు అన్నిటినీ బతకనివ్వాలిగదా
ప్రపంచం మానవుడికే సొంతంకాదు
ప్రపంచం మనిషితోనే అంతంగాదు"

తను బ్రతుకుతూ నలుగుర్నీ బ్రతకనిస్తూ అలాగే జీవితాన్ని సంరక్షించుకోవాలనే సందేశాన్ని యిచ్చారు.

మన భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శమని పొంగి పోయే మనకు ఈనాటి యువత ఆలోచనా విధానాన్ని చూసి మనం తలదించుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ఈ భావాలను ప్రతి బింబింపచేస్తుంది. కామేశ్వరి గారు రచించిన " కాలాన్ని వెనక్కి తిప్పకు " అనే కథలో భర్త సంప్రదాయ బద్ధమైన వాడు భార్య ఆదర్శ భావాలు కల మహిళ, ఆడపిల్లను పెంచే విషయంలో అతను భార్యను తప్పుపడుతూవున్నా ఆమె అందుకు అంగీకరించక కూతురికి మోతాదుకు మించిన స్వేచ్ఛనిచ్చింది. ఆ కూతురు హఠాత్తుగా ఒకరోజు వంటగదిలో పొపుపెడుతున్న తల్లి వద్దకు వెళ్ళి గైనాకాలజిస్టు గురించి వివరాలడగడం ఎందుకని తల్లి ప్రశ్నించగా "ఐ థింక్ ఐయామ్‌ప్రెగ్నెంట్ " అన్న కూతురి మాటలు విని నివ్వెరపోతుంది ఈ మాటలు భర్తకు తెలిస్తే ఏం జరుగుతుందోనని చాలా హీనస్వరంతో "హౌడజ్ ఇట్ హేపెన్" అని అడగగా ఆకూతురు "ఇట్ జస్ట్‌హేపెన్ట్" అని చాలా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది. దాంతో తల్లి కోపగించుకుని కూతుర్ని మందలిస్తుంది. ఆమె ఎక్కడో ఒక మారుమూల హాస్పిటల్లో అబార్షన్ చేయించుకోగా అది ప్రాణంమీదకు వస్తుంది.

అప్పటకి గాని ఆ అమ్మాయిలో తను చేసినది ఎంతటి తప్పోతెలిసిరాలేదు. పిల్లలు తల్లిదండ్రులు యిచ్చిన యీస్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవడం పాశ్చాత్య సంస్కృతి ప్రభావమేకదా యువత బాధ్యతారాహిత్యం ఈ కథలో మనకు కళ్ళకు కట్టినట్లు కన్పిస్తుంది.

ఈ విధంగా ఈ ప్రపంచీకరణం అన్నిరంగాలపై తన ప్రభావాన్ని చూపించింది. సమాజంలోని ఏ మార్పునైన రచయితలు తమకలంద్వారా ఎత్తిచూపిస్తూనేవున్నారు. ఏ మార్పుకైనా సాహిత్యం తన వంతు పాత్రను పోషిస్తూనే వున్నది. ప్రజలు ఏ సిద్ధాంతం నుంచైనా మంచిని ఆహ్వానించి చెడును తిరస్కరించే స్వభావాన్ని అలవాటు చేసుకోవాలి. అలా వున్నప్పుడు ప్రపంచం కుగ్రామమైపోతుంది. ప్రపంచదేశాలలో వున్న శాస్త్ర, సాంకేతిక విషయాలలో విషయ జ్ఞానం పెంచుకొని యువత దేశప్రగతికి తోడ్పాటు నివ్వాలి.

ఆధార గ్రంథాలు :

1. విశాలాంధ్ర తెలుగు కథ
2. ఒక ఖడ్గం - ఒక పుష్పం -- పాపినేని శివశంకర్
3. కవిత -- 2007 కవితాసంకలనం - పాపినేని శివశంకర్
4. నిశాంత - సాహిత్య తాత్త్వికవ్యాసాలు - పాపినేని శివశంకర్

❖

ప్రపంచీకరణ ప్రభావాన్ని చిత్రించిన పాట - పల్లె కన్నీరు పెడుతుందో

– జి. బాలచంద్ర, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

ప్రపంచీకరణ సాహిత్యం : పాట - నేపథ్యం :

ప్రపంచీకరణ ప్రారంభంలోనే వాటి విధానాలను ఎండ గట్టడంలో ముందున్న గేయ సాహిత్యం పాట. డంకెల్ ప్రతిపాదనలను తెరమీదకు తేవడానికి పాలకులు చేస్తున్న కుట్రలను అక్షరబద్ధం చేసి ఆలపించినది పాట. భారత దేశంలో పెట్టుబడి దారి విధానాల నుంచి వాటిని ప్రతి ఘటిస్తూ, పాటలను రచించిన ఎంతోమంది కవిగాయ కులు సమాజాన్ని చైతన్యం చేసేందుకు ప్రయత్నించడం జరిగింది. అంటే దీని మూలాలు ప్రపంచీకరణకు ముందు నుంచే మనం గుర్తించవచ్చు. ఈ క్రమంలోనే పాట ప్రపంచీకరణను కూడా ఎండగట్టింది. సామాన్య ప్రజా నీకానికి కూడా తేలికగా అంతర్జాతీయ కుట్రలను అర్థం చేయించింది.

1990 నుంచి పాట ప్రజా ఉద్యమాలకు వెన్ను దన్నుగా నిలిచింది. నూతన ఆర్థిక విధానల వలన ప్రజా జీవితం అతలాకుతలం కాసాగింది. దీన్ని నిరసిస్తూ ఎంతో మంది వాగ్గేయకారులు, కవులు, కళాకారులు పాటలు రచించారు. వీరిలో ముందుగా గద్దర్, వంగపండు ప్రసాదురావు, గోరటి వెంకన్న, అందెశ్రీ మొదలైన పలువురు ప్రజాగాయకులు ప్రపంచీకరణకు వ్యతిరేకంగా గొంతెత్తి గీతాలు ఆలపించారు.

గ్రామీణ వృత్తులు అంతరించడం నుంచి అమెరికా యుద్ధోన్మాదం వరకు పాట దాని విధానాలను వివరిస్తూ నిర్విరామంగా సాగిపోతూ ఉంది. అయితే నేడు ప్రపంచీ కరణ ప్రభావం వలన కులవృత్తులు అంతరించే స్థితికి వెళ్ళడం జరిగింది. ఈ నేపథ్యంలో కులవృత్తులు మీద అనేక పాటలు వచ్చాయి. ఈ క్రమంలో చిరస్థాయిగా నిలిచే పాట గోరటి వెంకన్న రాసిన 'పల్లెకన్నీరు పెడు తుందో' పాట. ఈ పాట సామాన్య జనాలనే కాదు మేధావు లను, రాజకీయ నాయకులను ప్రభావితం చేసింది. వృత్తుల మీద ఆధారపడిన దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా కనుమరుగై పోవడం, ఈ పాటలో చిత్రించబడింది. ఇక ఈ పాట నేపథ్యాన్ని పరిశిలిద్దాం.

మహబూబ్‌నగర్ జిల్లా, తెలకపల్లి మండలం గౌరారం గ్రామంలో 1964లో గోరటి వెంకన్న గారు జన్మించాడు. చిన్నప్పటి నుండి పాటలు పాడుతుండేవాడు. పల్లెతో విడదీయలేని గాఢానుబంధాన్ని ఏర్పర్చుకున్నాడు. చుక్కనీరు లేక ఎడారిగా మారిన చిన్నప్పటి దుందుభీ వాగును, శిథిలమవుతున్న తన గ్రామాన్ని చూసిన గోరేటి గుండెల్లోంచి ఉప్పెనలా ఎగిసిన దు:ఖగీతమే 'పల్లె కన్నీరు పెడుతుందో'. కవికి శాశ్వతమైన కీర్తిని, ఉన్నతస్థాయిని అందించిన ఈ పాటలోని జీవన విధ్వం సాన్ని, ప్రపంచీకరణ ప్రభావాన్ని కవిలోని లోతైన, ఆవేదనను తెలుసుకుందాం.

"పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
నా తల్లి బండీ అయిపోతుందో కనిపించని కుట్రల"

అంటూ సాగే ఈ పాట పల్లెను ప్రధాన భూమికగా చేసుకుని ఊళ్లోని విభిన్న కులాల సంస్కృతిని, బతుకు పోరాట వెతలను కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తుంది ఈ పాట. పల్లెను 'తల్లిలాగా, అమ్మ ఒడిలాగా' భావించే గాఢానుబంధంలో ఉన్న వాళ్లం మనం. అటువంటి పల్లె 'బండీ కావడానికీ, కన్నీరు పెట్టడానికి' వెనుకవున్న

కుట్రలను బట్టబయలు చేసిన శక్తివంతమైన గీతంగా 'పల్లెకన్నీరు పెడుతుందో' ప్రసిద్ధి పొందింది. అంతకు మించి కనిపించని కుట్రలలో 'ప్రపంచీకరణ' అనే ప్రధాన కుట్రను పసిగట్టి ప్రజలను హెచ్చరిస్తూ జాగృతం చేసింది ఈ గీతం.

ఈ పాట నేపథ్యం గురించి గోరేటి వెంకన్నగారు అనేక సందర్భాలలో ఎన్నో విషయాలను వెల్లడించారు. "ఈ పాట నా ఆత్మ. ఇరవై నాలుగేళ్ల క్రితం అది రాయకుంటే ఆత్మహత్యే శరణ్యం అనుకునేంటతటి దైన్యంలో ఎగిసిన పలవరింత. గ్లోబలైజేషన్, సరళీకరణ, ఇవన్ని అర్థమై రాసింది కాదు. సూచన ప్రాయంగా వాటి గురించి అవ గాహన ఉన్నా అది రాసినప్పుడు నా కళ్ళల్లో మెరిసిన నా ఊరు, నేను చదివిన రఘుపతిపేట, వెయ్యిమగ్గాల శిథలత్వం, ప్రాణమిత్రుల ఎడబాటు, పరిసరాలల్లో ఆవ రించిన ఎడారిదృశ్యం, ఏనాడూ నా ఊరిలో ఎవరితో ఇసుమెత్తె విభేదం లేని సామరస్య పూర్వక జీవితం, కష్టాలు, కన్నీళ్లు, ఆనందాలు, అనుబంధాలు కలబోసుకొని బ్రతికిన పల్లె యాదికొచ్చి అల్లుకొన్ని పాట అది. ఉద్యోగ బదీలీలవల్ల ఊరికి దూరం కావల్సిన పరిస్థితుల వల్ల నాలో తన్నుకొని వచ్చిన గేయం అది. అనివార్యమని అను కున్నా, ఆధిపత్యంతో లాభాపేక్ష సామ్రాజ్యవాదం విదిల్చిన ఇనుపరెక్కల వీరంగానికి అల్లాడిన పల్లె దృశ్యానికి పల్లవి కట్టాను. వృత్తులే కులానికి కారణమైతే ప్రపంచంలో అనేక దేశాలలో ఇలాంటి వృత్తులు చేసేవారి యెడ వివక్షత లేదు. వృత్తి చితికింది. కులం అతికింది. ఇది భారతీయ సమాజతరాల ప్రత్యేక అమానుష్య విధానమే వివక్షగానీ, వృత్తులు చేయడం వల్ల కాదు. వృత్తులున్న గ్రామాలకంటే వృత్తులు లేని నగరాల్లో కులవివక్ష అధికమనేది ఏ దళితుణ్ణి అడిగిన చెప్తారు. అయినా గ్లోబలైజేషన్ వల్ల కొన్ని వృత్తులకు అధిక రాబడి కూడా వచ్చింది. భూస్వామ్య సంకెళ్ళను తెంచుకున్నాయి. దనాన్ని అంగీ కరించవచ్చు. ఇది అప్పటి నా అవగాహన" అని తెలు పుతూ మరిన్ని ఆలోచనలు, చర్చలు చేయడానికి దారిని ఏర్పరిచినాడు. (ఆంధ్రజ్యోతి వివిధ - 16.03.2020 - ఇంటర్వ్యూ - పసనూరి రవీందర్)

"కుమ్మరి వామిలో తుమ్మలు మొలిచెను
కమ్మరి కొలిమిలో దుమ్ము పేరెను
పెద్దబాడిస మొద్దు బారినది
సాలెల మగ్గం సడుగులిరిగినవి.
చేతి వృత్తుల చేతులిరిగిపాయే నా పల్లెల్లోనా
అయ్యో గ్రామ స్వరాజ్యం గంగలోనబాయే ఈ దేశంలోనా"

పై పంక్తులలో కుమ్మరి, కమ్మరి, సాలెలు వంటి కుల వృత్తుల గురించి తెలుపుతున్నాయి పై గేయంలో. భారతదేశం వివిధ కులాలకు, మతాలకు, భాషలకు, సంప్రదాయాలకు నిలయం. దాని కనుగుణంగానే పల్లె అనకే కులాలకు, ఆశ్రిత కులాలకు, ఆవాసం. ప్రతి కులానికి ఒక వృత్తి ఉంటుంది. అదే వారికి జీవనోపాధిని అందిస్తుంది. అలాంటి ఉపాధి నేడు ప్రపంచీకరణ ప్రభావంలో అవన్నీ కనుమరుగయ్యాయంటూ గోరటి వెంకన్నగారు ఆవేదన చూపెడుతున్నారు. మట్టికుండలు చేసే కుమ్మరి వాము, వ్యవసాయానికి, ఇంటివసారాలకు పనికొచ్చే కమ్మరి కొలిమి ఆరిపోయింది. నాగల్లు, ఎడ్ల బండ్లు, ఇంటి నిర్మాణాలు చేసే వడ్రంగులు పెద్ద బాడిస పనిలేక మొద్దుబారింది. చేనేత కార్మికులకు పనిలేక సరైన ధర, గిరాకి లేక మగ్గాలు మూల బడ్డాయి.

ఇంకా ఈ పాటలో వృత్తులు, బతుకులే కాదు ప్రకృతి వనరులు, పర్యావరణమూ దోపిడికి గురయింది. దారుణంగా ధ్వంసమయింది అని కవి వాపోతాడు. ప్రకృతి లోని సంపదను, సహజ వనరులను కొన్ని అధికార శక్తులు తమకనుగుణంగా ఎలా మలచుకున్నాయో వివరిస్తాడు కవి.

"మడుగులన్ని అడుగంటి పోయినవి
బావులు సావుకు దగ్గరయ్యినవి
వాగులు వంకలు ఎండిపోయినవి
చాకలి పాయ్యిలు కూలిపోయినవి

పెద్దబోరు పొద్దంతా నడుస్తుందో బలిసీన దొరలది
మరి పేద రైతుల బావులెందుకెండే నా పల్లెల్లోనా"

ఒకప్పుడు మడుగులు, బావులు, వాగులు నీళ్ళతో కలకలలాడేవి. వేసవి కాలంలో వాటిల్లో ఈదులాడేవారు. అయితే నేడు అవి అడుగంటి పోయాయి. ఆ పరిస్థితి నేడు కనపడదు పల్లెలోన. వందల అడుగుల కొద్ది బోర్లు త్రవ్వించినా నీటి జాడ కనపడవు. ఆ విషయాల్నే కళ్ళకు కట్టినట్లు చూపెడతున్నారు కవి పై పంక్తుల్లో.

ఈదులన్ని వట్టి మొద్దులయ్యినవి
ఈతకల్లు బంగారుమయ్యినది
మందు కలిపిన కల్లును దాగిన
మంది కండ్ల నిండూసులయ్యినవి
చల్లని బీరు విస్కి లెవడు పంపే నా పల్లెల్లోకి
బుస్సున పొంగే పెప్సికోల వచ్చే నా పల్లెల్లోకి

ఈత చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాన్ని ఈదులు అంటారు. అక్కడ ఉండే ఈత చెట్లనుండి ఈత కల్లు తీస్తారు. అది స్వచ్ఛమైన కల్లు. చలువకోసం దానిని తాగుతారు. పశువులకు కూడా ఆ కల్లును తాపేవారు రైతులు. అయితే నేడు ఆ ఈదుల పరిస్థితిని, పై విధంగా చూపెడతున్నాడు కవి. నేడు కల్తీకల్లు వస్తుండాది. అలానే చల్లని బీరు, విస్కీలు, పెప్సీకోలాలో పల్లేలోకి వచ్చేశాయి అంటాడు కవి.

పరక చేపలకు గాలాలేసే తురకల పోరలు
యాడికి పోయిరి
లారీలల్ల క్లీనర్లయ్యిరా, పెట్రోల్ మురికిల
మురికియ్యిండ్రా
తల్లీ దూదు సేమియాకు దూరమయ్యినారా
సాయిబుల పోరలు
ఆ బేకరి కేపులో ఆకలి తీరిందా ఆ పట్టణాలలో"

అనుక్షణం బాల్యంలోని జ్ఞాపకాలు బరువెక్కుతూ కవి హృదయాన్ని కలత పరుస్తాయి. కాలం కరుగుతున్న కొద్దీ అనేకానేక విషయాలు ఒక చైతన్య స్రవంతిలా తనను చుట్టుముట్టినాయి. చెరువుల్లో పరక చేపల్ని పట్టుకున్న అనుభవంతో ముడిపడిన బాల్య స్నేహితులు గుర్తుకు వస్తారు. ఆ సాయిబు మిత్రులు నేడు ఎంత దుర్భరంగా బతుకు పోరాటం చేస్తున్నారో కదా అని అంతర్లీనంగా దు:ఖపు మడుగులోకి దూకుతాడు.

రెడిమెడ్ ఫ్యాషన్ దుస్తులు వల్ల మేరోళ్ల కత్తెర సిలుమెక్కిపోయింది. చెన్నై, బొంబాయి మిషన్ నగలొచ్చి కంసాలి జీవితం వన్నె తగ్గింది. ఫర్చిచరు పనుల కోసం పట్నాలకు వలస వెళ్లి పోయారు. మాదిగలొద్ది, మేదరి డప్పు, పూసలోళ్లు, దాసరివాళ్లు, యాచకులు, బుడగ జంగాలు మొదలైన బహుజనుల వృత్తులు, సబ్బండ వర్ణాల బతుకులు ఎంతగా చితికిపోయాయే విషాద కరంగా ఆలపిస్తాడు గోరేటి వెంకన్న.

కుంకుమ దాసరి బుక్కమీద గూడ కంపెనీ రక్కసి
కన్నుబడ్డది
పూసలోల్ల తాలాము కప్పలు, కాశీల కలసి
ఖతమౌతున్నవి
బొట్టు బిళ్ళలూ నొసటికొచ్చె గదరా నా పల్లెల జాడా
మన గుడ్డి దాసరీ బతుకులాగమాయే ఈ పల్లెల్లోనా

పల్లెలోకి ఒకప్పుడు కుంకుమను ఎక్కువగా ఉప యోగించేవారు. అయితే నేడు వాటి స్థానంలో బొట్టు బిళ్ళలూ (స్టిక్కర్లు) వచ్చేశాయి. అలా కుంకుమను తెచ్చి అమ్మే దాసర్లు, పూసలోల్ల వంటి ఎందరో పల్లెలమీద ఆధారపడి జీవించేవారు. నేడు వారు ఎక్కడ కనపడరు పల్లెల్లో అంటాడు కవి.

ఇల్లు కట్టుకొనె ఇటుకల రాయితో, సెలకల చల్లె
ఎరువు కుళ్లుతో
ఎద్దు బండి ఉన్నోనికి సేతిలో ఏడాదంతాపని
దొరికేది
టాటా ట్రాక్టరు టక్కరిచ్చినాదో, నా డొంక దారిని
నా ఎద్దు బండి గిల్లెగిరి పడ్డదమ్మో నా పల్లెల్లోనా.

ఇంటి కట్టుకొనే పనికి, వ్యవసాయానికి ఎక్కువగా పల్లెల్లో ఎద్దులు బండ్లు మాత్రమే ఉపయోగించారు. దాని వల్ల సంవత్సరమంతా ఎద్దుల బండ్లు పెట్టుకొనే వాళ్ళకు

పని దొరికేది. నేడు ట్రాక్టరు రావడంతో ఆ పనులన్నీ, ట్రాక్టర్లుతో చేయడం వలన ఎద్దు బండి ఎగిరిపడింది అంటాడు కవి.

తొలకరి జల్లులకు తడిసిన నేల మట్టిపరిమళాలే
మైపాయెరా
వానపాములు, నత్త గుల్లలు భూమిలో ఎందుకు
బతకలేవూ
పత్తిమందుల గత్తర వాసనరా ఈ పంట పొలాల -
- - -
హరిశ్చంద్ర పద్య నాటకాల పంతులారోనియం
చెదలు పట్టినది
యక్షగానము నేర్పే పంతులు ఉప్పరి పనిలో
తట్టపట్టినడు
యాచకులు, నా బుడగా జంగాలూ, ఈ పల్లెల
నిడిచీ
దేవా హరిహరా ఓ .....

ఒకప్పుడు పల్లెల్లో నాటకాలు, యక్షగానాలు, హరి కథలు, కోలాటం, చెక్కభజన, తోలుబొమ్మలాట వంటి కళా రూపాలన్నీ కూడా ప్రదర్శించేవారు. అయితే నేడు అవన్నీ కనుమరగవడాన్ని పై పంక్తులలో వెంకన్నగారు తెలియ పరుస్తున్నారు.

పిండోలెన్నల రాలుచుండగ రచ్చబండపై కూసొని
ఊరే
ఎనకటి సుద్దులు ఎతలూ కతలూ
యాది జేసుకొని బాధలె మరిచిరి
బుక్క నోటిలో బడ్డదంటే నేడు మన పల్లెల్లోనా
అయోయ ఒక్కడు రాతిరి బయటకెళ్ళడమ్మో ఇది
ఏమి విచిత్రమో..

ఒకనాటి పల్లెలోని మనుషుల స్వభావాన్ని నేటి మనుషుల స్వభావాన్ని తెలియజేశాడు. ఒకప్పుడు రాత్రైతే చాలు పిల్లలు ఆటలు ఆడుకొనేవారు. పెద్దలు పగలంతా పొలాలల్లో కష్టపడి పనిచేసింటారు కావున అందరూ ఒక చోట చేరి ముందు జరిగిన విషయాలను నెమరు వేసుకొనే వారు. కానీ నేడు ఆ పరిస్థితి కనపడదు పలెల్లో.

అరె స్టార్ టీవి సకలిస్తా ఉన్నదమ్మో నా పల్లెల్లోనా
సామ్రాజ్య వాద విషమెక్కుతున్నదమ్మో మెల్లంగా
పల్లెకు
- - - - - -
- - - - - -
అరె బహుళ జాతి కంపని మాయల్లోనా మా
అన్నల్లారా
భారత పల్లెలు నలిగి పోయి కుమిలె ఓ
అయ్యల్లారా...

పెద్దపెద్ద కంపెనీలు రాకతో చిన్నచిన్న కులవృత్తులు, కుటీర పరిశ్రములు కనుమరుగయ్యాయి. పట్టణాల సోకులు, నగరాల విషసంస్కృతి పల్లెల్లో వికృతంగా అలుముకుంది. ప్రపంచీకరణ విషపు గాలులు ఇంత వేగంగా పల్లెల్ని ముంచెత్తడంతో కవి ఆత్మనాళాల్లోంచి ఈ పాట ఒక ఉప్పెనలా ఎగిసి వచ్చింది.

పల్లె గురించి ఇంత గాఢత ఉన్న ఈ పాటను 'ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ముద్రించిన 'మన చదువు - మన కోసం' 5వ తరగతి లెవల్ - బీ పాఠ్య పుస్తకంలో పూర్తి పాటను పాఠ్యాంశంగా ముద్రించారు. అంతే గాకుండా ఈ పాట 2002లో డా. ఎల్. శ్రీనాథ దర్శకత్వంలో వచ్చిన 'కుబుసం' సినిమాలో కీలకమైన గీతంగా వినిపిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. మత్తడి (కవితా సంకలనం)
2. ఆంధ్రజ్యోతి వివిధ - 16.03.2020 - ఇంటర్వ్యూ - పసనూరి రవీందర్
3. ప్రపంచీకరణ ప్రభావ నవలలు - పరిశీలన : ఎం. నాగరాజు, కేంద్రీయ విశ్వవిద్యాలయం
4. డా. ఎస్. రఘు : వెంటాడే పాట (వ్యాసం)

❖

ప్రపంచీకరణ ప్రభావాన్ని చిత్రించిన కేతు విశ్వనాథరెడ్డి కథలు

– డా॥. బుశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ఎ.పి. ట్రిపుల్ ఐటి, ఆర్.కె.వ్యాలీ, కడప.

ఆధునిక కథా సాహిత్యంలో పరిచయం అక్కరలేని వ్యక్తి ఆచార్య కేతు విశ్వనాథరెడ్డిగారు. వీరు బహుముఖ ప్రజ్ఞావంతులు. అందులో కథా సాహిత్య సృజనలో అందె వేసిన చేయి. సమాజంలో జరుగుతున్న ప్రతి మార్పును ఒడిసిపట్టుకొని దానిని చక్కగా శిల్పీకరించి కథ సృజన చేయుటలో వీరికి వీరే సాటి. వీరు పాతతరం కొత్తతరం కథకులకు వారధి వంటివారు. వీరి కథా వస్తువులుగా రైతు జీవనం, సంస్కృతి, ఫ్యాక్షనిజం, మధ్య పేద తరగతి ప్రజల దుర్భర జీవనం వంటి వాటిని పేర్కొనవచ్చు. ఈ అంశాలపై ప్రపంచీకరణ ఎలాంటి ప్రభావం చూపుతున్నదో చక్కగా తెలిపాడు.

విదేశీ జంతువులపట్ల వ్యామోహం :

గ్లోబలైజేషన్ మూలంగా ప్రపంచమంతా కుగ్రామమై పోయింది. ప్రపంచదేశాల్లోని వస్తువులు, జంతువులు మన ఇంటి ముంగిటకే వచ్చి చేరుతున్నాయి. అలాంటి వాటిలో పెంపుడు జంతువులయిన కుక్కలు కూడా ఉన్నాయి. అలాంటి ఒక ఘటనను కథకుడు కేతు విశ్వనాథరెడ్డి ఇలా చిత్రించాడు 'అనధికారం' అనే కథలో.

''వారపత్రికలో బాక్సులోని జంతుప్రేమ వార్త సుధారాణి కళ్ళబడింది. ఒక ముఖ్యమంత్రిగారు కోడలు రక రకాల పక్షులు, రంగు రంగుల పిట్టలు, మాట్లాడే పక్షులు, చిలుకలు, మైనాలు, పూలపిట్టలు పెంచుతున్నదనీ. ఆవిడ దగ్గరుండే ఐరిస్ వుల్ఫ్ హవుండు ప్రపంచంలో అరుదైన అపురూపమైన పెద్ద కుక్క అనీ. ఆమె జంతు ప్రేమ అద్వితీయమనీ వార్త!

ముఖ్యమంత్రి కోడలు జంతు ప్రేమకు సుధారాణి ఈర్ష్య పడింది. తల్లడిల్లింది. అసహనంతో మండి పోయింది.

ప్రతి విషయంలోనూ మంత్రులూ, వాళ్ళ కొడుకులూ, కోడళ్ళూ, భార్యలూ, చుట్టాలూ - వీళ్ళకే పేరు ప్రఖ్యాతులు పత్రికల్లో వాళ్ళను గురించే రాతలు! జంతు ప్రేమ ముఖ్యమంత్రుల కోడళ్ళకే ఉన్నట్లు! అదేదో ఆ మధ్య పత్రికలో సినీతార కుక్కల ప్రేమ గురించి వ్యాసం వచ్చింది. తన బంగళాలో రకరకాల కుక్కలున్నాయి. ఐరిష్ వుల్ఫ్ హవుండు లేక పోవచ్చు. పెంపుడు పక్షులు లేక పోవచ్చు. తాను అనుకోవాలే కానీ యెంతసేపు? అంతే.

ఐరిన్‌వుల్ఫ్ హవుండును సంపాదించి పత్రికలో ఫోటోలు వేయించుకోవాలి అని సుధారాణి నిర్ణయించు కొంది'' అంటాడు కథకుడు. మన దేశ జంతువులు, పక్షులు కాదని విదేశాల వాటిని పెంచడం అన్నది ఉన్నవారికి ఒక ఫ్యాషనై పోయింది. దీనికి ప్రధాన హేతువు ప్రపంచీకరణయే ననవచ్చు.

ఆంగ్లభాష ప్రభావం :

ప్రపంచీకరణ ప్రభావంతో వావివరుసల పిలుపులు కూడా తెలుగుకు దూరమయ్యాయి. చిన్నపిల్లలు కూడా ఆంగ్లంలో అంకుల్ అని, ఆంటి అని పిలుస్తున్నారు. ఈ పిలుపులు పిల్లలకు మాటలు తిరిగే దశలోనే అలవాటు చేస్తున్నారు. ఇలాంటి ఒక సన్నివేశాన్ని కథకుడు కేతు విశ్వనాతరెడ్డి గారు 'సందా కబళం' అనే కథలో ఇలా తెలిపారు.

''నెలరోజుల కిందట హెూం డిప్యూటీ సెక్రటరీ కొడుకు భార్యాబిడ్డలతో కొండకొచ్చాడు. ఆ రోజు సిఐ కూడా కొండ పార్టీ వెంట ఉన్నాడు. అయ్యగారు అమ్మా గారెంత చెబితే అంత. అయ్యగారికి తినగలిగినంత ప్రసాదాలు కావాలి. అమ్మగారు కనబడ్డ రాళ్ళకంతా దండాలు పెట్టాలి. చేతులు నిండకూ యెవరెవరికో హైదరాబాదులో

పంచడానికి మహాప్రసాదం పొట్లాలు కావాలి. పిల్లలు ముగ్గురయినా పిల్ల రాక్షసులు. యేడాది మూడో పిల్ల మరీ బ్రహ్మ రాక్షసి. గుళ్ళోకి వెళుతూనే గుడి దద్దరిల్లేట్లు గీపెట్టింది. తల్లి వెంటనే కొండయ్యకు అందించింది. సిఐ మిగతా వాళ్ళకు దర్శనం తీరిగ్గా చేయించి పుణ్య మంతా మూటగట్టుకొని వచ్చేవేళకు, ఆ పిల్ల కొండయ్యను మూడు చెరువుల నీళ్ళు తాగించింది. ఈ బ్రతుకొద్దురా నాయనా, దేవుడా! అని మొత్తుకున్నాడు. ప్రసాదం లడ్డు ఆ పిల్ల నోట్లో వేయడంతో అవురావురుమని తీపి చప్పరించి జొల్లు కార్చుకుంటూ కాస్తా దారికొచ్చింది. అమ్మగారొచ్చాక పిల్లల కంత తీపి పెడతారా? అని కేక లేసింది. ఇంగ్లీషులో అర్థంగాని తిట్లు తిట్టింది.

ఇది చాలదన్నట్లు పెద్దవాడు, చిక్కినా కొండలడ్డులా ఉన్నవాడు - గెంతుతూ నడుస్తోంటే గుడి తడినేలమీద జారిపడ్డాడు. బాధలో కూడా కన్న అమ్మనూ, నాన్ననూ పిలువలేదు. అంకుల్ అంకుల్ అని ఏడుస్తూ సిఐ వైపు చేతులు చాచాడు. తన రక్షణ చూసేది తల్లిదండ్రుల పరిచారికులే అన్నట్లు", అంటాడు కథకుడు. కేతు విశ్వ నాథ రెడ్డి గారు పైకథలో ప్రపంచీకరణ ప్రభావంతో ఆంగ్లభాష పెద్దలపైనే గాకుండా పసికూనలపై కూడా ఎంత బలంగా ప్రభావం చూపుతున్నదో తెలిపాడు. ఆంగ్లంలో మాట్లాడితేనే ముద్దు అనే స్థాయికి పండిత పామరులందరూ చేరుకున్నారు. దానికోసమై తల్లి దండ్రులు ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకంజ వేయడం లేదు.

పశువుల అమ్మకం :

కరువు ప్రభావానికి పల్లెప్రజలు ఎలా తల్లడిల్లిపోతారో కథకుడు కేతు విశ్వనాథరెడ్డిగారు 'గడ్డి' కథలో చక్కగా తెలిపాడు.

"పుల్లారెడ్డి మనసులో కరువు కాలం తిరిగింది.

ఈ పాడు కరువు అందర్నీ మాడ్చి మసిచేస్తాంది. రైతులకు ఇంట్లో గింజల్లేవు. వీధుల్లో పరపతుల్లేవు. పశువులకు కళ్ళాల్లో మేతలేదు. యే కొండగడ్డి లేదు. పెద్దోళ్ళు దాత కరువని యేదో చెప్తారు. కానీ ఇంత కరువు పశువులకు గాట్లో యింత మేతలేదని చెడ్డ కరువు తనింతవరకు చూల్లేదు. వూళ్ళో కలిగిన అయిదారిండ్ల వాళ్ళు తప్పిస్తే చిన్నాచితక రైతులు మేత దొరక్క కన్నబిడ్డల్లాంటి ఎదుల్ని, కాండ్లకు కాండ్లే పులివెందుల సంతకు తోలి, అయిన కాడికి తెగనమ్మి వచ్చినారు. లారీలకు లారీలు నోరులేని ఎద్దుల్ని యేసుకొని బెంగు ళూరు కంట పోతాంటే తనొక సంతరోజు చూసినాడు. పల్లెల్లో ముప్పై నలభై కాండ్లు, అమ్మినారంట! ఈరోజు మూడువేలు చేసే యెద్దుల్ని వెయ్యికి కళ్ళంలో నారా యుడు అమ్మ లేదా? యేడుస్తా కూకో లేదా? తను మాత్తరం ఈ కాడెద్దుల్ని నిలబెట్టుకోడానికి పాడి గేదెల్ని అమ్మలేదా? ప్రెసిడెంటు బడి పని పెట్టుకోబట్టి కానీ లేకపోతే యీ ఎద్దులు, బండి నిల్చేవా? తను అమ్మా బతకడమే చావయితే? తన రెండెకరాలు, ట్రైర్ల బండికి తెచ్చిన అప్పు కిందనే వుంది. ఎంత బాడుగలు తోలినా కడుపు నిండా సంగటి సారకాలేదు, గాటి నిండా మేతా లేదు.

బండి వూరిదగ్గరకొచ్చింది. యెటు చూసినా చీకిచెట్లే వాటిని చూసిన పుల్లారెడ్డికి కోపం రగిలింది. ఆమధ్య పుల్లారెడ్డికి చీకి ముల్లిరిగింది. కిరసనాయిలు, చీకిఆకు వైద్యం చేయించుకున్నా బాధ తగ్గలేదు. నెలరోజులు నానా యాతన పడ్డాడు. అది గుర్తుకొచ్చింది. వాటిని చూస్తూ అసహ్యించుకున్నాడు" అని తెలిపాడు.

ఒకప్పుడు కరువొస్తే ప్రజలు పొట్ట చేతపట్టుకొని జంతువులను తోలుకొని ఎక్కడ నీరు, గడ్డి ఉంటే అక్కడికి తోలుకొని వెళ్ళేవారు. అయితే ప్రపంచీకరణ ప్రభావంతో రైతులు పశువులను కబేళాలకు అమ్మివేసి, తాము మాత్రం బతుకు తెరువు కోసం నగరాలకు వలసలు వెళు తున్నారు. ఈ దుస్థితి దేశమంతా ఉందని చెప్పవచ్చు.

విదేశాలకు వలసలు :

ప్రపంచీకరణ ప్రభావంతో పిల్లలు అమెరికా, లండన్

వంటి దేశాలకు ఉపాధి కోసం వెళ్ళడం సర్వసాధారణ మయింది. తల్లిదండ్రులు భారతదేశంలో ఉంటుండగా పిల్లలు స్టాఫ్‌వేర్ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా విదేశాలకు వెళ్ళి లెక్కలేనంత డబ్బు సంపాదిస్తున్నారు. ఈ విషయాన్ని కథకుడు కేతు విశ్వనాథ రెడ్డి గారు 'కాంక్ష' కథలో ఇలా తెలిపారు.

"పెద్దమ్మాయి ఎమ్మెస్సీ గణితం చేసింది. మరో గణితం ఎం.ఎస్.సిని పెళ్ళి చేసుకుంది. కట్న గణనాల్లేవు. రెండో అబ్బాయి బిటెక్ మెకానికల్ చేశాడు. నానా తంటాలుపడి కంప్యూటరు కోర్సులు పూర్తి చేశాడు. అమెరికాలో సమా చార సాంకేతిక పరిశ్రమ పిలుపుతో అమెరికా చేరుకున్నాడు. హెచ్.బి. మీద, 60కె తో మూడో అమ్మాయి గ్రూప్ ఒక సర్వీసులో సిటిఓగా సెలెక్ట్ అయింది," అంటాడు కథకుడు.

ప్రపంచీకరణ ప్రభావంతో ఒక ప్రాంతంవాళ్ళు ఖండాంతరాలకు వెళ్ళి వచ్చుటకు లేదా అక్కడే స్థిర పడుటకు చక్కని అవకాశం కలిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచీకరణ ప్రభావంతో ప్రజలు దగ్గర య్యారు. కానీ వారి మనసులు దగ్గర కాలేదని రూఢిగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కేతు విశ్వనాథ రెడ్డి కథలు - 1, 2 సంపుటాలు
2. సంస్కృతి - ఎ.ఎన్. మూర్తి
3. సంస్కృతి - సం॥ తెలకపల్లి రవి
4. తెలుగు కథానిక స్వరూప స్వభావాలు - డా॥ పోరంకి దక్షిణామూర్తి
5. కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
6. కేతు విశ్వనాథరెడ్డి కథలు - అరసం ప్రచురణ
7. తెలుగు కథకులు, కథనరీతులు - సం॥ సింగమనేని నారాయణ

❖ ❖ ❖

"రైతుల జీవితం - మార్పులు" (నమ్ముకున్న నేల కథ)

– డా॥. ఈ. మురళీధర్, యస్.వి డిగ్రీ పీజి కాలేజ్, అనంతపురము.

రచయిత పుట్టిన ఊరు చిలమకూరు. హైదరా బాదులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు తన స్వగ్రామంలో పిత్రార్జితంగా రెండెకరాల తోట మిగిలి ఉ ంది. నాలుగేండ్ల కిందట వీరన్న అనే దాయాది ఆ రెండెక రాల భూమిని తానే తీసుకుంటానన్నాడు. వీరన్నకే ఇవ్వా లని ఆయన నిర్ణయించుకున్నాడు. తన నిమ్మచెట్లు కాపుకాసిన వెంటనే మిగిలిన ఎనిమిదివేలు ఇస్తానని, రెండువేలు ఇచ్చి వీరన్న క్రయపత్రం రాయించుకున్నాడు. అంతవరకు గుత్త ఇచ్చేట్లు ఖరారయింది. కాని వీరన్న గుత్త ఇవ్వడం లేదు. రిజిష్టరు చేయించుకోలేదు. రచయిత కూరుతు పెళ్ళి నిశ్చయమైంది. వీరన్నకు ఉత్తరం రాసినా జవాబులేదు. ఇంతలో అదే ఊర్లో ఉండే అంగడి సుబ్బా రాయుడు వీరన్న వ్యవసాయం మానివేశాడని, తన తోట అమ్మివేశాడని, రచయిత పొలం తాను కొంటానని ఉత్తరం వ్రాశాడు. ఇంతకంటే ఉత్తరంలో వివరాలు లేకపోవడం చేత విషయం కనుక్కుందామని రచయిత తన ఊరు వచ్చాడు.

రచయిత తన ఊరును చూచి ఆశ్చర్యపోయాడు. చేలు వానలు లేక బీళ్ళయ్యాయి. ఊర్లో వేపచెట్టు క్రింద అరుగుమీద ఎప్పుడూ కనిపించే పుల్లయ్య కనిపించలేదు. అసలక్కడ ఊరివాళ్ళే కానరాలేదు. ఎవరో ఇద్దరు కుర్ర ాళ్ళు మాత్రం మట్కాచార్ట చూస్తున్నారు. ఊరిమధ్య అన్ని గ్రామవ్యవహారాలు జరిగే దేవాలయంలో కొంత మంది పిల్లలు కూర్చున్నారు. ఊరు వలసపోయినట్లు అనిపించింది. ఇళ్ళ అరుగులమీద పిల్లలు తప్ప పెద్దలు లేరు.

రచయిత వీరన్న ఇంటికి వెళ్ళాడు. వీరన్న భార్య రామ లక్ష్మమ్మ అతనికి కాళ్ళకు నీళ్ళిచ్చింది. మంచం వాల్చి కూర్చోమంది. కాఫీ ఇచ్చి మర్యాద చేసింది. రచయితకు వీరన్న ఇంటిలో ఎద్దులుగాని, వ్యవసాయపు పనిముట్లు గాని, గేదెలుగాని, చొప్పగాని కనిపించలేదు. వీరన్న వ్యవసాయం మానివేశాడని అర్థమయింది. వీరన్న సాయంత్రం ఇంటికి వస్తాడని చెప్పింది రామలక్ష్మమ్మ. రచయిత అంగడి సుబ్బారాయుడింటికి వెళ్ళాడు. అంతలో ..... పెద్దనాయన కొడుకు మునిరెడ్డి వచ్చి రచయితను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. ..... గ్రామ పరిస్థితులు, దేశ రాజకీయాల గురించి చెప్పాడు. రచయిత కుటుంబ వివరాలు, ఆర్థిక పరిస్థితులు ఆరా తీశాడు. పొలం తక్కువ ధరకైనా సుబ్బారాయుడికే ఇవ్వాల్సి ఉంటుందని తేల్చిచెప్పాడు.

రచయిత సుబ్బారాయుడు ఇంటికి వెళ్ళి భోజనం చేశాడు. దేవాలయం దగ్గరకు వెళ్ళి భోజనం చేశాడు. దేవాలయం దగ్గరకు వెళ్ళి కుర్రవాళ్ళు కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీల గురించి వాదులాడుకోవడం చూశాడు. తిరిగి వచ్చిన తరువాత సుబ్బారాయుడు తన కష్టాలన్నీ ఏకరువు పెట్టి రచయిత పొలానికి ఆరువేలకంటె ఎక్కువ ఇవ్వలేనని చెప్పాడు. తను తప్ప ఇంకెవ్వరూ ఆ పొలాన్ని కొనేవారు గ్రామంలో లేరని చెప్పాడు.

వీరన్నకు వ్యవసాయంలో నష్టం వచ్చింది. బాకీల పాలయ్యాడు. పొద్దుటూరికి వెళ్ళి భోగం కంపెనీలో చేరాడు. నీళ్ళు, అన్నం పొట్లాలు మోశాడు. బ్రాందీలు సారాయి తెచ్చాడు. చెయ్యగూడని పనులెన్నో చేశాడు. సొంతంగా కంపెనీ పెడదామనుకున్నాడు. పొలం అమ్మి బాకీలు కూడా పూర్తిగా తీర్చకుండా రెండువేలు తీసుకుని చిలకలూరిపేట వెళ్ళాడు. ఇద్దరు భోగం వాళ్ళను తెచ్చు కున్నాడు. వారిద్దరూ మోసం చేసి వెళ్ళిపోయారు. పోలీసు వాళ్ళచేత దెబ్బలు తిన్నాడు. అన్నివిధాల నష్టపోయి ఊరు చేరుకున్నాడు. ఫ్యాక్టరీలోకి కూలికి వెళుతున్నాడు.

వీరన్న రాత్రికి ఇంటికి వచ్చి రచయితతో తన గతమంతా చెప్పాడు. పొలం సుబ్బారాయుడికే అమ్మ నన్నాడు. ఇంట్లోనుంచి క్రమపత్రాన్ని వెతికి తెచ్చి ఇచ్చాడు. రచయిత కూతురు పెళ్ళికి తానే తంటాలు పడతానని, భూమిని ఉంచేసుకోమని వీరన్నతో చెప్పాడు. దానికి వీరన్న ఇలా అన్నాడు. "కరువును నమ్ముకోమంటావా? సుబ్బారాయుడిని నమ్ముకోమంటావా? బావిలో వంతు లేందంటే యేమి చెయ్యాలి? ఎద్దులు లేవు. పనిముట్లు లేవు. భూమిని నమ్ముకుని ఇరవైయేండ్లు పనిచేస్తే నాకు మిగిలిందేమిటి? సుబ్బారాయుడికి ఇవ్వవలసిన పదిహేను వందల బాకీ, గవర్నమెంటుకు కట్టవలసిన శిస్తు. ఈ బాకీలు చెయ్యలేకే బయటకు వెళ్ళాను. ఇంకా నష్టపోయి వచ్చినా."

ఫ్యాక్టరీ పని పూర్తయిన తరువాత పనులు ఉండవు గదా! అందువల్ల పొలం ఉంచుకుంటేనే బాగుంటుందని రచయిత మళ్ళీ సూచించాడు. దానికి అతడు "భూమీ వద్దు గీమీ వద్దు. భూమి చేసుకుంటాననుకో సుబ్బా రాయుడికి బాకీ, గవర్నమెంటుకీ బాకీ, నీకు బాకీ. సుబ్బారాయుడు తన బాకీలోని మళ్ళీ అయకం పెట్టు కుంటాడు. సొంతం చేసుకొంటాడు. సుబ్బారాయుడి బాకీ కింద నువ్విస్తానంటున్న రెండెకరాలు పోతాయి. నేను నీకివ్వాల్సిన పదివేలు ఇరవైవేలవుతుంది. సుబ్బా రాయుడు ఆరువేల కంటే ఎక్కువ ధర ఇవ్వడు. నువ్వు ఏమీ చెయ్యలేవు, ఇవ్వాల్సిందే. నేను నీకిచ్చిన బయానా డబ్బు నాకు రాదు. అది నా బాకీ క్రింద సుబ్బారాయుడు చెల్లువేసుకుంటాడు. నువ్వూ నేనూ చేసేది ఏమీ లేదు." అని వివరంగా చెప్పాడు.

ఆ రాత్రికి భూమి వ్యవహారం పూర్తయింది. మునిరెడ్డి మధ్యవర్తిత్వం చేసి, ఆరువేల మూడవందలకు ఫైనల్ చేశాడు. సుబ్బారాయుడు రచయితకు రెండువేల ఏడు వందలు ఇచ్చాడు. వీరన్నకు రచయిత ఇవ్వాల్సిన పద మూడు వందలు తీసుకున్నాడు. మిగిలిన రెండువేలు మానుల్లో ఇస్తానన్నాడు. రచయిత అన్నింటికి సరేనన్నాడు.

ఆ రాత్రి వీరన్న రచయితకు ఊరి విషయాలు, ఫ్యాక్టరీ కబుర్లు, పెద్దమనుషులు రైతులకు చేస్తున్న మోసాల గురించి చెప్పాడు. తెల్లవారిన తరువాత వీరన్న ఫ్యాక్టరీకి బయలుదేరాడు. అతనితోపాటు కరువుకాటకాలకు అప్పులపాలై పొలాలు అమ్ముకొన్న రైతులు కూలీలుగా మారి ఫ్యాక్టరీకి బయలుదేరారు. వారితే బయలుదేరాడు రచయిత, తిరుపతి వెళ్ళి ఇప్పట్లో పెళ్ళి చేయలేమని చెప్పడానికి.

నమ్ముకున్న నేల వీరన్నను అప్పుల పాలుచేసి కూలీగా మార్చింది. కుతురి పెళ్ళికి సహాయంగా ఉంటుందని రచయిత నమ్ముకున్న నేల అతని కూతురి పెళ్ళి చేయలేక పోయింది.

ఆధార గ్రంథాలు :

1. రాయలసీమ కథలు - సింగమనేని నారాయణ - 2005
2. నమ్ముకున్న నేల - కేతు విశ్వనాథ రెడ్డి
3. రెండు దశాబ్దాల కథ - పాపినేని శివశంకర్

❖ ❖ ❖

తెలుగు కథలు - ప్రపంచీకరణ ప్రభావం

– డా॥. నల్లపనేని విజయలక్ష్మి, తెలుగు ఆధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

పందొమ్మిదవ శతాబ్దంలో ప్రారంభమైన తెలుగు కథ నమకాలీన నమాజాన్ని ప్రతిబింబించటంలోనూ, సామాన్య దృష్టికి అంత తేలికగా గోచరం కాని సామాజిక సమస్యల వైపు ప్రజల దృష్టిని మళ్లించే విషయంలోనూ గురుతర బాధ్యతను నిర్వహించింది. ప్రపంచీకరణ అనివార్యంగా మారిన సమయంలో దాని వల్ల మేలే జరుగుతున్నదని సామాన్యులు భ్రమ పడుతున్న సమయంలో వాస్తవాలను ప్రజల ముందు ఉంచటానికి తెలుగు కథ చేసిన ప్రయత్నం అభినందనీయం.

దేశాలకు, ప్రజలకు మధ్య పరస్పర నంబంధ బాంధవ్యాలు, పరస్పరం ఆధారపడటంలోని పెరుగుదలనే ప్రపంచీకరణగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. వస్తువులు, సేవలు, పెట్టుబడులు, ప్రజలు, భావాల ప్రవాహం వేగంగా, ఎక్కువగా ఉండేలా అంతర్జాతీయ సరిహద్దులు తెరుచుకోవటం, దానికి దేశీయంగా, అంతర్జాతీయంగా వివిధ సంస్థలు, విధానాలు దోహదం చేయటం కూడా ప్రపంచీకరణలో భాగమే.

వివిధ ప్రాంతాలు, ప్రజల మధ్య వేగంగా పెరుగుతున్న నంబంధ బాంధవ్యాలు, నమాచార సాంకేతిక విప్లవం నమాజంలో అనేక మార్పులు చోటు చేసుకోవడానికి కారణమవుతున్నాయి.

మన దేశంలో ప్రపంచీకరణ ప్రభావం ఆంగ్లేయుల పాలనా ప్రభావంతోనే మొదలైందని చెప్పుకోవచ్చు. తమ అవసరాల కోసం వారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానం సంప్రదాయ విద్యావిధానాన్ని నమూలంగా మార్చి వేసింది. వారు దేశంలోని ముడి సరుకునంతా తరలించుకొని వెళ్ళి యంత్రాల సాయంతో తయారు చేసిన వస్తు నముదాయాన్ని అతి తక్కువ ధరలకే అందించటంతో దేశంలోని వృత్తులన్నీ కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. వృత్తి విద్యలు కూడు పెట్టే అవకాశం లేదని గ్రహించి ఆధునిక విద్యావిధానం ద్వారానే ఉపాధి సాధ్యమని నమ్మి ఆ వైపుకు పరుగులు పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదంతా నిదానంగానే జరిగినా ఆ ప్రభావం ఈనాడు స్పష్టంగా కనిపిస్తున్నది.

మన దేశంలో ఈనాడు అమలులో ఉన్న విద్యా విధానం నమాజానికి అవసరమైన భిన్న నైపుణ్యాలు గల వ్యక్తులను తయారుచేసేదిగా లేదు. ప్రపంచీకరణ ప్రభావంతో ఆయా పెట్టుబడిదారీ సంస్థలు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పనిచేయటానికి పనికివచ్చే నైపుణ్యాలను నేర్పేదిగా మారిపోయింది. ఇతర దేశాలకు చెందిన సంస్థలలో ఉద్యోగాలు సంపాదించుకోవటం కోసం మాతృ భాషను విడిచిపెట్టి పరభాషా మాధ్యమంలో చదువుకోవటం తప్పనిసరి అవసరంగా మారింది.

తెలివైన విద్యార్థులకు, తమ కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టగలిగిన వారికి ప్రపంచ దేశాలు ఆహ్వానం పలుకుతున్నాయి. అత్యధిక వేతనాలు పొందుతూ, సౌకర్యవంతమైన జీవితాలు గడుపుతున్న ఆ కొద్దిమందిని చూసి వారిలాగే తమ పిల్లలు ఉండాలనే కోరికతో తల్లిదండ్రులు తమ పిల్లల శక్తిని గమనించకుండా పరుగుపందెంలో గుర్రాలుగా మార్చి వారిని తరుముతున్నారు. బయటకు కనిపించే అత్యాధునిక, సౌకర్యవంతమైన

జీవితాలు ఏ క్షణమైనా పేలిపోయే నీటి బుడగ వంటివని, ఆ ఉద్యోగాలకు ఎటువంటి భద్రత ఉండదని, ఏ క్షణంలో అవసరం లేదనిపిస్తే ఆ క్షణంలో ఉద్యోగం నుండి తొలగిస్తారని వారు గ్రహించలేకపోతున్నారు. అదే సమయంలో తాను ఏమి చదువుతున్నాడో, ఆ చదువుకు తగిన ఉద్యోగం పొందగలడో, లేడో తెలియని స్థితిలో

నేటి విద్యార్థి ఉంటున్నాడు. అటువంటి పరిస్థితులను సున్నితంగా చర్చించిన కథ 'ఒక్క వాన కోసం'. రచయిత పాపినేని శివశంకర్.

కథలోని నాయకుడు హరి. తనకు డాలర్ వానలో తడిసే అవకాశం రాలేదు కాబట్టి తన కొడుకు ఆ వానలో తడవాలనే ఏకైక లక్ష్యంతో అతడి తండ్రి చదివిస్తాడు. ఆటపాటలు, సరదాలు అన్నీ మర్చిపోయి ఇంజనీరింగ్ చదవడమొక్కటే లక్ష్యంగా అతడి జీవితం గడుస్తుంది. 'చదువు తప్ప మరో లోకం పనికిరాదు. పోటీలో వెనకబడ రాదు' అని తండ్రి చెప్పిన మాటలు వేదవాక్కుగా అతడు ఇంజనీరింగ్ పూర్తి చేస్తాడు. అయినా బెంగుళూరులో పెద్దగా పేరు లేని కంపెనీలో పెద్ద జీతంలేని ఉద్యోగం మాత్రమే వస్తుంది. ఎలాగైనా వీసా తెచ్చుకొని అమెరికా వెళ్లాలని విఫల ప్రయత్నం చేస్తాడు. వీసా వచ్చి అమెరికా వెళ్లిన అతడి స్నేహితుడు ఉద్యోగం రాక ఐదు, పది డాలర్ల కోసం సబ్‌వేలో పని చేస్తుంటాడు.

హరి ప్రేమించిన హరిత అతడికి వీసా రాకపోవటంతో యు.ఎస్‌లో మంచి కంపెనీలో మంచి ఉద్యోగం ఉన్న వ్యక్తిని పెళ్లాడి వెళ్లిపోతుంది.

ఈ కథలో ప్రపంచీకరణ ప్రభావం గురించిన ప్రత్యక్ష ప్రస్తావన ఉండదు. ఆ ప్రభావం వ్యక్తుల జీవితాల మీద, వారి సంబంధ బాంధవ్యాల మీద, విద్యావ్యవస్థ మీద ఎంతగా ఉందో పరోక్షంగా తెలియజెపుతుంది.

ప్రపంచీకరణ ప్రభావంతో వచ్చిన నయా ఉపాధి అవ కాశం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు. భారీ వేతనాలు లభిస్తాయనే ఆశతో యువత వాటికోసం పరుగుపెడుతున్నది. తీరా ఉద్యోగం లభించాక వారి జీవితాలు ఎలా ఉంటున్నాయో వివరించింది శివశంకర్ గారే రచించిన 'వర్చ్యుయల్ రియాలిటీ' కథ. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లోని డొల్లతనాన్ని గురించి తెలియజెపుతుందీ కథ.

మనీషా, సుప్రియ ఈ కథలో ప్రధాన పాత్రలు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. మనిషికి, మనిషికి సంబంధం లేకుండా ఒంటరిగా క్యూబికల్‌లో కంప్యూటర్ ముందు కూర్చొని అంతులేని ఒత్తిడికి గురవుతూ వారు పని చేస్తారు. ప్రాజెక్టుల తుది మొదలు తెలియకుండానే, అవి ఎక్కడో, ఎందుకో సరైన అవగాహన లేకుండానే ఎలాట్ అయిన పనిని డెడ్ లైన్ లోగా పూర్తి చేయటమే లక్ష్యంగా నిద్రాహారాలు మాని పని చేయవలసి ఉంటుంది. ఎంతో కష్టపడి ప్రోగ్రామింగ్ చేస్తే ప్రాజెక్టు లీడర్ క్రెడిట్ మొత్తం తనదిగా మేనేజర్ వద్ద ప్రాజెక్ట్ చేసుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి.

ఉద్యోగంలోని అభద్రతా భావం, ఒత్తిడుల నుండి విముక్తి పొందటం కోసం వారాంతంలో ఔటింగ్స్‌కి వెళ్లటం, పబ్స్ చుట్టూ తిరగటం అలవాటు చేసు కుంటారు. అయినా మనసుకు తృప్తి లభించక ఎంప్టీనెస్ సిండ్రోమ్‌తో బాధ పడతారు.

తను దున్నిన పొలాన్ని చూసుకొని రైతు సంతోషించి నట్లు, చెప్పులు కుట్టే మనిషి తన పని చూసుకొని తృప్తి పొందినట్లు, ఒక టీచర్, ఒక సైంటిస్ట్ తమ పనిలో లీనమై ఆనందించినట్లు ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తన పనిని ఆస్వాదించే అవకాశం ఉండదన్న వాస్తవాన్ని ఈ కథ వివరిస్తుంది.

ప్రపంచీకరణ వల్ల సంపన్నదేశాల జీవన విధానంతో పరిచయం ఏర్పడింది. బహుళ జాతి సంస్థలు పాపులర్ మీడియాలో పెట్టుబడులు పెట్టి తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించుకొని వస్తు సంస్కృతిని, వినిమయ సంస్కృతిని పెంచి పోషించాయి. అప్పటివరకూ లగ్జరీగా భావించబడిన టెలివిజన్, ఫ్రిడ్జ్, ఎయిర్ కండీషనర్, సెల్‌ఫోన్ మొదలైన వస్తువులు జీవితావసరాలుగా మారి పోయాయి. వాటిని సమకూర్చుకుంటేనే సమాజంలో గౌరవం లభించే పరిస్థితి ఏర్పడింది. కొనుగోలు శక్తిని పెంచుకోవటం కోసం భార్యాభర్తలు ఇద్దరూ పనిచేయక తప్పదు. ఈ క్రమంలో ఇంటా బయటా స్త్రీలు ఎంత ఒత్తిడికి లోనవుతున్నారో చర్చించిన కథ గీతాంజలి

రచించిన 'ఊరికి పోదాం భూదేవీ'. కథలోని ప్రధాన పాత్ర శివాని కళాశాలలో గణిత ఆధ్యాపకురాలు. ఆమె భర్త దినకర్ నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్‌లో కంప్యూటర్ ఇంజనీరు. సాయంత్రం మరో కంప్యూటర్ ట్రెయినింగ్ సెంటర్‌లో ట్యూటర్‌గా పని చేస్తాడు.

రోజంతా క్లాసులో నిలబడి పాఠాలు చెప్పి, ఇంటికి వచ్చేటపుడు కూరగాయలు తెచ్చుకొని, పిల్లలతో హోం వర్క్ చేయించి, రాత్రికి వంట సిద్ధం చేసి అలసిపోయే శివాని కష్టాన్ని అర్థం చేసుకోకుండా ఆమెను ఎంసెట్ కోచింగ్ సెంటర్‌లో ట్యూటర్‌గా కుదిర్చాడు దినకర్. ఇంత కష్టం అవసరమా? ఎందుకీ సంపాదన? అని శివాని ప్రశ్నిస్తే

'నీకు తెలియదు ఊర్కో. ప్రపంచం ఎంత ఫాస్ట్‌గా ఉందో నీకేమన్నా అర్థం అవుతోందా? నా కొలీగ్స్ అందరూ ఇళ్లు కట్టుకున్నారు. కార్లు కొన్నారు. వాళ్ల ముందు నా పరిస్థితి ఏం కాను? నా స్టేటస్ తగ్గట్లు నేనుండాలా వద్దా? ఇపుడే ఇంత వెనకెయ్యాలి. నువ్వేమైనా నీ వెంట డబ్బుల మూటలు తెచ్చావా? పిల్లల చదువులకు కావాలా వద్దా? మెడిసిన్, ఇంజనీరింగ్ చదివించాలంటే ఎంత ఖర్చు! వేలల్లో డొనేషన్స్ పొయ్యాలి. ఇప్పట్నించే ప్లానింగ్‌తో ముందుకు పోతే అప్పుడు ఇబ్బంది ఉండదు. ఇక ఈ విషయంలో నన్నెప్పుడూ విసిగించకు...' అంటాడు దినకర్ కోపంగా.

'ఒకసారి ఇరవైవేల కలర్ టీవీగా, ఇంకోసారి పది హేనువేల ఫ్రిజ్‌గా....మరోసారి పన్నెండువేల సోఫా సెట్‌గా...ఇంకోసారి ఐదువేల వ్యాక్యుం క్లీనర్‌గా...ఓసారి ఎయిర్‌కూలర్‌గా...ఇంకోసారి ఐదువేల మ్యూజిక్ సిస్టమ్‌గా...అన్ని ఖరీదైన వస్తువుల్లా తనూ ఓ వస్తువు... అంటే...తన శరీరంలోని ఒక్కో భాగాన్ని కోసి వస్తువుగా మార్చి ఇంటిని అలంకరిస్తున్నాడు. దినకర్...దినకరూ బలిపశువే...పగలంతా ఆఫీసు...సాయంత్రం కంప్యూటర్ ట్రెయినింగ్ సెంటర్...ఎందుకూ? ఇల్లంతా వస్తువులతో నిండిపోవాలి...మనుషులూ వస్తువుల్లాగే...వస్తువులతో కాపురం...!' - ఇది ఇంటిని పూర్తిగా వస్తు సముదాయంతో నింపటం కోసం తన ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా దినకర్ ఒత్తిడికి గురి చేస్తుంటే శివాని అనుభవించిన మానసిక వేదన.

సమాజంలో పెరిగిన వస్తు సంస్కృతిని, కొనుగోలు సంస్కృతిని, క్రమంగా మనుషులు యంత్రాలుగా మారుతున్న తీరును ఈ కథ స్పష్టం చేసింది.

మెడిసిన్, ఇంజనీరింగ్ మాత్రమే చదువులుగా భావించటం, పిల్లల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా బాల్యం నుండే వారేం కావాలో తల్లిదండ్రులే నిర్ణయించటం, తాహతు లేకపోయినా పిల్లల చదువుల కోసం వేలల్లో, లక్షల్లో డొనేషన్లు కట్టి ప్రైవేట్ స్కూల్స్‌లో చదివించటం వంటి అంశాలను కూడా ఈ కథ స్పృశించింది.

తల్లిదండ్రులకు పిల్లలతో గడిపే సమయం లేక పోవటం, అంతులేని హోం వర్కులు, ఇష్టం లేని ట్యూషన్లతో పిల్లలు బుల్లి యంత్రాల్లా మారిపోవటం, వారిలో రెస్ట్‌లెస్ నెస్ పెరిగిపోవటం, చిప్స్ వంటి జంక్ ఫుడ్‌కు అలవాటుపడి డబ్బులు దొంగతనం చేయటం, టి.విల్లో వచ్చే ఫైటింగ్స్ చూసి తోడబుట్టినవారితో ఫైట్ చేయటం, ఆడపిల్లలు టి.విలో వచ్చే అందాల పోటీలు చూసి చిన్నవయసు నుండే లిప్‌స్టిక్‌లు, నెయిల్‌పాలిష్‌లు,

హైహీల్స్ కావాలని గొడవ చేయటం మొదలైన అంశాలను రచయిత్రి ప్రస్తావించారు.

ఆట స్థలాలు, ఆట పాటలు లేక టి.వి మాత్రమే గతి కావటం వల్ల అందులో ఏ సంస్కృతిని వారు చూస్తున్నారో దానినే తమలో ఇంకించుకొని బాల్యం నుండే పరాయీకరణకు వారు లోనవుతున్న విధాన్ని రచయిత్రి విశదంగా వర్ణించారు. ప్రపంచీకరణ ప్రభావాన్ని అనేక కోణాల నుండి స్పృశించిన కథ ఇది.

పాపులర్ మీడియాలో పెట్టుబడులు పెట్టే బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించుకోవటం కోసం అనేక యుక్తులను పన్నుతాయి. హటాత్తుగా

పాపులర్ మీడియాలో ఒక నివేదిక ప్రచురితమౌతుంది. 'ఓట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. దానిలో ఫైబర్ చాలా ఎక్కువ ఉంటుంది కనుక మధుమేహంతో ఇబ్బంది పడేవారికి, ఇతరులకు ఎంతగానో ఉపయోగపడే ఆహారం ఇది' అని అందులో ఉంటుంది. అప్పటివరకూ అదేమిటో తెలియకపోయినా, దానిని ఎలా వండుకోవాలో, ఎలా తినాలో తెలియకపోయినా తాము ఆరోగ్యంగానే జీవించామని మరచిపోయి జనమంతా వేలంవెర్రిగా ఆ ప్రొడక్ట్ వెంట పరుగులు తీస్తారు. మరి కొంత కాలానికి గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్స్ చాలా ఎక్కువ ఉంటాయని, ఆరోగ్యానికి చాలా మంచిదని నిరూపించబడిందని మరొక నివేదిక ప్రచురితమౌతుంది. జనమంతా దాని వెంట పరుగులు తీస్తారు. ఈ విధంగా తమ ఉత్పత్తుల పట్ల ప్రజల్లో ఒక మంచి అభిప్రాయాన్ని ఏర్పరచి లాభాలు దండుకోవటం అనేది పెట్టుబడిదారీ సంస్థల మార్కెట్ వ్యూహం అని తెలుసుకోలేక ప్రజలు తమ సంపాదనను వీటి కోసం వెచ్చిస్తారు. తమకు అత్యంత చవకగా లభించే చిరు ధాన్యాలలోనూ, ఇతర సంప్రదాయ సిద్ధ పానీయాలలోనూ అవే పోషకాలుంటాయన్న విషయం ప్రజలు మరచిపోయే రీతిలో ఈ ప్రచారాలు సాగుతాయి.

నూనె అవసరం పెద్దగా లేకుండా వంట చేసుకోవచ్చని, ఆరోగ్యానికి ఎంతో మంచివని ప్రచారం సాగిన నాన్‌స్టిక్ కుక్‌వేర్ గురించి కూడా చెప్పుకోవాలి. వాటికి విపరీతమైన ప్రచారం చేసి ప్రజలందరూ వాటిని కొని వాడటం మొదలుపెట్టేలా చేసి తమ ఉత్పత్తుల్ని అమ్ముకున్నాయి బహుళ జాతి సంస్థలు. లోకల్ కంపెనీలు వాటిని తయారు చేయటం మొదలు పెట్టగానే అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదని, వాటికంటె సెరామిక్ కోటింగ్ ఉన్న వంట పాత్రలు మంచివని ప్రచారం చేయటం, ఆ ఉత్పత్తులను అమ్ముకోవటం, మళ్లీ లోకల్ కంపెనీలు రంగంలోకి రాగానే అవి ఆరోగ్యకరం కాదని, మరొకటి ఆరోగ్యకరమని ప్రచారం చేయటం - ఇలా ఎప్పటికప్పుడు సరికొత్త ప్రచారంతో బహుళ జాతి సంస్థలు తమ ఉత్పత్తులను కొనిపించటం జరుగుతుంది. ఈ వేలంవెర్రిలో పడిపోయి ఇంట్లో నాన్‌స్టిక్ కుక్‌వేర్‌ని అమర్చుకోవటం కోసం తపనపడి అప్పులపాలైన కుటుంబం కథ బమ్మిడి జగదీశ్వరరావు రచించిన 'పెనం'.

ఇరవై రూపాయలకు దొరికే ఇనుప పెనం మీద అట్టు రుచించదు సుబ్బారావు కుటుంబానికి. పక్కింటి పంకజం దగ్గర ఉన్న నాన్‌స్టిక్ పెనం తెచ్చుకొని, దానిమీద వేసిన అట్లు ఉల్లిపొరలా పలచగా, రుచిగా ఉన్నాయని ఆ పెనం కొనాల్సిందే నని నిర్ణయించుకుంటారు. ఇంటికి వచ్చిన వారికి అటువంటి అట్లు పెట్టలేకపోవటం అప్రతిష్ఠగా భావిస్తారు. అప్పు చేసి మరీ పెనం కొన్నాక గానీ దాని కోటింగ్ పోకుండా ఉండటం కోసం ఎంత జాగ్రత్తగా ఉండాలో అర్థం కాదు. దానిని తోమటం కోసం వాడే పౌడర్, స్పాంజి ఎప్పటికప్పుడు మళ్లీ కొంటూ ఉండాలని, ఇనుప పెనాన్ని తోమినట్లు కొబ్బరి పీచుతోనో, బూడిదతోనో, ఇసుకతోనో తోమటం కుదరదని తత్త్వం బోధపడుతుంది. చివరికి పెనం కొన్న తరువాతి రెండు సంవత్సరాల్లో ఎక్కువ వాడితే ఎక్కడ పాడవుతుందోనని నాలుగు సార్లు మాత్రమే వాడుతుంది సుబ్బారావు భార్య సావిత్రి. పెనం కొనటం కోసం చేసిన అప్పు ఐదు వందలు మాత్రం వడ్డీలు, చక్రవడ్డీలతో కలసి వేలుగా మారి ఆ కుటుంబాన్ని భూతంలా భయపెడుతుంది.

ప్రపంచీకరణ కారణంగా విద్య, ఉద్యోగాలు, జీవన విధానంలో వచ్చిన మార్పులు ఒకెత్తయితే, సంపన్న దేశాలు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థల సాయంతో చిన్న దేశాలలోని ఒనరులను దోపిడీ చేసి వాటిని తమ చేతిలో కీలుబొమ్మలుగా మార్చుకోవటం ఒకెత్తు.

అమెరికా తరపున ఎకనామిక్ హిట్‌మాన్‌గా పనిచేసిన జాన్ పెర్కిన్స్ తన స్వీయానుభవాలను వివరించిన పుస్తకం 'కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్'. అందులో ఆయన వివరించిన దానిని బట్టి అమెరికాకు చెందిన బహుళ జాతి సంస్థలకు చెందిన దళారీలు వివిధ

దేశాలలో ప్రవేశిస్తారు. అక్కడి ప్రభుత్వాలకు కొన్ని వరాలు ప్రకటిస్తారు. ఆ దేశాల్లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, రహదారులు, రేవులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి కోసం భారీ ఎత్తున ఋణాలు మంజూరు చేస్తారు. వారి దేశానికే చెందిన ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థలకే ఆ ప్రాజెక్టులు నిర్మించే కాంట్రాక్టులు ఇవ్వాలని షరతు విధిస్తారు. దానితో అప్పుగా ఇచ్చిన డబ్బులో అధికశాతం అమెరికాలోనే ఉండిపోతుంది. అప్పు తీసుకున్న దేశం మాత్రం కొన్నేళ్లకే ఆ అప్పుల వాయిదాలు కట్టలేని స్థితికి చేరుకుంటుంది. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా దేశాలు తమ దేశాల్లో సైనిక స్థావరాలు నెలకొల్పుకోవటానికి అనుమతిని, తమ దేశంలోని సహజ సంపదలపై నియంత్రణను అమెరికాకు అప్పగిస్తాయి. వారి కోరికల నన్నింటినీ నెరవేరుస్తాయి.

జాన్ పెర్కిన్స్ చెప్పిన విషయం ఎంత వాస్తవమో వివరించిన కథ పెద్దింటి అశోక్ కుమార్ రచించిన 'కీలు బొమ్మలు'. యాంటీ డంపింగ్, కస్టమ్స్ డ్యూటీని దాటి, అమెరికా చికెన్ లెగ్‌పీస్, ఎగ్ పౌడర్ చౌకగా దేశంలోకి వచ్చాక మన కోళ్ల పరిశ్రమ చిన్నాభిన్నమైన తీరును రచయిత వివరించాడు.

'ఈ డార్క్ ఫ్రోజన్ చికెన్‌లో కొవ్వు శాతం ఎక్కువ. ఈ లెగ్‌పీస్‌ను వాళ్లు వ్యర్థ పదార్థంగా భావిస్తారు. సముద్రంలో డంప్ చేస్తే దేశంలో పర్యావరణ సమస్యలు తలెత్తు తాయని వర్ధమాన దేశాలకు చౌకగా సరఫరా చేసింది. కోల్డ్ స్టోరేజ్ చేయనందున ఎన్నో రోగ క్రిములు కూడా దానితో దిగుమతి అవుతున్నాయి. ఇవన్నీ తెలిసి కూడా ప్రభుత్వం ఎందుకు కళ్లు మూసుకుందంటావు...' -కథ లోని పాత్ర చేత రచయిత సంధించిన ఈ ప్రశ్న పాఠకులను ఆలోచింపజేస్తుంది.

డబ్ల్యు.టి.వో. ఒప్పందంలో చేరాక దేశంలోని రైతుల పరిస్థితి ఎలా అధ్వాన్నంగా మారిందో రచయిత స్పష్టంగా వివరించాడు.

'అప్పుడు ధాన్యం రేటు మన దేశంలో కంటే ప్రపంచ మార్కెట్లో ఎక్కువ ఉండె. అక్కడికి ఎగుమతి చేసి లాభాలు పొందవచ్చునని డబ్ల్యు.టి.వో.లో చేరింద్రు అదొక కుట్ర అని తెలిసి కూడా! తీరా చేరినాక పెద్ద దేశాలు తమ రైతులకు అరవై నుండి ఎనభై శాతం దాకా సబ్సిడీలు ఇచ్చి రేట్లను పూర్తిగా తగ్గించారు. ఇక్కడ మాత్రం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి సబ్సిడీలు తగ్గించి, కరెంటు, ఎరువుల రేట్లు పెంచుతున్నారు. మద్దతు ధర ఎక్కువై మన ధాన్యానికి మార్కెట్ లేకుండా పోయింది. లక్షల టన్నుల ధాన్యం గోడౌన్‌లలో మూల్గుతోంది. మన దేశంలో కూడా చౌకగా వచ్చే విదేశీ ధాన్యానికే గిరాకి పెరిగింది'.

అక్వా కల్చర్‌తో చేపల నీలి విప్లవం విచ్ఛిన్నం కావటం, పామాయిల్‌తో పసుపుపచ్చ విప్లవం నాశనం కావటం, సింథటిక్ మిల్క్ ప్యాకెట్స్‌తో శ్వేత విప్లవం దెబ్బ తినటం, నెదర్లాండ్ పాలు, అమెరికా గోధుమలు, చైనా బియ్యం, చక్కెర, పప్పులు చౌకగా మార్కెట్లను ముంచెత్తటం మొదలైన అంశాలను ప్రస్తావించటం ద్వారా రచయిత ఆయా రంగాల్లో దేశీయమైన అభివృద్ధికి ప్రపంచీకరణ వల్ల జరిగిన నష్టాన్ని స్పష్టం చేశారు.

సంపన్న దేశాల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రభుత్వం జెనెటికల్లీ మాడిఫైడ్ కూరగాయలను సాగు చేయటానికి అనుమతులు మంజూరు చేస్తే నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు చుట్టుముట్టటంతో పాటు, వాటిని తినటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తు తాయనే వాస్తవాన్ని పాఠకుల దృష్టికి తేవటానికి రచయిత ప్రయత్నించారు.

ప్రపంచీకరణ వల్ల కలుగుతున్న, కలుగబోయే దుష్ప రిణామాలన్నింటి గురించి చాలా వివరంగా చర్చించిన కథ ఇది.

ప్రపంచీకరణ ప్రభావం వ్యవసాయ కార్మికుల మీద ఎలా పడిందో, వారి జీవితాలను ఎలా అస్తవ్యస్తం చేసిందో వివరించిన కథ వి. చంద్రశేఖరరావు రచించిన 'ఆవు -

పులి మరికొన్ని కథలు'. విదేశీ కంపెనీలకు ఆహ్వానం పలికితే చోటుచేసుకునే దుష్పరిణామాలను గురించి చర్చించిన కథ ఓల్గా రచించిన 'కోకాకోలా'. దాదాపుగా ఈ కథలన్నీ విద్య, ఉద్యోగం, జీవన విధానం, దేశాభివృద్ధి తదితర అనేక అంశాల్లో ప్రపంచీకరణ వల్ల మేలు కంటె కీడే ఎక్కువ జరుగుతున్న తీరును వెల్లడి చేస్తున్నాయి. పారా హుషార్ అంటూ ప్రజలను హెచ్చరిస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. సగం తెరిచిన తలుపు - పాపినేని శివశంకర్
2. గ్లోబలైజేషన్ కథలు - సంపాదకుడు: డా. ఎస్వీ సత్యనారాయణ
3. నిశాంత - పాపినేని శివశంకర్
4. ఒక దళారీ పశ్చాత్తాపం - తెలుగు: కొణతం దిలీప్

❖ ❖ ❖

కులవృత్తులపై ప్రపంచీకరణ ప్రభావం

– అల్లు పుష్పలత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీకళాశాల, పిఠాపురం, తూ॥ గో॥ జిల్లా.

ఆదిమ మానవ సమాజం నుండి మనిషి జీవనశైలి నిరంతరం మార్పు చెంతుతూనే ఉంది. ఆదిమ మానవుని దశలో మానవుడు జంతు జీవన విధానం, జంతు ప్రవృత్తితో ఉండేవాడు. భూమిపై మనిషి కన్నా ముందు, మనిషితో పాటు ఉద్భవించిన లక్షల, కోట్ల జీవరాశులన్నీ నేటికీ అదేవిధంగా ఉన్నాయి. వాటి జీవన విధానంలో ఎన్ని వేల సంవత్సరాలు గడిచినా ఎలాంటి మార్పు లేదు. అయితే మనిషిలో ఉన్న తార్కిక జ్ఞానం అతని ప్రవృత్తిని, జీవన విధానాన్ని రెండింటినీ మార్చింది. మనిషి సంఘ జీవనం ఏర్పరచుకున్నాడు. ఆహారపు అలవాట్లను మార్చు కున్నాడు. సేద్యం చేయటం నేర్చుకున్నాడు. సంఘ జీవితాన్ని భద్రంగా, సురక్షితంగా కొనసాగించటానికి అవసరమైన కుటుంబ నియమాలను, సంఘ కట్టుబాట్లను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ సమాజాలన్నీ అవి ఉన్న భౌగోళిక పరిస్థితు లకు అనుగుణమైన ఆహారపు అలవాట్లు, జీవన విధా నాన్ని అలవరచుకున్నాయి. కాలపరిణామగతిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మానవసమాజాలు ఒకదానికొకటి పరిచయమయ్యాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో మానవ సమాజాలన్నీ ఒక్కటే మానవ సమాజంగా మారింది. అదే ప్రపంచీకరణ. ప్రపంచవ్యాప్తంగా నాగరికత వైపుగా ప్రయాణించే దశలో ఆవిర్భవించిన సాంకేతిక వృద్ధి అందరికీ అందుబాటులోకి వచ్చింది. ప్రపంచంలో ఏ మారుమూల పండిన పంటైనా, వండిన వంటైనా, తయారు చేసిన యంత్రమైనా అందరికీ క్షణాలలో కళ్ళ ముందు కనిపిస్తున్నది. కావాలనుకుంటే క్షణాలలో అందు బాటులోకి వస్తున్నది. ఇది ప్రపంచీకరణ నాణానికి ఒకవైపు కనిపించే సానుకూల ప్రభావం. నాణానికి రెండవవైపు పరిశీలించే ముందు, ప్రతికూల ప్రభావాన్ని చర్చించటానికి ముందు చిన్న ఉదాహరణను పరిశీలిద్దాం.

ఒక పెద్ద ఉద్యానవనం ఏర్పడాలంటే దానిని పెంచే క్రమంలో ఫలవంతమైన మహావృక్షాలు పెరుగుతాయి. సుందరమైన పూలను, ఫలాలను ఇచ్చే చిన్న చిన్న మొక్కలు, తీగలు పెరుగుతాయి. అందులో ఏ ఒక్కటీ నిరుపయోగం కాదు. సౌందర్యహీనం కాదు. ప్రతి మొక్క, తీగ అవసరమే, ఆవశ్యకమే. అన్నీ చిన్నవిగా ఉన్నప్పుడు ఏది, మహావృక్షంగా ఎదుగుతుందో మనకు తెలియక పోవచ్చు. మనం అంచనా వేయలేకపోవచ్చు. కానీ మొక్కలు ఎదిగే కొద్దీ మహావృక్ష పరిమాణం సంతరించు కునే మొక్కలేవో అర్థమౌతాయి. అవి పెరిగాక వాటి నీడలో చిన్న మొక్కలు బ్రతకలేవని గుర్తించాలి. వాటిని నిర్లక్ష్యం చేయకుండా వృక్షాల నీడ పడనంత దూరంలో వాటిని పెంచాలి. వృక్షాన్ని అల్లుకుని పెరిగే తీగలను అల్లుకో నివ్వాలి. మిగిలిన వాటిని దూరంగా ఉంచి రక్షించాలి. అప్పుడే అందమైన ఉద్యానవనం ఏర్పాటవు తుంది. మహావృక్షాలు ఉంటే చాలనుకుంటే పెనుతుఫానుకు అవి నేలకూలిన రోజు గుప్పెడు శ్వాసకు అల్లాడాల్సి వస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురవుతున్న వ్యతి రేక పార్శ్వం ఇదే. ప్రపంచంలోని సాంకేతిక పరిజ్ఞానం అంతా అందుబాటులోకి వచ్చి కార్పొరేట్ వ్యవస్థ అన్ని రంగాలలో బలంగా విస్తరిస్తున్నది. అన్ని రకాల సేవలు అందరికీ సునాయాసంగా అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఇవి కలిగించే ఆర్థిక భారం కూడా తక్కువేమీ కాదు. అందరూ మోయగలిగే భారం కాదు. ఆర్థిక సౌలభ్యం ఉన్నవాళ్ళు కార్పొరేట్ రంగం వలన లభ్యమయ్యే సౌఖ్యాన్ని అనుభవిస్తారు. లేనివాళ్ళు ఎప్పటిలా మన కుమ్మరి, కమ్మరి... సేవలు వినియోగించు కుంటారని భావిస్తే అది

అడియాశే. ఎందుకంటే కార్పొరేట్ పాము కాటుకు గ్రామీణ కులవృత్తులు కోలుకోలేని విధంగా దెబ్బ తింటున్నాయి. ముందు వెర్రి వ్యామోహంలో ప్రపంచీకరణ తెచ్చిన సౌఖ్యాలవైపు పరుగెత్తి తరువాత ఆర్థిక భారం మోయలేక లేదా మరే ఇతర కారణం చేతో వెనక్కి తిరిగితే అక్కడ కుదేలైన ప్రాంతీయ కులవృత్తులవారు ఎలాంటి సహాయం చేయలేని దుర్భర దారిద్ర్యంలోకి కూరుకు పోయి ఉంటారు. కులవృత్తులు అంతరించిపోయి ఉంటాయి. ఆధునికత కారణంగా కులవృత్తులు క్రమ క్రమంగా ఎలా అంతరించి పోతున్నాయన్న విషయాన్ని కాలవ మల్లయ్య గారు తన "పేగు మాడుతున్న వాసన" కథలో చాలా చక్కగా వివరించారు. ఈ కథలో 'పోచయ్య' పాత్ర ఎద్దులబండి నడుపుతాడు. ఆ ఊళ్ళోకి కొత్తగా బస్సు రావటం మొదలౌతుంది. ప్రయాణం సులభ మౌతుందని ఊళ్ళో అందరూ సంతోషిస్తారు. కానీ జీవనో పాధిని పోగొట్టుకున్న పోచయ్య మాత్రం దిగులుపడ తాడు. నీకు ఒక్కడికీ నష్టం కలుగుతుందని బస్సు రాకుండా చేయాలంటావా? అని అడిగిన ఊరివాళ్ళకు పోచయ్య ఇచ్చిన సమాధానంలో రచయిత ఆధునికత మూలంగా ఉపాధి కోల్పోబోతున్న కులవృత్తుల పరిణామ క్రమాన్ని చెప్పించారు. ఇందులో పోచయ్య తన గురించి కాదు. తనలాగే భవిష్యత్తులో ఉపాధి కోల్పోతున్న వాళ్ళందరి గూర్చి ఆలోచిస్తూ బాధపడతాడు. పట్నం పోయి చేపలమ్ముకుని జీవించే బెస్తలు, రోడ్డు ఏర్పడి పట్నం వాసులు నేరుగా చెరువు దగ్గరకు పోయి చేపలు కొనుక్కుంటే ఏ విధంగా జీవిస్తారు? రోడ్డు ఏర్పడితే వాహనాల రద్దీ పెరుగుతుంది. పచ్చిక తగ్గుతుంది. గొఱ్ఱెలు ఏం తింటాయి? రోడ్డు దాటలేక గొఱ్ఱెలు ఇబ్బంది పడు తాయి. భవిష్యత్తులో గెఱ్ఱెలు మేపుకునేవాళ్ళు ఏవిధంగా జీవిస్తారు? వస్త్ర పరిశ్రమల కారణంగా సాలెగాళ్ళ చేనేత వృత్తి ఇప్పటికే అడుగంటిపోయింది. ఇది ఆధునికత కారణంగా స్వరూపం కోల్పోయి మారిపోబోతున్న గ్రామీణ బ్రతుకు చిత్రం. ప్రతీ అంతరించిపోయిన లేదా కుదేలవు తున్న కులవృత్తి వెనుక కొన్ని వందల కుటుంబాల విషాద చరిత్ర, వేదన ఉంటుంది. ఈ విషయాన్ని డా॥ పులిపాటి గురుస్వామి గారు తన "పోగుల గూడు" కవితలో చక్కగా వివరించారు.

"వయసంతా మగ్గం గుంతలో ఇంకిపాయె, నరాలు తేలిపాయె" అనటంలో జీవితమంతా చేనేతవృత్తిలోనే గడిపిన వారికి వేరే ఏ పనీ చేతకాదు. ఆ వృత్తిలో ఎప్పటి కప్పుడు బ్రతకటానికి అవసరమైనంత తప్ప, భవిష్యత్తు కోసం మిగుల్చుకోగలిగే ఆదాయం సంపాదించుకోలేదు. చేనేత వృత్తి కుదేలవుతున్న ఈ దశలో అనారోగ్యం, ఎదిగిన ఆడపిల్లలు సమస్యలుగా మారాయి. ఉన్న బ్రతుకుతెరువు కోల్పోయి జీవితం ప్రశ్నార్థకంగా మారింది? కొందరికి మరణం జవాబుగా కనిపించింది.

"బ్రతుకంతా పట్టుచీరల మధ్య గడుస్తున్నా
కట్టింది లేదు, పెట్టింది లేదు"

అన్న వాక్యంలో రచయిత వారి జీవిత వాస్తవికతను వ్యక్తం చేసారు. చేనేత కళాకారులు ఇతరుల వస్త్రాలకు సౌందర్యాన్ని రంగరించారు. కాని వారి వ్యక్తిగత జీవితాన్ని సౌందర్యవంతం చేసుకోలేకపోయారు.

"ఏ కూర లేకున్నా
కారం కలుపుకుని
నంచుకు ఉల్లిగడ్డన్న కొరుక్కునేది
అది కూడా దక్కకుండాయె"

పై వాక్యంలో చేనేత వృత్తి పనివాళ్ళు వాళ్ళ వృత్తిని కోల్పోయిన సందర్భంలో ఆకలితో ఎలా అలమటించారో చెబుతున్నది.

భారతదేశం ప్రపంచంలో సహజవనరులకు, మానవ వనరులకు, మేధోసంపత్తికి, కళలకు, ప్రాచీన నిర్మాణా లకు నిలయం. ఒక్కో కులవృత్తి అంతరిస్తున్నదంటే ఒక కళ అంతరించిపోతున్నదని మనం గుర్తించాలి. మనకున్న దేశీయ కళలను అవగాహనా రాహిత్యంతో నాశనం చేసు కుంటున్నాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందింపుచ్చు

కుంటున్నంతగా సాంకేతికతను సాధించలేక మిగిలిన దేశాలకు మనం మానవవనరుగా మారుతున్నాం. విదేశాలలో మన పూర్వీకుల విగ్రహాలను, వస్తువులను మ్యూజియంలలో భద్రపరుస్తుంటే, మనం మనదేశ వారసత్వ సంపదను నిర్లక్ష్యం, స్వార్థం లాంటి కారణాలతో భవిష్యత్తు తరాలకు లేకుండా చేస్తున్నాం. సహజ వనరులను జాతి సంపదగా మార్చటంలో విఫలమవుతున్నాం. మేధోసంపత్తిని జీతానికి వెలకడుతున్నాం. ఒక కులవృత్తి నాశనం అవుతున్నప్పుడు మనకు ప్రస్తుతం సమస్య లేదు కదా అని అన్య వృత్తులవారు భావిస్తే అది తరువాత సరిదిద్దుకోలేని తప్పుగా పరిణమిస్తుంది.

అయితే వీటన్నింటి గురించి విశ్లేషిస్తున్నప్పుడు సాంకేతికతను, ఆధునికతను ఆహ్వానించడం తప్పా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఆధునికతను అందిపుచ్చుకోవటం ఎంత మాత్రం తప్పుకాదు. కాని ఆధునిక మార్పులు మనకు ఆర్థిక వనరుగా మారేలా చూసుకోవాలి. మనం మార్కెట్‌గా ఉపయోగపడటం కాదు. విదేశీ మార్కెట్‌ను మనం శాసించగలిగేలా ఆధునికతను అందిపుచ్చుకోవాలి. దేశీయ కులవృత్తుల వారి కళాత్మక నైపుణ్యానికి యంత్ర సామర్థ్యాన్ని జోడించుకునే విధంగా శిక్షణ / తర్ఫీదు ఇవ్వాలి. వారికి ఆర్థికంగా చేయూత నివ్వాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మారగలిగే వెసులుబాటు కల్పించాలి. స్వదేశీ వస్తువులు విదేశీ మార్కెట్‌లో గిరాకీ లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. విదేశీ వస్తువులు ఇబ్బడిముబ్బడిగా వచ్చి స్వదేశీ మార్కెట్‌ను దెబ్బ తీయకుండా చూసుకోవాలి. నాణ్యత, సరసమైన ధర, కులవృత్తుల వారి కళానైపుణ్యం, ఆధునిక యంత్ర సహాయాల మేలు కలయిక ఎలాంటి పోటీనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కులవృత్తుల వారికి ఇస్తుంది. ఇందులో పరస్పర స్వార్థం, వ్యాపార దిగ్గజాల తాంత్రికతకు లోబడకుండా శక్తివంతమైన భారతదేశం లక్ష్యంగా దార్శనికతతో నాయకులు పాలనా దక్షతను చూపిస్తే, ప్రజలు స్వల్ప కాలిక సౌఖ్యాలకంటే దీర్ఘకాలిక ప్రయోజనాలకు విలువిచ్చే అవగాహనను పొందుపరచుకుంటే ప్రపంచీకరణ కారణంగా కులవృత్తులు కుదేలవుతున్న ప్రతికూలాంశం కూడా సానుకూలాంశంగా మారుతుంది.

ఆధార గ్రంథాలు :

1. కాలువ మల్లయ్య : పేగు మాడుతున్న వాసన, దాహం, తెల్లదుప్పటి కథలు
2. డా॥ పులిపాటి గురుస్వామి : పోగుల గూడు దీర్ఘ కవిత
3. అద్దేపల్లి రామమోహనరావు : రెండు యంత్రాలు దీర్ఘ కవిత

❖ ❖ ❖

గిరిజన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు - ప్రపంచీకరణ

– డా॥. పి. భగ్ను నాయక్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

పద్దం అనసూయ రచించిన "చప్పుడు" కోయ ఆదివాసీ కథలు సంపుటి ఆగష్టు 2019న వెలువడింది. ఈ సంపుటిలో 1.కాకమ్మ 2.చప్పుడు 3.ముసిలి 4.మూగ బోయిన శబ్దం అనే కతలు ఉన్నాయి. ఆదివాసీ కోయ తెగకు చెందిన మొదటి ఆదివాసి రచయిత్రి. పి.విద్యా సాగర్ రాసిన ముంపు దీర్ఘ కవితను కోయ బాషలోకి "ముచ్చి" పేరుతో అనువదించారు. కోయతూర్ కోయ లిపిలో వాచకాలు రాశారు. కోయ భాషకి ఆమె చేసిన సేవకి "రంజని-నందివాడ శ్యామల స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. కోయ జాతి ఔన్నత్యంపై "గుంజాల నాట్ నీ బెరియ తోర్ తాస్తోరు-మనంకి అచ్చరాంకు అగ్గమీనాకు" అని కోయతూర్ భాష మరియు గిరిజన లిపి గొప్పదనం గురించి పాట రాశారు. ఇలా అనేక రకాలుగా ఆదివాసుల గొంతుకను వినిపిస్తున్నారు.

గిరిజన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు - ప్రపంచీకరణ :

అడవులలో నివసించే గిరిజనులు భూమి కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారు. ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారు. బ్రిటీష్ వారి నుండి ప్రస్తుత పాలకుల వరకు అందరు గిరిజనులను హింసించినవారే. అభివృద్ధి పేరుతో కడుతున్న ప్రాజెక్టుల వలన ఎందరో గిరిజనులు నిరాశ్రయులైపోతున్నారు. అనేకమంది తమ జీవనాధారమైన అడవిని కోల్పోయి అనేక అవస్థలకు గురి అవుతూ ఎందరో గిరిజనుల జీవితాలు అల్లకల్లోలం అవుతున్నాయి. "చివరగా అడవి పుత్రులు, గిరిజన రాజులు, పెద్దలు కట్టే ప్రాజెక్టులకి కూలీలుగా మారనున్నారు. ప్రపంచీకరణ వల్ల అనేక సంస్కృతులు ఇప్పటికే దాసోహం అన్నాయి. శిరస్సు వంచని గిరిజన సంస్కృతి గిరిజనులను నిర్వాసితులుగా చేయడం వల్ల అంతరించి పోబోతున్నది" (ఇప్పపూలు గిరిజన సంచార తెగల కథలు,2009 : Xiii) గిరిజనులు అనుసరించే మతం వారి నమ్మకాలపై ఆధార పడి ఉంటుంది. వారు ఎక్కువగా ప్రకృతి దేవతలను, స్త్రీ శక్తి దేవతలను, పితృ దేవతలను పూజించడం జరుగుతుంది. ప్రపంచీకరణ గిరిజన తెగలో ప్రవేశించి వారి సంస్కృతి, ఆచార సంప్రదాయాలలో తెచ్చిన మార్పులు ఎలా ఉన్నయో విశ్లేషణ చేస్తాను.

కాకమ్మ :

కోయ సంప్రదాయం ప్రకారం తన కర్మకాండలు జరగాలని వాటికి అవసరమైన వస్తువులన్నింటిని ముందే కొనుక్కొచ్చి భద్రంగా దాచిపెట్టుకొని చనిపోయిన "కాకమ్మ" కథ. కోయ సంస్కృతీ, సంప్రదాయాలను పాటించే కాకమ్మ ఆడి పాడుతుంటే నెమలి నాట్యం చేస్తున్నట్టు ఉండేదని ఆ కోయ గుంపు వాళ్ళు అనుకునే వాళ్ళు. కాకమ్మ తన బిడ్డలను ప్రేమించినట్టే, పోడు భూమి పైనే తన ధ్యాసంతా నిలిపి పనిచేయడం వలన ఆ కోయ గుంపు వాళ్ళు "నువ్ సచ్చినా గానీ నీ జీవి మంచె మీద కూసోని పిట్టల్ని తోల్తాది" అనడాన్ని ఆమె పడిన కష్టమెంతో తెలుస్తుంది. అయితే పట్టణంలో చదువుకున్న చిన్న కుమార్తె కోయవాడిని కాకుండా సూదరోడిని పెళ్ళి చేసుకుంటానని చెప్పడంతో ఖంగు తిన్నది. గుంపులో ఎవరు సూదరోళ్ళను పెండ్లి చేసుకున్న దాఖలాలు ఇప్పటివరకు లేవు. చదువుకొని ఉద్యోగం తెచ్చుకోవడం వలన జరుగుతోందా? అని ఎంత ఆలోచించినా అంతు చిక్కక అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో వస్తున్న కన్నీళ్ళను ఇంట్లోనే కాదు, గుంపులో కూడా ఇప్పటివరకు ఎవరు చూడలేదు. దీని వలన కాకమ్మ మనస్తత్వం తెలుస్తుంది.

కూతురు మనను మార్చాలని కాకమ్మ చేసిన

ప్రయత్నాలేవి ఫలించకపోవడంతో చివరికి కూతుర్ని దగ్గరికి పిలిచి "కులం పెడ్డ సుకం దక్కాల. నీ పెల్లి నీ ఇష్టం. నేను ఒద్దన్నా ఆగవు. ఆ సూదరోడ్ని పిలిపిచ్చు మన ఆచారం ప్రకారం పెళ్ళి జరిపిద్దాం అంది.

"ఆచారం ప్రకారమా? వాటితో పని లేదు. నేను గుళ్ళో పెండ్లి చేసుకుంటాను" దాంతో..కూతురు అన్నీ నిర్ణయించుకొనే వచ్చిందని అర్థమైంది. అప్పటికప్పుడు ఎకరం పొలం అర్నం కింద ఇస్తున్నట్టు కాయితాలు రాయించింది. తెగ ఆచారం ప్రకారం పెద్దల్ని పిలిపించి కుల కట్టెడ ఇచ్చింది. రాయించిన కాయితాల్ని కూతురు చేతిలో పెట్టి పారే ఏరులా పొలం వైపు నడిచింది."(చప్పుడు,2019:3,4) కోయల ఆచారం ప్రకారం పెళ్ళి చేస్తానన్న కూతురు ఒప్పుకోకపోవడంతో కన్నీళ్ళు కార్చింది. కాని కొడుకు పెళ్ళి గుంపు ఆచారం ప్రకారం జరిపించాలని పందిని పెంచి గుంపులో బత్తెం పంచాలనే కోరికతో ఉంటుంది. కాని కొడుకు ఇప్పుడివన్ని ఎవరు పట్టించుకుంటున్నారమ్మా!? అంతా మోటై పోయింది. ఐనా పెళ్ళికి పందిని కొయ్యాట మేంది గలీజుగా! అనడంతో నిశ్చేష్టురాలవుతుంది. నిన్న కూతురు, ఇవాళ్ళ కొడుకు నా కండ్ల ముందే అందరూ మారిపోతున్నారు. పాతకాలం మనిషి అనే ముద్రతో ఓ మూలకు నెట్టివేయబడుతున్నానని అనుకుంది. ఆధునిక పెళ్ళి పేరుతో ఆవులమంద సంతకు వెళ్ళడం, కరెంటు రూపంలో ఇంట్లో వెలుగు రావడంతో కాకమ్మ కంటి నిండా చీకట్లు కమ్ముకున్నాయి. పెళ్ళిలో ఆట లేదు, పాటా లేదు. కోయ పెద్దలైన పోయి, పూజారి, యాపారి ఊసే లేదు. వాళ్ళ స్థానంలో కొత్త పూజారి మంత్రాలు చదివి పెళ్ళి చేయడం చూసి మూగగా రోదించింది.

కోయ సంప్రదాయం పాటించకపోవడంతో ఇక తన అవసరం ఎవరికి లేదని తెలుసుకొని, తన కార్యానికి అవసరమైన వస్తువులను కొని తెచ్చుకొని భద్రంగా ఒక పెట్టెలో పెట్టి ప్రాణం విడుస్తూ పెట్టే తాళ్ళం ఇస్తుంది. తన కడుపున పుట్టిన బిడ్డ కొడుకు వాళ్ళకు ఇష్టమైన పద్ధతిలో పెళ్ళీళ్ళు చేసుకోవడంతో, కోయ జాతి ఆచార సంప్రదాయాలపై వాళ్ళకు నమ్మకం లేదని తెలుసుకున్న కాకమ్మ తను చనిపోయిన తర్వాత తనకిష్టమైన కోయ జాతి ఆచారం ప్రకారం కర్మకాండలు జరగాలని, వాటికి అవసరమయ్యే వస్తువులన్నింటిని ముందే కొనిపెట్టి చనిపోయిన ముసలమ్మ కథ ఇది. ఆధునికత పేరుతో గిరిజన జాతుల్లో వస్తున్న మార్పుల వలన గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఎలా మారిపోతున్నాయో ఈ కథలో రచయిత్రి తెలియజేశారు.

చప్పుడు :

కోయ జాతి ఆచారం ప్రకారం చనిపోయిన మనిషికి చేసే కర్మకాండలో పూర్భం చెప్పి యాసపోసి సాగనంపడానికి పట్నంలో ఎదురైన అనుభవాలను గురించి చెప్పిన కథ ఇది. పోతప్ప తన భార్య చనిపోవడంతో కోయ జాతి ఆచారం ప్రకారం పద్నాలుగో రోజు పూర్భం చెప్పడానికి డోలోళ్ళను రమ్మని కబురు చేయడానికి వెళ్ళినప్పుడు ఏ కోయ గుంపు అని అడిగిన వాళ్ళతో కోయ గుంపు కాదు పాల్వంచలో అనడంతో పట్నంలోనా? అని వాళ్ళు ఎదురు ప్రశ్నించడానికి గల కారణం పూర్భం మోటైంది. కర్మలకు డోలోళ్ళను పిలవడం లేదు ఈనేంది పట్నం రమ్మంటున్నాడని విచిత్రంగా చూస్తారు వాళ్ళు. నా భార్య కోయ ఆచారాన్ని వదులుకోలే. మీరు లేకుంట కర్మ జేస్తే దాని ఆత్మ నల్లుతదని ఒప్పిస్తాడు. ఇంటికి వచ్చి పూజ కోసం ఏర్పాటు చేసిన గదిలో చనిపోయిన సుంకులు ఫోటో ముందు అలికి ముగ్గుపెట్టి, జన్నలు పోసి పైన ఆనముంత నిలబెట్టారు. దాని నిండా నీళ్ళు పోసి కంకణం కట్టి ఉంచారు. కొత్త చీర, రవిక ఇంకా ఏవో వస్తువులు పెట్టి డోళ్ళ రాక కోసం ఎదురు చూస్తూ ఉండగా వాళ్ళు ఎంతకీ రాకపోయేసరికి పోతప్ప అందోళన చెందసాగాడు.

కాని డోలోళ్ళ రాకతో పూజ ఏర్పాట్లకు హడావుడి మొదలై పూర్భం మొదలు పెట్టి పిడికిలి బిగించి డోళ్ళు కొడుతుంటే ఉరుముతున్నట్టుగా వస్తున్న ఆ శబ్దంలో విషాదాన్ని మోసుకొచ్చే పాటలు పాడుతూ, ఆడుతుంటే ఆ శబ్దానికి వీధంతా దద్దరిల్లిపోతుంది. డోళ్ళ శబ్దంతో

మాకు డిస్టర్బ్ అవుతుందని డోళ్ళ శబ్దం ఆపేయమని కాలనివాళ్ళు గోల గోల చేస్తుండడంతో కర్మకు వచ్చిన వాళ్ళు పరేషాన్ అయి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని గమనించిన డోలు కన్నయ్య చేతులు జోడించి కాస్త ఓపిక పట్టమని కాలని వాళ్ళను బతిమిలాడగా మాకు డిస్టర్బ్ అవుతుందని చెబుతున్న కాలని వాళ్ళతో పోతప్ప "ఏందీ!? డిస్టబైతుందా? మీ వల్ల ఎన్నిసార్లు డిస్టబైన్నో తెల్సా" మా పక్కాయన హైం థియేటర్ల పుల్‌సౌండు పెట్టి సంపుతుండు. అది మీ దృష్టిలో డిస్టబెన్స్ కాదు! ఒకాయనేమో రోడ్డు మీదనే మైకు పెట్టి అయ్యప్ప భజన చేయిస్తడు. ఇంకొకాయనేమో ఫాదర్‌ని పిలిపిచ్చి ఏందేందో చెప్పిస్తడు. ఊరి మధ్య అజాలు, దసరా, వినాయక చవితి ఉత్సవాల్లో లౌడ్ స్పీకర్ పెడ్తలేరా? ఇవేవి డిస్టబెన్స్ కాదు. నేను నా ఇంటి ముందు డోలోళ్ళతో కర్మ చేయిస్తే..అది డిస్టబెన్స్! ఏం న్యాయం ఇదీ?" ప్రశ్నించాడు పోతప్ప" (చప్పుడు, 2019:12,13), అయ్యప్ప భజన సౌండ్, ఫాదర్ వచ్చి చెప్పినపుడు వచ్చే సౌండ్, అజాలు, దసరా, వినాయకుడి ఉత్సవాలలో సౌండ్‌లు ఏది డిస్టర్బ్ కానప్పుడు, మా కోయ జాతి ఆచారం ప్రకారం డోలోళ్ళతో కర్మ చేయిస్తే మీకు డిస్టర్బ్ అయ్యిందా? అని గొడవపడి పూర్భం చెప్పించగా అర గంటలో పూర్భం పూర్తి అవుతుంది. కాని ఆ కర్మకాండ శాంతిగా పెట్టుకునే కర్మకు నోచుకోలేదని, కోయజాతి ఆత్మ కూడా అశాంతిగా కదులుతోందని, ఆకాశంలో చుక్కల పట్టెమంచం తలకిందులవుతోందా? అని ఆవేదన చెందుతూ కథను ముగించారు రచయిత్రి. దీని వలన కోయ జాతి ఆచార వ్యవహారాల్లో వస్తున్న మార్పులు స్పష్టంగా తెలుస్తున్నాయి. శాంతంగా కర్మ కాండలు జరుపుకునే అవకాశాన్ని నాగరీకులు ఆదివాసీలకు ఇవ్వట్లేదని, నాగరీక సమాజంలో అందరూ సమానమేనని మాటలు చెప్పడానికే తప్ప ఆచరణలో జరగట్లేదని ఈ కథ ద్వారా తెలియజేస్తున్నారు రచయిత్రి.

ముసిలి :

యాస పోదామని ముసిలి ఇంటికి వెళ్ళేసరికి గుంపులో వాళ్ళంతా ముసిలి ఇంటి ముందే ఉన్నారు. ఇంటి పేరుతో సంబంధం లేకుండా అందరి ఇండ్లు ఎందుకు అలికి ఉన్నాయో అప్పుడు అర్థమైంది. అందరూ కలిసి ముసిలి కర్మ జరిపించడం ఆశ్చర్యాన్ని కలిగించింది రచయిత్రికి. చచ్చిపోయే వరకు ఎన్నో బాధలు పడిన ముసిలి విష జ్వరాల దెబ్బకు భర్తని, చేతికొచ్చిన కొడుకునూ ఒకేసారి కోల్పోయిన చెక్కు చెదరని మనో ధైర్యంతో బతికింది. తనతో పాటు పెంచుకున్న కుక్క ముసిలి చనిపోవడంతో ఎంతో వేదన చెంది చివరకు ముసిలి కర్మ పూర్తయిన తరువాత ముసిలి కాడు పక్కనే పడుకొని చనిపోవడం కుక్క విశ్వాసాన్ని తెలుపుతుంది.

ఒకరోజు కొండ చీపుర్లు ఎండపెడుతూ ఎంకులుతో మా ఇంటి పేరిటోళ్ళు ఇలకట్లు కూర్సుంటరంట. నేను ఆనలకి పెట్టాల. ఆకులు కోసి నాలుగు డబ్బులు కూడేసి, ఇలకట్ల పండగ చేయడానికి డబ్బుల కోసం నేను కూడా ఆకులు తెంపడానికి వస్తానంటుంది. అందరూ అడవికి రావద్దని చెప్పిన వినకుండా అందరితో పాటు ఆకులు కోయడానికి అడవిలోనికి వెళ్ళిన ముసిలి, ఆకులు తెంపే సోయిలో పడి ఒక్కతే అడవిలో విడి పోతుంది. ఆకులు తెంపి తెంపి చివరకు ఎండాకాలం ఎండలకు గొంతు ఎండి పోతుండడంతో ఒక్కసారిగా పరిసరాలను గమనించి ఎలాగైనా గుంపును చేరుకోవాలని ప్రయత్నించి నడుస్తూ, నడుస్తూ కళ్ళు మసక మసక పడుతూ ఎటు పోతుందో తెలియని పరిస్థితుల్లో మొదటి సారి అడవిని చూసి భయపడుతుంది. "నీళ్ళు ప్రాణ భయంతో అల్లాడుతుంది. నడుస్తూ నడుస్తూనే శరీరం ఎడారిగా మారి పెనుగాలికి వణుకుతూ చిగురుటాకులా వుంది ముసిలి. తూలుతూ...ఊగుతూ..ఒగరుస్తూ...ఎవరో తరుముతున్నట్టు ముందుకే వెళుతుంది. తెంపిన ఆకులన్నీ నడిచినంత మేరా జారిపడి ముల్లె కొక్కెర మాదిరిగా తయారయ్యింది. అడుగు ముందుకు పడడం లేదు. శరీరం తేలిపోతున్నట్టుగా వుంది.

ఎదురుగా కిరిసుగడ్డ తీగ కనిపించేసరికి ప్రాణం లేచి వచ్చినట్లైంది. రెండు అడుగులు వేసి ఒగరుస్తూ కూల బడింది. కిరుసు గడ్డ తీగ మొదలు ఎక్కడుందో అక్కడి వరకు పాక్కుంటూ వెళ్ళింది. గడ్డ కోసం తవ్వాలని ఎంత ప్రయత్నించినా చేతులు సహకరించడం లేదు. పక్కనే ఉన్న కుక్కను ఉస్కు అంటూ ఉసిగొల్పింది. అందులో ఏం వుందనుకుందో కుక్క రెండు కాళ్ళతో మట్టి తోడు తోంది. గడ్డ జాడ కన్పించలేదు. కళ్ళు చీకట్లు కమ్ము తున్నాయి ముసిలికి. కుక్కను దగ్గరకు తీసుకుని తల నిమురుతూ "నా కట్టెను ఇంటికి చేర్చు" అన్నట్టు చూసింది ముసిలి''(చప్పుడు, 2019:20,21) కట్టుకున్న భర్తను, కనిపెంచిన కొడుకును కోల్పోయిన తన సంస్కృతిని మరువరాదనే ఉద్దేశ్యంతో ఆకులు తెంపి డబ్బులు సంపాదించాలనే కోరికతో తన వయస్సును కూడా లెక్క చేయకుండా అడవిలో ఆకులు తెంపి తాగడానికి నీళ్ళు లేక ఎండదెబ్బకు బతుకు చాలించిన ముసలి లాంటి ఎందరో అడవిలో ఆకులు, అలములు ఏరుకొని బ్రతికే అమాయక ఆదివాసీ స్త్రీల దీనగాథను ఈ కథ ద్వారా తెలియజేశారు.

మూగబోయిన శబ్దం :

ప్రకృతి ఒడిలో హాయిగా, ప్రశాంతంగా జీవించే గిరి జన సంస్కృతిలోకి క్రైస్తవ మతం ప్రవేశించి, ఆ గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు ఏ విధంగా ధ్వంసం చేయబడుతున్నాయో తెలిపే ఇతి వృత్తంతో ఈ కథ నడుస్తుంది. కోయ తెగ నివసిస్తున్న తీతుగుంపులో నుండి చదువుకొని టీచరైన రచయిత్రి పాల్వంచలో స్థిరపడడంతో తీతగుంపుకు వెళ్ళడం తగ్గి పోతుంది. తీతగుంపు దట్టమైన అడవిలో, ఎదురుపిండెం వనాలే ఎక్కువగా ఉండి కాలిబాట ఒకటే ఉండేది. చివరిసారి తీతగుంపు పోయినప్పుడు తన మామ ఇంటికి డోలోళ్ళు వస్తే, ఆ ఇంట్లో వాళ్ళు డోళ్ళకు పసుపు, కుంకుమ రాసి వాళ్ళను లోపలికి తీసుకెళ్ళడం, వాళ్ళు కర్మకు సంబంధించిన పూజలు చేసిన జ్ఞాపకాలు అమె మనోఫలకంపై అలాగే ఉన్నాయి.

కోయ జాతిలో చనిపోయిన వ్యక్తికి పూర్భం గానం చేయడం, డోలు కొట్టడం అనవాయితీ. కర్మకు కన్నప్ప పూజారి కోడిని కోసి పూజ చేసి పూర్భ గానం ద్వారా కోయ జాతి ఎలా పుట్టింది. ఇంటి పేర్లు ఎలా వచ్చాయనే విషయాలను చెబుతాడు. కోయజాతి తన మూలాల్ని పూర్భం ద్వారా మననం చేసుకుంటుంది. అయితే చానాళ్ళ తరువాత కోయగూడెం నుండి వచ్చిన పెద్దయ్య తన పెద్దకొడుకు కర్మకు రమ్మని రచయితను పిలుస్తాడు. సరే అని చాలా రోజుల తరువాత తీతగుంపు వైపు కాలి బాటలో నడుచుకుంటూ వెళ్ళగా అడవి దారిలో ఒంటరి ప్రయాణం కొంత చికాకును, భయాన్ని కలిగించిన గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ తీతగుంపుకు చేరుకున్న రచయిత్రికి ఎదురుపిండెం వనాలు కనపడలేదు. చిన్నప్పుడు పిల్లంగోవి అన్నందుకు కోయభాషలో తీతు అనాలని పెద్దయ్య చెప్పింది గుర్తుకు వస్తుంది. ఇంటికి చేరుకున్నాక అన్నయ్య జ్ఞాపకాలతో వదిన ఏడవడం, పిల్లలు అమాయకంగా చూడడంతో కడుపు తరుక్కుపోయి వాళ్ళను ఓదార్చింది. చిన్నన్న ఎక్కడ అని అడిగితే సేవడి వేళకు వస్తడు అనడంతో పూర్భగానం చేసే డోళ్ళు ఇంకా ఎందుకు రాలేదని అడిగిన రచయిత్రికి వాళ్ళు రారు ఎందుకంటే నేను మతం తీసుకున్నానని చిన్నన్న అన్న మాటకు రచయిత్రి నిర్ఘాంతపోతుంది.

"మతమే లేని కోయ జాతిలోకి మతం వేరుపురుగులా ప్రవేశించిందన్నమాట!

ఇక డోళ్ళు చెప్పే 'పూర్భం'కు కాలం చెల్లినట్లేనా?

అనాది కోయ జాతి చరిత్ర చెప్పే డోళ్ళు ఇక ఈ వైపు రారా?

కోయలకో చరిత్ర ఉందనే ఇంతదాకా బయటి ప్రపంచానికి తెలవదు. అది తెలిసిన కాలానికి వాళ్ళు కోయల దగ్గరకు రాలేక పోవడం...కోయ చరిత్ర కూడా

చివరి శ్వాసలో ఉందనిపిస్తుంది. రేపు దానికి కూడా జోలెపట్టాలేమో" (చప్పుడు, 2019:28)మతమే లేని కోయ జాతిలోకి మతం ప్రవేశించి డోలోళ్ళ పూర్భంకు కాలం చెల్లిపోయినట్టే, కోయల చరిత్ర చివరి శ్వాసలో ఉందని పించింది. శోక సంద్రాన్ని గుండెల్లో దాచుకొని పెద్దయ్య నడిరోడ్డుపై నిలబడి ఉన్నాడు. గిరిజన గూడెలలో కూడా క్రైస్తవ మతం ప్రవేశించి, తమ రితి, రివాజులు, ఆచార సంద్రాయాలు, పండుగ, పబ్బాలు ఎలా ధ్వంసం చేయ బడుతున్నాయో ఈ కథలో రచయిత్రి అక్షరీకరించారు.

ముగింపు :

ప్రపంచీకరణ అడవుల్లోకి, కొండ కోనల్లోకి చొర బడడంతో దాని ప్రభావం గిరిజనులపై పడి వారి సంస్కృతి, సంప్రదాయాలలోను, ఆచార వ్యవహారాల లోను మార్పు చోటుచేసుకోసాగింది. ఆ మార్పును సమర్థిస్తూ నూతన అవకాశాల కోసం యువత పరుగులు పెడుతుంటే, తమ వసుధైక ప్రశాంత జీవనంలో ఏ మార్పు అవసరం లేదని ఉన్న దాంట్లోనే తింటూ హాయిగా బతుకుతామనే ఆలోచన చేస్తున్న వాళ్ళు మరొక వైపు ఉండగా ఆధునిక సమాజంలో వస్తున్న మార్పును ఆహ్వానిస్తూనే తమదైన జీవన విధానాన్ని కొనసాగిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే తమ ఉనికినే కోల్పోయి బతకడం కంటే, తమ అస్థిత్వాన్ని నిలుపుకొని తమదైన జీవితాన్ని గడపడం ఎంతో అవసరం. ఆ దిశగా గిరిజన సమాజాలు ముందుకు నడవాల్సి ఉంది. పద్దం అనసూయ ఇన్‌సైడర్ రచయిత్రి కావడం మూలంగా ఒక పద్ధతి ప్రకారం గిరిజన సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న వైనం కలచివేస్తుండగా తన గిరిజన సమాజంలో జరుగుతున్న మార్పులను, పరిణామాలను గురించి ఆవేదనతో నూతన కోణంలో పైకి కనబడని గిరిజనుల వాస్తవిక జీవితాలపై సంస్కృతి, సంప్ర దాయాలు, ఆచారాలపై ప్రపంచీకరణ ప్రభావాన్ని ఈ కథలలో చిత్రించారు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. అనసూయ పద్దం 2019 చప్పుడు హైదరాబాదు: సాహితి సర్కిల్.
2. తిరుమలరావు జె, జీవన్ 2009 ఇప్పపూలు(గిరిజన సంచార తెగల కథలు) ఖమ్మం: ప్రతిభా ప్రచురణలు.
3. రమేష్ నారాయణ పి. 2015 గిరిజన సంస్కృతి, సాహిత్యం అనంతపురం:
4. శైలమ్మ జి. 2011 తెలుగు కథా సాహిత్యం-గిరిజన జీవితం కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.
5. హాస్‌నైన్ నదీం 1995 భారతీయ గిరిజనులు హైదరాబాదు: ఓరియంట్ లాజ్మన్.

❖ ❖ ❖

ప్రపంచీకరణ విధ్వంస చిత్రం 'తుడుం'

– భమిడిపాటి గౌరీశంకర్, తెలుగు శాఖాధిపతి, గాయత్రి కాలేజ్ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్, శ్రీకాకుళం.

'ఆధునిక కవిత్వం అర్థంకాలేదంటే, ఆధునిక జీవితం అర్థం కాలేదన్నమాట' – శ్రీశ్రీ

కవిత్వానికి కవి యొక్క అద్వంద్వమైన అనుభవమే అర్థ సంవిధానాన్ని, అకృతిని నిర్ణయిస్తుంది. జీవితాను భవాన్ని ప్రత్యక్షంగా, సజీవంగా అనుభూతి అందివ్వడమే కవిత్వం లక్ష్యం. అదే కవిత్వసారము, కాంతి. ఆలోజింప చేసేది కవిత్వం. కాలక్రమంలో మార్పులకు వేదిక 'సమాజం'. అభివృద్ధి వేగం పేరుతో తెరపైకి వచ్చిన పదం - పథం ప్రపంచీకరణ. కాని క్రమేపి దీని అర్థం మారింది. గ్లోబలైజేషన్, ప్రయివేటజేషన్, లిబరలైజేషన్ వంటి అంశాలు తమ 'అసలు రంగును' ప్రపంచం చూసిన తరువాత సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి వ్యవస్థలు 'దళారీ' విభాగాన్ని పెంచి గ్రామీణ జీవనాన్ని చిన్నాభిన్నం చేసింది. విజృంభించిన కార్పోరేట్ శక్తులు చిన్నకారు - సన్నకారు రైతుల నుంచి విద్యావ్యవస్థలు వరకు విస్తరించి వికృతమైన తన ధృతరాష్ట్ర కౌగిలిలో నలిపివేస్తూ - కనుమరుగు చేస్తున్నాయి. విలువలు లేవు. 'విలువ' తప్పా. మానవ మనుగడకు ప్రాణమైన 'బంధాలను' త్రెంచే క్రమంలో విజయవంతమైందనే నిజం క్రమంగా అందరికి అర్థమయింది. తమ అవకాశాలను, అవసరాలను ప్రక్కవాడు తన్నుకుపోవడం, తమ ఆహార, సంప్రదాయ, సంస్కృతులపై 'ఇతరులు చేస్తున్న' దాడి ప్రకంపనలు తట్టుకొనే శక్తి, సామర్థ్యాలను పల్లెలు, కుటీర పరిశ్రమలు కోల్పోతున్నాయి, వలసలు పెరిగాయి, విధ్వంస చిత్రణం విపరీతమయింది. అభివృద్ధి చెందిన దేశాలు సహితం 'ప్రపంచీకరణ' విషకోరల నుంచి బయటపడేందుకు చట్టాలు చేసుకుంటున్నాయి. ప్రపంచీకరణకు ప్రారంభంలో ఉన్న 'ప్రయోజనార్థం' వేరు. ప్రస్తుతమున్న 'ప్రపంచార్థం' వేరు. ఇది ప్రపంచం గమనించింది కాని... పరిస్థితి చేయి దాటింది. ఈ క్రమంలోనే సాహిత్య ప్రక్రియలు ఈ అంశాన్ని ప్రధానంగా చేసుకొని ఎంతో 'సృజన' చేసాయి. అలా స్పందించిన కవుల 'కలల' 'కలాల' ప్రతిరూపమే 'తుడుం'. 'తుడుం' అనేది ఉత్తరాంధ్ర జన పదాల్లో వినియోగించే ఓ వాద్యసాధనం గిరిజన జీవితా ల్లోని - జీవనంలోని సంబరాన్ని, సంఘర్షణని, సమీరాన్ని ప్రతిధ్వనించే పరికరం. విధ్వంస వర్తమాన జీవనచిత్రాన్ని ఆవిష్కరించేది ఈ 'తుడుం'

ఎమర్సన్ 'ఛేంజ్ ఈజ్‌లా ఆఫ్ లైఫ్' అంటాడు. సమాజంలో అన్ని వనరులు ఉన్నా దోపిడి శక్తులు మార్పు జరగకుండా చూస్తాయి. చైతన్య సమూహాలుగా ఉన్న బాధితులు ఇలాంటి స్థితిని బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తారు. 'తుడుం' చేసేపని అటువంటిది. గంటేడి గౌరు నాయుడు గారు 'నా ఏటి పాట కావాలి' అని నినదిం చడం వెనుక ఓ 'విధ్వంస చిత్రం' కనిపిస్తుంది.

ఒక చోట.... 'ఒక ముసురపట్టిన వేళ
నాగలి పాయ్యిలోకి దూకి
ఆత్మహత్య చేసుకుంది.' అని దు:ఖిస్తూనే
మరో సందర్భంలో 'చదరంత పొలంలో చాలు పాయ్యడానికి
ఇనుపదున్న రూపాయిలు మే పందే
తన బైరు పాదం కదపదుగాక కదపదు'
అంటారు.

మరో సమయంలో - వాడు దిగుమతి చేసిన మొక్క మొక్కను వాగ్ధానం చేయదు అంటారు. ఇవన్నీ ప్రపంచీ కరణ నేపధ్యంలో బి.టి. విత్తనాల మోసం వెనుక వ్యవ సాయ విషాదం. ఇష'తుడుం' కవితల్లో గమనిస్తే... సిరికి స్వామినాయుడు 'ప్రకృతి' వికృతరూపానికి ఈ పరి ణామంలో ఎలా నాందీ వాచకం పలికిందో వివరిస్తూ...

పచ్చని అడవుల్లో...
యిప్పుడు పాప్ సంగీతాల టోరు!
పురివిప్పిన నెమళ్ళు వనాల్లో
యిప్పుడు దిగంబరదేహాల తైతక్కలు అంటారు.

పాశ్చాత్య నాగరికత ప్రభావం పచ్చని పల్లెలను 'రంగు వెలెసెటట్టు చేస్తున్నాయని వేదన చెందుతారు డా॥సంకిరెడ్డి.

శేండ్ల కడుపుబాయె
శెల్కంత లొట్టపీసు శెట్లాయె
పొద్దు కూలబడి
కుండ్లల్ల కన్నీరు పురడాయె

అని ఓ ఆర్తగీతాన్ని ఆలపిస్తారు.

గ్రామీణ మనిషి - వ్యవసాయంతోపాటు తన ఆట, పాట తనదని నమ్మే అమాయక గ్రామీణ జీవితం ఎలా 'తెల్లారి పోతున్నదో' ఓ 'కార్పోరేట్ శక్తి' ఎలా 'వాడిని' కాల్చేస్తున్నాదో.... కూల్చేస్తున్నాడో రామ్‌ప్రసాద్ తన కవితలో

రాత్రంతా పాటైన వాడి గొంతు మూగబోయిందని
స్వేద దేహంలో మట్టి కథల పువ్వుల్ని
సృష్టించినవాడు
శాశ్వత నిద్రలోకి జారిపోయాడని
కొండ కొండకూ... గడపగడపకు... కబురివ్వండి

అని దు:ఖించిన వైనం కనిపిస్తుంది. 'ప్రపంచీకరణ' చేనేతపై 'చేయిచేసుకున్న' విధానం, వారి దు:ఖ జాబితమైన జీవనాన్ని చిత్రిస్తూ.... కిలపర్తి దాలినాయుడు.

అగ్గిపెట్టెలో నిన్ను ఇమడ్చగల నేతన్నలకు
తెల్ల బంగారమని నమ్మిన రైతన్నలకు
ఉరి బిగించిన నీ కృతఘ్నతను ఏమని ప్రశ్నించాలి.

ఒకానొక కాలంలో (నేటికి కూడా) ప్రత్తి రైతుల ఆత్మ హత్యలతో దేశం ఓ 'శ్మశాన నిశ్శబ్దం'ను అనుభవించింది. అయినా ప్రపంచ కార్పోరేట్ శక్తులు విజృంభన పెరిగింది కాని తగ్గలేదు. ఇదో విషాదం. అంతరిస్తున్న 'రైతు జాతి' ప్రతినిధి ఆవేదన 'సిరా' చిత్రిస్తూ -

నేను పోగొట్టుకున్న మువ్వకాడికి, పువ్వుల కొరడాకి
తెరికి, తెడ్డుకి... సారెకి... కుదురికి... భీమా
కోరుకునే పేరాశబోతుని
ఎందుకో.... ఏమిటో.....
.....
నేనుండను!

రేపటి తరానికి బువెవలాగో?! రైతులు లేని సమాజంలో (దేశంలో) 'కూడు' ఎలా? రేపటి తరం ఏంతిని బ్రతకాలి... ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే 'ప్రపంచీకరణ' నిర్మాతలు... వ్యాపారులు.... నాయకులు ఏరి? నాగరికత చిహ్నాల విశ్వాలుఖతకు నిదర్శణాలు నిన్న.... నేటి తరాలు... డా॥ మానేపల్లి.

చేతులతో బట్టలు నెయ్యడమే కాదు
ఏ పని చేయ్యడమమూ అనాగరికమే అయి పోయింది.
సున్నితంగా స్విచ్ నొక్కితే సరుకుల సమ్మోహన ప్రపంచం
మన సమస్తాన్ని ఆక్రమించుకొని సర్వనాశనం చేస్తుంది.

ఇలా ఎన్నెన్నో... ఎంతో వేదానా చిత్రాలు కనిపిస్తాయి. అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేసుకొనవసరం లేదు. కాని... హద్దులు వేసుకోవలసిన అవసరం ఉంది కదా! మారుతున్న సమాజానికనుగుణంగా 'ప్రపంచీకరణ' పూరిత అభివృద్ధి అవసరమే... గతంలోనే కూరుకు పోదమనటం అవివేకం. కాని.... వర్తమానం నరకప్రాయం చేసుకోవటమూ అజ్ఞానమే

నిప్పు ఎవరు రాజేసినా
మన కొంపే తగలబడుతుంది.
యుద్ధం ప్రకటించకుండానే
ఓటమి వెల్లడైపోతుంది.

అనే అరుణ్‌బవేరా అక్షరసత్యాలను గమనిస్తే 'ప్రపంచీ

కరణ' నేపథ్యంలో 'మన మంటలను' మనే బాధ్యులం కాకూడదు. నివారణోపయం చూసుకోవాలి. పచ్చని ప్రకృతిని పరరక్షించుకోవాలి. చేతి వృత్తులను బ్రతికించుకోవాలి. రైతులను 'జీవించే విధంగా' ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఇందుకు 'ప్రపంచీకరణ' మార్గదర్శి కావాలి.

ఆధార గ్రంథాలు :

1. తుడుం - కవితా సంకలనం శ్రీకాకుళ సాహితీ ప్రచురణ
2. నాగేటిచాలు - శ్రీకాకుళం బుక్ ట్రస్ట్ ప్రచురణ
3. కవిత్వం అంటే ఏమిటి - వికీపీడియా నుంచి

❖ ❖ ❖

కాపుబిడ్డ కావ్యం - తెలంగాణ రైతు జీవన చిత్రణ - ప్రపంచీకరణ

- జె. శంకర్

ఆదిమ మానవుని కాలం నుండి నేటి వరకు భారత దేశం వ్యవసాయ ఆధారిత దేశమే. నేడు, ఇప్పుడిపుడే టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుకుంటూ అభివృద్ధి చెందుతున్న దేశంగా పరిగణింప బడుతున్నది. నాడైనా నేడైనా రైతే రాజు. వస్తు ఉత్పత్తి కన్నా ధాన్యోత్పత్తి గొప్పదంటారు. వస్తువులు లేకున్నా బ్రతకవచ్చు కానీ ఆహార ఉత్పత్తులు లేకుంటే జీవ కోటికి మనుగడే లేదు. అందుకే లాల్ బహదుర్ శాస్త్రి "దేశ రక్షణకు జై జవాన్" అనీ, దేశ పోషణకు "జై కిసాన్" అనే నినాదంతో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించారు. కానీ రాను రాను కాలం మారుతుంది. పాలకులు మారుతున్నారు. దానితో పాటే రైతుల జీవన స్థితి గతులు మారుతున్నవి. ఈ క్రమంలో మరొక మారు 1937 నాటి తెలంగాణలోని రైతు యొక్క జీవన పరిస్థితులు తెలిపే గంగుల శాయిరెడ్డి రచించిన 'కాపుబిడ్డ' వ్యవసాయ పద్య కావ్యం గురించి చర్చిస్తూ తెలంగాణ రైతు బిడ్డ యొక్క జీవనాన్ని ఈ వ్యాసంలో వివరిస్తాను.

గంగుల శాయిరెడ్డి గారు 1890లో వరంగల్ జిల్లాలోని జీడికల్లులోని రామచంద్ర గూడెంలో పుట్టి, స్వాతంత్ర్యోద్యమం నుండి నైజాం వ్యతిరేకోద్యమాల వరకు అనేక రకాలైన ఉద్యమాలలో పాల్గొన్నారు. తాత, తండ్రి వ్యవసాయదారులు కాబట్టి వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్నే వారు చేపట్టారు. చిన్నప్పుడే 'సాతానయ్య' దగ్గర నేర్చుకున్నది, స్వీయకృషి వల్ల వికసించినది కలిపి సహజ పండితులయ్యారు. శాయిరెడ్డి గారిని చూస్తే కర్షకునిగా పోతన్న, కవిగా శ్రీనాథుడు గుర్తుకు వస్తారు. అచ్చమైన తెలంగాణ రైతన్న అని కొందరనుకుంటే, బ్రహ్మక్షాత్రాలు మూర్తీభవించిన 'కవి సింహుడ'ని మరికొందరనుకునే వారట. ఉద్యమకారునిగా, కవిగా, రచయితగా, విద్యావేత్తగా, సంస్కర్తగా తెలుగు ప్రజలకు సుపరిచితుడు శాయిరెడ్డి గారు. కాపుబిడ్డ కావ్యం తెలుగు తేటలు - తెర మరుగులు లేకుండా పొడిమాటల్లో అభివర్ణించే అవసరం లేని చక్కని కావ్యం. చక్కటి సీస పద్యాల్లో రాసి రైతుకు కావ్యాంజలి పట్టినందుకు రెడ్డి గారిని కీర్తించాలి. రెడ్డి గారు ఎన్నుకున్న ఇతి వృత్తం ఎంత సహజ సుందరంగా ఉందో ఆయన పద్య రచనా శైలి అంత రసబంధురంగా ఉంటది.

ఋతు వర్ణనలు, పాడి పంటలు, కష్ట-సుఖాలు, పని ముట్లు, కలిమి లేములు, నీతి నియమాలు రస రమ్యంగా అభివర్ణించిన వర్ణనలు కవి చిత్త శుద్ధికి, డొక్క శుద్ధికి అద్దం పట్టిన కావ్యం ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే మట్టిని నమ్ముకున్న మనిషికి జీవిత వృక్షం శాఖోప శాఖలుగా సాక్షాత్కరించిన విశ్వరూపం ఈ కావ్యం. భాషా పరంగా సనాతన వృత్తి పదకోశం; భాషా పరంగా కష్టజీవుల పట్ల కవితాత్మ పొందిన కరుణ రసావేశం పాఠకుల్ని ఆకట్టుకుంటుంది.

ఈ వ్యవసాయ పద్యకావ్యం 'కాపుబిడ్డ' కేంద్రకంగా నడుస్తుంది. భూమి-నీరు, చెట్టు-చేమా, ఎరువులు - ధాన్యం, కులీలు-కుటుంబంలోని వారు-వీరు ఇలా అందరూ కాపు బిడ్డను అనుసరిస్తారు. ఇలా అనుసరించడం వల్ల అందరి సుఖ దుఃఖాలు, వేదనలు కాపు బిడ్డ చుట్టే భ్రమిస్తాయి.

కాపు అంటే వ్యవసాయదారుడు. కాపుదనం అంటే వ్యవసాయం. కాత అంటే వ్యవసాయ ఫలం. ఆ ఫలమైన కాతను కాపాడే వాడే 'కాపుబిడ్డ'గా కవి వాస్తవ పరిస్థితిని చిత్రీకరించాడు ఇలా.

కం॥ పుట్టితిరి మేదకులకున్
బట్టితిరా యరక చేత ! మట్టిని దున్నన్
బెట్టితిరి జగతి కన్నము
దట్టడవులు దిరుగు మీరు !తపసులుగారే!

అని రైతు కల్లా కపటం లేని అమాయకులకు జన్మించి, వ్యవసాయమే ప్రధాన ఆధారంగా చేసుకుని ప్రపంచానికే అన్నం పెడుతున్న రైతన్న అడవిలో జీవిస్తున్న సన్యాసి వలె మిగిలి ఉన్నాడని శాయిరెడ్డి గారు చెప్పిన ఆనాటి పరిస్థితి నేడు కూడా మారలేదు. ఈ యాంత్రిక సమాజంలో తన బ్రతుకు చితికి పోతున్నా నేటికి దేశానికి అన్నం పెడుతూ, దేశ సౌభాగ్యాన్ని కోరుకుంటున్నాడు. "కర్షకులు ఎల్లప్పుడు లోకోపకారులే" కదా! అనే నానుడికి నిలువుటద్దం రైతు.

కర్షకుల కష్టాలు కడగండ్ల గూర్చి చెప్పడమే రచయిత ప్రధాన ఉద్దేశ్యం. రెక్కాడితేనే డొక్కాడే పరిస్థితి కర్షకులది. ఆకాశరాజు భూమాతల ఆర్ద్రీభూత జగత్తులో విత్తనాలు విత్తడం అనే సృష్టి కార్యానికి సాధకుడు రైతు. రైతు భూమిని స్పృశిస్తే వసుధ పులకితమై ఆనందంతో అన్నం అందిస్తుంది. ఇలాంటి రైతు విషయంలో సుస్థిర భావాలు నాటుకునేట్లు క్రమ వికాసం ఎలా ఉంటుందో వివరిస్తున్నాడు కవి.

సీ॥ "కోతుల రీతిగా! గ్రుమ్మరి యాకులో
కాయగడ్డలో దిని! గడుపు వారు
తేనెల ద్రావుచు। స్థిరగేహములు లేక
చెట్లపై వాసముల్। సేయువారు"

అని వ్యవసాయ దారుని ఆటవిక జీవనాన్ని, అనాగరికపు పరిస్థితిని వివరించాడు కవి.

ఈ పరిస్థితులు ఇప్పటివి కావని బ్రిటిష్ వారి పాలన స్థిరమైన తర్వాత పుట్టిన గేయాల వల్లకూడా తెలుస్తుంది.

పల్లవి : "ఏటి కేతంబెట్టి ఎయి పుట్లు బండించి
ఎన్నడూ మెతుకెరగరన్నా- నేను గంజిలో
మెతుకెరు ..... గరన్నా ॥ ఏ॥
చుక్కపొద్దున్న లేచి బొక్కె నెత్తుక పోంగ
బొక్క బోర్లా బడితిరన్నా - నేను పక్క
లిరగ బడితిరన్నా
నాదేటి బ్రతుకాయెరన్నా - నేను నాడే
చావక పోతిరన్నా॥ ఏ॥

అని రాత్రి-పగలు కష్టపడి రక్తమును నీరుగా పారించి ప్రపంచానికి అన్నం బెట్టె రైతుకే అన్నం లేదు. ఇది మన దేశ దౌర్భాగ్యం కాదంటారా? బ్రిటిష్ వారు ఏర్పర్చిన పట్టణాల్లో ప్రభువులు, గ్రామాల్లో గ్రామాధికారులు రైతును పీల్చి పిప్పి చేసిన తీరు, రైతు హృదయ విధారకమైన బాధ ఈ గేయంలో అగుపిస్తుంది. ఈ వారసత్వాన్నే నైజాం ప్రభుత్వం కొనసాగించింది. ఇలాంటి గేయాలు కూడా కాపు బిడ్డ కావ్యానికి ప్రేరణ అయి ఉండవచ్చు.

సీ॥ పచ్చ జొన్నఁ గటక। పరమాన్నమును గాగ
చల్లనీరే సుధా । సార మనును
వడుకుడుపులు జరి । పట్టు బట్టలు గాగ
కంబళే వజ్రంపు । కవచమగును।

అని రైతు అన్ని కాలాలకు ఎన్ని రకాల పంటలు పండించినా సర్వసాధారణమైన ఆహారపు టలవాట్లతో సాధారణమైన జీవితాన్నిగడుపుతున్నాడు అని చెబుతూనే ఈ నాటి తెలంగాణ రైతు పరిస్థితిని ఆనాటి రైతు జీవనంలోనే కళ్ళకు కట్టినట్టు వివరించాడు. అంటే కవి గారి ఆనాటి ఆలోచనా శక్తి, భవిష్యత్ దర్శనం ఎంత గొప్పదో కాపుబిడ్డ కావ్యం ద్వారా అర్థమవుతుంది.

సీ॥ "ఎండలవేడికి । నెత్తు మేడలు లేక
చెట్టుల నీడకుఁ । చేరినావు
కొలది చినుకులకే । కొంపంత తడియగా
పొదరిండ్ల బురదలో । మెదలినావు"

అంటూ శాయిరెడ్డి గారు కర్షకుల కడగండ్లు, దిన, దిన గండములు, బలవంతపు ఇబ్బందులు హృదయ విదారకమయ్యెటట్లు పై పద్యంలో వివరిస్తున్నాడు. రైతు పరిస్థితి నాడైనా, నేడైనా ఒకటే విధంగా ఉంది. తెలంగాణ పల్లెల్లో చెరువులు లేక, కాలువల ద్వారా నీళ్ళు రాక, బోరు బావుల్లో ఊట రాక పైర్లు బీళ్ళుగా మారుతున్న పరిస్థితి నేడు గోచరిస్తుంటే "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్" అను మహాభారతంలోని నన్నయ గారి వాక్యము రైతు పరిస్థితికి అద్దం పడుతున్నట్లు ఉంది.

గ్రీష్మంలో ఎండ తీవ్రత ఎక్కువ. చెట్లూ - చేమా విలవిలలాడుతుంటవి. బావుల్లో నీరు అడుగంటుతుంది. ఈ స్థితిని గూర్చి

సీ॥ "చెలకలోపల నున్న । చెట్టుమెట్టుల నెల్ల
గుద్దలిచే ద్రుంచి । కుప్పవేసి
కుప్పల కెల్లను । నిప్పును దగిలించి
కంపను కట్టెల । గాల్చివేసి"

అని కారుచెండలో కర్షకుడు వర్షాకాలం పంటకోసం చెలకను సిద్ధం చేయడానికి చెట్లను పీకి అందులో ఎరువును చల్లుతున్న క్రమంలో రైతు అవతారం మురికితో నిండిపోతున్న ఆ రైతు గురించి ఎవరు ఆలోచిస్తారు అంటాడు కవి. నిజమే కవి గారు చెప్పినట్లు నేటి తెలంగాణలో తినే తిండి గురించి, వాటి నాణ్యత గురించి ఆలోచిస్తున్నారే తప్ప, ఆ పంట ఎలా పండుతుంది, దాన్ని పండించే రైతు ఎంత కష్టపడతాడు. వచ్చే పంట వెనుక ఎంత శ్రమ దాగి ఉంది అనే విషయాలు సమాజానికి ప్రశ్నార్థకాలు. శాయిరెడ్డి గారు వ్యవసాయ కుటుంబాన జన్మించి, వ్యవసాయం చేశాడు కాబట్టే రైతు గురించి, రైతు బాధ గురించి ఇంత గొప్పగా చెప్పగలిగాడు. వేరే వారికిది బోధపడదు.

వర్షాకాలం వచ్చి పొలంలో పంట వేస్తాడు రైతు. వేసిన పంటను చంటి పాపలా కాపాడడానికి రైతు చేసే ప్రయత్నం కవి మాటల్లో

సీ॥ "ఇరులలో ముండ్లనో। యురగంబులో ద్రొక్కి
తూముల గట్టగా । తూఁటు వారు
కడువడితో నీరు । గండ్లను గోయగా
నిశియందు నచ్చట । నిల్చువారు"

అంటూ రైతు పొలంలో పెరిగిన ముండ్లను, పాములను తొక్కుకుంటూ వెళ్ళి అర్ధరాత్రి పొలానికి నీరందిస్తాడు. నీటి నందించే చెరువు తూముకు చెత్త అడ్డం వచ్చినా, చెరువుకు గండి పడినా రైతు పడే బాధ అంతా ఇంతా కాదంటాడు కవి. అయితే కాలం గడుస్తున్న కొద్ది అడవి విస్తీర్ణం తగ్గి, కాలుష్యం పెరిగి వర్షాలే లేని రోజులు నేడగుపిస్తున్నవి. చేతికొచ్చిన పంట ఎండుతుంటే రైతు పడే బాధ నేటి తెలంగాణ కవి జయరాజ్ గారు శాయిరెడ్డి గారి భావనను బలపరుస్తూ రాసిన పాట తెలంగాణ రైతు జీవితానికి ప్రతీక

వానమ్మ వానమ్మ వానమ్మా
ఒక్కసారన్న వచ్చిపోవే వానమ్మ ॥వానమ్మ॥
సేలల్లో నీళ్ళు లేవు
సెలకల్లో నీళ్ళు లేవు
వాగుల్లో నీళ్ళు లేవు
వంపుల్లో నీళ్ళు లేవు
నిన్నే నమ్ముకున్న రైతు
కళ్ళల్లో నీళ్ళు లేవు ॥వానమ్మ॥

అంటూ నేటి తెలంగాణ రైతు కన్నీళ్ళ గాథను చెబుతున్నాడు. ప్రకృతిని కరుణించమని, రైతు బాధను వినమని వాన దేవున్ని వేడుకుంటున్నాడు రైతు.

శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువ. కర్షక కుటుంబాలకు శీతవాతాతపాదుల వల్ల కలిగే కష్ట నష్టాలకు కవి కదలి పోతాడు. ఆ కారణంగానే శీతాకాల వర్ణనలో కవి ఆవేదన స్పష్టంగా కనిపిస్తుంది.

సీ॥ "చలికాల మందు పై । రుల కావలికి రేయి
పొలములో నిద్రింప । బోవు నొకఁడు

అద్దమరేతిరి । యెద్దుల చేబట్టి
మోట గొట్టుచు పాడు । పాట నొకడు"

అంటూ చలికాలంలో రైతు రాత్రుల్లో పంట కావలికి వెళ్ళిన సందర్భాన ఉత్తర దిక్కు చలిగాలికి పడే తిప్పలు, అర్ధరాత్రి మోట కొట్టు సమయాన పడే ఇబ్బందులు, పొద్దు పొడిచే వరకు నేలను దున్ని బంగారు పంటను ప్రజలకు అందజేస్తాడు. ఇలాంటి రైతును తెలంగాణలో నైజాం పాలనలో గ్రామాధికారులు, పటేళ్ళు, పట్వారీలు భయంకర స్వరూపులై అనేక బాధలకు గురిచేసే వారు. వ్యాపారులు దుర్బుద్ధి గలవారై అధిక లాభము గడిం

చడానికై రైతును మోసం చేసే వారు. అంతే కాకుండా నైజాం సర్కారు జాలు నీటి మీద, వాగు నీటి మీద, చెరువు నీటి మీద పన్నులు వేసి పీడించేది. అందు వల్లనే తెలంగాణలో నైజాంకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం వచ్చి తెలంగాణ నైజాం నుండి విముక్తి అయింది. ఈ సంఘటన తెలంగాణ రైతు జీవితంలో మరిచిపోని చారిత్రిక ఘట్టం.

కాపుబిడ్డ కావ్యం రచించి నేటికి 80 సంవత్సరాలు గడిచినా రైతు జీవన పరిస్థితుల్లో మార్పులేదు. ఈ నాడు తెలంగాణలో రమారమి 2995 మంది రైతులు ఆత్మ హత్య చేసుకున్నారంటే తెలంగాణలోని రైతు పరిస్థితి చెప్పనక్కరలేదు. రోజు రోజుకు రైతు హృదయం గాయమై మానని పుండు వలె మానువైనది తప్ప మార్పు లేదు.

నేటి తెలంగాణ రైతు జీవనం అనాటి పరిస్థితుల కన్నా దిగజారుతున్నదని నేటి కవి 'ఏవూరి సోమన్న' తన పాటలో తెలంగాణ రైతు జీవితాన్ని ఇలా ప్రతిబింబించాడు.

పల్లవి : "నేల రాలుతున్న రైతన్నలా జూస్తే
గుండే తరిగిపోతవుందో కంట నీరు ఏరై పారుతుందో
దేశానికే బువ్వవెట్టే రైతన్నా
ఉరితాడుకేలాడుతుండో ఈ ఘోరమెందుకు జరుగుతుందో
ఓ ఏలేటి పాలకులారా! మీరెందుకు స్పందిస్తలేరో ॥ నేల॥

చ॥ నకిలి విత్తనాలతో నష్టపోయిన రైతు
బ్రతుకు నెవ్వరు జూడడాయే వాళ్ళ బాధ దేవుడెరుగడాయే
ఆరుగాలం సెమట దారవోసిన పంట
గిట్టుబాటు రాకపాయే తెచ్చినప్పుకు వడ్డి వెరుగవట్టె"

అంటూ నేటి తెలంగాణ రైతు సమస్యల సుడి గుండంలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరి అవుతున్న తీరు గమనిస్తే శాయిరెడ్డి గారి కాపు బిడ్డ కావ్యం లోని రైతు గోచరిస్తాడు. శాయిరెడ్డి గారు తెలంగాణ ప్రాంతంలోనే జన్మించాడు కాబట్టి మిగతా ప్రాంతాల రైతు జీవితానికన్నా కాపుబిడ్డ కావ్యంలో తెలంగాణ ప్రాంత రైతు జీవన చిత్రణ కళ్ళకు కట్టినట్లు అగుపిస్తుంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కూడా రైతు దోపిడికి, నయవంచనకు గురి అవుతూనే ఉన్నాడు.

రైతు దేశ సౌభాగ్యం కోసం తన సౌఖ్యాన్ని, కుటుంబ క్షేమాన్ని మరిచి దేశానికి అన్నం పెడుతున్నాడు. వ్యవసాయం అన్ని వృత్తులలో శ్రేష్ఠమైన వృత్తి అంటారు. కానీ 'ఆత్మహత్యలే వృత్తి అంటున్నారు ఈనాడు. నేటికీ రాజులు మారినా, రాజ్యాలు మారినా, ప్రభువులు మారినా, ప్రభుత్వాలు మారినా దేశానికి వెన్నుముక అయిన రైతన్న బ్రతుకు మారలేదు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి నేటికి 4 సంవత్సరాలపైన అయింది. గడిచిన 4 సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2995 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మెతుకు సీమగా పిలువబడుతున్న మెదక్ జిల్లాలోని ముఖ్యమంత్రి గారి నియోజక వర్గంలో 114 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే తెలంగాణ రైతు పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో ఇక్కడ మనం గమనించ వచ్చు. ప్రభుత్వాలకు రైతుల పట్ల క్రమబద్ధమైన ప్రణాళికలు లేకపోవడం, దళారులు పెరిగిపోవడం, రైతులకు గిట్టుబాటు ధర లభించక పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతు ఆత్మహత్యల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నవి. కాబట్టి రైతులకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ఏర్పాటు చేసి, దళారులను నిర్మూలించి రైతుకు గిట్టుబాటు ధర దొరికేట్లు చర్యలు తీసుకుంటే రైతే రాజు అనే నినాదం ప్రజలల్లో బలపడుతుందని ఈ వ్యాసం ద్వారా తెలియ జేయడమైనది.

ఈ కావ్యం గ్రామీణ జీవిత సత్యాలన్నింటికి అక్షరాకృతి. ఈ కృతి కాపుబిడ్డ కేంద్ర బిందువుగా ఆవిష్కృతమైన రైతు జీవన వృత్తం. కావ్య దర్శనం, వర్ణనలు, దేహాత్మల

వంటివి. ఇందులో వర్ణనలన్నీ కవి సత్యదర్శనానికి నిదర్శనాలే. ప్రతి పద్యంలో, ప్రతి పాదంలో వ్యవసాయ వృత్తి పరమైన తెలంగాణ వాస్తవ జీవిత సత్యాలు విరబూయించారు. రేయింబవళ్ళు కష్టించి, మట్టితో పోరాడి ప్రజలకు అన్నంపెడుతున్న కాపు కుటుంబాల సామాజిక సేవను సాహితీకరించిన తీరు కమనీయం.

ఆధార గ్రంథాలు :

1. కాపుబిడ్డ - గంగుల శాయిరెడ్డి
2. మహాభారతం - నన్నయ
3. వానమ్మ వానమ్మా (పాట) - జయరాజ్
4. నేల రాలుతున్న రైతన్న (పాట) - ఏపూరి సోమన్న

❖ ❖ ❖

కడప జిల్లా కథాసాహిత్యం - సామాజిక దృక్పథం (1991-2000)

– యస్. రామాంజనేయులు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ప్రవేశిక :

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సమకాలీన సమాజ పరిణామాలను రచయితలు శిల్ప వైవిధ్యంతో చిత్రిస్తారు. ఈ వాస్తవం దాదాపు అన్ని ప్రక్రియలకు వర్తిస్తుంది. అందరు రచయితలకూ వర్తిస్తుంది. అదే విధంగా అన్ని కాలాలకూ వర్తిస్తుంది. ఈ అంశాలు సమకాలీన సమాజాన్ని చైతన్యపరుస్తుంటాయని రూఢిగా చెప్పవచ్చు. ఈ దృక్కోణంతో చూసినపుడు ఒక దశాబ్దపు రాయలసీమ కథకుల (1991-2000) కథలను పరిశీలిస్తే ఎన్నో సామాజికాంశాలు ప్రస్ఫుటమవుతాయి. అనాటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతికాది అంశాలూ బయటపడతాయి. వాటి ద్వారా నాటి ప్రజల జీవన విధానాన్ని అంచనా వేయవచ్చు.

దళితుల జీవనం :

రాయలసీమ ప్రాంత ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఆ వ్యవసాయాన్ని అగ్రవర్ణాల వారూ, వెనుకబడినవారూ చేస్తుంటారు. దళితులు వారి పొలాల్లో కూలీ పనిచేసి పొట్టపోసుకుంటుంటారు. ఈ రైతులు కూలీలకు నిత్యం ఏదోక పని కల్పిస్తుండేవారు. ఆ విధంగా రైతులూ, కూలీలకు అవినాభావ సంబంధం ఉండేది. అయితే ఎన్నాళ్ళు చేసినా దళితుల జీవితాల్లో ఎదుగూ బొదుగూ ఉండేది కాదు. ఈ విషయాన్ని సుప్రసిద్ధ కథా రచయిత సాదుం జయరాం 'పాడె' కథలో ఇలా తెలిపాడు.

"మాలవాడకూ ఊరికి మధ్య సంబంధాలు విచ్ఛిన్నమై పోతున్నాయి. ఉత్తర కార్తెలోనూ, హస్తకార్తెలోనూ ఒకటే దడివాన కురిసేది. వాడలో బీదాబిక్కి తిండి గింజల కోసం నానా యాతన పడేవారు. ఊర్లోని రైతుల చుట్టూ మూగేవారు. వాళ్ళు ఆస్తులూ, పస్తులూ పడకుండా రైతు ఆదుకునేవాడు. కొట్టి నా తిట్టినా తమ కడుపు కొట్టడనే భావం వాడలో వాళ్ళకుండేది. ఒక పేడ పుటికెడు జొన్న కంకులు దొంగిలిస్తే కాలా చేతా పడదన్నేవాళ్ళు. ముల్లు గర్ర తీసుకొని తాటవలిచేవాళ్ళు. వాడలో వాళ్ళకి కిక్కురు మనే ధైర్యం ఉండేదికాదు. దెబ్బలు తిన్న మూడో రోజూ మళ్ళీ అదే రైతు పంచన కూర్చునేవారు. రైతు కాల్చి పారేసే ఎంగిలి బీడికి చేతులొగ్గేవారు. తాము నికృష్టంగా బతుకు తున్నామనే భావన వాళ్ళకు వచ్చేది కాదేమో! ఇక ఆడవాళ్ళు సరేసరి. రెడ్డిసాని చెమట తడసిన పాత చీరెకు, పాత రవికెకు, నానా వూడిగం చేసేవాళ్ళు. అంతమాత్రమే అయితే పర్వాలేదు. తెల్లారగట్ల రెడ్డి వాడలోకెళ్ళి జీతగాడిని పనిలోకి పంపి, వాళ్ళ స్థానంలో తను పడుకునేవాడు. మగవాళ్ళే బానిసలై బతుకుతుంటే ఆడవాళ్ళకి ఒక వ్యక్తిత్వం ఎక్కడుంటుంది. పాతివ్రత్యం ఎక్కడ కాపాడు కుంటారు? కిక్కురు మనకుండా సహించేవాళ్ళు. క్షోభ పడడానికి, మధనపడడానికి వాళ్ళకు ఒక ఆత్మ అంటూ ఉన్నదో లేదో ఆ పరమాత్మకే తెలియాలి" అంటాడు. దళితుల దుర్భర జీవనాన్ని రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. ఇందులో అసత్యమంటూ ఏదీ లేదు. అయితే నేడు ఈ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. దీనికి ప్రధాన కారణం దళితుల్లో వచ్చిన చైతన్యమేనని చెప్పవచ్చు.

స్త్రీల అందచందాలతో వ్యాపారం :

స్త్రీలను ఉన్నతంగా, గౌరవంగా మగజాతి చూడాలి. అయితే నాడు, నేడు అందుకు భిన్నంగా జరుగుతున్నది. 'యత్రనార్యస్తు పూజ్యంతే తత్రరమంతీ దేవతా' - ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని పురాణాలు చెబుతున్నాయి. అదే విధంగా 'కలకంఠి కంట కన్నీ రొలికిన సిరి ఇంట నుండ నొల్లదు సుమతీ!' అని

సుమతీ శతకకారు బద్దెన చెప్పాడు. ఈ సూక్తులన్నీ మనకు తెలిసినా వాటిని ఆచరణలో అమలు చేయటం లేదు. స్త్రీ శరీరంతో వ్యాపారం కొందరు చేస్తుంటే, మరి కొందరు స్త్రీల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారిని లైంగికంగా వాడుకుంటున్నారు. ఈ దుస్థితి సినీ, వ్యాపార రంగంలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. సినీరంగంలో ఉన్న స్త్రీల దుర్భర స్థితిగతులను ఇటీవల కాలంలో కళా కారిణులు పూసగుచ్చినట్లుగా బయట పెట్టారు. అయినా సభ్యసమాజం వాళ్ళకు తగిన రీతిలో మద్దతు ఇవ్వలేదు.

అదే విధంగా కొందరు వ్యాపారస్తులు అమ్మాయిల అందచందాలతో వ్యాపారం చేస్తున్నారు. ఖాతాదారులను ఆకర్షించుటకు అమ్మాయిల అంగాంగాలను ప్రదర్శనగా పెడుతూ తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారు. అమ్మాయిల ప్రతిభకు కాక వారి అందాన్ని చూసి ఉద్యోగానికి ఎంపిక చేస్తున్నారు. ఇది కాదనలేని సమ కాలీన కఠోర నిత్యసత్యం. ఈ అంశాన్ని కథకుడు బడబాగ్ని శంకర్రాజు తన 'అందాల వ్యాపారం' అనే కథలో ఇలా తెలిపాడు.

"అక్కడ ఆఫీసులో ఇంటర్వ్యూలు జరిగిన వారం రోజుల తరువాత....

రాఘవయ్యా! అన్న మేనేజర్ సాయికిశోర్ పిలుపు విని ఎస్ సర్ అంటూ వచ్చి మేనేజరు ముందు నిలబడ్డాడు ఆఫీసు గుమస్తా. ఉషాపేరు మీద అపాయింట్‌మెంట్ ఆర్డర్ ప్రిపేర్ చేయించి, ఆ అమ్మాయికి పంపండి.

సార్ ఆ అమ్మాయి కంటే కీర్తికే....

ఎక్కువ విద్యార్హతలున్నాయంటావ్. అంతే కదా. నిజమే. ఇంతవరకూ మన కంపెనీలో అర్హతలను బట్టే ఉద్యోగాలలో నియమించేవాళ్ళం. కానీ మైడియర్ ఓల్డ్‌మాన్ ఇపుడు కాలం మారిపోయింది. కస్టమర్స్ కంపెనీ పార్ట్నర్స్ అభిరుచులు వేగంగా మారిపోతున్నాయి. మనమూ మారాలి, తప్పదు. నా ఫైనాన్సింగ్ కంపెనీలో పర్సనల్ సెక్రటరీగా జాయిన్ కాబోయే అమ్మాయికి విద్యార్హత లొక్కటే చాలవు. వాటికి ధీటుగా అందమూ ఉండాలి. అటువంటి అమ్మాయి నాపక్కన నిలబడినపుడే మన బిజినెస్ వేగం పుంజుకుంటుంది. మన కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి వాటాదారులు పోటీపడి ఎగ బడతారు. ఎందుకంటావ్? మనం వాళ్ళ కిచ్చే వడ్డీ కోసమే కాదు. దానితో బాటు మనం వాళ్ళ కందించే పడతి అందాల కోసమే. 'ఈజ్ ఇట్ నాట్', తన మాటలను మధ్యలోనే తుంచేస్తూ ఉపన్యాస ధోరణిలో అన్న మేనేజరు మాటలకు అంగీకారంగా తలూపుతూ వెళ్ళిపోయాడు", అంటూ ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా చెప్పాడు. ప్రతిభ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వకుండా అందచందాలకు ఉద్యోగాలిచ్చే దౌర్భాగ్య పరిస్థితులు మన దేశంలో ఉన్నందుకు మనందరం సిగ్గుపడాలి. ఇలాంటి విపరీత ధోరణులు మన దేశ సంప్రదాయాలను సంస్కృతిని మంట గలుపుతున్నాయి. ప్రైవేటు రంగంలోనే ఈ ధోరణులు పుట్టుకొస్తున్నాయని దృఢంగా చెప్పవచ్చు.

కరువు :

రాయలసీమలో కరువు కారణంగా వేలాదిమంది దిన కూలీలు, రైతులు నగరాలకు వలసలు వెళ్ళారు. అక్కడ వారు భవన నిర్మాణ కార్మికులుగా, అపార్ట్‌మెంట్లలో కాపలాదార్లుగా ఆత్మాభిమానాన్ని చంపుకొని పనిచేస్తు న్నారు. ఈ పరిస్థితి రాయలసీమలోని నాలుగు జిల్లాల్లోనూ కనిపిస్తుంది. ముఖ్యంగా అనంతపురం జిల్లాలోని ప్రజలు బెంగుళూరుకు వలస వెళ్ళారు. చిత్తూరు జిల్లా వాళ్ళు తిరుపతి, బెంగుళూరుకు వెళుతున్నారు. కర్నూలు జిల్లా వాళ్ళు ముంబయి, పూనాకు వెళుతున్నారు. కడప జిల్లా వాళ్ళు తిరుపతి, బెంగళూరు వెళుతున్నారు. వీటికన్నిటికి భిన్నంగా వేలాదిమంది స్త్రీ, పురుషులు లక్షల రూపా యలు అప్పులు చేసి గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. అలా వెళ్ళిన వారిని ఏజంట్లు దారుణంగా మోసం చేసి లక్షలు వెనకేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు ఏజంట్లు ఇక్కడి పేదలకు ముఖ్యంగా స్త్రీలకు మాయ మాటలు చెప్పి పంపుతున్నారు. ఇంట్లో పని చేయాల్సి

ఉంటుందని ఇక్కడ చెబుతూ, వారిని అక్కడి నవాబులకు అమ్మేస్తున్నారు. అక్కడికెళ్ళాక తాము ఘోరంగా మోసపోయామని తెలుసుకొని లబోదిబోమంటున్నారు. ఆ ఇళ్ళలో విశ్రాంతి లేకుండా, మంచి తిండి లేకుండా పని చేసి అలసిపోతున్నారు. దానితోబాటు ఆ ఇంటిలోని మగవాళ్ళందరికీ లైంగిక సుఖాన్ని ఇవ్వలేక సోలిపోతున్నారు. ఈ విషయాన్ని ఎందరో బాధితులు నిర్భయంగా, నిజాయితీగా బయటపెడుతున్నారు. అయినా వారి గోడు పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నాడు. ఈ సంఘటనల నన్నిటిని చక్రవేణు, మధురాంతకం రాజారాం వంటి కథకులు చిత్రించారు. వీటన్నిటికీ భిన్నంగా మరి కొందరు స్త్రీలు బొంబాయి, పూనా, హైదరాబాద్, కలకత్తా వంటి నగరాల్లోని రెడ్‌లైట్ ఏరియాలకు వ్యభిచార వృత్తి నిమిత్తం వెళుతున్నారు. ఆ రొంపిలో నుంచి బయటపడలేక, పడినా సమాజంలో గౌరవంగా బతకలేక దుర్భరంగా జీవనం సాగిస్తున్నారు. ఈ అంశాలన్నింటినీ వస్తువుగా తీసికొని కడప జిల్లా కథకులు చక్కని కథలు రాశారు. వాటిని చదువుతుంటే గుండె తరుక్కు పోతుంది.

సంస్కృతి :

రాయలసీమకు మహోన్నతమైన సంస్కృతి ఉంది. ఇక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవులూ జీవిస్తున్నారు. హిందువులతో సమానంగా ముస్లింలు ఉన్నారని చెప్పవచ్చు. గతంలో రాయచోటి, కదిరి, కడప వంటి పట్టణాల్లో మత కలహాలు జరిగాయి. అయితే 2001 నుంచి ఆ దుష్టసంస్కృతికి ప్రజలు ముగింపు పలికారు. దీనికి ప్రజలు చైతన్యవంతులు కావడం ఒక కారణం కాగా, ప్రభుత్వాల కృషి రెండో కారణంగా పేర్కొనవచ్చు. దీనికి ఎందరో సాహితీవేత్తల కృషి కూడా చక్కగా దోహద పడిందనవచ్చు. పరమత సహనాన్ని గురించి కథకుడు మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి తన 'మతాతీతం' అనే కథలో ఇలా తెలిపాడు.

"మతాలను దేవుడు ఏర్పరచలేదు. మనం ఏర్పరచుకున్నాం. మతం మానవత్వం వేరు కాదు. మానవత్వం లేని మతం గుడ్డిది. మతం ఒక సంప్రదాయం. ఒక కట్టుబాటు. అది సర్వజన హితం కావాలి. దేశంలో ఇప్పుడు జరుగుతున్న మత కల్లోలాలు చూస్తుంటే బాధగా ఉంది. పందెం ఊయల మీద పడుకుని చెప్పకు పోతున్నాడు రోశిరెడ్డి.

ఊయల ఊపుతూ జిలానీ బాషా అన్నాడు 'మసీదు పడగొట్టడం తప్పు కదయ్యా!'

రేడియోలో అంతకు క్రితమే విన్నవార్త 'అయోధ్యలో బాబ్రీ మసీదును పడగొట్టారు.' ఆ విధ్వంస కాండను ప్రపంచమంతా ఖండించింది. ఆ వార్తకు రోశిరెడ్డి హృదయం స్పందించింది.

ముమ్మాటికీ తప్పే! దేవుడికి జన్మభూమి ఎక్కడని నిర్దేశించగలము. ప్రపంచమంతా ఆయనదే. ఆయన ఎక్కడో లేడు. ప్రతి హృదయంలోనూ ఉన్నాడు. అసలు రాముడంటే అర్థం అదే", అంటాడు. 1992లో అయోధ్యలోని బాబ్రీ మసీదును కొందరు మతోన్మాదులు కూల్చివేసినందుకు ఆవేదన చెందుతూ ఎందరో కథకులు కథలు రాశారు. అలా రాసిన వారిలో ముఖ్యులు మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి గారు.

కడప జిల్లాకు చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. అక్కడ ఎన్నో చారిత్రక కట్టడాలున్నాయి. ఎందరో రాజులు పరిపాలించారు. ఎన్నో పుణ్యనదులున్నాయి. ఎందరో కవీశ్వరులు జన్మించారు. ఎందరో రాజనీతిజ్ఞులు, స్వాతంత్ర్య పోరాట వీరులు ఈ జిల్లాలో జన్మించారు. అదేవిధంగా సాంస్కృతికంగా కూడా ఈ జిల్లాకు ఒక ప్రత్యేక స్థానముంది. ఈ అంశాలతోబాటు కరువు, ఫ్యాక్షన్ కూడా ఉంది. ఈ అంశాలన్నింటిని కడప జిల్లా కథకులు అద్భుతంగా చిత్రించారు. అలా చేసి తమ సామాజిక బాధ్యతను నెరవేర్చుకున్నారు.

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి 'ఒంటరి'

– డా॥. దొర్లపూడి శివరామకృష్ణ, తెలుగు ఉపన్యాసకులు, మహారాజ సంస్కృత ప్రభుత్వ కళాశాల, విజయనగరం.

'ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆర్థిక వ్యవస్థలు, పరిశ్రమలు, మార్కెట్లు, సంస్కృతులు, విధానాల రూప కల్పన అన్నీ సమ్మేళతం కావటమే ప్రపంచీకరణ' బ్రిటన్ పత్రిక ఫెనాన్షియల్ పత్రిక కధనం. ఈ మొత్తం ప్రక్రియలో మనిషి గమ్యం... ప్రయాణం ఏమిటి. మనిషి కేంద్రంగా నడిచే వ్యవస్థలు అదే మనిషిని నిర్వీర్యం చేస్తే. తద్వారా 'గ్రామీణ వ్యవస్థ' కుదేలు అవుతున్నదని ఎవరు నిర్ణ యిస్తారు. ప్రభుత్వాలు, ఆదిపత్య వర్గాలు ఈ ప్రపంచీ కరణలో 'తమ స్థానాలను' మరింత విస్మృతి చేసు కుంటున్నారు. తమ ఆర్థిక స్థితిని మరో మెటు పైకి తీసుకు వెలుతున్నారు. సగటు మనిషి... వ్యవసాయ, గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో మిళితమైన అనేకానేక చేతివృత్తి సంస్కృతులు 'నాశనం' వెనుక ఎవరి హస్తం ఉందో గమనించుకొని, విశ్లేషించుకొనే 'అవసరం' 'ఆవశ్యకత' వర్తమానంలో ఎవరికి లేదు... ఎవరికి అక్కర్లేదు. కాని... ప్రపంచీకరణ ప్రయోజనాలు, ఫలితాలు మధ్య 'మనిషి' ఉనికి, అస్తిత్వాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. కాలక్రమంలో 'ప్రపంచీకరణ' అనేదానికి అర్థాలు, నిర్వచనాలు మారి పోతున్నాయి. పాము తన పిల్లల్ని తానే తినివేసే విధంగా 'ప్రపంచీకరణ' గ్రామీణాన్ని తనలో కలిపేసుకుంటున్నది.... కనిపించకుండా....!? పెట్టుబడిదారులు, దోపిడీదారులకు లాభాల మార్గంగా ఈ పదం మారిపోవటం శోచనీయం అయినప్పటికీ ప్రపంచం 'శాంతి' 'సుఖం' 'ఐకమత్యం' వంటి వాటి కకోసం తపన ప్రారంభమయింది. 'ప్రపంచీ కరణ' అంటే 'బహుళ సంస్కృతుల సమ్మేళనం' అన్నవారే అదొక 'విఫల ప్రయోజనకరంగా' అభివర్ణిస్తున్నారు. సామ్రాజ్య విధానంలో 'ప్రపంచీకరణ' ఓ 'అధ్మాత విధానం' కాని...'వలసీకరణ' అనే దానిని విస్మరించడం 'మనిషి' మాయమవుతుండటం వంటి వాటిని 'కన్వీనీ యంట్ గా విస్మరిస్తుండటం' విషాదం.

ఈ నేపథ్యంలో కొన్ని వందల కథలు, నవలు వచ్చాయి. సాహిత్యం తనవంతు పాత్రను పోషించింది... ముఖ్యంగా 'వ్యవసాయం' లో జరిగిన మార్పులు, వాటి వెనుక 'వ్యవస్థల' విఫలతలు 'కంటికి కనిపిస్తున్న సత్యాలు' 'వ్యవసాయంలో' సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రయివేటీ కరణ వంటివి ఆ రంగంలో చిన్న, సన్నకారు వర్గాలను కుదేలు చేస్తున్నాయి. చిత్రం ఏమిటంటే 'ఉన్నత' వర్గాలు వారు సహితం ఈ నేపథ్యంలో 'ఒంటరి' పోరాటం చేయటం. ఈ పరిణాలు మధ్య 'ప్రకృతి' నాశనమవు తుండటాన్ని గమనించి. 'ప్రకృతి అర్థం చేసుకున్నవాడు దాన్ని విధ్వంసం చేయడు' అనే రచయిత ఆవేదనకు అద్దం... 'ఒంటరి' జంతువుల అరుపుల్ని, మొక్కల స్పర్శని ఆస్వాదించలేని 'అజ్ఞానం' పక్షుల 'కిలకిల రావాలు' కవిత్వంలో మాత్రమే 'సూత్రీకరిస్తున్న' వర్తమానం... ప్రకృతిని 'సొంతం' చేసుకోలేని మనిషి దానిని 'ధ్వంసం' చేయటం ఎంతటి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుంది అనే అంశాలను సున్నితంగా మనసుకు హత్తుకొనే విధంగా చిత్రించిన నవల సన్నపురెడ్డి వెంకటరామరెడ్డి రచన 'ఒంటరి'.

'మనిషి' లొంగని 'వ్యాధులు' అతనినే ఎలా భయ పెడుతూ, ఆ 'రోగాల'ను తగ్గించుకొనేందుకు ఏవిధమైన 'ఒంటరి' ప్రయాణం చేయాలనేది ఈ రచనలోని ప్రధాన ఉద్దేశ్యం. వ్యవసాయరంగంనకు ప్రాణమైన 'వంగడాల్ని' బహుళజాతి కంపెనీలు తమ కబంధ హస్తాలతో 'ఆక్ర మిస్తే' మనిషి అత్యాశలో 'పల్లె' తన స్వరూపాన్ని కోల్పో తున్న పరిస్థితి కళ్ళెదుట కనిపిస్తున్న సత్యం. 'అంగీకరించ లేని' వాస్తవం. ఇక్కడ గమనించుకోవలసిన మరో అంశముంది.... ఈరోజు నూటికి తొంభై ఎనిమిది మందిని కబలిస్తున్న 'నిశ్శబ్దపు రాక్షసి' - డయాబెటిస్.... దీన్ని

మానవాళికి బహుకరించిన గొప్ప విధానం 'ప్రపంచీకరణ' .... ఇదో గొప్ప 'తాత్వికచింతనను' మనిషిలో కలిగిస్తుంది. ఒంటరి ప్రయాణం అనివార్యమనే తత్వాన్ని చెబుతుంది.

'ఒంటరి' నవలలో ప్రధాన పాత్రలు డా॥రాఘవ, రైతు నర్సయ్య, వైద్యాన్ని 'వ్యాపార రంగం'గా గుర్తించిన 'గ్లోబలై జషన్' ప్రక్రియలో అలుపెరుగని పరుగులో 'ఆర్థిక' యుద్ధం అనివార్యం. నగరాలు కాలుష్యపుకాసారాలుగా మారిపోయి, శరీరాలు రోగాలకు వేదికలవున్నాయి. 'పదం తస్తుల కార్పోరేట్' వైద్యాలయాలు 'వ్యాపారం' చేస్తున్న తీరు 'ప్రపంచీకరణ' అభివృద్ధికి ఓ నిదర్శనం. ఇందుకు అచ్చమైన నకలు ప్రతి 'డా॥ రాఘవ' అతని కొడుకు. రాఘవకు 'డయాబెటిస్' మందులకు లొంగని స్థాయి. ఎవరో చెబుతారు 'అరికెలు' (కఫలు) బువ్వ తినమని కాని... ఏవి 'అరికెలు'...? ఎంత డబ్బైనా 'వెచ్చించగల' శక్తి రాఘవది... కాని...ఏవి? ఓ స్వామిజీ సలహాలతో 'ఒక అటవీ ప్రాంతం సమీపంలోని గ్రామమంలోని 'నర్సయ్య' దగ్గరకు చేరుకుంటాడు. దీని వలన అతనిలో క్రమంగా మార్పవస్తుంది. ఇది 'అంతర్గతమైన' 'అంతరంగీకమైన' మార్పు డబ్బు ఇందనంగా పరిణమించిన భౌతిక జీవితం అర్థరహితమని, మనిషి ప్రకృతితో సహజంగా ఉండే 'పేగు బంధాన్ని' తెంపుకోనంత కాలం నిజమైన ఆనందం, జీవితానికో పరమార్థం ఉండదని గ్రహిస్తాడు. ప్రపంచీకరణ నేపథ్యం అంతరించిన ఒక ధాన్య జాతిని అన్వేషించే క్రమంలో ఓ 'మనిషి తపన, అదే 'వంగడాన్ని'.... నాగరీకరణకు.... నగరీకరణకు దూరంగా తనదైన 'కుటుంబం ఇచ్చే సఖ్యత... సుఖం' వంటి వాటితో పరరక్షించుకొనే రైతు నర్సయ్య వంటి పాత్రలు ఓ 'సజీవచిత్రాలు'గా పాఠకునిగా కనిపిస్తాయి. అయితే 'క్రొత్త'ను ఆహ్వానించ కూడదా? అభివృద్ధి నిరోధకాలుగా ఉండిపోతామా అనే ప్రశ్నలు వెనుక మానవమనస్తత్వం వెనుక 'సున్నితత్వం' 'కుటుంబం' వంటి వాటిని విస్మరిస్తే మనిషి ఎవరి గదుల్లో వారే నివశించాలి.... ఒక రకంగా 'వ్యక్తిగత జైలు' 'నీలి విప్లవం' విఫలం.... చేపల చెరువులు పేరుతో పంట పొలాలు విధ్వంసం... వీటికి ఏ 'ప్రపంచీకరణ' సమాధానం చెబుతుంది. ఈ నవల నేపథ్యం ఇదే ప్రశ్నిస్తుంది. నవల లోని రెండు సంఘటనలు మానవ జీవితంలోని వాస్తవికతను, మార్మికతను, నిర్లిప్తతను, విధ్వంసపు నీలి నీడలను అనుకొనే పాఠకులకు చెబుతాయి.

రోడ్డు మీద మోజు. బస్సు మీద మోజు. పెద్ద పులుల్ని తరిమి నోళ్ళం. ఈ రోడ్డు మోజును తరమలేకపోయా'మనే రైతు మాటల వెనుక 'విధ్వంసపు' చిహ్నాలు కనిపిస్తాయి. 'ఎండు మిరపకాలయలు కాల్చి తెల్లచాయలు జతచేసి బొటనవులి దరువేసి మీగడ పాలతో కలిపిన కారం అందులో వడ్డించింది. అప్పుడే కాచి తెచ్చిన నెయ్యిని కారం మీద పోసింది. 'చుయ్' మని శబ్దం వచ్చేలా' నోస్టాల్జియా త్రవ్వకాల వెనుక మనసు చేసే సంతోషాల 'జీవనం - జీవితం' వర్తమానంలో ఏది? ఎక్కడ.... ఈ ప్రశ్నల వెనుక 'రాక్షస స్నేహం' ఎవరితో?

జీవితం... ఏకాంతంగా గడిపేది కాదు. జీవితానికి అనంతమైన ముఖాలున్నాయి. మనిషికి వ్యక్తిగత ఏకాంతం, జీవితం, కుటుంబ, సామాజిక జీవితం ఉంటాయి. ఇదే కాదు... మానసిక, బౌద్ధిక జీవితం కూడా ఉంటుంది. లోతుగా విశ్లేషిస్తే వీటి వెనుక ఓ 'సూత్రం' ఉంటుంది. భావాలు సమాజపరమైన ప్రభావితం పని చేస్తాయి. కాని... తనకంటూ ఓ 'వ్యక్తిగత జీవితాన్ని' కోల్పోయే క్రమం అతనిని అశాంతిలోనికి నెట్టిస్తాయి. ఇందుకు కారణం...మనం చెప్పుకుంటున్న 'ప్రపంచీకరణ' కారాదు...

నవల ముందు మాటలో పర్యావరణ వేత్త తల్లా వజ్జల పతంజలి శాస్త్రి గారు చెప్పిట్లు'.... విలువలు, ప్రాపంచిక ధృక్పథం అంతరించిపోవడం విచారకరం. మన దేశంలో గుత్తాధిపత్యం ఉన్న ఎరువులు పురుగుల మందుల కంపెనీల, వాళ్ళిచ్చే కమీషన్లకి అమ్ముడుబోయే నాయకులు నియంత్రిస్తున్నారు. రైతుల్ని కంపెనీలు కూలీలుగా మార్చి, చినన కమతాలుగా మార్చేస్తున్నాయి అంటారు. ఇది నిజం కాలక్రమంలో 'రైతు' వ్యవస్థ కనుమరుగవు

తుంది. 'రైతు'ను సాహిత్యంలోనూ... చిత్రాల్లోనూ.... (మ్యూజియంలో) చూడవలసిరావటం వస్తుంది... అప్పుడు అందరికీ బువ్వ ఎలా వస్తుంది.... ప్రపంచీకరణ నిర్వచనం ఇదేనా...!? ఈ హెచ్చరిక... సమాధానం... మనిషి 'ఒంటరి' ప్రయాణాలకు ఓ తుది మార్పు సూచించే గొప్ప రచన 'ఒంటరి'.

ఆధార గ్రంథాలు :

1. ఒంటరి - సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
2. నవలాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య

❖ ❖ ❖

అట్టాడ అప్పలనాయుడు గారి ప్రత్యామ్నాయం కథా సంపుటి - ప్రపంచీకరణ కథలు

– జె. యోగీశ్వర నాయుడు, తెలుగు అధ్యాపకులు, జి.టి.ఆర్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల, కర్నూలు.

ప్రపంచీకరణ అర్థం :

ప్రపంచీకరణ అంటే ప్రపంచ ఏకీకరణ. విశ్వీకరణ అని కూడా వ్యవహరిస్తున్నారు. దీనికి అంగ్లపదం గ్లోబలైజేషన్. మార్షల్ మెక్ లూహాన్ 1962లో మొదటగా గ్లోబలైజేషన్ అనే పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చాడు. ప్రత్యేకించి 'ప్రపంచ కుగ్రామం'' (గ్లోబల్ విలేజ్) అనే పదాన్ని వాడుకలోకి తెచ్చాడు.

GLOBALIZATION IS THE PROCESS BY WHICH THE EXPERIENCE OF EVERYDAY LIFE, MARKED BY THE DIFFUSION OF COMMODITIES AND IDEAS, IS BECOMING STANDARDIZED AROUND THE WORLD .

(మన నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభూతులు, అవసరాలు, ఆలోచనలను ప్రపంచమంతా వ్యాప్తి చేసి వాటికి స్థిరత్వం తీసుకొచ్చే ఒక ప్రక్రియగా చెప్పవచ్చు)

''ఇంతకీ గ్లోబలైజేషన్ అంటే ఏమిటి? ఇది ఒక విధంగా గ్లోబలి. అంటే గ్లోబును బలి తీసుకోవడం లాంటిదే. పీడిత కులాలు, జాతులు, వర్గాలు ప్రయోజనాలపై చావు దెబ్బ తీయడమే'' అని కాలువ మల్లయ్య గారు పేర్కొన్నారు.

ప్రపంచీకరణ - తెలుగు కథ :

ప్రపంచీకరణ అన్ని రంగాలపై ప్రభావాన్ని చూపింది. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలతో పాటు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది. 1990వ దశకం నుండి నూతన ఆర్థిక విధానాలు జనజీవితాల్లోకి రావడంతో అన్ని వాదాల సాహిత్యకారులు దీనిపై స్పందించి సాహిత్యాన్ని వెలువరించారు. ప్రపంచీకరణ అనేది నేడు ఒక ధోరణిగా మారింది. తెలుగు సాహిత్యంలో ఇతర ప్రక్రియల్లాగే ప్రపంచీకరణపై వ్యతిరేకత భావాన్ని చూపెట్టింది కథా ప్రక్రియ.

ఉత్తరాంధ్ర ప్రాంతంపై ఈ ప్రపంచీకరణ ప్రభావం ఏ విధంగా ఉన్నదో అట్టాడ అప్పల్నాయుడు గారు తన కథలలో పేర్కొన్నారు. ఇతను 23-08-1953సం॥ శ్రీకాకుళం జిల్లా, 'గుమడ' గ్రామంలో జన్మించాడు. ఇతను దాదాపుగా 78 కథలు, 4 కథా సంపుటాలు, 3 నవలలు ఇంకా నాటకాలు, వ్యాసాలు రాశారు. 1989లో 'యేలినవోరికి వెయ్యిదండాలు' పేర ఆంధ్ర దినపత్రిక లోను, 2007 - 2008లో కొంత కాలం 'సూర్య' దిన పత్రికలో ప్రతి ఆదివారం 'నేస్తం ఊసులు' పేర కాలమ్ నడిపాడు.

1992 నుండి 97 మధ్యకాలంలో వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డ అప్పల నాయుడుగారి కథలను 'ప్రత్యామ్నాయం కథలు' పేరుతో శ్రీకాకుళం విరసం యూనిట్ 1998లో ముద్రించింది. ఈ కథా సంపుటిలో 13 కథలున్నాయి. అవి : ప్రత్యామ్నాయం, భద్రయ్య, గయిరమ్మ, డోర్ డెలివరీ, మమకారం, బారికోడు, బంధాలూ - అనుబంధాలూ, యుద్ధం, కొలతలు, తల్లీకూతుళ్ళు, జీవనస్రవంతి, వేళ్ళు తెగిన, యానగాలి. తొంబయవ దశకంలో దేశంలో ప్రవేశించిన సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఉత్తరాంధ్ర రైతాంగం, గిరిజనుల జీవితాల్లో తెచ్చిన మార్పులు అంతర్లీనంగా ఉద్యమాల నేపథ్యంగా ఈ కథలు నడిచాయి.

ఈ కథలల్లోని నేపథ్యాన్ని గురించి రచయిత తన "ప్రత్యామ్నాయ కథా సంపుటి - ముందుమాటలో ఇలా పేర్కొన్నారు. "ఒక వైపు నక్సల్బరీ, శ్రీకాకుళాలు ప్రజా రాజీకీయాలు ద్వారా తెచ్చిన ప్రత్యామ్నాయానికి పాలక వర్గాలు సామ్రాజ్యవాదం గొడుగుకింద ఆశ్రయాన్ని వెతుక్కొని మనలందరినీ ఆ గోవర్ధనగిరి కిందికి తోయాలని చూస్తుంటే, ఆ మాయాజాలం నుంచి (సరుకుల మాయ నుంచి) బయటపడి దానిని ఛేదించి ప్రత్యామ్నామయ అభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించుకుంటున్న ప్రజా పోరాట రాజకీయాలకు అప్పల్నాయుడు తన కథలో "అంతస్రోతస్విని"గా అందుకున్నాడు. అందుకే చాలా కాన్షస్‌గానే ఆయన తన కథలకు "ప్రత్యామ్నాయం కథలు' అని పేరు పెట్టాడు.

వ్యవసాయం :

ఉరుగ్వే రౌండ్‌కు సంబంధించిన 'గాట్' కొన్ని తీర్మానాలు చేసింది. 20 డిసెంబర్ 1991లో వర్తక చర్చల కమిటీ ఛైర్మెన్ అయిన 'ఆర్థర్ డంకెల్' ఉరుగ్వేరౌండ్ అంతిమ ముసాయిదాను సమర్పించారు. ఇది పైకి అందంగా ముస్తాబు చేయబడినా దీని వెనుక అభివృద్ధి చెందిన దేశాలస్వార్థం దాగి ఉంది. భారత్‌లాంటి దేశాలలో వ్యవసాయం సబ్సిడీలు తొలగించమని చెప్పి స్వదేశంలో భారీ ఎత్తున సబ్సిడీలు కల్పిస్తున్నాయి. ఈ ముసాయిదా చాటున తమ ఉత్పత్తులను మనదేశంలో ప్రవేశపెడుతున్నాయి. ఈ విషయాన్నే రచయిత 'మమకారం' కథలో ఇలా చెబుతున్నాడు.

కౌలుదారుడైన శిమ్మన్నతో రాజులమ్మ కొడుకు వ్యవసాయం గురించి మాట్లాడుతూ - "అంతే శిమ్మన్నా! వ్యవసాయం కిట్టుబాటు కాని వృత్తి అయిపోయింది. రాబోయే రోజుల్ల మరీ కష్టం. విత్తనాలూ, ఎరువులూ విదేశీ కంపెనీలమ్ముతాయి. ఈ సబ్సిడీలు గట్రా యేముండవ్. కొనబోతే కొరివీ, అమ్మబోతే అడవీ - అని రైతులు యిప్పుడు బాధపడతారా! ఇక ముందు రోజుల్లో మీరు కొనలేరు, అమ్మడానికి మీ దగ్గరేది వుండదు. రాబోయే రోజుల్లో రైతుల పరిస్థితి అదీ". అంటూ డంకెల్ ప్రభావాన్ని ముందుగానే ఊహిస్తాడు.

చిరు వ్యాపారాలు దెబ్బతినటం :

ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచమే ఒక స్వేచ్ఛా వాణిజ్య విపణిగా మారిపోయింది. ఒకప్పుడు మన దేశంలో వివిధ వృత్తులవారు తాము తయారు చేసిన వస్తువులు గ్రామాలకు తీసుకెళ్ళి యింటింటికీ తిరిగి అమ్మేవారు. వారి వారి స్థాయిలను బట్టి లావాదేవీలు జరిగేవి. కొనేవారు, అమ్మేవారి మధ్య ఒక రకమైన సంబంధం నెలకొనేది. అయితే నేడు ఆ పరిస్థితి కపపడదు. ప్రపంచీకరణ ప్రభావంతో ఈ విధానం కొత్తరూపు దాల్చుకొంది. షాపింగ్‌మాల్స్‌గా కొత్త అవతారమెత్తింది. యిక్కడ ప్రతి వస్తువు అందంగ ప్యాక్ చేయబడి లభిస్తుంది. మారిందల్లా వ్యాపార సూత్రమే. నాడు వ్యాపారంలో నైతిక విలువలు పాటించేవారు. నేడు దోపిడీయే ప్రధానం.

నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా బ్యాంకింగ్ వ్యవస్థలో వచ్చిన మార్పుల్తో, రుణసదుపాయం పెరిగి చిల్లర వ్యాపారం చిన్న - పెద్ద సూపర్ మార్కెట్లు విస్తరించటం గత దశాబ్దకాలంలో చోటు చేసుకున్న పరిణామం ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర ప్రాంతంలో పల్లె నుండి వలస వచ్చి బ్యాంక్ సహాయంతో బడ్డీకొట్టు పెట్టుకొన్న భద్రయ్య రాజకీయ నాయకుల చేసే వ్యాపార సూత్రాలకు ఉపాధి కోల్పోయిన వైనం 'భద్రయ్య' కథలో కన్పిస్తుంది.

'భద్రయ్య' కథలో బడ్డీకొట్టు (చిన్న బంకు) వ్యాపారి భద్రయ్య. పట్టణాన్ని విస్తురిస్తున్నామనే కారణంతో నాయకులు పేదల ఉపాధిని దూరం చేస్తుంటారు. తన బంకు ఉన్న బస్టాండు స్థలంలో షాపింగ్‌మాల్ కట్టడానికి మున్సిపల్ నాయకులు నిర్ణయించి బడ్డీ (బంకు)ను తొలగించడానికి పూనుకుంటారు. అది చూసిన భద్రయ్య ఆవేదన వ్యక్తపరుస్తాడు. బడ్డీకొట్ల సంఘం నాయకుడు బలరాం. భద్రయ్యను పక్కకు తీసుకెళ్ళి "ఇదంతా రాజకీయం! అంతేనిరా భద్రయ్య అంతే! బయటికి

మాత్రం యిది చెప్పరు. పట్నానికీ, పాతబస్టాండ్‌కీ మధ్య దూరం యెక్కువయిపోయిందనీ,.... మన్లాటి చిన్నచిన్న బతుకులన్నీటికి ముప్పు వొస్తుంది. పెద్ద పెద్ద చేపలు కాదు తిమింగళాలు వొస్తున్నాయి. చిన్న చేపలిక బతకవుపు అని వాస్తవ పరిస్థితిని వివరిస్తాడు. విదేశీ వ్యాపారులు పెట్టుబడులతో సహా ఈ దేశంలో దిగిపోయి యిక్కడి వ్యాపారాలను దెబ్బతీస్తున్నారు. చివరకు చిల్లర వర్తకంలో కూడా అడుగుపెట్టి ఏకంగా ఉపాధినే దూరం చేస్తున్నారు. ఈ వ్యాపార సూత్రంలో భద్రయ్య లాంటి వారు చితికి పోతే, ఇంకా ఎంతోమంది ఉపాధికి దూరమయ్యే పరిస్థితులు సిద్ధంగా ఉన్నాయి.

కులవృత్తులు :

అనాదిగా ప్రజలు కులవృత్తులపై ఆధారపడి జీవించే వారు. ప్రతి వృత్తి గొప్పదే. ఒక దాని మీద ఇంకోటి ఆధార పడేది. అందరూ సమిష్టిగా వృత్తి జీవనం సాగించేవారు. నేడు కొన్ని వృత్తులు స్వరూపాన్ని మార్చుకుంటున్నాయి. ఆ విషయాన్ని చూపెడుతున్నది 'బారికోడు కథ'లో.

ఎప్పుడైతే కులవృత్తులు నాశనమయ్యాయో వ్యక్తులు అయోమయం పాలవుతారు. కొత్త పన్నులు వెయ్యడం వలసల కారణంగా కొత్త వాతావరణంలో ఇమడలేక పోవడం, ఫలితంగా మానవ సంబంధాలు ఛిద్రం కావడం ప్రపంచీకరణ ఫలితాలే' ఈ అంశాలను అప్పల్నాయుడి బారికోడు కథలో కన్పిస్తున్నాయి.

తరతరాలుగా బారిక వృత్తి చేసే ఆదెయ్య కథె 'బారికోడు'. తాత, తండ్రీ చేసిన బారిక వృత్తినే నమ్ముకున్న ఆదెయ్య ప్రభుత్వం యిచ్చే చాలీచాలని జీతంతో ఊర్లో అడుక్కోవడానికి బయల్దేరతాడు. గ్రామంలో ఉండే యడ్ల పోతినాయుడు ఆదెయ్యను చూసి -

"గంటల లారీ (ఫైర్ ఇంజన్) లాగా ముందు పద్యం, రాగమొచ్చేది. యెనకాల మీ నాయిన వొచ్చీవోడు. నువ్వేట్రా, వొక పజ్జెం లేదు, వొక పాటా లేదు. అడుకున్నోడిలాగ - అమ్మా అనరుస్తావు" అని హాస్య మాడబోతే, ఆదెయ్య తాను అడుక్కునేవాడినేనని సమాధానమిస్తాడు. గ్రామసేవకుడిగా నామకరణం చేసినా, చాలీ చాలని జీతంతో ఊర్లో అడుక్కునే పరిస్థితి ఎదరవుతుంది.

వస్తువ్యామోహం :

ప్రపంచీకరణ ప్రభావం వలన ప్రజల జీవనంలో అనేక మార్పులొచ్చాయి. టి.వి.లలో వచ్చే వ్యాపార ప్రకటనలకి ఆకర్షింపబడి మన మూలాలను మరిచిపోతున్న విధానం 'మమకారం' కథలో ఈ విధంగా కన్పిస్తుంది.

"ఏడుస్తున్న మనవరాలని ఎత్తుకొన్న రాజులమ్మ "చూసేవా? నడుం విరుస్తోంది! కడుపులో నొప్పే..... అజీర్ణం నొప్పి అది! వామూ, జీలకర్ర పొడిచేసి.... పాలల్లో మలివెచ్చగా వేడి చేసి పడితే ఠక్కున తగ్గిపోతుంది"[9] అంటే "ఇప్పుడవన్నీ యెక్కడ తేనూ? టీవిలో చెప్పారుగా గ్రైప్ వాటరుంది. అదే పడదాము" అని కోడలు సద్దుణ సమాధానమిస్తుంది.

ముందురోజుల్లో వైద్యానికి ప్రకృతి సిద్ధమైన పసుపు, జీలకర్ర, వాము, వేప, తేనె మొదలైన తగుపాళ్ళలో కలిపివాడేవారు. అవి ఆరోగ్యరీత్యా మేలు చేసేవి. రాజులమ్మ భారతీయ సంస్కృతికి ప్రతీకగా మాట్లాడితే, కోడలు అచ్చమైన ఆధునిక జీవితానికి ప్రతీకగా మాట్లాడుతుంది. నిజానికి పైన చెప్పిన పదార్థాలే గ్రైప్‌వాటర్‌లోను ఉండేవి. ఆకర్షణీయమైన ప్రకటనలకి ఈ తరం ఎలా మోస పోతున్నదీ కన్పిస్తుంది ఈ కథలో.

ఈ విధంగా ప్రపంచీకరణ ప్రభావం నేటి ఆధునిక జీవితంలో ఎలా కొనసాగుతుందో, దాని పర్యవసనాలు ఎలో ఉంటాయో అప్పల్నాయుడుగారు తమ కథలలో చూపెట్టారు.

❖ ❖ ❖

తెలుగు సాహిత్యంలో జీవన నైపుణ్యాలు

– డి. రూతమ్మ, తెలుగు పరిశోధక విద్యార్థి, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ.ప్ర), కర్నూలు.

మంచి చెప్పడం మానవులు నడుచు కోవాల్సిన పద్ధతులను సూచించడం సాహిత్యం యొక్క ముఖ్య లక్ష్యాలలో ఒకటి. అయితే ఈ హితబోధలో ఎవరికైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా "ఏం చెప్పాము ?" అనేది ఎంత ముఖ్యమో, ఎలా చెప్పాము అనేది కూడా అంతే ముఖ్యం. వేదాలు అధికారంతో ఆజ్ఞాపిస్తే, పురాణాలు మిత్రుల్లా బోధిస్తే, కావ్యాలు ప్రియురాలిలా హితం చెబుతాయని పెద్దలు అంటారు. అలా ప్రియంగా హితం చెప్పడంలో తెలుగుసాహిత్యం ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంది.

తెలుగుసాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం గురించి విపులంగా చర్చించే ముందు వ్యక్తిత్వ వికాసం అనే మదానికి అర్థం పూర్వానికి ఇప్పటికీ మారుతూండటాన్ని మనం పరిగణనలోకి తీసుకోవాలి. సాంప్రదాయ యుగంలో ధర్మంగా జీవించడం, నీతిగా జీవించడమే వ్యక్తిత్వ వికాసానికి పరాకాష్ట అత్యున్నత స్థితి.

వ్యక్తిత్వ వికాసపరంగా తెలుగు సాహిత్యాన్ని చూసినప్పుడు మన కావ్యాలన్నీ ధీరోదాత్తులు, ధీర శాంతులు, ధర్మానికి బద్ధులు అయిన కథానాయకులు పాత్రల చుట్టూ తిరుగుతూ ఉండేవి. పాత్రలలో అత్యధిక భాగం ధర్మాన్ని ఆచరించేందుకు మొగ్గుచూపేవారే అయి ఉండేవారు. అదర్శ ప్రాయమైన వ్యక్తులంటే ధర్మానికి బద్ధులైన వారే. రామాయణంలో రాముడు, భారతంలో ధర్మరాజు, మనుచరిత్రలో ప్రవరుడు, భట్టి విక్రమార్కులు ఇలా చాలా మంది ఉన్నో కష్ట నష్టాలకు ఓర్చి ధర్మాన్ని అనుసరించినవారే. మాట మీద నిలబడటం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, వయసులోనూ, జ్ఞానంలోనూ పెద్దవారు తనకన్నా బలంలోనూ, ధనంలోనూ చిన్న వారైనా వారిని గౌరవించడం, ఇవీ ఆనాటి ధర్మంలోని ముఖ్యా,శాలు. ధన సంపాదన, రాజ్య సంపాదన తప్పని కానీ, కూడని పనులని కానీ చెప్పలేదు. వాటిని సాధ్యమైనంత ఎక్కువగా, ధర్మబద్ధంగా సంపాదించాలని చెప్పారు.

తెలుగు సాహిత్యంలో ఆధునియుగంగా భావిస్తున్న సమయంలో సాహిత్యలక్ష్యం సామాజిక దురాచారాలను రూపుమాపడం, దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడం అనే రెండు పనులను పడుగుపేకలుగా నిర్వహించేందుకు ప్రయత్నించింది. సమాజంగానే అప్పటి కథానాయకులు మూఢాచారాలను ఖండించేవారుగా దేశంకోసం సర్వస్వం త్యాగం చేసేవారుగా ఉండేవారు.

దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషు లోయ్ అని చెప్పిన గురజాడ అదే గేయంలో పూను స్పర్ధలు విద్యలందే, వైరములు వాణిజ్యమందే అని ఆరోగ్యకరమైన పోటీతత్వం ఎలా ఉండాలో చెప్పాడు. దానితో పాటే సొంతలాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడవోయ్ అనే సందేశాన్నిచ్చాడు. ఇదే సూత్రం వ్యక్తిపరమైన అంశాలలోనూ చాలా కాలం కనబడింది.

కుటుంబం కోసం, స్నేహితుల కోసం, ప్రేమికుల కోసం తమవి అనుకున్నవాటిని త్యాగం చేసే హీరో, హీరోయిన్ పాత్రలు మనకు 1980ల వరకూ అన్ని రకాల సాహిత్యాలలోనూ కనబడేవని అందరికీ తెలిసిందే. గాంధీ ప్రభావంతో నిరాడంబరత, అహింస కూడా మంచి వ్యక్తిత్వానికి లక్షణాలుగా గుర్తించబడ్డాయి. ఆస్తి సంపాదన కానీ, మరో వ్యక్తిగతమైన విజయం కానీ, దానికేదైనా సామాజిక ప్రయోజమనముంటే తప్ప వాటిని గొప్ప విషయాలుగా అంగీకరించేవారు కాదు. చట్టం గురించిన పట్టింపు కూడా అంతగా కనిపించదు. ఇదంతా

1880 నుంచి 1980ల మధ్య తెలుగుసాహిత్యం సంగతి. 1980ల తర్వాత సమాజాన్ని త్యాగాల ద్వారా మార్చలేము, సమాజాన్ని మార్చేందుకు ప్రయత్నించడమో, అది జరిగే వరకూ ఎదురు చూడటమో చేయకుండా తన చుట్టూ ఉన్న పరిస్థితులను అంగీకరిస్తూనే తాను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిచెందాలి అనే ఆలోచన బయలు దేరింది.

ఆధునిక సమాజంలో విద్యార్హతలు మాత్రమే సరిపోవు. ఉన్నత చదువులు, పట్టాలతోనే ఉద్యోగాలు రావు. విద్య, విజ్ఞానానికి జీవన నైపుణ్యాలు తోడైతేనే రాణిస్తారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వృత్తి కౌశలాలు, సామాజిక నైపుణ్యాలకు విశేష ప్రాధాన్యత ఏర్పడింది. ప్రైవేటు, కార్పోరేట్ ఉద్యోగాల ఎంపికలో వ్యక్తిత్వానికి పెద్దపీట వేస్తున్నారు. వ్యక్తి దృక్పథ,, ప్రవర్తన, ఆలోచనా తీరు, వ్యవహార శైలి, భావవ్యక్తీకరణ, సృజనాత్మకత, నిర్వహణా సామర్థ్యం లాంటి అంశాలను పరిశీలిస్తున్నారు. వృత్తి, ఉద్యోగాలకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పలు మానసిక నైపుణ్యాలు కావాలంటున్నారు. వాటినే జీవన లేదా మృదు నైపుణ్యాలుగా వ్యవహరిస్తున్నారు.

మనకు నిత్య జీవితంలో, ఉద్యోగ నిర్వహణలో ఎన్నో సమస్యలు, సవాళ్ళు ఎదురవుతుంటాయి. మానసిక ఒత్తిళ్ళు సంఘర్షణలు, సంక్షోభాలు తారసపడుతుంటాయి. అనేక అవసరాలు ఏర్పడుతుంటాయి. వీటన్నింటిని ఎదుర్కొడానికి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం, నైపుణ్యాలు అవసరమవుతాయి. సమాజంలో బాధ్యతాయుతంగా పనిచేయడానికి, గౌరవంగా జీవించడానికి, ఆనందాను భూతులు పంచుకోవడానికి అనేక అంశాలు తోడ్పడు తాయి. ఇలాంటి సున్నితమైన అంశాలనే జీవన నైపుణ్యాలంటారు. ఈ నైపుణ్యాలలో కొన్ని సమాజంగాను, మరికొన్ని సమాజం ద్వారా, ఇంకొన్ని పరిసరాల ద్వారా సిద్ధిస్తాయి. అయితే అవసరమైన ప్రతి నైపుణ్యాన్ని శిక్షణ, సాధన ద్వారా అలవర్చుకోవచ్చు.

యాంత్రిక జీవనం అలవాటుగా మారిన ఈ రోజుల్లో మానవ సంబంధాలు, నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు కొరవడుతున్నాయి. దీంతో ఇంటా, బయటా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వీటి అవసరాన్ని గుర్తించి పెంపొందించుకున్న వారు మాత్రమే ఎంచుకున్న రంగాలలో విజయ శిఖరాలను అధిరోహించగలరని పలు అధ్యయనాలు బుజువు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మానసిక నిపుణులు, వ్యక్తిత్వ వికాస శిక్షకులు ప్రభావిత శక్తులుగా మారుతున్నారు. వ్యక్తిత్వ నిర్మాయం, నైపుణ్యాల వృద్ధి అన్న అంశాలు మానవ వనరుల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. దీంతో శిక్షణ ఒక వృత్తిగా బలపడుతున్నది.

సామర్థ్యమే నైపుణ్యం :

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం ప్రతిరోజు ఎదురయ్యే అవసరాలు, సవాళ్ళను సమర్థవంతంగా పరిష్కరించుకోవడానికి అవసరమైన ప్రవర్తనాపర అంశాలే జీవన నైపుణ్యాలు. యూనిసెఫ్ సంస్థ పేర్కొన్నట్టు విజ్ఞానము వైఖరి సామర్థ్యాల మధ్య సమతుల్యత సాధనకు నైపుణ్యాలు తోడ్పడుతాయి. ఈ నైపుణ్యాలు ఒక రోజులో వృద్ధి చెందవు, మరొక రోజుతో తీరిపోవు. ఈ నైపుణ్యాల అవసరం, అభివృద్ధి జీవిత కాలం నిరంతరాయంగా కొనసాగుతుంది. ఈ నైపుణ్యాలు విస్తృత సంఖ్యలో ఉన్నాయి. అయితే నిత్య జీవితంలో మనకు కావలసిన వాటిలో ప్రముఖంగా కొన్నింటిని చెప్పుకోవచ్చు. స్వీయ అవగాహన, సహానుభూతి, ఆత్మ విశ్వాసం, లక్ష్య నిర్దేశం, సానుకూల దృక్పథం భావ వ్యక్తీకరణ, పరస్పర సంబంధాలు ఉద్వేగ నియంత్రణ, ఒత్తిళ్ళ అదుపు, సంప్రదింపులు, నిర్వహణ, పాలనా సామర్థ్యం లాంటి అంశాలు ప్రధానమైనవిగా చెప్పవచ్చు. వీటితో పాటు దాదాపు 60 అంశాలను మృదు నైపుణ్యాలుగా మేధావులు గుర్తించారు. అయితే చేసే పని, వృత్తి, ఉద్యోగాన్ని బట్టి కనీస నైపుణ్యాలను పెంపొందించు కోవలసిన అవసరం ఉంది.

జీవన నైపుణ్యాలు ప్రతివారికి విజయ సోపానాలవుతాయి. వృత్తి, ఉద్యోగం, సేవ, వ్యాపారంలాంటి ప్రతి

చోట రాణించేందుకు నైపుణ్యాలు తప్పననిసరి. సాంకేతిక ప్రగతి సాధించిన సమాచార జగతిలో పోటీని తట్టుకోవడానికి, ప్రత్యేక నైపుణ్యాలు చాల అవసరం. విశ్వ కుటీరంలో విజేతల మీద జరిగిన పలు అధ్యయనాలలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అందుకే ప్రతి సంస్థ తమ వద్ద పని చేసే ఉద్యోగులకు తప్పన సరిగా వికాస శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఉద్యోగుల ఎంపిక సమయంలోనే నైపుణ్యాలను అంచనా వేస్తున్నది. నిరంతరం అనేక మార్పులకు గురవుతున్న మానవ ప్రపంచంలో ప్రతి వారు ప్రతిభా పాటవాలు, శక్తి సామర్థ్యాలను స్వంతం చేసుకోవలసి వస్తున్నది. అందుకే పెద్ద, పెద్ద కార్పోరేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఉద్యోగుల్లో నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణా సంస్థలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. చిన్నా, చితక సంస్థలు సైతం నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించుకుంటాయి. ఒక్కొ శిక్షణా నిపుణునికి రోజుకు ఐదువేల నుంచి యాభై వేల వరకు వెచ్చిస్తున్నాయి. ప్రైవేటుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే కొందరు ప్రముఖులు రోజుకు ఐదు లక్షల రూపాయల వరకు గడిస్తున్న సందర్భాలు ఉన్నాయి.

ప్రతి సంస్థ ప్రగతి, దాని వినియోగదారులు, ఖాతాదారులు ఇతరుల సంతృప్తి, సహకారాలపై ఆధారపడి ఉంటుంది. వారిని ఆకర్షించి, ఆకట్టుకుని, నాణ్యమైన సేవలందిస్తూ కాపాడుకోవలసి ఉంటుంది. సంస్థలోని ఒక ఉద్యోగి లేదా సంబంధించిన వ్యక్తి తప్పు చేస్తే, వినియోగదారుడు సంస్థకు దూరమయ్యే ప్రమాదముంది కాబట్టి సంస్థలో పని చేసే ప్రతి వ్యక్తి బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంటుంది. సంస్థ పేరు ప్రతిష్టలు ఎంత పెరిగితే అంతగా లాభాలను ఆర్జించవచ్చు. ఏవో కొన్ని సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కీర్తి నార్జించి, ప్రఖ్యాతి పొందవచ్చు అనుకోవడం ఎల్ల వేళలా కుదరదు. స్వీపరు, వాచ్‌మేన్ నుంచి సంస్థ అధిపతి వరకు ప్రతి వ్యక్తి ప్రవర్తన సంస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు గుర్తించారు. వస్తువుల నాణ్యత, మన్నికతో పాటు, ఉద్యోగులు, సిబ్బంది వ్యవహార శైలి కూడ ప్రధాన భూమిక పోషిస్తుంది.

నిపుణులకే అవకాశం :

ఉద్యోగాలిచ్చే సంస్థలు విద్యార్హతలు, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలను పరిశీలిస్తున్నాయి. గతంలో లాగా మార్కులు, ర్యాంకుల ఆధారంగా ఎంపిక చేయడం తగిపోతున్నది. ఉద్యోగార్థులను ముఖాముఖి పరిశీలించే సమయంలో మానవ వనరుల అభివృద్ధి ప్రముఖులు, మానసిక నిపుణులు అనేక అంశాలను పరిశీలిస్తున్నారు. వైఖరి, ప్రవర్తన, భావ వ్యక్తీకరణ, సామర్థ్యాలను ప్రత్యేకంగా గమనిస్తున్నారు. ప్రతి వ్యక్తి ప్రదర్శించిన నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సివిల్ సర్వీసెస్, గ్రూపు పరీక్షల అనంతరం నిర్వహించే ముఖాముఖిలో మానసిక, వ్యక్తిత్వ, నైతిక అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కార్పోరేట్ సంస్థలు నైపుణ్యాలకే పెద్ద పీట వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బి.టెక్, ఎం.టెక్, ఎం.బి.ఎ., ఎం.సి.ఎ, ఇతర పట్టాలు పొందిన వారిలో అధిక శాతం తగిన ఉద్యోగాలు పొందలేక పోతున్నారు. నైపుణ్యాల లేమి వారిని నిరుద్యోగులుగా మిగిలి పోవడానికి కారణమవుతున్నది. కాబట్టి విద్యార్థులకు తోడు నైపుణ్యాలు పెంపొందించుకోవడం తప్పని సరి అవుతున్నది. ప్రతి రంగంలో భావ వ్యక్తీకరణ నైపుణ్యం ప్రధాన అంశంగా మారింది. అలాగే నలుగురిని కలుపుకుని పని చేయడం, పరస్పర సంబంధాలు నిర్వహించడం, సంప్రదింపులు సాగించడం అలవర్చుకోవలసి ఉంది. సమయ పాలన, హుందా పూరింతా అలంకరణ, శరీర భాషలపై శ్రద్ధ వహించాలి. మానసిక ఒత్తిళ్ళను అధిగమించడం, ఉద్యోగాలను నియంత్రించుకోవడంపై పట్టు సాధించాలి. హావభావాల వ్యక్తీకరణ, సభ్యత సంస్కారాలు, విలువలు పాటించాలి. సృజనాత్మకంగా ఆలోచించడం, సమస్యలను పరిష్కరించడం, నిర్ణయాలు తీసుకోవడంలో నేర్పు ప్రదర్శించాలి.

దీనికోసం ప్రతి వ్యక్తి ప్రత్యేక శ్రద్ధ చూపాలి. తనలోని శక్తి సామర్థ్యాలు, బలాలు, బలహీనతలు, నైపుణ్యాలు, లోపాలను అంచనావేయాలి. అవసరమైతే కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, నిపుణుల సహాయం తీసుకోవాలి. బలాలను పెంచుకుని లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. శిక్షణా శిబిరాలు, సదస్సులు, వర్క్ షాపుల్లో పాల్గొని నైపుణ్యాలకు సాన పట్టుకోవాలి. చాలమంది వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం, నైపుణ్యాలను పెంచుకోవడం అంత సులభం కాదని భావిస్తారు. సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే మార్పు, నేర్పు సుసాధ్యమని స్పురిస్తుంది. మంచి శిక్షకులు, నిపుణుల మార్గదర్శనంలో ప్రతివారు నైపుణ్యాలను నేర్చుకోవచ్చు. అయితే అందుకు స్వయం సంసిద్ధత అవసరం స్వీయ అవగాహన ముఖ్యం. నేర్చుకోవాలన్న తపన, పట్టుదల, ఆసక్తి, కృషి, సాధన తప్పనిసరి.

ప్రతి నైపుణ్యం నేర్చుకుంటే అలవడుతుంది. ప్రదర్శించే స్థాయిలో కొంత భేదాలున్నప్పటికి ప్రతివారు నైపుణ్యాలను సంతరించుకోవచ్చు. మంచి పుస్తకాలు చదవడం, విషయాలు గ్రహించడ,, కలసి పని చేయడం ద్వారా నైపుణ్యాలు వంట బడుతాయి. ఇతరులను ఆదర్శంగా తీసుకుని కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. స్ఫూర్తి, స్వయం ప్రేరణతో నైపుణ్యాలు సాధించవచ్చు. ఇతరులు చేసే విమర్శలు, ఎత్తి చూపే పొపాలను మనస్ఫూర్తిగా స్వాగతించి సరిదిద్దుకోవాలి. నిరంతరం తనపట్ల తాను స్పృహ కలిగి ఉండాలి. ఇతరుల నుంచి వచ్చే అభినందనలు, స్పందనలు, ప్రతి స్పందనలు విశ్లేషించుకోవాలి. శారీరక ఆరోగ్యం, మానసిక అభివృద్ధి, సామాజిక స్పృహపట్ల శ్రద్ధ వహించాలి. నిత్యం ఎదరయ్యే అనుభావలను విశ్లేషించుకుంటూ, సామర్థ్యాలను మెరుగు పరచుకుంటూ పోతే జీవన నైపుణ్యాలు, జీవనంలో భాగమైపోతాయి.

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో రుబాయి కవితాస్థానం

– ఆర్. కుమత, తెలుగు పరిశోధక విద్యార్థి, కె.వి.ఆర్.ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ.ప్ర), కర్నూలు.

రుబాయి కవిత సుమారు వేయినంవత్సరాల వెనుకటిది. అది కూడ అరబ్బీప్రాంతంలో అప్రయత్నంగా ఆవిర్భవించిన మేలి ప్రక్రియ. 7వ శతాబ్ధపు "రూద్కీ" ఆదికవిగా భావింపబడుతున్నాడు. అరబ్బుల దండ యాత్రల ఫలితంగా ఈ ప్రక్రియ ఫార్సీలో సహితం ప్రవేశించడమే కాక స్వీయసంస్కారాలన్నింటితో విస్త రించింది. అప్పటివరకు అరబ్బీయే రాజభాష తర్వాత ఫారసీకులు అరబ్బులను తరిమివేసి తమ దేశాభాషను రాజభాషగా చేసుకున్నారు. అయినప్పటికి అరబ్బుల సమయంసంప్రదాయాలు ఫార్సీలో పాదుకొనిపోయాయి. అందుచేత ఫార్సీలో ఏ కవితను తీసుకున్నా అరబ్బీ సంస్కారముద్ర పరోక్షంగా దాగి వుంటుంది. క్రమంగా ఫార్సీ సమయసంప్రదాయాలు ఉర్దూలోకి ప్రవేశించడమే కాక చక్కగా విస్తరించాయి. ఉర్దూ కవితాసంప్రదాయాలు దాదాపు అన్ని భాషల్లోకి వ్యాపించాయి. ముఖ్యంగా తెలుగుభాషలోకి మృదువుగానే ప్రవేశించి ఇక్కడి కవితాపరిధిని వృక్షోపమానంగా పెంచాయి. తెలుగువారు ఆ సంప్రదాయాలకు పూర్తిగా ఆకర్షింపబడి సందర్భాను సారంగా అనువదించారు. తెలుగుకవితలో ఆ నాడిని ప్రవహింపచేశారు. ఇటీవల సొంతకవితలనే ఆ ప్రక్రియలపేర్లతో రచించి ప్రపంచమంతా వ్యాపింప చేశారు. ఒక తెలుగుకవి ఇలా అంటున్నాడు.

'ఏ దేశసంస్కృతి అయినా, ఏనాడూ కాదొక స్థిరబిందువు
నైకనదీనదాలు అదృశ్యంగా కలిసిన అంత స్సింధువు'

నిజమే మరి ! నేడే కాక మునుపు కూడ ఇలాంటి భావాలు క్వాచిత్కంగా మాత్రమే కనిపించాయి. ఒక్కొక్క దేశం ఒక్కొక్కసంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. దానిని శాశ్వతమని చెప్పలేము. దేశందాక కూడ పోనక్కరలేదు. ఒక్కొక్క రాష్ట్రానికి సహితం నాటి అభిరుచులకు తగ్గట్లుగా సంస్కృతి ఏర్పడుతుంది. దీనిని కూడ శాశ్వతమని చెప్పలేము. ఎందుకనగా ఏ సంస్కృతికి బలపైనపునాది వుంటుందో, అది మాత్రమే చాలాకాలం నిలుస్తుంది. నా సంస్కృతిగొప్పదని, తక్కినవి గొప్పవి కావని, మేమే గొప్పవాళ్ళమని ఇతరులు అల్పులని భావించడం అజ్ఞానమేకాక, అపాయకరం కూడ.

నేలమీద నీటికాలువలు, వడియాలు, నదీనదాలు మరెన్నో జలాశయాలు ప్రవహిస్తుంటాయి. కొన్ని నీటి మడుగులు వున్నట్లుండి అక్కడే ఇంకిపతున్నాయి. ఇంకా సముద్రాలు భూగోళం చుట్టూవున్నాయి. వాటి పేర్లు మాత్రమే వేరు. కొంత రంగు కూడా వేరు. ఉదా :- ఎర్ర సముద్రం కొంత ఎరుపుగా వుంటుందట. గంగానది ఒకా నొకచోట బంగారువన్నెతో ప్రవహిస్తుందట[2]. ఆ కాంతిని 'జాతరూపం' అంటారు. ఇలా నీళ్ళకు ఆ నేల విధానాన్ని బట్టి కాంతి మారుతుంది. దేశసామీప్యాన్ని బట్టి పేర్లు మారుతున్నాయి. భూభాగం చాలా చిన్నది. సముద్రజలమే చాలా అధికమైనది. ఆ సముద్రజలమే పలుప్రాంతాల్లో ఒక రకమైన వడపోతనీటిగా పరిణమించి, కురిసి నదీనదములుగాను, నీటిపడియలుగాను, సముద్రాలు గాను పిలువబడుతున్నది. అట్టడుగు భాగానికి వెళ్ళి రుచిభేదాలకు అతీతంగా చూస్తే నీరంతా ఒక్కటే. దాని పరిణామస్వరూపమే పైవన్నీ !

విశ్వైకదృష్టి :

ఫార్సీ, ఉర్దూకవులు ఈ సమస్త ప్రపంచాన్ని ఒక 'పానశాల'గా భావించిరి. మరికొందరు పూలచెట్టుతో పోల్చి మానవులందరినిఅందమైన బుల్బులు పక్షులుగా ఆరోపించిది. ఆకాశాన్ని బోరగిల్లినగిన్నెలాగా ఉన్నదని. అది కూడ

సాక్షీతిరస్కారానికి సూచకమని భావించిరి. ఈ కారణంగా చింతిస్తూ ఈ బ్రహ్మాండమెంతో ఇరుకైనదని, అది చీమగ్రుడ్డు కన్న చిన్నదిగా ఉన్నదని అభిప్రాయాపడిరి. మసీదు ప్రక్కనే మధుశాల వుండవచ్చని కొందరంటే, అసలు మసీదు, మధుశాల ఈ రెండింటి కంటె నిరాకారోపాసనమే మేలని కూడ ప్రకటించిరి. ఈ భూగోళాన్ని ఒక పక్షిగూడుతోను. ఆటబంతితోను ఆరోపించిరి. ఇంత చిన్నస్థలంలో శాంతిదేవతకు స్థానం కల్పించాలని, మానవులందరు కలసిమెలసి జీవించాలని అప్పుడే విశ్వవృక్షం వచ్చగా, పాదశాలవలె నులివెచ్చగా ప్రశాంతికి నిలయమవుతుంది.

తెలుగురుబాయి కవులు విశ్వాన్ని సరికొత్త దార్శనిక నేత్రంతో చూశారు.

'విశ్వాన్నే కాగితముగా చేశాను
నదులను భావాలుగా చేశాను
నక్షత్రాలన్నిఐటిని అక్షరాలుగ చేసి
సరికొత్తగ కావ్యసృష్టి చేశాను'

- అంటున్నాడు. కనుక విశ్వప్రతీక పలువిధాలుగా మారిపోయింది. ఒకప్పుడు పానశాల ఫార్సీ, ఉర్దూభాషల్లో విశ్వానికి ప్రతీక. తర్వాత వికసించిన పుష్పవృక్షం ప్రపంచానికి ప్రపతీక. మరొక్కసారి చీమగ్రుడ్డుకు ప్రతీక. తెలుగురుబాయిలో కాగితము ప్రతీక. కాగితము చతురస్రాకారములో వుంటుంది. మరి విశ్వం వలయాకారముగా వుంటుంది. ఈ పోలిక సమంజసముగా వుంటుందా ! అనుకోరాదు. కాగితం ప్రతీక మాత్రమే. ఇక్కడ కాగితం ముఖ్యంకాదు. కాగితంలో వుండేవి ముఖ్యం. అక్కడ ఏమున్నాయి ? పదునైన భావాలున్నాయి. అవే నదీనదాలు. పైగా నక్షత్రాలు అక్షరాలుగా దిగివచ్చాయి. ఇక సరికొత్త కావ్యసృష్టికాక మరేమౌతుంది ? కవితాసృష్టిలో విశ్వమంత కలిపి ఒక కాగితమే తప్ప మరేమి కాదు. అందలి భావాలే - భావసామరస్యాలే ఇలా ప్రపంచాన్ని పానశాలగాను, వృక్షంగాను, బంతిగాను, కాగితంగాను పోల్చుతూ రావటం. దాని పరిణామానికి నిదర్శనం. అందుచేత తత్త్వగురువులు చెప్పినట్లు కాలం లేదా ప్రపంచం పరిణామశీలమైనది.

తెలుగు కవులు ఈ సామరస్యాన్ని పోషించే నిమిత్తం పోటీపడి ఫారసీ, ఉర్దూరుబాయీలను తెలుగుభాషలకి అనువదించారు. అక్కడి సమయసంప్రదాయాల గుమగుమలను చవిచూశారు. తక్కిన భాషలకు కూడ ప్రసరింప జేసారు. ఎందుకనగా రుబాయికవితతో ప్రకటమైన భావాలు నదీనదాలు విశ్వజనీనతను చాటుతున్నాయి. ఒకప్పుడు ఖయాం రుబాయీలను అనువదిస్తూ తత్త్వాలను, నీతులను చెప్పటానికి ఈ రుబాయి ప్రక్రియ అనులైనది అన్నాడు దువ్వూరి. అంతేకాక నేడు ఈ ప్రక్రియ విశ్వజనీనభావాలను చెప్పటానికి మేల్తరమైనప్రక్రియ అని చెప్పిరి. కాని తత్త్వంలో విశ్వం ఒక భాగమే. కావున విశ్వజనీనభావాలను తత్త్వమయంగా చెప్పే ప్రక్రియ 'రుబాయి'

దేశభక్తి – విశ్వైకభక్తి :

దేశభక్తి ప్రచారం ఎక్కువగా నినాదాలతో సాగుతుంది. మనుషులతో పాటు పశుపక్ష్యాదులు జలచర, భూచర, శూన్యచరములు కూడ దేశములో భాగములే. మునుషులు మాత్రమే కాదు. మరి గురజాడ 'దేశమంటే మనుషులోయయ్' అన్నాడు. మరి తక్కినప్రాణులు ఏమిగతి కావాలి. అట్లే మనుషులతో పాటు ప్రాణులన్నింటికి ఆధారంగా వుండే మట్టిని ఎందుకు విస్మరించాలి. సమస్త జీవులు పట్టింది మట్టినుంచే కావున దేశమంటే మట్టితో పాటు మనుషులు. అట్లే మనుషులతోపాటు సమస్త జీవరాసులు. వీకన్నింటితో పాటు సకల దృశ్యప్రకృతి కూడ. ఇవన్ని లేకుంటే మనిషి కూడ 'మనుగడ' సాగించలేడు. అందుచేత'దేశ' శబ్దానికి మరికొంత విస్తృతమైన నిర్వచనం అవసరమని తెలుస్తుంది. అట్లే సొంతలాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడాలన్నాడు అతడే. అది కూడ కొంత ఆలోచింపదగిన విషయమే. లాభాన్నే కాక ఉన్నదాన్నిసహితం పొరుగువారి యోగక్షేమాల కోసం త్యాగం చేయాలి. కొంతమాత్రమే కాక అవసరాన్ని బట్టి

అంతకూడ మానుకోవాలి. భాగవతమండలి బలిచక్రవర్తి అలా మానుకొని అంటే వున్నదంతా వామనమూర్తికి సమర్పించి తాను నిరాశ్రయుడైనాడు. అతని త్యాగ సంపూర్ణతకు మెచ్చి భగవంతుడు సుతలలోకాన్ని ప్రాప్తింప చేశాడు. అది స్వర్గంకన్న వేయిరెట్లు ఎక్కువ. కనుక లాభాలనే కాక మూలధనాన్ని, కొంతయే కాక అంతటినీ, ఇంకా అవసరమైతే తన్ను కూడ సమర్పించుకోవాలి. లేకుంటే స్వార్థం ఏ మూలకైనా నక్కివుండవచ్చు. అది విజృంభిస్తే చాలా వైపరీత్యాలు కలుగుతాయి. కనుక అచ్చమైన దేశభక్తికి పరిపూర్ణత్యాగమే నిదర్శనం.

గురజాడ మరోచోట దేశాన్ని చక్కటి వృక్షంతో పోల్చాడు.

'దేశమనియెడు దొడ్డ వృక్షం
ప్రేమలను పూవులెత్తవలెనోయ్'

అన్నాడు. మానవుల సోదరత్వాన్ని ఈ ప్రేమ శబ్దం చాటుతుంది. అంత సోదరులమై కలసిమెలసి మనుగడ సాగిస్తే ఇక తగాదాలు రావు. అదే శ్రేయోరాజ్యమంటే. కావున దేశభక్తి వుండాల్సిందే. కాని ఇది పరమావధికాదు. తద్వారా విశ్వైకభక్తికి ఆలోచనసాగాలి. మొదట దేశాన్ని దేహంగా భావిస్తున్నాడు తిరుమల.

'చెట్టుకు మట్టికి ఏమిటి సంబంధం
గువ్వకు గూటికి ఏమిటి సంబంధం
మాటకు నోటికి వుండే స్నేహమే
మనకూ దేశానికున్న అనుబంధం'

ఇక్కడ దేశానికి వ్యక్తికి వుండాల్సిన సాన్నిహిత్యాన్ని తద్వారా దేశభక్తిని కవి చెబుతున్నాడు. మట్టిలో నుంచే చెట్టు పుడుతుంది. ఇంకా దూరమేముంది. అట్లే గువ్వ గూటిలో విశ్రాంతి తీసుకుంటుంది. గూడుపోతే గువ్వకు ఆశ్రయం వుండదు. అట్లే మాటకు నోటికి మిక్కిలి సాన్నిహిత్యం. నోరు లేకుంటే మాట వస్తుందా ! ఇక్కడ చెప్పలేదు కాని దీపానికి, నూనెకు ఎంత అనుబంధం వుంటుందో దేశానికి మనిషికి అలా అవినాభావ సంబంధం వుంటుంది. కొందరు దేశాన్నంతా ఒక దేహంగా చెబుతారు. ఇది ప్రతీక మాత్రమే. మానవుల చైతన్యాన్ని జీవంగా చెబుతారు. కనుక మానవులు నివసించే దేశం వారికి, అతిసన్నిహితం. ప్రతిమానవుడు మిగిలిన వారికి అవసరమౌతున్నాడు. వ్యాపారస్థులు, శ్రామికులు, ప్రయాణీకులు, రైతులు, ఉద్యోగస్థులు, విద్యావేత్తలు, స్త్రీలు, పురుషులు, శిశువులు, వృద్ధులు, పశువులు, పక్షులు తక్కిన తిర్యక్కులు అన్నీ పరస్పరం అవసర మయ్యేవే. అన్నింటికి దేశంతో విడదీయరాని అనుబంధం వుంటుంది. లవలేశం కూడ వేరుగా వుండదు. కావున దేశాన్ని ఆరాధించాలి. అవసరమైతే అందుకసం ఆత్మా ర్పణం కూడ చేయాలి. తద్వారా విశ్వైకభక్తిని పెంచు కోవాలి.

'దేశం కన్నా ఖండం విశాలం
ఖండం కన్నా పెద్దది భూగోళం
భూగోళం ఖగోళం అన్నిటికన్నా
మంచి మనిషి ఆలోచన విశాలం'

కనుక దేశభక్తి నుంచి మరికొంత పెరగాలి. ఖండాం తరాల దాకా దృష్టి సాగించాలి. అలా ఖండాంతరదృష్టి ఏర్పడ్డాక భూగోళమంతా ఒక్కటే అనే దృష్టి రావాలి. ఆ తర్వాత మానవదృష్టి ఖగోళం దాకా పెరగాలి. ఇంక సంకుచిత భావాలకు అవకాశమే వుండదు. అలా అవకాశ ముంటే అతనిది కుటుంబదృష్టికాని, గ్రామదృష్టికాని, జిల్లా, రాష్ట్ర, ఖండ, భూగోళపరిధుల వరకు మాత్రమే వున్నట్లు. అప్పుడు కూడ చిన్నవో పెద్దవో తగాదాలు తగ్గుతాయి. ఒక కవి చెప్పినట్లు ప్రణయకలహాల నుంచి ప్రపంచ యుద్ధాల దాకా సాగిపోయే, గొడవలకు కారణం బట్టి విశాలదృష్టి లేకపోవడమే. ఇలా విశాలదృష్టిని పెంచే కవితలు కొన్ని లేకపోలేదు. ఖగోళపరిధివరకు మానవుల దృష్టి పెరగాలి అని చెప్పే రుబాయి ఇది.

ఇది కూడ చాలదు. ఎందుకనగా దృష్టి అంత పెరిగితే క్రిందవున్న వాళ్ళ దృష్టి ఎలా వుంటుందో. ఎప్పటికైనా, ఆలోచనా వైశాల్యాన్ని అభినందించాల్సిందే. కనుక

రుబాయికవిత మానవుని సదాలోచనకు పట్టం కడుతుంది. స్వార్థాన్ని నిరసిస్తుంది. అల్పవిషయాలకు కాక అధికవిషయాల పట్ల శ్రద్ధను ప్రసరిస్తుంది. ఇది ఇలా వుండగా కొందరిదృష్టి ఇలా పెరుగుతూ వుంటే మరికొందరి దృష్టి తరుగుతూ వుంటుంది. దేహం నాది అనుకున్నప్పుడు ఇక కాళ్ళు, చేతులు, తల, చర్మం అన్నీ నావే అయి వుంటాయి. మరి ప్రజలు ఇలా వుండరు. భారతదేశం నాదంటే మాత్రం ప్రజలు జేజేలు పలుకుతారు. ఇందులోని ఇండ్లు, కర్మాగారాలు, తక్కిన పంటపొలాలు, అస్తిపాస్తులు నావి అంటే తగాదాలకు వస్తారు. ఇంతకన్న సంకుచితభావం వుంటుందా. అలా వుండేవారిని నాజూకుగా అధిక్షేపిస్తుంది రుబాయి.

❖ ❖ ❖

ప్రాచీన ఆధునిక విద్యావిధానాలు - ప్రపంచీకరణ పాత్ర

– నారాయణదాసు మంజులచారి, కస్తూర్బా కళాశాల అధ్యాపకురాలు, నాగర్ కర్నూల్.

చదువని వాడజ్ఞుండు
చదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ
(భాగవతం - 8 - 130)

భారతీయుల ఆలోచన విధానంగా విద్య చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. యుగయుగాలుగా భారతదేశంలో విద్యార్జన కోసమే కాదు. అది వ్యక్తి మానసికోన్నతికి మార్గం. అది ముక్తి ఆత్మజ్ఞానానికి ద్వారం. ప్రకృతిని తరచి చూడడం. సృష్టి రహస్యాన్ని చేధించే అన్వేషణ భారతీయుల సాహిత్య రచనకు ప్రేరణ అయింది. తమ భావుకతనంత అక్షర రూపంలో పెట్టారు. మానవ జాతికి తరగని సంపదను కుర్చారు.

నాటి విద్యావిధానంలో శిష్యుడు గురువును అన్వేషించుకోవాలి. గురువు కుటుంబంలో ఒకడిగా జీవించాలి. అన్ని విధాల శిష్యుడు గురుపుత్రునితో సమానం. ఇక్కడ కృత్రిమమయిన తరగతి గదులుండవు. సహజమైన ఆశ్రమ వాతావరణంలో నగర జీవన విధానానికి దూరంగా ప్రశాంత పరిసరాలలో ఏకాంత నిశ్శబ్దంలో విద్యార్జన మొదలవుతుంది.

విద్య బాహ్య ప్రపంచ ఆధ్యయనానికి భిన్నంగా వ్యక్తి లోపలి ప్రపంచాన్ని తీసుకునే ప్రయత్నం అయ్యింది. విశ్వంలోని వివిధ భాగాలను ఒక్కొక్కటిగా అధ్యయనం చేసి విశ్వాన్ని తెలుసుకోవడం కంటే సమస్త జీవానానికి జ్ఞానానికి మూలం అయిన దాన్ని సూటిగా తెలుసుకునే ప్రయత్నం సరైనది అని భావించారు. కాబట్టి భౌతిక జ్ఞానం విద్యకు ప్రధాన లక్ష్యం కాదు, బావ్యా జగద్విషయక వస్తు జ్ఞానానికి భిన్నమైన జ్ఞానం కావాలి., బుద్ధిని భౌతిక ప్రపంచం నుంచి ఉపసంహరించాలి,ఇంద్రియాలపై ద్వారా ఉపరితలంలోని కల్లోలాలకు దూరంగా మనస్సు లోతుల్లోకి ప్రశాంతలోకి తీసుకెలుతుంది.

ప్రాచీన భారతదేశంలో ఆధ్యాత్మిక చింతన ఆత్మ జ్ఞానం ప్రధానం అయినప్పటికి లౌకిక విద్యలకు ప్రాధాన్యం ఉంది. విశ్వాన్ని నూక్ష్మంగా పరిశీలించి విశ్లేషించే ప్రయత్నం అద్భుతంగా జరిగింది. శాస్త్ర పరిశోధన దానితో పాటు కనుగోనే విషయాలను జీవితానికి అన్వయించడం సమర్ధంగా జరిగింది. నూతన ఆవిష్కరణలు వ్యక్తి స్వార్ధ ప్రయోజనానికి కాక విశ్వకళ్యాణానికి ఉపయోగించారు, వ్యష్టి సుఖశాంతులకు కాక సమిష్టి సుఖశాంతులను వాంచించారు.

గణిత, భూగోళ, ఖగోళ, వైద్య శాస్త్రాలు, ధర్మ శాస్త్రాలతో పాటు, వేదాంగాలతో పాటు వేదకాలంలోనే అభివృద్ధి చెందాయి. వేదంలో యజ్ఞవేది నిర్మాణం దగ్గర నుండి కాల గణనం దాక అనేక విషయాలు గణిత శాస్త్ర సంబంధమైనది.

యారవ్‌లో నాలుగు దశాబ్దాల క్రిందట వరకు పదివేలకు మించి సంఖ్యలు తెలియవు. ఋగ్వేథంలో శతసహస్ర సంఖ్య పలుమార్లు కనిపిస్తుంది. గణితంలో శూన్యం (0) భారతీయుల ప్రసాదమేనని అందరికి తెలుసు. భారతీయుల కాల గణనం కూడ సుప్రసిద్ధం కాలాన్ని నాలుగు యుగాలుగా విభజించారు.

జ్యోతిశ్య శాస్త్రం కూడ ఆధునికులను ఆశ్చర్య చకితులను చేయగలిగేదే. ఆర్యభట్టు వరహమిహిరుడు సుప్రసిద్ధులు.

ఆయుర్వేదంలో చరకుడు, సుశ్రుతుడు రచించిన సంహితలు సుప్రసిద్ధాలు, నాటి నుండి నేటి వరకు అసంఖ్యాకాకమైన రసాయన శాస్త్రంలో ప్రసిద్ధుడు. ఆర్థశాస్త్రంలో కౌటిల్యుడు, ఆయన రచనలు నేటి

ప్రామాణికాలు స్వయంభూ మనువు ధర్మశాస్త్రానికి ఆద్యుడు అని అంటారు. దాదాపు 5 వేకు పైగా ధర్మశాస్త్ర గ్రంధాలున్నాయి. అలంకార శాస్త్రానికి నందికేశ్వరుడు ఆద్యుడు నాట్య శాస్త్రం. అద్భుతంగా అలంకార శాస్త్ర గ్రంథంలో చాలానే గ్రంథాలు వచ్చాయి.

తెలుగు కవులు అనేక శాస్త్ర గ్రంథాలలో కళావిదుల మణి చెప్పుకిస్తారు. గత వెయ్యేల్ల సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇంతమంది కవులు పండితులు తయారు అవ్వడానికి తగిన విద్యా వ్యవస్థ లేకుండా ఎలా ఉంటుంది. రెండు దశాబ్దాల క్రిందట వరకు సంప్రదాయ బద్ధమైన విద్యా విధానం కొనసాగింది. ఇంగ్లీష్ పాలన వచ్చాక కూడా ఇది ఒక శాఖగా ఈ విద్య విధానం కొనసాగింది. అయితే అది సారస్వత లక్షణాలను మధ్య యుగాలలోనే కోల్పో వడం వల్ల అల్ప సంఖ్యాకులు మాత్రమే విద్యా ప్రయోజనాన్ని పొందారు.

భారత దేశంలో అమలు అవుతున్న విద్యకు ప్రజా అవసరాలు కాని, ప్రజాసమస్యలు కాని కొంత కాలం పట్టలేదు. కారణం విదేశీ పాలన విశ్వవిద్యాయాలలో ఇంగ్లీష్ భాష వాడకం.

నేటి విద్యకు ధన సంపాదన లక్ష్యం తప్ప మరోక లక్ష్యం లేకపోవడం ప్రధానంగా బాధించే విషయం. అందువల్లే ఏ చదువయితే ఎక్కువ డబ్బు సంపాదించ డానికి ఉపయోగపడుతుందో ఆ చదువు మనకు కావాలి తమ పిల్లలకు అటువంటి చదువు ఇప్పించడానికే తల్లిదండ్రులు తాపత్రయపడుతున్నారు. పిల్లలూ తల్లి దండ్రులు పోటీలు పడి శారీరకంగా మానసికంగా ఒత్తిడి లకు గురవుతున్నారు.

బౌద్ధిక శ్రమకూ, శారీరక శ్రమకూ సమాన విలువ ఉన్నప్పుడు ఈ పోటీ నుండి బయటపడగలం, అట్లాగే రకరకాల బౌద్ధిక శ్రమలకు రకరకాల శారీరక తప్పనిసరిగా ఇంతకంటే సంపన్నమయిన సమాజాన్ని సృష్టించగలమో లేమో చెప్పలేము కాని ఇంతకంటే సుఖ శాంతి యుతమైన సమాజాన్ని మాత్రం ఏర్పరచుకోగలం.

చదువుకున్నవాడు చేయవలసిన మొదటి పని. తాను చదువుకున్నది మరోకరికి నేర్పడం. ఈ ప్రాథమిక భార తీయ విద్యా వ్యవస్థ లక్షణాన్ని మరచిపోయాం. బోధన ఒక ప్రత్యేక వృత్తి అయినది. అది వృత్తి కావడం వల్ల గురు శిష్య సంబంధం అమ్మకం దారు కొనుగోలు దారు సంబంధంగా మారిపోయింది. గురు శిష్యుల మధ్య ధన సంబంధం ఏర్పడింది. గురువుకు శిష్యుణ్ణి ఎంచుకునే అధికారం శిష్యుడికి గురువును ఎంచుకునే అధికారం పోయాయి. మొత్తం సమాజంలో విస్తరించిన సర్వ దుర్లక్షణాలు విద్య వ్యవస్థకు కూడా సక్రమించాలి.

కానీ ప్రాచీన విద్యావిధానంలో శిష్యుడు గురు కుటుంబంలో చేరి పోవడం వల్ల తానెక్కడో గుంపులో పడిపోయిన ఏ కాకి భావం శిష్యుడిలో ఉండదు, శిష్యుడి మొదటి పని ఉదయాన లేవగానే అడవికి పోయి కట్టెలు ఏరుకొని రావడం, అగ్ని హోత్రానికి, యజ్ఞానికి సమిధలు తేవడం ద్వారా ఒక కార్యక్రమం పూర్తవుతుంది. యజ్ఞ గుండంలో అగ్నితో పాటు బ్రహ్మచారి మేధస్సు కూడా జ్ఞానాగ్నితో వెలుగుతుంది. తరువాత గురు కుటీరాన్ని శుభ్రం చేయడం గోష్ఠం శుభ్రం చేయడం బ్రహ్మచారి పని "ఇది శ్రమ విలువను తెలుపుతుంది". "శిష్యులలో భ్రాతృభావలను పెంపొందిస్తుంది". గోపాలన ఒక ప్రధాన విద్య, శిష్యుడు గురు గృహంలోనూ గోపాలనలోనూ పొందే విద్య భారతదేశంలో ప్రధాన విద్య. ఆవును గౌరవించడం నేర్చుకుంటాడు. ఆవు తల్లి తరువాత తల్లి అంతటిది రెండు మూడెకరాల భూమి ఒక ఆవు అన్నది సామాన్య భారతీయుడి ఆకాంక్ష. సత్యకామజావాలి మహర్షి తన బాల్యంలో గురు శుశ్రూషలో 400 గోవుల మందను 1000 గోవులకు వృద్ధి చేశాడు. నాటి ప్రధాన వృత్తి అయిన పశుపాలనలో ఇది శిక్షణ.

బ్రహ్మచారి చేయవలసిన మరొక పని భిక్షాటన ఎంత సంపద కలవాడయిన రాజకుమమరుడైన ఎవరైనా దానికి అపవాదం కాదు. గురువు వద్దకు నిర్ధనుడై వస్తాడు. గురువు చెప్పింది చేస్తాడు. శారీరక శ్రమ అ ప్రతిష్ఠాకారం కాదు.

భిక్షాటన అవమానకరం కాదు. చదువును కొనుక్కోవలసిన పని లేదు. అప్పులు చేయవలసిన పనిలేదు.

పోషకుల కోసం చూడవలసిన అవసరం లేదు. రాజ్యం మీద ఆధార పడవలసి, అవసరం అసలే లేదు. భిక్షాటన తనకోసం మాత్రమే కాదు. మొత్తం ఆశ్రమం కోసం ఇది బ్రహ్మచారిలో గొప్ప మానవతా విలువలను, వైరాగ్య భావనకు కలిగిస్తుంది. వ్యవస్థ పట్ల గౌరవ భావాన్ని కలిగి స్తుంది. ఆత్మ నెరిగిన వాడు దుఃఖాన్ని జయిస్తాడని "ఈ దుఃఖాలన్నిటికి నెలవైన జీవబంధం నుండి విముక్తి కోరుకోవడం భారతీయ విద్య లక్షణం" ప్రాచీన విద్య విధానం ఒక ఆచారణ యోగ్యమైనది, విద్యార్థికి శ్రద్ధ, అంకితభావం, నియమ నిబంధనలకు కట్టుబడి ఉం టాడు. ఈ ఋషి వాటికలే ప్రాచీన విధానాన్ని సంస్కృతిని నిర్మించాయి.

నేటి విద్యానేపథ్యంలో ఒక గుంపులో భాగం సమూహం పై పూర్తిగా ఆధారపడిన వారి, స్వయం వ్యక్తి వికాసం దాదాపు అసాధ్యం భావావేశాలు నిరుద్ధమై స్వార్థ పూరితుడవుతున్నాడు.

అయితే మళ్ళీ ఆదర్శాలలోకి నాటి విద్యా విధానంలోకి, ఋషి వాటి కల్లోకివెళ్దామా? వెళ్ళగలమా? లేక పోవచ్చు, కాని ఆ విలువల్ని ఆధునిక విద్యా విధానానికి అనుగుణంగా మలచుకునే ప్రయత్నం చేయవచ్చు.

పాశ్యాత్య జాతీయ వేర్పాటుకు, స్వార్థానికి అహంభా వానికి ప్రోది చేసింది. జాతీయ ఆదర్శాలు, సంప్రదాయా లను విడిచిపెట్టి ఏ విద్యావిధానము సఫలం కాలేదు. జాతీయ సంప్రదాయాలను పక్కకు నెట్టి పాశ్చాత్య విద్యా విధానాన్ని అవలంబించడం వల్ల మన విద్య ఆత్మను కోల్పోయిన శరీరం లాగా తయారయింది. మన సంప్ర దాయ భావధారలను కొనసాగించిన, సహజ పరిణామ క్రమంలో ఏర్పడిన విద్యా విధానాన్ని మనం అనుసరిం చడం లేదు. ఈ సంప్రదాయ ధార ఎక్కడో తెగిపోయింది. అరువు తెచ్చుకున్న లేదా పాశ్చాత్య ప్రపంచం మనమీద రుద్దినది అవలంబిస్తున్నాం. తత్ఫలితమే సమాజంలో మొత్తంగా ఏర్పడిన సంక్షోభం, మన విద్యా విధానాన్ని గురించి మనం పునరాలో చించుకోవాలి. మనకు కావల సిందేమేటిటో గుర్తించాలి. మన్న స్వంత పద్ధతిలో ఆధునికీ కరించుకోవాలి. మన సమాజ అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకోవాలి. అప్పుడే వ్యక్తికి, సమిష్టికి సమన్వయం కలుగుతుంది. సంక్షోభం తొలగుతుంది.

"చదువది ఎంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న
నా చదువు నిరర్థకంబు గుణ సంహితులెవ్వరు మెచ్చ
రెచ్చటన్"

రసజ్ఞానము లేని చదువు వ్యర్థమని ఎప్పుడో తెల్పారు. శతతకారులు విద్యావంతులే నేడు నిర్లిప్త భావాన్ని గురై చదువుకు తగ్గ ఉద్యోగం పొందలేదనో మీరే కారణం తోనో ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు.

సాపాటు ఎటూ లేదు పాడైనా పాడు బ్రదర్
రాజధాని నగరంలొ వీధి వీధి నీది నాది బ్రదర్
ఇక్కడ చావుకూడా పెళ్ళి లాంటిదే బ్రదర్
"పొట్ట కూటికే కదరా డిగ్రీలు"

పై పాటలో నిరుద్యోగం, పస్తులతో బాధపడుతూ వీథులు తిరిగే ఎన్నో వేల జీవితాలను 'చలన చిత్రాల' రూపంలో చూసి కథలు, నవలల రూపంలో చదవచ్చు ఫలితం సాధించే క్రమంలో ఎదురైన సమస్యల్ని చూపట్టు తుంది. అలాగే "ముద్దు రామ కృష్ణయ్య" "Eech one - Teach one" అనే నినాదం ఇచ్చే ముందు పరిస్థితులు ఆయన జీవిత చరిత్ర చదివితే తెలుస్తున్నది.

"ఎప్పటి చదువులు అప్పుడే
తప్పక చదువగ వలయున్
అటుగాకున్నన్ తిప్పలు తప్పవు
మీకున్ తప్పక తప్పదురు పరీక్షలందున్"

అలాగే ఇక్కడ "చదువు అంటే కేవలం పరీక్షల కొరకే" అన్న సూచన కనబడుతుంది. పరీక్షలు నేర్చిన అంశంలో ప్రోత్సాహం - ప్రేరణ మాత్రమే ఇవ్వగలవని గుర్తించాలి.

"స్పర్ధయా వర్ధితే విద్యా" అంటే ఆరోగ్య కరమైన పోటీ వల్ల పెరిగెదే విద్య అది కాస్త నేడు "వ్యాపారమైంది"

విత్త మూలం విద్య" ఇది కేవలం కొందరికి మాత్రమే అందుబాటులో ఉండేది.

మనం నేర్చిన వద్య కొంత గౌరవంచ కొంత జ్ఞానంచ కొంత ధనం ఇచ్చేటట్లుగా ఉంటే సరిపోతుంది. అప్పుడు ఈ పోటీ ప్రపంచపు వింత వెంపర్లాటలో మనం బొమ్మలు కాకుండా ఉండవచ్చు. ఈ పోటీని అందుకోక

నా చిట్టి చేతులు చక్కని రాతలు నేర్వ లేదయ్యో
నా సంక్కన మేడిత సాలురు వాల్లు దున్ని నాన్నయో.."
"చదవాలిరా ఎన్ని ఆటంకాలొచ్చినా చదువు లేకపోతే
మన బ్రతుకు పెద్ద సున్న"
"బంగారం కరిగిస్తే కోరుకున్న నగ
విద్యార్థి శ్రమిస్తే భవిష్యత్తు ధగధగ"

అనేల విద్యకు ప్రాధాన్యం ఇవ్వబడి రైతు వర్షానికి ఎదురు చూసినట్లు, విద్యార్థి నోటిఫికేషన్ లకు ఎదురు జూస్తూ ప్రయివేటులో పనిచేయలేక కలో గంజో తాగలేక దొరికిన పనల్లా చేయడానికి సిద్ధమైనారు నేటి విద్యార్థులు.

అక్షరాలు ఇసుకలో, బొగ్గుతో బలపం, పెన్సిలు, పెన్ను నుండి నేడు గణకయంత్ర గడీలో "కీ" బోర్డు రూపాంతరం చెందింది. విద్యలో మార్పు పర్యావరణ ఆర్థిక, వృత్తి విద్యలు చోటుచేసుకున్నాయి. వీటి వల్ల కొందరిలో మా స్థాయి ఇదే అన్న ధోరణి. ఆ చదువు మేం చదవలేము అనే ఒక తక్కువ స్థాయి ఆలోచన చేసుకొని ఓ గిరి గీసుకుంటున్నారు. కాబట్టి ఇది ఒక లోపం. మరి ఈ కోర్సులు లేకపోతే ఇక పైచదువులు కావుకదా బడి ముఖమే చూడని పరిస్థితి.

ప్రభుత్వం కే.జి నుండి పి.జి. వరకు ఉచిత విద్య అందించడంలో ఎన్నో పథకాలను తెస్తున్నది. కాని చదువుకు తగ్గ ఉద్యోగం లేక నిరుద్యోగ భృతిలో మళ్ళీ అసహాయులుగా మారిన వైఖరి. ఏదేమైన మార్పు కావాలి. మొదట్లో కొంత విఫలత చోటు చేసుకున్నా సమస్యను గుర్తించి సవరిస్తూ మందుకు వెళ్ళవచ్చు. ఏర్పడిన ఖాళీలను గుర్తించి ఏటా ఉద్యోగాలను భర్తి చేస్తూ ఉంటే ఏ విద్య ఉన్నతంగా జీవించవచ్చు.

వీధివీధికో ప్రయివేటు పాఠశాలలకు పర్మిషన్లు ఇస్తూ విద్యను అమ్ముకుంటున్న తీరును సమర్థించడం మళ్ళీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచాలని తుపై మొట్టి కన్నీరు తుడిచిన విధానం.

మమ్మీ డాడీల చదువులు
క్రమ్ముగ కాన్వెంటు లందు గుమ్మాచు మురియున్
అమ్మెవరికి కావలెను
మమ్మీ సంస్కృతి యే చాలు మహిలో కుమతి.

అంటూ ఆంగ్ల విద్యను అర్రు చూపుతూ అంగట్లో వస్తువు రాతిన విద్యను వ్యాపారం చేస్తున్న రీతికి వ్యతిరేకంగా అధికారి నుండి సామాన్యుని వరకు 'సర్కారు బడిలో' చదివే కఠిన నిబంధన తప్పనిసరి 'విద్యాహక్కు' అందరికీ అనేవి ఎందరో మహనీయుల కృషి ఫలితం, ఆ ఫలితం నిజంగా పేదవాడు అందుకుంటున్నాడా! సాపేతిక విద్యాలో పాటు సామాజిక విద్యా విస్తృతి అవసరం. ఏ కోర్సు కైనా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటే దానికి ప్రత్యేకమైన ప్రచారం అవసరం లేదు.

విద్య అనేది విస్తృతమైనది దానిని ఫలాలు ప్రజలందరికీ అందితే ప్రయోజతకత చేకూరుతుంది. జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. "విద్య నృపాల పూజితము" అని ఎప్పుడో నిరూపించబడింది. కానీ కాస్త మనమే వేరే అర్థంలో తీసుకొని "విద్య నృపాల పఠితము"గా అన్వయించుకున్నాము.

ఇక్కడ మారాల్సింది తరమా! లేదా తరాన్ని ముందుకు నడిపిస్తున్న మనమా? "దూరపు కొండలు నునుపు" మాదిరిగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదివించే

కోణంలో ఎక్కువ ఫీజు ఉంటే ఎక్కువ చదువుంటుందనే ఆలోచనలో పడుతున్నారు. కాబట్టి ఆలోచిద్దాం! ప్రభుత్వ బడికి పట్టం కడదాం! ప్రయివేటును వ్యతిరేకిద్దాం" చదువు చెప్పని పంతుల్ను ప్రశ్నిద్దాం! నేర్వని విద్యార్థిని మందలింపులో మార్చుకుందాం!

బడిలో పిల్లల శాతం పెరిగితే కొలువుల శాతం పెరుగుతుంది. కొలువులు వస్తే జీవితాలు బాగుపడతాయి. కాబట్టి ఉద్యోగ ప్రకటన కోసం కాక ఉద్యోగాలు సాధించుకునే ఉపాయాన్ని చేపట్టుదాం. మూలాల్లోకి వెళదాం మార్పు సాధిద్దాం.

ఆధార ఉపయుక్త గ్రంథ సూచి :

1. "భారతీయ విద్య" - డా॥ డి. చంద్రశేఖరరెడ్డి. ఎమెస్కో బుక్స్ ప్రచురణ. (విజయవాడ)
2. విద్యాదృక్పథాలు - తెలుగు అకాడమి ప్రచురణ. హైదరాబాదు.

❖ ❖ ❖

రుబాయి కవితలోని జ్ఞాన ప్రాధాన్యత

– ఎం. భవాని, తెలుగు పరిశోధక విద్యార్థి, కె.వి.ఆర్.ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ.ప్ర), కర్నూలు.

అరుదైన వన్నెతో వాసనతో భారతీయుల గుండెల్లో పదిలమైన తావును సంపాదించుకున్న ప్రసూనం గులాబి. ఇది ఇరాన్ నుంచి మన దేశానికి వలస వచ్చి స్థిరపడి పోయిందని పలువురి తలపోత. గులాబీ వలనే రబాయీ అనే ముక్తక జాతికి చెందిన కవితాప్రక్రియ ఇరాన్ నుంచి భారతదేశానికి సంక్రమించింది.ఎనిమిదవ శతాబ్దాలలో భారతీయులెందరో ఫారసి కవితను వెలయించిరి. అనివార్యంగా ఫారసిలో రుబాయీలు కూడా వెలువడినవి. ఫారసితోనూ, సంస్కృత ప్రాకృత అపభ్రంశ భాషల కలయికతోనూ బహువర్ణ కుసుమ మంజరిగా అవ తరించిన అచ్చమైన భారతీయ భాష ఉర్దూలో పదహారవ శతాబ్దం నుంచే రుబాయిలు వెలువడినవి. ఉర్దూభాషతో సమాంతరంగా వర్ధిల్లిన హిందీ భాషలో చౌపాయీ అని, అంగ్లంలో క్వాట్రైన్ అని, సంస్కృతంలో చార్‌చరణ్ అనే పేర్లతో రుబాయి అడుగులు వేసింది.

జ్ఞాన ప్రాధాన్యం :

వ్యక్తికి కాక జ్ఞానసంపత్తికి రుబాయిలో ప్రాధాన్యం వుంటుంది. బొండుమల్లె పువ్వు అగాధమయిన లోయల్లో పుడుతుంది. కొండచరియలపై చిన్న చిప్పరువు గడ్డిపువ్వు పుట్టుతుంది. మరి వీటికి పరిమళం వుంటుంది. ఒక్కొక్క సారి మానవనివాసాలకు దగ్గరనే ఉమ్మెత్తపూలు పుడ తాయి. తంగేడుపూలు వుంటాయి. వీటికి సువాసన వుండదు. అట్లే నదీనదాలు కూడ. పువ్వులు ఎక్కడ పుట్టేది అనవసరం. వాటి పరిమళమే ప్రధానం కవి 'తావి' చూసి. ఆచితూచి విలువలను ఇవ్వవల్సిందిగా బోధిస్తున్నాడు. ఇది పువ్వులను మిషగా చేసుకొని మనుషులకు చెప్పిన విషయమన్నమాట. అందుచేత మహానుభావుల పుట్టు పూర్వోత్తరాలను విస్మరించి వారిలోని జ్ఞానానికి పట్టం కట్టాలంటున్నాడు కవి. ఇలాంటివెన్నో వున్నాయి. అట్లే జ్ఞానాన్ని గ్రంథాల ద్వారా సేకరించుకో వచ్చంటాడు.

లోలోపలి చీకట్లను చంపేస్తాయి
స్వర్గాలను భూమిపైకి దింపేస్తాయి
వాడిపోని పువ్వులురా గ్రంధాలు !
తరతరాల పరిమళాలు నింపేస్తాయి.
వల్లవాన్ని బల్లెంగా మలిచేస్తుంది
కన్నీటిని ఖడ్గంగా మలిచేస్తుంది
లోకంలో ఒకే ఒకటి – పుస్తకమే
జడతను విప్లవంగా మలిచేస్తుంది.
అర్ధరాత్రి సూర్యుణ్ణి చూడాలంటే
అమవస నిశిలో శశిని చూడాలంటే
గ్రంధాలయమునకు వెళ్ళిపోవాలి
ఎడారిలో సెలయేటిని చూడాలంటే
మాట్లడే పక్షులను చూడాలంటే
పరుగెత్తే వృక్షాలను చూడాలంటే
గ్రంధాలయమునకు వెళ్ళిపోవాలి
పాడే నక్షత్రాలను చూడాలంటే

నిజానికి జ్ఞానం సేకరింపబడేది కాదు. అది అందరి లోను సమృద్ధిగా వుండేదే. కాని లోకసంబంధములైన ఆలోచనలచేత అది కప్పబడి వుంటుంది. ఆ కప్పును తొలగించడానికి గ్రంథపఠనం పనికి వస్తుంది. అంతేతప్ప గ్రంథం కొత్తజ్ఞానాన్ని ఇస్తుందని కాదు. మరి ఉన్న జ్ఞానాన్ని సమృద్ధిపరుస్తుంది. అంతేకాక విశాలదృష్టిని పెంచుతుంది. తుదకు ఆత్మగమ్యాన్ని కూడ చేరుస్తుంది. పై రుబాయీలన్ని ఈ పనిని చేస్తాయి. ఎడారిలో కూడ సెల యేటిని చూడాలంటే జడత్వం నుంచి కూడ చైతన్యాన్ని ఆవిష్కరించాలంటే, నక్షత్రమండలంలో విహరించాలంటే కూడ సద్గ్రంధమే శరణ్యం. ధనధాన్యాలు తినగ తినగ ఆరిగిపోతాయి గ్రంథపరిజ్ఞానం బహుజన్మల దాకా జీవునివెంట పయనిస్తూవుంటుంది. ఇలా గ్రంథపఠనం

వల్ల జ్ఞానమే కాక దాని పరమావధియైన ఆహ్లాదం కలుగుతుంది. జీవుణ్ణి ఉత్తమజన్మకు తరలిస్తుంది. లేదా మోక్షగమ్యాన్నే చేసుస్తుంది. ఇలా గ్రంథప్రశస్తిని. జ్ఞాన ప్రాధాన్యాన్ని కలిపి ఆత్మజ్ఞానగమ్యానికి దారితీసే ప్రక్రియ రుబాయి. ఫార్సీ, ఉర్దూ రుబాయీలు ప్రతీకాత్మకంగా సూఫీతత్వాన్నే చెబుతున్నాయి. తత్త్వమనగా ధర్మం. ధర్మమునగా చెడు నుంచి మంచిని వేరు చేసే ప్రక్రియ. తెలుగు రుబాయీల సంపుటిలో ఈ ప్రక్రియ ఎలాగు ఉపదేశాత్మకము కావున ధర్మాన్నే బోధిస్తుంది.

అవుంటుందని భరతమహర్షి చెప్పాడు. చక్కని బోధ కుడు కవియే. ఎందుకనగా మాటద్వారా సమాజాన్ని సంస్కరిస్తున్నాడు. అట్టి పదునైన మాటలకు రుబాయీలు 'ఉపగ్రాణము'ల వంటివి. సందర్భానుసారంగా జీవితంలో రుబాయీలను పాడుకోవచ్చు. కారణం ఈ ప్రక్రియ మాత్రాఛందస్సుతో సాగిపోవడమే. కొన్ని సందర్భాలలో స్వీయజీవితాని అన్వయించుకోవచ్చు.ఇప్పటికే చాలా రుబాయీలు మానవజీవితానికి సమన్వయమైనాయి. ఇక ప్రక్కకు పోవు. పైగా కొత్తదనం కోసం ప్రతిమనిషి పరిగెత్తు తుంటాడు. త్రాడు కూడ సర్పంలాగా గుండ్రంగా వుంటే, దానిని చూడటానికి పరుగులెత్తుతాడు. తీరా అక్కడికి వెళ్లిచూస్తే ఏమీవుండదు. ఎవరైనా చిన్న వింతకోసం ప్రాకులాడుతూ వుంటే అప్పుడు ఒక రుబాయి వాక్యం అవతరిస్తుంది. 'క్రొత్తదనం కోసమె కదపరుగంతా' అన్నది ఆ వాక్యం. అవతరిస్తుంది. 'క్రొత్తదనం కోసమె కద పరుగంతా' అన్నది ఆ వాక్యం. తప్పుడు పనులు చేస్తూ దేవాలయాలకు వెళ్ళి పూజలు చేస్తుంటారు. అప్పుడు 'శనివారం దేవునికొక కొబ్బరికాయ' అనే వాక్యంతో కుహనాభక్తుల్ని పరిహసించవచ్చన్నమాట. ఎవరైనా మధురంగా వ్రాస్తే అతణ్ణి పోతన కవితో పోల్చి 'తెలుగు గుండెలో దూకే జలపాతం' అని రుబాయీవాక్యంతో కుహనాభక్తుల్ని పరిహసించవచ్చన్నమాట. ఎవరైనా మధురంగా వ్రాస్తే అతణ్ణి పోతన కవితో పోల్చి 'తెలుగు గుండెలో దూకే జలపాతం' అని రుబాయివాక్యంతో ప్రశంసించవచ్చు. ఇలా అణిముత్యాలవంటి రుబాయీ వాక్యాలు ఎన్నో వున్నాయి. కొన్ని సామెతల వంటివి. అంటే జీవితఘట్టాలకు సమీపంగా వుండేవి. మరికొన్ని చాటువుల వంటివి. 'చాటుఃప్రియోళిక్తిఃి' అని నిర్వచనం. అనగా ప్రియమైన వాక్యమన్నమాట. ఇలాంటి వాక్యాలు మానవులజీవితాన్ని సంస్కరిస్తాయి. ఇంకా కొన్ని సూత్రముల వంటివి. అంటే క్లుప్తంగా వుంటాయి/. అల్పాక్షరం, అసందిగ్ధం విశ్వతోముఖమైనది సూత్రం. ఏకపక్షంగా కాక అందరికి వర్తించేదిగా వుండేదే సూత్రం. రుబాయీలు నిష్కర్షగా సూత్రములవంటివి. అందుకే ఎళ్ళవేళలా గుర్తుంటాయి. ఇవి ముక్తకాల వంటివికూడ. ఈ శబ్దానికి అర్థాలు రెండు. ఒకటి ముత్యం, రెండు స్వతంత్రం. కథ లేకుండ స్వతంత్రంగా వ్రాయబడింది గనుక రుబాయి ముక్తకం. పైగా రమ్యార్థం కలది కనుక ఇది ముత్యము వలె విలువైనది.

❖ ❖ ❖

పీర్ల పండుగ కథ - పల్లె జీవనం

– డా॥. తోరీన కళి, తెలుగు పరిశోధక విద్యార్థి, కె.వి.ఆర్.ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ.ప్ర), కర్నూలు.

పీర్ల పండుగ - పల్లె జీవనానికి అద్దంపట్టేవి పండుగలు. అలాంటి ఒక కథ ద్వారా పల్లె జీవిత విశేషాలను తెలుసుకోవడం విశిష్టమైన విషయమే. ప్రతి పల్లెలోనూ అన్ని వర్గాలవారు, అంటే అన్ని కులాలకు మతాలకు సంబంధించిన ప్రజలు జీవించడం ఆనవాయితి. పల్లె భాగ్యాన్ని, సౌందర్యాన్ని, కష్టనష్టాలను, మాటామంతిని, అలనాటి ఆచారసంప్రదాయాలను ఈ కథ వివరిస్తుంది. పల్లెల్లోని హిందూ ముస్లింల స్నేహభావానికి ప్రతీకగా ఈ కథ నిలుస్తుంది. ఈ పీర్ల పండుగ హిందూ-ముస్లిం సంస్కృతుల సమ్మేళనాన్ని ప్రతిబింబించే కథాంశమే. పీరుని ఎత్తుకొనే వారిలో ఉండే నిబద్ధతే మానవత్వాన్ని నిలబెడుతుంది. మతాలు కాదు, మానవత్వమే ముఖ్యమనే సందేశాన్ని ఈ కథ ద్వారా రచయిత అందించారు.

పాకాల యశోదారెడ్డి అచ్చమైన తెలంగాణ యాసలో కథలు రాశారు. తెలంగాణ ప్రాంతపు భాషను, యాసను ఆదరించే విధంగా కూడా తెలంగాణ మాంతడలికంలోనే కథలు రాసి, పాఠకులను మెప్పించింది రచయిత్రి. తెలంగాణ మాండలికమే ఆమెకు ప్రత్యేకమైన సొత్తగా నిలిచింది. ప్రతి వ్యక్తి తను ఒక ప్రాంతానికి చెందివాడు అని తెలియజేయడానికి భాష ఉపయోగపడుతుంది, దాన్ని కాపాడుకోవడానికి, సమాజానికి తెలియజేయడాకి సంతోషిస్తాడు ఇదే యశోదారెడ్డి చేసింది కూడా. ఈ కథలో ఎన్నో ఉర్దూ పదాలతో మిళితమైన తెలంగాణ పదాలను రచయిత్రి ఉపయోగించింది.

పల్లెల్లో జరుపుకునే పీర్ల పండగ గురించిన చెప్పే కథ ఇది. పీర్ల పండుగ తెలంగాణ పల్లెల్లో హిందూ ముస్లిం మత భేదాలు లేకుండా జరుపుకునే పండగ. అయితే ఊర్లలో ఉండే దూదేకులు అనే వాళ్ళు ఈ పీర్లను ఎత్తుతారు. ఈ కథలో ఇతర కులాల వాళ్ళు పీరును ఎత్తే సంప్రదాయం ఉంది. గ్రామంలోని వారందరూ దీన్ని సమ్మతిస్తారు.

"మన పటేలు దుంకుతలేడు గని సూస్తున్నడు. ఇంగ రేపు, పీర్ల బాయిలవడయి గద. ఇంగ మన ఊళ్ళ ఊరు మీద ఊరే పడెటట్లుండది. నాల్ సావు నేమొ సవారి సాయన్న ఎత్తుకుంటడు. ఎన్కటి నంది బీబీఫాతమ్మ నేమొ నబ్బీసాబ్ ఎత్తుకుంటడు"

పీర్ల పండుగ ఎంత ఎత్తున ఊరేగింపుగా ఊళ్ళో జరుగుతుందో వారి మాటల్లో గమనించవచ్చి. పండుగ వాతావరణాన్ని, ఊరు ఊరంతా ఏకమై సందడిగా కలసికట్టుగా జరుపుకునే ఆచారం పల్లె ప్రజల్లో ఉంది.

ఈ కథలో రామరంద్రారెడ్డి పటేలు. ఆ పటేలు దగ్గర పనిచేసే పిల్లవాడు రంగడు. ఆ పటేలు కొడుకు పెంటయ్య. రామచంద్రారెడ్డి పటేలుకు ఎన్నిసార్లు బిడ్డలు పుట్టినా చనిపోతూనే వచ్చారు. అందుకని ఈ పిల్లవాణ్ని పుట్టంగానే ఇస్తరాకులో ఏసి పెంటలో పెట్టారు.

"ఈ పెంటయ్య రామచంద్రారెడ్డి పటేలుకు పోంగ పోంగనిచ్చినసంతు. ఈ పిల్లగాడు పుట్టంగనే ముక్కుగుట్టి ఇంటెన్క పెంటమీద ఇస్తరాకుల ఏసి పెంటయ్య అని పేరు పెట్టింది ఆ వూరి మంత్రసాని ఈడ్డి రాములు. ఇంగ ఆ పిల్లగాడు దినగండం, వారగండం, సందుగండం, పాల గండాలన్ని గడిచి ఇప్పటికి బతికి బట్టగట్టి పన్నెండేండ్లయిండు."

పురాతన కాలం నుండి ఉన్న ఆచారాలను ఇక్కడ చూడొచ్చు. ఎన్నో సంవత్సరాలుగా ఎంతోమంది పిల్లలను పోగొట్టుకున్న పటేలు ఇంట్లో బిడ్డలు బ్రతకాలని విస్తరాకు మీద బిడ్డను పెట్టి, పెంటకుప్పలో ఉంచి, పెంటయ్య అను పేరు పెట్టడం గ్రామ ఆచారకాండకు ప్రతీకగా కనిపిస్తుంది. పల్లెల్లో మంత్రసాని పురుడు

పోయడం కూడా సంప్రదాయమే. ఇలా చేయడం వల్ల దిగండం, వారగండం, పాలగండం వంటి గండాలెన్నో పోతాయని మంత్రసాని చెప్పడం అప్పటి ఆచారాలకు అనవాలంగా ఉంటుంది. గండాలంటే భవిష్యత్తులో పిల్లవాడికి వచ్చే విపత్తులుగా భావిస్తారు పల్లె ప్రజలు వాటిని దాటడానికి ఇలాంటి భిన్నమైన ప్రక్రియలు చేపడతారు.

ఈ పిల్లవాడికి ఉన్న గండాలన్ని గడిసి ఇప్పుడు పన్నెండేళ్ళు. పెంటయ్య నాన్నమ్మ నంజమ్మకు పెంటయ్యను చూస్తే అపురూపం. చెప్పా పెట్టకుండా చడీ చప్పుడు లేకుండా స్నాన్నానికి వచ్చిన పెంటయ్యకు నీళ్ళు తోడమంటుంది వాళ్ళ నాన్నమ్మ. ఊర్లో ఎవరో తుర్కలోడు వచ్చిండనే వార్త తెస్తాడు రంగయ్య.

"ఈ పిల్లగాణ్ణి జూసినప్పుడల్ల రామక్క మొకం గంపంత అయితది. ఆడింది ఆట, పాడింది పాట."

ఎంతో శ్రమించి బ్రతికించుకున్న పిల్లవాడు కాబట్టి, వాణ్ని గారంచేయడం మనం చూడవచ్చు. అదేవిధంగా నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు ఎక్కువ శాతం గ్రామాల్లోనే గారంచేయడం, గోము చేయడం వంటిని గమనించవచ్చు.

ఈ పీరు సావులను చూసి ఇంటికొచ్చాడు మన పెంటయ్య చక్రవర్తి అనుకుంటుంది సంజమ్మ మనవణ్ని చూసి. మన చిన్న పటేలు కాదు అందరూ ఊర్లకు పోయినాడని చెప్పాడు రంగడు. ఊరి ముచ్చట్లన్ని రంగడు సంజమమకు వివరిస్తాడు. నబీసావు పీరికన్న సాయన్న పీరికి సత్తెం ఎక్కువ అని ఊరంతా అనుకుంటున్నారని చెప్పాడు.

"రామచంద్రయ్య, కొడ్కును వారగంట జూసి, ఇని ఇన్నట్లుండి ముసి ముసినగులు నగుకూంట దస్కురు మాల దులిపి బూజానేసుకొని బంకులు దాటి కావలి ఎంకణ్ణి ఎంటబెట్టుకొని కొలిమిచింత దిక్కు మళ్ళిండు."

పటేలు తన బిడ్డచేసే పనులను గమనిస్తూ, చూడనట్టే ముసిముసి నవ్వులు నవ్వుకుంటాడు. తండ్రి కన్ను ఎప్పుడూ బిడ్డపైనే ఉంటుంది, కాని ఏమి ఎరుగునట్లు ప్రవర్తిస్తాడు, ముద్దు చేసే వాడి జీవితం దెబ్బతింటుందనే భయం ఇలాంటి తండ్రి మానసిక స్థితిని ఈ కథలో రచయిత చిత్రించిచారు.

తెల్ల దుప్పటిళ్ళతో తాను కూర్చోడానికి సిద్ధం చేయించుకుంటుంది. కోడలు దొర్సాని చూడాలను కుంటున్నదని చెప్తుంది.

"అయితే రంగా! మన పసుల దొడ్డి ఎన్క మాసాని మిద్దెకు నిచ్చెన ఎయ్యి. ఇంగ దాని సపుటికప్ప మీద నల్కమంచాలు వొంచి తెల్ల దుప్పటి రేకులు పరువు. మెత్తలుగిన కైగ అమరిచ్చి పెట్టు బిడ్డ పొద్దుమూకంగ నేను, కోడలు దొర్సాని వొస్తము."

పల్లె పెద్దలు, ఉత్సవాలు జరిపించవారు, ఉత్సవాలను చూడాలంటే వారికి ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉంటాయి, అది రివాజుగా రచయిత్రి రచన చేశారు. అనాటి సాంఘీక పరిస్థితులకు ఈ పద్ధతి అద్దంపడుతుంది.

అక్కడంతా పండుగ వాతావరణం. కోమటి సెంద్రమమ పుట్నాలు, లడ్డు పట్టుకొని వచ్చి అక్కడ అమ్మకానికి పెడ్తుంది.

"ఇంకట్లకే సేవుబిల్లలు, పూలపుట్నాలు, పారప్పుట్నాలు, బొంగులడ్లు, బెల్లప్పూస పట్క లల్ల పెట్టుకోని కోమటి సెంద్రమ్మ వొచ్చి కూసున్నది. బెండ్లు, బత్తీసలు దీస్కొచ్చి ఓ బుట్టి దుకాణం దెరిసిండు కోమటి ఈరయ్య."

"ఈ అనుమక్క అనుపగుగ్గిళ్లు దెచ్చి పైన కో సిట్టెడు అమ్మింది. పెద్దింటిపోరులు ఊసిళ్లు గొనుక్కోని త్యాపకు సారెడు బుక్కవోసి బర్ఫటిచ్చి గుటుక్కు మంటుండరు"

ఉత్సవాలు ఊరేగింపులు పల్లెల్లో జరిగే సందర్భాలలో ఊరంతా దుకాణాలు తెరవడం పరిపాటి. అలాగే ఆ ఊళ్ళోనూ. ఈ ఊరివారు తినే తినుబండారాలది ప్రథమ స్థానం ఉంటుంది. ఏవి ఎక్కువ అమ్మకమవుతాయే వాటిని అమ్మకానికి పెడతారు. తెలంగాణా ప్రాంతంలో తినే తినుబండారలు పూలపుట్నాలు, పారపుట్నాలు,

బెల్లప్పూస, అనుపగుగ్గిళ్ళు వంటివి. ఇక్కడ తినేవిధానాన్ని కూడా రచయిత వివరించారు.

ఇక్కడ సందడి అవుతుండగానే మసీదులో గొడవ మొదలవుతుంది. పద్ధతి ప్రకారం పీర్లను ఎత్తుకోవాలి కాని నాకు గురిలేని దేవుణ్ని నేనెందుకు ఎత్తుకుంటా అంటూ సాయన్న బిగించుకొని కూర్చున్నాడు. మొల్లసాబ్ మాట ప్రకారం చెయ్యాలె అనగానే సాయన్న కోపాన్ని దిగ మింగుకుని గిరుక్కున వెనక్కి తిరుగుతాడు.

"ఇంతట్లనె మసీదుల లొల్లి పుట్టుకొచ్చింది. బుజ బుజ మనుకుంట మంది అందరు మసీదు సుట్టుమూగిన్రు. ఏం దంటే 'రివాజు! పొంటి పేర్లను ఎత్తుకోవలె గని నాకు గురి లేని దేవుణ్ణి మోయ మంటె నే నెందుకు మోస్స నయ్యో' అని సవారిసాయన్న బిగుచ్చుకొని కూసున్నడు."

ఎప్పటి నుండో వస్తున్న ఆచారాన్ని ప్రక్కకు పెట్టి కొత్త పద్ధతిని అవలంబించినప్పుడు, దాన్ని వ్యతిరేకించడం గ్రామాల్లో చూడవచ్చు. అందుకే సాయన్న గురిలేని దేవుణ్ని మోయలేనని కరాఖండిగా చెప్పాడు - రచయిత చెప్పించింది.

"బేటా! దిల్ సాఫ్ ఉండాలే గని దేంట్ల ఏముండది? మనం రివాజ్ దప్ప గూడదు. పై రివాజ్ దాటి సవారీలు అదలు బదులు జేస్తే మాటొస్తది."

అనాదిగా వస్తున్న ఆచారాన్ని కాలరాయడం మంచిది కాదని, పెద్దలు చెప్పిన విననివారు ఉంటారని, ఆచారాన్ని తప్పడంవల్ల అనర్థం జరగవచ్చని సూచనగా తెలిపినా మూర్ఖంగా ఉన్నవారు వాటినన్నింటిని లెక్కచేయరని అలాంటి వారు ప్రతి గ్రామంలోనూ ఉంటారని ఈ సందర్భం ద్వారా రచయిత తెలిపారు.

"సాబ్ ఇది ఉత్తుత్త మాట గాదు. మన ఇజ్జత్ సవాలుండది. నా ఇజ్జత్ మీచేతులుండది. అని గట్టిగ పట్టు పట్టిండంట."

ఇది నా పరువుకు సంబంధించిన విషయం, దాన్ని తక్కువగా తీకుకోకూడదు, అందుకే చెబుతున్న దయుంచి నా విన్నపాన్ని మన్నించి నేను చెప్పినట్లు చేయండి అని బలవంతంగా ఒప్పించె మనసున్నవారు పల్లెల్లో అనేకులు ఉంటారు, వారికి వత్తాసు పలికే వారు ఉంటారని రచయిత అభిప్రాయం.

ఈసారి బీబీ ఫాత్మమ్మను అష్టల్ మియా, నాస్‌సావును నబ్బిసావు ఎత్తుకున్నరు. అంతా అప్పటి సంప్రదాయం మారిపోయింది. కొత్త కట్టుబాటు మొదలైనాయి.

"అబే సాయిగా! మాకు ఖాయిదా నేర్పెటి హిమ్మతు వొచ్చింది? ఇక్కడ నీవు పెద్దనా, మొల్లా సాబ్ పెద్దనా? మొల్ల సాబ్ మాట ఖరారు లేకుంటే సవారి ఎత్తుకు, పో" అని ఉర్మి ఉర్మి మాట్లాడే ట్యాళ్లకు, బురుజుల రాయిఏసి మొకం నిండ ఎవరు జిట్లిచ్చుకోవాలె అని వొచ్చిన ఉగ్రాన్ని దిగుమింగుకోని.

నీకు ఎంత ధైర్యం, ఎంత బలంగం మొల్లా సాబ్ చెప్పిందే వినాలి, అంటూ బెదిరించి ఎప్పటి నుండో వస్తున్న ఆచారాన్ని మార్పించాడొక మూర్ఖుడు. ఏం మాట్లాడాలో తెలియలేదు ప్రతి ఏడాది పీరును ఎత్తుకుంటున్న సాయన్నకు, కాని ఎదురు మాట్లాడకుండా మౌనంవహించారు. మంచివారు చెడుకు లొంగరు. సజ్జనులు ఎప్పుడూ ధర్మానే నమ్ముకుంటారు తప్ప ఎదురు తిరగరని రచయిత చెప్పకనే చెప్పారు.

ఇంతలో దూదేకులోళ్ళు ఇద్దరు పీరిలనెత్తుకొని బొడ్రాయి దగ్గరికి వచ్చినారు. వాళ్ళ వెనుకనే సవారి సాయన్న మౌనంగా నడుస్తున్నడు. మధ్యలో ఏం గందర గోళం జరిగిందో తెలియదు. సాయన్న ఉరుక్కుంటు వచ్చి నబ్బిసావును పడేసి పీరును ఎత్తుకొన్నాడు.

ముడుపులు - "ఈ పీర్ల సవారి, మసీదు మూలమల్పు దాటి సాయిరెడ్డి పటేలింటికి వచ్చిందో లేదో పెద్దకోడలు పార్వతమ్మ రొండు కడ్వల నీళ్ళు సాకవోసి నిరుడు కొడుకు పుట్టినందుకు కట్టిన ముడుపు దట్టి దెచ్చి మొల్లసావు కిచ్చి ముట్టినట్లు ఊదుపొగ ఎయ్యమనిజెప్పి ఏపిచ్చింది."

ముడుపులు కట్టుకోవడం పాత ఆచారమే. పల్లెల్లో ప్రతి చిన్నవిషయానికి ముడుపు కట్టుకుంటారు. కొడుకు

పుట్టినందుకు కట్టుకున్న ముడుపును పీర్ల ముందు చెల్లించుకుంది పార్వతమ్మ. పల్లె సంప్రదాయం ఇది. ఏడు కొండలవానికి కావచ్చు, ఎవరికి నచ్చిన దేవుడికి వారి స్తోమతను బట్టి ముడుపులు కట్టుకోవడం ఆచారం. వాటిని తిరిగి చెల్లించాలనేది వారి నమ్మకం. చెల్లించక పోతే పాపం వస్తుందని పల్లీయులు భావిస్తారు.

మొక్కులు - "సామి నా కొడ్కును సల్లంగ జూడు యాట యాట నా ఇంట్ల యిట్లనే కొత్తదట్టి గట్టుకొని పోవాలె"

కుల వృత్తులు, జానపద కళాకారులు - "రంగడు గుడ్డెలుగు ఏశం గుర్కు గుర్కు మనుకుంట దిగ్గ తుండడు. బైండ్లోళ్లు ఒగరి జోలి ఒగరికి దెల్వకుండ తప్పెట్లు గొట్టుండరు. ఆయిందం బోపిచ్చుకోని పెద్ద మంగలోడు దివిటీలకు కొత్త నూనె సుట్టలు దగిలిస్తుం డడు. చిన్నా పెద్ద అంతగల్సి లొల్లి లొల్లి జేస్తుండరు."

భగవంతుడు ఇంటి ముందుకు వస్తే పల్లీయులు మొక్కుకోవడం వారికున్న ఆచారాలలో అతి ముఖ్య మైనది. వారి నమ్మకం కూడా. ఏది కోరుకుంటే అది భగవంతుడు తీరుస్తాడని వారి విశ్వాసం. కోరిన కోర్కెలను భగవంతుడికి తెలిపి వాటికోసం ఏదైనా ప్రత్యేకమైనది చేస్తానని భగవంతుని మెప్పుకోసం ఇలా మొక్కుకుంటారు. రచయిత ఇలాంటి విషయాలను సావధానంగా ఈ కథలో తెలుపుతున్నారు.

ఈ పండుగకు మరింత శోభ ఇచ్చేది కళాకారులే. అదేవిధంగా జానపద కళాకారులు అందరూ వారివారి కళను ప్రదర్శించడానికి ఎంతో ఉత్సుకతతో ముందుకు వచ్చి వారి కళారాధన, ప్రదర్శనా చాతుర్యాన్ని అందరి ముందు ప్రదర్శించి మన్ననలు పొందారు. పల్లీయుల కళంతా జానపద కళాకారుల దగ్గరే ఇంకా నిలిచి ఉం దని రచయిత ఉద్దేశమై ఉంటుంది.

ఆ పీరును ఎత్తుకోగానే ఇక అందరూ పూనక మొచ్చినట్లు ఊగడం మొదలుపెట్టారు. అట్లా ఊగుతూ నిప్పుల్లోంచి నడుస్తూ వెళ్ళిపోయాడు సవారి సాయన్న. కణకణ మండుతున్న నిప్పుల అలాయిల నుంచి ఉటు నుంచి ఇటు, ఇటు నుంటి అటు. రెండు సార్లు ఏమాత్రం బెదరకుండా, తొణకకుండా పూలల్ల నడిచినట్టు మూడు సార్లు నడిచాడు సాయన్న. ఊరు ఊరంతా సాయన్న ధైర్యాన్ని చూసి మెచ్చుకుంటూ తలోమాట పాగడుతూ ఉన్నారు.

"ఇంగ సవారిసాయన్న యాది పట్టిచ్చుకోకుండ నదురు బెదరు అన్ని టడ్సి సవారి నిండుకుంట ఊరంత దిగ్గి మొక్కువళ్లు ముట్టడెప్పుకోని పడికట్టుదప్పకుండ నడ్సి అలాయి కాడ్కి వొచ్చిండు. అప్పటికే చింత మొద్దులు ఏసి కణ కణ నిప్పులు జేసిన అలాయిల కెల్లి అడ్కెల్లి ఈడ్కి ఈడ్కెళ్ళి ఆడ్కి పూలల్ల, మకుమలు బట్టలల్ల నడ్సి నట్లు మూడుసార్లు నడ్సుకుంటపోయిండు. ఇది జూసి ఊరన్న ఊరు కట్టున గదిలింది. దండాలు వెట్టెటోళ్ళు, సత్తెం అంటే అది రా అనెటోళ్ళు, కులం గాదురా నమ్మకం అనేటోళ్ళు, ఉపాసం బలం రా అనెటోళ్ళు, నాల్ సావూ నన్ను నక్కనజూడు తండ్రీ! ఈ నెల దప్పితే నీకు పట్టు దట్టి గట్టిస్త. అనెటోళ్ళు అందరాడ గూడిన్రు. అందరి నోళ్ళల్ల ఆయాళ్ల సాయన్ననే మెదిలిండు."

ఎంత కుట్ర జరిగినా నిజమే ఎప్పుడు జయిస్తుదని ప్రతీకాత్మకంగా రచయిత ఈ కథలో తెలిపారు. పీరును ఎవరు ఎత్తుకున్న నిప్పుల్లో నడిచింది సత్యమున్నవారే అని నిరూపించారు రచయిత.

కొందరు దండాలు పెట్టారు. కొందరు సత్యం అంటే అదే అన్నారు. మరి కొందరు కులం మతం కన్న నమ్మకం ముఖ్యం అన్నారు. కొందరు ఉపవాస బలం అంటూ రకరకాలుగా పాగుతూ ఉన్నారు.

మంచిని మెచ్చుకోవడం సమాజపు నైజం. దాన్ని రచయిత గ్రామ ప్రజల మాటల్లో చెప్పించారు. సాయన్న సత్యాన్ని నిరూపించి చూపించాడు కూడా. ఎన్ని కుతంత్రాలు పన్నినా చివరకు గెలిచేది మంచి మాత్రమే. అదే రచయిత చెప్పదల్చుకుంది.

ఇదంతా కళ్ళారా చూడడానకి వచ్చిన దొరసాని సంజెమ్మ రంగడ్ని పిలిచి నిజంరా నువ్వు చెప్పింది మనసుల ఏ మాయా మర్మం లేని నమ్మకం గెలుస్తుంది. నమ్మకముంటే ఏదైనా చేయ్యవచ్చు. అగ్గిలో నడవచ్చు, ప్రవాహానికి ఎదురీదొచ్చు. సవారి సాయన్న సత్యమైన మనిషిరా అంటూ కీర్తించింది.

''ఈ చిత్రం కండ్లార జూసిన సండెమ్మ తెల్లారి రంగడోస్తే వాణ్ణి జూసి 'రంగా! నీవు జెప్పింది నిజం రా! మనుసుల మర్మం లేకుండ నమ్ముకం ఉండాలె గని, అగ్గిల నడువొచ్చు అలుగు కు అడ్డం ఈ దొచ్చురా! ఎట్లైనా సాయిగాడు సత్తెం గల్లోడేరా!'అని అన్నది.''

ఊర్లో జరిగే పీరుల పండుగ మనుషుల నమ్మకాలకు సంబంధించింది. నమ్మకమున్న చోట ఏ దైవుడైనా ఒక్కటే అన్న అంశాన్ని నిరూపిస్తుంది. కణకణ మండే నిప్పుల్లోంచి నడవాలంటే ధైర్యం ఉండాలి. తాను చేసే పనిపైన విశ్వాసం ఉండాలి. ఆ రెండూ కలిగి ఉన్న సాయన్న విజయాన్ని సాధించాడు. నిజాన్ని నిగ్గు తేల్చాడు.

పల్లెల్లో భిన్నమైన సంస్కృతులు కనిపిస్తాయి. ఈ పీర్ల పండుగ ధనిక పేద అనే భేదం లేకుండా అందరూ కలసికట్టుగా జరుపుతుంటారు. మానవత్వాన్ని చాటుకునే కథగా దీన్ని విశ్లేషించవచ్చు. ఏ మతస్తుడైనా మనసు స్వచ్ఛంగా ఉండే ఎలాంటి కష్టానైనా ఎదుర్కొని విజయాన్ని సాధించవచ్చని రచయిత తెలిపారు. పల్లెటూరి వాతావరణానికి అనుగుణంగా ఈ కథ సాగుతుంది. ఈ కథలో పల్లెల్లో మాట్లాడే సామెతలు, జాతీయాలు, పలుకుబడులు కనిపిస్తాయి. ఈకథలో ఉపయోగించిన తెలుగు పలుకుబళ్ళు, మాటలు మాండలిక పదాలు ప్రత్యేకం. తెలంగాణ పల్లెల్లోని వ్యవసాయ కుటుంబలలోని మాటల, పద బంధాలు ఈ కథలో విరివిగా కనిపిస్తాయి. తెలంగాణా పల్లె పదాలు - దోసకాకయబెంబు, మల్లెశాల, దస్తురుమాలు, పోలెడు, తప్యాల, తుర్కదూదేకులు, బొడ్రాయి కాడికి, దట్టీలు. ఉర్దూపదాలు - ఇజ్జత్, బేటా, జర, దిల్ సాఫ్, రివాజ్ దైవాన్ని మూఢంగా నమ్మే ఆచారం పల్లెలో ఉన్నపట్టికి మూఢభక్తిలోను దేవుడుంటాడు అని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు. రచయిత పల్లె జీవితాన్ని స్వయంగా అనుభవించినట్లు తోస్తుంది. అందుకే యశోదారెడ్డి తాను స్వయంగా చూసిన, విన్న, అనుభవంలో నుంచి స్వీకరించిన కథలా ఈ కథ మలిచారు. దాదాపుగా ప్రతి గ్రామంలోనూ ఈ పీర్ల పండుగా జరుపుకునే ఆచారం ఎప్పటినుండో మనదేశంలో కలసిపోయింది. అది ముఖ్యమైదైతే చిన్న పిల్లలు పీర్లొస్తున్నా యంటూ వాటికోసం ఎదురుచూస్తూ ఊరంతా చుట్టేస్తారు. ఆ పీర్ల చావడి దగ్గరే ఆరోజంతా గడిపేస్తారు. గ్రామంలోని ప్రతి ఇల్లు పీరు వారి ఇంటి ముందు నుండి వెళ్ళడం గొప్పగా భావిస్తారు. అదేవిధంగా గ్రామ పెద్దలైన పటేలు, పట్వారీ, కరణం వంటివారి ఇళ్ళ ముందు పీర్లను కచ్చితంగా తీసుకువస్తారు. తర్వాతే ఊరంతా పీర్లను ఊరేగిస్తారు. పీర్లతో ఊదుపొగవేస్తూ, ఊరి ప్రజలందరికీ దీవెనలు ఇస్తూ సాగిపోతారు. పీర్లు ఎత్తుకునే వాళ్ళు ఏ మతస్థులు అనే దానికన్నా వారి మనస్సు స్వచ్ఛమైనదో తెలుస్తుంది. మనిషికుండే విశ్వాసాన్ని ప్రకటించేది మానవత్వం అంటూ ఇక్కడ గమనించవచ్చు.

పల్లె ప్రజల విశ్వాసాలు, నమ్మకాలు, ఆచారాలు ఒక్కటేమిటి వారి పద్ధతులన్నింటిని ఈ కథ మనకు వినిపిస్తుంది. ప్రతి కథ నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు, సంస్కృతి సంప్రదాయాలు స్పష్టంగా తెలుపుతుంది.ఈ కథలో గ్రామీణ సంస్కృతిలో మమేకమైపోయి, ముస్లిం మతాచారాలతో మిళితమైపోయిన అంశాలను గమనించవచ్చు. ఈ కథ రెండు మతాల గురించి, మానవత్వాన్ని గురించి, ఊరి కట్టుబాట్లను గురించి వివరిస్తూనే, మనిషి లోపల నమ్మకం ఉండాలని, మనిషి మనసులో ఏ రకమైన మర్మమూ లేకపోతే ఏ కులమైనా, మతమైనా ఒక్కటే అని నిరూపించిన కథ.

"పల్లె జీవనం పరమానందం
పల్లె సౌందర్యం కవితాత్మకం
పల్లె గుండెలు సందేశాత్మకం

పల్లె కష్టాలు వర్ణనాత్మకం
పల్లె హృదయాలు కరుణాత్మకం"

"మనమందరం భారతీయులం – భావితరాలకు
సారథులం"

ఆధారగ్రంథాలు :

1. యశోదారెడ్డి కథలు - యశోదారెడ్డి

❖ ❖ ❖

ఆధునిక యుగ విమర్శ వికాసంలో మన తెలుగువారు

– డా॥. మల్లోగు వెంకటలక్ష్మమ్మ, తెలుగు అధ్యాపకులు

'వి' అను ఉపసర్గకు 'మృశ్' అను ధాతువు చేరి 'విమర్శ' అనే పదం పుట్టింది. వి+మృశ్ = విమర్శ. పరామర్శించుట, పరిశీలించుట, పరీక్షించుట, చర్చించుట. విమర్శ అనగా లోక సాధారణార్థం. తప్పులెన్నుట, సాహిత్యపరంగా విమర్శ అంటే గుణదోష ప్రకటన. ప్రాచీన కాలంలో విమర్శకు వ్యాఖ్య. వివరణము, మీమాంస మున్నగు పదముల పర్యాయపదములుగా వ్యాప్తిలో కలవు. "గ్రంథములకు సంబంధించిన సర్వ విషయములను కూలంకుషంగా చర్చించి వాఙ్మయమున ఆ గ్రంథమునకు గల స్థానం నిరూపించుట విమర్శ అనబడును.

గ్రంథసేకరణ, సంస్కరణ, పరిష్కరణ అన్నవి సాహిత్య పరిశోధనలో ప్రధానమైనవి. పరిశోధనకు, సాహిత్య విమర్శకు అవినాభావ సంబంధం వుంది. ఒక ప్రాచీన రచనకు సంబంధించి సాధ్యమైనన్ని లిఖిత ప్రతులను సేకరించి, అవసరమైన చిన్నచిన్న సవరణలు చేసి, సరియైన పాఠనిర్ణయం చేసి, విభాగాలను సూచించి, గ్రంథానికి తుదిరూపం ఇవ్వటాన్ని పరిష్కరణమంటారు. పరిష్కర్త గ్రంథానికి పీఠికను కూడ సమకూర్చుతారు. ఈ తరహా విమర్శను పాఠ్య విమర్శ అంటారు.

ఇక విమర్శలో నేను చర్చించిపోయే విమర్శకులు ప్రధానంగా 1. కందుకూరి వీరేశలింగం, 2. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, 3. వేదం వెంకటరాయశాస్త్రి, 4.పుదప్పాకం సుబ్రమణ్య అయ్యర్, 6. వింజమూరి రంగాచార్యులు 6. గురజాడ అప్పారావు, 7. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, 8. విశ్వనాథ సత్యనారాయణగార్లు.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఈస్టిండియా కంపెనీ ఉద్యోగిగా ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో పనిచేసి, ఇతర ఉద్యోగుల వలె తెలుగును నేర్చుకొని, అంతటితో తృప్తిపడక తెలుగు భాషా సాహిత్యాలను లోతుగా అధ్యయనం చేసి విమర్శ చేశారు.

వేమన రాసిన 693 పద్యాలను బ్రౌన్ ఆంగ్లంలోకి అనువదించారు. అందులో ఆయన మత, నీతి, అధిక్షేప, మర్మ అని నాలుగు భాగాలు విభజన చేసి అంతటితో తృప్తిపడక అవసరమైన చోట శబ్ద చర్చ చేసి, వ్యాఖ్యానాన్ని చేశారు. యతిభంగం కలిగినట్లుగా కనిపించే సందర్భంలో తొందరపడకుండా ఉచ్చారణ రీతులను దృష్టిలో ఒక నిర్ణయానికి రావాలని దీన్నే ఆయన 'దుర్వుమర్యాద' అని. ఆశుపద్ధతికి చెందిన వేమన పద్యాలన దుర్వు మర్యాద దృష్ట్యా పరిశీలించుట, లయజ్ఞానం కలిగిన మాతృభాషా వ్యవహర్తలకు మాత్రమే సాధ్యం. అలాంటిది బ్రౌన్ వంటి విదేశీయుడికి సాధ్యమైందంటే ఆయన తెలుగు భాషా సాహిత్యాల మీద ఎంత అధికారాన్ని సంపాదించారో వేరే చెప్పనక్కరలేదు.

అంతేకాకుండా ఒక పద్యం ద్వారా ఆయనకు విమర్శపై శాస్త్రియత ఉందని తెలుసుకోవచ్చు.

ఉదా :

"చంపదగిన యట్టి శత్రువు తన చేత
చిక్కెనేని కీడు చేయరాదు
పాసగమేలు చేసి పామ్మనుటే చాలు"

అన్న వేమన పద్యం చివరి చరణంలో "చాలు" అన్నమాటలకు బదులు "చావు" అన్న పాఠం కూడా కొన్ని ప్రతుల్లో ఉంది. బ్రౌన్ "చావు" అన్న పాఠమే ఎంపిక చేశారు. ఈ పీఠికలో వేమన స్థల, కాలాదులకు సంబంధించిన చర్చ కూడా ఉంది. ముఖ్యంగా వేమన పద్యాలలోని మాండలిక పదాల ఆధారంగా కూడా వేమన నివసించిన ప్రదేశాన్ని నిర్ణయించటానికి బ్రౌన్ పూనుకున్నారు. ఈ విమర్శ పద్ధతి తరువాత కవులకు మార్గదర్శకం అయింది.

తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శనా పద్ధతికి శ్రీకారం చుట్టినవారు కట్టమంచివారు. వీరు 'విమర్శ అనగా గుణదోష విచారణయని' మొట్టమొదటిసారిగా తెలియజెప్పారు. వీరు ఆధునిక ఆంధ్ర సాహిత్య విమర్శన చరిత్రకు యుగపురుషుడు.

వీరు కొక్కండ వెంకటరత్నంపంతులుగారు విగ్రహ తంత్రం కథను తెలుగులోకి అనువదించగా, ఆదే రచనను వీరు అనువదించి, దానిని ''వివేకవర్ధిని'' పత్రికలో ప్రకటించి 1874లో గ్రంథరూపంలోని తెచ్చారు. వీరేశలింగం పంతులు రచన కన్నా తన రచనే ఉత్తమంగా ఉందని కొక్కండవారు ''శివశంకర పాండ్యా'' పేరుతో ఆత్మ ప్రశంస చేసిన విషయాల్ని గమనించి ''విగ్రహతంత్ర విమర్శనము'' అనే విమర్శను రాశారు.

ఇందులో భాషాపరమైన దోషాలు చేశారు. అందులో 'వర్తక' శబ్దాన్ని వ్యాపారి అని తప్పుగా వెంకటరత్నం పంతులుగారు కథను తారుమారు చేయడం, భార్య అంటే భరించునునది అని వ్యుత్పత్తి అర్థాన్ని వాడాడు. గనగనమండు, దిగ్గున దుర్గము నిర్మించు వంటి పదాలను సంధర్భానికి తగ్గట్టుగా వాడలేదన్నారు.

క్షీణ ప్రబంధయుగంలోని చిత్రబంధాది కవిత్వ రీతులకు, అంధానుకరణ, ధోరణికి నిరసనగా విరేశలింగం పంతులు 1895లో ''సరస్వతీ నారద విలాపం'' అనే లఘు కావ్యాన్ని రచించారు. ఈ కావ్యంలో సరస్వతీ దేవి తన బాధలను నారదునితో చెప్పుకున్నట్టు కవి కల్పించారు.

1886లో ''ఆంధ్రకవులచరిత్ర''ను రాశారు. ప్రధా నంగా వీరు కవుల స్థల కాలాదులను, పాత పాత్రల సంస్కరణ చేస్తూ కవుల చరిత్రను రాశారు. అంతేకాకుండా ''వైజయంతీ విలాసం'' కావ్యంలో భక్తుడు అవినీతిపరుడైనా నిందార్హుడు కాడని కవి సిద్ధాంతీకరిస్తూ పంతులు గారు దీనిని ఖండిస్తూ ''ఇటువంటి సిద్ధాంతములే మన దేశములో నీతికిని, మతమునకు చాలా కీడు కలుగు జేస్తున్నవి'' అన్నాడు.

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి :

సాహిత్య విమర్శను మండనము, మండ ఖండనము, ఖండనము అని మూడు రకాలుగా విభజించారు. వీరు వీరేశలింగం పంతులుగారు రచించిన ''రాజశేఖర చరిత్రము'' రచనలో గోల్డ్‌స్మిత్ రచించిన ''వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్'' అన్న ఆంగ్ల నవల సహాయం కొంతవరకు స్వీకరించినా తమది స్వకపోల కల్పితమే అని పంతులు గారు చెప్పిన దానిని వీరు విమర్శిస్తూ విరేశలింగంగారు ఈ నవలను పూర్తిగా ఆంగ్ల నవలను అనుకరించే రాశారని చూపారు.

ఈ విమర్శ గ్రంథంలో మరో విశేషం ఉంది. ''నవీన ప్రబంధము, వచన ప్రబంధము'' అని నవలా ప్రక్రియను వ్యవరిస్తున్న రోజుల్లో ''నవల'' అనే పేరు సబబుగా ఉందని బ్రహ్మయ్యశాస్త్రి చెప్పారు.

వేదం వెంకటరాయశాస్త్రి :

వీరు ''శారదాకాంచిక'' అనే గ్రంథమాల పక్షాన కొన్ని విమర్శలు ప్రకటించారు. వీరు మూడు రచనలపై ప్రధానంగా విమర్శ చేశారు. 1. జక్కన రచించిన విక్రమార్క చరిత్రను పరిష్కరించిన పరిష్కర్తలకు భాషా జ్ఞానంగాని, లక్షణ జ్ఞానం కాని లేదని ''విక్రమార్కచరిత్ర ముద్రణ విమర్శనము'' అన్న గ్రంథంలో చెప్పారు. 2. జయదేవుడు రాసిన ''ఆంధ్ర ప్రసన్న రాఘవ నాటకం'' ను అనువాదం చేసిన కొక్కండ వెంకటరత్నం పంతులుగారికి భాషా పరిజ్ఞానం లేకపోవటం వల్ల రసము, ఇతివృత్తము చెడిపోయాయని విమర్శించారు. 3.''శ్రీకాళహస్తీ మహాత్వము'' పరిష్కర్తకు కవిహృదయం అర్థం కాక పోవడం వల్ల చాలా తప్పులు చోటు చేసుకున్నాయని ''శ్రీకాళహస్తీమహాత్మ ముద్రణ విమర్శనము'' లో వారు పేర్కొన్నారు.

పుదుప్పాకం సుబ్రమణ్య అయ్యర్ :

వీరు ''నన్నయ భట్టారకుడు'' అని నన్నయపై తొలి విమర్శ గ్రంథం రాశారు. నన్నయ సంస్కృత భారతాన్ని అనువదించారు. మూల కథను తెలుగులో తిరిగి చెప్పినా

రని చెప్పారు. భారత కావ్యాన్ని పరిశీలించినట్లైతే రసం తగ్గినట్లు అనిపిస్తుందన్నారు.

వింజమూరి రంగాచార్యులు :

వీరు "పింగళి సూర్యనార్యుడు" అనే విమర్శనా గ్రంథం రచించారు. పింగళి సూరన రచించిన "రాఘవ పాండవీయము"ను ద్వర్థి కావ్యంను రాసినా అందులో రసపోషణ అంతగా లేదని, అందువల్ల ఇది ఉత్తమ కావ్యం కాదన్నారు.

గురజాడ అప్పారావు :

వీరు తెలుగులోనూ, ఆంగ్లంలో కొన్ని విమర్శనా వ్యాసాలు రాశారు. అయితే వీరు రాసిన అన్ని వ్యాసాలు వ్యవహారిక భాషను విమర్శించేది. వీరు "ఆధునిక ఆంధ్ర వచన రచన" అన్న ఆంగ్ల వ్యాసంలో దుగ్గిరాల రాఘవ చంద్రయ్య రచించిన "విజయనగర సామ్రాజ్యము" అను చారిత్రక నవలను గురజాడ పరిశీలించిన తీరు గమనార్హమైనది. ఈ నవలలో తళ్ళికోట యుద్ధం తరువాత 'తిరుమల రాయడు పై యుద్ధంలో మరణించినట్లుగా చూపడమైనది. రచయిత చేసిన ఈ తప్పును "గురజాడ వారు కనీస చారిత్రక పరిజ్ఞానం లేకుండా" నవల రాశారని ఈ విధంగా నవల రాయడం మంచిది కాదన్నారు.

'కవిత్వము' అను చిన్న వ్యాసంలో కావ్య వస్తువును గూర్చి మనదేశపు కవులు తమ కావ్యాలలో దేవతలను గూర్చి, రాజులను గూర్చి రాస్తారే తప్ప, సామాన్య మానవుడి కష్టసుఖాలను చిత్రించారన్నారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ :

నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన విమర్శనా దృక్పథంలో కవి జీవిత విమర్శకు, పాత్ర పరిశీలనా పద్ధతికి మార్గదర్శకులు వీరు. వీరు విమర్శ 4 గ్రంథాలుగా ప్రకటితమైనాయి. అవి - 1. వేమన, 2. నాటకోపన్యాసములు, 3. సారస్వతాలోకము, 4. రాళ్ళపల్లి పీఠికలు.

వేమన :

ఇందులో వేమన వ్యక్తిత్వము, దేశ కాలాదులు, సంసార స్థితిగతులు, సమకాలీన ధర్మములు, యోగసిద్ధి, మతప్రచారము, వేమన వంటి వారితో పోలికలు - భేదాలు, వేమన కవిత్వ లక్షణాలు చర్చించబడ్డాయి. వీరు ఇందులో చెప్పింది ఏంటంటే "వేమన పేరిట ప్రచారంలో వున్న పద్యాల్లో అధిక శాతం వేమన రాసినవి కావు. శైలి, పదరచనాసరళి, చంధోరీతుల ఆధారంగా వేమన పద్యాల కర్తృత్వాన్ని నిర్ణయించాలని చక్కని సూచన చేశారు. వేమన కవిత లక్షణాలలో భావతీవ్రత, భాషా సాహిత్యం, స్వచ్ఛమైన హాస్యం, సూటియైన నీతిబోధ వేమన కవితా గుణాలుగా ఆయన భావించారు.

కందుకూరి వీరేశలింగం తను రాసిన "కవుల చరిత్రలో" నాచన సోమన కవిత్వం ఎర్రన కవిత్వం కన్నా ప్రశస్తమైనది. చెపితే వీరు కల్పనా ప్రధానమైన అలంకారిక శబ్దార్థ రచనకు లోబడి సోమనకు రసపోషణ దృష్టి ఎర్రన ఒకటే తక్కువ అని, నాచన సోమన నవీన గుణాల ప్రస్తావనలో కవిత్వీకరణ వినూత్నంగా వివేచించి చెప్పారు.

వీరు ప్రబంధాలలో ప్రతిఫలించిన "రాయల నాటి రసికత" వ్యాసం చెప్పుకోదగినది. వీరు తిక్కన తీర్చిన సీతమ్మ, నిగమశర్మ అక్క అనే రెండు వ్యాసాలు పాత్ర పరిశీలనా పద్ధతికి దారి చూపాయి.

వీరు కట్టమంచివారికి సన్నిహిత మిత్రులైనప్పటికి పెక్కు అంశాలలో ఆయనతో విభేదించి స్వతంత్రను చాటుకున్నారు.

విశ్వనాథ సత్యనారాయణ :

తెలుగు సాహిత్య విమర్శ వికాసాన్ని పరిపుష్టం చేసిన విమర్శక శేఖరుడు విశ్వనాథ సత్యనారాయణ. వీరు సృజనాత్మకరంగంలో ఎంత కీర్తి గడించాడో విమర్శ రంగంలో అంతే కీర్తి గడించాడు.

వీరు ఒక దృష్టితో చూచిన ఒక కవి యాధక్యము తెలియగలదు. ఒక కవి యొక్క కవిత చదువుటకు సానుభూతి కావలయును, రెండవది బహువిషయములను సంయోజన పరచుకొనవలయును. తాను వలచి

నదియే రంభ, తాను మునిగినిదే గంగ కాకూడదు' అన్నారు.

1. నన్నయ ప్రసన్న కథాకలితార్థయుక్తి
2. ఒకడు నాచన సోమన
3. అల్లసాని వాని అల్లిక జిగిబిగి
4. శాకుంతలము యొక్క అభిజ్ఞానత
5. విశ్వనాథ సాహిత్యోపనాసాలు
6. సాహిత్య సురభి
7. కావ్య పరిమళము
8. కావ్యానందము

ఇవే గాక యింకెన్నో వాటి మీద వీరు మంచి విమర్శ చేశారు. ''నన్నయ ప్రసన్న కథా కలితార్థయుక్తి'' అన్న గ్రంథంలో ''నన్నయ కథ యొక్క ప్రాణమును బట్టికొని నొక్కునుగాని, కథలోని వివిధాంశములను పెంచడు'' అంటారు.

విశ్వనాథ వారిది చాలా స్పష్టమైన సూటియైన వచనం. కావ్యశైలిలో తర్కబద్ధంగా సాగే భావ విన్యాసం. ఆయన సాహిత్య విమర్శకు ఒక గాంభీర్యాన్ని సమకూర్చిందనే చెప్పాలి. శైలిలో సారళ్యం తర్కబద్ధమైన విషయ ప్రతిపాదన, క్రమోనీల్మనం విశ్వనాథ విమర్శలో కన్పించే ప్రధాన లక్షణం.

ఈ విధంగా తెలుగు ఆధునిక ప్రక్రియలు విమర్శ మొదలై అది బలమైన పునాదులు కలిపి అనేక మంది కవులకు ఆ వైపు నడిపించి అనేక గ్రంథాలను, వారి శైలిని, వారి కాలాదులపై వచ్చిన విమర్శలు ఎంతో ఉపయోగ పడుతున్నదని చెప్పవచ్చు.

❖ ❖ ❖

అక్టోబర్ 2020

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

ఆధునిక తెలుగు సాహిత్యం - ప్రపంచీకరణ ప్రభావం

భావేపణ ప్రత్యేక సంచిక











NAAC WITH B GRADE

ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)

చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఇండియా.